
# హక్కుల ఉద్యమం
## తాత్విక దృక్పథం



కె. బాలగోపాల్

మానవ హక్కుల వేదిక ప్రచురణ



కె. బాలగోపాల్

(10.6.1952 – 8.10.2009)

# హక్కుల ఉద్యమం
# తాత్త్విక దృక్పథం

**హక్కుల ఉద్యమం - తాత్విక దృక్పథం**

మానవహక్కుల వేదిక ప్రచురణ

ప్రచురణ సంఖ్య: 22
అక్టోబర్ 2010
కాపీలు: 2000
వెల: 100 రూపాయలు
కవర్: శ్రావణ్
డిటిపి: కె.వి.ఆర్
ముద్రణ: నవ్య ప్రింటర్స్

ప్రతులకు:
**ఎస్. జీవన్ కుమార్**
3-12-117/ఎ-2/1, పి.ఎస్. కాలనీ,
గణేష్‌నగర్, రామంతపూర్,
హైదరాబాద్ - 500 013
ఫోన్: 040-27039519

**సహచర, నవోదయ, దిశ బుక్ హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org
బాలగోపాల్ రచనల కోసం: www.balagopal.org

# మా మాట

**మ**న రాష్ట్రంలో గత మూడు దశాబ్దాలుగా ఒక విశిష్టమైన ప్రజాతంత్ర కృషి జరిగింది. సామాజిక మార్పులో హక్కుల ఉద్యమం పాత్ర గురించి, హక్కుల అవగాహన, ఆచరణ గురించి సమాజంతో, రాజ్యంతో, విప్లవోద్యమంతో ఒక మేధోమథనం జరిగింది. ఈ కృషికి బాలగోపాల్ కేంద్ర బిందువు. ఇదే మన రాష్ట్ర హక్కుల ఉద్యమాన్ని దేశంలోనే ముందు వరుసలో నిలిపింది.

నక్సలైటు ఉద్యమంపై క్రూరమైన అణచివేతకు వ్యతిరేకంగా పుట్టిన హక్కుల ఉద్యమం కాలక్రమంలో ఆచరణలో తన కార్యరంగాన్ని విస్తృతం చేసుకుంటూ వచ్చింది. దళిత, ఆదివాసీ, స్త్రీవాద ఉద్యమాలు లేవనెత్తిన ప్రజాస్వామిక ఆకాంక్షలకు అనుగుణంగా తన కార్యాచరణను పెంచుకుంటూ వచ్చింది. ఇది సహజ స్పందనగా జరిగిందే కానీ, హక్కుల ఉద్యమ పాత్ర గురించి, అవగాహన గురించి పునరాలోచనతో జరిగింది కాదు. కాని ఆచరణలో విస్తృతమైన ఈ కార్యరంగాన్ని విప్లవోద్యమ అవగాహనా చట్రంలో ఇమడ్చడంవల్ల హక్కుల ఉద్యమ ప్రాధాన్యతల్లో మార్పు రాలేదు. కార్యకర్తలకు విప్లవ పరిభాష స్థానంలో హక్కుల పరిభాష అలవడలేదు. ప్రజాస్వామ్యానికి ఒక నాగరికతా విలువగా గుర్తింపు రాలేదు. వ్యవస్థ మార్పు స్థానంలో వ్యవస్థల మార్పు అజెండా కాలేదు. హక్కుల ఉద్యమంలో అవగాహనకు, ఆచరణకు మధ్య వున్న ఈ తేడాను గుర్తించిన బాలగోపాల్ దానికొక స్వతంత్రమైన తాత్విక అవగాహన, ఆచరణ అవసరమని భావించారు. సమాజ పురోగమనానికి పోరాటాలు, ఉద్యమాలు చాలా ముఖ్యమని చెప్తూనే వాటి ఫలితంగా పుట్టే నూతన విలువల వ్యవస్థీకరణ, వ్యాప్తి, దానిని ఆధారం చేసుకున్న ప్రజాతంత్ర కృషి హక్కుల ఉద్యమానికి చాలా ముఖ్యమైన అంశంగా బాలగోపాల్ భావించారు.

హక్కుల ఉద్యమానికి చారిత్రక దృష్టిని కల్పించడానికి ఆయన చేసిన కృషి ఈ వ్యాసాలలో కనిపిస్తుంది. ప్రస్తుత వ్యవస్థలో కుదించబడి అసమగ్రంగా అమలౌతున్న హక్కులు కూడా గతకాలపు పోరాటాలు, సంస్కరణల ఫలితంగా వచ్చినవే. అవి పాలకులు బలవంతంగా గుర్తించినవే తప్ప, ఉదారంగా దయతో ప్రజలకు ఇచ్చినవి కావు. వాటిలోని మినహాయింపులు తొలగించి, సమగ్రంగా అమలు చేయించుకోవడానికి జరగవలసిన కృషి హక్కుల ఉద్యమానికి ఎప్పుడైనా సరే ప్రధాన కార్యరంగమే. పాలక వర్గాలు ఎన్ని మినహాయింపులు ఇచ్చినా, వక్రీకరణలకు గురిచేసినా ప్రజాతంత్ర వ్యవస్థలు, విలువలు, ప్రక్రియలు వాటికవే విలువైనవి. వాటిని హక్కుల ఉద్యమం ఉపయోగించుకునే దృష్టితో కాక పరిరక్షించుకునే దృష్టితో చూడాలి. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులన్నీ పోరాటాల ఫలితంగా వచ్చినవే. ఆ హక్కులకున్న పోరాట నేపథ్యాన్ని నిరంతరం సమాజానికి గుర్తుచేయడం ద్వారానే వర్తమానంలో జరుగుతున్న ప్రజాపోరాటాలకు సామాజిక ఆమోదం సాధించగలం. అప్పుడే మార్పుకోసం జరగాల్సిన కృషికి అవకాశాలను సజీవంగా వుంచుకోగలుగుతాం. వాటిని తృణీకరిస్తే గతానికే కాదు, వర్తమానానికి, భవిష్యత్తుకు కూడా నష్టం జరుగుతుందని ఎంతో స్పష్టంగా వివరిస్తూ వచ్చారు బాలగోపాల్.

హక్కుల భావనకున్న చారిత్రక పునాదుల్ని, బహుళత్వాన్ని గుర్తించడం ద్వారానే వివిధ ప్రజా ఉద్యమాలు ముందుకు తెచ్చే ఆకాంక్షలకు సమాన ప్రాధాన్యతనిచ్చి విశాలమైన హక్కుల ఉద్యమాన్ని నిర్మించగలుగుతామని చెప్పారు బాలగోపాల్. రాజకీయాలు, పోరాటాలు తెలియని, అణచివేతకు గురౌతున్నామనే స్పృహ సైతం లేనివారి హక్కుల కోసం కూడా పోరాడడం ద్వారా మాత్రమే హక్కులకు సార్వజనీనతను, సాధికారతను ప్రోది చేయగలమని వాదించారు. రాజకీయ ఉద్యమాల అవసరాల మేరకే పనిచేయడం వలన హక్కుల ఉద్యమం తనను తాను ఎంతగా కుదించుకుంటోందో చూపారాయన. ఆచరణలో, ప్రాధాన్యతలలో హక్కుల ఉద్యమం ఆత్మవిశ్వాసం గల స్వతంత్ర ఉద్యమంగా ఎదగాల్సిన అవసరాన్ని ఎంతో ముందుగా గుర్తించిన వ్యక్తి బాలగోపాల్.

ప్రజాస్వామ్యాన్ని ఒక ఎత్తుగడగా కాకుండా, దానంతటదే కాంక్షించదగ్గ రాజకీయ విలువగా గుర్తించిన తర్వాత సామాజిక వైఖరిలో, రాజ్యాంగ యంత్రాంగంలో, ప్రజా ఉద్యమాలలో ఆ విలువలను పెంపొందించాలి. అదే హక్కుల ఉద్యమం కర్తవ్యం అవుతుంది. హక్కుల సంఘాలైనా ప్రజాతంత్ర విలువలను యధాతథంగా ఆచరించాలని బాలగోపాల్ అభిప్రాయపడ్డారు. స్వతంత్ర అవగాహన, అస్తిత్వం గల హక్కుల ఉద్యమం వాస్తవం కావాలనే ఆశయంతోనే మానవ హక్కుల వేదిక ఏర్పాటులో బాలగోపాల్ కీలక పాత్ర పోషించారు.

మార్గనిర్దేశనం చేయడమే కాదు ముందుండి నడిపించారు. అన్ని రంగాలలో లాగే ప్రజాస్వామ్య విలువలను స్వీకరించడంలోనూ వెనకబడిన భారతీయ సమాజంలో ప్రత్యేకమైన చారిత్రక కృషి చేయాల్సిన కర్తవ్యం హక్కుల సంఘాలకు ఉందని భావించారు.

ఒక సామాజిక ఆధిపత్య రూపాన్ని హక్కుల దృష్టికోణం నుండి విమర్శించిన వాళ్ళు గతంలో లేకపోలేదు. కాని మొత్తం సామాజిక ఆధిపత్య రూపాలతో వ్యవహరించేటప్పుడు ఆచరణలో హక్కుల ఉద్యమానికి ఉండవలసిన వైఖరి గురించి సుదీర్ఘకాలం పాటు చర్చ చేసి, సమాజం మొత్తంలోను ఆలోచనల్ని రేకెత్తించినవాడు బాలగోపాల్. కాని స్వతంత్ర హక్కుల ఉద్యమ అవగాహన, కర్తవ్యాల గురించి బాలగోపాల్ చేసిన ప్రతిపాదనలు ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో అత్యధిక సభ్యులు ఆమోదించలేదు. స్వతంత్రమైన హక్కుల సంఘం అవసరం లేదనే రాజకీయ భావజాలానిదే అక్కడ పైచేయి అయ్యింది. హక్కుల సంఘానికి స్వంత గొంతుక ఉండవలసిన అవసరాన్ని స్థిరంగా నమ్మిన బాలగోపాల్ మానవ హక్కుల వేదిక ద్వారా దానిని ఆచరించి చూపారు.

ప్రజాతంత్ర కృషి బహుముఖంగా నిరంతరం జరగాల్సిన ప్రక్రియగా గుర్తించిన తర్వాత హక్కుల ఉద్యమం ఏదో ఒక చారిత్రక సందర్భం విధించిన పరిధిలోనో, కొన్ని పురోగామి శక్తులు కోరుకునే పరిమితిలోనో పనిచేయడం అసాధ్యం. ప్రజాతంత్ర కృషి స్థూలంగా సర్వ ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా జరిగేది. అవి గతకాలానికి సంబంధించిన కరడుగట్టిన తిరోగామి శక్తులు కావచ్చు, నూతనంగా ఆధిపత్యంలోకి వస్తున్న వర్గాలు కావచ్చు, భవిష్యత్తులో అధికారానికి వచ్చే శక్తులు కావచ్చు. అధికారాన్ని సందేహించని వాళ్ళు, ఆధిపత్యాన్ని ప్రశ్నించనివాళ్ళు హక్కుల కార్యకర్తలు కాజాలరు. ఆధిపత్యం, అధికారం, వర్గ ప్రయోజనాలు రాజ్యాంగ యంత్రాలలో మాత్రమే ఉంటాయనే అవగాహనకు కాలం చెల్లింది. అవి ఏ రూపంలో వున్నా, ఏ స్థాయిలో వున్నా వ్యతిరేకించాలనే ఆకాంక్ష హక్కుల ఉద్యమానికి పునాది. హక్కుల కృషి అధికారం కోసం జరిగే ప్రయత్నం కాదు. ఆధిపత్య అధికారానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య విలువల కోసం జరిగేది. ఈ విస్తృత ప్రజాతంత్ర ఆకాంక్షలను ఇముడ్చుకోగల విశాలమైన హక్కుల ఉద్యమాన్ని నిర్మించడానికి బాలగోపాల్ చేసిన కృషి ఈ వ్యాసాలలో చూడవచ్చు.

ప్రజాఉద్యమాల అవగాహన, ఆచరణలతో కలగాపులగంగా కలిసిపోయిన హక్కుల ఉద్యమ అవగాహనను పొరలు పొరలుగా విడదీసి, అందులో రాజకీయ ఉద్యమాల అవసరాల నుండి ప్రజాతంత్ర విలువలను వేరుచేసి, హక్కుల ఉద్యమానికి స్వంత అస్థిత్వం, అవగాహన ఉండాల్సిన అవసరాన్ని స్పష్టంగా చూపెడతాయి ఈ వ్యాసాలు. రాజకీయ పరిభాషను మాత్రమే వాడుతున్న హక్కుల

ఉద్యమాన్ని చట్టపరమైన, రాజకీయ, సామాజిక, నైతిక వాదనల సమ్మేళనంగా గుర్తించాల్సిన అవసరాన్ని అవి స్పష్టం చేస్తాయి. ప్రజాస్వామీకరణ అనేక రంగాలలో, అనేక స్థాయిల్లో జరగాల్సిన కృషిగా హక్కుల ఉద్యమం అర్థం చేసుకోవాలని సూచిస్తాయి.

చాలామంది ఆలోచనాపరుల్లో కనిపించని స్పష్టత బాలగోపాల్ రాసిన ఈ వ్యాసాల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. సంక్లిష్టమైన సమాజంలో న్యాయాన్యాయాల మధ్య స్పష్టమైన విభజన రేఖ గీయడం సులభం కాదు. సంఘర్షిస్తున్న శక్తుల మధ్య ఏదో ఒక పక్షం వహించడమే న్యాయాన్యాయాలకు గీటురాయిగా ప్రచారం జరిగే, ఒత్తిడి పెట్టే సమాజంలో ఇది మరింత కష్టం. సంఘర్షిస్తున్న శక్తుల మధ్య ఉంటూనే, స్పష్టమైన నైతిక, న్యాయ దృష్టిని కలిగి ఉండాలంటే ఎటువంటి ప్రలోభాలకు లొంగని ఆత్మవిశ్వాసం వుండాలి. ఉద్వేగాలకు, మనుషులకు, పుస్తకాలకు దూరంగా వుండి ఏర్పరచుకున్న విజ్ఞత కాదు ఇది. ఎన్నో కఠినమైన వాస్తవాలను, హింసను, అధికారాన్ని, ప్రజల నిస్సహాయతను, త్యాగాలను నిరంతరం దగ్గరగా పరిశీలించి ఏర్పరచుకున్న ప్రజాతంత్ర విలువల దృష్టి ఈ పుస్తకంలోని ప్రతి అక్షరంలో కనిపిస్తుంది.

* * *

వ్యాసం, ఉపన్యాసం, కరపత్రం, సిద్ధాంత పత్రం, పాఠం, నివాళి, జవాబు, సంపాదకీయం, ఇంటర్వ్యూ... ఇలా భిన్న రూపాల్లో భిన్న అవసరాలకోసం రాసినవి ఇవన్నీ. సౌలభ్యం కోసం వీటిని మూడు విభాగాలు చేసాం. హక్కుల సిద్ధాంతం గురించి చెప్పేవన్నీ ఒక భాగం, యూనివర్శిటీవారి మానవహక్కుల కోర్సు కోసం రాసిన పాఠాలు రెండవ భాగం, పౌరహక్కుల ఉద్యమంలో పనిచేసి మరణించిన వారిపై రాసిన నివాళి వ్యాసాలు మూడో భాగంగా విభజించాం. వేరు వేరు సందర్భాలలో వేరు వేరు అవసరాలకోసం రాసినవి కావడం వలన సహజంగానే కొన్ని విషయాలు పునరావృతమై ఉండవచ్చు. అయినా దేనికదే విలువైనదిగా భావిస్తున్నాం.

మూడు దశాబ్దాల హక్కుల ఉద్యమ ప్రయాణంలో బాలగోపాల్ కృషి ఫలాలివి. ఈ కృషి, ఆలోచనలు భారతదేశ హక్కుల ఉద్యమానికి విలువైన చేర్పు కాగలవని నమ్ముతూ ఈ ప్రచురణను తీసుకొస్తున్నాం.

**– మానవ హక్కుల వేదిక**

అక్టోబరు 8, 2010





1. స్వతంత్ర ఆచరణ అవసరం ........ 11
2. కుల వ్యవస్థ – పౌరహక్కులు ........ 25
3. మన పని కవచంగా పనిచేయడం కాదు ........ 31
4. పౌరహక్కుల ఉద్యమ దృక్పథం: కొన్ని సమస్యలు ........ 43
5. విప్లవ హింస – హక్కుల దృక్పథం ........ 79
6. 'మానవహక్కుల' భావనపై ఎందుకు ఇంత వ్యతిరేకత? 94
7. మా అవగాహన – ఆచరణ ........ 99
8. హక్కుల ఉద్యమం – తాత్విక దృక్కోణం ........ 101
9. స్త్రీలు – మానవహక్కులు ........ 107
10. హక్కుల చరిత్ర – మూడు ప్రధాన స్రవంతులు ........ 111
11. హక్కులకొక తాత్విక కోణాన్ని ఆవిష్కరించుకుందాం ........ 143

**మానవ హక్కుల కోర్సు కోసం రాసిన పాఠాలు**

12. నిత్యజీవితంలో మానవహక్కులు ........ 149
13. నేరమూ శిక్ష – మానవహక్కులు ........ 159
14. నేర విచారణ వ్యవస్థ – మానవహక్కులు ........ 175
15. పౌర సమాజం – మానవహక్కులు ........ 188

**నివాళి వ్యాసాలు**

16. ఇదా దేశభక్తి! ........ 203
17. డా॥ రామనాథంకు జోహార్లు ........ 206
18. మౌనం నిశ్శబ్దం కాదు ........ 209
19. ప్రభాకరరెడ్డి బాటలో సాగండి ........ 212
20. తీరని లోటు ........ 217
21. నలుగురు నేతలకు నివాళి ........ 220
22. ప్రజల మెడలో స్టెతస్కోపు ........ 227
23. ఒక మంచి మనిషికి జోహార్లు ........ 230
24. నియోగి సంస్మరణ ........ 234
25. నిస్పృహకు చోటివ్వద్దు ........ 237
26. హక్కుల ఉద్యమానికి తాత్విక స్ఫూర్తి ........ 241
27. అసాధారణులలో ఒకడు ........ 245

# స్వతంత్ర ఆచరణ అవసరం

❖ సామాజిక ఆర్థిక అసమానతల నుంచి పుట్టే ప్రజాఉద్యమాలకు బాసటగా పౌరహక్కుల ఉద్యమాలు పుడుతుంటాయి. అవి సంఘటిత నిర్మాణాలుగా కూడ రూపధారణ చేస్తాయి. మన దేశంలో వివిధ పౌరహక్కుల సంఘాల పుట్టుకలకు నేపథ్యమేమిటి? ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఆవిర్భావం గూర్చి చెప్పండి.

⊕ మన దేశంలోనే కాదు, ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ ప్రజాఉద్యమాల పైన ప్రభుత్వం ప్రయోగించే అణచివేతకు నిరసనగానే పౌరహక్కుల సంఘాలు పుట్టాయి.

అమెరికాలో ఈ శతాబ్దం రెండవ దశకంలో కమ్యూనిస్టు భావాలు గల వాళ్ళను ప్రభుత్వం వెంటాడి వేధించి 'దేశద్రోహ' నేరం మోపి జైలుపాలు చేస్తుంటే దానికి నిరసనగా అమెరికా పౌర హక్కుల సంఘం ఏర్పడింది. బ్రిటన్‌లో 1930లలో నిరుద్యోగానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్మిక వర్గాన్ని ప్రభుత్వం కుట్రపూరితంగా అణచివేస్తుంటే

'జనంసాక్షి'లో వచ్చిన ఇంటర్వ్యూ, డిసెంబర్ 1992

దానికి నిరసనగా జాతీయ పౌరహక్కుల సమితి ఏర్పడింది. చైనాలో షాంగై తిరుగుబాటు తర్వాత చాంగ్ కై షేక్ ప్రభుత్వం కమ్యూనిస్టులను, వారి సానుభూతిపరులనూ ఊచకోత కోస్తుంటే దానికి నిరసనగా చైనా లీగ్ ఫర్ సివిల్ రైట్స్ పుట్టింది.

భారత జాతీయ ఉద్యమ కాలంలో బ్రిటిష్ వలస పాలకులు నిషేధాలతో, నిర్బంధాలతో ఉద్యమాలను అణచజూస్తే దానికి నిరసనగా 1936లో తొలి పౌరహక్కుల సంఘం ఐ.సి.ఎల్.యు. (భారత పౌరహక్కుల యూనియన్) పుట్టింది.

పెట్టుబడిదారీ లేక వలస దేశాలలోనే కాదు, సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీలు పరిపాలించిన దేశాలలోనూ పౌరహక్కుల సంస్థలు ఇదే విధంగా ఏర్పడ్డాయి. పాలక పార్టీతో విభేదించే హక్కును నిరాకరించి అసమ్మతివాదులను తమ దేశ జైళ్ళలోనూ, మానసిక రోగాలయాలలోనూ బంధించడానికి నిరసనగా చెకొస్లోవేకియా వంటి దేశాలలో బలమైన పౌరహక్కుల వేదికలు ఏర్పడ్డాయి.

**ఇ**ప్పటి విషయానికి వస్తే, భారతదేశంలో ఈ రోజు పౌరహక్కులు, ప్రజాతంత్ర హక్కులు, మానవ హక్కులు అనే పేరుతో పనిచేస్తున్న సంస్థలు అనేకం ఉన్నప్పటికీ, చురుగ్గా పనిచేస్తున్న వాటిని మటుకు లెక్కలోకి తీసుకొంటే ప్రస్తుత పౌర హక్కుల ఉద్యమానికి నాంది రెండు చారిత్రక సందర్భాలలో ఉందని చెప్పవచ్చు. 1968 తర్వాత దేశంలోని వివిధ ప్రాంతాలలో ముందుకొచ్చిన విప్లవ కమ్యూనిస్టు ఉద్యమం మీద ప్రభుత్వాలు ప్రయోగించిన అణచివేతకు నిరసనగా మొదలైన సంస్థలు కొన్ని. 1975లో జయప్రకాశ్ నారాయణ ఇచ్చిన పిలుపునందుకొని ఉత్తర భారతదేశంలో జరిగిన విద్యార్థి, యువజన ఉద్యమాలపైన ప్రభుత్వం ప్రయోగించిన అణచివేతకు నిరసనగా ఏర్పడిన సంస్థలు కొన్ని. మొదటి కోవకు చెందినవి పశ్చిమబెంగాల్‌కు చెందిన ఎ.పి.డి.ఆర్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎ.పి.సి.యల్.సి, ఓ.పి.డి.ఆర్, మహారాష్ట్రలోని బొంబాయి, నాగపూర్, చంద్రపూర్‌లలో సి.పి.డి.ఆర్. పేరుతో ఉన్న మూడు సంస్థలు, లోక్ షాహి హక్ సంఘటన అనే సంస్థ, పంజాబుకు చెందిన ఎ.ఎఫ్.డి.ఆర్. మొదలైనవి. రెండవ కోవకు చెందినది (ప్రధానంగా) పి.యు.సి.యల్.

ఈ సంస్థలు ఆయా చారిత్రక సందర్భాలలో ఏర్పడ్డాయంటే వాటి ఆలోచన, ఆచరణ ఆ ప్రేరణకే పరిమితం అయ్యాయని కాదు. ప్రేరణను గుర్తించటం మట్టుకే నా ఉద్దేశ్యం. ఆచరణ, ఆలోచనల గురించి విస్తృతంగానే చర్చ జరిగింది. ఆ సంవాదంలో భాగంగానే పి.యు.సి.యల్. నుండి ఢిల్లీలో పి.యు.డి.ఆర్. బయటకు వచ్చింది. ఈశాన్య భారత దేశానికి చెందిన ఎన్.పి.యం.హెచ్.ఆర్. (నాగా పీపుల్స్ మూవ్‌మెంట్ ఫర్ హ్యూమన్ రైట్స్), ఎం.ఎ.ఎస్.ఎస్, (MASS) పై సంస్థలకంటే తరువాతి కాలంలో, ఆ ప్రాంతంలో నడుస్తున్న ప్రజాఉద్యమాలపైన అమలవుతున్న అణచివేతకు నిరసనగా ఏర్పడ్డాయి.

**పీ**డిత ప్రజలను సంఘటితం చేసే ఏ ప్రజా ఉద్యమమయినా ఆ ప్రాంతంలోని మధ్యతరగతి మేధావి వర్గంలో కొంత సానుభూతిని సంపాదించుకుంటుంది. ఆ ఉద్యమంతో

రాజకీయంగా పూర్తిగా ఏకీభవించనివారు కూడ ఆ ఉద్యమాలు న్యాయమైన ప్రశ్నలు లేవదీస్తున్నాయనీ సమస్యల పరిష్కారాన్ని ఆవిష్కరిస్తున్నాయనీ గుర్తిస్తారు. ఆ ఉద్యమాల మీద ప్రభుత్వం చట్టవిరుద్ధమైన అణచివేత ప్రయోగించినా, అన్యాయమైన చట్టాలను తయారుచేసి తమ నిర్బంధానికొక బూటకపు చట్టబద్ధత కల్పించినా, ఆ ఉద్యమాలను అసలు రాజకీయ ఉద్యమాలుగానే గుర్తించకుండా 'వేర్పాటువాదం' 'విచ్ఛిన్నకరవాదం' 'తీవ్రవాదం' అనే దూషణకు దిగినా, ఈ మేధావి వర్గం అది అన్యాయమని స్పందిస్తుంది. ఈ స్పందన అక్కడితో ఆగిపోకుండా, చట్టబద్ధ పాలన, ప్రజాస్వామ్య విలువలు మొదలయిన వాటి పరిరక్షణ కూడ ఒక రాజకీయ కర్తవ్యమేననే గుర్తింపుకు దారి తీస్తుంది. ప్రపంచంలోని అన్ని పౌరహక్కుల సంఘాలు ఈ విధంగా ఏర్పడినవే.

మన రాష్ట్రంలో నక్సలైట్ ఉద్యమాన్ని అణచడం కోసం ప్రభుత్వం ఎన్‌కౌంటర్లు, గిరిజన గృహ దహనాలు, కుట్రకేసులు, మూకుమ్మడి అరెస్టులు, చిత్రహింసలకు పాల్పడ సాగినపుడు అనేకమంది రచయితలు, న్యాయవాదులు, రాజకీయ వేత్తలు పౌరహక్కుల పరిరక్షణ కోసం కదిలారు. ఊరూరా సభలు, ఊరేగింపులు జరిపారు. ఒక విస్తృతమైన కదలిక 1970–72 సంవత్సరాలలో వచ్చింది. ఆంధ్రప్రదేశ్ పౌర ప్రజాస్వామ్య హక్కుల సంస్థ (ఎ.పి.సి.యల్.డి.ఆర్.ఎ.) అనే వేదికను ఏర్పాటు చేసారు. దీనికి ఒక నిర్దిష్ట నిర్మాణం ఇచ్చే ప్రయత్నంలో అది రెండుగా చీలి ఎ.పి.సి.యల్.సి. (1973) ఒ.పి.డి.ఆర్. (1974) గా ఆవిర్భవించాయి. ఎ.పి.సి.యల్.సి. మొదటి అధ్యక్షులు శ్రీశ్రీ అయితే ప్రధాన కార్యదర్శి హైకోర్టు న్యాయవాది పత్తిపాటి వెంకటేశ్వర్లు.

❖ ఇతర ప్రజా ఉద్యమాలకూ, పౌరహక్కుల ఉద్యమానికీ వున్న ప్రధానమైన తేడా ఏమిటి?

⊕ ఒక రకంగా చెప్పాలంటే రెండింటికీ అన్యోన్య సంబంధం వుంది. ప్రజా ఉద్యమాలు సాధ్యం కావడానికి అవసరమైన ప్రజాస్వామ్య వాతావరణాన్ని కాపాడడం, పెంపొందించడం పౌర హక్కుల ఉద్యమ కర్తవ్యాలలో ఒకటి.

ఒకప్పుడు పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యం ఇంతేనని భావించడం జరిగేదనుకుంటాను. కానీ ఆచరణక్రమంలో ఇంతకంటే విస్తృతమైన బాధ్యత వున్నట్లు అర్థం అవుతూ వుంది.

ప్రజానీకంలోని వివిధ వర్గాలు ఉద్యమాల ద్వారా హక్కులు సాధించుకుంటారు. ఈ ఉద్యమాలు చరిత్రలో అన్ని వేళలా సంఘటిత రాజకీయ ఉద్యమాలే కానవసరం లేదు. అవి ఆధునిక యుగ లక్షణం. గతంలో అవి భక్తి ఉద్యమాల రూపంలోనూ, అసంఘటిత సంఘర్షణ రూపంలోనూ, వట్టి 'అరాచకత్వం' రూపంలోనూ ఇంకా అనేక రూపాల్లోనూ జరిగాయి. మొత్తానికి ఏదో ఒక సంఘర్షణ, అలజడి లేకుండ హక్కులు రావు. ఒక హక్కు మొదట కొందరి ఆలోచనలలో గుర్తింపు పొందుతుంది. తరువాత సామాజిక చైతన్యంలోకి విస్తరిస్తుంది. రాజకీయ ఆచరణలో గుర్తింపు పొందుతుంది. ఒక దశలో రాజకీయంగా విజయం పొందుతుంది. అంటే చట్టం, రాజ్యాంగం, ఆచారం, సంప్రదాయం అన్నీ దానిని హక్కుగా గుర్తిస్తాయి. ఏదో ఒక రూపంలో వ్యవస్థీకరిస్తాయి.

అక్కడితో కథ అయిపోదు. ఆ వ్యవస్థీకరణలో ఎన్నో లోపాలుంటాయి. పరిమితులు ఉంటాయి. ఆ తరువాత అమలులో మరిన్ని లోపాలుంటాయి. ఒప్పుకున్న హక్కును ఆచరణలో ప్రతినిత్యం అతిక్రమిస్తారు. సమాజంలో సంక్షోభం పెరిగే కొద్దీ ఆ హక్కును అసలు లేకుండా చేయాలనీ, తొలగించాలనీ ప్రయత్నిస్తారు. పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యం ఇక్కడ వుంది. ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులను పాలకులు వ్యవస్థీకరించే పద్ధతిలో వున్న లోపాలను తొలగించడం కోసం కృషి చేయాలి. ఆచరణలో హక్కులను అతిక్రమించ కుండ కాపాడడం కోసం కృషి చేయాలి. ఆ హక్కుల వెనుకవున్న ప్రజాపోరాటాలను సమాజానికి నిత్యం జ్ఞాపకం చేయాలి. వాటిని సజీవంగా వుంచాలి. భవిష్యత్తులో సాధించు కోవలసిన హక్కులు ప్రస్తుత సామాజిక చైతన్యంలో బీజరూపంలో వున్నా వాటిని ప్రచారంలో పెట్టాలి.

ఇదీ పౌరహక్కుల ఉద్యమం యొక్క ప్రత్యేక కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చే క్రమంలో అది ప్రజా ఉద్యమాలకు అవసరమైన తోడ్పాటు అందిస్తుంది. ప్రజా ఉద్యమాలు సాధ్యం కావడానికి అవసరమైన ప్రజాస్వామ్య వాతావరణం కల్పించడం కోసం కృషి చేస్తుంది. అయితే పౌరహక్కుల ఉద్యమం ఇందుకోసమే లేదు. దాని స్వతంత్ర కార్యరంగం దానికి వుంది. దీనిని ఒక రకమైన రియర్‌గార్డ్ (rear guard) కర్తవ్యం అనవచ్చు. ఇది మినహా వేరే తేడాలు ఉన్నాయా అంటే అనుమానమే. ఉదాహరణకు ఇతర ప్రజా ఉద్యమాలలాగా కాక పౌరహక్కుల ఉద్యమం అన్ని దేశాలలో అన్ని ప్రాంతాలలో ప్రధానంగా మేధావి వర్గానికే పరిమితం అయివుంది. ఇది ఎంతవరకు అనివార్యం, ఎంతవరకు ఉద్యమకారుల అశక్తత అనే ప్రశ్న వస్తుంది. పౌరహక్కుల ఉద్యమం ప్రజా ఉద్యమం కాగలదా? కాలేదేమోనని నా సందేహం. తక్షణ ఆర్థిక – సామాజిక ప్రయోజనాలు లేని ఉద్యమమేదీ విస్తృత ప్రజా ఉద్యమం కాలేదేమో. కార్మికులు, రైతులు ఇతర పీడిత ప్రజలు తమ ఆర్థిక, సామాజిక పోరాటాలలో భాగంగా, వాటితోపాటు, పౌరహక్కుల కోసం కూడా పోరాడతారు. పోరాడుతూనే వున్నారు. కానీ ఆర్థిక సామాజిక లక్ష్యాలు లేకుండా కేవలం పౌరహక్కుల కోసం పనిచేసే ఉద్యమంలోకి విస్తృత ప్రజానీకం రావడం సాధ్యమా? కాదని నేననుకుంటున్నాను. అయినా ఇది ఇంకా చర్చలో వున్న విషయం.

❖ రాజకీయ పోరాటాలకు బాసటగా, స్వతంత్రంగా పౌరహక్కుల ఉద్యమాన్ని నిర్మించడంలో గతంలో ఎలాంటి ఇబ్బందులుండేవి? వాటిని తొలగించుకొనే ప్రయత్నాలు ఎంతవరకు సఫలమైనాయి? భవిష్యత్తు దిశ ఏమిటి?

⌖ ఇబ్బందులు చాలా ఉండేవి. ఉన్నాయి. కొన్ని బయటి ఇబ్బందులు, కొన్ని ఇంటిలోనివి.

ప్రభుత్వ నిర్బంధం ఒక ముఖ్యమైన సమస్య. పూర్తిగా చట్టం పరిధిలో పనిచేస్తున్న పౌరహక్కుల ఉద్యమకారులను కూడ అది బ్రతకనివ్వడం లేదు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత. వేరే ఎక్కడా (మన దేశంలో) పౌరహక్కుల ఉద్యమకారులను పోలీసులు చంపలేదు.

పౌరహక్కుల ఉద్యమాన్ని స్వతంత్రమైన కార్యరంగం గల ఉద్యమంగా కాక ప్రజా ఉద్యమాలకు సహాయంగా ఉండే ఉద్యమంగా ఎక్కువమంది అర్థం చేసుకోవడంవల్ల కూడ ఉద్యమం ఎదుగుదలకు పరిమితులు ఏర్పడుతున్నాయి.

పంజాబులో చంపలేదు, కాశ్మీర్‌లో చంపలేదు, అస్సాంలో చంపలేదు, నాగాలాండ్‌లో చంపలేదు. ఆంధ్రప్రదేశ్ పోలీసులు మట్టుకు డాక్టర్ రామనాథంను, జాపా లక్ష్మారెడ్డిని, నర్రా ప్రభాకర్‌రెడ్డిని చంపారు. బి.జె.పి. వాళ్ళకు తుపాకి ఇచ్చి గోపి రాజన్నను చంపించారు. మమ్మల్ని అనేకసార్లు నాసా, టాడా, రాజద్రోహం కేసులలో జైలులో పెట్టారు. ఈ నిర్బంధాన్ని తట్టుకొని మేధావి వర్గంలోని ప్రజాస్వామికవాదులు ముందుకు రావాలంటే సమస్యే.

ఈ ప్రత్యక్ష నిర్బంధమే కాక మానసిక ఒత్తిడి చాలా ఉంటుంది. దీనికి ప్రభుత్వంతోపాటు పత్రికలు, స్నేహితులు, సహ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు అందరూ దోహదం చేస్తారు. 'మనకెందుకొచ్చింది' 'ఒకరు చేస్తే అయ్యేదా' అనే సాంస్కృతిక వైఖరి, 'ఈ ప్రపంచం మారదు' 'మనిషి నైజమే ఇంత' 'రష్యాలో మాత్రం ఇంతకంటే బాగుండిందా' అనే నిరాశ, నిస్పృహలతో మొదలుపెట్టి పౌరహక్కులు అంటేనే తీవ్రవాదాన్ని సమర్థించడం అనీ, సంఘ వ్యతిరేకులను సమర్థించడం అనీ, ఏకపక్షమైన విమర్శ అనీ ఊదరగొట్టే ప్రచారం దాకా అనేక ఒత్తిడులు మేధావి వర్గంమీద పనిచేస్తుంటాయి.

ఇవి సాధారణ సమస్యలు. ఒక్క పౌరహక్కుల ఉద్యమమే కాదు, అన్ని ఉద్యమాలూ ఎదుర్కొనే సమస్యలు. ఒక్క మేధావి వర్గాన్నే కాదు, అన్ని వర్గాలనూ పీడించే సమస్యలు. అయితే పౌరహక్కుల ఉద్యమానికి కొన్ని ప్రత్యేక సమస్యలు ఉన్నాయి. పైన చెప్పినట్లు ఈ ఉద్యమంవల్ల ఎవ్వరికీ తక్షణ సామాజిక ఆర్థిక ప్రయోజనాలు నెరవేరవు. అందువల్ల దీనిలోకి వచ్చేవాళ్ల సంఖ్యే తక్కువ. పైగా నిర్బంధాన్నీ, ఒత్తిడులనూ ఎదుర్కొని ముందుకు రావాలంటే మరీ కష్టం.

పౌరహక్కుల ఉద్యమాన్ని స్వతంత్రమైన కార్యరంగం గల ఉద్యమంగా కాక ప్రజా ఉద్యమాలకు సహాయంగా ఉండే ఉద్యమంగా ఎక్కువమంది అర్థం చేసుకోవడంవల్ల కూడ ఉద్యమం ఎదుగుదలకు పరిమితులు ఏర్పడుతున్నాయి. ఒక ఉద్యమం సమర్థవంతంగా, వేగంగా ఎదగాలంటే దానికి తన ప్రాధాన్యత గురించి ఆత్మవిశ్వాసం ఉండాలి. ఉద్యమకారులు తమ సమయాన్నీ, ఆలోచననూ, వనరులనూ తగినరీతిలో ఉద్యమ వ్యాప్తికోసం వెచ్చించాలి. 'అసలు పోరాటం వేరే ఉంది. ఇది కేవలం సహాయకం మాత్రమే' అనుకున్నంత కాలం ఈ విషయంలో లోటు జరుగుతూనే ఉంటుంది.

అంతేకాక పౌరహక్కుల ఉద్యమాన్ని కేవలం ప్రజా ఉద్యమాలకు సహాయంగా అర్థం చేసుకుంటే అది చేపట్టే సమస్యలలో, సమస్యలు చేపట్టడంలో చూపే ఉత్సాహంలో అసమతుల్యం ఉంటుంది. ఆయా ప్రాంతాలలో ఏ ప్రజాఉద్యమం నుండి పౌరహక్కుల ఉద్యమం ఎక్కువగా ఉత్తేజం పొందుతుందో ఆ ప్రజాఉద్యమం నుండి ఉత్పన్నమయ్యే సమస్యలకు, లేదా ఆ ప్రజాఉద్యమం దృష్టిలో ప్రధానంగా కనిపించే సమస్యలకు ఇచ్చే ప్రాముఖ్యం వేరేవాటికి ఇవ్వకపోవడం జరుగుతుంది. దీనివల్ల పౌరహక్కుల కార్యరంగం కుదించుకొని పోవడమే కాక, ఆ ప్రజా ఉద్యమాల సానుభూతిపరులు తప్ప తక్కినవాళ్ళు పౌరహక్కుల ఉద్యమాన్ని తమదిగా భావించుకొని తామూ దానిలో చేరడానికి ముందుకు రావడం కష్టతరం అవుతుంది. ఇది ఉద్యమ వ్యాప్తికి ఆటంకం అవుతుంది. ఎ.పి.సి.యల్.సి, ఒ.పి.డి.ఆర్.లలో విప్లవ కమ్యూనిస్టు ఉద్యమ సానుభూతిపరులు కానివాళ్ళు ఎక్కువమంది లేకపోవడానికి ఇదొక కారణం. ఈ సమస్య ఒక్క ఎ.పి.సి.యల్.సి., ఒ.పి.డి.ఆర్.ల లోనే కాదు, అన్ని పౌరహక్కుల సంస్థలలోనూ ఉంది. ఒకచోట విప్లవ కమ్యూనిస్టు ఉద్యమానికి సహాయక సంస్థగా అనుకుంటే మరొకచోట ఉల్ఫాకు, కాశ్మీర్, పంజాబులలో ఆయా జాతుల విముక్తి పోరాటాలకు అనుకోవచ్చు. 1974లో పి.యు.సి.యల్.ను ఏర్పాటు చేసిన వారిలో ప్రముఖులు కాంగ్రెస్–వ్యతిరేక రాజకీయవాదులు. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత జనతాపార్టీ అధికారంలోకి రాగానే వాళ్ళు 'ఇంక పి.యు.సి.యల్. అనవసరం' అని వాదించారు. అంటే వాళ్ళు పి.యు.సి.యల్.ను కాంగ్రెస్ వ్యతిరేక (ఇందిరా వ్యతిరేక) ఉద్యమానికి సహాయక సంస్థగా చూసారు తప్ప స్వతంత్రమయిన పౌరహక్కుల వేదికగా చూడలేదు!

ఈ విషయంలో అభివృద్ధి లేనే లేదనడం అబద్ధం అవుతుంది. ఒకప్పటికీ ఇప్పటికీ పరిస్థితి చాలా మెరుగయింది. అయినా ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు. కొత్తగా ఈ ఉద్యమంలోకి వచ్చే కార్యకర్తలు ఎక్కువగా ప్రజాఉద్యమాల ప్రేరణతో వచ్చేవారే తప్ప పౌరహక్కుల ఉద్యమం ప్రేరణతో వచ్చేవారు కాకపోవడం వల్ల ఎంత పరిష్కారం అయిపోయిందనుకున్నా ఈ సమస్య పునరావృతం అవుతూనే ఉంటుంది. నిరంతర చర్చ ఒకటే దీనికి పరిష్కారం. భయపడేవాళ్ళు భయం పోగొట్టుకొని ఎక్కువ సంఖ్యలో ఉద్యమంలోకి రావాలన్నా ఉద్యమ అవగాహన, ఆచరణ పూర్తిగా స్వతంత్రం కావాలి. ప్రభుత్వం చెప్తున్నట్టు ఇది నక్సలైట్ల సంస్థ కాదు, మరెవరో ఉద్యమకారుల సంస్థ కాదు, ఇది సమాజాన్ని ముందుకు తీసుకుపోయే ఒక సందేశం – తనదయిన సందేశం – ఇస్తున్నది అని ప్రజలు నమ్మగలగాలి. అది లేనంతవరకూ కొద్దిమంది సాహసం చూసి మిగిలిన వాళ్ళు సాహసం చేయాలి తప్ప ఉద్యమం ఎదగదు. అది ఉన్నప్పుడు ఎక్కువమంది ఉద్యమంలోకి రాగలగడమే కాక, ఉద్యమంలో పని చేసేవాళ్ళకు సాధారణ 'ప్రజాభిప్రాయం' అనే రక్షణ (ఏదో ఒక మేరకు) ఉంటుంది.

దీన్ని ప్రజా ఉద్యమాలకు సహాయక సంస్థగా అర్థం చేసుకుంటే ఆ ఉద్యమాలలో ఉన్న ప్రజల ఆదరణ, అభిమానం పౌరహక్కుల ఉద్యమానికి లభిస్తాయి కదా, అది రక్షణ కాదా

అనవచ్చు. అయితే ఆ రక్షణ పరిమితంగా ఉంటుంది. ఆ ప్రజాఉద్యమం ఎదుర్కునే సంక్షోభాలను బట్టి ఆటుపోట్లకు గురవుతుంది. ఆ ఆటుపోట్లకు పౌరహక్కుల ఉద్యమం భవితవ్యం ముడిపడడం పౌరహక్కుల ఉద్యమానికి మంచిది కాదు. స్వతంత్ర ప్రతిపత్తిని ప్రజాభిప్రాయంలో ఈనాటికీ పూర్తిగా సాధించుకోక పోవడమొక్కటే పౌరహక్కుల ఉద్యమం ఎదుర్కొంటున్న ఇబ్బందా, ఇంతకంటే బలమయినవి లేవా అనవచ్చు. లేకేం, ఉన్నాయి. ప్రభుత్వ నిర్బంధం గురించి మొదట్లోనే ప్రస్తావించాను. అదిగాక సామాజిక సంస్కృతి, సంప్రదాయాలు, మధ్యతరగతి జీవితంలోని సంకుచితత్వం ఇంకా ఎన్నో ఉన్నాయి. అయితే ఇ. హెచ్. కార్ ఒకచోట అన్నట్టు ఒక సమస్యకు ఎన్ని కారణాలున్నా, వాటిలో మన ప్రయత్నం వల్ల బాగుచేసుకోగలదాన్ని గురించి మాట్లాడుకోవడమే ప్రయోజనకరం. తక్కిన చర్చ నిష్ఫలం.

❖ భిన్న పౌరహక్కుల సంఘాలు ఏకం కావడమూ, ఐక్యవేదికల మీదికి రావడమూ లాంటి ఎంతో ప్రాముఖ్యత కల్గిన పరిణామాలు మనం ఇటీవల చూస్తున్నాం. వీటికి కారణమేమి? ఈ ట్రెండ్**ను** మరింత బలిష్టం చేసేదెలా?

⌖ పౌరహక్కుల ఉద్యమం తన కార్యరంగాన్నీ తన అవగాహననూ తాను నిర్దేశించుకొనే క్రమంలో విభిన్న సంస్థల మధ్య ఉన్న తేడాలు క్రమంగా పలుచన అవుతున్నాయి. ఆ తేడాలలో కొన్ని రాజకీయ పిడివాదం వల్ల వచ్చినవి. కొన్ని అనుభవ రాహిత్యం నుండి వచ్చినవి. పిడివాదం తగ్గి అనుభవం పెరిగే క్రమంలో తేడాలు కూడా తగ్గుతున్నాయి. ఈ క్రమంలోనే అన్ని సంస్థల అనుభవం నుండి 'పౌరహక్కుల ఉద్యమం అంటే ఏమిటి' అనే ప్రశ్నకు జవాబు దొరుకుతూ ఉంది. విభిన్న పౌరహక్కుల సంస్థలు దగ్గర కావడానికీ కలిసి పని చేయడానికీ వేరే ఎన్ని కారణాలున్నా ఇదే అన్నిటికంటే ప్రయోజనకరమయిన కారణం.

మొత్తంగానే ప్రజా ఉద్యమాలలో విభేదాలను పెంచుకొనే ధోరణి పట్ల, పిడివాదం పట్ల ఈ మధ్యకాలంలో ప్రజలలో వ్యతిరేకత బాగా పెరిగిందనుకుంటాను. ముఖ్యంగా, పౌరహక్కులవంటి విశాల లక్ష్యంకోసం ఇన్ని సంస్థలు ఎందుకుండాలి అని ప్రజాస్వామికవాదుల నుండి వచ్చే ప్రశ్నకు మా దగ్గర హేతుబద్ధమయిన జవాబు లేకపోవడం మమ్ములను చాలా ఆలోచింపజేస్తున్నది. పౌరహక్కుల ఉద్యమం తనదంటూ ఒక కార్యరంగాన్నీ అవగాహననూ ఏ మేరకు నిర్దేశించుకుంటుందో, 'ఈ ఉద్యమం ఎందుకోసం ఉంది. దీనిలో మనం ఎందుకోసం పనిచేస్తున్నాం' అని పౌరహక్కుల ఉద్యమకారులు ఏ మేరకు ఆలోచిస్తారో ఆ మేరకు ఈ ఐక్య కార్యాచరణ, దగ్గర కావడం అనేవి బలపడతాయి.

❖ ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నక్సలైట్ల సంస్థ అనే ప్రభుత్వ దుష్ప్రచారానికి దాదాపు పార్లమెంటరీ పార్టీలన్నీ (వామపక్షాలతో సహా) ఆమోదముద్ర వేస్తున్నాయి. అంటే మధ్యతరగతి బుద్ధి జీవులూ, సామాన్య ప్రజలలో కూడా ఒక మేరకు ఈ ప్రచారం ఇంకిందనే అర్థం. ఈ ప్రచారాన్ని తిప్పిగొట్టడం సాధ్యమా? ఎలా?

✣ నిర్బంధాన్ని వ్యతిరేకించినంతకాలం ప్రభుత్వం ఏదో ఒక పేరు పెడుతూనే ఉంటుంది. ప్రభుత్వ దుష్ప్రచారాన్ని ఆపాలనే ప్రయత్నమే వృధా ప్రయాస.

డాక్టర్ రామనాథం హత్యకు ముందు వరంగల్లో మేము విప్లవ సంస్థల కార్యకర్తలను పోలీసులు అక్రమ నిర్బంధంలో పెట్టుకున్నట్టు తెలిసినప్పుడల్లా పోయి పోలీసు అధికారులతో మాట్లాడేవాళ్ళము. అపుడు పోలీసులు 'మేము వీళ్ళనే కాదు చాలామందిని అరెస్ట్ చేస్తాం, అక్రమ నిర్బంధంలో పెట్టుకుంటాం, కొడతాం. మీరు వాళ్ళకోసం ఎప్పుడూ రారెందుకు? తీవ్రవాదులు మాత్రమే పౌరులా' అని వెక్కిరింతగా అడిగేవాళ్ళు. కాలక్రమంలో మా ఆచరణ కూడ మారుతూ వచ్చింది. దొంగలు, సంఘ వ్యతిరేక శక్తులు అని పోలీసులు పేరుపెట్టి అక్రమంగా నిర్బంధించి, చిత్రహింసలు పెడుతున్నవారి గురించి కూడ ఆలోచించ నారంభించాము. చివరికి ఒకనాడు, హనుమకొండ లాకప్‌లో ఒక బందిపోటు కేసు నిందితుడిని పోలీసులు కొట్టి చంపేస్తే, దాని గురించి గొడవ చేశాము. ఆ తర్వాత ఒక సందర్భంలో ఒక పోలీసు అధికారిని కలవడం జరిగింది. ఆయన చాలా కోపంగా 'నక్సలైట్లంటే సరే వాళ్ళకేవో ఆదర్శాలున్నాయి. వాళ్ళ హక్కుల కోసం మీరడిగితే ఏదో అర్థం ఉంది. కాని బందిపోట్లకు కూడా హక్కులా,? అంటూ మామీద విరుచుకుపడ్డాడు!

కాబట్టి పౌరహక్కుల ఉద్యమం ఏమి చేసినా, ఏమి చేయలేకపోయినా ప్రభుత్వం తిట్టడానికి ఒక నెపం వెతుక్కుంటుంది. తనను విమర్శించకుండా ఉండాలని దాని కోరిక. ఆ మాట అనలేక ఏదో ఒక సాకు చూపించి పౌరహక్కుల ఉద్యమాన్ని దూషిస్తుంది.

పార్లమెంటరీ ప్రతిపక్ష పార్టీల విషయం (ఒకరిద్దరు వ్యక్తులను మినహాయిస్తే) ఇందుకు భిన్నం కాదు. నక్సలైట్లను వాళ్ళు తమ రాజకీయ ప్రత్యర్థులుగా అర్థం చేసుకుంటారు. ఈ ప్రత్యర్థుల అణచివేత గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోవాలని వాళ్ళ కోరిక. పౌరహక్కుల ఉద్యమం చప్పుడు చేస్తూ ఉంది. నిశ్శబ్దంగా జరిగిపోయేదాన్ని బయటకు ఈడ్చి గొడవ చేస్తోంది. అది వాళ్ళకు ఇష్టంలేదు. అందువల్ల ఆ పార్టీలను మెప్పించాలనే ప్రయత్నం చేయడం వృధాయే. (ఆ పార్టీలలో వ్యక్తులుగా కొందరు హేతుబద్ధంగా ఆలోచించేవారు లేకపోలేదు. వారి స్నేహాన్ని పౌరహక్కుల ఉద్యమం తిరస్కరించడం లేదు.) మధ్యతరగతిలోకి, సామాన్య ప్రజలలోకి ఈ ప్రచారం ఒక మేరకు ఇంకిందనడం నిజమే. దాని గురించి మట్టుకు సీరియస్‌గా ఆలోచించాలి. నిజానికి ప్రభుత్వం చేసే దుష్ప్రచారం ఇంకిందనడం కంటే పౌరహక్కుల సంఘం ఆచరణ వల్లనే ఆ అభిప్రాయం కలుగుతున్నదన్నా పూర్తిగా అవాస్తవం కాదు. ప్రజల దృష్టికి పౌరహక్కుల ఉద్యమం విప్లవోద్యమానికి ఒక శాఖగా, ఒక ఎక్స్‌టెన్షన్‌గా కనబడినంతకాలం ఈ అభిప్రాయం పోదు. ప్రస్తుతం అధిక భాగం ఆ విధంగానే కనిపిస్తుంది. ఇది మారాలంటే పౌరహక్కుల సంఘం కార్యకర్తల ఆచరణ, ఆలోచన, ప్రవర్తన మారాలి. స్వంత అస్థిత్వం, స్వతంత్ర కార్య రంగం, స్వంత ఆలోచన ఉన్న ఉద్యమంగా దీనిని గుర్తించి అందుకు తగ్గ దృష్టిని, ఆచరణను పెంపొందించుకోవాలి.

ఆ ఉద్యమాల హింసామార్గాన్ని గురించి ఎవరికే అభిప్రాయం వున్నప్పటికీ, ఒక ప్రత్యామ్నాయ రాజకీయంగా వాటి సాధికారతను గుర్తించాలనీ రాజకీయంగానే దానిని చర్చించాలనీ పౌరహక్కుల ఉద్యమం పట్టుబడుతుంది.

ఒక విషయం మటుకు స్పష్టమే. స్వంత అస్థిత్వం, స్వతంత్ర ఆలోచన ఉన్నాయంటే అర్థం పౌర హక్కుల ఉద్యమం అటు వ్యవస్థను, ఇటు తిరుగబాటుదారులను సమానంగా చూస్తుందని కాదు. చూడదు. ఉద్యమాల అవసరాన్నీ ఉద్యమించే హక్కునూ పౌరహక్కుల సంఘం ప్రధాన విషయాలుగా గుర్తిస్తుంది. ఈ వ్యవస్థ లోపలే కాదు, ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం ఉద్యమించే హక్కును కూడ గుర్తిస్తుంది. ఈ వ్యవస్థ ఆమోదించే రాజకీయాలనే కాదు, ప్రత్యామ్నాయ రాజకీయాలను (దానికి వ్యవస్థ తీవ్రవాదం అనీ, వేర్పాటువాదం అనీ పేర్లు పెట్టినప్పటికీ) అనుసరించే హక్కును కూడ గుర్తిస్తుంది. వ్యవస్థ కొన్ని రకాల రాజకీయ ప్రత్యామ్నాయాన్ని మట్టుకే 'ప్రతిపక్షం' అనే పేరుతో సాధికారత (ఇంగ్లీషులో లెజిటిమసీ అంటారు) కలిగిన ప్రత్యామ్నాయంగా గుర్తిస్తుంది. ఆ సాధికారతా పరిధికి వెలుపల ఉన్న రాజకీయాలను ఆసలు రాజకీయంగానే గుర్తించదు. ఒక ప్రత్యామ్నాయంగా అసలు గుర్తించదు. కేవలం దానిలోని హింసను మట్టుకే చర్చిస్తుంది. హింసావాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం, విచ్ఛిన్నకరవాదం అనే తిట్టు మాటలకు తన చర్చను పరిమితం చేస్తుంది. ఈ వైఖరిని పౌరహక్కుల ఉద్యమం గర్హిస్తుంది.

ఆ ఉద్యమాల హింసామార్గాన్ని గురించి ఎవరికే అభిప్రాయం వున్నప్పటికీ, ఒక ప్రత్యామ్నాయ రాజకీయంగా వాటి సాధికారతను గుర్తించాలనీ రాజకీయంగానే దానిని చర్చించాలనీ పౌరహక్కుల ఉద్యమం పట్టుబడుతుంది. వ్యవస్థ చేసే ప్రచారం ప్రభావం సామాజిక చైతన్యం మీద బలంగా ఉంటుంది కాబట్టి ఈ వాదన సామాన్య ప్రజలకు కూడ సులభంగా అర్థం కాకపోవచ్చు. అర్థం అయిన వాళ్ళు కూడ ఆమోదించకపోవచ్చు. అందువల్ల పౌర హక్కుల సంఘం అంటే తీవ్రవాదులకు మద్దతు ఇచ్చే సంఘం అనే అభిప్రాయం పూర్తిగా పోదు. 'తీవ్రవాదం' అనేది కూడ ఒక రాజకీయమేననే వాదన సమాజానికి నూటికి నూరు శాతం ఎప్పటికీ మింగుడు పడదు కాబట్టి ఈ ముద్ర నూటికి నూరుశాతం ఎప్పటికీ పోదు.

అయితే ఎంతవరకు పోగొట్టుకోవడం సాధ్యమో అంతవరకు పోగొట్టుకుంటున్నామా? 'తీవ్రవాదులకు మద్దతు ఇస్తున్నారు' అనుకొనేవాళ్లు కూడ ఒక అనుబంధ సంస్థగా కాకుండా ఒక స్వతంత్ర అవగాహన గల సంస్థగా ఆ పని చేస్తున్నారని అనుకొనే విధంగా నడుచుకుంటున్నామా? అని ప్రశ్నలు వేసుకుంటే నూటికి నూరుశాతం కాదు కదా యాభై శాతం కూడ అవునని జవాబు చెప్పే స్థితిలో ఈ రోజు లేమేమో. పైన చెప్పినట్టు గతంలో

కంటే ఇప్పుడు పరిస్థితి చాలా మెరుగయ్యింది. అయినా ఇంకా ప్రయత్న పూర్వకంగా మెరుగుపరచుకోవాల్సి ఉంది.

❖ పౌరహక్కుల సంఘం రాజకీయ సంఘాలలో భిన్నమైన రాజకీయ సంఘం. ప్రజా సంఘాలలో భిన్నమైన ప్రజా సంఘం. ఈ ప్రత్యేక లక్షణం వల్ల ఎలాంటి సమస్యలు ఏర్పడ్డం లేదా? దీన్ని మరింత 'మాస్-ఓరియంటెడ్'గా చేయాలంటే ఎలా?

⌖ ఈ ప్రశ్నకు జవాబు ఇప్పటికే చాలావరకు వచ్చింది. మన బోటి దేశాలలో పౌర హక్కుల ఉద్యమాలు ఒక విచిత్రమైన వైరుధ్యాన్ని ఎదుర్కొంటున్నాయి. ఇక్కడ పౌరహక్కుల ఉద్యమం ఎంత ఆవశ్యమో అంత కష్ట సాధ్యం. ప్రజాస్వామ్యమనేదాన్ని (ప్రజాస్వామ్య హక్కులు, విలువలు, ప్రక్రియలు, సంస్థలు) ఒక స్వతంత్ర విలువగా కాంక్షించే రాజకీయ పరిణతి మన దేశ సామాజిక చైతన్యంలో లేదు. ప్రజా ఉద్యమకారులు కూడ 'మీ చట్టంలో మీరు రాసుకున్నారు కాబట్టి అమలు చేయండి' అనే పద్ధతిలోనే పౌరహక్కుల కోసం అడుగుతారు. తొలి రోజులలో పౌరహక్కుల సంఘాలు కూడ (కొంతమేరకు ఈనాటికీ) 'మీరు రాసుకున్నారు కాబట్టి' అనే ధ్వనితోనే పౌరహక్కుల అమలును డిమాండు చేసాయి. ప్రజాస్వామ్యమనేది వాళ్లు రాసుకున్నారు కాబట్టి అమలు చేయమని అడిగేది కాదనీ, ప్రజాఉద్యమాల పురోగమనానికి ఒక ఎత్తుగడగా ఉపయోగపడుతుంది కాబట్టి కోరేది కాదనీ, దానంతటదే కాంక్షించదగ్గ రాజకీయ విలువనీ అర్థం కావడానికి పౌరహక్కుల ఉద్యమకారులకే చాలా కాలం పట్టింది. ఇంక వేరేవాళ్ళ సంగతి ఎందుకు? హక్కుల గురించి మేము మాట్లాడేటప్పుడు 'మీరు రాసుకున్నారు కాబట్టి' అనడం మానేసి ఎంతోకాలం కాలేదు. ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడేటప్పుడు 'అని పిలువబడేది' 'అని చెప్పబడుతున్నది' అని తోకలు తగిలించడం మానేసి ఎంతో కాలం కాలేదు.

ప్రజాస్వామ్యమనే దానికి ఒక స్వతంత్ర రాజకీయ విలువగా గుర్తింపు (ప్రజలలోనూ, పాలకులలోనూ) సాధించడం పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యం. కాని ప్రజలలో ఆ గుర్తింపు ఇంకా బలంగా లేకపోవడం పౌరహక్కుల ఉద్యమానికి ఒక పరిమితి. పైన చెప్పినట్టు దీని ఫలితంగా ఈ ఉద్యమంలోకి వచ్చేవాళ్ళు ప్రజాస్వామ్యం అనే విలువను స్వతంత్రంగా కాంక్షించేవాళ్ళు కాక, విప్లవ కమ్యూనిస్టు ఉద్యమం వల్లనో, దళిత ఉద్యమం వల్లనో ప్రేరేపితులై పౌరహక్కుల ఉద్యమం దానికి సహాయంగా ఉంటుంది కాబట్టి దీనిలో పనిచేద్దామని వచ్చేవాళ్ళే.

దీనిని ఒక నిరాశావాదంగా మార్చి స్వతంత్ర అవగాహన, అస్థిత్వం గల పౌరహక్కుల ఉద్యమం సాధ్యమే కాదనీ, ప్రజాఉద్యమాలకు అనుబంధ లేక సహాయక సంస్థగానే ఇది ఉంటుందనీ నిర్ధారించడం చీకట్లో ఎట్లాగా కనబడదని మన కళ్ళు మనం పీక్కోవడం అవుతుంది. స్వంత అస్థిత్వం కోసం, స్వంత అవగాహన కోసం ఏ మేరకు పౌరహక్కుల ఉద్యమం పట్టుదలగా కృషి చేస్తుందో ఆ మేరకు తన లక్ష్యానికి చేరువవుతుంది. అదే సమయంలో తన వ్యాప్తికి గల ఆటంకాలను తొలగించుకుంటుంది.

పౌరహక్కుల ఉద్యమం ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెంపొందించడం తన ప్రధాన లక్ష్యంగా పెట్టుకొంది కాబట్టి చైతన్యానికి సంబంధించిన ఆటంకాలే ప్రధానమైనవి. వీటిలో కొన్ని సార్వత్రికమైనవి. కొన్ని మన దేశ హైందవ సంస్కృతికి ప్రత్యేకమైనవి. మనిషి స్వేచ్ఛకూ, స్వతంత్రానికీ, సమగ్రమయిన ఎదుగుదలకూ, నిండయిన బ్రతుకుకూ అడ్డమొచ్చే శక్తులన్నిటినీ ప్రశ్నించడం నేర్చుకోవాలి. అది అన్నింటికంటే ముఖ్యమైన ప్రజాస్వామిక విలువ. కానీ ఆస్తిలో, కులంలో, కుటుంబంలో, రాజ్యాధికారంలో 'పెద్దవాళ్ళు' 'గొప్పవాళ్ళు' 'దొరలు' 'మగమహారాజులు' అయినవాళ్ళు తమ ఇష్టానుసారం ప్రవర్తిస్తారనీ అది ప్రకృతిసిద్ధమైన సహజ ధర్మమనీ నమ్మే సంస్కృతి మనది.

ప్రశ్నించడానికి ఈ సంస్కృతిలో తావు లేనే లేదని కాదు. ఆ పెత్తందారీ శక్తులు ఆమోదించే విమర్శనా పరిధి ఒకటి వుంటుంది. ఈ 'గొప్పవాళ్ళకు' 'తక్కువవాళ్ళ' పట్ల కొన్ని ధర్మాలను ఆ 'గొప్పవాళ్ళే' నిర్దేశిస్తారు. ఆ మేరకు ప్రశ్నించవచ్చు. కానీ దానిని దాటిపోతే అది ధర్మ విరుద్ధం అవుతుంది, సంఘ విద్రోహం అవుతుంది. సమాజ విచ్ఛిన్నం అవుతుంది. ఈనాటి పరిభాషలో తీవ్రవాదం, ఉగ్రవాదం అవుతుంది. ఇది కేవలం పాలకుల అభిప్రాయం కాదు. ప్రజల చైతన్యంలోనూ ఇది ఇంకిపోయి ఉంటుంది. 'కోర్టులో కేసు వేయవచ్చు కదా? చట్టాన్ని తామే చేతిలోకి తీసుకోవడం ఎందుకు?', 'ఎన్నికలలో పోటీచేసి గెలవవచ్చు కదా? తుపాకులు పట్టుకోవడం ఎందుకు?' మొదలైన ప్రశ్నలు మనం తరచూ వింటుంటాం. ఇది సార్వత్రికంగా ఉండే విషయమే. కాని మన హైందవ సంస్కృతిలో కులాధిక్య భావంతో, కర్మ సిద్ధాంతంతో, పునర్జన్మ భావనతో ఇది ముడిపడి వుంటుంది.

ప్రజాస్వామ్య చైతన్యం వ్యాప్తికి భయంకన్న, బెదిరింపులకన్న, మధ్యతరగతి నిరాసక్తికన్న ఈ పరిమితే పెద్ద ఆటంకం అనుకుంటాను. అయితే ఈ మధ్యకాలంలో వ్యాపార సంస్కృతికి సంబంధించిన సంకుచిత ధోరణులు, స్వార్థధోరణులు కూడ ప్రబలుతున్నాయి. ఈ సంస్కృతి వ్యక్తిగత స్వేచ్ఛకు, స్వతంత్రతకు చాలా ప్రాముఖ్యం ఇచ్చినట్టు కనిపిస్తుంది కానీ అది సమిష్టి కార్యాచరణకు వ్యతిరేకం. 'ఎవరి బాగు వాళ్ళు చూసుకుంటే ప్రపంచం అదే బాగుపడుతుంది' అనే వైఖరి అవలంబిస్తుంది. ఈ సంస్కృతి ప్రబలడం కూడా పౌర హక్కుల ఉద్యమ వ్యాప్తికి ఒక ప్రతిబంధకమే.

'మాస్ – ఓరియంటెడ్'గా చేయడాన్ని గురించి ఇదివరకే చెప్పాను. పూర్తిగా స్వేచ్ఛను హరించే నియంతృత్వ పాలనలో మట్టుకే ప్రజాస్వామ్యం కోసం విస్తృత ప్రజా ఉద్యమాలు వచ్చాయి. అరకొర ప్రజాస్వామ్య మనుభవిస్తున్న దేశాలలో తక్షణ ఆర్థిక సామాజిక ప్రయోజనాలు నెరవేర్చని వట్టి పౌరహక్కుల ఉద్యమం విస్తృత ప్రజా ఉద్యమం కావడం కష్టం. ఈ ఉద్యమం 'మాస్ – ఓరియంటెడ్' కావడం అంటే అర్థం శ్రామిక ప్రజానీకంలో పుట్టి కొత్తగా మేధావులుగా ఎదుగుతున్న యువతరాన్ని ఈ ఉద్యమం వైపు ఆకర్షించడం; కొత్తగా విద్యావంతులై మేధావి వర్గంలోకి ప్రవేశిస్తున్న దళితులనూ, స్త్రీలనూ ఆకర్షించడం. పౌరహక్కుల ఉద్యమానికి 'మాస్ – ఓరియంటేషన్' అంటే ఇంతకంటే వేరే అర్థం

ఉండజాలదనుకుంటాను. ఈ ప్రయత్నం మా శక్తి మేరకు చేస్తూనే ఉన్నాము. దళితుల విషయంలో సఫలం అయినంతగా స్త్రీల విషయంలో కాలేకపోతున్నాము.

❖ మన దేశంలో బూర్జువా ప్రజాస్వామ్యమైనా వుందా లేదా అనేది వివాదాస్పద విషయంగా వుంది. పౌరహక్కుల ఉద్యమకారుడుగా ఈ విషయంలో మీ అనుభవం ఏం చెబుతోంది?

⊕ ముందు బూర్జువా ప్రజాస్వామ్యం అంటే అర్థం ఏమిటో కొంచెం చర్చించాలి. చాలా మంది ప్రజాస్వామ్యం అనేదానికే బూర్జువా లక్షణాలున్నట్లు మాట్లాడుతున్నారు కాబట్టి కొంత వివరణ అవసరం.

ప్రజాస్వామ్యం అనేది కొన్ని హక్కులు, విలువలు, సంస్థలు, ప్రక్రియల కలయిక. ఇవి చరిత్రలో అనేక పోరాటాల ఫలితంగా వచ్చినవి. చట్టబద్ధ పాలన (రూల్ ఆఫ్ లా) అనేదానికి రాజులను ఒప్పించడానికి ఇంగ్లండ్‌లో నాలుగు శతాబ్దాల పోరాటం జరిగింది. మిగిలిన అన్ని ప్రజాస్వామిక విలువలూ ఆ రకమైన పోరాటాల నుండి వచ్చినవే. సంతాల్ పోరాటమూ, రంప పితూరీలూ పెద్ద ఎత్తున సాగబట్టే గిరిజనులకు అడవి ప్రాంతంలో కొన్ని ప్రత్యేకమైన హక్కులున్నాయన్న గుర్తింపు వచ్చింది.

ఈ హక్కులకు, విలువలకు, ప్రక్రియలకు ‘బూర్జువా’ స్వభావం ఎక్కడినుండి వస్తుందంటే వాటిని నిర్వచించే పద్ధతి నుండి, వ్యవస్థీకరించే పద్ధతి నుండి. బూర్జువా వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని తన పరిధిలోకి కుదించి నిర్వచించింది, వ్యవస్థీకరించింది. కొందరిని స్వాభావికంగానే ఉన్నతులుగా, కొందరిని అల్పులుగా చూసే భూస్వామ్య శాసనాధికారం మీద జరిగిన తిరుగుబాటు ఫలితంగా ‘చట్టం ముందు అందరూ సమానమే’, ‘చట్టం అందరికీ సమాన సంరక్షణ కల్పించాలి’ అనే ప్రజాస్వామ్య విలువలు పుట్టాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లో ఇది ఒక ప్రాథమిక హక్కు. అయితే ఈ సమదృష్టి అనే దాన్ని బూర్జువా శాసనం తన పరిధిలోకి కుదించి వ్యవస్థీకరించింది.

ఉదాహరణకు చట్టం అందరినీ సమదృష్టితో చూడాలంటే అర్థం ఏమిటంటే కోర్టులో అందరికీ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, సివిల్ ప్రొసీజర్ కోడ్‌లు సమంగా వర్తిస్తాయని. సమదృష్టిని బూర్జువా శాసనం ఈ రకంగా వ్యవస్థీకరించింది. కాని ఈ ‘సమదృష్టి’ని డబ్బున్నవాళ్ళు ఉపయోగ పెట్టుకున్నంతగా డబ్బులేని వాళ్ళు ఉపయోగ పెట్టుకోలేరన్నది బూర్జువా శాసనానికి అనవసరం. అదే విధంగా, మమ్మల్ని ఏ రాజులూ పరిపాలించనవసరం లేదు. మమ్మల్ని మేమే పరిపాలించుకుంటాం అనే ప్రజాస్వామిక ఆకాంక్షను అయిదేళ్ళకొకసారి జరిగే ఎన్నికల రూపంలో బూర్జువా సమాజం వ్యవస్థీకరించింది. దానినే ప్రజాస్వామ్యంగా నిర్వచించింది.

ఇప్పుడు ‘బూర్జువా ప్రజాస్వామ్యం అయినా ఉందా లేదా’ అనే ప్రశ్నను విడమరచి చర్చించుకుందాం. విడగొట్టి విశ్లేషిస్తే ఇది ఒక ప్రశ్నగా కాక కనీసం మూడు ప్రశ్నల కలయికగా అర్థమవుతుంది.

1. భారత ప్రజాస్వామ్యం ఏ ప్రజాస్వామిక విలువలను, హక్కులను శాసనరూపంలో వ్యవస్థీకరించింది?

2. వాటిని వ్యవస్థీకరించిన తీరులో ఉన్న పరిమితులు, లోపాలు ఏమిటి?

3. ఆచరణలో ఇవి ఏ మేరకు అమలవుతున్నాయి?

ఈ రకంగా అర్థం చేసుకున్నపుడు మీరు వేసిన ప్రశ్నకు 'ఉంది' అనిగానీ 'లేదు' అనిగానీ జవాబు చెప్పడం సాధ్యం కాదని అర్థం అవుతుంది. భారత రాజ్యాంగం, చట్టాలు పాశ్చాత్య దేశాల శాసనాలు ఆమోదించే హక్కులలో చాలావాటిని గుర్తించాయి, వ్యవస్థీకరించాయి. అదనంగా భారతదేశ చరిత్రకు ప్రత్యేకమయిన కుల వ్యతిరేక పోరాటాల నుండి వచ్చిన కొన్ని హక్కులను కూడ వ్యవస్థీకరించాయి. అయితే అనేక పాశ్చాత్య దేశాల రాజ్యాంగాల కంటే మన రాజ్యాంగం హక్కులకు ఎక్కువ పరిమితులు పెట్టింది. నిజానికి హక్కుల ప్రకటనలోనే పరిమితులను పేర్కొన్న రాజ్యాంగం మనది తప్ప వేరే ఏదీ లేదు. ఈ పరిమితులను కాలక్రమంలో కోర్టులు తమ వ్యాఖ్యానాలలో కొంత సడలించాయి. కొన్ని పరిమితులను ధృవీకరించాయి. గత దశాబ్ద కాలంలో దేశంలో రాజకీయ సంక్షోభం పెరిగిన క్రమంలో ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన టాడా వంటి శాసనాలు కొత్తగా వచ్చి చేరాయి. అయితే శాసనాల అవసరం లేకుండ ఆచరణలో ప్రజాస్వామ్య విలువలను పూర్తిగా ధ్వంసం చేసే అలవాటు భారత రాజ్యాంగ యంత్రానికి తొలినాటి నుండీ వున్నది. ఇది ఈ మధ్య మరీ పెరిగింది. పోలీసుయంత్రాంగం ఈ విధ్వంసానికి ప్రధాన సాధనం.

ఈ పరిమితుల నుండి, విధ్వంసం నుండి ప్రజాస్వామ్య విలువలను కాపాడే కర్తవ్యం ఒక ముఖ్య కర్తవ్యం. పౌరహక్కుల ఉద్యమానికి తనదయిన కార్యరంగం ఈ కర్తవ్యంలో ఉందని ముందే చెప్పాను. ఈ కర్తవ్యం నిర్వహించేటప్పుడు 'బూర్జువా ప్రజాస్వామ్యమయినా ఉందా లేదా' అనే పద్ధతిలో ప్రశ్న వేసుకొని ప్రయోజనమేమీ లేదు.

❖ గిరిజన, దళిత, స్త్రీ సమస్యల పట్లా, జాతుల సమస్య పట్లా పౌరహక్కులసంఘం చాలా సీరియస్‌గానే స్పందించింది. ప్రజాస్వామిక చైతన్యంతో కొత్త తరగతుల ప్రజలను మేల్కొల్పి వాళ్ళ హక్కులపట్ల కొత్త జాగృతిని కల్గిస్తున్న ఈ తరుణంలో పౌరహక్కుల సంఘం యొక్క బాధ్యత ఎంతో పెరిగింది. అయితే ఈ బాధ్యతలు నెరవేర్చడంలో ఒక ఆర్గనైజేషన్‌గా మీకెదురౌతున్న ఇబ్బందులేమిటి?

ఏ ప్రజా ఉద్యమం ముందుకొచ్చినా హక్కులకు సంబంధించి ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఆ కోణాన్ని అందుకొని దాన్ని పౌరహక్కుల దృక్పథంలోనూ, ఆచరణలోనూ భాగం చేసే బాధ్యత పౌరహక్కుల ఉద్యమానిది.

కొత్తవర్గాల నుండి కార్యకర్తలను తయారు చేసుకోలేకపోతే ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం సాధ్యం కాదేమో అనిపిస్తుంది. పౌరహక్కుల ఉద్యమాన్ని ప్రజాతంత్ర మేధావుల

ఉద్యమంగా అర్థం చేసుకుంటే, ప్రజాతంత్ర ఉద్యమంలోకి ఎన్ని వర్గాలు వచ్చి చేరుతాయో ఆ వర్గాలన్నిటికీ చెందిన ప్రజాతంత్ర భావాలు గల మేధావులకూ దీనిలో స్థానం ఉండాలి. లేకపోతే తన కర్తవ్యాన్ని పౌరహక్కుల ఉద్యమం సక్రమంగా నిర్వర్తించలేదు. ప్రజాతంత్రభావాలు కలవాళ్ళు ఏ విషయాన్ని గురించయినా ప్రజాస్వామికంగానే ఆలోచిస్తారు కాబట్టి ఎన్ని కొత్త కోణాలు ముందుకొచ్చినా కొత్త సెక్షన్లకు చెందిన మేధావులను చేర్చుకోక పోయినప్పటికీ పౌరహక్కుల ఉద్యమం తన కర్తవ్యాన్ని నిర్వర్తించగలదని అనుకోవడం భ్రమే. 'ప్రజాతంత్రభావాలు కలిగి ఉండడం' అంటే తమ అనుభవం మేరకు ప్రజాస్వామికంగా ఆలోచించడం అని అర్థం. ఆ అనుభవానికి ఉన్న పరిమితులు ఆలోచనకూ ఉంటాయి. ఒకరిద్దరు వ్యక్తులుగా తమ వ్యక్తిగత జీవిత అనుభవాన్ని అధిగమించి అందరి అనుభవాన్ని గురించీ ప్రజాస్వామికంగా ఆలోచించగలుగుతారేమోగాని, అంతటి చైతన్యం 'ప్రజాస్వామిక వాదులు' అందరికీ సాధ్యం కాదు. అందువల్ల కేవలం అగ్రకుల పురుషులు సభ్యులుగా వున్న పౌరహక్కుల సంఘం దళితుల సమస్యలకూ స్త్రీల సమస్యలకూ ఉత్సాహంగా స్పందించగలుగుతుందనుకోవడం అవాస్తవికం.

మాకిది అనుభవంలో రుజువయింది. కులం సమస్య గురించి, స్త్రీలపైన అణచివేత గురించి పౌరహక్కుల దృక్పథంతో స్పందించి కార్యక్రమాలు చేపట్టాలని మేము నిర్ణయించుకొని నాలుగయిదేళ్ళయ్యింది. అయితే ఇందులో మొదటిది అమలయినట్లు రెండవది అమలు కాలేదు. ఎ.పి.సి.యల్.సి. కార్యకర్తలలో ఎస్.సి, బి.సి. కులాలకు చెందిన వాళ్ళు ఇప్పుడు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. చాలా జిల్లా శాఖల కార్యవర్గాలలో మెజారిటీగా కూడ ఉన్నారు. అందువల్ల మండల్ కమీషన్, చుండూరు మొదలయిన విషయాల మీద మేము చేపట్టిన కార్యక్రమాలు బాగానే అమలయ్యాయి. కానీ ఎ.పి.సి.యల్.సిలో స్త్రీల సంఖ్య బాగా తక్కువ. అందువల్ల పౌరహక్కుల పరిధిలో స్త్రీల సమస్యలు చేపట్టాలని తీసుకున్న నిర్ణయం అమలయ్యింది చాలా తక్కువ. అది కూడ స్త్రీలు ముఖ్య బాధ్యులుగా వున్న జిల్లాలలో (విశాఖపట్నం, కృష్ణ, కడప) మాత్రమే అమలయ్యింది.

చరిత్ర పురోగమన క్రమంలో వివిధ రూపాలలో అణచివేతకు గురయ్యేవారంతా ఉద్యమాలలోకి వస్తారు. కొత్త కొత్త ఉద్యమాలు ముందుకొస్తాయి. దాని వల్ల పౌరహక్కుల ఉద్యమంపైన పెరిగే బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలంటే కొత్తగా ఉద్యమాలలోకి వస్తున్న సెక్షన్లకు సంబంధించిన మేధావి వర్గం నుండి కూడ పౌరహక్కుల ఉద్యమం కార్యకర్తలను తయారు చేసుకోగలగాలి. ఇదే ప్రధానమయిన సమస్య. తక్కినవి కాకతాళీయమయిన ప్రతిబంధకాలు.

'జనంసాక్షి' అప్పట్లో కర్నూలు నుంచి వెలువడిన ఒక బులెటిన్.
దాని ఎడిటర్ భార్గవ చేసిన ఇంటర్వ్యూ ఇది.

# కుల వ్యవస్థ - పౌరహక్కులు

కులాన్ని గురించి, కుల వ్యవస్థను గురించి ఈ రోజు సమాజంలో చాలా చర్చ జరుగుతున్నది. నిన్నటి వరకు తమ జీవితాలను తాము శాసించుకునే హక్కు లేని దళితులు ఈ రోజు సమాజ జీవితాన్ని మేమే శాసిస్తామని ముందుకొస్తున్నారు. ఇది భారతదేశ చరిత్రలో ఒక మహత్తర ఘట్టం. అపూర్వ సందర్భం.

ఈ ఘట్టం అందరినీ కులవ్యవస్థ గురించి ఆలోచింపజేస్తున్నది. రాజకీయాలు, సంస్కృతి, చరిత్ర, సాహిత్యం, ఒక్కొక్క జీవితరంగంలోనూ చర్చ జరుగుతున్నది. కారంచేడు హత్యాకాండ జరిగిన నాటి నుండి కులానికీ పౌరహక్కులకూ ఉన్న సంబంధాన్ని గురించి పౌరహక్కుల ఉద్యమం ఆలోచిస్తూ ఉంది. దళితుల ఉద్యమాల నుండి, ఆకాంక్షల నుండి నేర్చుకుంటూ ఉంది. తన ఆచరణ ద్వారా దళిత ఉద్యమాలకు సహాయ సహకారాలు అందిస్తూ ఉంది. ఈ క్రమంలో తన అవగాహనను పెంచుకొంటూ ఉంది.

కె. బాలగోపాల్

కులవ్యవస్థ - పౌరహక్కులు సదస్సు కోసం రాసిన కరపత్రం, 1994

అగ్రకులాలకు చెందిన గ్రామీణ పెత్తందారీ మూకలు దళితులపైన దాడి చేసి గృహాలు దహనం చేసినప్పుడు, బరిసెలతో గొడ్డళ్లతో దళితులను పొడిచి నరికి పోగులు పెట్టినప్పుడు 'ఇది ఘోరం, అన్యాయం' అని అనుకోవడం, దోషులను శిక్షించడం కోసం కృషి చేయడం, న్యాయం కోసం జరిగే దళితుల ఉద్యమాలలో పాల్గొనడం ఒకెత్తు.

ఈ హింస వెనుక ఉన్న వ్యవస్థను, దాని నిర్మాణాన్నీ భావజాలాన్నీ గుర్తించడం ఇంకొకెత్తు. ఆ నిర్మాణం, భావజాలం నాశనం కానిదే ఈ దాడులు ఆగవని పౌరహక్కుల ఉద్యమం గుర్తించింది. కుల నిర్మూలనం జరగనిదే 'ప్రజాస్వామ్యం' అనే మాటకు భారత సమాజంలో నిండయిన అర్థం రాదని గుర్తించింది.

కారంచేడు చుండూరు వంటి దాడులు కులవ్యవస్థలో ఉండే భౌతిక దౌర్జన్యాన్నీ హింసనూ కళ్లకు కట్టినట్టు చూపించాయి. ఈ హింస వెనుక దాగి వున్న అమానుషమయిన విషవ్యవస్థ పైన చర్చను ఆహ్వానించాయి.

మండల్ కమీషన్ ప్రతిపాదనలను అమలు చేస్తానని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పుడు కుల వ్యవస్థలోని భౌతిక హింసే కాక తాత్విక హింస కూడ బయటకు వచ్చింది. దళితులకు సంపూర్ణమయిన మనుషులుగా గుర్తింపు ఇవ్వని బ్రాహ్మణీయ సంస్కృతి కొత్త నినాదాలతో, ఆధునిక పరిభాషతో ముందుకొచ్చింది. భౌతిక దాడులనూ హింసనూ అరికడితే చాలదనీ సామాజిక నిర్మాణం, సంస్కృతి, భావజాలం తదితర రంగాలన్నిటిలోనూ కుల నిర్మూలన కోసం కృషి జరగకపోతే ఆ హింసకు పునాది అయిన వ్యవస్థ నాశనం కాదనీ 'మండల్' సంఘర్షణ స్పష్టంగా చూపించింది.

ఈ కృషి ఏ విధంగా జరగాలనే విషయంలో రాజకీయ విభేదాలుంటాయి. విభిన్న రాజకీయ సిద్ధాంతాల మధ్య ఘర్షణ ఉంటుంది. ఆధునిక కాలంలో ఈ కృషిని రాజకీయంగా చేపట్టిన పెరియార్, పూలె, అంబేద్కర్ వంటి వాళ్ళు తమ సిద్ధాంత దృక్పథాన్ని ప్రతిపాదించారు. వాళ్ల ఆలోచనల ప్రేరణతో కృషి కొనసాగుతూ ఉంది. అందులో భాగంగానే ఈ రోజు బహుజన్ సమాజ్ పార్టీ ఒక కొత్త రాజకీయ శక్తిగా దేశ రాజకీయాలలో ముందుకు వచ్చింది. కానీ కుల నిర్మూలన గురించి ఇందుకు భిన్నమయిన ఆలోచనలు, సిద్ధాంతాలు ఉన్నాయి, ఉంటాయి.

ఈ వివిధ ఆలోచనల తప్పొప్పులను, సాధ్యాసాధ్యాలను బేరీజు వేయడం పౌరహక్కుల సంఘం ఉద్దేశ్యం కాదు. అయితే ఈ ఆలోచనల నేపథ్యంలో కుల నిర్మూలనను ఒక ప్రజాతంత్ర కర్తవ్యంగా గుర్తించి దాని ఆవశ్యకతను వివరంగా చర్చించవలసిన అవసరం ఉందని పౌరహక్కుల సంఘం భావిస్తూ ఉంది.

మనిషయి పుట్టిన కారణంగా ప్రతి ఒక్కరికి కొన్ని సహజ హక్కులుంటాయనేది ఒక బలమయిన ప్రజాతంత్ర భావన. ఏవి 'సహజ హక్కులు' అని నిర్వచించడంలో అభిప్రాయభేదాలకు తావు ఉన్నా ఈ భావన ప్రజాతంత్ర దృక్పథానికి కీలకమయినది. వర్ణ

వ్యవస్థ, వర్ణ ధర్మం, బ్రాహ్మణీయ భావజాలం దీనికి బద్ధ శత్రువులు. అసలు వర్ణ ధర్మం ప్రకారం 'మనిషయి పుట్టడం' అనే మాటకే అర్థం లేదు. బ్రాహ్మణులుగా పుడతారు, శూద్రులుగా పుడతారు, అతి శూద్రులుగా పుడతారు. ఆడవాళ్ళుగా పుడతారు, మగవాళ్ళుగా పుడతారు. కాబట్టి పుట్టినందుకు ఎవరికీ సహజ హక్కులుండవు. సహజ ధర్మాలు మాత్రమే ఉంటాయి. ధర్మం అంటే పుట్టిన పుట్టుకను అనుసరించి జీవితాన్ని ఆచరించడం.

ఈ సహజ ధర్మాల సమాజం సమాన విలువ ఉన్న మనుషుల సమూహం కాదు. అదొక హెచ్చుతగ్గుల నిచ్చెన. నిచ్చెన కింది నుండి మీదికి, మీది నుండి కిందికి పోయే హక్కు, అవకాశం ఎవరికీ లేదు. మీది మెట్ల మీద ఉన్నవాళ్లకు పరపతి ఎక్కువ, అధికారం ఎక్కువ, అవకాశాలు ఎక్కువ. ఎంత మీదికి పోతే అంత ఎక్కువ. ఎంత కిందికి పోతే అంత తక్కువ. ప్రజాస్వామ్య భావనకు ఇంతకంటే పూర్తిగా విరుద్ధమయిన వ్యవస్థ వేరే ఏదీ ఉండదు. అందుకే దీనిని వ్యతిరేకించిన వాళ్ళందరినీ పాశ్చాత్య దేశాల ప్రజాతంత్ర విప్లవంలో పుట్టిన 'సహజ హక్కుల' భావన ఆకర్షించింది. జ్యోతిబా పూలే థామస్ పెయిన్‌ను ఉటంకించాడు. అంబేద్కర్ ఫ్రెంచి విప్లవ ఆశయం అయిన 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' అనే లక్ష్యాన్ని ఉటంకించాడు.

వర్ణ ధర్మ నిచ్చెన వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల ఫలితంగా భారత రాజ్యాంగం దానిని నిషేధించింది. రాజ్యాంగ పరిషత్ డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షుడయిన అంబేద్కర్ దీనికోసం ప్రత్యేకంగా కృషి చేసాడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 పరోక్షంగా కుల వ్యవస్థను నిషేధిస్తే, ఆర్టికల్స్ 15, 16, 17 ప్రత్యక్షంగానే కుల నిషేధాన్ని ప్రస్తావించాయి. కులం ఫలితంగా పుట్టిన వివక్ష సంపూర్ణంగా పోయేటటువంటి సామాజిక వ్యవస్థ కోసం భారత ప్రభుత్వం కృషి చేయాలని రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు చెప్తాయి.

### ఇదొక చెప్పుకోదగ్గ మార్పే

అయినా సామాజిక ఆర్థిక రాజకీయ జీవితంలో కుల వ్యవస్థ, వర్ణ ధర్మం, సంస్కృతి ఈ నాటికీ బలంగానే ఉన్నాయి. కారంచేడు చుండూరు వంటి దాడులు కేవలం రోగ లక్షణం మాత్రమే. సమాజంలో ఆస్తి, సంపద, అధికారం, హోదా, ఒక్క మాటలో చెప్పాలంటే అన్నిరకాల పెద్దరికం, కొద్ది శాతంగా వున్న అగ్రకులాల చేతిలోనే ఉంది. ఈ వివక్ష ఉన్నంతకాలం సమాన అవకాశాలు అనే మాటకు అర్థం లేదు. భౌతిక జీవితంలో ఉన్న ఈ వివక్షకు తగిన భావజాలం, ఆలోచనలు, తాత్విక జీవితంలోనూ, సంస్కృతిలోనూ చాలా ప్రబలంగా ఉన్నాయి. ఈ రోజు అవన్నీ 'హిందూత్వం' అనే రాజకీయ సిద్ధాంతంతో వర్ణ ధర్మ సంరక్షణ కోసం రాజకీయ పార్టీల రూపంలో, 'స్వయంసేవా' సంస్థల రూపంలో, ధర్మ సంసద్‌ల రూపంలో ముందుకొస్తున్నాయి. పైకి హిందూత్వం కేవలం మైనారిటీలకు శత్రువుగా కనిపించినా నిజానికి ఇది వర్ణ ధర్మ సంరక్షణ కోసం – అందులో భాగంగా దళితుల అణచివేతకోసం – ముందుకొస్తున్నదని స్పష్టంగానే ఉంది. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ మధ్యంతర ఎన్నికలలో దళితుల స్పందనే ఈ విషయాన్ని రుజువు చేసింది.

జీవితంలోని అన్ని రంగాలలో అలుముకొనిపోయి ఉన్న కుల వ్యవస్థ సమూల నిర్మూలనం జరగనిదే భారత దేశాన్ని ఒక ప్రజాతంత్ర సమాజంగా మార్చే కృషి పరిపూర్ణం కాదు. ఆ ఆవశ్యకత గురించి, అందుకోసం దేశంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన, జరుగుతున్న ప్రయత్నాల గురించి చర్చించుకునేందుకే ఈ సదస్సు.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఈ అంశంపై భీమవరంలో
1994 మే 7, 8 తేదీలలో జరిపిన సదస్సు కోసం రాసిన కరపత్రం.

## కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లు: ఏప్రిల్ 'జనపథం' సంపాదకీయం

1994 డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధినాయకుడు మూడు నినాదాలను ప్రధానంగా ప్రచారం చేశారు. రెండు రూపాయలకు కిలో బియ్యం, సంపూర్ణ మద్యపాన నిషేధం, ఎన్‌కౌంటర్లు ఆపివేయటం. చిత్రహింసల కొలిమిలో కాగిపోతున్న తెలంగాణ ప్రజానీకం 'ఎన్‌కౌంటర్ బంద్' ప్రచారాన్ని విశ్వసించో, తాత్కాలిక ఉపశమనమన్నా లభిస్తుందన్న ఆశతోనో కాంగ్రెసుకి వ్యతిరేకంగా ఓటు వేసారు. ఏరు దాటగానే తెప్ప తగలేయటం రాజకీయ సంస్కృతిగా మారింది. ప్రజల చెవుల్లో పూలు పెట్టడం, నాలుకను మడత పెట్టడం రాజకీయ పార్టీల నాయకులకు పరిపాటి అయింది. ఎన్నికల తంతు సమయంలో అత్యంత దూకుడుగా సాగిన ఎన్‌కౌంటర్లు, ఆ తరువాత కూడా సాగుతూనే వున్నాయి. రామారావు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 5 నెలల కాలంలో ఎన్‌కౌంటర్ హత్య జరగని నెల లేదు. ఇప్పటికి 35 మంది 'మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీల' కార్యకర్తలను, లేదా వారి సానుభూతిపరుల్ని రాష్ట్ర పోలీసులు హత్య చేసారు. హంతకులపై విచారణా లేదు, శిక్షా లేదు.

1968లో ఒక రాజకీయ విధానంగా ప్రారంభించబడిన ఎన్‌కౌంటర్లు దాదాపు నిరంతరంగా కొనసాగుతున్నాయి. గాంధేయ అహింసావాదానికి రాష్ట్ర పాలకులందరు పూజారులే! కాంగ్రెసు, తెలుగుదేశం – ఏ పార్టీ ప్రభుత్వమైనా ఎన్‌కౌంటర్ హత్యాకాండను పవిత్ర రాజకీయ కర్తవ్యంగా కొనసాగిస్తూనే వున్నారు. కనుక ఎన్‌కౌంటర్‌లను ఒక మానవ హక్కుల ఉల్లంఘన సమస్యగానో, చట్ట వ్యతిరేక చర్యలుగానో చూడటం మాత్రమే చాలదు. వాటిని ఆ రోజు నుండి వ్యతిరేకిస్తూ ప్రచారం చేయటం మాత్రమే చాలదు. ఎన్‌కౌంటర్ హత్యాకాండ గురి వ్యక్తులు కాదు ఉద్యమం, రైతాంగ విప్లవోద్యమం. రైతాంగ విప్లవోద్యమం ఎక్కడన్నా, ఎప్పుడన్నా అర్థరహిత హింసకు పాల్పడితే దాన్ని విమర్శించాల్సిందే. కానీ 'ఉద్యమకారులు నేరాలు చేస్తే అరెస్టుచేసి, కోర్టులో విచారించి శిక్షలు వేయండి. పట్టుకుని కాల్చి చంపివేయటం చట్టవ్యతిరేకం, మానవహక్కుల ఉల్లంఘన, దానిని హక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది' అని చెప్పటమంటే 'ఆమ్నెస్టీ' వాదాన్ని నెత్తికెత్తుకోవటమే. భూమయ్య, కిష్టా గౌడ్‌ల ఉరితీతను (1975 డిసెంబరు) ఆమోదించటమే! రాజకీయ ఖైదీల బేషరతు విడుదల డిమాండును హక్కుల ఉద్యమం ఎత్తివేసుకొన్నట్లే!

భారతదేశం లాంటి పేద దేశాలలోని ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమం 'ఆమ్నెస్టీ' బాటను ఎంచుకోవటం ఆత్మహత్యా సదృశ్యం, ప్రజాతంత్ర ఉద్యమాల హత్యా సదృశ్యం. ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమం ప్రజాస్వామిక శక్తుల విశాల ప్రజా ఉద్యమంలో భాగంగా సాగాలి. ఆ ఉద్యమాల రక్షణ కవచంగా రూపొందాలి. ఎన్‌కౌంటర్ల వ్యతిరేక ప్రచారోద్యమం ప్రధానంగా రాజకీయోద్యమంగా కొనసాగాలి; ప్రజా ఉద్యమంగా ఎదగాలి; 'భద్రలోగ్' (ఉన్నత మధ్యతరగతి ఉదారవాదులు) ఉద్యమంగా ఆగిపోకుండా చూసుకోవాలి. అణచివేతకు లోనవుతోన్న ప్రజలందరి దుర్గంగా, వర్గ కుల లింగ అణచివేతలను చైతన్యంతో వ్యతిరేకించే అన్ని శక్తుల కూడలిగా హక్కుల ఉద్యమం ఎదగాలి. ●

కె. బాలగోపాల్

# ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమం – సామాజిక విప్లవోద్యమాలు

**జనపథం సంపాదకుడి ముందుమాట :**

ప్రజాస్వామ్య హక్కులంటే ఏమిటి? పౌర హక్కులంటే ఏమిటి? మానవ హక్కులంటే ఏమిటి? ఈ హక్కుల భావన తలెత్తిన, ఈ హక్కుల సాధన జరిగిన – కాలము, భౌగోళిక ప్రాంతము, క్రమము – వీటిని పరిగణనలోకి తీసుకొని ఆ మూడు పదాల మధ్య తేడా చూడాలనేది ఒక వాదన. ఆ మూడూ పర్యాయ పదాలనేది మరొక వాదన. ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమం విశాల ప్రజానీకం పాల్గొనే ఒక ప్రజాఉద్యమంగా ఎదిగే ప్రయత్నం చేయాలా? లేక మేధోజీవులకు పరిమితమైన కార్యక్రమంగా ఉండాలా? ఇది ఒక సమస్య. మన భారత సమాజంలో అనేక ఉద్యమాలు సాగుతున్నాయి – రైతాంగ ఉద్యమాలు, కార్మిక ఉద్యమాలు, గిరిజన ఉద్యమాలు, దళిత ఉద్యమాలు, స్త్రీల ఉద్యమాలు, విద్యార్థి ఉద్యమాలు, జాతుల ఉద్యమాలు, మైనారిటీల స్వయం రక్షణ ఉద్యమాలు వగైరా. వీటికీ ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమానికీ ఎలాంటి సంబంధ బాంధవ్యాలు వుండాలి? అసలు ఉండనే కూడదా? ఇది ఇంకొక సమస్య. అమలులో వున్న సామాజిక వ్యవస్థకీ (విస్తృతార్థంలో) ప్రజాస్వామ్య విలువల స్థాయికీ ఎలాంటి సంబంధముంటుంది? అసలు ప్రజాస్వామ్యమంటే ఏమిటి? నియంతృత్వమంటే ఏమిటి? సామాజిక మౌలిక మార్పు కోసం జరిగే ఉద్యమంలో సంభవించే హింసపట్ల, ఆ హింసా చర్యలలో పాల్గొన్న వ్యక్తులపట్ల హక్కుల ఉద్యమం ఎలాంటి వైఖరిని తీసుకోవాలి? ఉద్యమంలో జరిగే హింసకు, హింసే ఉద్యమంగా మారటాన్ని వేరుచేసి చూడాలా లేదా?

సామాజిక మార్పు కొరకు ఉద్యమాలు నిర్మించే శక్తులను ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమం నుంచి దూరంగా ఉంచాలా? ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమం రాజకీయ ఉద్యమమేగాని రాజకీయ వేదిక ఉద్యమంగా మారకూడదు అంటే ఏమిటి? అసలు హక్కుల ఉద్యమానికి వర్గ దృక్పథం ఉండాలా, అవసరం లేదా? ఉండకూడదంటుంది 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్'. ఫ్రెంచి విప్లవం (1789), అమెరికా స్వాతంత్ర్య పోరాటం (1776), పారిస్ కమ్యూన్ (1871), రష్యా విప్లవం (1917 అక్టోబరు), చైనా విప్లవం (1949) యివి హక్కుల భావనకు చేకూర్చిన జవసత్వాలేమన్నా వుంటే, ఏమిటవి? భారత స్వాతంత్రోద్యమం ఏ ప్రజాస్వామిక విలువలను మన సమాజంలోకి తెచ్చింది? రష్యా, చైనా విప్లవాలు రెండూ 20వ శతాబ్దంలో అత్యంత నిరంకుశ నియంతృత్వం ఏర్పాటుకు దారి తీసాయా? ఈ ప్రశ్నలను, ఇంకెన్నో ప్రశ్నలను ఏప్రిల్ 1995 'జనపథం' లో వచ్చిన చిన్ని ఎడిటోరియల్‌కి స్పందనగా బాలగోపాల్ వ్రాసిన లేఖ లేవనెత్తింది. వీటిపై చర్చ జరగాలని కూడా ఆ లేఖలోనే బాలగోపాల్ ప్రతిపాదించారు. వ్యక్తిగత దూషణ భూషణలు లేని శాస్త్రీయ చర్చను ఆహ్వానిస్తున్నాం.

# మన పని కవచంగా పనిచేయడం కాదు

**'జనపథం' సంపాదకులకు,**

ఏప్రిల్ నెల 'జనపథం' సంపాదకీయం చదివి ఈ లేఖ రాస్తున్నాను. మీరు పేరు పెట్టకుండ విమర్శిస్తున్నది ఎపిసియల్‌సినే అనే విషయం స్పష్టంగానే వుంది. అయినా నేను ఎపిసియల్‌సి ప్రధాన కార్యదర్శిగా ఈ లేఖ రాయడం లేదు. ఎందుకంటే పౌరహక్కుల ఉద్యమం 'రాజకీయ ఉద్యమంగా' ఎదగాలనీ, ప్రజా ఉద్యమాలకు 'కవచంగా', ఉద్యమాల 'కూడలిగా' పనిచేయాలనీ మీరు చేసిన సూచనతో ఎపిసిఎల్‌సి సభ్యులు కూడా చాలామంది బహుశా ఏకీభవిస్తారు. ఎటొచ్చీ ఏది సరయిన రాజకీయం, ఏ ఉద్యమాలు నిజమయిన ప్రజాఉద్యమాలు అనే విషయంలో తేడాలు రావచ్చు. మీరు ఖండించాలని చెప్తున్న అర్థరహితమయిన హింస కొందరి దృష్టిలో సమర్థనీయమయిన ప్రతిహింస కావచ్చు. అది మినహా (అది చిన్న



జనపథం మాసపత్రిక, 3.8.1995

మినహాయింపని కాదు) మీ సంపాదకీయంలో మీరు వ్యక్తపరచిన అభిప్రాయం మన దగ్గర విప్లవోద్యమ స్ఫూర్తితో పనిచేసే పౌరహక్కుల కార్యకర్తల సామాన్య అభిప్రాయమే. అందువల్ల నేనీ ఉత్తరం ఎపిసియల్‌సి ప్రధాన కార్యదర్శిగా కాక పౌరహక్కుల ఉద్యమంలో ఒకటిన్నర దశాబ్దకాలంగా పనిచేస్తున్న వ్యక్తిగా రాస్తున్నాను. విప్లవోద్యమ స్ఫూర్తి నుండి పుట్టిన పౌరహక్కుల అవగాహన లోపభూయిష్టమయినదనీ, పౌరహక్కుల ఉద్యమానికి తనదంటూ ఒక చారిత్రక కర్తవ్యం వుందనీ, దానికి తగిన తాత్విక అవగాహన, స్వతంత్ర అస్తిత్వం, పౌరహక్కుల ఉద్యమం సాధించుకోవాలనీ నమ్మే వ్యక్తిగా రాస్తున్నాను. ఎవరు ఏం మాట్లాడుతున్నారో వినడానికి ఎవ్వరూ సిద్ధంగా లేని పిడివాద తాత్విక వాతావరణంలో ఈ లక్ష్యం దిశగా కృషి చేస్తున్న వ్యక్తిగా రాస్తున్నాను. పౌరహక్కుల ఉద్యమం కూడ ఒక 'రాజకీయ' ఉద్యమమే కావచ్చు. వ్యవస్థలో ఏ మార్పు కోసం జరిగే కృషి అయినా రాజకీయ కృషే. అయితే ప్రతి ప్రయత్నమూ తన రాజకీయ పాత్ర ఏమిటో, దృక్పథం ఏమిటో నిర్ణయించుకోవలసి వుంటుంది.

విమర్శించదలచుకొన్నప్పుడు ఎదుటివారి అభిప్రాయాలకు విపరీత రూపం ఇచ్చి వేళాకోళం చేయడం ఈ పిడివాద తాత్విక సంప్రదాయానికి చెందిన ఒక గుణం. మీరు ప్రతిపాదించే దృక్పథంతో విభేదించడమంటే 'ఆమ్నెస్టీ' దృక్పథాన్ని నెత్తికెత్తుకోవడమేననే మీ వాదన దీనికొక ఉదాహరణ. పౌరహక్కుల గురించి విప్లవ దృక్పథం, ఆమ్నెస్టీ దృక్పథం అనేవి రెండే కాదు. ఒక ప్రజాస్వామ్య దృక్పథం కూడ వుంటుంది. అది 'భారతదేశం వంటి పేద దేశాలకే' కాదు, అమెరికా వంటి ధనిక దేశాలకు కూడ సూత్రప్రాయంగా వర్తిస్తుంది. భారతదేశం పేద దేశమయినంత మాత్రాన పౌరహక్కుల ఉద్యమం తన స్వతంత్ర అస్తిత్వాన్నీ తన ప్రత్యేక కర్తవ్యాలనూ వదిలిపెట్టి విప్లవోద్యమాల వెంటపడి పోనవసరం లేదు. భారతదేశం పేదదేశం మాత్రమే కాదు. ప్రజాస్వామికంగా వెనకబడిన దేశం. ఇంకా ఎన్నో రకాలుగా వెనకబడిన దేశం. ఈ దేశం మారాలంటే పేదరికానికి వ్యతిరేకంగా పోరాడితే చాలదు. ప్రజాస్వామ్యం కోసం కూడ పోరాడాలి. మొదటి పోరాటం రెండవదానికి కొంత దోహదం చేస్తుంది. కాని దాని నుండి ఇది పుట్టుకొని రాదు. ప్రజాస్వామ్యం కోసం ప్రత్యేకమయిన కృషి జరగాలి. ఆ కృషిని అర్థం చేసుకునే ప్రయత్నంలోనే పౌరహక్కుల ఉద్యమం తన కర్తవ్యాలనూ తన ఉనికి ఆవశ్యకతనూ ఆవిష్కరించుకోగలదు.

'ఆమ్నెస్టీ' దృక్పథం అని మీరు తిరస్కరిస్తున్న దాని నుండి కూడ మనం నేర్చుకోగలిగింది లేకపోదు. 'ఆమ్నెస్టీ దృక్పథం' అనే దానిలో ఒక లోపం వుంది. ఒక సద్గుణం వుంది. హక్కుల ఆవిర్భావానికీ అతిక్రమణకూ సామాజిక వ్యవస్థలో మూలం వుందని గుర్తించకపోవడం లోపం. అయితే హక్కులు అనే వాటిని అనిర్దిష్టంగా (జీవించే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ వగైరా) అర్థం చేసుకొని ఊరుకోకుండ వ్యవస్థిత నిర్మాణాలయిన చట్టం, న్యాయవ్యవస్థ మొదలయిన వాటిని సీరియస్‌గా తీసుకోవడం ఒక సద్గుణం. ఇది మనం ఇంకా నేర్చుకోవలసి వుంది. చట్టాన్ని గురించి మాట్లాడటమే అనవసరం అనుకున్నంత

కాలం నేర్చుకోలేము కూడ ('నల్ల చట్టాల'కు వ్యతిరేకంగా అప్పుడప్పుడు ఆందోళనలు చేసినప్పటికీ). అయితే ఆమ్నెస్టీకి ఉండే ఈ సద్గుణంలో కూడ ఒక లోపం వుంది. హక్కుల వ్యవస్థీకరణ కోసం వెతకవలసింది కేవలం చట్టాలలో, కోర్టులలో మాత్రమే కాదు. రాజకీయ సంప్రదాయాలలో, సామాజిక వ్యవస్థా సంస్కృతులలో కూడ వెతకవలసి వుంటుంది. దీనిని గుర్తించకపోవడం ఆమ్నెస్టీ దృక్పథంలోని లోపాలలో ఒకటి. అయితే ఈ లోపం మనలోనూ పుష్కలంగా వుంది. రాజ్యహింస, రాజ్యహింస అంటుంటే చాలని విప్లవోద్యమ స్ఫూర్తితో పనిచేసే పౌరహక్కుల కార్యకర్తలు చాలామంది అనుకుంటున్నారు. దీనికీ, చట్టాన్ని మాత్రమే పట్టించుకునే ఆమ్నెస్టీ దృక్పథానికీ పెద్దగా తేడా లేదు. (మన దేశంలో పౌరహక్కుల ఉద్యమం అంటరానితనం గురించి ఏ మాత్రం పట్టించుకుందని ఎన్నడూ విమర్శించని వాళ్ళు ఆమ్నెస్టీ అమెరికాలో నల్లజాతీయుల అసమస్థితి గురించి పట్టించుకోదని విమర్శిస్తుంటారు.)

సామాజిక మార్పులో పౌరహక్కుల ఉద్యమం పాత్ర ఏమిటనే విషయం గురించి ఏనాడో బహిరంగ చర్చ జరగవలసి వుండింది. దళితవాదులు, స్త్రీవాదులు బహిరంగచర్చకు దిగి చాలా మేలు చేసారు. పౌరహక్కుల ఉద్యమం ఆ పని చేయకుండ ఈ చర్చను సంస్థలకు అంతర్గతమైన విషయంగా ఉంచేయడం, ఒక తాత్విక చర్చగా కాకుండ సమస్యల మీద వాదులాటగా నిర్వహించడం చాలా పొరపాటు అయింది. ఇది పొరబాటు అన్న విషయం గడచిన ఆరునెలల కాలంలో స్పష్టం అయింది. విప్లవ రాజకీయాలు తప్ప వేరే ఏదీ మాట్లాడే అలవాటు లేని మేధావులూ కళాకారులూ 'ప్రజాస్వామ్య హక్కుల ఐక్య కార్యాచరణ కమిటీ' పేరిట ఒక వేదిక ఏర్పరచుకొని పౌరహక్కుల వ్యాఖ్యాతలుగా ప్రజల ముందుకు వచ్చారు. ఎన్నికల గురించి, ఎన్నికల బహిష్కరణ గురించి, రాజ్యహింస గురించి, ప్రతిహింస గురించి, ప్రజల గురించి, ప్రజా శత్రువుల గురించి మాట్లాడుతున్నారు. విప్లవ వేదికల మీద నుండి ఈ మాటలు మాట్లాడుకుంటే నష్టమేమీ వుండదు. నిజానికి చాలా ఏళ్ళుగా ఈ మాటలు విప్లవ రాజకీయ సంస్థలు మాట్లాడుతూనే వున్నాయి. కానీ ఈ విప్లవ రాజకీయ వ్యాఖ్యలకు వీళ్ళు కావాలనే ఒక పౌరహక్కుల వేదిక ఏర్పాటు చేసుకున్నారు. వీళ్ళు పౌరహక్కుల నాయకులయ్యారు, వీళ్ళ మాటలు పౌరహక్కుల మాటలయ్యాయి, వీళ్ళ వ్యాఖ్యలు పౌరహక్కుల ఉద్యమ అవగాహనగా చలామణి అవుతున్నాయి. ఏది విప్లవం, ఏది పౌర హక్కులు అనే తేడాను వీళ్ళు పూర్తిగా చెరిపేసి పౌరహక్కుల ఉద్యమ అవగాహనను 20 సంవత్సరాలు వెనక్కి తీసుకుపోతున్నారు. తన అనుభవం నుండి తనకంటూ ఒక అవగాహననూ ఒక కార్యరంగాన్నీ రూపొందించుకుంటున్న పౌరహక్కుల ఉద్యమానికి ఈ పరిణామం చాలా నష్టం చేసింది.

'హింస'కు సంబంధించి మీ అభిప్రాయం, వారి అభిప్రాయం వేరయినా తాత్వికంగా వారికీ మీకూ తేడా ఏమీ లేదని మీ సంపాదకీయాన్ని బట్టి అనిపిస్తుంది. కాబట్టి ఈ లేఖను పౌరహక్కుల ఉద్యమం గురించి జరగవలసిన చర్చకు నాందిగా భావించి రాస్తున్నాను. ఈ చర్చ చివరిదాకా సాగితే మార్క్సిస్టు సంప్రదాయంలో పౌర సమాజం (సివిల్ సొసైటీ),

ప్రజాస్వామ్యం మొదలయిన విషయాలకుండే స్థానం ఏమిటనే దగ్గర తేలుతుందనడంలో సందేహం లేదు. బహుశా దానికి భయపడడం వల్లనే మార్క్సిస్టులయిన పౌరహక్కుల ఉద్యమకారులు ఈ చర్చను సమగ్రంగా జరపడానికి సిద్ధపడడం లేదేమో.

మీరు ప్రతిపాదించే పౌరహక్కుల అవగాహనతో విభేదించినంత మాత్రాన భూమయ్య, కిష్టగౌడ్‌ల ఉరిశిక్షను సమర్థించనవసరం లేదు. కానీ దానిని ఎందుకు వ్యతిరేకిస్తాము? వ్యతిరేకించడానికి మూడు కారణాలుండవచ్చును. వాటిని కొంచెం పరిశీలిద్దాము.

1. ఉరిశిక్ష అనేది శిక్షాస్మృతిలో మధ్యయుగాల ప్రతీకార సిద్ధాంతానికి ఆఖరి అవశేషం. కాబట్టి దానిని రద్దు చేయాలి. కంటికి కన్ను పంటికి పన్ను అనేది శిక్షాస్మృతిలో ప్రతీకార సిద్ధాంతం. మానవ నాగరికత ఎదిగే క్రమంలో నేరస్మృతి గురించి, శిక్షాస్మృతి గురించి ప్రజాతంత్ర అవగాహన పెరిగి ఈ ప్రతీకార సిద్ధాంతానికి కాలం చెల్లిపోయింది. అయితే దాని ఆఖరి అవశేషంగా ఉరిశిక్ష మిగిలింది. అందువల్ల ఆ శిక్షను చట్టంనుండి తొలగించాలి.

2. నేరస్మృతి అన్ని నేరాలనూ ఒకటిగా చూడకూడదు. నేరాల సామాజిక స్వభావాన్నిబట్టి శిక్షల ప్రమాణంలో తేడా ఉండాలి. ఒక సామాజిక అన్యాయానికి ప్రతీకారంగా జరిగే నేరానికీ కిరాయి హత్యకూ ఒకే శిక్ష వేయకూడదు. కాబట్టి వీరికి విధించిన ఉరిశిక్ష రద్దు చేయాలి.

3. వీరిద్దరూ విప్లవకారులు. విప్లవకారులు చేసేదేదీ నేరం కాదు. అది విముక్తి చర్య. అందువల్ల ఏ శిక్ష వేయకూడదు.

ఇందులో (2), (3) ఒకటి కావు. అవి రెండూ ఒకటి కావని గుర్తించడం కూడ చాలామందికి కష్టం కావచ్చు. మన తాత్విక అపరిపక్వత అట్లాంటిది. కాని (1), (2) పౌరహక్కుల స్వభావంగల వాదనలు. ఆ కారణాలవల్ల ఉరిశిక్షను వ్యతిరేకిస్తే ఈ యిద్దరి ఉరిశిక్షను ఆపినా ఆపకపోయినా నేరస్మృతికీ శిక్షాస్మృతికీ సంబంధించిన అవగాహనను మనం మెరుగుపరచగలుగుతాము. ఆ మెరుగుదలను చట్టాలలో న్యాయ వ్యవస్థలో వ్యవస్థీకరించగలిగితే మానవ నాగరికతకు శాశ్వతంగా మేలు చేయగలుగుతాము. అది 'ఈ వ్యవస్థలో సాధ్యం కాదు' అంటారేమో. 'వ్యవస్థ మారిన తరువాతే సాధ్యం అవుతుంది' అంటారేమో. ఇటువంటి సమాధానాలు తరచుగా వింటుంటాం. అయితే 'వ్యవస్థ మారడం' అంటే అర్థం ఏమిటి? కమ్యూనిస్టు పార్టీ రాజ్యాధికారం చేపట్టి ఆస్తి సంబంధాలను మార్చడం అనేదే దానికి గల అర్థం అయితే దానివల్ల సమాజంలో అన్ని మార్పులూ అన్ని సంస్కరణలూ ఒకేసారి ఎలా సాధ్యమయిపోతాయో అర్థం కాదు. 'వ్యవస్థ మారడం' అనేదానికి అంతకంటే సమగ్రమైన అర్థం ఇచ్చేటట్టయితే అనేక సంస్కరణలు దానిలో భాగం కావలసి ఉంటుంది. అప్పుడు వ్యవస్థ మారిన తరువాత సంస్కరణలు సాధ్యం కావడం కాదు, అనేక సంస్కరణలు అమలు అయిన తరువాతే వ్యవస్థ మార్పు పూర్తి అవుతుంది.

సంస్కరణలు ఎప్పుడూ ఎంతో కొంత సాధ్యం అవుతాయి. 'విప్లవం' (దాని అర్థం ఏమయినప్పటికీ) వచ్చిన తరువాత కూడ సంస్కరణల అవసరం ఉండనే ఉంటుంది. ఏదీ ఒక్క క్షణంలో ఊడిపడదు. దానికోసం కృషి కావాలి. మనుషుల మెదళ్ళను ఆ దిశగా 'ప్రిపేర్' చేయాలి. 'ప్రిపేర్' అయిన మెదళ్ళు పరిస్థితులు ఏ మేరకు అనుకూలిస్తే ఆ మేరకు సంస్కరణలను వ్యవస్థీకరించుకుంటాయి. ప్రజాస్వామ్య విలువల విషయంలో మనుషుల ఆలోచనలను మేల్కొలపడం, పదును పెట్టడం, వాటి వ్యవస్థీకరణ కోసం కృషి చేయడం, వ్యవస్థీకృత హక్కుల అమలు గురించి ఆందోళన చేయడం పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యాలు. ఈ కర్తవ్యాన్ని ఇప్పటికి జరిగిన కమ్యూనిస్టు విప్లవాలు గుర్తించకపోబట్టే ఆ విప్లవాలవల్ల నేరస్మృతిలో కొత్త పౌరహక్కులు రాలేదు సరికదా, చాలా అనాగరికమయిన సంప్రదాయాలు నెలకొన్నాయి. భారతదేశంలో ఉరిశిక్షను రద్దు చేయకపోయినా కనీసం 'చాలా అరుదుగా మాత్రమే ఉరిశిక్ష వేయాలి' అని సుప్రీంకోర్టు అనగలిగింది. ఆ సూచన మొత్తంమీద అమలు అవుతూనే వుంది. కొన్ని పాశ్చాత్య బూర్జువా రాజ్యాలు ఉరిశిక్షను పూర్తిగా రద్దే చేసాయి. కానీ చైనాలో (మావో కాలంలో కూడ) అందుకు భిన్నంగా ఉరిశిక్షలు విచ్చలవిడిగా వేసారు. 'విప్లవ ద్రోహులకే' కాక సాధారణ నేరస్తులకు కూడ వేసారు. మూకుమ్మడిగా ఉరిశిక్షలు వేసిన సందర్భాలు కూడ వున్నాయి.

(1), (2) కారణాలకు గల పౌరహక్కుల స్వభావాన్ని వివరించాను. (3)కు ప్రత్యేకమైన పౌరహక్కుల స్వభావమేమీ లేదు. ఆ వాదన (అది ఇతరత్రా కూడ సమంజసమైనదా కాదా అన్న చర్చ కొంచెం సేపు పక్కనపెట్టి) చేయడానికి ఒక 'పౌరహక్కుల' ఉద్యమం అవసరం లేదు. అందులో పౌరహక్కుల అంశమేమీ లేదు. ఆ వాదనతో ఉద్యమించి భూమయ్య కిష్టగౌడ్‌ల ఉరిశిక్షను ఆపగలిగినా దానివల్ల పౌరహక్కుల రంగంలో జరిగే మేలేమీ ఉండదు. వారిద్దరూ విడుదలయి విప్లవం కోసం గట్టిగా కృషిచేస్తే విప్లవం అనేది మరింత త్వరగా విజయవంతమయి సమాజ ప్రజాస్వామీకరణ మరింత త్వరగా సాధ్యం అవుతుంది కదా అనవచ్చు. ప్రజాస్వామ్యాన్ని గురించి ప్రత్యేకమైన అవగాహన, కృషి లేకుండ విప్లవాలు విజయవంతమయితే అవి నెలకొల్పే రాజ్యాలు ఒక అంశంలో ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరుస్తూ మరొక అంశంలో చాలా అనాగరికమైన సమాజాలను నెలకొల్పగలవని ఈ శతాబ్దపు చరిత్ర చెప్తుంది. అదట్లాగుంచి, రేపు రాబోయే విప్లవం వల్ల జరగబోయే ప్రజాస్వామీకరణను దృష్టిలో పెట్టుకొని విప్లవకారులు చేసేవేవీ నేరాలుకావని ఆందోళన చేయడానికి ఒక 'పౌరహక్కుల' ఉద్యమం ఎందుకు? ప్రజాస్వామీకరణ అంత రిమోట్‌గా జరగబోయేటట్టయితే దానికోసం ఈ రోజు ఒక ప్రత్యేకమైన పౌరహక్కుల కార్యరంగం ఎందుకు? విప్లవకారులే కేసు మాఫీ ఉద్యమాలు నడుపుకోవచ్చును కదా! చంద్రుడి కోసం ఎదురుచూసే ఈ చకోరపక్షి కర్తవ్యం తప్ప పౌరహక్కుల ఉద్యమానికి తనదంటూ ప్రజాస్వామీకరణ రంగంలో ఒక పాత్ర లేదా? సమాజ పరిణామంలో ఒక కార్యరంగం లేదా?

బహుముఖంగా సాగే ప్రగతిశీలక కృషిలో భూమికోసం, కులనిర్మూలన కోసం, పితృస్వామ్య నిర్మూలన కోసం, ఇతర అసమానతల నిర్మూలన కోసం పోరాటాలు అవసరం అయినట్టే ప్రజాస్వామీకరణ కోసం కూడా కృషి అవసరం. ఇతర ప్రజా పోరాటాలు విజయవంతం అయితే ప్రజాస్వామీకరణ దానంతటదే సిద్ధిస్తుందని ఇరవయ్యవ శతాబ్దపు తొలి భాగంలో ఎవరయినా నమ్మారంటే అర్థం ఉంది కానీ చివరి భాగంలో మనం ఇంకా నమ్ముతున్నామంటే మనం చరిత్రనుండి ఏమీ నేర్చుకోనట్టే. ప్రజాస్వామీకరణ అనేది అన్ని జీవితరంగాలలోనూ అమలు కావలసిన ఒక విలువల క్రమం. ప్రజా పోరాటాలకూ దానికీ సంబంధం లేదని కాదు. చాలా సంబంధం ఉంది. కానీ అది కార్యకారణ సంబంధం కాదు. పునాది ఉపరితల సంబంధం కాదు. అది చాలా సంకీర్ణమైన సంబంధం. ఒక విషయంలో ప్రజాస్వామీకరణను ముందుకు తీసుకుపోయే ఒక ప్రజా ఉద్యమం అన్ని విషయాలలోనూ తీసుకుపోతుందన్న నమ్మకం లేదు. సంకీర్ణమైన ఈ సంబంధాన్ని అర్థం చేసుకొని సామాజిక పరిణామంలోని ప్రజాస్వామీకరణ రంగంలో పాల్గొనడం పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యం. అది 'ప్రజాస్వామిక శక్తుల విశాల ప్రజా ఉద్యమంలో భాగంగానే' సాగుతుంది. కానీ బహుముఖమైన ఈ ఉద్యమంలో తన కర్తవ్యాన్నీ కార్యరంగాన్నీ నిర్దేశించుకొని పనిచేస్తుంది.

ఈ కర్తవ్యం రేపు ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పబోయే ప్రజా ఉద్యమాలకు ఈరోజు కవచంగా పనిచేయడం కాదు. ఉద్యమాలకు కవచాలు కావలసి ఉంటే తొడుక్కుంటాయి. అది కూడ ఒక ఉద్యమ కర్తవ్యమే కావచ్చు. పౌరహక్కుల ఉద్యమం తన కర్తవ్య నిర్వహణలో భాగంగా ఆ పని కొంత మేరకు చేస్తుంది. కానీ ఈ ఉద్యమం వున్నది అందుకోసం కాదు.

అన్ని ప్రజా ఉద్యమాలూ కొన్ని ప్రజాతంత్ర విలువలను చరిత్రలోకి తీసుకొస్తాయి. ఒక ప్రజాతంత్ర 'లేమి'ని గుర్తింపజేస్తాయి. దానితోపాటు ఒక నిర్దిష్టమైన రాజకీయ సిద్ధాంతాన్నీ ఆచరణనూ ముందుకు తెస్తాయి. పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యం ఆ సిద్ధాంతాలను ప్రచారం చేయడం కాదు. ఆ ఆచరణను భుజానికెత్తుకొని దానికి కవచంగా పనిచేయడమూ కాదు. ఆ ఉద్యమ విలువలను స్వీకరించడం, అప్పటికి నెలకొని వున్న విలువలకు జతచేయడం, వాటి వెలుగులో ప్రజాస్వామ్య భావనను పునర్నిర్వచించడం, అప్పటి సామాజిక రాజకీయ ఆర్థిక వ్యవస్థలో ఈ కొత్త విలువల వ్యాప్తికీ వ్యవస్థీకరణకూ కృషి చేయడం, వ్యవస్థీకృతమైన ప్రజాస్వామ్య సంప్రదాయాల వక్రీకరణనూ అతిక్రమణనూ వ్యతిరేకించడం – ఇదీ పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యం. ఇది 'కవచం' కర్తవ్యం కాదు. ఒక అంతస్సంబంధ స్వభావం గల కృషి. ఈ కృషిలో ఇరుపక్షాలకూ సమాన ప్రతిపత్తి, అర్థవంతమయిన పాత్ర వుంటాయి. ఒకరు చేసే వాళ్ళు ఒకరు చూసేవాళ్ళు కారు.

II

మీ సంపాదకీయంలోని కొన్ని ఇతర వ్యాఖ్యలను పరిశీలిద్దాం. 'ఎన్‌కౌంటర్‌కు గురయ్యేది ఒక వ్యక్తి కాదు, ఉద్యమం. రైతాంగ విప్లవోద్యమం' అన్నారు. అందులో చాలా సత్యం ఉంది. కానీ ఈ వ్యాఖ్యవల్ల పౌరహక్కుల ఉద్యమకారులుగా మీరు సాధించేది ఏమిటి? మీరు రేకెత్తించే ఆలోచన ఏముంది? రైతాంగ విప్లవోద్యమాన్ని అభిమానించే వాళ్ళు

మీతోపాటు బాధపడతారు. మీరు ఈ వ్యాఖ్య చేయకున్నా వాళ్లెట్లాగూ బాధపడతారు. ఆ ఉద్యమాన్ని అభిమానించనివాళ్ళు మీతో పాటు ఎందుకు బాధపడాలి? వాళ్ళకు మీరిస్తున్న సందేశం ఏమిటి? 'ఎన్‌కౌంటర్‌లో పోయేది ఒక నిండు ప్రాణం' అన్నారనుకోండి. ఏ మాత్రం రాజకీయ స్పృహలేని ఈ సెంటిమెంటల్ వ్యాఖ్యవల్ల కొంచెం ఎక్కువ ప్రయోజనం వుండవచ్చు. ప్రతీ ఒక్కరూ తనది ఒక నిండు ప్రాణమేననుకుంటారు కాబట్టి పోయిన ప్రాణంతో 'ఐడెంటిఫై' అవుతారు. 'ఎన్‌కౌంటర్‌లో పోయేది ఒక వ్యక్తి ప్రాణం కాదు. రాజ్యాంగమే హతమార్చబడుతుంది' అన్నారనుకోండి. రైతాంగ విప్లవ ఉద్యమాన్ని అభిమానించే వాళ్ళతోపాటు రాజ్యాంగాన్ని అభిమానించే వాళ్ళు కూడ మీతోపాటు బాధపడతారు. మీరు 'కవచంగా' పని చేయదలచుకున్న రైతాంగ విప్లవ ఉద్యమానికి ఈ వ్యాఖ్య వల్లనే ఎక్కువ ప్రయోజనం వుంటుందేమో!

ఎవరు స్పందిస్తారనే విషయం పక్కకుపెట్టి పౌరహక్కుల ఉద్యమకారులుగా మనం ఏ సందేశం ఇస్తాము, ఏ ఆలోచన కలగజేస్తామనేది కొంచెం చూద్దాం. 'ఎన్‌కౌంటర్‌లో పోయేది ఒక వ్యక్తి ప్రాణం కాదు. మనందరికీ చెందిన జీవించే హక్కు' అన్నారనుకోండి. జీవించే హక్కు అందరికీ చెందడమే తప్పు అనుకునే వాళ్ళను మినహాయిస్తే మిగిలిన వాళ్ళందరూ ఆగి వింటారు. ఎన్‌కౌంటర్ల గురించి ఆలోచిస్తారు. అట్లాగే 'ఎన్‌కౌంటర్‌కు గురయ్యేది రైతాంగ విప్లవ ఉద్యమం' అనే బదులు 'ఎన్‌కౌంటర్‌కు గురయ్యేది ఉద్యమించే హక్కు' అన్నారనుకోండి. రైతాంగ విప్లవ ఉద్యమం గురించి అనుమానాలున్నా, దానిపట్ల వ్యతిరేకత వున్నా, ఉద్యమించే హక్కే దెబ్బతింటే ప్రజలకు నష్టకరం అనుకునే వాళ్ళు స్పందిస్తారు, ఎన్‌కౌంటర్ల గురించి ఆలోచిస్తారు. ఇవి పౌరహక్కుల వ్యాఖ్యలు. అటువంటి వ్యాఖ్యలవల్ల మనం సమాజంలో పౌరహక్కుల స్పందనకు తోడ్పడగలుగుతాం. మీరు చేసిన వ్యాఖ్య (ఎంత గంభీరంగా వున్నప్పటికీ) అటువంటి పౌరహక్కుల స్పందనకు దారితీయదు. రైతాంగ విప్లవోద్యమాన్ని అభిమానించేవాళ్ల ఆవేదననూ ఆవేశాన్నీ అది ద్విగుణీకృతం చేయవచ్చు. అది మంచిపని కూడ కావచ్చు. కానీ దానికి ఒపిడిఆర్ అనే సంస్థ ఎందుకు?

'ఉద్యమకారులు నేరాలు చేస్తే పట్టుకొని కోర్టులో విచారించి శిక్షించండి. అంతేతప్ప కాల్చిపారేయొద్దు' అనడాన్ని మీరు వ్యతిరేకిస్తున్నారు. నిజానికి ఎన్‌కౌంటర్లను వ్యతిరేకించేటప్పుడు 'చట్టం ప్రకారం శిక్షించండి' అని ఎవ్వరూ ప్రతిసారీ ప్రభుత్వానికి కర్తవ్య బోధ చేయడం లేదు. అయితే 'హత్యలు చేస్తుంటే ఏం చేయాలి' అనే ప్రశ్న ఎదురయినప్పుడు 'కోర్టులో ప్రజాస్వామిక పద్ధతులలో విచారించి శిక్షించాలి తప్ప కాల్చిపారేయడానికి వీలు లేదు' అంటున్నాం. ఇప్పుడు మీరు చెప్పేదాన్నిబట్టి వాళ్ళను ఫ్రీగా వదిలేయమనాలి. రాజకీయ ఖైదీలను బేషరతుగా విడిచిపెట్టాలి అనే డిమాండ్ కూడ ఈ కోవకు చెందిన డిమాండే కాబట్టి రెండింటినీ కలిపి చర్చిద్దాం.

'చట్టం ప్రకారం విచారించి శిక్షించండి' అంటే అభ్యంతరం ఎందుకుండాలి? ఈ ప్రశ్నకు రెండు సమాధానాలు ఉండగలవు. ఒకటి శిక్షించే వాళ్ళ గురించి అభ్యంతరం, రెండవది శిక్షింపబడే వాళ్ల విషయంలో అభ్యంతరం. రెండింటినీ విడిగా పరిశీలిద్దాం.

(1) శిక్షించేది చట్టం, రాజ్యాంగ యంత్రం. చట్టం ప్రకారం శిక్షించండి అనే వాక్యం చట్టానికీ రాజ్యాంగయంత్రానికీ సాధికారత కల్పిస్తుంది. వాటికి సమాజంలో ఒక న్యాయమైన పాత్ర ఉందనే అభిప్రాయం కలిగిస్తుంది. ఈ దోపిడీ వర్గాల చట్టానికీ రాజ్యాంగ యంత్రానికీ సాధికారత కల్పించకూడదు. ఇది ఒక అభ్యంతరం కావచ్చు.

ఈ వాదన రాజకీయ ఉద్యమకారులకు మాత్రమే ఎందుకు వర్తిస్తుంది? ఒక డెకాయిట్‌ను పోలీసులు కొట్టి చంపేస్తారనుకుందాం. పౌరహక్కుల సంస్థలు వ్యతిరేకిస్తాయి. 'మరి వాడు మనుషులను చంపి ఇల్లు దోచుకుపోతుంటే ఏం చేయాలి' అని ప్రజలు, పోలీసులు అడుగుతారు. కోర్టులో పెట్టి విచారించండి అంటాము తప్ప విడిచిపెట్టండి అనము. రాజకీయ ఖైదీలను విడిచి పెట్టమంటున్నామే తప్ప ఖైదీలందరినీ విడిచిపెట్టమని ఉద్యమించడం లేదు. అంటే వాళ్ళను విచారించి శిక్షించమనే అంటున్నాం. మరి ఇది శిక్షాస్మృతికీ రాజ్యాంగయంత్రానికీ సాధికారత కల్పించడం లేదా? అసలే ఇది దోపిడీ వ్యవస్థ అయినప్పుడు డెకాయిటీకి సెక్షన్ 395 ఎందుకుండాలి? డెకాయిట్లను ఎందుకు శిక్షించాలి అని అనలేకపోవడానికి కారణం ఏమిటి? ఈ బందిపోట్లను శిక్షించినట్టే (లేకపోతే అంతకంటే ఎక్కువగా) హర్షద్ మెహతా వంటి వైట్‌కాలర్ బందిపోట్లను కూడ శిక్షించాలి అనగలమే తప్ప వాళ్ళనూ వీళ్ళనూ ఎవ్వరినీ శిక్షించవద్దు అని ఎందుకు అనలేము? వాదనకోసం ఊరికే అనడంకాదు. ఆ డిమాండ్‌తో ఒక ఉద్యమం ఎందుకు నడపలేము? దానికి సామాజిక ఆమోదం ఉండదనే కదా? ప్రజలు ఒప్పుకోరనే కదా? మరి శిక్షాస్మృతికి సాధికారత అనేది మనం కలిగించవలసిన అవసరం లేకుండానే ఉన్నట్టే కదా?

రంగా హత్యకేసు ముద్దాయిలపైన క్రిమినల్ కేసులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేసి అందరినీ వదిలిపెట్టినప్పుడు అందరం వ్యతిరేకించాము. విమర్శించాము. ఎందుకని? ఖైదీలందరినీ విడిచిపెట్టకుండ కొందరిని మాత్రం విడిచిపెట్టినందుకా? తాను మాట్లాడే చట్టబద్ధత పట్ల తనకే విశ్వాసం లేదని ఈ ప్రభుత్వం రుజువు చేసుకున్నందుకా? లేకపోతే సామాజిక శాంతి భద్రతలు కాపాడే బాధ్యత గల ప్రభుత్వం ఆ కర్తవ్య నిర్వహణకు ద్రోహం చేసి నేరాలకు పాల్పడిన వాళ్ళతో చేతులు కలిపినందుకా? ఎవరు ఎందుకోసం వ్యతిరేకిస్తున్నా మనకున్న ఈ మూడవ కారణంవల్లనే ప్రజలు ప్రభుత్వ చర్యను వ్యతిరేకించారు. మన ఖండనలు స్వీకరించారు. శాంతి భద్రతలను కాపాడే రాజ్యాంగ యంత్ర కర్తవ్యానికి సాధికారత, గుర్తింపు, అదొక బాధ్యత అనే విలువ ఉండబట్టే పాలకపార్టీకి చెందిన వాళ్ళ నేరాలపైన కేసులు మాఫీ చేసే చర్యలను ప్రజలు వ్యతిరేకిస్తారు.

ఇది తప్పుడు చైతన్యం వల్ల, రాజ్యభావజాలం ప్రభావం వల్ల అనవచ్చు. 'రాజ్యాన్ని' గురించి తప్పుడు చైతన్యం, భావజాలం ఉంటాయి కానీ, సామాజిక శాంతి భద్రతలను నిర్వహించే కర్తవ్యం ప్రభుత్వానికి ఉందని గుర్తించడమే ఒక తప్పుడు చైతన్యం కాదు. సంఘ జీవితానికి నియంత్రణ అవసరం. పదిమంది కలిసి పిక్నిక్‌కు పోయినా కొన్ని నియమాలు పెట్టుకోకపోతే గడవదు. కోట్లాది మనుషుల సహజీవనంలో ఒకరి అవసరాలు మరొకరికి

ఇవ్వాళ్టి విప్లవోద్యమాలు రేపో ఎల్లుండో రాజ్యరహిత సమాజాన్ని నిర్మిస్తాయని నమ్మి ఈ రోజు రాజ్యం అంటేనే హింస కాబట్టి చట్టానికీ రాజ్యాంగ యంత్రానికీ సాధికారత కల్పించవద్దనే వైఖరికి అర్థం లేదు. సంఘ జీవితానికి అవసరమయిన నియంత్రణనూ, ఆ సంఘ జీవితంలోని అసమానతల వల్ల నియంత్రణాధికారానికి పట్టిన వక్రగతినీ వేరుచేసి చూడడం అవసరం.

హాని కలిగించకుండ చూడడానికి ఒక నియంత్రణాధికారం, చట్టాలు ఒక చారిత్రక అవసరంగానే పుట్టాయి. ఎటొచ్చీ అవి నియంత్రించే సమాజంలోని అసమానతలు ఆ చట్టాలలోనికీ ఆ నియంత్రణాధికారంలోనికి కూడా ప్రవేశించాయి. దీనిని వ్యతిరేకించవలసిందే. కానీ మొత్తంగా చట్టాలు, నియంత్రణాధికారం అనే వాటినే తిరస్కరించలేము. అవి నిష్పక్షపాతంగా, న్యాయంగా, హేతుబద్ధంగా ఉండాలని ఆందోళన చేయగలుగుతాం, చేయవలసి వుంటుంది కూడ. దానికి అవసరమైన ప్రజాతంత్ర విలువలను నిర్వచించడం, వ్యవస్థీకరింపజేయడం ఒక ముఖ్య పౌరహక్కుల కర్తవ్యం. కాలక్రమంలో చట్టాలు, నియంత్రణాధికారం అనేవి తమ ప్రాముఖ్యతను కోల్పోయి, సంస్కృతి తీర్చిదిద్దే మానవ సామాజిక స్వభావమే వాటి పాత్ర నిర్వహిస్తుందని ఆశిస్తాం. అయితే అది చాలా చాలా కాలం పడుతుంది. బహుశా సంపూర్ణంగా ఎప్పటికీ సాధ్యంకాదు.

అంతే తప్ప ఇవ్వాళ్టి విప్లవోద్యమాలు రేపో ఎల్లుండో రాజ్యరహిత సమాజాన్ని నిర్మిస్తాయని నమ్మి ఈ రోజు రాజ్యం అంటేనే హింస కాబట్టి చట్టానికీ రాజ్యాంగ యంత్రానికీ సాధికారత కల్పించవద్దనే వైఖరికి అర్థం లేదు. సంఘ జీవితానికి అవసరమయిన నియంత్రణనూ, ఆ సంఘ జీవితంలోని అసమానతల వల్ల నియంత్రణాధికారానికి పట్టిన వక్రగతినీ వేరుచేసి చూడడం అవసరం. రెండవదాన్ని తిరస్కరించడం అంటే మొదటి దాన్ని తృణీకరించడం కాదు. ఆ నియంత్రణకు సంబంధించిన నియమాలు, విలువలు, పద్ధతులు ఒక ముఖ్య పౌరహక్కుల కార్యరంగం; రాజకీయ ప్రజాస్వామ్యానికి సంబంధించిన ఒక ముఖ్య అంశం. దానిని గురించి ఒక అవగాహన లేకపోవటం వల్ల, అధికారానికి వచ్చిన కమ్యూనిస్టు పార్టీలు అధికార నిర్వహణ గురించి ఒక ప్రజాతంత్ర అవగాహన లేక ఈ శతాబ్దంలోనే అత్యంత అనాగరికమైన నియంతృత్వాలను నిర్మించాయి.

(2) శిక్షించబడే వాళ్ళ వైపునుండి చూద్దాం. విప్లవకారులు ప్రజల విముక్తి కోసం కృషి చేస్తున్నారు కాబట్టి వాళ్ళు చేసే చర్యలన్నీ విముక్తి చర్యలే. అవి నేరాలు కావు. వాళ్లను 'చట్టం ప్రకారం విచారించి శిక్షించండి' అనకూడదు.

**ఈ** వాదన ఫలితమేమిటంటే కేవలం ప్రజా ఉద్యమాల ఆదర్శాలనేకాక అవి చేపట్టే చర్యలన్నిటినీ పౌరహక్కుల ఉద్యమం భుజానికి ఎత్తుకోవలసి వుంటుంది. ఆ చర్యలన్నీ ప్రజల

విముక్తికి అవసరం అని రుజువు చేసే బాధ్యత తనమీద వేసుకోవలసి వుంటుంది. ఇది ఆచరణలో అసాధ్యమేకాక సూత్రరీత్యా అనవసరం. సామాజిక పురోగమనంలో పౌరహక్కుల ఉద్యమం నిర్వర్తించవలసిన పాత్రకు ఈ బాధ్యత మీద వేసుకోవటం ఎంతమాత్రం అవసరం కాదు. ప్రజా ఉద్యమాలనుండి ముందుకొచ్చే ప్రజాతంత్ర విలువలను పౌరహక్కుల వుద్యమం స్వీకరించి తన అవగాహనలో అంతర్లీనం చేసుకుంటుంది కానీ ఆ ఉద్యమాల సిద్ధాంత ప్రతిపాదననూ ఆచరణ పంథానూ సమర్థించే బాధ్యత స్వీకరించనవసరం లేదు. ఆ సిద్ధాంత ప్రతిపాదనలను ఒక రాజకీయ విశ్వాసంగా గుర్తిస్తుంది. ఆ ఆచరణను మౌలికంగా రాజకీయ స్వభావంగల చర్యగా గుర్తిస్తుంది. ప్రభుత్వము, సమాజము కూడ వాటిని అదే విధంగా గుర్తించి రాజకీయంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తుంది. మరి ఆ ఆచరణ క్రమంలో హింసకు పాల్పడితే ఏం చేయాలంటే ప్రజాస్వామిక పద్ధతులలో (అంటే అప్పటికి నాగరిక దేశాలలో అమలులో ఉన్న ప్రామాణిక ప్రజాతంత్ర విలువల ప్రకారం) విచారించి శిక్షించమంటుంది. భూములు దున్నుకున్నందుకు, అడవులు సాగుచేసినందుకు, ఉద్యమకారులకు అన్నం పెట్టినందుకు కేసులు పెట్టడానికి వీలు లేదంటుంది. అంతే తప్ప విప్లవకారులు చేపట్టే చర్యలన్నీ ప్రజల విముక్తికి అవసరం అని రుజువు చేసే బాధ్యత తనమీద వేసుకోజాలదు. ఆ బాధ్యత మీద వేసుకోకపోతే నక్సలైట్లు ఏం చేసినా కేసులు పెట్టొద్దనీ నక్సలైట్ ఖైదీలందరినీ బేషరతుగా విడిచిపెట్టాలనీ డిమాండ్ చేయడం సాధ్యం కాదు.

నిజానికి రాజకీయ ఖైదీలందరినీ వదిలిపెట్టాలనేది కొన్ని చారిత్రక సందర్భాలలో సహజంగా ముందుకొచ్చే రాజకీయ డిమాండే తప్ప అది ఎప్పుడయినా సంపూర్ణంగా ఒక పౌరహక్కుల డిమాండు కాగలదా అనేది అనుమానమే. ఉద్యమకారులకూ ప్రభుత్వానికీ మధ్య ఒప్పందాలు కుదిరినప్పుడు, అప్పటి దాకా జైలుపాలయి ఉన్న ఉద్యమకారులను వదిలిపెట్టాలనేది సాధారణంగా ఒప్పందంలో ఒక అంశంగా ఉంటుంది. ఉదాహరణకు రేపు శ్రీలంక ప్రభుత్వానికీ ఎల్‌టిటిఇకీ ఒడంబడిక జరిగితే, తమిళ రాజకీయ ఖైదీల విడుదల ఆ ఒడంబడికలో భాగం కావచ్చు. శ్రీలంక సైన్యంతో యుద్ధం చేసి దొరికిపోయిన తమిళ పులులు సరేగానీ, ఉత్తర ప్రాంతంలో ముస్లింలను ప్రభుత్వ ఏజెంట్లుగా ముద్రవేసి హతమార్చిన వారందరికీ కూడా ఈ విముక్తి వర్తించడం ప్రజాస్వామికవాదులు సమర్థించగలరా అంటే అనుమానమే.

నక్సలైట్ ఖైదీలందరినీ బేషరతుగా విడిచిపెట్టాలనే డిమాండ్‌ను సమర్థించుకోవడం కోసం హైదరాబాద్‌లోని ప్రజాస్వామ్య హక్కుల ఐక్య కార్యాచరణ వేదికవాళ్ళు ఒక వాదన ప్రచారంలో పెట్టారు. నక్సలైట్లు చేసే హింస యావత్తు పోలీసులు (లేక భూస్వాములు) చేసే హింసకు ప్రతిహింసేననేది యీ వాదన. నక్సలైట్లు సాయుధ పోరాటాన్ని ఒక రాజకీయ పంథాగా స్వీకరించారని ఇన్నాళ్ళూ అనుకున్నాం. నాకు జ్ఞాపకం ఉన్నంతవరకు (నా జ్ఞాపక శక్తి క్షీణించి వుంటే సహృదయులు క్షమిస్తారు) ఉభయ కమ్యూనిస్టు పార్టీలు పార్లమెంటరీ

పంథాలో కూరుకొని పోయాయనీ అది విప్లవ రాజ్యాధికారం నెలకొల్పడానికి సరయిన మార్గం కాదనీ సాయుధ పోరాటమే ఆ మార్గమనీ నమ్మి విప్లవ కమ్యూనిస్టులు ఆయుధాలు పట్టుకున్నారు. ఆ నిర్ణయాన్నే ప్రతిహింస అంటామంటే ఫరవాలేదు. 'ప్రతిహింస' అనే మాటకు అదొక తాత్విక వ్యాఖ్య అనుకుంటాము. కానీ నక్సలైట్లు చేస్తున్నదంతా పోలీసుల, లేక భూస్వాముల హింసకు ప్రతిహింసేనని వ్యాఖ్యానించడం వాస్తవాలకు దూరం. విప్లవం పేరుమీద కాక పౌరహక్కుల పేరుమీద విప్లవ హింసను సమర్థించడానికి ఈ వ్యాఖ్య అవసరం అయినట్టుంది. నిజానికి, ఒక నిర్ణయం ప్రకారం ఆయుధాలు పట్టుకున్న విప్లవకారులు అనేక చర్యలకు పాల్పడుతున్నారు. అందులో కొంత పోలీసుల హింసకు ప్రతిహింసే కాగా, కొంత తమ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికీ నిలబెట్టుకోవడానికీ చేసే హింస.

నిజానికి రాజకీయ ఖైదీలందరినీ వదిలిపెట్టాలనే డిమాండ్‌ను సమర్థించుకోవడానికి తంటాలు పడేకంటే, ఉరిశిక్షను గురించి మొదట్లో చర్చించినప్పుడు ప్రస్తావించిన (2) వాదనమీద దృష్టి పెట్టి కృషి చేస్తే పౌరహక్కుల ఉద్యమం సమాజ పురోగమనానికి ఎక్కువ మేలు చేయగలుగుతుంది. చట్టం అందరినీ సమానంగా చూడాలనే సూత్రం బూర్జువా ప్రజాతంత్ర విప్లవాలతో ముందుకొచ్చిన ప్రజాతంత్ర సూత్రం. ఫ్యూడల్ దశలో మనిషి కులాన్నిబట్టి, మతాన్నిబట్టి, హోదానుబట్టి, లింగాన్నిబట్టి చట్టాలు మనుషులకు భిన్నంగా వర్తించేవి. దానిని తొలగించి శాసన సంబంధమైన సమదృష్టిని ప్రవేశపెట్టడం బూర్జువా చట్టం చేసిన ఒక మంచిపని. అయితే ఈ సూత్రాన్ని వ్యవస్థీకరించిన పద్ధతి ఫలితంగా, నేర స్మృతిలో ఒక నేరం ఎందుకు జరిగిందీ, ఏ పరిస్థితులలో జరిగిందీ అనే వివేచనకు తావు లేకుండా పోయింది. ఎందుకోసం చేసినా ఏ పరిస్థితిలో చేసినా నేరం ఒకటే అయింది. సమదృష్టి కోసం చేసిన నేరస్మృతి 'సామాజికస్పృహ'ను కోల్పోయింది. సమదృష్టిని పోగొట్టుకోకుండ నేరస్మృతికి సామాజిక స్పృహను కల్గించగలమా అనేది పౌరహక్కుల ఉద్యమం ముందున్న ఒక చిక్కు సమస్య.

ఇది సులభసాధ్యం కాదు. ఒక మంచి కోసం నేరం చేస్తే చట్టం కొంచెం ఉదారంగా చూస్తుందని హామీ ఇస్తే మంచి పేరు మీదనే చెడు చాలా జరగగలదు. అనివార్య పరిస్థితులలో నేరం చేస్తే చట్టం కొంచెం సానుభూతిగా చూస్తుందన్న భరోసా ఉంటే నివారించగల పరిస్థితులు అనివార్యంగా కనబడతాయి. ప్రజల విముక్తి కోసం జరిగే చర్యలు నేరాలు కావని గుర్తించాలని డిమాండ్ చేయాలంటున్నారు. కానీ నిజంగా ఆ డిమాండ్‌ను ఒప్పుకుంటే ప్రజల విముక్తి పేరుమీదనే చాలా అరాచకాలు జరగగలవు. విప్లవకారులే (జాగ్రత్తగా ఉండవలసిన అవసరం లేదు కాబట్టి) అతిగా ప్రవర్తించవచ్చు. లేకపోతే వృత్తి నేరస్తులు విప్లవకారులుగా చలామణి కావచ్చు. చైనాలో సాంస్కృతిక విప్లవ కాలంలో దేశ అధినేత అయిన మావో అనుమతితో రెడ్ గార్డ్సుకు విప్లవ ప్రతీఘాతుక శక్తులపైన బలప్రయోగానికి పాల్పడే అధికారం ఇవ్వబడింది. ఇవి చాలా వేగంగా విపరీతమైన

అరాచకానికి దారి తీశాయి. ఈ రోజు చైనాలో సాంస్కృతిక విప్లవాన్ని గురించి ఒక మంచి మాట అనేవాళ్ళు సహితం కరువయ్యారని పరిశీలకులు అంటున్నారంటే దానికి ఇదొక కారణం.

కాబట్టి నేరస్మృతికి 'సామాజిక స్పృహ' కలిగించడం సులభం కాదు. అయినప్పటికీ అది ప్రయత్నం చేయవలసిన ఆదర్శమే. నేరాలేలేని సమాజం ఊహాలోకాలకు చెందిన ఆదర్శం. ఉత్పత్తి సంబంధాలలో మార్పులు సాధించి పేదరికాన్నీ నిరుద్యోగాన్నీ తగ్గిస్తే ఆర్థిక అవసరాల నుండి పుట్టే నేరాలు తగ్గుతాయి. అయితే ఇతర నేరాలు కొనసాగటమే కాక, కొత్త పరిస్థితులలో కొత్తనేరాలు పుట్టుకురావచ్చు. ప్రభుత్వ ఆస్తులనూ సమిష్టి ఆస్తులనూ నిర్లక్ష్యం చేయడం, స్వంతం చేసుకోవడం, పాడు చేయడం వంటి నేరాలు కమ్యూనిస్టు పాలిత దేశాలలో పెద్ద సంఖ్యలో జరిగాయి. కాబట్టి ఒక నేరస్మృతి అనేది చరిత్రలో ఇంకా చాలాకాలంపాటు – సంస్కృతి చాలా అభివృద్ధి చెందేదాకా – ఉండవలసి ఉంటుంది. కాబట్టి నేరస్మృతికి సామాజిక స్థితిగతుల స్పృహ కల్గించడం కోసం కృషి చేయడం చాలా అవసరం. రాజకీయ ఖైదీల బేషరతు విడుదల కోసం ధర్నాలు చేసేకంటే ఈ కృషి చేస్తే పౌరహక్కుల ఉద్యమం తన కార్యరంగంలో మానవజాతి పురోగమనానికి దోహదం చేసినట్టు అవుతుంది.

ఇది మీ ఏప్రిల్ సంపాదకీయానికి నా స్పందన. మీ సంపాదకీయంలో చేసిన వ్యాఖ్యలకే ఇక్కడ పరిమితం అయ్యాను. మొత్తంగా పౌరహక్కుల ఉద్యమ అవగాహనపైన చర్చ పెట్టాలంటే ఇంకా అనేక విషయాలను ప్రస్తావించవలసి ఉంటుంది. ముందు ప్రజాస్వామ్యాన్ని కేవలం రాజకీయ ప్రజాస్వామ్యంగా కాక రాజకీయ సామాజిక ప్రజాస్వామ్యంగా అర్థం చేసుకోవలసి ఉంటుంది.

'జనపథం' ఒపిడిఆర్ అధికార మాసపత్రిక

# పౌరహక్కుల ఉద్యమ దృక్పథం: కొన్ని సమస్యలు

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నక్సలైట్ ఉద్యమంపైన ప్రభుత్వం ప్రయోగించిన క్రూరమైన నిర్బంధానికి నిరసనగా పుట్టింది. ఇదెంత సత్యమో, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నక్సలైట్ ఉద్యమంలో భాగంగా పుట్టిందనేది కూడా అంతే సత్యం. మొదటిది ఒక కర్తవ్యం. ఆ కర్తవ్యం ఇప్పుడూ ఎప్పుడూ (ఉద్యమాలపైన నిర్బంధమంటూ ఉన్నన్నాళ్లు) ఉంటుంది, కొనసాగుతుంది. రెండవది ఒక చారిత్రక విశేషం. దానినుండి ఈ సంస్థ క్రమంగా బయటపడుతున్న దశలో తిరిగి తొలినాటి స్థితికి వెనక్కి తీసుకుపోవాలనే ప్రయత్నం జరుగుతూ ఉంది కాబట్టి ఈ ఉద్యమం కర్తవ్యం ఏమిటో, పాత్ర ఏమిటో స్పష్టంగా చర్చించుకోవలసి ఉంది. చర్చ సౌలభ్యం కోసం నా అభిప్రాయాలను వీలైనంత క్లుప్తంగా, సూటిగా చెప్తాను.

పౌరహక్కుల ఉద్యమానికి తనదంటూ ఒక అవగాహన, తనదంటూ ఒక కర్తవ్యం,

కె. బాలగోపాల్

'పౌరహక్కుల అవగాహన చర్చాపత్రాలు' పుస్తకంలో వచ్చిన వ్యాసం, 1997

తనదంటూ ఒక కార్యరంగం ఉండాలి, ఉన్నాయి. ఇప్పుడున్న అభిప్రాయాలను విమర్శనాత్మకంగా విశ్లేషించడం ద్వారా వాటిని గ్రహించవచ్చును. నిజానికి 1993లో కర్నూలు మహాసభలలో ఆమోదించిన ప్రణాళికలో ఈ అవగాహన స్పష్టంగానే ఉంది కానీ దానిని చాలామంది సభ్యులు కేవలం నామమాత్రంగా ఆమోదించినట్టున్నారు కాబట్టి ఈ చర్చ ఇప్పుడు పెట్టుకోవలసి వస్తున్నది. హక్కుల చరిత్ర గురించి, హక్కుల స్వభావాన్ని గురించి ఎంతైనా మాట్లాడుకోవచ్చు. కానీ ఈనాడు సూటిగా మాట్లాడుకోవలసింది పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యాన్ని గురించి, కార్య రంగాన్ని గురించి.

1. 'వ్యవస్థను మార్చుకోవడం కోసం పోరాడడం ప్రజల ప్రజాస్వామిక హక్కు. అదే పౌరహక్కుల ఉద్యమానికి ప్రామాణికం' అనే అభిప్రాయం పౌరహక్కుల ఉద్యమంలో విస్తృతంగా ప్రాచుర్యం పొంది ఉంది. దీనిని కొంచెం పరిశీలిద్దాం.

'వ్యవస్థ' అని దేన్ని అంటున్నాం? సామాజిక జీవితం వ్యవస్థితంగా ఉంటుంది. అంటే నిర్మాణయుతంగా ఉంటుంది. అందులో కాకతాళీయమైన విషయాలు చాలా ఉన్నప్పటికీ అది మొత్తంగా కాకతాళీయం కాదు. నిర్మాణయుతమే కాబట్టి వ్యవస్థ అనేది అర్థవంతమైన మాటే. కానీ మనం దేనిని వ్యవస్థ అంటున్నాం? సామాజిక నిర్మాణంలో భాగంగా అనేక వ్యవస్థలున్నాయి. ఆస్తివ్యవస్థ ఉంది, కులవ్యవస్థ ఉంది, కుటుంబవ్యవస్థ ఉంది, పాలనావ్యవస్థ ఉంది, రాజకీయవ్యవస్థ ఉంది, ఇంకా ఎన్నో వ్యవస్థలున్నాయి. వీటిలో ఒక దానిని మాత్రమే 'వ్యవస్థ' అనీ మిగిలినవాటిని సంస్కృతీ సంప్రదాయాలు లేక ఆచారాలు అనీ భావిస్తున్నామా? లేకపోతే ఒక వ్యవస్థ ప్రాథమికమైనది, అదే పునాది వ్యవస్థ, మిగిలినవి దానికి అనుబంధంగా లేక ఉపరితలంగా ఉండేవి అనుకుంటున్నామా? లేకపోతే ఈ వ్యవస్థలన్నిటిని కలిపి ఒక 'వ్యవస్థ' అనగలమని భావిస్తున్నామా?

ఒక్కొక్క సిద్ధాంత దృక్పథం ఈ ప్రశ్నలకు ఒక్కొక్క జవాబు చెబుతుంది. వీటి తప్పొప్పుల గురించి చాలా చర్చ జరిగింది, జరుగుతూ ఉంది. పౌరహక్కుల ఉద్యమం తన పరిధిలో ఈ జవాబులను బేరీజు వేయజాలదు. ఏదో ఒక వ్యవస్థే ప్రాథమికం అనీ, అదే అసలమయిన 'వ్యవస్థ' అనీ తీర్పు చెప్పే ప్రయత్నం చేయడం పౌరహక్కుల ఉద్యమానికి అవసరమూ కాదు, మంచిదీ కాదు. అటువంటి ప్రయత్నం ఈ ఉద్యమాన్ని సంకుచితం చేస్తుంది.

అయితే ఈ వ్యవస్థలన్నీ అసమాన వ్యవస్థలే కాబట్టి, లేదా ఆధిపత్య లక్షణాలున్న వ్యవస్థలే కాబట్టి, వీటికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలన్నిటినీ ప్రజాతంత్ర పోరాటాలుగా పౌరహక్కుల ఉద్యమం గుర్తిస్తుంది. అది పెట్టుబడిదార్లకూ భూస్వాములకూ వ్యతిరేకంగా శ్రామికులు చేసే పోరాటం కావచ్చు, కులవ్యవస్థకు వ్యతిరేకంగా దళితులు చేసే పోరాటం కావచ్చు, మగపెత్తనానికి వ్యతిరేకంగా స్త్రీలు చేసే పోరాటం కావచ్చు, మతపరమైన మెజారిటీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా మైనారిటీలు చేసే పోరాటం కావచ్చు, మైదాన ప్రాంతాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఆదివాసులు చేసే పోరాటం కావచ్చు, అభివృద్ధి చెందిన ప్రాంతాల పెత్తనానికి వ్యతిరేకంగా వెనుకబాటుతనానికీ వివక్షకూ గురయిన ప్రాంతాలు చేసే

పోరాటాలు కావచ్చు, ఇంకేదయినా కావచ్చు . ఈ పోరాటాలన్నీ ప్రజాతంత్ర పోరాటాలే. వీటిలో ఏది 'వ్యవస్థను మార్చే పోరాటం', ఏది కాదు అని నిర్ణయించడానికి పూనుకోవడం పౌరహక్కుల ఉద్యమానికి అవసరం కాదు, సాధ్యం కాదు, మంచిదీ కాదు. అన్ని పోరాటాలూ ఆయా సామాజిక వ్యవస్థలలోని ఆధిపత్య స్వభావాన్నీ అన్యాయాన్నీ వ్యతిరేకించే పోరాటాలే. ఈ పోరాటాలలోనే (వాటి అవగాహనలోనయినా ఆచరణలోనయినా) అప్రజాస్వామిక లక్షణాలు పొడసూపితే మాత్రం వాటిని పౌరహక్కుల ఉద్యమం విమర్శించవలసి ఉంటుంది. (ఈ విషయాన్ని దిగువ వివరంగా చూద్దాం.) కానీ వీటి సాపేక్ష ప్రాధాన్యతలను తీర్మానించవలసిన అవసరం లేదు.

కాబట్టి 'వ్యవస్థ' అనే ఏకవచన ప్రయోగం పౌరహక్కుల ఉద్యమ అవగాహనకు తగినది కాదు. వ్యవస్థల బాహుళ్యం ఉందని గుర్తించాలి. వాటి ఆధిపత్య స్వభావానికీ వాటిలోని అసమానతకూ వ్యతిరేకంగా పోరాడే హక్కు ప్రజలకు ఉంటుందని గుర్తించాలి. 'వ్యవస్థను మార్చుకునే హక్కు' అనే బదులు 'ఆధిపత్య వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడే హక్కు' అనడం ఉచితంగా ఉంటుంది.

2. ఈ రెండు ప్రయోగాల మధ్య వ్యవస్థ–వ్యవస్థలు అనే ఏకవచన – బహువచనాల తేడాయే కాక ఇంకొక తేడా కూడా ఉంది. 'మార్చుకునే హక్కు' అనే బదులు 'పోరాడే హక్కు' అంటున్నాం. ఈ తేడా ఎందుకు అవసరం? 'వ్యవస్థను మార్చుకునే హక్కు' అనే ప్రయోగం వెనుక ఒక అవగాహన ఉంది. అన్ని రకాల సమస్యలకూ మూలమయిన 'వ్యవస్థ' ఒకటి ఉంది. దానిని 'మార్చుకొని' కొత్త 'వ్యవస్థ'ను ఏర్పాటు చేసుకున్న తరువాతే ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాతిపదిక ఏర్పడుతుంది. అందుకే 'వ్యవస్థను మార్చుకునే' పోరాటం అంత ముఖ్యమైనది. దీనిని 'విప్లవ దృక్పథం' అనవచ్చు. ఇది కమ్యూనిస్టు విప్లవ దృక్పథమే కానవసరం లేదు. మనం పునాదిగా ఎంచే 'వ్యవస్థ'ను బట్టి రకరకాల విప్లవ దృక్పథాలు ఉండగలవు. ఇప్పటికి ప్రాచుర్యంలో కమ్యూనిస్టు విప్లవ దృక్పథంతో పాటు దళిత విప్లవ దృక్పథం కూడా ఉంది. ప్రజల సమస్యలకు ఈ విప్లవ దృక్పథాలలో ఏది పరిష్కారాన్ని ఇస్తుంది (అసలు ఏదైనా పరిష్కారాన్ని ఇస్తుందా) అనే చర్చ పౌరహక్కుల ఉద్యమానికి అక్కరలేదు. కానీ పౌరహక్కుల ఉద్యమానికి (ఏదో ఒక) విప్లవ దృక్పథమే ఉండాలా? ఎందుకుండాలి? అనే చర్చ అవసరం. 'వ్యవస్థ' అనే దానిని (అది ఏ వ్యవస్థ అయినప్పటికీ) 'మార్చుకోవడం' అనే క్రియ మీదనే అన్ని సమస్యల పరిష్కారం ఆధారపడి ఉందని పౌరహక్కుల ఉద్యమం ఎందుకు నమ్మాలి? అప్పుడే ప్రజాస్వామ్యము, హక్కులు, సమానత్వం నిజంగా సిద్ధిస్తాయని పౌరహక్కుల ఉద్యమం నమ్మాల్సిన అవసరం ఉందా?

అన్యాయానికీ అసమానతలకూ వ్యతిరేకంగా పోరాడే హక్కును గుర్తించడం పౌరహక్కుల ఉద్యమానికి తప్పనిసరిగా అవసరం. కానీ ఆ పోరాటం 'వ్యవస్థను కూలదోసి కొత్త వ్యవస్థను నిర్మించడం' ద్వారానే సాఫల్యం చెందుతుందని నమ్మడం పౌరహక్కుల ఉద్యమానికి ఎందుకు

అవసరం? క్రమానుగత మార్పు ద్వారా కూడా సాఫల్యం చెందవచ్చునేమో కదా? రెండవది సాధ్యం కాదనీ మొదటిదే సాధ్యమనీ పౌరహక్కుల ఉద్యమం ఎందుకు నమ్మాలి? ఈ రెండిటిలో ఏది సత్యం అన్న తీర్పు పౌరహక్కుల ఉద్యమం ఎందుకు చెప్పాలి? సమస్యల పరిష్కారానికీ సమానత్వ సాధనకూ వ్యవస్థ మార్పు ఒక్కటే సాధనం అని తీర్పు చెప్పకుండ అన్య పరిష్కారాలను కూడా గౌరవించే రీతిలో పౌరహక్కుల ఉద్యమం ఒక విశాలమైన అవగాహన రూపొందించుకోలేదా? కమ్యూనిస్టు ఉద్యమం నుండి వచ్చిన అనేక అభిప్రాయాలు పౌరహక్కుల ఉద్యమంలో భాగం అయిపోయాయి. అవి ఈ ఉద్యమానికి అవసరమా? ప్రయోజనకరమా? అసలవి సత్యమేనా? అని చర్చించకుండ వాటిని పౌరహక్కుల అవగాహనలో భాగం చేసుకోవడం వల్ల ఈ ఉద్యమం విశాల స్వభావాన్ని సంతరించుకోలేక పోతున్నది. తనదైన ఒక అవగాహనను రూపొందించుకోలేక పోతున్నది.

పోరాటాల అవసరాన్నీ పోరాడే హక్కునూ గుర్తిస్తూ, పోరాటాలు 'వ్యవస్థను మార్చి', 'కొత్త వ్యవస్థను నెలకొల్పడం' ద్వారానే ఫలవంతం అవుతాయన్న అభిప్రాయానికి పరిమితం కాకుండ విభిన్న పరిష్కారమార్గాలకు సమానస్థాయి కల్పించే పద్ధతిలో పౌరహక్కుల ఉద్యమం సామాజిక మార్పు గురించి తన అవగాహనను రూపొందించుకోవాలి.

'వ్యవస్థను మార్చి కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ప్రజల ప్రజాస్వామిక హక్కు' అనే బదులు 'అన్ని సామాజిక వ్యవస్థలలోనూ ఉన్న అసమానతలకూ అన్యాయానికీ వ్యతిరేకంగా పోరాడడం ప్రజల ప్రజాస్వామిక హక్కు' అనడం విశాలమైన అవగాహనకు ప్రాతిపదిక ఇస్తుంది. 'వ్యవస్థ' అనే బదులు 'అన్ని సామాజిక వ్యవస్థలు' అనడం ఒక కోణంలో దృక్పథాన్ని విశాలం చేస్తుంది. 'వ్యవస్థను మార్చి కొత్త వ్యవస్థను నిర్మించడం' అనే పరిష్కారమార్గాన్ని నిర్దేశించకుండ, 'అసమానతలకూ అన్యాయానికీ వ్యతిరేకంగా పోరాడడం' అనడం ద్వారా ఒక్క విప్లవ దృక్పథానికే కాక, పోరాటాల ఆవశ్యకతనూ హక్కునూ గుర్తించే ఏ ప్రజాతంత్ర దృక్పథానికైనా పౌరహక్కుల ఉద్యమ దృక్పథంలో సమాన హోదా కల్పించగలుగుతాం. హక్కుల కోసం ప్రభుత్వాన్ని అడుక్కోవాలి తప్ప పోరాటాలు చేయకూడదనే దృక్పథానికి మాత్రమే ఇందులో చోటు ఉండదు.

పౌరహక్కుల ఉద్యమానికి విశాల స్వభావం ఉండాలని అందరూ ఒప్పుకుంటారు. 'మేము ఎప్పుడో చెప్పామ'ని కూడా అంటారు. కానీ దాని అర్థం ఏమిటి? ఈ ఉద్యమం ఏ ఒక్క రాజకీయ దృక్పథానికీ పరిమితం కాకుండ నిజంగానే విశాలమైన దృక్పథంతో పనిచేయాలనా? లేక అది కమ్యూనిస్టు రాజకీయాల ప్రాపంచిక దృక్పథం పరిధిలోనే పనిచేస్తూ, ఇతరులను కూడ ఆచితూచి కలుపుకుని పోవడం ద్వారా ఆ రాజకీయాలే ప్రజాతంత్ర దృక్పథానికి అసలయిన ప్రాతిపదిక అన్న అభిప్రాయాన్ని సమాజంలో నెలకొల్పాలనా? మన రాష్ట్రంలో పౌరహక్కుల ఉద్యమానికి నాంది పలికిన మార్క్సిస్ట్–లెనినిస్ట్ పార్టీల దృష్టిలో పౌరహక్కుల ఉద్యమానికి నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రచారం, ఆందోళన చేపట్టే పౌరహక్కుల కర్తవ్యమే కాక, ప్రజాతంత్రవాదులను ఆ పార్టీలు నమ్మే నూతన

> పౌరహక్కుల ఉద్యమం పోరాడే హక్కును ఒక ముఖ్యమైన హక్కుగా గుర్తిస్తుంది. కానీ అదే ఎందుకు ప్రామాణికం కావాలి? నిత్యజీవితంలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా, గౌరవప్రదంగా బతికే హక్కు అంతే ప్రామాణికం ఎందుకు కాకూడదు?

ప్రజాస్వామిక విప్లవం వైపు ఆకర్షించే రాజకీయ కర్తవ్యం కూడ ఉంది. ఆ పార్టీల రాజకీయ దృక్కోణం నుండి పౌరహక్కుల ఉద్యమాన్ని చూసేవారు కోరుకునే 'విశాల స్వభావం' ఆ కర్తవ్యం నుండే వస్తుంది. ఆ పార్టీల సభ్యులుగానూ అనుయాయులుగానూ ఉంటూ పౌరహక్కుల ఉద్యమంలో పనిచేసే వాళ్లు 'విశాల ప్రాతిపదిక' అనే మాటను ఈ అర్థంలోనే అవగాహన చేసుకుంటున్నారేమో ఆలోచించాలి. అవ్యక్తంగా ఉండిపోయి మన ఆచరణను శాసిస్తున్న అభిప్రాయాలను వెలికితీసి పరీక్షించాలి. కానీ నిజానికి పౌరహక్కుల ఉద్యమానికి కావలసిన విశాల ప్రాతిపదిక ఇది కాదు. ప్రజాస్వామ్యాన్ని వ్యవస్థలలో, విలువలలో, ప్రమాణాలలో, సామాజిక సంబంధాలలో పెంపొందించే తనదైన కార్యరంగానికీ, కృషికీ అవసరమైన విశాల ప్రాతిపదిక. అది ఎం.ఎల్ పార్టీల రాజకీయ హక్కులకూ ఆ పార్టీల కార్యకర్తల పౌరప్రజాస్వామ్య హక్కులకూ సహాయకంగానే ఉంటుంది కానీ ఆ పార్టీల రాజకీయవ్యాప్తికి తోడ్పడకపోవచ్చు. ఒకవేళ నష్టం కలిగిస్తే కూడ చేయగలిగిందేమీ లేదు.

దీనిని విశదీకరించడం కోసం మరికొన్ని విషయాలు చూద్దాం.

3. 'వ్యవస్థను మార్చడం కోసం పోరాడే హక్కు' అనే బదులు ఆధిపత్య వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడే హక్కు, లేక వ్యవస్థలోని అన్యాయాలకూ అసమానతలకూ వ్యతిరేకంగా పోరాడే హక్కు అనడం పౌరహక్కుల ఉద్యమ అవగాహనకు ఉచితంగా ఉంటుందని అన్నాను. అయితే ఏ రకంగా చెప్పుకున్నా, ఈ పోరాడే హక్కే అన్నిటికన్నా ఎందుకు ముఖ్యం కావాలి? పౌరహక్కుల ఉద్యమం అవగాహనకు గీటురాయి ఎందుకు కావాలి? పౌరహక్కుల ఉద్యమం పోరాడే హక్కును ఒక ముఖ్యమైన హక్కుగా గుర్తిస్తుంది. కానీ అదే ఎందుకు ప్రామాణికం కావాలి? నిత్యజీవితంలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా, గౌరవప్రదంగా బతికే హక్కు అంతే ప్రామాణికం ఎందుకు కాకూడదు? పోరాటాల ద్వారానే ప్రజలు హక్కులు సాధించుకుంటారు కాబట్టి పోరాడే హక్కు అన్నిటికంటే ముఖ్యమైనది అని దీనికి జవాబు చెబుతారు. బాగానే ఉంది. కానీ ఆ తర్కం ప్రకారమే, ప్రజలు గతంలో పోరాటం చేసి సాధించుకున్న హక్కులను ఈ రోజు నిత్యజీవితంలో అనుభవించగలగడం పౌరహక్కుల ఉద్యమానికి ఒక ముఖ్యవిషయం కావాలి కదా? పోరాడి కొత్త హక్కులు సాధించుకోవడం ఎంత ముఖ్యమో, గతంలో పోరాడి సాధించుకున్న పాత హక్కులను నిత్యజీవితంలో అనుభవించగలగడం అంతే ముఖ్యం ఎందుకు కాదు? పోరాడే హక్కుకు మద్దతునివ్వడం ఎంత ముఖ్యమైన విషయమో,

ఇప్పటికే సాధించుకున్న హక్కులు, సంస్కరణలు అమలయ్యేట్టు చూడడం అంతే ముఖ్యమైన విషయం అవుతుంది కదా!

హక్కులను నిత్యజీవితంలో అనుభవించడం కోసం ప్రజలు కోరుకుంటారు. అందుకోసం పోరాటాలు చేస్తారు. పోరాటాలు సఫలం అయితే ప్రజలు కోరుకున్న హక్కులు చట్టాల రూపం తీసుకుంటాయి. వాటి అమలుకు ఒక యంత్రాంగం ఏర్పడుతుంది. పోరాటం జరిగే దశలో పోరాడే హక్కుకు మద్దతు ఇవ్వడం ఎంత ముఖ్యమో, పోరాడి సాధించుకున్న హక్కులు సక్రమంగా వ్యవస్థీకృతం అయ్యేటట్టు చూడడం (అంటే వాటికి వ్యవస్థిత రూపం ఇచ్చే చట్టాలలోనూ సంస్కరణలలోనూ లొసుగులు లేకుండ చూడడం), వాటిని అమలు చేసే యంత్రాంగం సక్రమంగా పని చేసేట్టు చూడడం, దాని కోసం కోర్టుల ద్వారానూ ఆందోళనల ద్వారానూ ఒత్తిడి పెట్టడం, అంతే ముఖ్యమైన కర్తవ్యాలు.

ప్రతీ హక్కూ తొలిదశలో ఒక ఆకాంక్ష మాత్రమే. ఆ దశలో అందులోని న్యాయమైన అంశాన్ని సమాజంలో ప్రచారం చేయాలి. వక్రభాష్యాలను విమర్శించాలి. తరువాత అదొక ఉద్యమం రూపం తీసుకుంటుంది. ఆ దశలో దాని కోసం ఉద్యమించే హక్కుకూ పోరాడే హక్కుకూ మద్దతు ఇవ్వాలి. వాటిని కాపాడడం కోసం కృషి చేయాలి. ఉద్యమం విజయవంతమయితే ఆ హక్కు చట్టం రూపం తీసుకుంటుంది. అంటే అది వ్యవస్థితమవుతుంది. అప్పుడు ఆ చట్టం సమగ్రరూపం తీసుకునేటట్టు చూడాలి. దానిని అమలు చేయడానికి సరయిన యంత్రాంగం ఉండేటట్టు చూడాలి. చట్టంలోనూ యంత్రాంగంలోనూ లొసుగులు లేకుండా చూడాలి. ఆ తరువాత ఆ చట్టం అమలయ్యేట్టు చూడాలి, దానిని అమలు చేసే యంత్రాంగం సక్రమంగా పని చేసేటట్టు చూడాలి.

ఇవన్నీ పౌరహక్కుల ఉద్యమానికి సమాన ప్రాముఖ్యం గల కర్తవ్యాలే. 'పోరాడే హక్కుకు మద్దతు ఇవ్వడం' అనేదే పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యాలకు ప్రామాణికం కాదు. వీటన్నిటికీ ప్రజాందోళన ఒక సాధనం కాగలదు. కానీ అదొక్కటే సాధనం కాదు. ప్రజాందోళన విషయంలో కూడ 'ఆందోళన చేయండి' అని ప్రోత్సహించడం మాత్రమే పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యం కాదు.

4. అదే ప్రామాణికం అనుకోవడానికి వెనుక ఉన్న తాత్విక దృక్పథాన్ని చర్చించాలి. ఎం.ఎల్ పార్టీల ప్రాపంచిక దృక్పథం నుండి పౌరహక్కుల దృక్పథంలోకి వచ్చి అవ్యక్తంగా దానిని శాసిస్తున్న అభిప్రాయాలలో ఇదొకటి. ఇటువంటి అభిప్రాయాలన్నిటినీ వెలికితీసి అవి ఎంతవరకు సత్యమో, పౌరహక్కుల అవగాహనకు ఎంతవరకు ఉపయోగపడతాయో పరిశీలించాలి.

ఆ అభిప్రాయాన్ని క్లుప్తంగా ఈ విధంగా వివరించవచ్చు. ప్రస్తుత వ్యవస్థలో ఉన్నదంతా (పోరాటాలు తప్ప) చీకటే. పోరాటాల ద్వారా దీనిని కూల్చి నూతన వ్యవస్థను నిర్మించుకున్నప్పుడే వెలుగు వస్తుంది. అందువల్ల పోరాడే హక్కే ప్రధానమైన హక్కు.

వ్యవస్థను కూలదోయడం కోసం హక్కులను వాడుకోవాలి. అదే వాటి నిజమైన ప్రాముఖ్యం. హక్కులకు వేరే ఏ ప్రాముఖ్యమైనా ఉందనుకోవడం భ్రమ, భావజాలం. మరి నిత్యజీవితావసరాల కోసం పోరాటాలు జరగడం లేదా, వాటి ద్వారా సంస్కరణలు రావడం లేదా అంటే ఆ సంస్కరణలూ ఆ చట్టాలూ కూడ ప్రస్తుత వ్యవస్థలో అమలు కావనీ, వాటి కోసం కూడ మళ్లీ పోరాటాలు చేయవలసిందేననీ, అందువల్ల ఏ రకంగా చూసినా వ్యవస్థను మార్చడం కోసం పోరాడే హక్కే పౌరహక్కుల దృక్పథానికి ప్రామాణికం అనీ అంటారు.

ఇప్పుడున్నదంతా చీకటేనని కొంచెం సేపు ఒప్పుకుందాం. ఈ వ్యవస్థలో న్యాయం అసలే లేదనీ హక్కులను కల్పించే చట్టాలూ సంస్కరణలూ బూటకం అనీ వ్యవస్థను మార్చే పోరాటమే శరణ్యం అనీ కొంచెం సేపు అనుకుందాం. అప్పుడు పౌరహక్కుల ఉద్యమం ఏం చేయాలి? పోరాడే హక్కుకు ప్రాధాన్యం ఇచ్చి పనిచేయాలి. అంటే ఏం చేయాలి? మీకు పోరాడే హక్కు ఉంది అని ప్రజలకు చెప్పొచ్చు. పాలకులు పోరాడే హక్కును ఎన్ని రూపాలలో అణిచివేస్తున్నారో ప్రజలకు చెప్పొచ్చు. అంతకంటే ఏమైనా చేయగలుగుతుందా? ఈ మాత్రానికయితే ఒక పౌరహక్కుల ఉద్యమం ఎందుకు? ప్రజలకు పోరాడే హక్కు ఉందని పోరాటాలు నిర్వహించే ఉద్యమాలే చెప్పగలవు. అది ఎన్ని రకాల అణచివేతకు గురి అవుతున్నదో కూడ చెప్పగలవు. నిజానికి ఆ సంగతి ప్రజలకే తెలుసు. దాని కోసం ఒక పౌరహక్కుల ఉద్యమం ఎందుకు?

**పో**రాడే హక్కే ప్రధానం అనుకున్నా, 'మీకు పోరాడే హక్కు ఉంది, పోరాడండి' అని ప్రచారం చేయడంతో సరిపెట్టుకోకుండ, ఆ పోరాడే హక్కును కాపాడే ప్రయత్నమేమయినా నిర్దిష్టంగా చేయగలిగితేనే పౌరహక్కుల ఉద్యమానికి సార్థకత ఉంటుంది. అయితే 'పోరాడే హక్కు' అనేది మాట వరసకు మాత్రమే ఒక హక్కు. నిజానికి అది అనేక హక్కుల కలయిక. సంఘాలు పెట్టుకునే హక్కు, సమావేశాలు జరుపుకునే హక్కు, ఊరేగింపు తీసే హక్కు, ఎన్నికలలో పోటీ చేసే హక్కు, ప్రదర్శన నిర్వహించే హక్కు, ప్రచురణ హక్కు, అభిప్రాయ స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, పోలీసు హింస నుండి రక్షణ కల్పించే హక్కు, ప్రత్యామ్నాయ సామాజిక ఆర్థిక వ్యవస్థల కోసం, జీవన విధానాల కోసం కృషి చేసే రాజకీయ స్వేచ్ఛ, సహేతుకమైన నేరవిచారణ లేకుండ ఎవరినీ శిక్షించడానికి వీలు లేదనే హక్కు, మొదలయిన హక్కులెన్నో కలిస్తేనే 'పోరాడే హక్కు' అవుతుంది.

పోరాడే హక్కుకు ప్రాధాన్యం ఇవ్వడం అంటే పోరాడే హక్కులో అంతర్భాగమైన పై హక్కులన్నిటినీ కాపాడడానికి నిర్దిష్టంగా కృషి చేయడం. ఆ కృషిని గురించి ఏ కొంచెం ఆలోచించినా ప్రస్తుత వ్యవస్థలో 'అంతా శూన్యం' అనే వైఖరి పనికి రాదని అర్థం అవుతుంది. ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థలో ఆ హక్కులకు ఎంతో కొంత స్థానం కల్పించే చట్టాలు చాలానే ఉన్నాయి. వాటిని అర్థవంతమైన చట్టాలుగా గుర్తించాలి (వాటిలోని లోపాలను విస్మరించాలని కాదు). వాటి వెనుక ఒక పోరాట చరిత్ర ఉందని గుర్తించాలి. సమాజం చేత వాటిని నాగరికతా విలువలుగా గుర్తింపజేయాలి. 'వ్యవస్థను మార్చే

పోరాటాలకు ఇవి అవసరం కాబట్టి వీటిని కాపాడుకుందాం' అని చెప్తే ఉపయోగం లేదు. పౌరహక్కుల ఉద్యమం పోరాటకారులతో మాత్రమే సంభాషిస్తే ప్రయోజనం ఎక్కువ ఉండదు. పోరాడే హక్కు ప్రజలకు ఉందని ధైర్యం చెప్పి ఉత్తేజం ఇవ్వడం పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యమే. కానీ అంతకంటే ముఖ్యమైన కర్తవ్యం ఆ పోరాటాలకు అవసరమైన అవకాశాలను వ్యవస్థలో సజీవంగా ఉంచడం. వాటికి సంబంధించిన విలువలను సమాజంలో పెంపొందించడం. దాని కోసం పోరాటకారులతో కాక ఇతరులతో ప్రధానంగా సంభాషించాలి. ఇప్పటికే సమాజం సాధించుకున్న నాగరికతనూ ప్రజాస్వామ్య ప్రగతినీ అభిమానించే వాళ్లతో సంభాషించాలి. ఆ అభిమానాన్ని సమాజంలో పెంచాలి. అభిమానించే వాళ్ల సంఖ్యనూ పెంచాలి. 'ఈ హక్కులూ విలువలూ మన నాగరికతలో భాగం కనుక వీటిని కాపాడుకుందాం' అని చెప్పాలి. (ముందు తాను నమ్మాలి). వాటిని అమలు పరిచే కర్తవ్యం ఉన్న యంత్రాంగాల చేత పని చేయించాలి. దాని కోసం న్యాయవ్యవస్థ లోపల కూడ కృషి చేయాలి. అధికార యంత్రాంగంపైన ఒత్తిడి పెట్టే ఆందోళన చేపట్టాలి. ఈ కృషికి కావలసింది 'ఈ వ్యవస్థ మారితే తప్ప న్యాయం జరగదు' అనే అభిప్రాయం కాదు. 'చారిత్రకంగా సంక్రమించిన ప్రజాతంత్ర విలువలనూ వ్యవస్థలనూ పతనం కానివ్వడానికి వీలు లేదు' అనే అభిప్రాయం.

ఈ రెండు అభిప్రాయాలూ పరస్పర విరుద్ధమైనవి కాకపోవచ్చు. కానీ దేని మీద దృష్టి పెడతామనేది మన ఆచరణను చాలా ప్రభావితం చేస్తుంది. మొదటిదాని మీద కాక రెండవదాని మీద దృష్టి పెట్టి దానిని నిలబెట్టడానికి ఏ మేరకు కృషి చేస్తామో ఆ మేరకు పోరాడే హక్కును నిజంగా కాపాడగలుగుతాం. పోరాడే హక్కును కాపాడడమే తన కర్తవ్యం అని పౌరహక్కుల ఉద్యమం భావించినా అది మాట్లాడవలసింది ప్రధానంగా పోరాటాల ఆవశ్యకత గురించి కాదు. అది ప్రచారం చేయవలసింది పోరాటం తప్ప గత్యంతరం లేదని కాదు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంబంధించిన చారిత్రకంగా సంక్రమించిన హక్కుల గురించి, విలువల గురించి, వాటికి వ్యవస్థలో స్థానం కల్పించే చట్టాల గురించి, ఆ చట్టాలను అమలు చేసుకోవడానికి ఉండవలసిన అవకాశాల గురించి మాట్లాడాలి. అంటే అది దృష్టి కేంద్రీకరించవలసింది వ్యవస్థ పట్ల అవిశ్వాసాన్ని పెంపొందించడం పైన కాదు. ప్రజాస్వామ్య హక్కులనూ, విలువలనూ, వాటికి స్థానం కల్పించే ప్రజాస్వామ్య వ్యవస్థలనూ కాపాడుకోవాలనే కర్తవ్యం మీద అది దృష్టి పెట్టాలి. కాపాడుకోవడమే కాక వాటిని మరింత విస్తృత పరచుకోవడం ద్వారా పోరాట అవకాశాలను మరింత మెరుగు పరచడానికి అది కృషి చేయాలి. దానికి ప్రచార ఆందోళనా రంగాలలోనే కాక న్యాయవ్యవస్థలోనూ, చట్టసభలలోనూ కూడ కృషి చేయాలి. అంటే మొట్టమొదట ఇవన్నీ అర్థవంతమైన వ్యవస్థలేనని (వాటిలో ఎన్ని లోపాలున్నా) గుర్తించాలి.

'పోరాడే హక్కును కాపాడడం' అంటే 'ప్రజలలో హక్కుల చైతన్యం పెంపొందించడం' అని మాత్రమే చాలామంది పౌరహక్కుల ఉద్యమ కార్యకర్తలు భావిస్తున్నారు. అది పాక్షికమైన

అవగాహన. ప్రజలలో హక్కుల చైతన్యాన్ని పెంపొందించడమే కాదు, వ్యవస్థలో ప్రజాస్వామ్యాన్ని పెంపొందించే కృషి కూడా చేయాలి. దానిని 'వాడుకోవడానికి' చాలామందికి అభ్యంతరం లేదుగానీ, దానిని 'పెంపొందించడం' అనేసరికి ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థలో ప్రజాస్వామ్యం అనేదొకటి ఉందనీ, దానికి అర్థం, విలువ ఉన్నాయనీ, వాటిని పెంపొందించే కృషికి కూడా అర్థం ఉందనీ ఒప్పుకోవలసి వస్తుంది. ప్రస్తుత వ్యవస్థలో ప్రజాస్వామ్యం నామమాత్రం అని భావించే దృక్పథానికి ఇది ఇబ్బందికరంగా తోచవచ్చు. కానీ అది నామమాత్రమేననీ, నామమాత్రంగానే ఉంటుందనీ అనుకుంటే 'పోరాడే హక్కును' కాపాడడానికి నిర్దిష్టమైన పౌరహక్కుల కృషి ఏదీ సాధ్యం కాదు. 'మీకు పోరాడే హక్కు ఉంది, పోరాడండి' అని ప్రజలకు చెప్పడం మాత్రమే సాధ్యమవుతుంది.

గతంలో జరిగిన పోరాటాల నుండి ప్రజాస్వామిక విలువలూ హక్కులూ అనేకం పుట్టాయని అంటే ఇప్పుడందరూ ఒప్పుకుంటున్నారు. దానితో ఎవరికీ పేచీ లేదు. ఆ హక్కులకూ విలువలకూ ప్రజల చైతన్యంలో స్థానం ఉందనీ దానిని పెంచడం కోసం కృషి చేయాలనీ అంటే కూడ సంతోషంగా ఒప్పుకుంటారు. కానీ ప్రజల చైతన్యంలోనే కాక ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థలో కూడ వాటికి నిజమైన (అంటే బూటకం కాని) స్థానం ఉందనీ దానిని పెంపొందించాలనీ అనేసరికి ఇబ్బంది వచ్చేస్తుంది. ఎంత స్థానం ఉంది, అది ఏ మేరకు అమలవుతుంది అని చర్చించుకోవచ్చు. మనం కృషి చేసే కొద్దీ వాటిని పెంచవచ్చు. కానీ 'నామమాత్రం', 'బూటకం', 'శూన్యం' అని అనుకోవడం వాస్తవికం కాదు. పౌరహక్కుల కర్తవ్యానికి ఎంతమాత్రం ఉపయోగకరమూ కాదు.

సారాంశంలో – ఈ వ్యవస్థలో మంచి, న్యాయం, ప్రజాస్వామ్యం శూన్యం అనే అభిప్రాయంతో మొదలుపెట్టి ఇంక పోరాటమే శరణ్యం అని నిర్ణయించుకున్నా పోరాడే హక్కును కాపాడే అర్థవంతమైన కార్యక్రమం చేపట్టాలంటే ఈ వ్యవస్థలో ప్రజాస్వామ్యం, న్యాయం శూన్యం అన్న అభిప్రాయం ఒక ఆటంకం అని గుర్తించక తప్పదు. లేకపోతే పోరాడే హక్కును కాపాడే నిర్దిష్టమైన కృషి ఏదీ సాధ్యం కాదు. 'పోరాడండి, పోరాడితే పోయేదేమీ లేదు' అని ప్రజలను ఉద్బోధించడం మాత్రమే సాధ్యం అవుతుంది. అదొక ఉపయోగకరమైన కర్తవ్యమే కానీ పౌరహక్కుల ఉద్యమానికదే ముఖ్య కర్తవ్యం కాదు. ఆ కర్తవ్యాన్ని నిర్వర్తించడానికే అయితే ఒక పౌరహక్కుల ఉద్యమం అవసరం లేదు. అది కాకపోతే మిగిలింది ఏమిటంటే 'ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే వాళ్లందరూ ఈ వ్యవస్థను కూలదోసే కృషిలో భాగం కాక తప్పదు' అనే అభిప్రాయాన్ని ప్రచారం చేసే రాజకీయ కర్తవ్యం. చాలామంది పౌరహక్కుల ఉద్యమకారుల అభిప్రాయంలో పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యం ఇదేననుకుంటాను (పైకి ఒప్పుకోకపోయినా). 'ఈ వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోయింది' అనే అవిశ్వాస ప్రకటనతో మొదలయ్యే పౌరహక్కుల ఉద్యమానికి ఈ రాజకీయ కర్తవ్యమే తప్ప నిర్దిష్టమైన పౌరహక్కుల కర్తవ్యమేమీ వుండదు. అదే కావాలనుకుంటే ఆ విషయం ప్రకటించుకుంటే మంచిది. దానికి హక్కుల పరిభాష అనవసరం.

5. పోరాటాలపైన, పోరాడే హక్కుపైన మాత్రమే దృష్టి పెట్టే వైఖరి పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యాలను ఎంతగా కుదించి వేస్తుందో ఇంకొంచెం వివరంగా చూద్దాం.

ఎప్పుడయినా పీడిత ప్రజలలో కొద్దిశాతం మాత్రమే పోరాటాలలో నిమగ్నమయి వుంటారు. మెజారిటీ ప్రజలు మామూలుగా బ్రతుకుతూ హక్కులనూ, హక్కుల లేమినీ అనుభవిస్తుంటారు. కొత్త హక్కుల కోసమయితే ఎవరైనా పోరాటం చేయక తప్పదు. సంస్కరణల ద్వారా కొత్త హక్కులు రావాలన్నా, సంస్కరణల కోసం ప్రభుత్వంపైన, రాజకీయపార్టీలపైన ఒత్తిడి పెట్టే ఆందోళనలూ ఉద్యమాలూ అవసరం. అడగకుండ, ఆందోళన చేయకుండ కొత్త హక్కులు రావు.

కానీ గతమంతా చీకటి కాదు. గతంలో అనేక పోరాటాలూ ఉద్యమాలూ జరిగాయి. వాటినుండి ప్రజాస్వామ్య విలువలూ, నియమాలూ, హక్కులూ పుట్టాయి. ఉద్యమకారులు ప్రత్యక్షంగా కోరుకున్న హక్కులే కాక ఉద్యమాల నుండి పుట్టిన విలువల ప్రోద్బలంతో చట్టసభలు చేపట్టిన సంస్కరణల వల్ల కూడ కొత్త హక్కులూ, ప్రజోపయోగమైన శాసనాలూ వచ్చాయి.

వీటిని నిత్య జీవితంలో అనుభవించే హక్కు ప్రజలకుంది. కొత్త హక్కుల కోసం పోరాడే హక్కు ఎంత ముఖ్యమో, ఇప్పటికే సాధించుకొని రాజ్యాంగ వ్యవస్థలో భాగం అయిన విలువలను నిత్య జీవితంలో నిరాటంకంగా అనుభవించే హక్కు కూడ అంతే ముఖ్యం. పోరాడే హక్కుకే ప్రాధాన్యం ఇచ్చే పౌరహక్కుల ఉద్యమం ఈ రెండవ హక్కు గురించి ఏం చెప్పగలదు? ఏం చేయగలదు? రాజ్యాంగ వ్యవస్థ ప్రజల నిత్య జీవితంలో కల్పించవలసిన హక్కులను కూడ పోరాడి అమలు చేయించుకొమ్మని ప్రజలకు ఉద్బోధించగలదు. తప్పనిసరయితే ప్రజలు పోరాటం చేయవలసిందే. కానీ ఆ సలహాకు (లేక ఆ ప్రోత్సాహానికి) పరిమితమయ్యే వైఖరి పౌరహక్కుల ఉద్యమానికి తగినదేనా? అమలు కాకుండ ఉన్న ఒక్కొక్క హక్కు గురించి ఆందోళన చేయమని ప్రజలను ప్రోత్సహించడం, ఆ ఆందోళనలకు మద్దతు ఇవ్వడం పౌరహక్కుల ఉద్యమం నిర్వర్తించగల కర్తవ్యాలలో ఒకటి మాత్రమే. మొత్తంగా రాజ్యాంగ వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచే కృషి (దానికి కూడ ఆందోళనలు అవసరం కావొచ్చు) చేపడితే, అది పెరిగిన మేరకు ప్రజలు తమ హక్కులను నిత్యజీవితంలో నిరాటంకంగా పొందగలుగుతారు. ఇదొక ముఖ్యమైన పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యం.

రాజ్యాంగ వ్యవస్థలోని ప్రజాస్వామ్యం (అందులో ఎన్ని లోపాలు ఉన్నప్పటికీ) మౌలికంగా అర్థవంతమయినదేననీ అది చారిత్రక ప్రగతి ఫలితమనీ అర్థం చేసుకొని ఆ ప్రజాస్వామ్యం ప్రజలకు నిత్యజీవితంలో అందేటట్లు చూడదానికి పౌరహక్కుల ఉద్యమం కృషి చేయాలి. అంటే పాలనకు వుండే జవాబుదారీతనాన్ని పెంచాలి. అందుకోసం కోర్టుల ద్వారా కృషి చేయవచ్చు. ఆందోళనల ద్వారానూ, పత్రికల ద్వారానూ, ప్రజాభిప్రాయం ద్వారానూ ఒత్తిడి పెట్టవచ్చు. జవాబుదారీతనం ఏ మేరకు వుంటుందో ఆ మేరకు గతంలో

> రాజ్యాంగ వ్యవస్థలోని ప్రజాస్వామ్యం (అందులో ఎన్ని లోపాలు ఉన్నప్పటికీ) మౌలికంగా అర్థవంతమయినదేననీ అది చారిత్రక ప్రగతి ఫలితమనీ అర్థం చేసుకొని ఆ ప్రజాస్వామ్యం ప్రజలకు నిత్యజీవితంలో అందేటట్లు చూడడానికి పౌరహక్కుల ఉద్యమం కృషి చేయాలి. అంటే పాలనకు వుండే జవాబుదారీతనాన్ని పెంచాలి.

సాధించుకున్న ప్రజాస్వామ్య హక్కులూ విలువలూ నిత్య జీవితంలో ప్రజలకు అందుతాయి. ప్రజలు నిత్యజీవితంలో వాటిని అనుభవించగలుగుతారు. అందవలసి వుండీ అందని హక్కుల కోసం ఆందోళన చేసే హక్కు, కొత్త హక్కుల కోసం పోరాటం చేసే హక్కు ప్రజలకు వుందని చెప్పడం, ప్రజలకు ఆ చైతన్యం కలిగించడం, ఆ పోరాటాలకూ ఆందోళనలకూ అవసరమైన ప్రజాస్వామ్య అవకాశాలనూ, హక్కులనూ కాపాడడం ఎంత ముఖ్యమైన పౌరహక్కుల కర్తవ్యమో, రోజువారీ జీవితంలో రాజ్యాంగ వ్యవస్థకు (న్యాయ వ్యవస్థకూ, పరిపాలనా యంత్రాంగానికీ, చట్టసభలకూ) వుండవలసిన జవాబుదారీతనాన్ని కాపాడడం, పెంపొందించడం కూడ అంతే ముఖ్యమైన పౌరహక్కుల కర్తవ్యం. ఈ జవాబుదారీతనానికి గీటురాయి సామాజిక ప్రగతిలో భాగంగా ఇప్పటిదాకా సాధించిన ప్రజాస్వామ్య విలువలు, వ్యవస్థలు. ఈ జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి పౌరహక్కుల వుద్యమం కోర్టు కేసుల నుండి ప్రచార ఆందోళనా కార్యక్రమాల దాకా ఎన్ని సాధనాలు వీలయితే అన్నిటిని రూపొందించుకోవాలి.

ఎప్పుడయినా పీడిత ప్రజలలో ఒక మైనారిటీ మాత్రమే పోరాటాలలో వుంటారు. పోరాడే హక్కుకే ప్రాధాన్యం ఇచ్చే పౌరహక్కుల ఉద్యమం వారికి మాత్రమే సహాయం చేయగలుగుతుంది. మిగిలిన వాళ్లకు (అంటే మెజారిటీ పీడిత ప్రజలకు) 'మీరు కూడ పోరాటాలు చేయండి' అని మాత్రమే చెప్పగలుగుతుంది. రాజ్యాంగ వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి విస్తృత స్థాయిలో ఒక సాధారణ కృషి, కార్యక్రమం చేపట్టేట్టయితేనే ఈ మెజారిటీ ప్రజానీకానికి నిత్య జీవితంలో ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థ పరిధిలో అందవలసిన ఫలితాలు అందించడానికి పౌరహక్కుల ఉద్యమం తోడ్పడగలుగుతుంది. లేకపోతే ఈ ప్రజలు పౌరహక్కుల ఉద్యమానికి కనిపించకుండానే పోయే ప్రమాదం వుంది. ఆ కృషి 'వృధా' అని, ఈ వ్యవస్థలో వున్న ప్రజాస్వామ్యాన్ని 'వాడుకుంటే వాడుకోవచ్చు' కానీ అందులో నిజంగా ఏదో వుందని నమ్మకాలు పెట్టుకోవద్దని అనుకోవడం చారిత్రక విజయాలను చేజేతులా వదులుకోవడం అవుతుంది. పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యాన్ని సగానికి కుదించివేయడం అవుతుంది.

మార్క్సిస్ట్-లెనినిస్ట్ పార్టీల ఉద్యమాల నుండి ప్రేరణ పొందిన పౌరహక్కుల దృక్పథానికి ఇది ఇబ్బందికరంగా తోచవచ్చు. పోరాడే హక్కు గురించి ఎంత మాట్లాడినా ఇబ్బంది లేదు. రాజ్యాంగ వ్యవస్థ ప్రజల పట్ల జవాబుదారీతనం కలిగి వుండాలని చెప్తే ఇబ్బంది లేదు. అది ప్రజల చైతన్యాన్నీ, పాలకుల పట్ల విమర్శనా దృక్పథాన్ని పెంచుతుంది కాబట్టి మంచిదే. ప్రస్తుత పాలనా వ్యవస్థలో జవాబుదారీతనం లోపించిందని ఎంత విమర్శించినా కూడా ఇబ్బంది లేదు. నిజానికి ఎంత ఎక్కువగా విమర్శిస్తే అంతగా ప్రస్తుత రాజ్యాంగంపట్ల ప్రజలలో విశ్వాసం పోతుంది కాబట్టి అది మంచి పనేనని భావిస్తారు. కానీ వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచడం కోసం కృషి చేయాలని అనగానే 'భ్రమలకు లోనవుతున్నాం' అనీ, ప్రజలలో వ్యవస్థ పట్ల భ్రమలు పెంచుతున్నాం అనీ ఆందోళన చెందుతారు. ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థలో ప్రజాస్వామ్యం, జవాబుదారీతనం, ఉన్నదానికంటె ఎక్కువ వున్నాయని నమ్మడం భ్రమే అవుతుంది. అంతా దీనిలోనే వుంది కాబట్టి ఇంక మార్పెందుకు అంటే అది భావజాలం అవుతుంది. కానీ ప్రజాస్వామ్యం, జవాబుదారీతనం ఉన్నాయనుకోవడమే భ్రమ కాదు. వాటిని పెంచగలమనుకోవడం భ్రమ కాదు. వాటిని ఏ మేరకు పెంపొందించగలిగితే ఆ మేరకు ప్రజలు నిత్యజీవితంలో హక్కులు అనుభవించ గలుగుతారనుకోవడం భ్రమ కాదు. ఇదంతా భ్రమ అనుకోవడం గడచిన పోరాటాల చరిత్రను, వాటి ఫలితంగా జరిగిన సంస్కరణల చరిత్రనూ తిరస్కరించడం అవుతుంది. పెంపొందించడం కోసం కృషి చేయడం అంటే ప్రజాస్వామ్యం ఎప్పటికీ ప్రస్తుత రూపంలోనే వుండిపోతుందని భావించడం కాదు. ఆ కృషి చేసే క్రమంలోనే కొత్త రూపాలు కూడ మన దృష్టికి రావచ్చు.

'వ్యవస్థ మౌలికంగా మారితేనే తప్ప న్యాయం జరగదు' అని నమ్మే ఉద్యమకారులకు ఈ విషయంలో ఒక సందిగ్ధం వుంటుంది. ప్రస్తుత వ్యవస్థలో ప్రజాస్వామ్యం ఏ మేరకు వుంటే ఆ మేరకు వాళ్ల పోరాటాలు సుగమం అవుతాయి. అయితే ప్రస్తుత వ్యవస్థలో ప్రజాస్వామ్యం ఏ మేరకు వుంటే ఆ మేరకు వాళ్ల పోరాటాలు ఆకర్షణను కోల్పోతాయి. అందుకే వాళ్లు తమ పోరాటాల అవసరం కోసం ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటూనే, ఈ వ్యవస్థలో ప్రజాస్వామ్యం సాధ్యం అనే 'భ్రమ' ప్రజలలో కలగకుండ జాగ్రత్తపడాలని నమ్ముతుంటారు. ఈ సందిగ్ధస్థితి నుండి వాళ్లు బయటపడగలరో లేదో కానీ పౌరహక్కుల ఉద్యమం దానికి బలి కావలసిన అవసరం లేదు. ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థలో జవాబుదారీతనాన్నీ తద్వారా ప్రజాస్వామ్యాన్నీ పెంపొందించే కృషి ఎంతవరకు సఫలం కాగలదనే విషయంలో ముందే గిరిగీసుకొని కూర్చోనవసరం లేదు. 'ఏదో సాధించేస్తామని భ్రమలు పెట్టుకోవద్దు' అని మనల్ని మనం ముందే హెచ్చరించుకోనవసరం లేదు. ఎంత సాధ్యమయితే అంత చేయాలి. ఎంత సాధ్యమవుతుందనేది పరిస్థితుల మీదనే కాక మనం చేసే కృషి మీద కూడ ఆధారపడి వుంటుంది. ఆ కృషి ఎంత చేస్తే అంత మేరకు 'పరిస్థితులు' కూడ మారతాయి. రాజ్యాంగ వ్యవస్థ ప్రజలకు ఇవ్వగల న్యాయం వాళ్లకు నిత్యజీవితంలో అందుతుంది. ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థ ఇవ్వలేని న్యాయాన్ని కొత్త రాజ్యాంగ వ్యవస్థను నెలకొల్పడం ద్వారా సాధించుకోవడానికి అవసరమయిన రాజకీయ స్వేచ్ఛను కాపాడడం

కోసం కూడ కృషి చేయాలి. ఇందులో మొదటి కృషివల్ల 'భ్రమలు' పెరిగి రెండవ కృషికి ఆటంకం కలుగుతుందేమోనని భయపడవలసిన పని పౌరహక్కుల ఉద్యమానికి లేదు. ఏ దశలోనయినా జరిగిన దానికంటే ఎక్కువ జరిగిందని నమ్మితే మాత్రమే భ్రమ అవుతుంది. అంతే తప్ప ప్రస్తుత రాజ్యాంగం పరిధిలో ప్రజాస్వామ్యమే భ్రమ కాదు. జవాబుదారీతనమే భ్రమ కాదు. అట్లా అనుకోవడం వాస్తవమూ కాదు, పౌరహక్కుల దృక్పథమూ కాదు. పౌరహక్కుల ఉద్యమం కృషివల్ల ప్రస్తుత ప్రజాస్వామ్యంలో ప్రజలకు విశ్వాసం పెరిగి 'మాకు విప్లవం వద్దు' అని అనుకుంటే పౌరహక్కుల ఉద్యమం బాధపడవలసిన పని లేదు. ఆ విశ్వాసమే పెరిగి కావాలనుకున్నా ఇబ్బంది లేదు.

6. ప్రస్తుత పాలనా వ్యవస్థలో ప్రజాస్వామ్యాన్నీ, జవాబుదారీతనాన్నీ పెంపొందించే కృషే తప్ప దాని పరిమితులనూ లోపాలనూ ప్రజలకు ఎత్తిచూపే కృషి అవసరం లేదా అని అడగవచ్చు. అది తప్పనిసరిగా అవసరమే. పెంపొందించే కృషిలో మొదటి అంశం ఆ విమర్శే.

ఈ విమర్శలో రెండు విషయాలుంటాయి. ఒకటి, ప్రస్తుత రాజ్యాంగంలోని ప్రజాస్వామ్యానికి స్వభావరీత్యానే వుండే పరిమితుల గురించి చెప్పడం. రెండు ఆచరణలో ఆ మేరకు కూడ అది పని చేయకపోవడాన్ని గురించి చెప్పడం. ఈ విమర్శల లక్ష్యం ప్రస్తుత రాజ్యాంగం పట్ల ప్రజలలో నమ్మకాన్ని పోగొట్టడం కాదు. ఆ పని చేయవలసిన అవసరం పౌరహక్కుల ఉద్యమానికి లేదు. విమర్శ లక్ష్యం ఈ వ్యవస్థలో ప్రజాస్వామ్యం ఏ మేరకు వుందో చెప్పడం, దానిని అమలు చేయించుకునే విధానాల గురించి చెప్పడం, ఈ రెండింటిలోనూ వున్న లోపాలను వివరించడం ద్వారా ఇకముందు సాధించుకోవలసిన ప్రజాస్వామ్యాన్ని గురించి చెప్పడం. ఆ సాధించుకోవడం అనేది ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థను సంస్కరించుకోవడం ద్వారా జరగవచ్చు, ప్రత్యామ్నాయ వ్యవస్థను నెలకొల్పడం ద్వారా జరగవచ్చు.

రాజ్యాంగ వ్యవస్థలో వుండి అమలులో అందకుండాపోతున్న హక్కుల అమలు కోర్టుల ద్వారా, ఆందోళనల ద్వారా, ప్రచారం ద్వారా, పాలనా వ్యవస్థపైన ఒత్తిడి పెట్టే వివిధ చర్యల ద్వారా సాధ్యం కాగలదు. మొత్తంగా జవాబుదారీతనాన్ని పెంచడం ద్వారా జరగగలదు.

రాజ్యాంగ వ్యవస్థలోనే లేని హక్కుల సాధన రాజకీయ ఉద్యమాల ద్వారానూ, సంస్కరణల ద్వారానూ జరగవలసి వుంటుంది. ఆ రాజకీయ ఉద్యమాలు ప్రస్తుత రాజ్యాంగాన్ని ఆమోదిస్తూ దానిని (అది అనుమతించే పద్ధతిలోనే) సవరించడం ద్వారా మెరుగుపరచాలని చూసే ఉద్యమాలు కావచ్చు. రాజ్యాంగ వ్యవస్థనే మౌలికంగా తిరగరాసే ఉద్యమాలు కావచ్చు. పౌరహక్కుల ఉద్యమం ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థనే అంతిమ వ్యవస్థగా భావించ నవసరమూ లేదు, దీనిని సవరించి ప్రజాస్వామీకరించే ప్రయత్నం భ్రమ అనీ కొట్టిపారేయ నవసరమూ లేదు. రెండు రకాల ప్రయత్నాలకూ అవకాశం వుండేటట్లు చూడడం కోసం పౌరహక్కుల ఉద్యమం కృషి చేయాలి. ఆ అవకాశం వుండాలంటే ప్రస్తుత రాజ్యాంగ

వ్యవస్థలో వున్న హక్కులను బలోపేతం చేయాలి, తృణీకరించడం కాదు. సంస్కరణల కోసమయినా బలోపేతం చేయాలి. ప్రత్యామ్నాయం కోసమైనా బలోపేతం చేయాలి. ఉన్న హక్కులను గట్టిగా నిలబెట్టడం ద్వారానే కొత్త హక్కులనూ, కొత్త వ్యవస్థనూ సాధించుకునే అవకాశాన్ని పౌరహక్కుల ఉద్యమం పెంపొందించగలుగుతుంది. 'ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థలో నిజమైన ప్రజాస్వామ్యం లేదు' అనే వైఖరి అవలంబించే పౌరహక్కుల ఉద్యమం ఈ వ్యవస్థను సంస్కరించడానికి గానీ మార్చడానికి గానీ అవసరమైన ప్రజాస్వామ్య అవకాశాన్ని కాపాడడానికి ఏమీ చేయలేదు. ఆ వైఖరి వాస్తవికమైనది కూడ కాదు. పౌరహక్కుల ఉద్యమం ఆ కర్తవ్యాన్ని నిర్వర్తించాలంటే ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థలోని ప్రజాస్వామిక అంశాలను గతకాలపు పోరాటాల విజయంగా గుర్తించి, వాటికి ప్రస్తుత వ్యవస్థలో వున్న స్థానాన్ని గౌరవించి, వాటిని కాపాడుకోవడం ఆ చరిత్రను గౌరవించే ప్రజాతంత్ర వాదులందరి కర్తవ్యం అని చెప్పవలసి వుంటుంది.

**అం**టే అది ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థను కూలదోసే రాజకీయ ప్రయత్నంతో గొంతు కలపకుండ, ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థలోని ప్రజాతంత్ర విలువలకు సంపూర్ణమైన అర్థం ఇచ్చే కృషిలో నిమగ్నం కావాలి. అదొక ప్రజాతంత్ర కృషి అని గుర్తించి నిమగ్నం కావాలి. ఆ రూపంగా మాత్రమే అది ప్రత్యామ్నాయ ప్రయత్నాలకు సహకరించగలుగుతుంది. ప్రత్యామ్నాయ ప్రయత్నాలకే కాక వ్యవస్థను సంస్కరించడం ద్వారా బాగు చేయవచ్చుననే రాజకీయ ఉద్యమాలకు కూడ తోడ్పడుతుంది. అయితే దీనికో దానికో తోడ్పడడం కోసం కాకుండ ఒక సూత్రబద్ధమైన కర్తవ్యంగా భావించి తన పని చేస్తుంది. ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం పోరాడే అవకాశం కూడ ఉండాలనడాన్ని 'తీవ్రవాదులకు సహకరించడం' అని ప్రభుత్వం నిందించవచ్చు. ప్రస్తుత వ్యవస్థలోని ప్రజాతంత్ర విలువలను గౌరవించి బలోపేతం చేయాలనడం విప్లవకారులకు 'సంస్కరణవాద భ్రమ'గా కనిపించవచ్చు. ఎవరేమన్నా పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యం ఇదే.

**ఈ** రాజ్యాంగ వ్యవస్థలో ప్రజాస్వామ్యం లేదని నమ్మే నక్సలైట్ విప్లవకారుడిని పోలీసులు పట్టుకొని కాల్చి చంపి 'ఎన్‌కౌంటర్' జరిగిందంటారనుకోండి. ఆ హత్యపట్ల నిరసన తెలిపేటప్పుడు 'ఈ వ్యవస్థలో ప్రజాస్వామ్యం లేదని ఇప్పుడు రుజువు అయిపోయింది' అని వ్యాఖ్యానించవచ్చు. అది నక్సలైట్ రాజకీయాలకు తోడ్పడే వ్యాఖ్య. ప్రత్యామ్నాయ రాజ్యాంగ వ్యవస్థవైపు ప్రజలను ఆకర్షించే వ్యాఖ్య. లేకపోతే, 'పట్టుకున్న వ్యక్తిని కాల్చి చంపడానికి వీలు లేదు. అది రాజ్యాంగంలోని ఒక ప్రజాతంత్ర విలువ. గతంలో ప్రజలు పోరాటం చేసి సాధించుకున్న విలువ. ఈ ప్రభుత్వం దానిని అతిక్రమిస్తూ వుంది. దానిని కాపాడుకుందాం' అని వ్యాఖ్యానించవచ్చు. ఇది పౌరహక్కుల వ్యాఖ్య. ఈ ప్రచారం ద్వారా చారిత్రకంగా సంక్రమించి రాజ్యాంగ వ్యవస్థలో భాగమైన ప్రజాస్వామ్య విలువలను ప్రభుత్వ దుశ్చర్యల నుండి కాపాడుకోవాలనే సంకల్పాన్ని ఏ మేరకయితే సమాజంలో బలోపేతం చేస్తామో ఆ మేరకు ప్రజాస్వామ్యాన్ని పెంపొందిస్తాం. నక్సలైట్లతో సహా అన్నిరకాల

పోరాటకారులకూ పోరాడే అవకాశాన్ని పెంపొందిస్తాం. అయితే నక్సలైట్ రాజకీయాలకు సహకరించం. ఎందుకంటే ఈ వ్యవస్థలో న్యాయం లేకపోలేదనే అభిప్రాయం కూడ అదే క్రమంలో పెంచుతాం. అందుకే 'భ్రమలు పెంచొద్దని' నక్సలైట్ పార్టీలు పౌరహక్కుల ఉద్యమాన్ని హెచ్చరిస్తుంటాయి. మరొకవైపు ఈ వ్యవస్థలో ప్రజాస్వామ్యం లేదనే వాళ్లతో కూడా ఈ వ్యవస్థ ప్రజాస్వామికంగా వ్యవహరించాలని మీరు అంటున్నారు కాబట్టి మీరూ తీవ్రవాదులే అని ప్రభుత్వం అంటుంది. ప్రజాస్వామ్యాన్ని ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థకు లోబడి బ్రతికే వాళ్లకే పరిమితం చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ప్రస్తుత వ్యవస్థలో ప్రజాస్వామ్యమేమీ లేదని చెప్పడం కోసమే ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడాలని నక్సలైట్ ఉద్యమకారులు భావిస్తారు. పౌరహక్కుల ఉద్యమం ఈ రెండు కోర్కెలూ తీర్చలేదు. వాళ్ల అవసరాలకూ, వీళ్ల ఎత్తుగడలకూ ఉపయోగపడలేదు. ప్రజాస్వామ్యాన్ని పెంపొందించే కృషిని ఒక సూత్రబద్ధమైన కర్తవ్యంగా భావిస్తుంది.

అయితే రాజ్యాంగ వ్యవస్థలో లేని హక్కుల సాధన ఉద్యమాల ద్వారానే కాక సంస్కరణల ద్వారా కూడా జరగగలదు. ప్రజాస్వామ్య వ్యవస్థలాగే సంస్కరణలను కూడ 'భ్రమ, భావజాలం' అని కొట్టి పారేసే వైఖరి ఒకటి ఉంది. అది తప్పు. సంస్కరణలలో లేనిదానిని చూపిస్తే, ఉన్నదాని కంటే ఎక్కువ వున్నట్టు చూపిస్తే అది భ్రమ అవుతుంది. అంతా వుంది కాబట్టి ఇక ఉద్యమాలెందుకు అని దబాయిస్తే అది భావజాలం అవుతుంది. కాని సంస్కరణే భ్రమ కాదు, భావజాలం కాదు.

ప్రజాఉద్యమాల నుండే సంస్కరణలు వస్తాయి కాబట్టి సంస్కరణల గురించి విడిగా ఆలోచించనవసరం లేదనీ, ఉద్యమించే హక్కు గురించి ఆలోచిస్తే చాలనీ కూడ వాదించవచ్చు. ఇది పాక్షిక సత్యం మాత్రమే. ఏ ఉద్యమమూ లేకపోతే సంస్కరణలు రావనేది ఒక చారిత్రక సత్యంగా (కొన్ని మినహాయింపులున్నప్పటికీ) ఒప్పుకోవచ్చు. కానీ ప్రతీ సంస్కరణ వెనక ఆ సంస్కరణనే డిమాండ్ చేసిన ఒక ఉద్యమం ఉండి తీరుతుందనేది సత్యం కాదు. సాధారణంగా జరిగేది ఏమిటంటే ఉద్యమాలు నిర్దిష్టమైన డిమాండ్లతో పాటు కొన్ని కొత్త విలువలనూ ఒక కొత్త భావ వాతావరణాన్నీ తీసుకొస్తాయి. ఆ వాతావరణంలో ఆ డిమాండ్లను దాటిపోయే సంస్కరణలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రజాతంత్రవాదులూ పౌరహక్కుల ఉద్యమాలూ వ్యవస్థను విమర్శించడమే ఏకైక కర్తవ్యంగా పెట్టుకుని సంస్కరణలకు ఉండే అవకాశాన్ని విస్మరించడం వల్ల ఈ అవకాశం పూర్తిగా సద్వినియోగం కావడం లేదు. రాజకీయ పక్షాలకు అవసరం ఉన్న మేరకు, లేదా సదుద్దేశాలున్న బ్యూరోక్రాట్లు పదవులలో ఉన్న మేరకు ఇది వినియోగం అవుతున్నది. పౌరహక్కుల ఉద్యమం ఈ అవకాశాన్ని సృజనాత్మకంగా వాడుకుంటే తన కర్తవ్యానికి మేలు చేయగలుగుతుంది.

7. రాజ్యాన్ని గురించి, సామాజిక ఆర్థిక వ్యవస్థ గురించి పౌరహక్కుల ఉద్యమానికి ఉండవలసిన అవగాహన గురించి కూడ కొన్ని అభిప్రాయాలు ప్రచారంలో ఉన్నాయి. మనది 'వర్గ సమాజం' అని పౌరహక్కుల ఉద్యమం గుర్తించాలని చాలామంది

అంటుంటారు. పౌరహక్కుల ఉద్యమం దాన్ని గుర్తిస్తుంది. అయితే కేవలం వర్గసమాజం అనే కాదు. వర్గం, కులం, లింగం మొదలయిన అనేక రూపాల వ్యవస్థీకృత అసమానతలున్న సమాజంగా గుర్తిస్తుంది. అంతే కాదు, ఈ వ్యవస్థీకృత అసమానత నుండి, అణచివేత నుండే హక్కుల లేమి, అతిక్రమణ, ఉల్లంఘన పుడతాయని కూడ గుర్తిస్తుంది.

అయితే మొదట్లో చెప్పినట్టు ఈ ఆధిపత్య వ్యవస్థలలో ఏ ఒక్కదానినీ (వర్గమైనా ఇంకొకటయినా) మిగిలిన వాటికంటే ప్రధానం లేక ప్రాథమికం అని పౌరహక్కుల ఉద్యమం భావించనవసరం లేదు. ఆ వివాదాన్ని రాజకీయ చర్చకు వదిలేసి ఒక్కొక్క రకమైన ఆధిపత్య వ్యవస్థకు ఉండే ప్రత్యేక లక్షణాలను, ఆ ప్రత్యేక లక్షణాల నుండి పుట్టే ప్రత్యేకమైన హక్కుల లేమినీ అతిక్రమణనూ ఈ ఉద్యమం అధ్యయనం చేస్తుంది. ఆ అధ్యయనం వెలుగులో ఆయా రంగాలలో హక్కులను పెంపొందించడంలోనూ పరిరక్షించడంలోనూ తాను నిర్వహించవలసిన కర్తవ్యాలను రూపొందించుకుంటుంది.

ఈ ఆధిపత్య వ్యవస్థలకు వ్యతిరేకంగా చరిత్రలో అనేక పోరాటాలు జరిగాయి. హక్కులు పుట్టాయి. సంస్కరణలు జరిగాయి. వాటి ప్రభావం ఈ వ్యవస్థలపైన ఉంది. వాటిలోని ఆధిపత్యం ఆ ప్రభావం వల్ల ఒక మేరకు బలహీనపడింది. ఆ ప్రగతిని కాపాడడానికి కృషి చేయడం, అది తిరోగమించకుండ చూడడం పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యాలలో ఒకటి. మరిన్ని సంస్కరణల ద్వారా, పోరాటాల ద్వారా ఈ వ్యవస్థల చేత పీడితులయిన వారు స్వేచ్ఛా స్వాతంత్రాలను, సమాన అవకాశాలను, స్థితిగతులను పొందే అవకాశాన్ని సజీవంగా ఉంచడానికీ మెరుగుపరచడానికీ కూడ పౌరహక్కుల ఉద్యమం కృషి చేయాలి.

అంతేగానీ వర్గదోపిడీయే ప్రధానమైన అణచివేత రూపమనీ మన సమాజాన్ని వర్గ సమాజంగా అర్థం చేసుకోవడమే సరైనదనీ భావించడం పౌరహక్కుల ఉద్యమం అవగాహన కాదు. ఆ అవగాహన పౌరహక్కుల ఉద్యమాన్ని సంకుచితం చేస్తుంది.

మరి రాజ్యం సంగతి? రాజ్యం అనగానే చాలామంది పౌరహక్కుల ఉద్యమకారులకు రాజ్యహింస గుర్తుకొస్తుంది కాబట్టి ముందు రాజ్యహింస గురించి రెండు మాటలు చెప్పుకుందాం. నక్సలైట్ ఉద్యమం పైన రాజ్యం ప్రయోగించిన హింసను వ్యతిరేకించడంతో పౌరహక్కుల ఉద్యమం తన కృషిని ప్రారంభించింది కాబట్టి తొలినాడు రాజ్యహింసే ముఖ్యమయిన పౌరహక్కుల సమస్య అని భావించిందంటే అర్థం ఉంది. సిపిఐ (ఎం–ఎల్) పార్టీలు రాజ్యాధికారం కోసం రాజ్యంతో తలపడుతున్నాయి కాబట్టి ఇప్పటికీ పౌరహక్కుల ఉద్యమం రాజ్యహింసకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆ పార్టీలూ ఆ పార్టీల మేధావులూ భావించడంలోనూ అర్థం ఉంది. కానీ పౌరహక్కుల ఉద్యమకారులు సహితం రాజ్యహింసే ప్రధాన పౌరహక్కుల సమస్య అనుకోవడం సబబా? హింస అంటే భౌతిక హింసే కాదని అందరూ ఒప్పుకుంటారనుకుంటాను. ఒక వ్యక్తిని పోలీసులు పట్టుకొని హింసించి చంపితే అది ఎక్కువ హింసా, లేక 'నువ్వు అంటరాని మనిషివి' అని వెలివేస్తే ఎక్కువ హింసా? ఈ

ఈ రకంగా కొలతలూ తూకాలూ వేసి ఏది ప్రధానం అని నిర్ణయించడం కష్టమనుకుంటే, కనీసం అన్ని రకాల అణచివేత వ్యవస్థలనూ ఒకే ప్రాతిపదికన చూసి సమదృష్టితో పనిచేయడం అవసరం. ఒకే ప్రాతిపదికన చూడడమంటే అన్నిటి స్వభావం ఒకటేననుకోవడం కాదు.

తూకం ఎట్లా వేయాలి? ఒకవేళ భౌతికహింసే ఎక్కువ హింస అనుకున్నా, కుటుంబ వ్యవస్థ పెట్టే ఒత్తిడుల ఫలితంగా హత్యలకూ ఆత్మహత్యలకూ బలి అవుతున్న స్త్రీల సంఖ్య రాజ్యం చేతిలో చనిపోతున్న వారి సంఖ్యకు దాదాపు 20 రెట్లు ఉందని మనకు తెలుసు కదా. అప్పుడు కుటుంబ హింస రాజ్యహింస కంటే 20 రెట్లు తీవ్రమైన సమస్య కాదా?

ఈ రకంగా కొలతలూ తూకాలూ వేసి ఏది ప్రధానం అని నిర్ణయించడం కష్టమనుకుంటే, కనీసం అన్ని రకాల అణచివేత వ్యవస్థలనూ ఒకే ప్రాతిపదికన చూసి సమదృష్టితో పనిచేయడం అవసరం. ఒకే ప్రాతిపదికన చూడడమంటే అన్నిటి స్వభావం ఒకటేననుకోవడం కాదు. నిజానికి దేని స్వభావం దానికి ఉంటుంది. పౌరహక్కుల ఉద్యమం చేయగల కృషి కూడ ఒక్కొక్క విషయంలో ఒక్కొక్క రకంగా ఉంటుంది. కానీ ప్రాధాన్యత ఒకటిగా ఉండాలి.

8. కాగా, రాజ్యం అంటే హింసేననుకోవడం సమగ్రమైన అవగాహన కాదు. రాజ్యం ప్రధానంగా చేసే పని సామాజిక వ్యవస్థలను కాపాడడం, స్థిరీకరించడం. దీని కోసం అది అనుల్లంఘనీయమైన నియమాలను ప్రకటిస్తుంది. (ఆధునిక కాలంలో ఇవి చట్టాల రూపంలో ఉంటాయి ) వాటిని నిర్బంధంగా అమలు చేస్తుంది. ఈ నిర్బంధంలో ఒక అంశం భౌతిక హింస.

ఈ మేరకు రాజ్యం అణచివేతను కాపాడే సాధనం. పీడితులకు శత్రువు.

అయితే రాజ్యంపైన వేరే రకమైన ఒత్తిడి కూడ ఉంటుంది. సామాజిక వ్యవస్థల చేత అణచివేతకు గురయ్యే పీడితులు వాటికి వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న విజయాలకు రాజ్యం గుర్తింపు ఇవ్వాలని (అంటే అణచివేతను ఆ మేరకు అదుపు చేసే చట్టాలు చేసి వాటిని కూడ నిర్బంధంగా అమలు చేయాలని) కోరుకుంటారు. ఆ విధంగా, వ్యవస్థలను కాపాడే రాజ్యం వ్యవస్థలలో వచ్చిన సంస్కరణలను కూడ కాపాడవలసి వస్తుంది. సంస్కరణలు కూడా 'వ్యవస్థ'లో భాగం అయిపోతాయి కాబట్టి అది కూడ దాని కర్తవ్యం అవుతుంది. మొదటి అవతారంలో రాజ్యం పీడిత ప్రజలకు శత్రువు. రెండవ అవతారంలో మిత్రుడు. ఇళ్లస్థలాలు లేని దళితులు రోడ్డు పక్కన గుడిసెలు వేసుకుంటే అది చట్టవిరుద్ధమైన ఆక్రమణ అని చెప్పి గుడిసెలు తొలగించడానికి బయలుదేరి వచ్చే రాజ్యాంగ యంత్రం

దళితుల దగ్గరికి శత్రువుగా వస్తుంది. అదే దళితులను సవర్ణులు కులం పేరిట దూషించినా కొట్టినా వాళ్ల మీద ఎస్.సి, ఎస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టం కింద కేసు పెట్టమని దళితులు రాజ్యానికి ఫిర్యాదు ఇచ్చినప్పుడు కులపరమైన అణచివేత నుండి తమను కాపాడే బాధ్యతగల మిత్రుడిగా రాజ్యం దగ్గరకు పోతారు. అన్ని పీడిత ప్రజాబృందాలూ రాజ్యాన్ని ఈ రెండు రూపాలలోనూ ఎదుర్కుంటాయి

వీటిలో మొదటి కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో చూపించే ఉత్సాహం రెండవ కర్తవ్యం నిర్వర్తించడంలో రాజ్యం చూపించదు. దానిపైన ఆధిపత్య శక్తుల ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం, ఒత్తిడి ఉంటాయి. ఈ ద్వంద్వ వైఖరిని చూపించి 'రాజ్యం మీకు ఏమైనా చేస్తుందన్న భ్రమలు వదులుకోండి' అని ప్రజలకు ఉద్బోధించడం కన్నా, ఈ ద్వంద్వ వైఖరిని పోగొట్టడం కోసం, ప్రజల హక్కుల పట్ల తనకున్న 'బాధ్యతను' రాజ్యం నిర్వర్తించేటట్లు చూడడం కోసం పౌరహక్కుల ఉద్యమం కృషి చేయడం ఉచితంగా ఉంటుంది. ఆ కృషి మొత్తంగా విజయం సాధించకపోవచ్చు. కానీ అసలే సాధించకుండ పోదు. సాధించిన మేరకు అది ప్రజలకు రక్షణ కల్పిస్తుంది. అంటే రాజ్యం ప్రజలకు శత్రువు అనే విషయాన్ని సందర్భోచితంగా చెప్పినట్టే, అది ఎక్కడ మిత్రుడిగా వ్యవహరించాలో అక్కడ ఆ కర్తవ్యాన్ని ప్రజల హక్కుగా గుర్తించి ఒత్తిడి పెట్టడం అవసరం.

రాజ్యం అణచివేత వ్యవస్థల సంరక్షణకు తనను తాను జవాబుదారు చేసుకుంది కాబట్టి ఆ వ్యవస్థలలోని అన్యాయానికి కూడ జవాబుదారు కావలసి వచ్చింది. ఇది కాలక్రమంలో రాజ్యానికి సంక్షేమ బాధ్యతను కట్టబెట్టింది. అన్యాయానికి గురయిన వాళ్లు హింసకు పాల్పడడానికి వీలు లేదని శాసించిన రాజ్యం ఆ అన్యాయాన్ని ఒక మేరకయినా అదుపు చేసే సంక్షేమ బాధ్యతను తన మీద వేసుకోక తప్పలేదు. పాశ్చాత్య దేశాలలో వామపక్ష ఉద్యమాలు (తమ విమర్శ ద్వారాను, పోరాటాల ద్వారాను) ఈ మార్పుకు చాలా దోహదం చేశాయి. కార్మిక చట్టాలు ఈ క్రమంలోనే వచ్చాయి. మనబోటి మూడవ ప్రపంచ దేశాలలో సంక్షేమ చట్టాలు ఇంకా ఎక్కువే ఉన్నాయి. వీటి అమలు విషయంలో కూడ ఒత్తిడి లేనిదే పని జరగదన్న నీతి వర్తిస్తుంది. అది పౌరహక్కుల ఉద్యమం చేపట్టవలసిన ఒక కృషి. ఈ కృషిలో రాజ్యాన్ని పీడిత ప్రజల శత్రువుగా కాక సంక్షేమ బాధ్యత నిర్వర్తించడం ద్వారా వాళ్ల ప్రయోజనాలను కాపాడవలసిన శక్తిగా చూడాలి. ఈ బాధ్యతను మొత్తంగానే తొలగించడానికి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రంగా ఒత్తిడి పెడుతున్న ప్రస్తుత దశలో దానినొక అర్థవంతమైన ప్రజాతంత్ర విలువగా గుర్తించి కాపాడుకునే కృషి చేయాలి. అంతేగానీ 'ఆ బాధ్యత ఒట్టి బూటకం అని ఇప్పుడు రుజువయిపోయింది' అని దానిని కొట్టి పారేయడం పౌరహక్కుల ఉద్యమానికి తగిన వైఖరి కాదు.

వలసలుగా ఉండి వలసపాలన నుండి విముక్తి పొందిన మూడవ ప్రపంచ దేశాలలో రాజ్యానికి సంక్షేమ కర్తవ్యంతో పాటు అభివృద్ధి సాధించే కర్తవ్యం కూడ వచ్చింది. ఇందులో సోషలిస్టు ప్రభావం చాలా ఉంది. పెట్టుబడిదార్ల ఆస్తులనూ లాభాలనూ కాపాడే బాధ్యత తన

మీద వేసుకున్న రాజ్యం, ఆ పెట్టుబడిదార్లకు లాభసాటిగా కనిపించని అభివృద్ధి పనులు తానే చేపట్టవలసి వచ్చింది. తమ ఊరికి రోడ్డు వేయమనీ తమ పొలాలకు సాగునీరు ఇచ్చే ఆనకట్టలు కట్టమనీ ప్రజలు ప్రభుత్వాన్ని కోరేటప్పుడు రాజ్యాన్ని శత్రువుగా కాక అభివృద్ధి సాధించే ప్రజానుకూల శక్తిగా చూస్తారు. ఈ కర్తవ్యంలో కూడ బలవంతుల పట్ల పక్షపాతం ఉంటుంది కాబట్టి దీనిని కూడ భ్రమ అని కొట్టిపారేయొచ్చు. దాని బదులు రాజ్యానికి ఉండే ఈ అభివృద్ధి కర్తవ్యాన్ని పెట్టుబడిదారీ లాభార్జన సూత్రాన్ని అదుపు చేసే ఒక ప్రజాతంత్ర విలువగా గుర్తించి కాపాడుకోవడానికి కృషి చేయడం పౌరహక్కుల ఉద్యమానికి ఉచితమైన వైఖరి అవుతుంది.

**మ**రొక విషయం కూడ చెప్పుకోవాలి. రాజ్యం ఏ కర్తవ్యాలు నిర్వర్తిస్తుందనేది ఎంత ముఖ్యమో అది ఆ కర్తవ్యాలను ఏ పద్ధతిలో నిర్వర్తిస్తుందనేది కూడ అంతే ముఖ్యం. సామాజిక వ్యవస్థలన్నిటినీ బల ప్రయోగంతో కాపాడే కర్తవ్యంతో పాటు ఆ వ్యవస్థలోని సంస్కరణలను కాపాడడం, సంక్షేమాన్ని అందియ్యడం, అభివృద్ధి సాధించడం కాలక్రమంలో రాజ్యం కర్తవ్యాలుగా మారాయని చూసాం. అదే విధంగా ఈ కర్తవ్యాలను నిర్వర్తించే పద్ధతిలో కూడ మార్పులు వచ్చాయి. ఏక వ్యక్తి నియంతృత్వం నుండి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం దాకా పరిపాలనా పద్ధతులు మారాయి. పరిపాలనా విధానాలలో ప్రజాస్వామ్యం పెరిగే కొద్దీ రాజ్యం ప్రజల అవసరాలకు (ఆ మేరకు) తలఒగ్గక తప్పదు. సంస్కరణలకు చోటు పెరుగుతుంది. అప్పుడా సంస్కరణల అమలుకు అవకాశం పెరుగుతుంది. మార్పు సాధించుకునే రాజకీయ స్వేచ్ఛ పెరుగుతుంది. చట్టసభలే చట్టాలు చేయాలనీ ఆ చట్టాలు ప్రజల ప్రాథమిక హక్కులకు లోబడి వుండాలనీ ఆ చట్టాల ప్రకారమే పరిపాలన జరగాలనీ అది జరుగుతున్నదీ లేనిదీ పర్యవేక్షించే స్వతంత్రమైన అధికారం న్యాయస్థానాలకు వుండాలనీ ఈ వ్యవస్థను నిర్భయంగా విమర్శించే స్వాతంత్ర్యం ప్రజలకుండాలనీ ఈ ప్రజాస్వామ్యం అంటుంది. ఇది చెప్పుకోవడానికి ఉన్నంత గంభీరంగా ఆచరణలో వుండదని మనకు తెలుసు. అయినప్పటికీ ఇది రాజ్యానికి ప్రజలపట్ల ఇచ్చే జవాబుదారీతనం వట్టి బూటకం కాదు. రాజ్యం కర్తవ్యం ఒకటే అయినా ఆ జవాబుదారీ తనం ప్రజలకు ప్రజాస్వామిక అవకాశాలు ఇస్తుంది. వాటిని పెంపొందించుకునే కృషి ఒక అర్థవంతమైన కృషి, ఒక అవసరమైన కృషి, పౌరహక్కుల ఉద్యమం చేపట్టవలసిన కృషి.

**కా**బట్టి పౌరహక్కుల దృక్పథానికి రాజ్యం అంటే వట్టి అణచివేత కాదు, వట్టి హింస కాదు. రాజ్యం అంటే ఇవన్నీ, ఇదంతా కూడా.

రాజ్యంలో ప్రజాస్వామ్యం కోసం వెతికే బదులు, ప్రజలు తమ జీవితాలను తామే పరిపాలించుకునే స్థితి కోసం పౌరహక్కుల ఉద్యమం కృషి చేయకూడదా అని అడగవచ్చు. ఈ విషయాన్ని వివరంగా చర్చించడానికి ఇది సందర్భం కాదు. కానీ ఒకటి మాత్రం చెప్పవచ్చు. రాజ్యాంగ వ్యవస్థలో ప్రజాస్వామ్యం పెరిగేకొద్దీ ప్రజలకు స్వయంపరిపాలన మరింత చేరువ అవుతుంది కాబట్టి దానిని గౌరవించడం, కాపాడుకోవడం అవసరం.

కె. బాలగోపాల్

9. పోరాడే హక్కు అన్ని హక్కులకూ ప్రామాణికం కాకపోయినా అది చాలా ముఖ్యమైన హక్కు. పౌరహక్కుల ఉద్యమం దానిని సమర్థిస్తుంది, దానిని కాపాడడానికి కృషి చేస్తుంది.

అయితే పోరాడే హక్కును సమర్థించడం అంటే, ఉద్యమక్రమంలో పోరాటకారులు చేపట్టే అన్ని చర్యలనూ సమర్థించడం, వాళ్లు సమాజాన్ని గురించి చేసే వ్యాఖ్యానాలన్నిటినీ సమర్థించడం, వాళ్ల పోరాట పంథానూ వ్యూహాలనూ ఎత్తుగడలనూ సమర్థించడం అని కాదు.

పౌరహక్కుల ఉద్యమం సమర్థించేది పోరాడే హక్కును, పోరాట లక్ష్యాలలోని ప్రజాస్వామిక అంశాలను – అంటే ఆధిపత్యాన్నీ అసమానతనూ తిరస్కరించి సమానత్వాన్ని పెంచే అంశాలను. సమర్థించడమే కాక, పోరాట హక్కును కాపాడడానికి, పోరాట లక్ష్యాలలోని ప్రజాస్వామిక అంశాలను సమాజంలో చర్చకు పెట్టి వాటికి సామాజిక ఆమోదం కల్పించడానికి కూడా పౌరహక్కుల ఉద్యమం కృషి చేస్తుంది.

అయితే పోరాటాలలో ఇవే కాక వేరే విషయాలు చాలా వుంటాయి. వ్యూహాలు, ఎత్తుగడలు, సిద్ధాంత వ్యాఖ్యలు, మొదలయినవి వుంటాయి. వాటిని సమర్థించడం, వాటికి సమాజంలో మద్దతు సంపాదించడం పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యం కాదు. పోరాట లక్ష్యాలలోని ప్రజాస్వామిక అంశాలకు సామాజిక మద్దతు సమీకరించడం వరకే పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యం. ఈ పని విజయవంతంగా చేయాలంటే అది స్వతంత్రంగా పని చేయాలి. పోరాటాల నిర్మాణం నుండి, వ్యూహాల నుండి స్వతంత్రంగా వుంటేనే పోరాట లక్ష్యాన్ని సమాజంలో చర్చకు పెట్టి పోరాడే హక్కుకు మద్దతు సమీకరించగలుగుతుంది.

స్థూలంగా చెప్పాలంటే పీడిత ప్రజల అవసరాల నుండీ ఆకాంక్షల నుండీ పుట్టే ప్రతీ రాజకీయ ఉద్యమంలోనూ రెండు అంశాలుంటాయి. ఒకటి, ఆ ఉద్యమ ఆకాంక్ష, అందులోని ప్రజాస్వామ్య విలువలు. రెండు, ఆ ఉద్యమానికి ప్రత్యేకమైన రాజకీయ అవగాహన, పంథా, వ్యూహాలు, ఎత్తుగడలు. పౌరహక్కుల ఉద్యమానికి మొదటి అంశంతోనే గానీ రెండవ దానితో అవసరం లేదు. రెండవదాని నుండి ఎంత దూరం వుంటే మొదటి విషయంలో అంత మేలు చేయగలుగుతుంది. అంతే కాదు, ఈ రెండవ విషయంలో పౌరహక్కులకూ ప్రజాస్వామ్య విలువలకూ నష్టకరమైనది ఏమైనా వుంటే దానిని విమర్శించాలి కూడ. దానిని సవరించుకొమ్మని సూచనలు, సలహాలు ఇవ్వాలి కూడ. ఉద్యమ లక్ష్యాలలోని ప్రజాస్వామ్య విలువలను మనం గౌరవిస్తాం. సమాజంలో వాటికి మద్దతు సమీకరిస్తాం. కాని ఉద్యమ పంథాకు గానీ విధానాలకు గానీ సమాజంలో మద్దతు సమీకరించవలసిన పని లేదు. అంతేకాక అందులో ప్రజాస్వామ్య దృక్పథానికి అభ్యంతరకరంగా కనిపించిన విషయాలను విమర్శిస్తాం కూడ.

ఎందుకు విమర్శించాలి? పౌరహక్కుల పరిభాష ప్రధానంగా న్యాయాన్యాయాల పరిభాష. వ్యవస్థలో ఎక్కడ అన్యాయం వున్నా ఆ అన్యాయాన్ని మనం వ్యతిరేకించడమే కాక, అన్యాయానికి వ్యతిరేకంగా ఉద్యమించే హక్కు ప్రజలకు వుందని చెప్తాం. దానిని కాపాడడానికి కృషి చేస్తాం. అటువంటప్పుడు అన్యాయానికి వ్యతిరేకంగా పుట్టిన ఉద్యమాలు తామే అన్యాయంగా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోవడం పౌరహక్కుల ఉద్యమానికి తగదు. అటువంటి చర్యలను విమర్శించవలసిందే. ప్రయోజనాలు, లేక అవసరాల పరిభాషలో మాట్లాడే ఉద్యమమయితే మౌనంగా వుండగలదు. కాని విలువల పరిభాషలో మాట్లాడే ఉద్యమం మౌనంగా వుండజాలదు. పౌరహక్కుల ఉద్యమం విలువల పరిభాషలో మాట్లాడుతుందంటే అర్థం అది సమాజంలోని విభిన్న ప్రయోజనాలనూ అవసరాలనూ పరిగణనలోకి తీసుకోదని కాదు. తీసుకుంటుంది. తీసుకొని కూడ ప్రయోజనాల పరిభాషలో కాక విలువల పరిభాషలో మాట్లాడుతుంది. అటువంటి ఉద్యమం విలువలకు భంగం కలిగినప్పుడు మౌనంగా వుంటే దాని మాటలకే విలువ లేకుండా పోతుంది. తన కర్తవ్యంలో విఫలం అవుతుంది కూడ. అటువంటి సందర్భాలలో మౌనంగా వుండడానికి వీలు లేదు. విమర్శించాల్సిందే.

ఈ విమర్శ పౌరహక్కుల ఉద్యమంలో చాలామందికి మింగుడుపడని విషయం అయింది. అది మింగుడుపడక పోవలసిన అవసరమేమీ లేదు. నిజానికి మింగుడుపడక పోవడం కొన్ని సందర్భాలలో మాత్రమే జరుగుతున్నది. సి.పి.ఐ. (ఎం.ఎల్) పార్టీలు పాల్పడే అప్రజాస్వామిక చర్యలను విమర్శించడం చాలామందికి మింగుడుపడడం లేదు. ఉద్యమించే హక్కును గుర్తిస్తున్నామంటూ ఉద్యమాల చర్యలను విమర్శించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కానీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి లక్ష్యాన్ని సమర్థిస్తూ కూడ, వాళ్ల ప్రచారంలో వాళు మాలలను తమ ప్రధాన శత్రువులుగా చూపించడాన్ని మనం విమర్శించినప్పుడు అది మనకు సులభంగానే మింగుడుపడింది. 'సమర్థిస్తున్నామంటూ విమర్శించడం సబబా?' అని ఎవరికీ సందేహం రాలేదు. లక్ష్యాన్ని సమర్థించడానికీ పద్ధతులను విమర్శించడానికీ మధ్య వైరుధ్యం వుందని అప్పుడు ఎవరికీ అనిపించలేదు. నిజానికి వాటి మధ్య వైరుధ్యమేమీ లేదు. తెలంగాణ ఉద్యమకారులు తమ ప్రాంతానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఉద్యమించడం న్యాయమయిన పోరాటమేననీ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం డిమాండ్ చేయడం కూడా ఒక హక్కేననీ ఒప్పుకుంటూ కూడ మనం ఆ ఉద్యమం ఆ ప్రాంతాలకు చెందిన పేద, దళిత, పీడిత వర్గాలకు ఏం చేయనుందని నిలదీసాం. కరపత్రాలలోనూ ఉపన్యాసాలలోనూ ఈ ప్రశ్న వేసాం. ఇది అసంబద్ధమైన విమర్శ అని పౌరహక్కుల సంఘం సభ్యులెవరూ అభ్యంతరం చెప్పలేదు. నిజానికి ఈ విమర్శలో అసంబద్ధత ఏమీ లేదు.

ఉద్యమాలను విమర్శించడాన్ని దిగమింగలేకపోవడం ఒక్క నక్సలైట్ల విషయంలోనే. అప్పుడు మాత్రమే తాత్విక సందేహాలు వస్తున్నాయి. 'ఉద్యమించే హక్కునూ ఉద్యమ లక్ష్యాన్నీ సమర్థిస్తున్నామంటూ ఉద్యమాల చర్యలను విమర్శించడం శత్రువుతో చేతులు కలపడం

కాదా?' అనీ 'అది ప్రజల మనోనిబ్బరాన్ని నీరుకార్చదా?' అనీ సందేహాలు వస్తున్నాయి. ఆ ఒక్క సందర్భంలో మాత్రమే సందేహాలు వస్తున్నాయి కాబట్టి అవి తాత్విక సందేహాలు కావనేది స్పష్టమే. అవి ఆ ఉద్యమాల ప్రయోజనాలు దెబ్బతింటాయన్న ఆందోళనతో లేవదీస్తున్న అభ్యంతరాలు. సిపిఐ (ఎంఎల్) పార్టీల సభ్యులు, అనుయాయులు, ఆ పార్టీల క్రమశిక్షణకు లోబడి వుండేవారు చాలామంది పౌరహక్కుల ఉద్యమ కార్యకర్తలుగా వున్నారు. ఆ పార్టీల ప్రయోజనాలకు పౌరహక్కుల ఉద్యమం ఉపయోగపడాలే తప్ప వాటి అప్రజాస్వామిక ప్రవర్తనను విమర్శించడం ద్వారా వాటి ప్రయోజనాలను దెబ్బతీయడానికి వీలులేదని అడ్డంపడుతున్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యకర్తలొక వందమంది, ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారులొక వందమంది పౌరహక్కుల సంఘంలో సభ్యులుగా వుండివుంటే ఆ ఉద్యమాలను విమర్శించడం కూడ పౌరహక్కుల సంఘానికి సాధ్యం అయ్యేది కాదు.

10. 'ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి తమకు తోచిన మార్గాలు ఎంచుకుంటారు. వాటిని విమర్శించడానికి మనం ఎవరు?' అనేది ఈ సందర్భంలో తరచుగా వినిపించే వాదన.

ప్రజల సమస్యల నుండి పుట్టిన ఉద్యమాలు చేసే పనులన్నిటినీ 'ప్రజలు చేసే పనులు' అనడం సరయినది కాదు. అయితే ఒకవేళ ప్రజలే ఆ నిర్ణయం (మెజారిటీగానయినా ఏకగ్రీవంగానయినా) చేసినా అది అప్రజాస్వామికం అయితే విమర్శించవలసిందే. ఒక ఊరి ప్రజలందరూ కలిసి ఒక వ్యక్తికి చేయని తప్పుకు శిక్షవేస్తే ఆ పని ప్రజలు చేసారు కాబట్టి విమర్శించకూడదని ఊరుకోము.

అయితే ప్రజా ఉద్యమాలు చేసే పనులన్నీ ప్రజలు చేసేవేననడం సరయిన అవగాహన కాదు. ఉద్యమంలో ప్రజలుంటారు. ఉద్యమాన్ని నడిపించే సంస్థలు లేక పార్టీలు వుంటాయి. ఇవి వేరు వేరు. అంటే అర్థం ఆ సంస్థకు లేక పార్టీకి ప్రజలతో సంబంధం లేదనీ ఆ ఉద్యమంలో ప్రజలు లేరనీ కాదు. ఏ మేరకు వుంటే ఆ మేరకు గుర్తించాల్సిందే. కానీ మద్దతు ఎంత వున్నా ప్రజల భాగస్వామ్యం ఎంత వున్నా ఉద్యమాన్ని నిర్వహించే సంస్థల నిర్ణయాలనూ చర్యలనూ ప్రజల నిర్ణయాలు, ప్రజల చర్యలూ అనడం సరయినది కాదు. వాటిని ఆ ఉద్యమకారులు నిజంగానే ప్రజలలో చర్చకు పెట్టి మెజారిటీ ప్రజాభిప్రాయం ప్రకారం నడచుకుంటే తప్ప. ఉద్యమకారులు చాలా అరుదుగా మాత్రమే అంత ప్రజాస్వామికంగా వ్యవహరిస్తారు. అది తమకు సాధ్యం కాదని కూడ (సకారణంగానే కావచ్చు) భావిస్తారు. దేనినయినా ప్రజాఉద్యమం అంటున్నామంటే అర్థం అది ప్రజలు తమకోసం తాము నడుపుకుంటున్న ఉద్యమమని కాదు. అటువంటి ఉద్యమాలు అతి కొద్ది సంఖ్యలో వుంటాయి. అదే నిర్వచనం అయితే ఈ రోజు ప్రజా ఉద్యమాలుగా గుర్తిస్తున్న వాటిలో కొన్నిటికి మాత్రమే ఆ పేరు పెట్టగలం. ప్రజల న్యాయమైన సమస్యల నుండి పుట్టి వాటికి పరిష్కారం చూపించే ప్రయత్నం చేసే సంఘటిత ఉద్యమాలను ప్రజా ఉద్యమాలుగా

తమ నిర్ణయాలను ప్రజల నిర్ణయాలుగా, తమ చర్యలను ప్రజల చర్యలుగా వర్ణించడానికి ఉద్యమాలు చేసే ప్రయత్నంలో పౌరహక్కుల సంఘం భాగం కాజాలదు. ఉద్యమాలు విమర్శను తప్పించుకోవడానికి లేక తమ చర్యలకు సాధికారత కల్గించడానికి ఆ రకమైన పరిభాష ఉపయోగిస్తాయి. పౌరహక్కుల ఉద్యమం ఆ పరిభాష ఉపయోగించడం సరయినది కాదు.

గుర్తిస్తున్నాం. అటువంటి ఉద్యమాలలో ప్రజలుంటారు. వారి సమస్యలూ ఆకాంక్షలూ ఆరాటాలూ వుంటాయి. ఉద్యమానికి నాయకత్వం వహించే సంస్థ వుంటుంది. ఆ సంస్థకు ఒక నిర్మాణం వుంటుంది. ఒక పని పద్ధతి వుంటుంది. ప్రజల సమస్యల గురించి, వాటి పరిష్కారం గురించి ఆ సంస్థకు ఒక ఆలోచన, ఒక దృక్పథం వుంటాయి. ఇవన్నీ ప్రజలవేననలేము. ఉద్యమ ఆలోచనలు, నిర్ణయాలు, చర్యలూ ప్రజల ఆలోచనలు, నిర్ణయాలు, చర్యలేననలేము. ప్రజల మద్దతు, ఆమోదం, భాగస్వామ్యం ఏ మేరకు వుంటే ఆ మేరకు గుర్తిస్తాము. అంతే తప్ప తమ నిర్ణయాలను ప్రజల నిర్ణయాలుగా, తమ చర్యలను ప్రజల చర్యలుగా వర్ణించడానికి ఉద్యమాలు చేసే ప్రయత్నంలో పౌరహక్కుల సంఘం భాగం కాజాలదు. ఉద్యమాలు విమర్శను తప్పించుకోవడానికి లేక తమ చర్యలకు సాధికారత కల్గించడానికి ఆ రకమైన పరిభాష ఉపయోగిస్తాయి. పౌరహక్కుల ఉద్యమం ఆ పరిభాష ఉపయోగించడం సరయినది కాదు. తాము అణచివేయజూసే ఉద్యమాలకు ప్రజల మద్దతే లేదనీ ప్రజల భాగస్వామ్యమే లేదనీ ప్రభుత్వం ఒకవైపు అంటే, తమ నిర్ణయాలన్నీ ప్రజల నిర్ణయాలే, తమ చర్యలన్నీ ప్రజల చర్యలేననీ ఉద్యమకారులు మరొకవైపు ప్రకటిస్తారు. పౌరహక్కుల ఉద్యమం ఈ రెండు వైఖరులనూ తిరస్కరించి ఏ చర్యకు ఎవరు బాధ్యులు, దానిలో ప్రజల భాగస్వామ్యం ఏ మేరకు వుంది, భాగస్వామ్యం కల్పించే నిర్మాణము, విధానము ఏ మేరకు వున్నాయి అనేది వాస్తవికంగా చూడాలి.

అయినా ఒకవేళ ప్రజలే ఏకగ్రీవంగా చేసిన పనయినా అది అన్యాయం అయితే అన్యాయం అనవలసిందే.

**వా**ళ్లు (ప్రజలయినా ప్రజాఉద్యమ నాయకత్వమైనా) సమస్యల నడుమన వుండి ఒక నిర్ణయం తీసుకుంటారనీ సమస్యలకు దూరంగా వుండే పౌరహక్కుల ఉద్యమకారులు దానిపై తీర్పు ఎట్లా చెప్పగలుగుతారనీ అడుగుతారు. తొందరపడి ఒక తీర్పు చెప్పాలనిగానీ వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను లెక్కలోకి తీసుకోకుండా న్యాయాన్యాయాలు తేల్చాలనిగానీ పౌరహక్కుల ఉద్యమం భావించదు. కానీ ఆ పేరుమీద ఉద్యమకారుల అప్రజాస్వామిక చర్యలను విమర్శనుండి కాపాడాలనుకోవడం సరయినది కాదు. ఆ చర్యలకు బాధ్యులయిన

పోరాటకారుల కష్టాలెంత ముఖ్యమో వాటివల్ల నష్టపోయేవారి హక్కులు కూడ పౌరహక్కుల ఉద్యమానికి కనీసం అంతే ముఖ్యం కావలసివుంటుంది.

11. ఉద్యమకారులు అప్రజాస్వామికంగా ప్రవర్తిస్తే పౌరహక్కుల ఉద్యమం విమర్శించవలసి వుంటుందని అన్నాను. సమాజం పౌరహక్కుల ఉద్యమం మీద ఒత్తిడి ఎక్కువగా పెట్టేది ఉద్యమకారుల హింసను ఖండించాలని. హింసను ఖండించడం, అప్రజాస్వామిక చర్యలను ఖండించడం ఒకటి కాదు. రెండవది హక్కుల ఉద్యమం తప్పనిసరి కర్తవ్యం. మొదటిది అన్ని సందర్భాలలోనూ అవసరం కాదు. అప్పుడప్పుడు మాత్రమే అవసరం అవుతుంది. అయితే అప్రజాస్వామిక చర్యలు హింసాత్మక రూపం తీసుకున్నప్పుడు వాటివల్ల జరిగే నష్టం ఎక్కువ వుంటుంది కాబట్టి పోరాటకారులు అమాయకులను చంపిన ఘటనలు, సామాన్య ప్రజలను చంపిన ఘటనలు, తప్పుడు అభియోగాలతో ఒక వ్యక్తిపైన దాడిచేసిన ఘటనలు, ఇతరుల న్యాయమైన హక్కులను బలప్రయోగంతో అణచివేసిన ఘటనలు విమర్శకు గురి అవుతాయి. ఇక్కడ విమర్శకు గురి అయ్యేది ప్రధానంగా ఆ చర్యలలోని అప్రజాస్వామిక లక్షణం. అది హింసాత్మక రూపం తీసుకున్నప్పుడు దానివల్ల జరిగే నష్టం ఎక్కువ వుంటుంది కాబట్టి విమర్శించవలసిన ఆవశ్యకత ఎక్కువ వుంటుంది. హింసాత్మకం అయినా కాకున్నా అప్రజాస్వామిక చర్యలను తప్పనిసరిగా ఖండించాల్సిందే.

'పోరాటకారుల అప్రజాస్వామిక చర్యలను ఖండించాలి. అవి హింసాత్మక రూపం తీసుకున్నప్పుడు అవశ్యం ఖండించాలి' అనడం వేరు, హింసను 'ప్రజాస్వామిక హింస – అప్రజాస్వామిక హింస' అని వర్గీకరించి, మొదటిదానిని సమర్థించాలనీ రెండవదానిని విమర్శించాలనీ అనడం వేరు. జీవించే హక్కుకు ప్రాముఖ్యం ఇచ్చే పౌరహక్కుల ఉద్యమం ఏ హింసనూ సమర్థించజాలదు. హింసకుగల సామాజిక మూలాలను చూడగలదు. అది అన్యాయం నుండి అణచివేత నుండి పుట్టిన హింస అయితే ఆ హింసకు పాల్పడిన వ్యక్తిపట్ల సానుభూతి చూపించమనీ ఉదారంగా వ్యవహరించమనీ సమాజానికీ చట్టానికీ చెప్పగలదు. ఆ దిశగా చట్టంలోనూ న్యాయవ్యవస్థలోనూ సంస్కరణలు తేవడానికి కృషి చేయగలదు. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండ వుండడానికి ఆ సామాజిక మూలాలను సంస్కరించమని సమాజంపైన ఒత్తిడి పెట్టగలదు.

కొన్ని ప్రత్యేకమైన సందర్భాలలో, హింసాత్మక చర్యకు పాల్పడిన వ్యక్తిపట్ల సమాజం నుండి, న్యాయ వ్యవస్థ నుండి పౌరహక్కుల ఉద్యమం కోరుకునే ఉదారవైఖరి పూర్తి క్షమాభిక్ష – అంటే శిక్ష నుండి పూర్తి మాఫీ ఇవ్వడం – దాకా పోవచ్చు. అది ఆ సందర్భాన్ని బట్టి, పరిస్థితిని బట్టి వుంటుంది. అంతే తప్ప హింసను ప్రజాస్వామిక హింస – అప్రజాస్వామిక హింస అని వర్గీకరించడం పౌరహక్కుల ఉద్యమానికి తగని పని. ఎంత క్రూరుడి గురించయినా 'వీడిని చంపవలసిందే, వీడిని చంపడం ప్రజాస్వామిక చర్యే' అని తీర్పు చెప్పటం పౌరహక్కుల ఉద్యమానికి ఎట్లా సాధ్యం అవుతుంది? అతని క్రూరత్వానికి

గురయిన వాళ్లు అతనిని చంపితే, వాళ్లు ఆ స్థితికి నెట్టబడ్డారు కాబట్టి, ఆ స్థితి వాళ్లకు కలగకుండ చట్టం కాపాడలేకపోయింది కాబట్టి, వాళ్ల చర్యపట్ల చట్టం, సమాజం ఉదారంగా వ్యవహరించాలని చెప్పడం సాధ్యం అవుతుంది. తప్పంతా వాళ్లమీద పెట్టి వాళ్లను కాపాడలేకపోయిన వ్యవస్థలు తప్పించుకోవడానికి వీలులేదని చెప్పడం సాధ్యం అవుతుంది. నేరం తీవ్రత పరిస్థితులను బట్టి వుంటుందనేది ఒక ప్రజాతంత్ర సూత్రమే. కాని దుర్మార్గులను హతమార్చే హక్కు వుంటుందనేది ప్రజాతంత్ర సూత్రం కాదు. చంపదగ్గ దుర్మార్గులు ఎవరు అనే నిర్ణయం ఎవరికి వారు వేసుకుంటారు కాబట్టి ఇది అరాచక పరిస్థితులకు దారితీయగలదు.

పైగా, ప్రజాస్వామిక హింస – అప్రజాస్వామిక హింస అనే వర్గీకరణ చేస్తున్న వాళ్ల ఉద్దేశ్యం, ఒక్కొక్క హింసాత్మక ఘటనకూ దానిని అన్వయింపజేసి నిర్ణయించాలని కాదు. దానికి కొంతయినా అర్థం వుంటుంది. వాళ్ల ఉద్దేశ్యం, మొత్తంగానే ప్రజా ఉద్యమాలూ, విప్లవకారులూ చేసేదంతా ప్రజాస్వామిక హింసేననీ, పాలకవర్గాలూ రాజ్యాంగ యంత్రమూ చేసేది మాత్రం అప్రజాస్వామిక హింస అనీ వాదించడం. అందుకోసమే ఈ వర్గీకరణ ప్రతిపాదిస్తున్నారు. ఈ రకంగా ఒక వర్గం చేసే హింస మొత్తంగా 'ప్రజాస్వామికం' అనే వాదన అసలే చెల్లదు. ఉదాహరణకు ఉద్యమకారులు క్రూరుడయిన ఒక భూస్వామిని చంపుతారనుకుందాం. వాదన కోసం ఈ ఘటనను 'ప్రజాస్వామిక హింస' అందాం. ఆ కేసు కోర్టులో విచారణకు వచ్చినప్పుడు ఆ భూస్వామి జీతగాడు తన మృత యజమానిపట్ల విధేయతకొద్దీ వద్దన్నా వినకుండ సాక్ష్యం చెప్తానని తయారవుతాడు. అతనిని ఆపడం కోసం ఉద్యమకారులు అతనిని కూడ చంపుతారు. ఇది కూడ ప్రజాస్వామిక హింసేనా? ఆ తరువాత ఆ జీతగాని తమ్ముడు న్యాయమైన ఆగ్రహం కొద్దీ పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా మారతాడు. ఉద్యమకారులు అతనిని కూడ చంపుతారు. అది కూడ ప్రజాస్వామిక హింసేనా?

ఇది ఊహాజనితమైన ఉదాహరణ కాదు. సాయుధ పోరాటాలు నడుస్తున్న ప్రాంతాలలో ఇటువంటి ఉదాహరణలు కొల్లలు. వాళ్లు చేసే హత్యలలో పదిశాతం కూడ క్రూరుడయిన భూస్వామిని చంపడం వంటి 'ప్రజాస్వామిక హత్యలు' కావు. కాబట్టి ప్రజాస్వామిక హింస – అప్రజాస్వామిక హింస అనే వర్గీకరణ వల్ల వాళ్లకు పెద్దగా ఉపయోగం లేదు. టోకున వాళ్లు చేసేదంతా ప్రజాస్వామిక హింసేనని నిర్వచించిపారేస్తే తప్ప.

12. కాబట్టి ప్రజాస్వామిక హింస – అప్రజాస్వామిక హింస అనే అర్థరహితమైన వర్గీకరణను విడిచిపెట్టడం అవసరం. అట్లాగని హింసకు వుండే సామాజిక నేపథ్యాన్ని మొత్తంగా ఉపేక్షించి ఏ హింస అయినా జీవించే హక్కుకు భంగకరం కాబట్టి హింసను మొత్తంగా ఖండించాలని వాదించనవసరం లేదు. హింసను మొత్తంగా ఖండించవలసిన అవసరం గానీ, ప్రజాస్వామిక హింస అని పేరు పెట్టి కొన్ని రకాల హింసను సమర్థించవలసిన అవసరంగానీ పౌరహక్కుల ఉద్యమానికి లేదు.

మనమిక్కడ భౌతిక హింస గురించి మాట్లాడుకుంటున్నాం. కానీ సామాజిక వ్యవస్థలోని అసమానతల నుండి, అణచివేత నుండి పుట్టే ఆకలి, నిరక్షరాస్యత, అంటరానితనం, పేదరికం, అస్వతంత్రత మొదలయినదంతా కూడ ఒక రకమైన హింసే. దీనిని వ్యవస్థాగత హింస అందాం.

పేదలు, పీడితులు, పీడిత ప్రజా ఉద్యమాలు చేసే భౌతిక హింసకు ఈ వ్యవస్థాగత హింసను నేపథ్యంగా చూడాలి. ఆ సామాజిక నేపథ్యంలో ఈ హింసను అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకొమ్మని సమాజానికి నచ్చచెప్పాలి. ఇది కేవలం రాజకీయ ఉద్యమాలూ పోరాటకారులూ చేపట్టే హింసకే కాదు, సాధారణ నేరాలలో వుండే హింసకు కూడ వర్తిస్తుంది. ఈ పని పౌరహక్కుల ఉద్యమం చేయగలగాలంటే తాను హింస చేసే వాళ్లకు దూరంగా వుండాలి. హింస ప్రయోగించే ఉద్యమకారులతో చెట్టపట్టాలు వేసుకొని తిరుగుతూ, హింసకు గల సామాజిక నేపథ్యం చూడాలని సమాజానికి నచ్చజెప్పాలని చూస్తే సమాజం విశ్వసించదు.

హింసను సామాజిక నేపథ్యంలో చూడడం అంటే ఆ నేపథ్యం పేరిట దానిని సమర్థించడం కాదు. దానిని అర్థం చేసుకోవడం అని మాత్రమే దీని భావం. సమర్థించడమంటే ఆ సామాజిక నేపథ్యంలో వున్న సమస్యలకు హింస అనివార్య పర్యవసానం, లేదా వాటి పరిష్కారానికి అనివార్య సాధనం అని వాదించడం. ఇవి రెండూ నిజం కాకపోవచ్చు. నిజమని రుజువు చేయడం ఎప్పుడో అరుదుగా తప్ప సాధ్యం కాదు. ఒక పేదవ్యక్తి దొంగగా మారడానికి పేదరికాన్ని నేపథ్యంగా చూస్తున్నామంటే పేదలంతా దొంగలుగా మారడం అనివార్యమనీ కాదు, దొంగతనం చేయడం ద్వారా తప్ప వాళ్లు పేదరికం నుండి బయటపడలేరనీ కాదు. అది నేపథ్యం, లేక సందర్భం మాత్రమే. ఆ నేపథ్యాన్ని, లేక సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని సమాజం, న్యాయ వ్యవస్థ, ఆ నేరానికి పూర్తిగా ఆ వ్యక్తినే బాధ్యుడిని చేసి శిక్షించకుండ, వ్యవస్థ బాధ్యత కొంత వుందని గుర్తించి ఆ వ్యక్తిపట్ల ఉదారంగా వ్యవహరించాలనీ, వ్యవస్థలోని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలనీ పౌరహక్కుల ఉద్యమం వాదిస్తుంది. అంతే తప్ప పేదరికం ఉన్నంత కాలం దొంగతనాలు అనివార్యమనీ, సమర్థనీయమనీ, ఎవరి మీదా దొంగతనం కేసులు పెట్టకూడదనీ వాదించజాలదు. సమస్యలున్నంత కాలం నేరాలు జరుగుతాయి కాబట్టి అన్ని సమస్యలూ పరిష్కారం అయ్యేంతవరకు నేరస్మృతిని సస్పెండ్ చేయమని చెప్పజాలదు. నేరస్మృతికి నేరాలకున్న సామాజిక నేపథ్యాన్ని గురించి స్పృహ వుండాలనీ శిక్షలూ విచారణా పద్ధతులూ ఆ వెలుగులో వుండవలసిన చోట ఉదారంగా వుండాలనీ మాత్రమే చెప్పగలదు. దొంగతనాలకు పాల్పడే పేదల చర్యలవల్ల ఆ పేదరికానికి బాధ్యులయిన వాళ్లు మాత్రమే నష్టపోయేటట్టయితే దొంగతనాలను సమర్థించడం కనీసం నైతికంగానైనా సాధ్యం అయ్యేదేమో. కానీ అది కూడా సాధారణంగా నిజం కాదని మనకు తెలుసు. దొంగతనాలకు ఎక్కువగా గురయ్యేది ఎవరి పేదరికానికీ బాధ్యులు కాని మామూలు జనమే.

13. దొంగతనాల గురించి మాట్లాడినంతకాలం ఈ తర్కాన్ని ఎవ్వరూ వ్యతిరేకించకపోవచ్చు. కానీ పోరాటకారులు చేసే హింసకు కూడ ఇదే తర్కం వర్తిస్తుంది. పోరాటాలకు సామాజిక సమస్యలు, సామాజిక అణచివేత మూలం. అందువల్ల పోరాటకారులు చేసే హింసను పౌరహక్కుల ఉద్యమం ఖండించనవసరం లేదు (అప్రజాస్వామిక చర్యలను మాత్రం ఖండిస్తాం). ఆ హింసపైన ప్రభుత్వం చర్య తీసుకోవచ్చునని చెప్తాం. అంటే నేరస్మృతి తన పని తాను చేసుకోవచ్చునని చెప్తాం. అంతకంటే ముఖ్యంగా, సమస్య మూలాలను గుర్తించి ఉద్యమాలతో రాజకీయంగా, ప్రజాస్వామికంగా వ్యవహరించాలని చెప్తాం.

అంతే తప్ప పోరాటాలకు అణచివేత మూలం కాబట్టి పోరాటకారులు చేసే అన్ని చర్యలూ సమర్థనీయమని అనలేము. అది సత్యమూ కాదు, పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యమూ కాదు. వాళ్లు చేసే హింస ఆ అణచివేతకు అనివార్య పర్యవసానమనీ తప్పనిసరి పరిష్కారమనీ అనలేము. 'అణచివేతే పోరాటాలకు మూలం కాబట్టి పోరాటకారులు చేసే హింస నేరం కాదు' అనే వాదన పౌరహక్కుల ఉద్యమంలో ప్రవేశపెడుతున్నారు. నక్సలైట్ ఖైదీల బేషరతు విడుదలను డిమాండ్ చేయడానికి ఇది అవసరం అయింది. దాని అర్థం ఏమిటంటే వాళ్లు చేసే ప్రతీ హింసాత్మక చర్య అణచివేతకు తప్పనిసరి ఫలితమనీ లేదా అణచివేతను అధిగమించడానికి తప్పనిసరిగా అవసరమనీనూ. 'పోరాటాలకు అణచివేత మూలం' అనే సాధారణ సూత్రాన్ని ఇంత అతిగా వ్యాఖ్యానిస్తే తప్ప వాళ్లు చేసేవేవీ నేరాలే కావనీ వాళ్లపైన చట్టం ప్రకారం కూడ చర్య తీసుకోకూడదనీ వాదించడం సాధ్యం కాదు. తెలంగాణ నుండి కాశ్మీర్ దాకా ఏ ఒక్క పోరాటాన్ని ఉదాహరణగా తీసుకొని చూసినా ఈ ప్రతిపాదనను రుజువు చేయడం అసాధ్యం అని చూపించవచ్చును.

నక్సలైట్ ఉద్యమకారులనే ఉదాహరణగా తీసుకుంటే, వాళ్లు ప్రయోగించే హింసాకాండ ఈ క్రింది రూపాలలో వుంటుంది.

1. ప్రజలను చాలా కాలం పీడించి చట్టానికి దొరకకుండ వుండిపోయిన వ్యక్తులపైన ప్రయోగించే హింస.

2. ప్రజల పోరాటాలకు అడ్డంగా నిలబడి అణచివేయాలని ప్రయత్నించే వ్యక్తులపైన ప్రయోగించే హింస.

3. ప్రజల పోరాటాలకు అడ్డంగా నిలబడకున్నా నక్సలైట్లకు రాజకీయంగా వ్యతిరేకంగా నిలబడే వ్యక్తులపైన ప్రయోగించే హింస. వీళ్లు ప్రజా వ్యతిరేకులు కావచ్చు, కాకపోవచ్చు. కేవలం నక్సలైట్ రాజకీయాలను మొండిగా వ్యతిరేకించినవారూ కావచ్చు.

4. పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా నక్సలైట్లు గుర్తించే వారిపైన ప్రయోగించే హింస. 'ఇన్‌ఫార్మర్'లు అంటే కుట్రపూరితంగా నక్సలైట్ల సమాచారాన్ని పోలీసులకు అందిచ్చేవాళ్లే కానవసరం

లేదు. అటువంటి వాళ్లతో మొదలుపెట్టి, నక్సలైట్ల వల్ల తమకు ప్రాణభయం వుందని పోలీసుల రక్షణ కోరే వ్యక్తుల దాకా అనేక రకాల వ్యక్తులు ఈ కోవలోకి వస్తారు.

5. భూముల విషయంలోనయినా గ్రామ వ్యవహారాల విషయంలోనయినా రాజకీయాలలో అయినా ఎన్నికలప్పుడయినా మరే సందర్భంలోనయినా నక్సలైట్లు జారీ చేసిన ఆదేశాలను వ్యతిరేకించే వ్యక్తులపైన ప్రయోగించే హింస.

6. పంచాయితీలలో నక్సలైట్లు ఇచ్చే తీర్పును గౌరవించని వారిపైన ప్రయోగించే హింస.

7. ప్రభుత్వ నిర్బంధానికి నిరసనగా పాలక పార్టీకి చెందిన వారిలో ఎవరు అందుబాట్లో వుంటే వారిపైన ప్రయోగించే హింస.

8. పోలీసులపైన ప్రయోగించే హింస. దీనికి బలయ్యేది క్రూరులయిన పోలీస్ అధికారులే కానవసరం లేదు. మందుపాతరకు అందుబాట్లో వుండే పోలీసులెవరయినా కావచ్చు. తుపాకుల కోసం నక్సలైట్లు దాడిచేసే పోలీస్ స్టేషన్లలో ఆ క్షణం డ్యూటీలో వున్నవారెవరయినా కావచ్చు.

9. ఒక గ్రామంలో లేక ఒక ప్రాంతంలో తమ శత్రువర్గానికి చెందిన వారి ప్రభావం పెరిగిపోతున్నదని నక్సలైట్లు భావిస్తే ఆ ప్రభావాన్ని తగ్గించి తమ శాసనాన్ని నెలకొల్పడం కోసం శత్రువర్గంలో ఎవరు అందుబాట్లో వుంటే వారిపైన ప్రయోగించే హింస.

ఇవి కాక 'పోరబాట్లు', 'అవగాహనా లోపం వల్ల జరిగే చర్యలు' కూడ వుంటాయి. రాజకీయ కక్షలలో తలదూర్చి ఒక పక్షం తరఫున మరొకరిపైన చేసే దాడులు, చెప్పుడు మాటలు విని స్వార్థపరుల ప్రయోజనాలను ప్రజాప్రయోజనాలుగా భావించి చేసే దాడులు, కార్యకర్తలు తమ పూర్వాశ్రమానికి చెందిన కక్షలను ఉద్యమం పేరిట తీర్చుకునే క్రమంలో చేసే దాడులు, ఒకరనుకొని మరొకరిపైన చేసే దాడులు కూడా వుంటాయి. ఈ దాడులకు గురయ్యే వాళ్లందరూ ధనవంతులూ ఆధిపత్య వర్గాలకు చెందినవారూ కారు. వ్యక్తిగతంగా అందరూ దుర్మార్గులేననీ ప్రజా వ్యతిరేకులేననీ కూడ చెప్పలేం.

ఇన్ని కారణాల వల్ల జరిగే హింసను మొత్తంగా 'ప్రజల చర్యలు' అనీ, 'ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టే చర్యలు' అనీ, 'అణచివేత నుండి పుట్టిన ప్రతిఘటన' అనీ, '85 శాతం ప్రజలు 15 శాతం పెత్తందార్లపైన చేసే హింస' అనీ వర్ణించే ప్రయత్నం చేయడం ఎవరికి చెల్లినా పౌరహక్కుల ఉద్యమానికి చెల్లదు. ఈ రకమైన వ్యాఖ్యల సహాయంతో 'ఇవి ప్రతిఘటనా చర్యలే తప్ప నేరాలు కావు కాబట్టి నక్సలైట్లపైన పెట్టిన కేసులన్నీ ఎత్తివేసి నక్సలైట్ ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయాలి' అని వాదించడం తగని పని.

రాజకీయ కార్యకర్తలయినంత మాత్రాన ఎటువంటి హింసాత్మక చర్యలకు పాల్పడినా వారిపైన కేసులు పెట్టడానికి వీలులేదనీ పెట్టిన కేసులన్నీ ఎత్తివేసి అందరినీ బేషరతుగా విడుదల చేయాలనీ పౌరహక్కుల పేరిట ఆందోళన చేయడంలో అర్థం లేదు.

నక్సలైట్ ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేయడమంటే అర్థం వారు చేసే ప్రతి చర్యనూ సమర్థించడం అని. చట్టం వాళ్లు చేసే హింసాకాండపైన చర్య తీసుకోవడానికి వీలు లేదంటే అర్థం వాళ్లుచేసే హింసాకాండనంతా సమర్థిస్తున్నామని. అంటే పౌరహక్కుల ఉద్యమం నక్సలైట్లకు వుండే ఉద్యమించే హక్కును సమర్థించడం, వాళ్ల ఉద్యమ లక్ష్యాలలోని ప్రజాస్వామిక విలువలను సమర్థించడం మాత్రమే కాక వాళ్ల ప్రతీ చర్యనూ – హింసాత్మక చర్యలతో సహా సమర్థించడం అని అర్థం. వాళ్ల పంథానూ సమర్థించడం అని అర్థం. అది పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యం ఎంతమాత్రం కాదు.

14. 'రాజకీయ ఖైదీలు' అనే మాటకు పరిమితమైన అర్థం ఇచ్చుకుంటే వారి విడుదల కోసం కృషి చేయడం పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యం కాగలదు. కేవలం రాజకీయ కారణాలవల్ల – అంటే వ్యవస్థకు, లేక పాలకులకు అభ్యంతరకరమైన రాజకీయ భావాలను నమ్మినందుకు, ప్రచారం చేసినందుకు – నిర్బంధింపబడిన వారు అని అర్థం చేసుకుంటే అటువంటి ఖైదీల విడుదల కోసం కృషి చేయవచ్చు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ లాగ ఆ రాజకీయ భావాలు శాంతియుతమయినవి అయి వుంటేనే ఆ ఖైదీల విడుదల కోసం కృషి చేస్తామనవసరం లేదు. అవి ఏ భావాలయినా కావచ్చు.

ఈ విధంగా నిర్బంధించడానికి ప్రస్తుత చట్టాలలో ఒక్క 'నాసా' మాత్రమే అవకాశం ఇస్తుంది. టాడా చట్టం వున్న రోజులలో ఆ చట్టంలోని సెక్షన్ 4లో కూడ ఆ అవకాశం వుండింది. కాశ్మీర్‌లో పంజాబులో ఈశాన్య రాష్ట్రాలలో ఈ సెక్షన్‌ను విస్తృతంగా ప్రయోగించారు. అటువంటి ఖైదీలను రాజకీయ ఖైదీలుగా గుర్తించి, వారి విడుదల కోసం పౌరహక్కుల ఉద్యమం ఆందోళన చేయగలదు, చేయాలి. గతంలో అనేక సందర్భాలలో పౌరహక్కుల సంఘాలు ఇటువంటి ఆందోళనలు చేపట్టాయి. అంతే తప్ప రాజకీయ కార్యకర్తలయినంత మాత్రాన ఎటువంటి హింసాత్మక చర్యలకు పాల్పడినా వారిపైన కేసులు పెట్టడానికి వీలులేదనీ పెట్టిన కేసులన్నీ ఎత్తివేసి అందరినీ బేషరతుగా విడుదల చేయాలనీ పౌరహక్కుల పేరిట ఆందోళన చేయడంలో అర్థం లేదు.

నక్సలైట్లు ప్రతి రోజూ హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. ఇది ఎవ్వరూ కాదనలేని విషయం. కానీ ఆ కేసులలో నేరం చేసిన వారినే కాక చేయనివారిని కూడ పోలీసులు

ఇరికిస్తున్నారనీ కేవలం ఆ పార్టీకి చెందిన వారయినందుకు చాలామందిని ముద్దాయిలుగా చూపిస్తున్నారనీ అటువంటి వాళ్లపైన కేసులు ఎత్తివేయమని అడగకూడదా అనీ వాదిస్తున్నారు. అదే సమస్య అయితే తప్పుడు కేసుల గురించి ఆందోళన చేయవచ్చు. తప్పుడు కేసులు ఒక్క నక్సలైట్ల పైననే కాక చాలామంది పైన పెడుతుంటారు. ఆ ఆందోళనకూ 'రాజకీయ ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయాలి' అనే ఆందోళనకూ ఏం సంబంధం వుంది? అన్ని కేసులూ తప్పుడు కేసులు కావు. అందరు ముద్దాయిలూ కల్పితంగా చేర్చబడ్డవారు కాదు. ఒక పేరుమీద మరొక ఆందోళన చేయడం ఎందుకు.

15. ప్రస్తుతం మన రాష్ట్రంలో పనిచేస్తున్న నక్సలైట్ పార్టీలు పాల్పడుతున్న హింసాకాండను మొత్తంగా సమర్థించడం సాధ్యంకాదు కాబట్టే ఈ మాటలు అంటున్నామా? వాళ్లు హింసను 'న్యాయం'గానే ప్రయోగించేటట్టయితే 'రాజకీయ ఖైదీల బేషరతు విడుదల' అనే డిమాండ్ పౌరహక్కుల ఉద్యమానికి సాధ్యం అవుతుందా? అని అడగవచ్చు. ఇక్కడ మళ్లీ 'ప్రజాస్వామిక హింస' అనే భావన దగ్గరికి వస్తాం. 'హింస ప్రజాస్వామికంగా వుంటే సమర్థించాలి' అనే ప్రతిపాదన దగ్గరికి వస్తాం. ఇది పౌరహక్కుల ఉద్యమానికి అసాధ్యమైన, అనవసరమైన పని. హింసకుగల సామాజిక నేపథ్యాన్నీ మూలాన్నీ అర్థం చేసుకొని ఆ జ్ఞానం చట్టానికీ న్యాయవ్యవస్థకూ సమాజానికీ అందివ్వడం మాత్రమే పౌరహక్కుల ఉద్యమానికి సాధ్యం అవుతుంది.

దీని అర్థం ఏమిటి?

'రూల్ ఆఫ్ లా' అనే వ్యవస్థనూ నేరస్మృతినీ మనం ఏ విధంగా అర్థం చేసుకుంటామనేది ఇక్కడ ముఖ్యం. 'రూల్ ఆఫ్ లా' నుండి, నేరస్మృతి నుండి 'న్యాయమైన పోరాటాలకు' మొత్తంగానే మినహాయింపు వుండాలని పౌరహక్కుల ఉద్యమం కోరాలా, లేకపోతే 'రూల్ ఆఫ్ లా' అనేదాన్ని ఒక నాగరికతా విలువగా గుర్తించి, ప్రస్తుతం వ్యక్తి ప్రాతిపదికన వున్న ఆ వ్యవస్థ సామాజిక జీవితంలోని వ్యవస్థితమైన న్యాయాన్యాయాలను కూడ లెక్కలోకి తీసుకుని విశాల స్వభావాన్ని సంతరించుకునేటట్టు చేయాలా? దానికి కావలసిన చైతన్యాన్నీ స్పృహనూ సమాజంలో పెంచాలా?

'రూల్ ఆఫ్ లా' అనే దానికి తెలుగులో సరయిన అనువాదం లేదు (మనకెవరికీ దాని విలువ తెలీదు కాబట్టి దానికి కావలసిన భాష కూడ అభివృద్ధి చెందలేదు). మామూలుగా 'చట్టబద్ధ పాలన' అంటున్నాం. అంటే పరిపాలన చట్టబద్ధంగా వుండాలని అర్థం. కానీ దాని పూర్తి అర్థం అది కాదు. సమాజ జీవితం నియమబద్ధంగా వుండాలి, ఆ నియమాలను చట్టసభలు రాజ్యాంగం పరిధిలో రూపొందించాలి, వాటిని రాజ్యాంగ యంత్రం న్యాయసమ్మతమైన పద్ధతులలో అమలు చేయాలి అనేది దాని అర్థం.

అసమాన సమాజంలో ఆ నియమాలూ చట్టాలూ అసమానతను భద్రపరుస్తాయనేది ఒక అంశం. కానీ ఆ పరిధిలోనయినా 'రూల్ ఆఫ్ లా' అనేది జీవితానికి నియమబద్ధత

కల్పిస్తుందనేది కూడ చూడవలసిన అంశం. ఈ నియమబద్ధత చాలా అవసరం. ధనవంతుల కంటే బలవంతుల కంటే పేదలకూ బలహీనులకూ ఆ భద్రత ఎక్కువ అవసరం. సామాజిక వ్యవస్థ అసమానంగా వుందా సమానంగా వుందా అనేది అటుంచి, అది నియమబద్ధంగా లేకపోతే, ఆ నియమాలు విస్పష్టంగా లేకపోతే, పేదల జీవితాలూ పీడితుల జీవితాలూ దుర్భరం అవుతాయి. పీడిత ప్రజలందరినీ పోరాటకారులుగా గెరిల్లాలుగా ఊహించుకునే దృక్పథానికి మాత్రమే 'రూల్ ఆఫ్ లా' కల్పించే నియమబద్ధత మొత్తంగా అన్యాయంగా కనిపిస్తుంది. పోరాటాలనే తప్ప నిత్యజీవిత అవసరాలను చూడలేకపోవడం పౌరహక్కుల ఉద్యమానికి ఎంతమాత్రం తగదు.

కాబట్టి 'రూల్ ఆఫ్ లా' అంటేనే అణచివేత అని ప్రకటించి దానిని బలహీనపరచే డిమాండ్లు పెట్టకుండ (ఏదయినా ఒక కోవకు చెందిన హింసకు నేరస్మృతి నుండి మొత్తంగా మినహాయింపు ఇవ్వాలనడం 'రూల్ ఆఫ్ లా' సూత్రాన్నీ విలువనూ వ్యవస్థనూ బలహీనపరిచే నినాదం) 'రూల్ ఆఫ్ లా'ను గౌరవించి 'లా' అనే దానికి (అంటే చట్టానికి) సామాజిక అసమానతల పట్ల వుండే గుడ్డితనాన్ని పోగొట్టి 'సోషల్ సెన్సిటివిటీ' కల్పించే ప్రయత్నం చేయడం ఉచితంగా వుంటుంది.

ఒక ఉదాహరణ. ఒక క్రూరుడయిన భూస్వామిని పేదలు చంపేస్తారనుకుందాం. 'అతను క్రూరుడు కాబట్టి అతనిని చంపడం ప్రజల హక్కు. ఆ హక్కును నేరం అనే చట్టం ప్రజా వ్యతిరేక చట్టం. వాళ్లను శిక్షించే 'రూల్ ఆఫ్ లా' ప్రజా వ్యతిరేక వ్యవస్థ. దానిని మేము గుర్తించము. ఆ ప్రజల మీద కేసు ఎత్తివేసి వారిని బేషరతుగా విడుదల చేయాలి' అని అనవచ్చు. లేదా, 'ఎవరూ ఎవరినీ చంపడానికి వీలు లేదు అనే చట్టం నియమబద్ధ జీవితానికి అవసరమే. దానిని అమలు చేసే 'రూల్ ఆఫ్ లా' ఒక నాగరిక వ్యవస్థే. అయితే ఆ ఘటన ఏ పరిస్థితిలో, ఏ నేపథ్యంలో జరిగిందో అర్థం చేసుకొని నేర విచారణ పద్ధతులనూ శిక్షా ప్రమాణాన్నీ సరళం చేయాలి. తీవ్రమైన ఒత్తిడిలో పీడిత ప్రజలు పాల్పడే నేరాలకు అతి తక్కువ శిక్ష వేయాలి. అవసరమైతే పూర్తి మినహాయింపు ఇవ్వాలి, (ఈ మధ్య ఒక బ్రిటిష్ కోర్టు సంవత్సరాల తరబడి తనను వేధించిన భర్తను చంపిన భార్యకు ఇచ్చినట్టు) అనవచ్చు.

ఇందులో రెండవదే పౌరహక్కుల ఉద్యమానికి అనువైన వైఖరి. 'రూల్ ఆఫ్ లా'ను నాగరికతా విలువగా గౌరవించి, దానికి సామాజిక స్పృహ కల్గించడం కోసం ప్రయత్నం చేసే వైఖరి ఇది. అంతే తప్ప 'రూల్ ఆఫ్ లా'ను బలహీనపరిచే పని మనం చేస్తే దానివల్ల పేదలూ పీడితులే ఎక్కువ నష్టపోతారు. పేదలందరినీ పోరాటకారులుగా చూసేవాళ్లకు మాత్రమే ఇది అర్థం కాదు. పోరాటాలలో లేని ప్రజలకు 'పోరాడండి, పోరాడండి' అని ఉద్బోధించడమే పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యం అనుకునే వాళ్లకు ఇది అర్థం కాదు. వాళ్ల నిత్యజీవిత అవసరాలను కాపాడడంలో పౌరహక్కుల ఉద్యమానికొక పాత్ర వుందని గుర్తిస్తే అర్థం అవుతుంది.

16. పౌరహక్కుల ఉద్యమం ప్రజాపోరాటాలతోనూ రాజకీయ ఉద్యమాలతోనూ ఎంతమేరకు కలిసి పనిచేయవచ్చుననే ప్రశ్న ఈ ఉద్యమానికి తరచు ఒక సమస్యగా వుంటూ వుంది. సమస్యల మీద అప్పుడప్పుడు కలిసి పనిచేయడం జరుగుతూనే వుంది. కానీ ఎంతవరకు, ఏ రూపాలలో పని చేయవచ్చుననేది ఒక చర్చగా వుంది.

ప్రజాపోరాటాల హక్కులు కాపాడడానికీ, వాటి ఆకాంక్షలలోని ప్రజాతంత్ర విలువలకు సామాజిక మద్దతు సమీకరించడానికీ పౌరహక్కుల ఉద్యమం ఆ పోరాటాల దైనందిన ఆచరణ నుండి ఎంత దూరం వుంటే అంత మంచిది. అప్పుడే పౌరహక్కుల ఉద్యమం చేసే కృషికి విశ్వసనీయత వుంటుంది. 'వాళ్లకోసం చేస్తున్న పని'గా కాక ఒక సూత్రబద్ధమైన కృషిగా సమాజానికి అది కనిపిస్తుంది. అప్పుడే అది సఫలం అయ్యే అవకాశం వుంటుంది. పౌరహక్కుల ఉద్యమం పోరాటకారుల రాజకీయ పరిభాషలో కాక విలువల పరిభాషలో మాట్లాడాలి. ఇప్పటికే సమాజంలో ఆమోదం పొంది ఉన్న విలువలకు విస్తృత వ్యాఖ్యానం ఇవ్వడం ద్వారా పోరాటాలు తీసుకొస్తున్న కొత్త ఆలోచనలకు సామాజిక చైతన్యంలో స్థానం కలిగించాలి. ఈ కొత్త ఆలోచనల వెలుగులో సామాజిక వ్యవస్థలను విమర్శనాత్మకంగా చూడడం సమాజానికి నేర్పించాలి. ఇదొక సున్నితమైన కృషి. 'తటస్థ'మైన కృషి కాదు. కానీ స్వతంత్రమైన కృషి. పౌరహక్కుల ఉద్యమం న్యాయాన్యాయాల మధ్య తటస్థంగా ఉండదు. న్యాయం పక్షం తీసుకుంటుంది. కానీ న్యాయం పక్షం తీసుకోవడమంటే అర్థం న్యాయం పేరు మీద పని చేసే ఉద్యమాలను మొత్తంగా వెనకేసుకొని రావడం, వాటితో కలగలసిపోవడం అని కాదు. అవి న్యాయం పేరు మీద పని చేసినా అన్ని సందర్భాలలోనూ న్యాయంగా వ్యవహరించకపోవచ్చు. అంతేకాక, న్యాయాన్ని నిలబెట్టడంలోనూ పెంపొందించడంలోనూ పౌరహక్కుల ఉద్యమానికి ఉండే ప్రత్యేకమైన పాత్రకు అది మంచిది కాదు. న్యాయాన్ని నెలకొల్పే కృషిలో విభిన్న కార్యరంగాలుంటాయి. వాటిలో పౌరహక్కుల కార్యరంగం ఒకటి. ఆ కృషి సమర్థవంతంగా నిర్వర్తించాలంటే పౌరహక్కుల ఉద్యమం నిర్మాణంలోనూ ఆచరణలోనూ అవగాహనా చట్రంలోనూ విషయాలను వివరించడానికి ఉపయోగించే సిద్ధాంత చట్రంలోనూ స్వతంత్రంగా వ్యవహరించాలి.

పౌరహక్కుల ఉద్యమం తన స్వతంత్ర ప్రతిపత్తిని జాగ్రత్తగా కాపాడుకోవాలని భావించడానికి ఇంకొక కారణం కూడ వుంది.

రాజకీయ ఉద్యమాలు ప్రయోజనాలకూ అవసరాలకూ ప్రాధాన్యం ఇస్తాయి. పౌరహక్కుల ఉద్యమం విలువలకు ప్రాధాన్యం ఇస్తుంది. అంటే అవి విలువలను గుర్తించవనీ, ఇది ప్రయోజనాలనూ అవసరాలనూ గుర్తించదనీ కాదు. ఇక్కడ ప్రాధాన్యం గురించి మాట్లాడుకుంటున్నాం.

రాజకీయ పార్టీలూ ఉద్యమాలూ కార్మికుల ప్రయోజనాలనో, దళితుల ప్రయోజనాలనో ఆదివాసుల ప్రయోజనాలనో ఒక భౌగోళిక ప్రాంతం ప్రయోజనాలనో ప్రాతిపదిక చేసుకొని

పనిచేస్తాయి. ఆపైన ఆ పార్టీల, ఉద్యమ సంస్థల, వ్యూహాలకూ ఎత్తుగడలకూ సంబంధించిన ప్రయోజనాలూ అవసరాలూ వుంటాయి. వీటిలో విలువలు అసలే వుండవని కాదు. ప్రతీ ప్రయోజనానికి అనుబంధంగా విలువలుంటాయి. ప్రతీ ప్రయోజనమూ విలువల రూపంలో వ్యక్తం అవుతుంది. కానీ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడానికీ విలువలకు ప్రాధాన్యం ఇవ్వడానికీ తేడా వుంటుంది. ప్రజావర్గాల ప్రయోజనం నుండి ఉద్యమాల వ్యూహాలు, ఎత్తుగడలు, ప్రయోజనాల దగ్గరికి వచ్చేసరికి ఈ తేడా ఇంకా స్పష్టంగా కనిపిస్తుంది.

పౌరహక్కుల ఉద్యమం విలువలకు ప్రాధాన్యం ఇస్తుంది. విలువలు శూన్యంలో పుట్టవనీ అవి ప్రయోజనాలతో అవసరాలతో ముడిపడి వుంటాయనీ పౌరహక్కుల ఉద్యమానికి తెలుసు. అయినప్పటికీ విలువలకు అది విలువలుగా ప్రాముఖ్యం ఇస్తుంది, వాటి వ్యాప్తికీ వ్యవస్థీకరణకూ కృషి చేస్తుంది.

భిన్నమైన ఈ వైఖరుల కారణంగా రాజకీయ ఉద్యమాలతోనూ రాజకీయ స్వభావంగల ప్రజా ఉద్యమాలతోనూ కలిసి పనిచేసేటప్పుడు పౌరహక్కుల ఉద్యమం అనేక సమస్యలు ఎదుర్కొంటూ వుంది. అది తాము అభిమానించే రాజకీయ ఉద్యమమయితే ఈ సమస్యలు లేనట్లు ప్రవర్తించడం, అభిమానించని ఉద్యమమయితే ఈ సమస్యల పేరు చెప్పి దూరం వుండడం పౌరహక్కుల ఉద్యమకారులు నేర్చుకున్నారు.

ఇక్కడొక సూత్రబద్ధమైన వైఖరి అనుసరించడం అవసరం. దీర్ఘకాలిక డిమాండ్ల మీద, సమస్యల మీద రాజకీయ ఉద్యమాలతో (అవి పార్టీలే కానవసరం లేదు, ప్రజా సంఘాలు కావచ్చు) కలిసి పని చేయడం ఎట్లాగూ సాధ్యం కాదు. స్వల్పకాలిక డిమాండ్లపైన పని చేసేటప్పుడు కూడ పౌరహక్కుల విలువలకు నష్టకరం కానంతవరకే పనిచేయగలుగుతాం. ఆ పరిస్థితి వస్తే స్వతంత్రంగా పని చేయడం సరయిన పని. ముఖ్యంగా, తెలంగాణ జిల్లాలలో నిర్బంధానికి వ్యతిరేకంగా ఆందోళన చేసేటప్పుడు, ఆ జిల్లాలలో నిత్యం హింసాకాండకు పాల్పడుతున్న ఎం.ఎల్ పార్టీల ప్రజాసంఘాలతో కలిసి పనిచేయడం జీవించే హక్కుకు ప్రాముఖ్యం ఇచ్చే పౌరహక్కుల ఉద్యమానికి మంచిది కాదు. ఈ ఉద్యమం చేయగల కృషికి అది విఘాతం కలిగిస్తుంది. నక్సలైట్ పార్టీలు కేవలం ప్రజల అవసరాల కోసమే పోరాటం చేసినా, హింసను ఆచితూచి ప్రయోగించినా ఇది కష్టం అయ్యేదే. కానీ వాళ్లు హింసను ఆచితూచి ప్రయోగించడం లేదు. కేవలం ప్రజల అవసరాల కోసం పోరాటం చేయడం లేదు. సమాజం మీద ప్రత్యామ్నాయ అధికారాన్ని నెలకొల్పడం కోసం పోరాటం చేస్తున్నారు. అధికారాన్ని ప్రశ్నించే స్వభావం వున్న పౌరహక్కుల ఉద్యమం వాళ్లతో ఎంత మేరకు కలిసి పని చేయగలదు?

17. ఒక చివరి విషయం. పౌరహక్కులు, ప్రజాస్వామిక హక్కులు, మానవ హక్కులు అనే వర్గీకరణ ఒకటి మన దేశంలోని పౌరహక్కుల ఉద్యమంలో తరచుగా చర్చకు వస్తూ వుంది. హక్కులలో హెచ్చుతగ్గులు నిర్ణయించడం కోసం దీనిని వాడుకోవడం

జరుగుతూ వుంది. నిజానికి మనుషులందరికీ రాజకీయ ఆర్థిక సాంఘిక రంగాలలో అన్నిరకాల సమానత్వం (హోదాలో, స్థితిగతులలో, అవకాశాలలో) వుండాలనేది హక్కులకు ప్రామాణికం. ఈ దిశగా ఇప్పటికి సాధించుకున్న హక్కులు, ఇప్పటికింకా సాధించుకోవలసి వున్న హక్కులు అనేదొక్కటే ఉపయోగకరమైన వర్గీకరణ. వేరే ఏ వర్గీకరణ అయినా విశ్లేషణా సౌలభ్యం కోసం చేసుకునేదే. అంతే తప్ప హక్కులలో హెచ్చుతగ్గులు చూపించి ఒక దాని పేరుమీద మరొక దాని నిరాకరణను సమర్థించజూడడాన్ని వ్యతిరేకించాలి.

దాదాపు అర్ధశతాబ్దం పాటు ప్రపంచ రాజకీయాలను శాసించిన 'ప్రచ్ఛన్న యుద్ధం' (కోల్డ్‌వార్) కాలంలో ఈ రకమైన హెచ్చుతగ్గుల వర్గీకరణ ప్రాచుర్యం పొందింది. పౌర రాజకీయ హక్కులే ప్రజాస్వామ్యమనీ, సామాజిక ఆర్థిక హక్కులను పెట్టుబడిస్వామ్యం దయాదాక్షిణ్యాలకు వదిలేసినా అక్కడ ప్రజాస్వామ్యం లోపించినట్టు భావించనవసరం లేదనీ అమెరికా కూటమి వాదించగా, సామాజిక ఆర్థిక హక్కులే ప్రజాస్వామ్యమనీ పౌర రాజకీయ హక్కులు సహితం కావాలనడం కేవలం బూర్జువా బలహీనతనీ సోవియట్ కూటమి వాదించింది. ఇది పౌరహక్కుల ఉద్యమం దృష్టిలో కృత్రిమమైన విభజన. ఒకదాని పేరు చెప్పి మరొక దాని నిరాదరణను సమర్థించడం తగని పని. ఒకటి లేకుండ మరొకటి పరిపూర్ణం కాదు, నిలవదు. ఈ శతాబ్దపు చరిత్ర నేర్పిన ఈ ముఖ్య గుణపాఠాన్ని తన అవగాహనలో భాగం చేసుకొని ప్రచారం చేయడం పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యాలలో ఒకటి.

18. సారాంశంలో,

i) రాజ్యం, వర్గం, కులం, లింగం మొదలయిన వ్యవస్థిత ఆధిపత్యాలలో అన్నిటికీ పౌరహక్కుల ఉద్యమం ఒకే రకమైన ప్రాముఖ్యం ఇవ్వాలి. వాటి నుండి పుట్టే హక్కుల సమస్యలను సమభావంతో చూడాలి. కేవలం సమస్య తీవ్రతను బట్టి ప్రాముఖ్యాన్ని నిర్ణయించాలే తప్ప అది ఏ రకమైన ఆధిపత్యం నుండి పుట్టింది అనే దానిని బట్టి కాదు. ఈ ఆధిపత్య వ్యవస్థలకు వ్యతిరేకంగా ముందుకొచ్చే ఉద్యమాల పట్ల పౌరహక్కుల ఉద్యమం ఏ రకమైన పక్షపాతాన్నీ ప్రదర్శించకూడదు. ఏదో ఒక ఉద్యమ అవగాహనకూ ఆచరణకూ ఉపయోగపడేటట్టు తన అవగాహననూ ఆచరణనూ రూపొందించుకోకూడదు.

ii) ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థలోని ప్రజాస్వామ్యాన్ని బూటకం, మోసపూరితం, భ్రమ అని భావించడం పౌరహక్కుల ఉద్యమానికి తగిన వైఖరి కాదు. దాని స్వభావంలోనూ, అమలులోనూ ఉన్న పరిమితులను వాస్తవికంగా గుర్తిస్తూనే ఆ ప్రజాస్వామ్యాన్ని అర్థవంతమైనదిగా స్వీకరించాలి. దానిలోని ప్రజాస్వామ్య సారాన్ని కాపాడడానికీ పెంపొందించడానికీ కృషి చేయాలి. ప్రజలలో ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెంపొందించడానికి ఎంతగా కృషి చేయాలో వ్యవస్థలో ప్రజాస్వామ్య సారాన్ని పెంపొందించడం కోసం కూడ అంత చేయాలి. దాని కోసం ప్రజాందోళనలను

> రాజ్యం, వర్గం, కులం, లింగం మొదలయిన వ్యవస్థిత ఆధిపత్యాలలో అన్నిటికీ పౌరహక్కుల ఉద్యమం ఒకే రకమైన ప్రాముఖ్యం ఇవ్వాలి. వాటి నుండి పుట్టే హక్కుల సమస్యలను సమభావంతో చూడాలి. కేవలం సమస్య తీవ్రతను బట్టి ప్రాముఖ్యాన్ని నిర్ణయించాలే తప్ప అది ఏ రకమైన ఆధిపత్యం నుండి పుట్టింది అనే దానిని బట్టి కాదు.

ప్రోత్సహించడమే కాక ఈ రాజ్యాంగ వ్యవస్థ లోపల సాధ్యమయ్యే అన్ని మార్గాలూ అన్వేషించాలి. ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం పోరాడే హక్కు ప్రజలకు ఉంటుందని చెప్పడం, దానిని కాపాడడం కోసం కృషి చేయడం ఎంత ముఖ్యమో ఈ కర్తవ్యం కూడ అంత ముఖ్యం. ఈ క్రమంలో ప్రజలకు ప్రస్తుత రాజ్యాంగవ్యవస్థపైన విశ్వాసం పెరుగుతుందా అవిశ్వాసం పెరుగుతుందా అనేది పౌరహక్కుల ఉద్యమానికి అప్రస్తుతం.

iii) పౌరహక్కుల ఉద్యమం ప్రజాపోరాటాల నుండి, రాజకీయ ఉద్యమాల నుండి స్వతంత్రంగా ఉండాలి. ఉద్యమించే హక్కును, రాజకీయ స్వేచ్ఛను కాపాడడానికి కృషి చేయాలి. ఉద్యమ లక్ష్యాలలోని ప్రజాస్వామిక అంశాలను స్వీకరించాలి. సమాజంలో వాటిని చర్చకు పెట్టి వాటికి సామాజిక ఆమోదం పొందే ప్రయత్నం చేయాలి. అయితే ఉద్యమాల నిర్మాణం, వ్యూహాలు, ఎత్తుగడలు, రాజకీయ వ్యాఖ్యల నుండి దూరంగా ఉండాలి. ఉద్యమాల లక్ష్యాల గురించి, హక్కుల గురించి మాట్లాడేటప్పుడు కూడ వాటి గొంతుతో కాక తన గొంతుతో మాట్లాడాలి. ఉద్యమాల ప్రవర్తన పౌరహక్కుల కృషికీ, దాని విశ్వసనీయతకూ ఇబ్బందికరంగా ఉన్న చోట ఈ జాగ్రత్తలు మరీ ఎక్కువగా పాటించాలి. ఐక్య కార్యాచరణ చేపట్టేటపుడు ఈ పరిమితిని దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలి.

iv) ప్రజాస్వామ్య విలువల పరిభాషలో మాట్లాడే పౌరహక్కుల ఉద్యమం రాజకీయ ఉద్యమాలూ ప్రజా పోరాటాలూ అప్రజాస్వామిక చర్యలకు పాల్పడితే విమర్శించాలి. ఆ పోరాటాల లక్ష్యంలోని న్యాయమైన ఆకాంక్షల గురించి మాట్లాడడం ఒక ముఖ్య కర్తవ్యంగా ఉన్న పౌరహక్కుల ఉద్యమం, ఆ పోరాటకారులు పాల్పడే అన్యాయాల గురించి మౌనంగా ఉండజాలదు. ఆ అన్యాయం హింసాత్మక రూపం తీసుకుంటే అది ఇతరుల జీవించే హక్కుకే భంగకరం అవుతుంది కాబట్టి మరీ తప్పనిసరిగా విమర్శించాలి.

v) ఉద్యమించే హక్కునూ ఉద్యమ ఆకాంక్షలలోని న్యాయమైన అంశాలనూ సమర్థించడం, ఉద్యమకారుల సకల చర్యలనూ సమర్థించడం ఒకటి కాదు. ఉద్యమకారుల చర్యలన్నిటినీ 'ప్రజల చర్యలు', 'ప్రజల విముక్తికి అవసరమైన చర్యలు' అని

సమర్థించడం సరయినది కాదు. వాళ్ల చర్యలకు నేరస్మృతి నుండి పూర్తి మినహాయింపు ఇవ్వాలని కోరడం (రాజకీయ ఖైదీలనందరినీ బేషరతుగా విడుదల చేయాలనడం) సరయిన వైఖరి కాదు.

vi) తిండి వుంటే చాలు వాక్ స్వాతంత్రం అక్కరలేదనీ వాక్ స్వాతంత్రం వుంటే చాలు తిండి అక్కరలేదనీ హక్కులలో హెచ్చుతగ్గులు నిర్ధారించడానికి జరుగుతున్న కృత్రిమమైన చర్చను పౌరహక్కుల ఉద్యమం తిరస్కరించాలి, విమర్శించాలి. మనిషి నిండుగా ఎదగడానికి అన్ని హక్కులూ అవసరం అని గుర్తించాలి.

హక్కుల సిద్ధాంతం, ఆచరణల మీద ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల ఉద్యమంలో అభిప్రాయభేదాలు తీవ్రమైనపుడు సభ్యుల మధ్య చర్చ కోసం రాసిన వ్యాసం

# విప్లవ హింస - హక్కుల దృక్పథం

నాకిచ్చిన అంశం మీద ప్రసంగించేముందు రెండు సమస్యలను ప్రస్తావించదలిచాను.

ఒకటి 'విప్లవ హింస' అనే మాటకు సంబంధించినది. విప్లవహింస అంటే ఏమిటి? బహుశా దాని అర్థం సిపిఐ (ఎమ్.ఎల్) పార్టీలు చేస్తున్న హింస కావచ్చు. భారతదేశంలో సిపిఐ (యం.యల్.) పార్టీలు, జాతుల ఉద్యమాలు చాలా హింసను ప్రయోగిస్తున్నాయి. ఇంతకు ముందు సెషన్‌లో జాతుల ఉద్యమాల గురించి చర్చించుకున్నాం. కాబట్టి, ఇక్కడ విప్లవ హింస అంటే సిపిఐ యం.యల్. పార్టీల హింస అనే అర్థంలో వాడుతున్నాం. కాని, తమను 'విప్లవకారులు'గా అభివర్ణించుకొనేవి సిపిఐ (యం.ఎల్) పార్టీలు మాత్రమే కావు. దళిత ఉద్యమం తన్ను తాను విప్లవ స్వభావం వున్నదిగా అనుకుంటుంది. అదేవిధంగా స్త్రీల ఉద్యమమూ. కాని నిన్నటి సెషన్‌లో వాటిని దళిత ఉద్యమంగాను, స్త్రీల ఉద్యమంగాను ప్రస్తావించామే కాని స్త్రీల విప్లవోద్యమంగానో, దళితుల విప్లవోద్యమంగానో

కె. బాలగోపాల్

ఎపిసిఎల్‌సి సదస్సులో ఇచ్చిన ఉపన్యాసం, 15.6.1997

ప్రస్తావించలేదు. ప్రస్తుతం నాకిచ్చిన అంశాన్ని అదేవిధంగా విప్లవహింసగా కాకుండా, సిపిఐ యమ్.ఎల్ పార్టీలు చేస్తున్న హింసగా ఎందుకు వర్ణించకూడదు? విప్లవం, సిపిఐ యమ్.ఎల్ పార్టీల రాజకీయాలు రెండూ ఒకటేననే స్పష్టమైన అభిప్రాయం ఇక్కడ ఉన్నట్టుంది.

అంతేకాదు స్త్రీలకు, దళితులకు సంబంధించిన రాజకీయాలు కేవలం ఒక సామాజిక బృందానికి చెందినవి మాత్రమే అనే అర్థమూ వుంది. అది నిజం కావచ్చు. కాకపోవచ్చు. కాని ప్రశ్నేమిటంటే, ఇదంతా నిజమేనని, దానికి ఎటువంటి వివరణ అవసరం లేదని పౌరహక్కుల ఉద్యమం ఎలా భావిస్తుంది? తన స్వంత ప్రాతిపదికల నుండి, తన అవగాహన చట్రంలో నుండి పౌరహక్కుల ఉద్యమం ఏవిధంగా ఇలాంటి అంచనాలకు వస్తుంది?

ఇది కాకతాళీయంగా జరిగిన పొరబాటు కాదు. పౌరహక్కుల ఉద్యమాల ప్రాపంచిక దృక్పథంలోనికి మార్క్సిస్టు లేక మార్క్సిస్టు-లెనినిస్టు భావనలను అప్రకటితంగా చొప్పించి, అదే ప్రజాస్వామ్య ప్రాపంచిక దృక్పథంగా చెలామణి చేయించడం అనేది చాలా సామాన్య విషయమైపోయింది. ఈ అభిప్రాయం నిజమా కాదా అనేది కాదు సమస్య. పౌరహక్కుల అవగాహనకు అవి పునాది అని భావిస్తే, ఆ విషయాన్ని స్పష్టంగా పైకి చెప్పుకోవాలి. అంతేకాని పౌరహక్కుల అవగాహన చాలా విశాలమైనది, ఏదో ఒక రాజకీయ సిద్ధాంతానికి పరిమితమైనది కాదు అనే అభిప్రాయం కలిగిస్తూ దాని చాటున ఈ అవగాహనను దాచివుంచనక్కరలేదు.

నాకు తెలిసినంతవరకు, భారతదేశంలోని ఏ పౌరహక్కులసంస్థా తన అవగాహనకు మార్క్సిస్టు, లేక మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం ప్రాతిపదిక అని చెప్పుకోలేదు. అన్నీ కూడా విశాలంగా కనిపించే ప్రణాళికలను రూపొందిస్తున్నాయి. ప్రణాళికలు రాసుకోనట్లయితే, విశాలమైన ప్రజాస్వామ్య లక్ష్యాలు వున్నట్లు చెప్పుకున్నాయి. సెక్టేరియన్‌గా కనిపించకుండా వుండడానికి, కమ్యూనిస్టుల జేబు సంస్థలగా రాజ్యంచేత ముద్రపడకుండా తప్పించుకోవడానికి ఇదంతా బహుశా అవసరం అని అనిపించి వుండవచ్చు.

దీనికి అనుగుణంగా సమస్యల గురించి, సంఘటనల గురించి చేసే వ్యాఖ్యానాలు నిజంగానే విశాల అవగాహన ప్రాతిపదికన వుండవలసింది. కాని, సమాజం, సామాజిక సంబంధాల గురించిన మార్క్సిస్టు, లేక మార్క్సిస్టు-లెనినిస్టు అభిప్రాయాల ప్రాతిపదికన వ్యాఖ్యానాలు చేయడం అలవాటయింది. అయితే దీనిని స్పష్టంగా చెప్పుకోకపోవడం వలన, ఆ దృక్పథం నుండి వచ్చే సిద్ధాంతపరమైన సమస్యలను పౌరహక్కుల ఉద్యమం ఎదుర్కోవడం లేదు. కనీసం తన ఆలోచనల ప్రాతిపదికను స్పష్టంగా చెప్పుకుని వుంటే కమ్యూనిస్టు సిద్ధాంతానికీ - ప్రజాస్వామ్యానికీ మధ్య వున్న ఇబ్బందికరమైన సంబంధాన్ని హక్కుల ఉద్యమం బలవంతంగానైనా పట్టించుకోవలసి వచ్చేది. అలా చేయనందువల్ల పరీక్షించబడని అనేక మార్క్సిస్టు-లెనినిస్టు భావనలు, పౌరహక్కుల దృక్పథాలను నిర్ధారిస్తూ వున్నాయి.

ఒక ఉదాహరణ తీసుకుందాం. నిన్నటి సమావేశంలో మానవ్ అధికార్ సంగ్రామ్ సమితి (మాస్)కు చెందిన భూయాన్ మాట్లాడుతూ ప్రజలలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల పెరుగుతున్న భ్రమల గురించి పౌరహక్కుల ఉద్యమాలు అప్రమత్తంగా వుండాలని అన్నారు. ఇది ఒక విచిత్రమైన సలహా. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాలకున్న పరిమితులను విమర్శించడం ఖచ్చితంగా పౌరహక్కుల ఉద్యమాల కర్తవ్యమే. ఆచరణలో దాని వక్రీకరణను కూడా విమర్శించాల్సిందే. ప్రభుత్వం నిజంగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించేలా కృషి చేయడం కూడా పౌరహక్కుల ఉద్యమాల కర్తవ్యమే. కాని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనే వ్యవస్థ గురించి ప్రజలు భ్రమలు పెంచుకోకుండా చూడడం పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యం ఎందుకు అవుతుంది? పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని వర్గపోరాటానికి, కార్మిక రాజ్యానికి మధ్య పోటీవ్యవస్థగా భావించే మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథంలో మాత్రమే ఇలాంటి లక్ష్యానికి అర్థముంటుంది. ఈ లక్ష్యం పౌరహక్కుల ఉద్యమానికి ఎందుకుండాలి? ఇలాంటి లక్ష్యం వుండాల్సిందే అని పౌరహక్కుల కార్యకర్తలు భావిస్తే, తమ ప్రాపంచిక దృక్పథం మార్క్సిజం-లెనినిజం అని బహిరంగంగా ప్రకటించాలి. దాని సిద్ధాంతపరమైన పరిణామాలను ఎదుర్కోవాలి. అంతేకాని, దానిని అప్రకటితంగా వుంచుకొని, ప్రజాస్వామ్యానికీ, పౌరహక్కులకూ, కమ్యూనిస్టు ఉద్యమ ప్రాపంచిక అవగాహనకూ మధ్య నున్న సంబంధంలోని చిక్కును పరిష్కరించే కష్టతరమైన కర్తవ్యాన్ని తప్పించుకుంటూ పోకూడదు.

చట్టం, సామాజిక సంస్కరణ, సంక్షేమం, పత్రికా స్వేచ్ఛ లాంటి భావనలపట్ల పౌరహక్కుల ఉద్యమంలో చాలామందికి వున్న దృక్పథాలకు కూడా ఇది వర్తిస్తుంది. మార్క్సిస్టు-లెనినిస్టు దృక్పథం వాటిని భ్రమగాను, భావజాలంగాను, అణచివేతగాను, మోసంగానూ భావిస్తుందే కాని అవి నాగరిక ప్రగతిని సూచించే విలువలని, వ్యవస్థలని అర్థం చేసుకొని వాటి పరిమితులను, వక్రీకరణలను విమర్శించి తద్వారా, వాటిలోని ప్రగతిశీల, ప్రజాస్వామిక సారాంశాన్ని ముందుకు తీసుకుపోవడానికి తోడ్పడాలని భావించదు.

నా రెండవ ప్రశ్న. ఈ సెమినార్‌లో హింసకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడానికి సంబంధించినది. ఈ సెమినార్ ప్రజాఉద్యమాలకు, పౌరహక్కుల ఉద్యమాలకు మధ్య వుండాల్సిన సంబంధం గురించి చర్చిస్తున్నది. కాని ప్రసంగాలు సగానికి పైగా హింసకు సంబంధించే వున్నాయి. ప్రజాస్వామ్య ఉద్యమాలలో హింసకు అంత ప్రాధాన్యం వుందా? నిజానికి హింసను ఇంత ఎక్కువగా పట్టించుకోవడానికి గల కారణం అది కాదనుకుంటాను. సామాజిక సమస్యలకు బలప్రయోగంలోనే పరిష్కారం వుందని నమ్ముతూ ఆ నమ్మకాన్ని ప్రజాస్వామ్యం, మానవహక్కుల పేరుమీద సమర్థించాలని ఆరాటపడడం కారణం అని నాకనిపిస్తుంది. ఏదోవిధంగా మానవహక్కుల అవగాహనను, హింసామార్గం ద్వారా సామాజిక మార్పును సాధించే ప్రయత్నాలకు అనుగుణంగా రూపొందించాలి. హింస విషయంలో పౌరహక్కుల ఉద్యమం ఎదుర్కొనే సమస్యల వలన కాక, పైన చెప్పిన కారణం

వలననే విప్లవహింస అనే అంశాన్ని చర్చించడానికి ఈ సెమినార్‌లో ఇంత సమయం కేటాయించబడిందనుకుంటాను.

**భా**రతదేశంలో చాలామంది మానవహక్కుల ఉద్యమ కార్యకర్తలకు మానవ విలువలు, ప్రమాణాలు, వ్యవస్థలకంటే హింసలోనే ఎక్కువ నమ్మకముండడం ఒక దురదృష్టకరమైన విషయం. వాళ్ళ వాదనే సరియైనది కావచ్చు. మిగిలినవాళ్ళు పిచ్చివాళ్ళ స్వర్గంలో జీవిస్తూ వుండవచ్చు. కాని అదే నిజం అయితే మాత్రం మానవహక్కుల ఉద్యమాన్ని మూసేసుకోవడం మంచిది. ప్రజాస్వామిక విలువల కోసం వ్యవస్థీకృత సూత్రాల కోసం జరిపే అన్వేషణలోనే దానికి మనుగడ వుండగలదు. సామాజిక సమస్యలకు హింసాత్మక పరిష్కారాలను వెతికే రాజకీయ ఉద్యమాల అవసరాలకనుగుణంగా తన అభిప్రాయాలను, అవగాహనను రూపొందించుకొనే మానవహక్కుల ఉద్యమానికి స్థానం లేదు.

ఇప్పుడు నాకిచ్చిన అంశంమీద మాట్లాడతాను. నేను విప్లవహింస గురించి మాట్లాడను. రాజకీయ హింస మీద మాట్లాడతాను. ఎందుకంటే పౌరహక్కుల ఉద్యమం తన పరిధిలో ఒక రాజకీయాన్ని విప్లవకరమైనదిగాను మిగిలినవాటిని విప్లవకరం కానివిగాను గుర్తించజాలదు. కాని, రాజకీయ హింస అనే పదం ఆధిపత్య సామాజిక గ్రూపులు, వర్ణాలు చేసే హింసకు కూడా వర్తిస్తుంది కాబట్టి, దానితో పౌరహక్కుల ఉద్యమానికి సమస్య లేదు కాబట్టి అణచివేతకు గురౌతున్న ప్రజల అవసరాలు, విశ్వాసాలు, నమ్మకాల నుండి పుట్టిన రాజకీయ హింస గురించి మాట్లాడతాను. ఆ ప్రజలు కార్మికవర్గం కావచ్చు, దళితకులాలు కావచ్చు, ఒక అణగారిన జాతి కావచ్చు, స్త్రీలు కావచ్చు, మైనారిటీ కావచ్చు, ఏదయినా కావచ్చు.

## పౌరహక్కుల ఉద్యమం–హింస

పౌరహక్కుల ఉద్యమానికి హింస అనేది ఒక ఇబ్బందికరమైన విషయమే తప్ప ఒక ప్రధాన అంశం కాదు. ఇక్కడ నేను రాజకీయ హింస గురించి మాత్రమే మాట్లాడడం లేదు. హింస గురించి సాధారణంగా మాట్లాడుతున్నాను. పౌరహక్కుల ఉద్యమం జీవించే హక్కుకు కేంద్రస్థానాన్ని ఇస్తుంది. పౌరహక్కులలో ఇది అత్యంత ప్రధానమైనది. ఉద్యమం తన శక్తిని, కృషిని చాలావరకు జీవించేహక్కు అర్థాన్ని, పరిధిని విస్తృతపరచడానికి ఖర్చుచేసింది. జీవించడమంటే భౌతిక మనుగడ మాత్రమే కాదని, పరిపూర్ణమైన, గౌరవనీయమైన జీవితాన్ని గడపడమని నిర్వచించింది. అయితే ప్రాణాన్ని, స్వేచ్ఛను హరించే హింస చాలా జరుగుతూ వుంది. దాని గురించి పౌరహక్కుల ఉద్యమం మౌనంగా వుంది. నిశ్శబ్దం ఇబ్బందికరమైన విషయం. కొంతకాలంగా, సామాజిక వ్యవస్థలోని ఆధిపత్యస్థానాల నుండి పుట్టే హింసకు వ్యతిరేకంగా ఉద్యమించడం పౌరహక్కుల ఉద్యమం నేర్చుకుంది. ఉదాహరణకు, దళితులమీద జరిగే అగ్రకులాల హింస, స్త్రీలమీద పురుషులు చేసే హింస. అయినా పౌరహక్కుల ఉద్యమం మౌనంగా చూస్తూ ఊరుకుంటున్న హింస ఇంకా చాలా జరుగుతూనే ఉంది.

> సామాజిక వ్యవస్థలోని ఆధిపత్యస్థానాల నుండి పుట్టే హింసకు వ్యతిరేకంగా ఉద్యమించడం పౌరహక్కుల ఉద్యమం నేర్చుకుంది. ఉదాహరణకు, దళితులమీద జరిగే అగ్రకులాల హింస, స్త్రీలమీద పురుషులు చేసే హింస. అయినా పౌరహక్కుల ఉద్యమం మౌనంగా చూస్తూ ఊరుకుంటున్న హింస ఇంకా చాలా జరుగుతూనే ఉంది.

జీవించే హక్కు ఒక మానవ విలువగా పరిగణిస్తున్నాము కాబట్టి (ఫలానావారి జీవించే హక్కు అని కాకుండా) ఈ మౌనానికి సంజాయిషీ చెప్పడం తప్పనిసరి. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో ఒక సమాధానం ఏమిటంటే 'హింసాత్మక చర్యలను పట్టించుకోవడానికి చట్టం వుంది. న్యాయవ్యవస్థ వుంది. కాబట్టి మేము స్పందించనక్కరలేదు' అని. ఇలా అనడమంటే చట్టానికి, న్యాయవ్యవస్థకు సాధికారత(లెజిటిమసీ)ను ఇవ్వడమే. కాని వేరే సందర్భాలలో పౌరహక్కుల ఉద్యమం ఈ సాధికారతను నిరాకరిస్తూ వుంటుంది. దాని గురించి తర్వాత మాట్లాడతాను.

ఇది పూర్తిగా చట్టపరమైన వాదన. పౌరహక్కుల ఉద్యమ దృక్పథం పూర్తిగా చట్టపరమైనది అయివుంటే ఈ వాదన సంతృప్తికరంగా వుండేది. 'చట్టముంది పరిపాలన ఖచ్చితంగా దాని ప్రకారం జరగాలి' అనేదే పౌరహక్కుల ఉద్యమం యొక్క సాధారణ అవగాహన అయివుంటే, అప్పుడు కేవలం చట్టపరమైన ఈ వాదన సరియైనది అవుతుంది. కానీ పౌరహక్కుల ఉద్యమం అవగాహన చట్టంతో పాటు రాజకీయ, సామాజిక, నైతిక వాదనల సమ్మేళనం.

నిజానికి చట్టానికి ఈ మాత్రం స్థానం కూడా ఇవ్వకూడదని ఒక్కొక్కసారి అంటుంటారు. చట్టపరమైన వాదన ఒట్టి భ్రమ అని, సామాజిక, రాజకీయ సమస్యలను మాత్రమే మాట్లాడాలి అని వాదిస్తారు. (ఇందులో ఆసక్తికరమైన మరో కోణమేమిటంటే చట్టాన్ని భ్రమ అని కొట్టిపారేసేవాళ్లే నైతికతనూ భ్రమగా ఎగతాళి చేస్తారు.) అన్ని హింసలను ఎందుకు ఖండించరు అనే ప్రశ్నకు సమాధానం చెప్పేటప్పుడు మాత్రం పూర్తిగా చట్టపరమైన వాదన చేయడం సంతృప్తికరం ఎట్లా అవుతుంది?

పౌరహక్కుల ఉద్యమంలో పనిచేసే అందరినీ ఇది ఇబ్బంది పెడుతుంది. పోలీసుల కస్టడీలో నిందితులు మరణించినప్పుడు మనం ఖండిస్తాం. నిందితుడు చేసిన నేరం గురించి ప్రజలు సాధారణంగా మనల్ని ప్రశ్నిస్తారు. "ఇతను మా యింట్లో జొరబడి మేం పొదుపు చేసుకున్న వస్తువులు దొంగిలించినప్పుడు మీరెక్కడున్నారు?" అని అడుగుతారు. అలాంటి నేరాన్ని పట్టించుకోవడానికి చట్టముంది, చట్టం తన పని తాను చేసుకుపోతుంది అనే సమాధానం అన్నిసార్లు సంతృప్తికరంగా వుండదు. ఈ సమాధానం సరియైనది కాదని కాదు నా ఉద్దేశం. కాని అన్ని సందర్భాలకు ఈ సమాధానం పూర్తిగా సరిపోదు. ఒకరి హక్కులను

మనం సమర్థించినప్పుడు, వారి చర్యలకు కూడా మనం కొంతమేర జవాబుదార్లు అవుతామనేది సాధారణ నైతికసూత్రం. ఇతర సందర్భాలలో పరిహసించబడే చట్టాలమీద పూర్తి బాధ్యతను పెట్టలేము. ఉదాహరణకు, కస్టడీలో చంపబడిన వ్యక్తి చిన్న చిన్న దొంగతనాలు చేసేవాడైతే "చట్టం తన పని తాను చేసుకుపోనీ, ఆ పేదవాని నేరాన్ని మేము ఖండించం" అని అనగలము.

అంతేకాదు, చట్టం అతని నేరాన్ని అతని దారిద్ర్యం దృష్ట్యా కొంత దయతో చూడాలని అంటాం. అయితే కస్టడీలో చనిపోయిన వ్యక్తి కిరాయి హంతకుడైతే, ప్రజలకు సమాధానం చెప్పేటప్పుడు "అతను చేసిన హత్యలను మేము ఖండిస్తాం" అని చెప్పాల్సిన అవసరం రావడం పౌరహక్కుల ఉద్యమంలో పనిచేసే కార్యకర్తలందరికీ అనుభవమే. వాళ్ళు చేసిన చర్యలలోని న్యాయాన్యాయాలలో తేడా వుంటుంది. చర్యలలోని న్యాయాన్యాయాల జోలికి పోకుండా, పూర్తిగా చట్టపరమైన వాదన ఇవ్వడం అనేది అన్ని సందర్భాలలో సాధ్యం కాదని పౌరహక్కుల కార్యకర్తలు తెలుసుకున్నారు.

నేరాలు రెండే రెండు రకాలు అయివుంటే చాలా బాగా వుండేది. బలవంతులు బలహీనుల మీద చేసేవి బలహీనులు బలవంతులకు వ్యతిరేకంగా చేసేవి. అదే నిజమయితే నైతిక సందిగ్ధత ఇంత తీవ్రంగా ఉండేది కాదు. వేదికల మీద మాట్లాడేటప్పుడు పౌరహక్కుల కార్యకర్తలు సాధారణంగా రెండే రకాల నేరాలు వున్నట్లు మాట్లాడతారు. కాని అది వాస్తవం కాదు. మనం తరచుగా కష్టతరమైన నిర్ణయాలు చేయవలసి వుంటుంది. పేదవాడు బాగా ధనవంతుల నుండి కాకుండా, సాధారణంగా మధ్యతరగతి నుండి, క్రింది వర్గాల నుండి మాత్రమే దొంగిలిస్తాడు. ధనవంతుల నుండి దొంగతనం చేయడం సులభం కాదు. వాళ్లకు కాపలాకుక్కలు, కాపలా మనుషులు వుంటారు. అందువల్లనే దొంగతనం సామాజిక సంపదను పున:పంపిణీ చేసే క్రియ అనే వాదన అన్నిసార్లు సరియైంది కాదు. కాకపోతే బహిరంగసభల్లో ఇలా మాట్లాడి చప్పట్లు కొట్టించుకోవచ్చు.

హింస అనే సమస్యకు – అది రాజకీయ పరమైనదైనా కాకపోయినా పౌరహక్కుల, ప్రజాస్వామిక దృక్పథం నుండి సులభమైన సమాధానం లేదు. హింసగా సాధారణంగా పిలువబడేది భౌతికహింస మాత్రమే. కాని వ్యవస్థితమైన హింస చాలా వుంటుంది. అసమానత్వం, దోపిడి, అస్వతంత్రత కూడా హింసే. తరుచుగా భౌతిక హింసకు ఈ వ్యవస్థాపరమైన హింసతో సంబంధం వుంటుంది. ఇది రోజువారీ సాధారణ హింసాత్మక సంఘటనలకే కాక, రాజకీయ తిరుగుబాటుదారుల హింసకు కూడా వర్తిస్తుంది. కాని దీని అర్థం వ్యవస్థీకృత హింస పేరుతో భౌతికహింసను సమర్థించుకోవచ్చునని కాదు. ఆకలితో వున్న ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తిని కొట్టి డబ్బు దొంగిలిస్తే ఆ హింస ఆకలి కారణంగా సమర్థనీయమే అనిపిస్తుంది. కాని దాడికి గురైన వ్యక్తి దోపిడీదారుడు కాకపోవచ్చు. శ్రమచేసి జీవించే వ్యక్తి కావచ్చు. అలాంటప్పుడు సమర్థించడం సమస్య అవుతుంది. రాడికల్ పౌరహక్కుల సిద్ధాంతకారుల ఉపన్యాసాల్లో మాత్రమే ఇలాంటి సమస్య వుండదు. వారి

మాటల్లో రెండే రెండు వర్గాలు వుంటాయి. దోపిడీదారులు, దోపిడికి గురయ్యేవారు. అంతేకాదు దోపిడికి గురయ్యేవాళ్లు చేసే అన్ని రకాల హింసలు, వ్యక్తిగతమైనా, వ్యవస్థీకృతమైనా దోపిడిదారులకు వ్యతిరేకంగానే ఎక్కుపెట్టబడతాయి. కాని వాస్తవంలో సమాజం చాలా సంక్లిష్టంగా వుంటుంది. అలాగే హింసాత్మక చర్యలూను. మొత్తం హింసను సమర్థించడమూ సాధ్యం కాదు. అన్నీ ఖండించాల్సిన అవసరమూ వుండదు. ఒక హింసాత్మక చర్యను సమర్థిస్తున్నామంటే అర్థం అది వ్యవస్థీకృత హింసయొక్క అనివార్యమైన పరిణామమని, లేదా అలాంటి వ్యవస్థీకృత హింసను అధిగమించడానికి తప్పనిసరి అయిన చర్య అని. కాని ఈ రెండు విషయాలనూ నిరూపించడం సాధారణంగా సాధ్యం కాదు. అయితే సామాజిక వ్యవస్థలోని వ్యవస్థీకృత హింసతో ఈ చర్యకు వున్న సంబంధాన్ని చూపడం సాధ్యమే, అది అవసరం కూడా.

అణచివేతకు గురౌతున్న వాళ్ళ హింసను పూర్తిగా సమర్థించడమో లేక పూర్తిగా ఖండించడమో కాక, ఆ నిర్దిష్ట సామాజిక నేపథ్యంలో ఆ హింసను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం సాధ్యమవుతుంది. హింసను అర్థం చేసుకోవడమంటే దానిని ఒక అనివార్యమైన పరిణామంగానో ఒక అవసరమైన చర్యగానో అర్థం చేసుకోవడం కాదు. వాస్తవంలో దానికీ సామాజిక వ్యవస్థకూ మధ్య వున్న సంబంధాన్ని చూడడమే. సామాజిక సందర్భాన్ని అర్థం చేసుకోవడానికి చేసే ప్రయత్నానికి రెండు ప్రయోజనాలు వుంటాయి.

భౌతిక హింసమీద మాత్రమే దృష్టిని కేంద్రీకరించవద్దనీ సామాజిక వ్యవస్థలో నిర్మితమై వున్న హింసవైపు దృష్టిని సారించమనీ సమాజంపైన ఒత్తిడి పెట్టడం, ముందుగా ఆ హింసకు పరిష్కారాన్ని కనుగొనవలసిన అవసరాన్ని చూడమనడం, మొదటిది. రెండవది సామాజిక అణచివేతనుండి పుట్టిన హింస విషయంలో చట్టము, న్యాయవ్యవస్థ కొంత ఉదారమైన వైఖరిని ప్రదర్శించాలని కోరడం. ఈనాడు వున్న చట్టం కూడా ఆత్మరక్షణ, ఆస్తులరక్షణ సందర్భాలలో చేసే నేరాలపట్ల క్షణికోద్రేకంలో చేసే నేరాలపట్ల ఉదార దృక్పథాన్నే అవలంబిస్తుంది. సామాజిక అణచివేతతో ముడిపడి జరిగే నేరాలకు కూడా ఈ ఉదార వైఖరిని విస్తరింపజేయవచ్చు ఇది చాలా సున్నితమైన కృషి. దీనిని సాధించడానికి పౌరహక్కుల ఉద్యమం తనను తాను హింసకు దూరంగా ఉంచుకోవాల్సిన అవసరం వుంటుంది. తద్వారా హింసను ప్రజాస్వామికంగా అర్థం చేసుకోమని, దానికున్న సామాజిక నేపథ్యాన్ని చూడమని ఒత్తిడి పెట్టడానికి వీలౌతుంది. రాజ్యానికి, హింసకు పాల్పడేవారికి మధ్య ఒక తృతీయశక్తిగా లేక తటస్థ శక్తిగా వుండడం అవసరం అవుతుంది. ఈ తృతీయరంగాన్ని ప్రజాస్వామిక విలువలు సూత్రాల ప్రాతిపదికన నిర్వచించుకోవాలి. ఈ తృతీయరంగమే ఈ విషయంలో పౌరహక్కుల ఉద్యమ కార్యరంగం. కాని సమాజంలో రెండు వర్గాలు మాత్రమే వున్నాయని, ఏ విషయంపైన అయినా రెండు అభిప్రాయాలే వుంటాయని, రెండు వైఖరులు మాత్రమే వుంటాయని అనుకునేవాళ్ళు దీనిని అంగీకరించరు, అంగీకరించలేరు. కాని అలాంటి దృక్పథంలో పౌరహక్కుల ఉద్యమానికి స్థానం లేదు. దానిని విడిచిపెట్టవలసి వుంటుంది.

మనం హింస గురించి మాట్లాడేటప్పుడు చట్టం గురించి, చట్టబద్ధ పాలన గురించి తప్పకుండా మాట్లాడాలి. చట్టమే అణచివేత స్వభావం కలిగినదని, ప్రజలకు చట్టాలను అతిక్రమించే హక్కు వున్నదని పౌరహక్కుల ఉద్యమంలో ఒక అభిప్రాయం వుంది. ఇది సరియైన అభిప్రాయమని నేను అనుకోవడం లేదు. నిజానికి అధికారంలో వున్నవారికన్నా, ధనవంతులకన్నా చట్టబద్ధ జీవితం పేదవారికి, బలహీనులకే ఎక్కువ అవసరం. పేదవారి గురించి మనం మాట్లాడుతున్నప్పుడు వాళ్ళు నిరంతరం పోరాటాల్లో వున్నవాళ్ళుగా మాట్లాడకూడదు. అలాంటప్పుడు మాత్రమే, చట్టం చట్టబద్ధత అవరోధాలుగా కనిపిస్తాయి.

నిజానికి పోరాటాలకు సహితం చట్టం ఎంత వ్యతిరేకంగా వుండగలదో అంత సహాయకారిగా కూడా వుండగలదు. పోరాటాల్లో వున్న ప్రజలు తరచుగా చట్టం సహాయం తీసుకుంటూ వుంటారు. పోరాటమంటే హింస అని అనుకున్నప్పుడు మాత్రమే చట్టం సహాయకారిగా కన్నా అవరోధంగా కనిపిస్తుంది. కాని పోరాటమంటేనే హింస అనుకోవడం సమంజసం కాదు. పేదవారిని, అణచివేతకు గురౌతున్నవారిని నిరంతరం రాజకీయ పోరాటాల్లో మునిగితేలుతున్న వారిగా చూడడం అనేదే తప్పు. పేదలు, అణచివేతకు గురౌతున్నవారు అత్యధిక శాతం సాధారణ జీవితాన్ని గడుపుతుంటారు. ఈ సాధారణ జీవనానికి చట్టబద్ధ సమాజం అవసరం. ధనవంతులకన్నా, బలవంతులకన్నా, పేదలే ఎక్కువగా చట్టరహిత సమాజంలో ఇబ్బందుల పాలౌతారు. పేదల సాధారణ జీవనాన్ని కాక పోరాటాలను మాత్రమే పట్టించుకొనే పౌరహక్కుల ఉద్యమం తన పూర్తి కర్తవ్యాన్ని నిర్వర్తించదు. ఈ మధ్యాహ్నం జరగబోయే సమావేశంలో చట్టబద్ధపాలన-వర్గపోరాటం అనే అంశం గురించి ఇద్దరు వక్తలు మాట్లాడబోతున్నారు. వర్గపోరాటాల గురించి మాత్రమే ఎందుకు మాట్లాడాలి, అణచివేతకు గురౌతున్న ఇతర సామాజిక బృందాల పోరాటాల గురించి ఎందుకు మాట్లాడుకోకూడదు అనే ప్రశ్నను పక్కన పట్టినా, చట్టబద్ధపాలన, రోజువారీ జీవితం అనే అంశాన్ని గురించి కూడా మాట్లాడినప్పుడు మాత్రమే చట్టం యొక్క పాత్రను పూర్తిగా అర్థం చేసుకోగలము.

ధనవంతులకు, బలవంతులకు చట్టం ఎంత అవసరమో బహుశా వాళ్ళకన్నా ఎక్కువగా పేదవాళ్ళకు, బలహీనులకు అవసరం. అయితే ఇక్కడున్న వైరుధ్యం ఏమిటంటే, చట్టం అనేది జీవితానికి అవసరం అయిన స్థిరత్వాన్ని, భద్రతను ఇవ్వడమేకాక, అసమాన సామాజిక సంబంధాలను స్థిరీకరిస్తుంది, పునరుత్పత్తి చేస్తుంది. కాబట్టి వారి రోజువారీ జీవనంలోనూ, అసమానత్వాన్ని అధిగమించడానికి చేసే పోరాటక్రమంలోనూ పేదలు చట్టాన్ని ఒక అణచివేత శక్తిగా కూడా ఎదుర్కొంటారు. జీవించడానికి వాళ్ళకు చట్టం అవసరం. అయితే వాళ్లు కోరుకునే జీవితాన్ని మెరుగుపరచుకోవడానికి కొన్నిసార్లు వాళ్ళు చట్టాన్ని అతిక్రమించవలసి వస్తుంది. మార్పుపట్ల చట్టం సున్నితంగా వున్నంతమేరకు, చట్టాన్ని ఉల్లంఘించడానికి సంపూర్ణమైన హక్కు కావాలనడం పేదలకు, అణచివేతకు గురౌతున్న వారికి అవసరం కాదు. అటువంటి విధ్వంసక దృక్పథం పేదల జీవితాన్ని దుర్భరం చేస్తుంది.

చట్టం సాధికారితను తిరస్కరించకుండా దానిచుట్టూ వుండే మిథ్యను తొలగించడం అనే లక్ష్యాన్ని పౌరహక్కుల ఉద్యమం స్వీకరించాలి. అది చాలా సున్నితమైన, సంక్లిష్టమైన లక్ష్యం. చట్టమే అణచివేతకు ఒక భావజాల సాధనం అని అనడం మానేసి పౌరహక్కుల ఉద్యమం ఈ లక్ష్యాన్ని స్వీకరించాలి.

అయితే అన్యాయమైన చట్టాలను వ్యతిరేకించే హక్కు వుండాలి. హేతుబద్ధమైన చట్టాలను అన్యాయంగా ప్రయోగించడాన్ని కూడా వ్యతిరేకించే హక్కు వుండాలి. ఇందులో విప్లవాత్మకమైనదేమీ లేదు. మహాత్మాగాంధీ కూడా ఈ మాటలు అన్నాడు. ఈ పౌరహక్కుల ఉద్యమం న్యాయమనుకునేది మహాత్మాగాంధి న్యాయమనుకున్నది ఒకటి కాకపోవచ్చు. కాని సూత్రప్రాయంగా అంతకు మించి పౌరహక్కుల ఉద్యమం చెప్పగలిగింది లేదు.

కాబట్టి చట్టానికి వుండే సాధికారతను తిరస్కరించవలసిన అవసరం లేదు. అది ప్రజలకు హాని చేస్తుంది. కాని చట్టం చుట్టూ వుండే మిథ్యను తొలగించాల్సిన అవసరం మాత్రం వుంది. చట్టబద్ధమైనదంతా న్యాయమేనని, చట్ట వ్యతిరేకమైనదంతా అన్యాయమని ఈ భ్రమ అంటుంది. ఇది నిజం కావాల్సిన అవసరం లేదని మనకు తెలుసు. చట్టం సాధికారతను తిరస్కరించకుండా దానిచుట్టూ వుండే ఈ మిథ్యను తొలగించడం అనే లక్ష్యాన్ని పౌరహక్కుల ఉద్యమం స్వీకరించాలి. అది చాలా సున్నితమైన, సంక్లిష్టమైన లక్ష్యం. చట్టమే అణచివేతకు ఒక భావజాల సాధనం అని అనడం మానేసి పౌరహక్కుల ఉద్యమం ఈ లక్ష్యాన్ని స్వీకరించాలి.

## పౌరహక్కుల ఉద్యమం – రాజకీయ హింస

పైన చెప్పిన విషయాలు సంఘటిత, అసంఘటిత హింసలకు వర్తిస్తాయి. అయితే అణచివేతకు గురయ్యే ప్రజల ఆకాంక్షలనుండి విశ్వాసాలనుండి, సమస్యలనుండి ఉత్పన్నమయ్యే రాజకీయ హింస గురించి ఇంకొన్ని విషయాలు మాట్లాడుకోవలసి వుంది.

హింసను కాసేపు పక్కన పెడదాం. పౌరహక్కుల ఉద్యమానికి, ప్రజల కోరికలనుండి, విశ్వాసాలనుండి పుట్టిన రాజకీయ ఉద్యమాలకు మధ్యవున్న సంబంధం ఎలాంటిది? మొదటగా వాటిమధ్య సంబంధం అసలు ఎందుకు వుండాలి? సామాజిక సంబంధాలను, విలువలను, సంస్థలను ప్రజాస్వామ్యీకరించడం పౌరహక్కుల ఉద్యమ లక్ష్యం. ఇది నిర్మాణాత్మక సంస్కరణ ద్వారానైనా జరగవచ్చు లేదా రాజకీయ ఉద్యమాలు పెట్టే ఒత్తిడి ద్వారానైనా జరగవచ్చు. అందువల్లనే ప్రస్తుతమున్న చట్టంతోనూ రాజకీయ వ్యవస్థతోనూ పౌరహక్కుల ఉద్యమానికి సంబంధం వుంటుంది. అదే విధంగా పీడితుల రాజకీయ ఉద్యమాలతో పౌరహక్కుల ఉద్యమానికి సంబంధం వుంటుంది. రాజకీయ ఉద్యమకారులు

మొదటిదానిని సంస్కరణవాద భ్రమగా వర్ణిస్తారు. ప్రభుత్వం రెండవ అంశాన్ని తీవ్రవాద సంబంధాలుగా వర్ణిస్తుంది. వాళ్ళేమన్నప్పటికీ, పౌరహక్కుల ఉద్యమానికి రెండూ అవసరమే.

కాని రాజకీయ ఉద్యమాలతో ఎలాంటి సంబంధం వుండాలి? పీడితుల రాజకీయ ఉద్యమాలకు రెండు కోణాలున్నాయి. పీడితుల జీవన పరిస్థితులలో నుండి వచ్చిన ప్రజాస్వామిక ఆకాంక్షలు మొదటిది. ఉద్యమాన్ని నడిపించే ఉద్యమసంస్థలు లేక పార్టీలు చేపట్టే రాజకీయ కార్యక్రమాలు, ఎత్తుగడలు, సిద్ధాంత సూత్రీకరణలు రెండవది. పౌరహక్కుల ఉద్యమం ప్రధానంగా మొదటిదాన్నే పట్టించుకుంటుంది. ఉద్యమాలవెనక వున్న ప్రజాస్వామిక ఆకాంక్షలను పౌరహక్కుల ఉద్యమం స్వీకరించి ప్రస్తుతమున్న ప్రజాస్వామిక దృక్పథంలో భాగం చేయడానికి ప్రయత్నిస్తుంది. రాజకీయ ఉద్యమాలు సాధారణంగా తమ సామాజిక పునాదితోనే సంభాషిస్తాయి. పౌరహక్కుల ఉద్యమం సమాజంలోని ఇతరులకు విజ్ఞప్తి చేస్తుంది. ఉద్యమాలలోని ప్రజల ఆకాంక్షల గురించి ఆలోచించమని ఒత్తిడి పెడుతుంది. సమాజంలో రెండే రెండు వర్గాలు, రెండే ప్రయోజనాలు, రెండే అభిప్రాయాలు వుంటాయి అని నమ్మేవాళ్లు ఈ ప్రధానమైన తేడాను అర్థం చేసుకోలేరు.

**అ**లాంటివాళ్ళు పౌరహక్కుల ఉద్యమం రాజకీయ తిరుగుబాటు ఉద్యమంతో తన గొంతు కలపాలని, లేకపోతే శత్రువుతో కలిసి పోయినట్టేనని ఒత్తిడి చేస్తారు. కాని ఇందుకు విరుద్ధంగా, రాజ్యానికి (పీడకులకూ) పీడితుల ఉద్యమాలకూ మధ్య ఒక మూడవ (నాల్గవ, అయిదవ) క్షేత్రం, కార్యరంగం వున్నాయన్న విశ్వాసంపైన పౌరహక్కుల దృక్పథం ఆధారపడింది. ఈ కార్యరంగం వుండేది చైతన్యంలోని విలువలలో. పౌరహక్కుల ఉద్యమం ఆ కార్యరంగంలో పనిచేస్తుంది. పీడితుల ఉద్యమాలు ముందుకు తీసుకొచ్చే ప్రజాతంత్ర ఆకాంక్షలకూ విలువలకూ అక్కడ చోటు కల్పించాలని ప్రయత్నం చేస్తుంది. అందుకోసం కృషి చేస్తుంది. ఈ విలువలను, ఆకాంక్షలను సాధ్యమైనచోట వ్యవస్థీకరించడానికి ప్రయత్నం చేస్తుంది. రాజకీయ ఉద్యమాల గొంతుతో కాకుండా, తన స్వంత గొంతుతో మాట్లాడినప్పుడు మాత్రమే పౌరహక్కుల ఉద్యమం ఈ పని చెయ్యగలదు. ఆ రాజకీయ ఉద్యమాల సిద్ధాంతం, పరిభాషలో కాకుండా విలువల, ఆలోచనల పరిభాషలో మాట్లాడితేనే ఇది సాధ్యమవుతుంది. పౌరహక్కుల ఉద్యమం పాత్ర, కర్తవ్యం ఇది అయినప్పుడు, రాజకీయ ఉద్యమాల ఎత్తుగడలు, సిద్ధాంతాల కనుగుణంగా తన అవగాహనను రూపొందించుకోవలసిన అవసరం పౌరహక్కుల ఉద్యమానికి లేదు. వాటితో దానికి సంబంధం లేదు.

పౌరహక్కుల ఉద్యమానికి, పీడితుల రాజకీయ ఉద్యమాలకూ మధ్యవున్న సాధారణ సంబంధం ఇది. రాజకీయ హింసకు ఇది మరింతగా వర్తిస్తుంది. ముందుగానే చెప్పినట్లు జీవించేహక్కు గురించి మాట్లాడే పౌరహక్కుల ఉద్యమం, హింస గురించి తేలికగా మాట్లాడజాలదు. హింసకు వెనకవున్న సామాజిక నేపథ్యాన్ని గురించి ఆలోచించమని మాత్రమే చెప్పగలదు. హింస మీదనే దృష్టి అంతా పెట్టకుండా దాని సామాజిక నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలని చెప్పగలదు.

రాజకీయ హింస విషయంలో మరింత అప్రమత్తత అవసరం. ఎందుకంటే రాజకీయ హింస యొక్క లక్ష్యం అధికారాన్ని హస్తగతం చేసుకోవడం లేదా అధికారాన్ని స్థాపించడం. పౌరహక్కుల ఉద్యమం నిరంతరం అధికారంపట్ల అనుమానంతోనే వుండాలి. పౌరులమీద రాజ్యం అధికారం, దళితులమీద అగ్రకులస్థుల అధికారం, స్త్రీలమీద పురుషుల అధికారం, వెనుకబడిన వర్గాలమీద అభివృద్ధి చెందినవారి అధికారం, మైనారిటీలమీద మెజారిటీల అధికారం – వీటి గురించి ఆందోళన చేయడమే పౌరహక్కుల ఉద్యమం ప్రధాన కార్యరంగం. కాబట్టి అధికారం కోసం సంఘర్షించే ఉద్యమాలతో పౌరహక్కుల ఉద్యమం భుజం, భుజం కలిపి తిరుగజాలదు. ఇది రాజకీయ ఉద్యమాల ప్రజాపునాదిని గుర్తిస్తుంది. ఉద్యమం వెనకవున్న ప్రజాస్వామిక, సమానత్వ ఆకాంక్షలను అంగీకరిస్తుంది. ప్రచారం చేస్తుంది. కాని ఉద్యమం గొంతుతో తన గొంతు కలపలేదు. అధికారాన్ని ఆశించే వ్యవస్థీకృత ఉద్యమాలకు ప్రతిదీ తమ ఆధిపత్యం క్రిందకు రావాలని ప్రయత్నం చేసే అలవాటు వుంది. తాము చేసే ప్రతిదానికి అందరి ఆమోదము వుండాలని ఒత్తిడి చేస్తారు. తామూ ప్రజలూ ఒకటేననే వాదనను అంగీకరించాలని డిమాండ్ చేస్తారు. తమ చర్యలు, నిర్ణయాలు ప్రజలవేనని ఒప్పుకోవాలంటారు. అధికారం ఏర్పరచాలనే తమ కోరిక కారణంగా ప్రస్తుతమున్న సామాజిక పరిస్థితుల పట్ల ప్రజలు విశ్వాసం కోల్పోవాలని ఆ ఉద్యమాలు కోరుకుంటాయి. అంటే ఉన్న సమాజం గురించి 'భ్రమలు' వదులుకోవాలని అర్థం. విశ్వాసం పోగొట్టే కర్తవ్యానికి సహకరించాలని ఆ ఉద్యమాలు అందరిమీద వత్తిడి పెడతాయి.

పౌరహక్కుల ఉద్యమం కూడా ఈ ఒత్తిడికి గురౌతుంది. కానీ దానికి పౌరహక్కుల ఉద్యమం లొంగడానికి వీలులేదు. సమాజం లోపల సంస్కరణలు తేవడానికి కృషి చేయడం, మౌలికమైన మార్పులు తేవడానికి ఉద్యమించే అవకాశాలను, స్వేచ్ఛను కాపాడడానికి కృషి చేయడం అనే ద్వివిధ కర్తవ్యం పౌరహక్కుల ఉద్యమానికి వుంటుంది.

సంఘటిత రాజకీయ ఉద్యమాలు ప్రయోగించే హింస విషయంలో పౌరహక్కుల ఉద్యమం మీద ఈ ఒత్తిడి తీవ్రంగా వుంది. వాళ్లు పాల్పడే అన్ని రకాల హింసలను ప్రజలు చేసే హింసగా వర్ణించాలని పౌరహక్కుల ఉద్యమాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు హింసకు గురౌతున్నారు కాబట్టి, వాళ్లు తిరిగి హింసాత్మకంగా సమాధానం చెప్పదల్చుకున్నారు కాబట్టి, అది ఏ రూపం తీసుకున్నా సమర్థనీయమేనని, ప్రజాస్వామికమేనని సంఘటిత రాజకీయ ఉద్యమాలు వాదిస్తున్నాయి. పౌరహక్కుల ఉద్యమం ఈ వాదనను ప్రచారం చేయడానికి సహాయపడాలని భావిస్తున్నారు. ఈ ఒత్తిడిని పౌరహక్కుల ఉద్యమం తిరస్కరించాలి. ఆ రాజకీయ సంస్థకు వున్న ప్రజామద్దతును గుర్తించడానికి నిరాకరించాల్సిన అవసరం లేదు, నిరాకరించకూడదు. కాని ఆ సంస్థయొక్క చర్యలను, నిర్ణయాలను ప్రజల చర్యలుగా, నిర్ణయాలుగా పరిగణించకూడదు. అవన్నీ ఆ సంస్థల నిర్ణయాలు, చర్యలు. అవి ఆ సంస్థలు రూపొందించుకొనే ఎత్తుగడలలో భాగంగా ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనే నిర్ణయాలు. హింసకు పాల్పడడానికి సంస్థలకు భిన్నమైన

కారణాలు వుంటాయి. ఈ అన్ని కారణాలను పీడిత ప్రజల న్యాయబద్ధమైన కోపానికి ఆపాదించలేము. ఈ న్యాయబద్ద కోపం పేరుమీదే రాజకీయ సంస్థలు తమ హింసాత్మక చర్యలకు మద్దతు పలకమని డిమాండ్ చేస్తాయి. అది సాధ్యం కాదు.

సంఘటిత సాయుధ పోరాటాల హింసను పరిశీలిస్తే ఆ హింసకు ఈ క్రింది కారణాలను గుర్తించడం సాధ్యపడుతుంది.

1. ప్రజలు నిజంగా ద్వేషించే, అసహ్యించుకునే క్రూరమైన అణచివేత స్వభావం గల వ్యక్తులమీద జరిగే హింసాత్మక చర్యలు.

2. సాధారణ ప్రజలు ద్వేషించినా, ద్వేషించకపోయినా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతున్న సంస్థ కార్యకలాపాలను అడ్డుకుంటున్న వ్యక్తులుగా ఆ సంస్థ భావించేవారిమీద జరిపే హింసా చర్యలు.

3. ఒక వ్యక్తి సంస్థకు అడ్డుగా లేకపోయినా, ప్రజల శత్రువు కాకపోయినా శత్రు శిబిరంలోని వ్యక్తి అయితే అతని చావుతో శత్రుశిబిరంలో భయోత్పాతం సృష్టించడం సాధ్యం అనుకుంటే అటువంటి వ్యక్తిపై జరిపే హింసాత్మక చర్యలు.

4. పోలీసులలో భయోత్పాతం సృష్టించడానికి ఎవరో ఒక పోలీసు ఉద్యోగిని అతను వ్యక్తిగతంగా దుశ్చరితుడు కాకపోయినా చంపడం లేక పాలకపార్టీలో భయోత్పాతం సృష్టించడానికి పార్టీలోని ఏ సభ్యుడినైనా (అతను వ్యక్తిగతంగా దుశ్చరితుడు కాకపోయినా) చంపడం.

5. సంస్థల రాజకీయ ప్రయోజనాలకు, వారి ఆదేశాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వాళ్లమీద చేసే హింసాచర్యలు. అటువంటి వ్యక్తులు ప్రజలకు శత్రువులు కాకపోవచ్చు. కేవలం తమ రాజకీయ స్వేచ్ఛను తమ ఇష్టానుసారం వినియోగించుకోవడం వారి తప్పు కావచ్చు.

6. వివాదాలలో మధ్యవర్తిత్వం వహించినప్పుడు, సమస్యలను పరిష్కరించినప్పుడు, శిక్షలను విధించినప్పుడు జారీచేసిన తమ ఆదేశాలను అమలు చేయడానికి ఉద్దేశించిన హింసాత్మకచర్యలు. అలాంటి హింసాత్మక చర్యలు తరచుగా ఎలాంటి హేతుబద్ధమైన సూత్రాలనూ పాటించవు.

7. బస్సులు, టెలిఫోన్ ఎక్స్ఛేంజులు, కోర్టులు, బ్యాంకులు, రెవెన్యూ ఆఫీసులులాంటి ప్రభుత్వ ఆస్తులను పేల్చివేయడం, కాల్చివేయడం, అలాంటి చర్యలు తరచుగా ప్రజలకు చాలా అసౌకర్యాన్ని, అపాయాన్ని కలగజేస్తాయి.

తెలంగాణనుండి కాశ్మీరు, అస్సాంల వరకు హింసాత్మక పోరాటాలను నిర్వహిస్తున్న సంస్థలు పాల్పడుతున్న రకరకాల హింసాత్మక చర్యలు ఇవి. ముందుగానే చెప్పినట్లు ఈ

రాజకీయ ఉద్యమాల హింసాత్మక చర్యలను కొన్నిసార్లు ఖండించవలసి వస్తుంది. ఈ విషయంలో పనిగట్టుకొని సృష్టించిన గందరగోళం చాలా వుండడం వలన, ఖండించవలసింది హింసను కాదని అన్యాయమైన హింసను అని స్పష్టం చేయాల్సివుంది. ఇక్కడ అన్యాయం ప్రధాన విషయం.

హింసనంతా ప్రజల హింసగా గుర్తించాలని, అణచివేతకు వ్యతిరేకంగా ప్రజల కోపంనుండి పుట్టిన హింసగా దాన్ని సమర్థించాలని డిమాండ్ చేయడం జరుగుతూ వుంది. ఇదంతా నిజానికి ఒక రాజకీయ సంస్థ చేసే హింస మాత్రమే. ఆ సంస్థకు ప్రజలలో బలమైన మద్దతు వుంటే వుండవచ్చు.

ఇలాంటి హింసకు పౌరహక్కుల ఉద్యమం ఎలా స్పందించాలి? హింసపట్ల పౌరహక్కుల ఉద్యమం అనుసరించాల్సిన సాధారణ దృక్పథాన్ని ఇంతకుముందే వివరించాను. దానిని సమర్థించకుండా, సామాజిక వ్యవస్థతో, అందులో అంతర్గతంగా వున్న వ్యవస్థీకృత హింసతో వున్న సంబంధాన్ని, ఆ హింసకు వెనుక వున్న కారణాలను అర్థం చేసుకోమని సమాజాన్ని అభ్యర్థించడం, దానిపట్ల ప్రజాస్వామికంగా వ్యవహరించమని కోరడం.

ప్రజల తరఫున పనిచేసే సంస్థలను, ప్రజలను ఒకటిగా పరిగణించే ప్రశ్నే లేదు. ప్రజల పేరుమీద అది చేసే హింసను సమర్థించే ప్రశ్నే లేదు. కాని ప్రజల సమస్యలను, విశ్వాసాలను, న్యాయంకోసం సమానత్వంకోసం వారి ఆకాంక్షలను ఈ హింసకు వున్న సామాజిక సందర్భంగా గుర్తు చేయడం అవసరం. ఈ సామాజిక సందర్భాన్ని ఎత్తిచూపాలి. హింసాత్మక పోరాటాలు సాగిస్తున్న సంస్థలపట్ల, అది చేసే హింసపట్ల, వాటికి సామాజిక పునాదిగా వున్న ప్రజలపట్ల నాగరికంగా, ప్రజాస్వామికంగా వ్యవహరించాలని రాజ్యాన్ని, సమాజాన్ని కోరాలి.

రాజకీయ హింసపట్ల పౌరహక్కుల ఉద్యమం యొక్క అవగాహన ఇంతటితో పూర్తి అయిపోలేదు. రాజకీయ ఉద్యమాల హింసాత్మక చర్యలను కొన్నిసార్లు ఖండించవలసి వస్తుంది. ఈ విషయంలో పనిగట్టుకొని సృష్టించిన గందరగోళం చాలా వుండడం వలన, ఖండించవలసింది హింసను కాదని అన్యాయమైన హింసను అని స్పష్టం చేయాల్సివుంది. ఇక్కడ అన్యాయం ప్రధాన విషయం. సామాజిక అన్యాయం నుండి న్యాయం కొరకు ప్రజలలో వున్న ఆకాంక్షల నుండి ఈ ఉద్యమాలు పుట్టాయని చెపుతున్న పౌరహక్కుల ఉద్యమం ఆ ఉద్యమాలే అన్యాయంగా ప్రవర్తిస్తే చూస్తూ వూరుకోలేదు. ఆ అన్యాయం హింసాత్మక రూపం తీసుకున్నప్పుడు అసలే సాధ్యం కాదు. హింసా రాజకీయాలను ముందుకు తెచ్చేవాళ్ళకు అలాంటి విమర్శ నచ్చదు. కాబట్టి పౌరహక్కుల ఉద్యమం

చట్టపద్ధతులలో పరిష్కారం కాని సమస్యలను ప్రజలు హింసాత్మక పద్ధతులతో పరిష్కరించుకొంటుంటే ఖండిస్తున్నారు అనే అభిప్రాయాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది ఉద్దేశ్యపూరితమైన వక్రీకరణ.

ఇంతకుముందే వివరించినట్లు హింసకు వున్న నేపథ్యాన్ని అర్థం చేసుకోమని పౌరహక్కుల ఉద్యమం ఒత్తిడి పెడుతుంది. ఎలాంటి హింసనూ అది సమర్థించనప్పటికీ, అలాంటి అనివార్యమై పోయిన హింసాత్మక చర్యలపట్ల ప్రజాస్వామికంగా వ్యవహరించమని అడుగుతుంది. చట్టం కూడా సరళంగా వ్యవహరించాలని కోరుతుంది. కాని న్యాయంకోసం జరిగే పోరాటం పేరుమీద జరిగే అన్యాయాన్ని మాత్రం పౌరహక్కుల ఉద్యమం తప్పక ఖండించాలి. పౌరహక్కుల ఉద్యమం పరిభాష న్యాయాన్యాయాలకు సంబంధించింది కాబట్టి, రాజకీయ సంస్థల హింస వెనక ఉన్న ప్రజల న్యాయమైన ఆకాంక్షలను గుర్తించమని సమాజాన్ని కోరుతుంది కాబట్టి... ఈ హింస అన్యాయమైన రూపం తీసుకున్నప్పుడు అది నిశ్శబ్దంగా వుండజాలదు.

**రా**జకీయ హింసకు పాల్పడుతున్న వాళ్ళకు ఈ విమర్శ నచ్చదు కాబట్టి, పౌరహక్కుల ఉద్యమ కార్యకర్తలు భయపడిపోయారనో, రాజ్యానికి అమ్ముడు పోయారనో వాళ్ళు ఆరోపిస్తారు. పనికిమాలిన ఈ విమర్శకు జవాబు చెప్పడం అనవసరం. సమాజంలో ఎవరైనా పీడితుల వైపైనా, పీడకుల వైపైనా వుండకతప్పదనీ ఈ రెండింటి మధ్య మూడవమార్గం ఏమీ లేదనే వాదనతో పై విమర్శను సిద్ధాంతపరంగా సమర్థిస్తారు. పీడితులవైపు లేనివాళ్ళు అనివార్యంగా పీడకులవైపు వున్నారని అంటారు. పైకి సబబుగానే కనిపించే ఈ వాదనలో, పీడితులు వారి తరపున పనిచేసే రాజకీయ ఉద్యమాలు ఒకటే అనే ఉద్దేశ్యపూర్వకమైన వాదన వుంది. ఉద్యమాన్ని విమర్శించడమంటే పీడితులను ఖండించడమే అని, కాబట్టి పీడకులతో చేతులు కలపడమే అని వాదిస్తున్నారు. ఇలాంటి వాదన చెల్లదు. పౌరహక్కుల ఉద్యమం పీడితులతోనే వుంటుంది కాని వాళ్ళు, వాళ్ళమీద ఆధారపడిన పార్టీలు చేసేదానినంతా సమర్థించడం అనే అర్థంలో కాదు. న్యాయంకొరకు ప్రజలలో వున్న ఆకాంక్షలను సమర్థిస్తుంది అనే అర్థంలో ప్రజలతోనే వుంటుంది. ఈ పక్షపాతంవల్లనే పీడితుల ఆకాంక్షలనుండి పుట్టిన ఉద్యమాల అన్యాయమైన చర్యలను కూడా విమర్శిస్తుంది.

పౌరహక్కుల ఉద్యమం, ఇతర ఉద్యమాలలాగే, చరిత్రనుండి తప్పక నేర్చుకోవాలి. కార్మిక రైతాంగ వర్గాల అవసరాల కోసం, సోషలిజం, ప్రజాస్వామ్యం అనే ఆదర్శాలకోసం ముందుకొచ్చి రాజ్యాధికారం చేజిక్కించుకున్న పార్టీలు ఆ తరువాత కాలక్రమంలో ఆ ప్రజలకూ ఆ ఆదర్శాలకూ శత్రువులుగా మారిన వైనాన్ని ఈ శతాబ్దపు కమ్యూనిస్టు ప్రభుత్వాల చరిత్రలో చూడాలి. దానినుండి గుణపాఠం తీసుకోవాలి.

ప్రజలను, పార్టీలను, సంస్థలను వేరుచేసి చూడడం మొదటినుండి మనం నేర్చుకుంటే మంచిది. సంస్థలకు, రాజకీయ పార్టీలకు వున్న ప్రజాదరణను గుర్తించడం ఎంత అవసరమో, వాటిని వేరుచేసి చూడడం కూడా అంతే అవసరం.

పౌరహక్కుల ఉద్యమం ఏ రాజకీయ ఉద్యమం వెనకా పరుగెత్తజాలదు. అన్ని సమస్యలకు పరిష్కారాన్ని చూపించగల ఒకే ఒక ఉద్యమం, అన్ని ఆకాంక్షలను తీర్చగల ఒకే ఒక ఉద్యమం ఏదీ లేదు. వాస్తవికత చాలా కోణాలు కలిగినది. బహుముఖమైంది. అలాగే వాస్తవికతను మార్చాలనే కృషి కూడా. ఈ బహుముఖమైన కృషిలో పౌరహక్కుల ఉద్యమానికి తనదైన పాత్ర వుంది. చారిత్రకంగా సాధించిన ప్రజాస్వామిక విలువలను, వ్యవస్థలను ముందుకు తీసుకురావడం, రాజకీయ పోరాటాల ద్వారా ఇంకా ముందుకు తీసుకుపోవడానికి అవకాశాలను పెంచడం, రాజకీయ ఉద్యమాలలోని ప్రజాస్వామిక అంశాన్ని సమాజంలో ప్రచారం చేయడం, అలాంటి ఉద్యమాలపట్ల వాటి హింసాత్మక చర్యలపట్ల న్యాయమైన దృక్పథాన్ని పెంచడానికి కృషి చేయడం. న్యాయం కొరకు పోరాటం చేస్తున్న సంస్థల, పార్టీల ప్రవర్తన అన్యాయమైన రూపం తీసుకుంటే వ్యతిరేకించడం పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యాలు. అది ఏ రాజకీయ ఉద్యమానికీ పరిచారికగా వుండజాలదు.

'ప్రజాస్వామిక ఉద్యమాలు - మానవహక్కుల దృక్పథం' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 1997 జూన్ 14-15 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల సదస్సు కోసం రాసిన పత్రం. ఇంగ్లీషులో రాసిన ఈ వ్యాసాన్ని ఆయనే ఆ తర్వాత 'చూపు' పత్రిక కోసం తెలుగులోకి అనువాదం చేసి ఇచ్చారు. మే-ఆగస్టు 1997 'చూపు' సంచికలో అచ్చయింది.

# 'మానవ హక్కుల' భావనపై ఎందుకు ఇంత వ్యతిరేకత?

డిసెంబరు 10 సందర్భంగా మానవ హక్కుల పరిరక్షణ గురించి చర్చలు, సమావేశాలు నిర్వహించడం సమాజంలో ఒక అలవాటుగా మారుతుండగా (అన్ని అలవాట్ల లాగే ఇది కూడ అప్పుడప్పుడు అనాలోచితమయిన తంతుగా తయారవుతున్నప్పటికి) హక్కుల గురించి మొదటి నుంచి ఆందోళన చేస్తున్న వామపక్షవాదులలో మాత్రం 'మానవ హక్కుల' భావనపట్ల అనుమానం, సందేహం, వ్యతిరేకత వ్యక్తమవుతూనే ఉన్నాయి.

అమెరికా వంటి అగ్రరాజ్యాలు మానవ హక్కుల భావనను తమ ఆధిపత్య ప్రయోజనాలకు లోబరచుకున్నాయన్నది దీనికి కారణం కాజాలదు. వాళ్లు అన్నిటినీ లోబరచుకున్నారు. సాంకేతిక విజ్ఞానాన్ని లోబరచుకున్నారు, పర్యావరణాన్ని లోబరచుకున్నారు. మానవ శ్రమను లోబరచుకున్నారు. మానవ హక్కుల భావననూ

కె. బాలగోపాల్

'ఆంధ్రప్రభ', దినపత్రిక 24.12.1998

లోబరచుకున్నారు, అన్ని ప్రజాతంత్ర ఉద్యమాల పరిభాషనూ లోబరచుకున్నారు. సంప్రదాయ నైతిక భావనలను కూడ లోబరచుకున్నారు. కాబట్టి వాటిని అనుమానంగా చూడడానికి వ్యతిరేకించడానికి ఇదొక కారణం కాదు. అంతకంటే లోతయిన కారణమేదో ఉంది.

'మానవ హక్కుల' భావనలోనే పెట్టుబడిదార్లకూ హక్కులుంటాయి, కార్మికులకూ హక్కులుంటాయి, భూస్వామికీ హక్కులుంటాయి, కూలివాళ్లకూ హక్కులుంటాయి అన్న భావం ఇమిడి ఉందని ఈ మధ్య పీపుల్స్‌వార్ నాయకుడొకరు ఒక దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. ఇది విచిత్రమైన అభిప్రాయం. కాని కేవలం పీపుల్స్‌వార్ నాయకులకు పరిమితమైనది కాదు. హక్కుల ఉద్యమంలో కూడ దీనికి విస్తృతమైన ప్రాచుర్యం ఉంది.

మాటల భావాన్నే తీసుకుంటే ఈ అభ్యంతరాన్ని అర్థం చేసుకోవడం కష్టం. 'మానవహక్కులు' అన్నప్పుడు స్థితిగతులతో సంబంధం లేకుండా మనుషులందరి హక్కులూ ఒకటేననిపిస్తే, పౌరహక్కులు అన్నప్పుడు స్థితిగతులతో సంబంధం లేకుండా పౌరులందరూ ఒకటే, అందరి హక్కులూ ఒకటేనన్న ధ్వని లేదని ఎందుకు అనుకోవాలి? ప్రజాస్వామ్య హక్కులు అన్నప్పుడు స్థితిగతులతో సంబంధం లేకుండా అందరికీ ప్రజాస్వామ్యం ఒకటే రకంగా ఉంటుందన్న ధ్వని లేదని ఎందుకు అనుకోవాలి?

అందువల్ల ఇది కేవలం పదప్రయోగాలకు సంబంధించిన సమస్య కాదు. దీనివెనుక నిజమైన ఇబ్బంది ఏదో ఉంది. వామపక్ష రాజకీయ ఉద్యమాల ప్రేరణతో మొదలైన హక్కుల ఉద్యమం హక్కులను వర్గాల నేపథ్యంలో అర్థం చేసుకొన్నది. వర్గాలు, వర్గ ఘర్షణ, శ్రామికవర్గాలపైన రాజ్యం అణచివేత ఆ దృక్పథంలో కేంద్రస్థానం కలిగివుంటాయి. హక్కుల ఆవశ్యకత, వాటి నిర్వచనం, ప్రమాణాలు అక్కడి నించే వస్తాయి.

మానవ హక్కుల దృక్పథానికి మనిషి అన్న భావన కేంద్రం. మనిషై పుట్టినందుకు ప్రతి ఒక్కరికీ ఉండవలసిన హక్కులు మానవ హక్కులు. ఇవి సమాజంలో కొందరికి ఉన్నంతగా ఇతరులకు లేవు. లేకపోవడానికి వర్గం, కులం, జెండర్, ప్రాంతం, జాతి, మతం మొదలైన అనేక కారణాలున్నాయి. ఈ విధంగా 'మనిషి'తో మొదలైన నిర్వచనం 'వర్గం' తదితర సామాజిక అంశాల దగ్గరికి సులభంగానే వస్తుంది. కాని 'వర్గం'తో మొదలయ్యే హక్కుల దృక్పథం 'మనిషి'ని అందుకోవడానికి చాలా ఇబ్బంది పడుతుంది.

మానవ హక్కుల భావనకు వర్గస్పృహ లేదనడం తప్పు. ఒక్క వర్గస్పృహే కాదు అన్ని రకాల సామాజిక అసమానతల స్పృహ ఉంటుంది. కాని అది తన వివేచన వాటి దగ్గర మొదలుపెట్టదు. మనిషితో మొదలు పెడుతుంది. మనిషై పుట్టినందుకు ప్రతి ఒక్కరికీ ఉండవలసిన హక్కులు వర్గ వ్యవస్థల వల్ల, పితృస్వామ్యం వల్ల, జాతివివక్ష వల్ల, కులవ్యవస్థ వల్ల, ప్రాంతీయ ఆధిపత్యం వల్ల, ఇతర వ్యవస్థిత కారణాల వల్ల కొందరికి లేకుండా

పోతున్నాయని గుర్తించగలుగుతుంది. ఒక్క వర్గాన్నే కాక అన్ని రకాల ఆధిపత్యాలనూ ఏ సైద్ధాంతిక సమస్యా లేకుండా సులభంగా గుర్తించగలుగుతుంది. అటువైపు, తమ హక్కుల గురించి చైతన్యవంతులవుతున్న ఒక్కొక్క ప్రజా సమూహం 'మనిషై పుట్టినందుకు ప్రతి ఒక్కరికి ఉండవలసిన హక్కులు' అనే మానవ హక్కుల భావనను సులభంగా సొంతం చేసుకోగలుగుతున్నారు. 'స్త్రీల హక్కులు మానవహక్కులే'నని, 'దళిత హక్కులు మానవ హక్కులే'నని, 'ఖైదీల హక్కులు మానవ హక్కులే'నని, 'పిల్లల హక్కులు మానవ హక్కులే'నని నినదించగలుగుతున్నారు.

వర్గంతోను, వర్గఘర్షణతోను తన వివేచన మొదలుపెట్టే హక్కుల దృక్పథానికి ఇక్కడ రెండు సమస్యలున్నాయి. వర్గేతరమైన ఆధిపత్యాలకు సముచితస్థానం ఇవ్వడం దానికి కష్టం. ప్రయత్నపూర్వకంగా వాటికి ఒక స్థానం చూపించవలసి ఉంటుంది. కులం, జెండర్, ప్రాంతం, జాతి వంటి వర్గేతర ఆధిపత్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేసేవారు వర్గపునాది గల హక్కుల దృక్పథంతో సులభంగా మమేకం కాలేరు కూడా. పౌరహక్కుల ఉద్యమాన్ని వామపక్ష ఉద్యమాలు తమదిగా భావించినంత సులభంగా ఇతర ఉద్యమాలు భావించలేకపోవడం, పరస్పర అనుమానంతో కూడిన సంబంధం చాలాకాలం నెలకొని ఉండడం కాకతాళీయం కాదు.

రెండవ సమస్య హక్కుల ఉద్యమం అనుసరించే ప్రమాణాలకు సంబంధించినది. వర్గ ఘర్షణతో మొదలుపెట్టే హక్కుల ఆలోచన తన ప్రమాణాలను వర్గఘర్షణ నుంచే తీసుకుంటుంది. 'నువ్వు ఇటా? అటా? అనేదే ప్రమాణమవుతుంది. మనిషికి మనిషిగా ఉండవలసిన హక్కులను ప్రమాణంగా తీసుకునే ఆలోచన వర్గఘర్షణనూ చూడగలుగుతుంది. అందులో హక్కులు ఉన్నవారెవరో, లేనివారెవరో గుర్తించి లేనివాళ్ళవైపు మొగ్గు చూపించగలుగుతుంది. అయితే అక్కడితో ఆగిపోకుండా ఆ ఘర్షణలో ఇమిడి ఉండి కూడా గుర్తింపు పొందకుండా ఉన్న ఇతర (కులం, జెండర్, ప్రాంతం వగైరా) ఘర్షణలనూ చూడగలుగుతుంది. వాటి గురించి ఆ పోరాటాలను అప్రమత్తం చేయగలుగుతుంది. అంతేకాక ఈ ఘర్షణలను దాటిపోయే మానవతా విలువలను (మనిషిగా మనిషికి ఇవ్వవలసిన గుర్తింపుకూ గౌరవానికీ సంబంధించిన విలువలను) కూడా ప్రమాణం చేసుకోగలుగుతుంది. 'ఇటా? అటా?' అన్న ప్రశ్న దగ్గర ఆగిపోకుండా, మౌలికంగా హక్కులు లేనివాళ్ళ పక్షాన ఉంటూ కూడ వారి స్వీయచైతన్యాన్నీ, వారి పేరుమీద నడిచే రాజకీయ అజెండానూ దాటిపోయి ఆ ఘర్షణకు పరిమితం కాని ఆలోచనల వెలుగును కూడా వారికి అందించగలుగుతుంది.

రాజకీయ ఉద్యమాలకు (ముఖ్యంగా సమాజాన్ని మొత్తంగా విముక్తి చేసే మార్గం తమ దగ్గర ఉందని భావించే ఉద్యమాలకు) ఇదే ఇబ్బందికరంగా తోస్తుందనుకుంటాను. అందుకే మానవ హక్కుల భావనపట్ల వీరికింత వ్యతిరేకత. తమ ఉద్యమాలలో లేని ప్రజాతంత్ర దృక్కోణం ఉండగలదనిగానీ, తమ ఉద్యమాలకు వెలుపల మానవతా విలువలు

విలువలకు ఒకే మూలం ఉంటుందని మానవహక్కుల దృక్పథం నమ్మదు. అన్ని విలువలూ ఇవ్వాళే పుడుతున్నాయనీ, చరిత్రలోనూ ఆ చరిత్రనుంచి సంక్రమించిన వర్తమాన సామాజిక వ్యవస్థలోనూ ఏ విలువలూ లేవని కూడ నమ్మదు. భిన్న మూలాల నుంచి సంక్రమించిన ప్రజాస్వామ్య విలువలను క్రోడీకరించి అది అందరికీ ప్రమాణంగా నిలబెట్టగలుగుతుంది.

ఉండగలవనిగానీ మాట్లాడితే వాళ్ళకు సులభంగా మింగుడు పడదు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజాస్వామ్యం, మానవత మొదలైన భావనలు తమతోనే పుట్టాయనుకోకపోయినా, వాటికి తామే సమగ్రమైన అర్థమిస్తున్నామని వారు నమ్ముతారు. వాటికి ఇతర మూలాలు ఏమైనా ఉంటే అవి సందేహాస్పదమైనవి లేదా కనీసం అసమగ్రమైనవి అని నమ్ముతారు.

దీనితో ఏకీభవించని మానవ హక్కుల దృక్పథం వారి ఉద్యమాలలో ఉండే ప్రజాస్వామ్య స్వభావాన్ని, మానవతాకాంక్షను గౌరవిస్తూ కూడ అందులో లేనిదానిని వారి ఉద్యమాలకే ప్రమాణంగా చూపించగలుగుతుంది. విలువలకు ఒకే మూలం ఉంటుందని మానవ హక్కుల దృక్పథం నమ్మదు. అన్ని విలువలూ ఇవ్వాళే పుడుతున్నాయనీ, చరిత్రలోనూ ఆ చరిత్రనుంచి సంక్రమించిన వర్తమాన సామాజిక వ్యవస్థలోనూ ఏ విలువలూ లేవని కూడ నమ్మదు. భిన్న మూలాల నుంచి సంక్రమించిన ప్రజాస్వామ్య విలువలను క్రోడీకరించి అందరికీ ప్రమాణంగా నిలబెట్టగలుగుతుంది. అది రుచించక విలువలు సార్వజనీనమా, మానవత్వం వర్గపోరాటానికి అతీతమా అని విప్లవకారులు దబాయిస్తుంటారు.

**అ**న్ని విలువలూ సార్వజనీనం కాకపోవచ్చు కానీ కొన్ని సార్వజనీనమైనవే. ఎంతటి క్రూరమైన ఆధిపత్యంపైన పోరాటం చేసేటప్పుడయినా మనిషికిచ్చే గౌరవం, విలువ మనిషికివ్వాలి. చేయని తప్పు ఎవరిమీద పెట్టకూడదు. చేసిన తప్పును మించి మనిషిని భ్రష్టు పట్టించకూడదు. ఆధిపత్యానికి అనుకూలంగా మారిన సామాన్య ప్రజలతో వ్యవహరించేటప్పుడు శత్రువర్గంలో చేరడానికి ఒక వ్యక్తిపైన పని చేసిన ఒత్తిడులను చూడడానికి నిరాకరించకూడదు. తమతో విభేదించే రాజకీయ స్వేచ్ఛను శత్రువర్గంతో చేతులు కలపడంగా వ్యాఖ్యానించకూడదు. ఎంతటి దుర్మార్గుడినయినా భౌతికంగా దండించకుండా ఎదుర్కొనే మార్గాలను అన్వేషించే ప్రయత్నాన్ని విస్మరించకూడదు. దండించినప్పుడు కూడా క్రూరంగా హింసించకూడదు.

ఇది అక్కరకు రాని హితోపదేశంగా కనిపిస్తే ఆ మాటే అనవచ్చు. అంతే తప్ప పెట్టుబడిదారులను, కార్మికులను, భూస్వాములను, కూలీలను, ఉద్యమకారులను,

పోలీసులను సమానంగా చూస్తున్నారన్న అపనింద అంటగట్టి జవాబు చెప్పేశామని సంతోషించడంలో అర్థంలేదు. బహుశా రాజకీయ ఉద్యమాలకు ఎక్కువగా అభ్యంతరకరంగా కనిపించేది, ప్రజల పట్ల వారికి ఉండే బాధ్యత గురించి వారిని నిలదీసే విమర్శనాత్మక వైఖరి. మానవహక్కుల భావనలో ఇది ఇమిడి ఉందన్న అనుమానం వల్లనే దానిపట్ల అంత వ్యతిరేకత వ్యక్తపరుస్తున్నట్టున్నారు. కానీ ప్రజల పేరు మీద ఉద్యమాలు నడిపే వారిని ప్రజలకు జవాబుదారులను చేసే ప్రయత్నం తప్పనిసరిగా కొనసాగుతుంది. ఆ ఉద్యమాలవల్ల ప్రజలకు ఎంత మేలయినా జరిగి ఉండవచ్చునుగాక. అంతమాత్రం చేత వారి జవాబుదారితనాన్ని ప్రశ్నించకుండా ఉండలేము.

# మా అవగాహన - ఆచరణ

హక్కుల ఉద్యమానికి తనదంటూ ఒక కార్యరంగం, ఒక దృక్పథం అవసరమని మేము భావిస్తున్నాం. నూతన సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో ముందుకొచ్చే రాజకీయ, సామాజిక ఉద్యమాల మధ్యనున్న నువ్వా నేనా అన్న పోటీలో హక్కుల ఉద్యమం భాగం కానక్కరలేదు. కేవలం వ్యూహాత్మకంగా సమదూరం, సమభావం పాటించడం కాదు. సిద్ధాంతరీత్యానే అన్ని 'విముక్తి' పోరాటాలతోనూ సిద్ధాంతాలతోనూ ఒకే రకమైన సంబంధం పెట్టుకోవడం హక్కుల ఉద్యమానికి అవసరమేకాక తగినది కూడా.

ప్రతి రాజకీయ, సాంఘిక ఉద్యమ సిద్ధాంతంలోనూ కొన్ని సాధారణ ప్రజాస్వామిక సూత్రీకరణలతోపాటు ఒక ప్రత్యేక సిద్ధాంత కోణం కూడా ఉంటుంది. ఆ ప్రత్యేక సిద్ధాంతకోణాల మధ్య పోటీ, సంవాదం ఉంటుంది. వాటి నుండి హక్కుల ఉద్యమం నేర్చుకునేదేమీ లేదని కాదు. నేర్చుకునేదీ ఉంటుంది, తన దృక్కోణం నుండి విమర్శించేదీ ఉంటుంది. కానీ హక్కుల ఉద్యమ దృక్పథం ప్రధానంగా అన్ని ప్రజా ఉద్యమాలలోని

కె. బాలగోపాల్

మానవహక్కుల వేదిక మొదటి బులెటిన్ సంపాదకీయం నుంచి, 1999

ప్రజాతంత్ర ఆకాంక్షల సమాహారంగా రూపం తీసుకుంటుంది. ఇక్కడ ఉద్యమాలు అన్నప్పుడు సంఘటిత ఉద్యమాలే అనుకోనక్కరలేదు. సంఘటితరూపం తీసుకోలేక ఆకాంక్షగానో ఆరాటంగానో ఉండిపోయే నిరసన కూడా కావచ్చు. అదీ 'ఉద్యమాలు' అన్నదానిలో భాగమే. ఈ ఉద్యమాలు ప్రతిపాదించే ప్రజాస్వామిక సూత్రీకరణలనన్నిటినీ వీలయినమేరకు ఇముడ్చుకునే సిద్ధాంత దృక్పథాన్ని హక్కుల ఉద్యమం అభివృద్ధి చేసుకోవాలి. ఇది స్వభావరీత్యానే విశాల దృక్పథం కాబట్టి ఇతర ఉద్యమాలకు కూడా విశాల దృక్పథాన్ని హక్కుల ఉద్యమం నేర్పించగలుగుతుంది.

ఒక్కొక్క ప్రజా ఉద్యమం ఏదో ఒక ప్రజాసమూహానికీ వారి అవసరాలకూ కేంద్రస్థానం ఇస్తుంది. లేదా సామాజిక ప్రగతిలోని ఏదో ఒక సమస్యకూ దాని పరిష్కారానికీ ప్రాధాన్యం ఇస్తుంది. కానీ హక్కుల ఉద్యమం ప్రాధాన్యతల ఎంపిక జోలికి పోనక్కరలేదు. హక్కుల లేమిని అనుభవించే ప్రజలందరినీ ఒప్పించగల ప్రాధాన్యతాక్రమం ఏదీ ఉండదు. దాని బదులు ఒక్కొక్క జీవిత పోరాటంలోనూ ఒక్కొక్క జీవిత సమస్యలోనూ ఉన్న అణచివేతనూ ఆరాటాన్నీ ఆకాంక్షలనూ సమాజానికి వివరించడం, ఆ ప్రజలకు అండగా నిలబడడం, ఆ పోరాటం నుండీ ఆకాంక్షల నుండీ పుట్టే ప్రజాస్వామిక విలువలనూ హక్కులనూ నిలబెట్టడం, పెంపొందించడం హక్కుల ఉద్యమం తన కర్తవ్యంగా పెట్టుకుంటుంది. ఒక్కొక్క ప్రజాతంత్ర కృషి నుండి పుట్టే ప్రమాణాలనూ, వ్యవస్థితమయ్యే నియమాలనూ కాపాడడం, విస్తృత పరచడం తన కర్తవ్యంగా పెట్టుకుంటుంది.

సమాజ పురోగమనానికి పోరాటాలూ ఉద్యమాలూ చాలా ముఖ్యం కానీ వాటిలోని పోరాటం అనే అంశం కంటే దాని ఫలితంగా పుట్టే నూతన విలువల సక్రమ వ్యవస్థీకరణ, వ్యాప్తి, వ్యవస్థీకృతమైన విలువల అమలు, దానిని ఆధారం చేసుకున్న ప్రజాతంత్ర కృషి హక్కుల ఉద్యమానికి ముఖ్యం. అందుకే ఆ కోణం నుండే పోరాటాలను కూడా హక్కుల ఉద్యమం విమర్శించగలుగుతుంది. పోరాటాలు చేసే స్థితిలో లేని వారి హక్కుల రక్షణ కోసం ఏమైనా చేయాలన్నా అది వ్యవస్థితమయిన విలువలను అమలు చేయించే కృషి ద్వారానే చేయగలం. న్యాయవ్యవస్థతోనూ, చట్టంలోనూ రాజ్యంలోనూ ఉన్న హక్కుల అంశతోనూ, ప్రజాతంత్ర అంశతోనూ హక్కుల ఉద్యమానికి ఉండే సంబంధాన్ని ఈ కృషే నిర్ణయిస్తుంది.

# హక్కుల ఉద్యమం - తాత్విక దృక్కోణం

హక్కుల ఉద్యమంలో ఉన్నంతమంది బుద్ధిజీవులు వేరే ఏ ప్రజాతంత్ర ఉద్యమంలోనూ ఉండరేమో. అయితే హక్కుల ఉద్యమంలోని బుద్ధిజీవులు ప్రపంచంలోని అన్ని విషయాల గురించి సిద్ధాంత చర్చ చేస్తారు గానీ హక్కుల ఉద్యమాన్ని గురించి సిద్ధాంత చర్చ చేయడం పెద్దగా కనిపించదు.

హక్కుల గురించి చేయరని కాదు, చేస్తారు. కానీ హక్కుల ఉద్యమాన్ని గురించి సిద్ధాంత చర్చ చేసినట్టు మాత్రం దాఖలాలు - దాదాపు - మృగ్యం.

సామాజిక జీవితంలోనూ సామాజిక పరిణామంలోనూ హక్కుల ఉద్యమం స్థానం ఏమిటి? పాత్ర ఏమిటి? హక్కుల ఉద్యమం దీర్ఘకాలిక లక్ష్యమేమిటి? వ్యూహాలూ ఎత్తుగడలూ ఏమిటి? హక్కుల ఉద్యమం ఫిలాసఫీ ఏమిటి?

ఈ ప్రశ్నలకు జవాబుకోసం హక్కుల సంఘాల పత్రికలలోనూ, ప్రచురణలలోనూ వెతకొద్దు - అక్కడేమీ కనిపించదు. అన్నిటినీ సూత్రీకరించేవాళ్లు తాము చేస్తున్న పనిని మాత్రం సూత్రీకరించకపోవడానికి కారణం ఏమిటి?

చూపు మాసపత్రిక, ఏప్రిల్ 2001

హక్కులను సిద్ధాంతీకరించరని నేనంటున్నానుకోవద్దు. హక్కులను గురించి సూత్రీకరణలు చేయడం వేరు, హక్కుల ఉద్యమాన్ని గురించి చేయడం వేరు.

హక్కుల ఉద్యమం చేసే పనులకూ హక్కుల ఉద్యమంలో పనిచేసే బుద్ధిజీవుల రాజకీయ విశ్వాసాలకూ తాత్వికంగా పొసగక పోవడం దీనికి కారణం. మామూలుగా మనకు అలవాటయిన పరిభాషలో చెప్పాలంటే, హక్కుల ఉద్యమం చేసే పనులు స్వాభావికంగా సంస్కరణాత్మకమైనవి. హక్కుల ఉద్యమంలో పని చేసేవారు మాత్రం సంస్కరణలంటే పెద్దగా సదభిప్రాయం లేని విభిన్న రాడికల్ ఆలోచనా రీతులకు చెందినవారు. మార్క్సిస్టు రాడికల్స్ కావచ్చు, దళితవాద రాడికల్స్ కావచ్చు, ప్రాంతీయవాద రాడికల్స్ కావచ్చు, పర్యావరణవాద రాడికల్స్ కావచ్చు. ఈ 'పునాది' వాదాలన్నిటికీ హక్కుల ఉద్యమంతో అవసరం ఉంది. కానీ ఏ 'పునాది' వాదానికీ హక్కుల ఉద్యమంతో తాత్వికంగా పొసగదు. అయితే ఏదో ఒక 'పునాది' వాదాన్ని విశ్వసించే వాళ్లే హక్కుల ఉద్యమంలో నూటికి తొంభై మంది ఉండడం వల్ల తాము పనిచేస్తున్న ఉద్యమాన్ని వాళ్లు సూత్రీకరించరు.

హక్కుల ఉద్యమం చేసే పనులు మూడు రకాలని చెప్పుకోవచ్చు.

అణచివేతకూ హక్కుల లేమికీ గురయ్యేవారు తమకోసం తాము పోరాటాలు చేసుకుంటారు. సంఘటితంగానో అసంఘటితంగానో నిరసన తెలియజేస్తారు, ప్రతిఘటిస్తారు, ఉద్యమిస్తారు. మరి వారి హక్కుల గురించి మాట్లాడే హక్కుల ఉద్యమం వారి కోసం ఏం చేస్తుంది? ఇతరులను వారి గురించి ఆలోచింపజేస్తుంది. ఆ అణచివేతను అనుభవించని వారిలో దాని గురించి అవగాహన, దానిని ప్రతిఘటించే కార్యాచరణపట్ల సానుభూతి పెంపొందించే ప్రయత్నం చేస్తుంది. 'పోరాట ప్రజలు' కాని వారిలో సంఘీభావాన్ని కూడగడుతుంది. దళితుల గురించి దళితేతరులను, స్త్రీల గురించి మగవాళ్లను, భూమిలేని పేదల గురించి భూమి అక్కరలేని మధ్యతరగతిని, తెలంగాణ గురించి ఆంధ్రులను ఆలోచింపజేయాలని ప్రయత్నిస్తుంది.

ఈ ప్రయత్నానికి అవకాశం ఉందనీ అర్థం ఉందనీ నమ్మితేనే హక్కుల ఉద్యమానికొక స్థానం, పాత్ర ఉంటాయి. అవి ఉన్నాయని పునాదివాదాలేవీ నమ్మవు. అయినప్పటికీ రకరకాల పునాదివాదులు హక్కుల ఉద్యమాలలో పనిచేస్తూనే ఉంటారు. తాము చేసే పనికీ తమ రాడికల్ రాజకీయ విశ్వాసాలకూ పొసగదు కాబట్టి మీరేం చేస్తున్నారని అడిగితే 'ఏదో పనికిమాలిన ప్రయాసపడుతున్నాం – పోరాటం చేతకాక ఈ పని చేస్తున్నాం' అని తమ గురించి తామే సిగ్గుపడుతూ జవాబు చెప్తుంటారు. నిజానికి అది పనికిమాలిన పనికాదని మనసులో ఏదో ఒక మూల అనుకుంటారు కాబట్టే ఆ పని చేస్తారు. కానీ ఒప్పుకోవడానికి తాత్వికంగా మనసొప్పదు.

అణచివేతకు గురయ్యేవారు కొన్ని మినహాయింపులతో – అణచివేతను భౌతికంగా ప్రతిఘటించాలని చూస్తారు. 'భౌతికం' అంటే హింసాత్మకమనే అనుకోనక్కరలేదు. వోట్ల

బలం కావచ్చు, సంఘజీవితాన్ని స్తంభింపజేసే సంఖ్యాబలం కావచ్చు. హింసాత్మకమైన ఆయుధబలం కూడ కావచ్చు. హక్కుల ఉద్యమం ఆ ప్రతిఘటనకిచ్చే ఊతం ఏమిటి? ఆ భౌతిక ప్రతిఘటనకు తాను కూడ ఒక్క సమిధను అందియ్యడమైతే కాదు. హక్కుల ఉద్యమం అణచివేతను భౌతికంగా కాక నైతికంగా నిలదీస్తుంది. నైతికంగా తలదించుకునేలాగ చేయాలని చూస్తుంది. అదొక అర్థవంతమైన ప్రయత్నమని ఏ పునాదివాదమూ నమ్మదు గానీ దానికి చోటుందని నమ్మినట్టయితేనే హక్కుల ఉద్యమం చేసే కృషికి అర్థముంటుంది.

ఎదుటివారిని నైతికంగా నిలదీస్తున్నామంటేనే ఇద్దరికీ సమ్మతమైన నైతిక ప్రమాణాలేవో ఉన్నాయని అర్థం. రాడికల్ ఆలోచనా రీతులకు అదే మింగుడుపడదు. ఇరుపక్షాలకూ సమ్మతమైన నైతిక ప్రమాణాలున్నాయని ఒప్పుకోవడమంటే ఇరువురిలోనూ ఒక సామాన్య మానవత ఉందనీ ఒక సామాన్య మానవ నాగరికత ఉందనీ ఒప్పుకోవడం అవుతుంది. ఏ పునాదివాదమూ ఈ ఒప్పుకోలును సహించదు. ఒకవేళ వాదనలో భాగంగా ఎదుటివారిని నైతికంగా నిలదీసినా, 'ఇది నువ్వూనేనూ ఇద్దరం ఒప్పుకునే నీతి' అనదు, 'ఇది నీ నీతి అని నువ్వు చెప్పుకుంటున్నావు కాబట్టి అడుగుతున్నాను' అంటుంది. ఎప్పుడయినా ఒకసారి వేసే ప్రశ్నకు ఆ ధ్వని తగినదేమోగానీ హక్కుల ఉద్యమంలాగ నిత్యం అణచివేతను నైతికంగా నిలదీసే కృషికి అది తగదు. ఒక సామాన్య నైతిక ప్రమాణం ఉందన్న వైఖరే దానికి తగినది.

ఈ నైతిక ప్రమాణాలు నాగరికత క్రమంలో ఎదిగి సాంఘిక రాజకీయ నిర్మాణాలలో రకరకాల రూపాలలో వ్యవస్థితమయి ఉంటాయి. కొన్ని చట్టంలో ఉంటాయి, కొన్ని రాజకీయ వ్యవస్థలో ఉంటాయి, కొన్ని సంస్కృతిలో భాగమయి ఉంటాయి. గడచిన చరిత్రలో ఉనికిలోకి వచ్చి ఈ వివిధ రూపాలలో వ్యవస్థితమయి ఉన్న విలువలనూ ప్రమాణాలనూ కాపాడడం, పెంపొందించడం హక్కుల ఉద్యమం చేసే పనులలో మూడవది. ఆ కృషి గతకాలంలో సాధించిన అభ్యుదయాన్ని కాపాడడానికి తోడ్పడుతుంది, తద్వారా నేటి పోరాటాలకూ తోడ్పడుతుంది.

ఎంతటి రాడికల్ పోరాటాలకైనా ఈ కృషి అవసరమే, కానీ దీని వెనక ఉన్న తాత్వికభావన రాడికల్ ఆలోచనా రీతులకు ఇబ్బందికరమయినది. ప్రస్తుత వ్యవస్థలో ఉన్న అభ్యుదయం నిజమైన అభ్యుదయమా లేక వ్యవస్థ మూలాలలోని దుర్మార్గానికొక ఆచ్ఛాదనా అంటే రెండవదే నిజమని ప్రతీ పునాదివాదమూ అంటుంది. అటువంటప్పుడు దానిని 'కాపాడడం, పెంపొందించడం' అనేది అర్థరహితమైన పనే కాదు, ప్రమాదకరమైనది కూడ. అయినప్పటికీ హక్కుల ఉద్యమం నిత్యం చేసే కృషిలో ఇది అతి ముఖ్యమైనది. రాడికల్ భావాలుగల హక్కుల ఉద్యమకారులు సహితం ఈ కృషిలో నిత్యం పాల్గొంటూనే ఉంటారు.

అందుకే రకరకాల పునాదివాద బుద్ధిజీవులతో నిండి ఉన్న హక్కుల ఉద్యమం ప్రపంచంలోని అన్ని విషయాల గురించి – హక్కుల గురించి కూడ – సిద్ధాంత చర్చ జరుపుతూ ఉంటుంది గానీ తన గురించి మాత్రం సిద్ధాంత చర్చ జరపదు.

పునాదివాదుల పరిభాషలో చెప్పాలంటే హక్కుల ఉద్యమం స్వాభావికంగానే సంస్కరణవాద ఉద్యమం. ఈ పరిభాషను గుర్తించము పొమ్మనవచ్చును. ఆ రకంగా ఈ పరిభాష మన ఆలోచనలకు వేసే సంకెళ్లనుండి తప్పించుకోజూడవచ్చు. కానీ పరిభాష మార్చుకున్నా భావం మారిపోదు.

ఇంక పునాదివాదులను వారి 'కర్మ'కు వదిలిపెట్టి హక్కుల ఉద్యమం కర్తవ్యాల గురించి నేరుగా చెప్పుకుందాం.

ఎవరి పోరాటాలు వారి పోరాటాలుగానే ఉండిపోకుండ ఇతరులను కూడ వాటి గురించి ఆలోచింపజేయడం హక్కుల ఉద్యమం ముఖ్య కర్తవ్యాలలో ఒకటి. పోరాటాల పరిభాష తరచుగా అందుకు అనువుగా ఉండదు. విశాలమైన, విస్తృతమైన సంఘీభావం తమకు అవసరమనీ దానికోసం కృషి చేస్తామనీ పోరాటకారులు అంటుంటారుగానీ వారి భాష, తాత్విక పరిభాష దానికి తరచుగా ఆటంకంగా ఉంటాయి. ఆ పోరాటాలకు ఇతరులలో సంఘీభావాన్ని సమీకరించడానికి కృషి చేసే హక్కుల ఉద్యమం పోరాటకారుల గొంతును అనుకరించకూడదు. 'మేము చాలా ప్రత్యేకం, మామీద ఉన్న అణచివేత చాలా ప్రత్యేకం, మా పోరాటం ప్రత్యేకం, అది వేరెవ్వరికీ అర్థం కాదు' అనే పద్ధతిలో తమ ప్రత్యేకతను పదే పదే నొక్కి చెప్తూ, అదే సమయంలో అందరూ తమకు సంఘీభావం తెలపాలని పోరాటాలూ పోరాటకారులూ ప్రకటిస్తుంటారు.

ఒకరి స్థితి మరొకరికి అర్థంకాకపోవడానికి అవసరాలు, ప్రయోజనాలు అనుభవాలు, విలువలకు సంబంధించిన కారణాలనేకం ఉంటాయని గుర్తిస్తూ కూడ అర్థం కావటం అసాధ్యంకాదని నొక్కి చెప్తూ, దానిని సాధ్యం చేసే సామాన్య విషయాలపైన దృష్టి పెట్టడం హక్కుల ఉద్యమం కర్తవ్యం. ఇది వేరే గొంతు, వేరే స్వరం, పోరాటకారులది కాదు. పోరాటాలు ఐక్యతను కోరుకునేటప్పుడు కూడ ప్రత్యేకతలను తాత్వీకరిస్తుంటాయి. హక్కుల దృష్టి సామాన్యతను తాత్వీకరిస్తుంది. ఇందులో సామాజిక సామాన్యతకు మాత్రమే కాదు (అది ఉన్న మేరకు సహానుభూతి మరింత సులభమవుతుందంతే), సామాన్య మానవతకు కూడ చోటు ఉంటుంది.

ఒకరి పోరాటాన్ని గురించి ఇతరులను ఆలోచింపజేయడం అన్నప్పుడు 'ఇతరులు' అన్న ప్రయోగం పోరాటానికీ దానిని అణచివేసే వారికీ మధ్యనున్న స్థలాన్ని సూచిస్తుంది. అటువంటి స్థలం ఒకటి ఉందనిగానీ దానికి గణనీయమైన పాత్ర ఉంటుందని గానీ పోరాటాలు – ముఖ్యంగా రాడికల్ పోరాటాలు – సులభంగా ఒప్పుకోవు కాబట్టి ఆ స్థలం మీద ప్రధానంగా దృష్టిపెట్టే హక్కుల ఉద్యమం గొంతు భిన్నంగా ఉండక మానదు.

మధ్యనున్న స్థలంతో సంభాషించేటప్పుడే కాదు, అణచివేత ప్రయోగించేవారితో సంభాషించేటప్పుడు కూడ హక్కుల ఉద్యమం 'నీ ఆయుధాలు నువ్వు బయటికి తీయ్, నావి నేను బయటికి తీస్తాను' అనే పద్ధతిలో మాట్లాడదు. ఆ రకమైన సంవాదానికి

> అప్పటికి సమాజంలో గుర్తింపు పొంది ఉన్న ప్రజాస్వామ్య విలువలను తనవిగా భావించడమంటే అర్థం అప్పటి సమాజం దేనిని ప్రజాస్వామ్యంగా గుర్తిస్తుందో దానిని నిర్విమర్శగా స్వీకరించడమని కాదు. తన విమర్శతో వాటిని వడబోసి వాటిలోని నిజమైన ప్రజాస్వామ్య సారాన్ని స్వీకరించమని అర్థం.

ప్రయోజనమేమీ లేదని కాదు. పోరాటాలలో దానికీ చోటు ఉంటుంది. కానీ హక్కుల ఉద్యమం గొంతు అది కాదు. నువ్వు ప్రయోగించే అణచివేత అనైతికం అనేది హక్కుల ఉద్యమం గొంతు. ఆ నీతి చట్టం రూపంలో ఉండవచ్చు. ఆ నీతి సమాజంలో అందరూ ఒప్పుకునే విలువల రూపంలో ఉండవచ్చు. అది ఏమైనప్పటికీ దానిని ప్రాతిపదిక చేసుకొని నిలదీస్తున్నామంటే అది మన విలువ కూడానని అర్థం. సమాజంలో అప్పటికి ముందుకొచ్చి ఉన్న ప్రజాస్వామ్య విలువలను హక్కుల ఉద్యమం తనవిగా చేసుకొని వాటిని కాదని అణచివేత ప్రయోగించేవారిని నిలదీస్తుంది. పోరాటాలనుండి కొత్తగా ముందుకొచ్చే విలువల వెలుగులో ఆ విలువలను అవసరమైన మేరకు సవరించి మరింత సంపన్నం చేస్తుంది. ఎప్పటికప్పుడు విస్తరిస్తున్న ఈ ప్రజాస్వామ్య విలువలకు సామాజిక ఆమోదం కల్పించడానికీ ప్రామాణిక ప్రజాస్వామ్య విలువలుగా వాటిని నిలబెట్టడానికీ కృషి చేస్తుంది.

అప్పటికి సమాజంలో గుర్తింపు పొంది ఉన్న ప్రజాస్వామ్య విలువలను తనవిగా భావించడమంటే అర్థం అప్పటి సమాజం దేనిని ప్రజాస్వామ్యంగా గుర్తిస్తుందో దానిని నిర్విమర్శగా స్వీకరించడమని కాదు. తన విమర్శతో వాటిని వడబోసి వాటిలోని నిజమైన ప్రజాస్వామ్య సారాన్ని స్వీకరించమని అర్థం.

ప్రత్యేకతలను ప్రకటించడం కంటె సారూప్యతను వెతుక్కోవడం మీద, భౌతికంగా ప్రతిఘటించడం కంటె నైతికంగా నిలదీయడం మీద ఎక్కువ దృష్టిపెట్టే హక్కుల ఉద్యమం పరిభాష స్వాభావికంగానే విలువల పరిభాష. రాజకీయ పోరాటాల పరిభాష ప్రధానంగా ప్రయోజనాల పరిభాష. ప్రయోజనాలలో ప్రత్యేకతలు ప్రధానం. విలువలలో సారూప్యత ప్రధానం. ప్రయోజనాలు ఎక్కువగా భౌతికం. విలువలు నైతికం. ప్రయోజనాలు గిరిగీసుకొని వర్గీకరించుకుంటాయి. తేడాలు వెతుక్కుంటాయి. విలువలు సారూప్యతను వెతుక్కుంటూ ఎల్లలు చెరిపివేస్తూ విస్తరిస్తాయి.

ఇప్పటివరకు పోరాటాల గురించే మాట్లాడాను. కానీ నిజానికి అణచివేతకు గురయ్యే ప్రజలలో నూటికి తొంభై శాతం సంఘటిత పోరాటాలలో లేనివారే. అందరూ అణచివేతను అప్పుడప్పుడు అసంఘటితంగా ప్రతిఘటిస్తుండవచ్చును గాక. అటువంటి ప్రజలందరినీ

సంఘటిత పోరాటాలలోకి రమ్మని రాజకీయ పోరాటాలు పిలుస్తుంటాయి. వద్దని హక్కుల ఉద్యమం అనదుగానీ దాని కర్తవ్యం వేరు. ప్రస్తుత (రాజకీయ, ఆర్థిక, సాంఘిక) వ్యవస్థలో ప్రజాస్వామ్య సంస్థలనూ, విలువలనూ పెంపొందించడం ద్వారా వారు పోరాటాలలోకి పోయినా పోకున్నా వారి హక్కులకు కొంత రక్షణ కలిగేటట్టు చూడడం తన కర్తవ్యంగా భావిస్తుంది. ఏ మేరకు వ్యవస్థలో ప్రజాస్వామ్యాన్నీ మానవతా విలువలనూ పెంపొందించగలుగుతామో ఆ మేరకు సంఘటిత పోరాటాలలోనికి పోలేని అశేష ప్రజల జీవితాలు కొంత మెరుగుగా ఉంటాయని గుర్తించి ఆ కృషిలో హక్కుల ఉద్యమం నిమగ్నమవుతుంది.

ఇదంతా భావవాదం నుండి పుట్టిన భ్రమ అనే వాళ్లుంటారు. కావచ్చు. అయితే అప్పుడు హక్కుల ఉద్యమం అనేదేదీ ఉండదు. అప్పుడప్పుడు హక్కుల పదజాలాన్ని ప్రయోగించే రాజకీయ ఉద్యమాలు మాత్రమే ఉంటాయి.

అంతే కాదు. హక్కుల ఉద్యమం సంగతి పక్కనపెట్టి – ఈ ఆలోచనారీతి భ్రమాజనితమైతే మనుషుల మధ్య సంఘీభావానికి అవకాశవాదం తప్ప వేరే కారణం ఉండదు. సంఘర్షణ తప్ప వేరే సంవాదం ఉండదు. ఈ చరిత్రకు ముగింపు ఉండదు.

# స్త్రీలు - మానవహక్కులు

'స్త్రీల హక్కులూ మానవహక్కులే' అని ఈ రోజు అంటున్నామంటేనే 'మానవులు' అన్న మాటలో ఇన్నాళ్లూ స్త్రీలను భాగం చేయలేదని అర్థం. ఇంగ్లీష్‌లో 'man' అన్న మాటకు మనిషి అనీ మగవాడు అనీ రెండు అర్థాలూ ఉన్నాయి. మన భాషలలో ఆ రెండిటికీ వేరువేరు పదాలు ఉన్నంత మాత్రాన మనిషి అనే భావనలో స్త్రీకి తగిన స్థానం ఇచ్చామని కాదుగానీ, ఇంగ్లీష్‌లో ఒకే మాట ఉండడం మనిషి గురించి పాశ్చాత్య సమాజాల హక్కుల భావనలో అంతర్లీనంగా ఉన్న అవగాహనను ప్రతిబింబించింది.

ఇంగ్లండ్‌లో 13వ శతాబ్దంలో రూపొందించిన మాగ్నకార్టా నుండి దాదాపు 20వ శతాబ్దం దాకా కూడ హక్కుల అవగాహన 'రాజ్యం–పౌరులు' అనే చట్రంలోనే ఉండింది. పౌరులు అనేది స్త్రీ పురుషులకు సమానంగా వర్తించే భావనగానే కనిపిస్తుంది గానీ పౌరుల హక్కులను రాజ్యాన్ని ప్రమాణంగా పెట్టుకుని నిర్వచిస్తున్నామంటేనే తమ నెత్తిమీద రాజ్యం తప్ప వేరే ఏ శక్తీ లేని

కె. బాలగోపాల్

పౌరులగురించి మాత్రమే ఆలోచిస్తున్నామని అర్థం. ఇతర పౌరుల పెత్తనాన్ని భరించి బతికే పౌరులకు ఈ హక్కుల నిర్వచనం సరిపోదు.

మగ పెత్తనం కింద బతికే స్త్రీలకు, భూస్వాముల పెత్తనం కింద బతికే రైతులకు, తెల్లజాతి పెత్తనం కింద బతికే నల్లజాతి ప్రజలకు, బ్రాహ్మణ పెత్తనం కింద బతికే శూద్ర పంచమ కులాలకూ రాజ్యాన్ని కేంద్రం చేసుకొని ఏర్పరచుకున్న హక్కుల నిర్వచనం సరిపోదు. వారికి ఆ హక్కులు అక్కరలేదని కాదు. తమ మీద పెత్తనం చేసే ఇతర పౌరుల పెత్తనాన్ని నియంత్రించే హక్కులు కూడ వారికి కావాలని మాత్రమే.

ఇంగ్లీష్‌లో మనిషి హక్కులను 'రైట్స్ ఆఫ్ మాన్' (rights of man) అనే వారు. ఆ పేరు అట్లాగే ఉంచి అందులో స్త్రీల హక్కులను చేర్చడం కష్టమన్న విమర్శ బలంగా ముందుకు రావడం వల్ల అది 'హ్యూమన్ రైట్స్' (human rights) గా మారింది. 1948 డిసెంబర్ 10 నాడు ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనను ఆమోదించిన సంగతి తెలిసిందే. అయితే ఆ ప్రకటనకు 'మానవహక్కుల' ప్రకటన అన్నపేరు అది ముసాయిదా రూపంలో ఉన్నప్పుడు లేదు. అలవాటు ప్రకారం 'రైట్స్ ఆఫ్ మాన్' అనే అన్నారు. పేరులోనే స్త్రీలను వెలివేసే ఈ మాటను ఎన్నాళ్లింకా కొనసాగిద్దామని అప్పటి అమెరికా అధ్యక్షుడి భార్య ఎలీనర్ రూజ్‌వెల్ట్ అభ్యంతరం చెప్పి దానిని 'హ్యూమన్ రైట్స్'గా మార్పించారని అంటారు.

(మానవ హక్కులు అనే భావన మనుషుల మధ్య తేడాలను గుర్తించదనీ అందరికీ హక్కులను ఒకే రకంగా వర్తింపజేస్తుందనీ విమర్శించేవారు ఉన్నారు. కాని స్త్రీ పురుషుల మధ్యనున్న తేడాలను గుర్తించడం వల్లనే రైట్స్ ఆఫ్ మాన్ అన్న పేరు మానవహక్కులుగా రూపాంతరం చెందిందని గుర్తించాలి).

రాజకీయ హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ, సమాన వేతనాలు, పాలనా వ్యవస్థలో సమాన భాగస్వామ్యం, ఆస్తిహక్కు, లైంగిక విషయాలలో స్వయం నిర్ణయ స్వేచ్ఛ మొదలయిన అనేక విషయాల గురించి ఒక శతాబ్దంపైగా మహిళా ఉద్యమాలు ఆందోళన చేస్తున్నాయి.

ఏ సమస్య వెనకనయినా ఒకే ఒక మౌలిక సూత్రం పని చేస్తుందని భావించడం సరయినది కాదుగానీ, కుటుంబం – బయటి ప్రపంచం అనే వర్గీకరణ స్త్రీల హక్కుల దుస్థితికి ఒక ముఖ్య ప్రాతిపదిక అని చెప్పుకోవచ్చు. స్త్రీ జీవితానికి కుటుంబం పరిధిని నిర్ణయిస్తే, స్త్రీ హక్కులకూ స్వేచ్ఛకూ కుటుంబ విలువలు, కుటుంబ ప్రయోజనాలు, కుటుంబ అవసరాలుగా భావించబడేవి పరిధిని నిర్ణయిస్తాయి. పోనీ ఆ కుటుంబం సమాన వ్యవస్థా అంటే అందులో ఆస్తి, పని విభజన, లైంగిక నియమాల విషయంలో మగవాళ్లే ప్రథమ పౌరులు.

ప్రపంచాన్ని రెండుగా విభజించిన ఈ వర్గీకరణ స్త్రీల నైపుణ్యానికీ యోగ్యతకూ సృజన శక్తికీ అడ్డుగోడలు కట్టింది. సంపూర్ణంగా ఎదిగే అవకాశాన్ని మానవ హక్కుల నిర్వచనానికి ప్రాతిపదికగా తీసుకున్నట్టయితే, ఈ వర్గీకరణే స్త్రీల మానవ హక్కులకు పెద్ద ప్రతిబంధకం.

ఏ సమస్య వెనకనయినా ఒకే ఒక మౌలిక సూత్రం పని చేస్తుందని భావించడం సరయినది కాదుగానీ, కుటుంబం – బయటి ప్రపంచం అనే వర్గీకరణ స్త్రీల హక్కుల దుస్థితికి ఒక ముఖ్య ప్రాతిపదిక అని చెప్పుకోవచ్చు. స్త్రీ జీవితానికి కుటుంబం పరిధిని నిర్ణయిస్తే, స్త్రీ హక్కులకూ స్వేచ్ఛకూ కుటుంబ విలువలు, కుటుంబ ప్రయోజనాలు, కుటుంబ అవసరాలుగా భావించబడేవి పరిధిని నిర్ణయిస్తాయి.

పేదవాళ్లు ఆర్థిక లేమివల్ల, వనరుల లేమివల్ల తమ యోగ్యతనూ సృజన శక్తినీ సంపూర్ణంగా పెంచుకునే అవకాశాన్ని కోల్పోతారు. దళితులు కులం కట్టిన అడ్డుగోడల వల్ల, పేదరికంవల్ల కూడ కోల్పోతారు. స్త్రీలు కుటుంబం – బయటి ప్రపంచం అనే వర్గీకరణ, అందులో నుండి పుట్టిన పని విభజనల వల్ల, వనరులపైన హక్కు లేకపోవడం వల్ల కోల్పోతారు.

రాజ్యం నుండి పౌరుల స్వేచ్ఛను కాపాడే లక్ష్యంతో రూపొందిన పాశ్చాత్య హక్కుల భావన ఈ విషయాన్ని ఆకళింపు చేసుకోలేదు కాబట్టే పాశ్చాత్య దేశాలలో మహిళా ఉద్యమం ఆ దేశాల రాజ్యాంగాలు ప్రకటించిన హక్కుల జాబితా అపరిపూర్ణమన్న విమర్శతోనే మొదలయింది. ప్రజాస్వామ్యాన్ని గురించి మనబోటి వలసలకు లెక్చర్లిచ్చిన పాశ్చాత్య దేశాలలో 20వ శతాబ్దం దాకా స్త్రీలకు వోటు హక్కు లేదంటే బహుశా ఆశ్చర్యం కలగవచ్చు. అక్కడ తొలినాటి మహిళా ఉద్యమంలో వోటు హక్కు ప్రధాన విషయం.

మన దేశంలో స్త్రీల హక్కుల గురించి కృషి వలస కాలంలో మొదలయింది. అప్పట్లో ఎవ్వరికీ వోటుహక్కు లేదు కాబట్టి వోటుహక్కుతో మహిళా ఉద్యమం మొదలు కాలేదు. తొలినాడు అన్నిటిలోకీ బహుశా విద్య ప్రధాన విషయంగా ఉండింది. హైందవ సమాజంలో స్త్రీ పురుష సంబంధాలు వర్ణాశ్రమ ధర్మంలో అంతర్భాగంగా నిర్వచించబడ్డాయి కాబట్టి పురుషాధిక్యతలో సార్వత్రికంగా ఉండే లక్షణాలతో బాటు బ్రాహ్మణీయ వర్ణ ధర్మం నుండి సంక్రమించిన లక్షణాలు కూడ హైందవ కుటుంబ వ్యవస్థలో కనిపిస్తాయి. వర్ణ సాంకర్య భయం స్త్రీపైన పెట్టిన లైంగిక నియమాలను మరింత కఠినం చేయడం ఒక అంశం కాగా, స్త్రీలు శూద్రులేనన్న మనునీతి ఫలితంగా చదువుకునే హక్కు బ్రాహ్మణ స్త్రీలకు సహితం లేకపోవటం ఇంకొకటి. చదువుకుంటే బయటి ప్రపంచానికి ద్వారాలు తెరుచుకుంటాయన్న విశ్వాసం వల్ల స్త్రీ విద్య ఒక ముఖ్యమైన సంస్కరణాత్మక కృషి అయింది.

అయినప్పటికీ, బయటి ప్రపంచం ద్వారాలు మూసి ఉండడానికి కారణం స్త్రీల అవిద్యే కాదు కాబట్టి ఇంకా జరగవలసిన పని చాలా మిగిలిపోయింది. అన్ని రంగాలలోనూ ఆ కృషి ఇంకా కొనసాగుతున్నది. వనరులపైన సమాన హక్కు, పని విభజనలో సమూలమైన మార్పు, వ్యక్తిగత స్వేచ్ఛకు సమానగౌరవం దక్కేవరకు స్త్రీ పురుష సమానత్వం రాదు.

అయితే ఒక శతాబ్దం పైగా జరిగిన కృషిని వెనక్కి తిప్పే రెండు ప్రమాదకరమైన పరిణామాలు ఈ రోజు మన ముందు ఉన్నాయి. వనరులను అతివేగంగా లాభంగా మార్చే యోగ్యతగల కార్పొరేషన్లకు వనరులపైన మొత్తం హక్కు ఇస్తేనే 'డెవలప్‌మెంట్' వేగంగా వస్తుందని, వనరుల పంపిణీలో సమత, సమానత్వం అనే భావనలకు చోటు కల్పిస్తే అభివృద్ధిని వ్యర్థ ఆదర్శాలకు బలిచేయడం అవుతుందని చెప్పే గ్లోబలైజేషన్ ఒకటి. అన్ని సంప్రదాయక విలువలతోబాటు కుటుంబ విలువలను 'కాపాడ'డానికి కంకణం కట్టుకొని రౌడీయిజానికి దిగుతున్న సంఘ్‌పరివార్ రెండవది. నిజానికి వీళ్లు అన్ని విషయాలకంటే కుటుంబ విలువలు, లైంగిక నీతి మొదలయిన విషయాలలో సంప్రదాయక అభిప్రాయాలను ప్రశ్నించే ప్రయత్నాల పట్ల ఎక్కువ అసహనంగా ఉన్నారని దీపా మెహతా సినిమాలపైన జరిగిన దాడి తెలుపుతుంది.

ఈ ప్రతిబంధకాలవల్ల స్త్రీలు ఇప్పటి దాకా సాధించుకున్న హక్కులు పోగొట్టుకోకుండ కాపాడుకోవడం, ఇంకా సాధించుకోవలసిన హక్కుల కోసం జరగవలసిన కృషికి సరయిన మార్గాలు రచించుకోవడం మన ముందున్న కర్తవ్యం.

'మాతృభూమి' విశాఖపట్నం నుండి కొంతకాలం వచ్చిన పత్రిక.
ఎడిటర్ పి. సత్యనారాయణ

## హక్కుల చరిత్ర

# మూడు ప్రధాన స్రవంతులు

నాకు ఇచ్చిన టాపిక్ చాలా అనిర్దిష్టమయినది. అస్పష్టమయినది కాదుగానీ అనిర్దిష్టమయినది. హక్కుల చరిత్ర, మానవహక్కుల చరిత్ర, హక్కుల ఉద్యమం చరిత్ర, మానవహక్కుల ఉద్యమం చరిత్ర, మానవహక్కుల సంఘాల చరిత్ర ఇవన్నీ కూడా భిన్నమైనవి. ప్రధానంగా హక్కుల సంఘాల ఆవిర్భావం, వాటి కార్యక్రమాలు, ఎదుగుదల గురించి మాట్లాడుతూ మిగిలిన వాటిని కొంత స్పృశించే ప్రయత్నం చేస్తాను. టైం రీత్యా అంతకంటే ఎక్కువ సాధ్యం కాకపోవచ్చు. మానవ జాతి ఏర్పడినప్పటి నుంచి కాకపోవచ్చుగానీ, మానవ సమాజం ఏర్పడినప్పటినుంచీ హక్కుల ఆరాటం ఉండే ఉంటుంది. ఎందుకంటే సమాజంలో ఎప్పుడూ కూడా పెత్తనం, అధికారం చెలాయించే వాళ్ళు కొంతమంది అయితే, వాటికి లోనయ్యే వాళ్ళు ఎక్కువ మంది ఉంటూ వస్తున్నారు. ఆ విషయాన్ని

కె. బాలగోపాల్

విశాఖపట్నం జిల్లా HRF సదస్సులో చేసిన ప్రసంగం, 2002

ఆనాడు వాళ్లు స్పష్టంగా చూడగలిగినా, చూడలేకపోయినా అది ఉంటూనే ఉంది. తొలినాటి నుండి కూడా మీకెందుకు ఉండాలి అధికారం, మేమెందుకు ఆ అధికారాన్ని భరించాలి అనే ప్రశ్న వచ్చే ఉంటుంది. రాకుండా ఉంటుందనుకోను. నిజానికి, ఓ రకంగా మానవజాతి చరిత్రనే ఈ కోణం నుంచి రాయవచ్చు కూడా. రాస్తే అది చాలా బలమైనటువంటి ప్రజెంటేషన్ అవుతుంది.

## సహజాత హక్కులు

అట్లా చూస్తే మానవ హక్కుల చరిత్ర అన్నప్పుడు దాని నిర్వచనం కొంత కుదించబడుతుంది. ఒక హక్కును ఎందుకు అడుగుతున్నాము అనేది ఆ భావనలో అంతర్భాగం. ఒక హక్కును చాలా కారణాలుగా అడగొచ్చు. నీకుంది నాకు లేదు, కాబట్టి నాకు ఇవ్వు అని అడగొచ్చు. ఏ తాత్విక భూమిక లేకుండానే అలా అడగొచ్చు. కాని అట్లా అడిగినప్పుడు అది మానవ హక్కుల భావన కాదు. వేరే కారణాలుగా కూడా అడగొచ్చు. చరిత్రలో అనేక కారణాలతో హక్కులు అడిగి ఉన్నారు. మనిషయి పుట్టినందుకు, By virtue of being a human being ఈ హక్కు నేను అడుగుతున్నాను, నేను వేరే ఏ కారణం చెప్పాల్సిన అవసరం లేదు, నేను మనిషిని కాబట్టి నేను అడుగుతున్నాను అని ఎప్పుడైతే అంటామో అప్పుడు అది మానవ హక్కులు అనే భావన కిందకు వస్తుంది. ఈ భావన మరీ అంత ప్రాచీనమైనది కాదు. పాశ్చాత్య దేశాలలో అయితే దేన్నయితే ఆధునిక యుగం (మధ్యయుగాల తర్వాత వచ్చినది) అంటామో ఆ దశలో వచ్చింది. సహజాత హక్కులు అనే సిద్ధాంతంలో భాగంగా వచ్చింది. By virtue of being a human being, అంటే మనిషై పుట్టినందుకు నాకీ హక్కు ఉండాలి. ఇంక వేరే ఏ కారణాలు నేను చెప్పను, చెప్పాల్సిన అవసరం నాకు లేదు అనేది పాశ్చాత్యదేశాలలో ఆధునిక భావన. మన దగ్గర బహుశా బుద్ధుడి ఫిలాసఫీలో దీనికి కొంత పునాది పడిందేమో కానీ బౌద్ధం ఇక్కడ ఎక్కువ రోజులు నిలవలేదు. ఇతర దేశాల్లోకి వెళ్లిన చోట కూడా అది బౌద్ధంగా నిలవలేదు, పేరుకే బౌద్ధం అది. అందువల్ల మళ్ళీ ఆధునిక కాలంలోనే, కొంత మేరకు పాశ్చాత్యులు వచ్చి వాళ్ళ విద్య ప్రవేశపెట్టిన తర్వాతే మనం ఈ భావనను తిరిగి కనుగున్నామేమో. కొంత సంక్లిష్ట చరిత్రే గానీ, మొత్తానికి ఆ రకంగా కూడా అది ఆధునికమే కావచ్చు.

హక్కుల ఉద్యమాలు అన్నప్పుడు ఒక కార్మిక సంఘమైనా, ఒక రైతు సంఘమైనా, ఒక మహిళా సంఘమైనా, ఒక దళిత సంఘమైనా అన్నీ హక్కుల సంఘాలే. హక్కుల కోసం పోరాటం చేసే సంఘాలే. అట్లా చూస్తే చాలా విస్తృతమైనటువంటి చరిత్ర అవుతుంది కానీ మానవ హక్కుల సంఘాలు, మానవ హక్కుల ఉద్యమాలు అనేవి ప్రత్యేకంగా ఉన్నాయి. మేం దాంట్లో భాగంగా ఉన్నాం. దానికో చరిత్ర ఉంది. ఒక ప్రాముఖ్యం ఉంది. విశిష్టత ఉంది. ఇవన్నీ కూడా కొంత వేరు చేసుకొని చూడాల్సిన అవసరం ఉంది. మనిషై పుట్టినందుకే నాకు ఈ హక్కుకి అర్హత ఉంది అనేది సహజాత హక్కుల సిద్ధాంతంలో భాగంగా పాశ్చాత్య

రాజు అధికారానికి వ్యతిరేకంగా హక్కులు అడిగేవాళ్ళు, వాడు దైవదత్తం అంటున్నాడు, అంతే బలంగా మనం ఏమనాలి అనుకుని 'ఇది సహజాతం పో' అన్నారు. నాకు దేవుడు ఇచ్చినాడు అని వాడు అంటే, నాకు పుట్టుకతో వచ్చింది పో అని వీళ్లు అన్నారు.

దేశాలలో చాలా బలంగా ముందుకు వచ్చింది. సహజాతమైన హక్కులు అనే మాట అన్న వాళ్ళందరూ నాస్తికులేం గాదు. సహజము అంటున్నారు అంటే వాళ్ళు దేవుడు అనే దానికి వ్యతిరేకంగానో, ప్రకృతికి దేవుడికి పోటీ పెట్టినట్లుగానో అంటున్నారని కాదు. ఈ వాదన చేసే వారిలో నాస్తికులు ఉన్నారు, నాస్తికులు కాని వాళ్ళూ ఉన్నారు. కాని అక్కడ తాత్వికంగా ఆ భావన బలంగా ఎందుకు ముందుకు వచ్చింది అంటే వాళ్ళు ప్రధానంగా ఆ దేశాలలో ఎదుర్కొన్నది రాజ్యాధికారాన్ని. మన దగ్గర ఎట్లాగైతే హక్కుల భావన ప్రధానంగా ఎదుర్కొన్నది బ్రాహ్మణీయ హిందూత్వ సమాజాన్నో, పాశ్చాత్య దేశాల్లో ప్రధానంగా హక్కుల భావన ఎదుర్కొన్నది రాజ్యాధికారాన్ని. ఆ రాజ్యాధికారం తన అధికారాన్ని చెలాయించడానికి చూపించిన కారణం అది దైవదత్తమని. The divine right to rule, పరిపాలించేటటువంటి అధికారం దైవదత్తం కాబట్టి అధికారం చెలాయిస్తున్నాను అని రాజు అంటాడు. ఆ రాజు అధికారానికి వ్యతిరేకంగా హక్కులు అడిగేవాళ్ళు, వాడు దైవదత్తం అంటున్నాడు, అంతే బలంగా మనం ఏమనాలి అనుకుని 'ఇది సహజాతం పో' అన్నారు. నాకు దేవుడు ఇచ్చినాడు అని వాడు అంటే, నాకు పుట్టుకతో వచ్చింది పో అని వీళ్లు అన్నారు. ఆ పుట్టుక దేవుడు ఇచ్చిన పుట్టుక అనుకున్నవాళ్లూ ఉన్నారు, కాదనుకున్న వాళ్ళూ ఉన్నారు. ఆస్తికులూ ఉన్నారు, కానివాళ్ళూ ఉన్నారు. ఇది సహజాతమైన హక్కు అనేది దైవదత్తమైన అధికారానికి బలమైనటువంటి జవాబు అయింది పాశ్చాత్యదేశాలలో. (అలాగని) మనిషై పుట్టినందుకు By virtue of being a human being అప్పటి నుంచే ఈ హక్కు చాలా స్పష్టంగా వచ్చిందని నేనేమీ అనను. ఇవ్వాళ సిద్ధాంతీకరించినట్టుగా ఆ రోజు చేసి ఉండక పోవచ్చును గానీ ఆ రూపంలోనే అది వచ్చింది.

(నిజానికి) ఆనాడు హక్కుల గురించి ప్రకటించిన వాళ్ళు, మనిషై పుట్టినందుకు సహజాతంగా, సహజంగా, ప్రకృతి సిద్ధంగానే ఈ హక్కులు ఉన్నాయని చెప్పినవాళ్ళు వాళ్ళ జాబితాలో చేర్చిన హక్కులు కొన్నే. దాంట్లో లేనివి చాలా ఉన్నాయి ఈ రోజు. అప్పటికి ఎవరైతే నోరున్నవాళ్ళో, ఎవరైతే మాట్లాడగలిగిన వాళ్ళో, ఎవరైతే అడగ్గలవాళ్ళో, ఎవరైతే అడుగుతున్నారో వాళ్ళు మాత్రమే తమకి అవసరమైనవి, తమకు అర్థమైనవి హక్కులుగా ప్రకటించుకున్నారు. దీనికి Universal Rights అనీ, Declaration of the rights of man అనీ చాలా సాధారణమైన పేర్లు పెట్టుకున్నప్పటికీ ఒక పరిమితమైన జాబితా అది. అయినా

దానివల్ల ఒక ప్రయోజనం చేకూరింది. ఆ జాబితాలో లేని హక్కుల గురించి, అవి కావాల్సిన వాళ్ళు తర్వాత ప్రశ్నించడానికి దీని వల్ల మార్గం ఒక రకంగా సులభం అయ్యింది. వాడు ఎందుకు ఆ హక్కులు అడుగుతున్నాడు, అవి సహజాతం అంటున్నాడు, మరి నా హక్కులు సహజాతం కావా అని అడగటానికి ఒక సైద్ధాంతిక పునాది సులభంగా దొరికింది. నాకు ఈ హక్కులు కావాలి అనటానికి నేను ప్రత్యేకమైన కారణాలు చెప్పుకుంటే, వేరే వాళ్ళు అడగటానికి వాళ్ళూ ప్రత్యేకమైన కారణాలు చెప్పుకోవాలి. నేను మనిషిని కాబట్టి నేను హక్కులు అడుగుతున్నాను అంటే వేరే వాడు నేను మనిషిని కాదా, నేనూ అడుగుతాను అని తర్కిస్తే ఇష్టమున్నా లేకపోయినా నేను ఒప్పుకోవాల్సి వస్తుంది.

అందువల్ల ఈ మానవ హక్కులు అనే భావన ఆ రకంగా ఆ లేమి అనుభవించే వాళ్ళందరికీ ఒక తాత్విక పునాదిని సార్వజనీనంగా ఇచ్చింది. ఆ రకంగా వాటిని డిమాండ్ చేసుకుంటూ వచ్చారు. అమెరికా రాజ్యాంగము We the people of the United States of America అని మొదలవుతుంది. అంటే అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజలమైన మేము ఇవి మా సహజాతమైన హక్కులుగా భావిస్తున్నామని డిక్లేర్ చేసుకున్నారు. తొలినాడు దాంట్లోనూ కొన్నే ఉండేవి. తర్వాతర్వాత తమకు కావాల్సిన హక్కులు ఆ జాబితాలో లేవు అని గుర్తించిన వాళ్ళు – ప్రధానంగా కార్మిక ఉద్యమాలు, స్త్రీల ఉద్యమాలు, తర్వాత కాలంలో నల్లజాతీయుల ఉద్యమాలు ముందుకు వచ్చి We the people అన్నావు నువ్వు, దాంట్లో మేము లేమా...? అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజలమైన మేము ఇవి మా సహజాతమైన హక్కులుగా భావిస్తున్నాం అని ప్రకటించావు, దాంట్లో మేం లేమా? మా హక్కులు కనబడ్డం లేదు దాంట్లో అనేది వాళ్ళకు ఒక బలమైన తాత్విక పునాదిని ఇవ్వగలిగింది. ఇవి మా హక్కుల ప్రకటనగా భావిస్తున్నాం. స్త్రీల హక్కులు ఇవి, కార్మికుల హక్కులు ఇవి, నల్ల జాతీయులవి ఇవి, ఆదివాసులవి ఇవి, అంటూ అవన్నీ కలిపి ఒక పుస్తకంగా వేశారు. అది We the other people of United States of America, అంటే అమెరికా సంయుక్త రాష్ట్రాల ఇతర ప్రజలమైన మేము అని మొదలవుతుంది. ఆ రాజ్యాంగం రాసినప్పుడు దాంట్లో చేర్చబడని వాళ్ళం మేము అని గుర్తు చేశారు. అది ఒక ప్రచురణగా కూడా వచ్చింది. ఫిలసాఫికల్‌గా మానవహక్కులనే భావనలో ఉన్నటువంటి సౌకర్యం ఏమిటంటే అప్పటికి గుర్తించినటువంటి మానవ హక్కుల జాబితా పరిమితమే కావచ్చు, కాని అనంతంగా వ్యాప్తి చెందటానికి దాంట్లో మూలం ఉంది. ఆ తాత్విక భూమిక దానికి కావలసింది ఇస్తుంది.

## బౌద్ధంతో మొదలయింది

మన దేశానికి వచ్చేటప్పటికి బుద్ధుడు, బుద్ధుని సమకాలీన తత్వవేత్తలు, ఆలోచనాపరులు – ఇవ్వాళ్టి భావంలో ఉద్యమకారులు అనొచ్చునేమో – ఎక్కువగా స్పందించింది, ప్రశ్నించింది వైదిక ధర్మాన్ని. అప్పుడు ఉన్న రూపంలోనూ, తరువాత

మారుతున్న రూపాల్లోనూ చాలా బలంగా శాసించినటువంటి బ్రాహ్మణీయ ధర్మాన్ని ప్రశ్నించారు. దాంట్లో మౌలికంగా ఉన్న అసమానతను – పుట్టుకతోనే కొందరు ఎక్కువ, కొందరు తక్కువ అనేది ఎక్కడుంది, ఎందుకుండాలి అని అడిగారు వాళ్లు. ప్రత్యామ్నాయము, యోగ్యత అని ఇవ్వాళ మనం వాడిన భాష ఆనాడు వాళ్ళు వాడకపోవచ్చు. కానీ పుట్టుకతోనే ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ, పుట్టుకను బట్టే ఒకరు ఒక రకంగా బతకాల, ఇంకొకరు ఇంకో రకంగా బతకాల అనే ధర్మం సార్వజనీనం కాదట, వేరే ప్రాంతాలలో ఇట్లా లేదట అనేది బుద్ధుడు అప్పటికి ఈ బ్రాహ్మణీయ ఆర్యావర్తానికి వెలుపల ఉండే ప్రాంతాలను ఉదాహరణగా తీసుకొని ప్రశ్నిస్తాడు. ఆ తర్వాతి కాలంలోనూ ఈ ప్రశ్న పదే పదే వస్తూనే ఉంది. అంటే ఇది మనిషి అనే భావనకు సంబంధించినది. బ్రాహ్మణీయ ధర్మంలో మనిషనే భావన లేనే లేదు. దాని ప్రకారం మనిషై ఎవరూ పుట్టరు. బ్రాహ్మణుడుగా పుడతారు, క్షత్రియుడుగా పుడతారు, వైశ్యుడిగా పుడతారు, శూద్రుడిగా పుడతారు, ఇంకో రకంగా పుడతారు తప్ప మనిషిగా ఎవ్వరూ పుట్టరు బ్రాహ్మణ ధర్మంలో. అలాంటప్పుడు మనిషిగా పుడతాము అనేదే దానికి ఉన్న బలమైనటువంటి జవాబు. ఆ అర్థంలో అది హ్యూమనిజం. మానవతావాదం. ఆ జవాబుతో ఏమొచ్చింది అంటే మనిషై పుట్టిన వాళ్ళందరికి కూడా సమాన ప్రాతిపదిక ఉండాలి అనే ఒక బీజరూపమయిన భావన. ఇవ్వాళ మనం సమానత్వాన్ని ఎక్కువగా భౌతిక అర్థంలో ఉపయోగిస్తాం. వనరుల పైన సమాన అధికారము, సమాన జీవన ఆధారము, సమాన జీవనము అలా – తొలినాడు అది భౌతికం కంటే కూడా దేవుణ్ని తెలుసుకొనే అర్హత పొందే హక్కు, అందులో సమానత్వం. దాని మీద ఎక్కువ దృష్టి ఉండింది.

**బు**ద్ధుడి కాలం దగ్గర నుంచి బ్రాహ్మణీయ సమాజానికి వ్యతిరేకంగా వచ్చిన తిరుగుబాట్లన్నిట్నీ తీసుకుంటే వాటిలో కీలకమైన అంశం ఏమిటంటే, జ్ఞానాన్ని పొందే అర్హత నీకు మాత్రమే ఉందని ఎవరు చెప్పారు? మాకు ఎందుకు లేదు అని. ఈ జ్ఞానం అనేది పూర్తిగా ఆధ్యాత్మికమే కాకపోవచ్చు. ఆధ్యాత్మిక జ్ఞానము, భౌతిక జ్ఞానము కలగలిసిందే అయినా దాంట్లో కీలకమైనది ఏదీ అంటే ఆధ్యాత్మిక జ్ఞానం లేదా దైవజ్ఞానం పొందే అధికారం. అంటే సత్యాన్ని – మానవ జీవితానికి సంబంధించిన సత్యాన్ని తెలుసుకునే అధికారం. శాస్త్రీయ జ్ఞానం కాకపోవచ్చు. కొంత భాగం కలిసే ఉంటుంది కూడా. పూర్తిగా విడిపడి ఏమీ ఉండదు అది. శాస్త్రీయం, ఆధ్యాత్మికం అనే విభజన ఆధునికమైనది. ఆ రోజున ఆ విభజన అట్లా లేదు, కనీసం బలంగా లేదు. మానవ జీవితానికి సంబంధించినటువంటి సత్యాన్ని, ఆ జ్ఞానాన్ని పొందగలిగే అర్హత నీకు మాత్రమే ఎందుకుంది? బ్రాహ్మణులకి మాత్రమే ఎందుకుంది? అందరికీ ఎందుకుండకూడదు అని చాలా బలంగా ముందుకు వచ్చినటువంటి ఆ భావన హక్కుల భావనే. ఇవ్వాళ మనం ఎక్కువగా భౌతిక పరిస్థితుల రూపంలోని హక్కుల గురించి మాట్లాడుతున్నాం. అయినప్పటికీ రెండిటికీ పునాది ఒక్కటే. నేను మనిషిని, సత్యాన్ని తెలుసుకొనే అర్హత నాకెందుకు లేదు?

నీకెందుకు ఉంది? నువ్వూ మనిషివే కదా! అని బ్రాహ్మణులను ప్రశ్నించినటువంటి తిరుగుబాటు.

నిజానికి బుద్ధుడు సామాజిక, భౌతిక జీవితంలో సమానత్వాన్ని గురించి ఎంతవరకు మాట్లాడాడు అనేది ప్రశ్నార్థకంగానే ఉంది గానీ, జ్ఞానాన్ని, సత్యాన్ని శోధించేటటువంటి హక్కు, పొందేటటువంటి హక్కు మాత్రం అందరికీ ఉంటుందని చెప్పాడు. అందుకనే బౌద్ధ సంఘంలో కులంతో నిమిత్తం లేకుండా అందరికీ ప్రవేశం. ఈ రోజు ఇది అసంగతంగా అనిపిస్తే అనిపించవచ్చుగానీ ఆనాటికి ఇది చాలా బలమైనటువంటి కోరిక, చాలా బలమైనటువంటి ఆకాంక్ష. జీవితాన్ని నియంత్రించటంలో, మన జీవితాన్ని మనం సాధించుకోవటంలో జ్ఞానం చాలా కీలకమైనది, చాలా కేంద్రమైనది. జ్ఞానం మీద మనకు నియంత్రణ లేకపోతే, మనకు హక్కు లేకపోతే, జ్ఞానమంతా మరొకడి చేతుల్లో ఉంటే, అతని ద్వారానే, అంటే బ్రాహ్మణుడి ద్వారానే అదంతా జరుగుతుంది. అప్పుడు మన జీవితాన్ని మనం నియంత్రించుకోలేం. నియంత్రణకు అవసరమైన సత్యము, జ్ఞానముపైన అర్హత, హక్కు వేరే వాళ్ళ చేతుల్లో ఉంటుంది. ఇది నాకెందుకు లేదు? ఇది నాకూ కావాలి అనేది వాళ్ళలో చాలా బలంగా ముందుకు వచ్చినటువంటి భావన. అందుకే బౌద్ధ సంఘంలో అందరికీ సమాన ప్రవేశం. బయట జీవితంలో బౌద్ధులు సంపూర్ణమైన, ఆధునికమైన సోషలిస్టు అర్థంలో సమానత్వం కోసం పోరాటాలు చేశారో లేదో కానీ వారి సంఘంలో మాత్రం అందరికీ సమాన ప్రవేశం ఉండాలని చేశారు. అక్కడ కూడా బుద్ధుడు స్త్రీల ప్రవేశాన్ని చాలాకాలం ఒప్పుకోలేదు. చాలా కొట్లాటల తర్వాతే స్త్రీలకు ప్రవేశం కల్పించాడనేది కూడా ఒక చారిత్రక వాస్తవం. మొత్తానికి ఒక క్రమంలో అదీ జరిగింది.

## బ్రాహ్మణ వ్యతిరేక తిరుగుబాట్లు

ఆ తర్వాతి కాలంలో జరిగిన బ్రాహ్మణ వ్యతిరేక తిరుగుబాట్లు అన్నీ కూడా దేవుడికి మనిషికి మధ్య; లేకపోతే జ్ఞానానికి, ఆ జ్ఞానాన్ని పొందేటటువంటి మనిషికి మధ్య నువ్వెవరు అని బ్రాహ్మణులను ప్రశ్నించినవే. ఆ హక్కు ప్రతి ఒక్కరికి ఉందని చెప్పాయి అవన్నీ. లింగాయత్‌ల ఉద్యమం అయినా, వేరే బ్రాహ్మణ వ్యతిరేక తిరుగుబాట్లు అయినా సారాంశం అదే. వాళ్ల దృష్టి అంత మేరకే ఉన్నప్పటికీ బ్రాహ్మణీయ సమాజం పునాదులను అది మౌలికంగానే సవాలు చేసింది. కేవలం జ్ఞానానికి, పౌరోహిత్యానికి, పూజారితనానికి సంబంధించినటువంటి అంశం మాత్రమే కాకుండా మొత్తంగా బ్రాహ్మణీయ సమాజ స్వభావాన్ని ప్రశ్నించేటటువంటి లక్ష్యం అది. ఆచరణలో కూడా చాలా సందర్భాలలో అలాగే ఉండింది. మన దేశ హక్కుల ఉద్యమం చరిత్ర చెప్పాలంటే దీన్నుంచి మొదలుపెట్టి చెప్పుకుంటూ రావల్సి ఉంటుంది. అయితే పాశ్చాత్య దేశాలలో ఇంతకు ముందు చెప్పినట్లుగా వాళ్ళు ప్రధానంగా ఎదుర్కొన్నది రాజ్యం ఆధిపత్యాన్నే. ఇక్కడ లేదని కాదు, అయితే దానికి వ్యతిరేకంగా ఇక్కడ ఉద్యమాలు రాలేదు. ఇక్కడా రాచరికపు నియంతృత్వ

పాశ్చాత్య దేశాల్లో వచ్చినటువంటి హక్కులు అవి రాజ్యానికి వ్యతిరేకంగా రావడంవల్ల మనిషిని పౌరుడిగా చూస్తాయి. మనం మానవహక్కులు, మనుషుల హక్కులు అనుకున్నప్పుడు ఈ మనిషి ఎవరు, మనిషికి మనం ఏం నిర్వచనం ఇచ్చుకుంటాం అనేదాన్ని బట్టి మనం దేన్ని హక్కుగా గుర్తిస్తాం అనేది ఉంటుంది.

అధికారం ఉండింది కానీ, ఇక్కడ బహుశా మానవ జీవితాన్ని ప్రధానంగా శాసించింది రాజ్యం అధికారం కంటే కూడా బ్రాహ్మణీయ హైందవ సమాజం యొక్క సంస్కృతి, సామాజిక ఆచారాలు, అలవాట్లు, పెత్తనం, ఆధిపత్యం. అందువల్ల ఇక్కడ హక్కులకు సంబంధించిన ఆరాటం ఎక్కువగా దానికి వ్యతిరేకంగానే వచ్చాయి.

హక్కులకు సంబంధించి వెనక్కి తిరిగి చూసుకుంటే ఈ రెండు మూలాలు కూడా మనకు బలంగానే కన్పిస్తాయి. వాటి నుంచి వచ్చినటువంటి హక్కుల భావనలు తెలిసో తెలియక మన అవగాహనలో అంతర్భాగం అయి ఉన్నాయి. తెలిసే వాటిని సిద్ధాంతీకరించుకోవాల్సిన బాధ్యత మనమీద చాలా బలంగా ఉంది. పాశ్చాత్య దేశాల్లో వచ్చినటువంటి హక్కులు అవి రాజ్యానికి వ్యతిరేకంగా రావడంవల్ల మనిషిని పౌరుడిగా చూస్తాయి. మనం మానవహక్కులు, మనుషుల హక్కులు అనుకున్నప్పుడు ఈ మనిషి ఎవరు, మనిషికి మనం ఏం నిర్వచనం ఇచ్చుకుంటాం అనేదాన్ని బట్టి మనం దేన్ని హక్కుగా గుర్తిస్తాం అనేది ఉంటుంది. మనిషి పౌరుడు అయితే మనకు కనిపించే హక్కులు కొన్ని. పౌరులకు పరిపాలించే వాళ్ళ అభిప్రాయాలతో విభేదించి మాట్లాడేందుకు భావప్రకటనా స్వేచ్ఛ ఉండాలి. తమను ఎవరు పరిపాలిస్తారో అని నిర్ణయించుకునేందుకు ఓటింగ్ హక్కు అనుకోండి, వేరే ఏ రూపంలోనైనా అనుకోండి – రాజకీయ హక్కు కూడా ఉండాలి. రాజ్యం జోక్యం లేకుండా తమకు నచ్చిన జీవన విధానాన్ని ఎంచుకొనేటటువంటి స్వేచ్ఛ ఉండాలి. ఒకవేళ ఏదైనా తప్పు చేసి రాజ్యం చేతిలో శిక్షకు గురైనా నేరవిచారణ, శిక్ష న్యాయబద్ధంగా, మానవీయంగా ఉండాలి. మనిషిని మనం పౌరులుగా చూసినప్పుడు – అంటే హక్కులను రాజ్యానికి వ్యతిరేకంగా చూసినప్పుడు – ఇట్లాంటి హక్కులు అడుగుతాం.

ఇవాల్టికి కూడా వాటినే Civil and political rights పౌర రాజకీయ హక్కులు అని వర్గీకరించటం జరుగుతూ ఉంది. ఐక్యరాజ్యసమితి ప్రకటనలలో కూడా ఇంటర్నేషనల్ కొవెనంట్ ఆన్ సివిల్ అండ్ పొలిటికల్ రైట్స్ అని ఒకటుంది, ఇంటర్నేషనల్ కొవెనంట్ ఆన్ సోషల్, ఎకనామిక్ అండ్ కల్చరల్ రైట్స్ అని వేరే ఉంది. రెండూ ఇప్పటికీ వేరుగానే ఉన్నాయి. వాటిని కలపలేదు. ఆ కృత్రిమమైన విభజన పదే పదే తలెత్తుతూనే ఉంది. సివిల్

అండ్ పొలిటికల్ హక్కులు కలిగి ఉండే మనిషి ఎవరంటే.. ఈ హక్కుల కర్త ఎవరు అంటే పౌరుడు. పౌరుడు అంటున్నామంటే అతనికి వ్యతిరేకంగా ఏముంటుంది? రాజ్యం ఉంటుంది. ఆ రాజ్యం నుండి పౌరులు కోరుకొనే స్వేచ్ఛలు ఏవీ అంటే అభిప్రాయ స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ. మాగ్నాకార్టాలో చెప్పినట్టు పరిపాలన అనేది చట్టప్రకారం జరగాలి. ఆ చట్టాలు ప్రజల ఉమ్మడి సమ్మతి మీద రూపొందాలి. అప్పుడది ఆ సమాజం ఉమ్మడి సమ్మతి అవుతుంది. ఎన్నికల రూపంలో వ్యక్తం చేసుకునే సమ్మతి. దాని ద్వారా చేసిన చట్టాల ఆధారంగానే పరిపాలన సాగాలి. అవన్నీ కలిసే పౌర, రాజకీయ హక్కులు అయ్యాయి.

**అ**దే మనిషిని ఓ స్త్రీగా చూస్తే చాలా భిన్నమైన హక్కుల అవసరం మనకు కనిపిస్తుంది. మనిషిని మనం ఎలా చూస్తామనే దానిని బట్టే ఏ హక్కులు మన కళ్ళకు కనిపిస్తాయో తెలుస్తుంది. కేవలం సిటిజన్‌గా చూస్తే కొన్ని హక్కులు మనకు కనిపించవు. స్త్రీగా చూస్తేనే కొన్ని హక్కులు కనిపిస్తాయి. ప్రపంచాన్ని రెండుగా విభజించి కుటుంబం లోపల, కుటుంబం బయట అనే వర్గీకరణ చేసేసి, నీ కుటుంబం లోపల నువ్వు ఉండు, నీ యోగ్యత, నీ టాలెంట్, నీ ఇష్టాయిష్టాలు ఏవైనా అక్కడే వ్యక్తం కావాలి అనేది హక్కుల మీద ఒక పరిమితి అని, అణచివేత అని ఎప్పుడు గుర్తిస్తాం? ఆ మనిషిని స్త్రీగా చూసినప్పుడే ఆ స్పృహ వస్తుంది. అట్లాగే మనిషిని మనం బ్రాహ్మణీయ వ్యవస్థలో బతుకుతున్న ఒక దళితుడుగా చూడగలిగితే వేరే రకమయిన హక్కుల ఆవశ్యకత, హక్కుల లేమి మన కళ్ళకు కనిపిస్తాయి. ఆ మనిషిని అడవిలో బతికే ఆదివాసిగా చూస్తే తమ పరిసరాలపైన వారికుండవలసిన అజమాయిషీ గానీ, అది కోల్పోవడం గానీ, అది ధ్వంసం కావటం గానీ కనిపిస్తుంది. అంటే హక్కులకు వాహకమైనటువంటి వ్యక్తి ఎవరు అన్నదాన్ని బట్టి మనకు ఏ హక్కులు కనిపిస్తాయి అనేది మారుతూ వస్తుంది. ఆయా సమాజాలలో ఎదుర్కొన్న పరిస్థితులను బట్టే ఆ మనిషిని పౌరులుగా చూడటం పాశ్చాత్య దేశాలలో జరిగింది. పౌరులుగా చూసినప్పుడు సహజంగానే ఏం కనిపించింది అంటే ఇవ్వాళ పౌర రాజకీయ హక్కులు అని చెప్పేవే కనిపించాయి. వాటికోసమే పోరాటాలు నడిచాయి. వాటిని తక్కువ చేయడం నా ఉద్దేశ్యం కాదుగానీ ఆ పరిమితిలో వచ్చిన హక్కులే అవన్నీ కూడా.

## వాళ్లేనా పౌరులు?

ఆనాడు మనిషిని పౌరులుగా మాత్రమే చూశారు కాబట్టే వారు తాము తయారు చేసుకున్న హక్కుల జాబితాను Declaration of the Rights of man అన్నారు. అంటే మనిషి యొక్క హక్కుల ప్రకటన అని బ్రహ్మాండంగా దానిని ప్రకటించుకున్నారు. కానీ దానిలో ఉన్నది ఏమిటి అంటే అందరు మనుషులకూ అవసరమైన అన్ని హక్కులూ కాదు, పౌరుల హక్కులు మాత్రమే. తాము పౌరులం మాత్రమే కాదు, తాము కార్మికులం; తాము పౌరులం మాత్రమే కాదు తాము స్త్రీలం; తాము పౌరులం మాత్రమే కాదు నల్లజాతి వాళ్ళం; అని గుర్తించాక కార్మికులు అయినందుకు, స్త్రీలు అయినందుకు, నల్లజాతి వాళ్ళు అయినందుకు

తమకు కనిపించిన కొన్ని హక్కులు ఈ డిక్లరేషన్‌లో లేవే అనుకున్నారు. అప్పుడు we the people of United States of America అని ఎట్లా అన్నావు నువ్వు అని అడిగారు. How about the other people? మా సంగతేమిటి అన్నారు. అంటే పౌరులుగా హక్కులు మాత్రమే కాదు. వీళ్ళకు అదనంగా వేరే కోణాలు ఉన్నాయి. మా స్థితి కారణంగా వచ్చిన హక్కుల లేమి గురించి నీ జాబితాలో ఏమీ లేదెందుకు అని వాళ్ళు ప్రశ్నించినపుడు సహజంగానే ఒక చర్చ వచ్చింది. వీటిని ఎట్లా అంతర్భాగం చేసుకోవాలి? వీటికి ఎట్లా చోటు కల్పించాలి? అసలు కల్పించాలా, కల్పించ కూడదా? అమెరికా చాలా కాలం పాటు ఒక వైఖరి తీసుకొంది ఐక్యరాజ్యసమితిలో. ఏమనంటే పౌర, రాజకీయ, హక్కులు మాత్రమే హక్కులు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కులు అని పిలవబడేవి విధాన పరమైనటువంటి లక్ష్యాలు గావచ్చు, ఆదర్శాలు గావచ్చు కానీ అవి హక్కులు కాదు అని. ఇవ్వాళ్టికీ అమెరికా వైఖరి అదే.

## పౌర రాజకీయ హక్కులు VS సామాజిక ఆర్థిక హక్కులు

అయినా ఐక్యరాజ్యసమితి 1948లో అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన చేసినప్పుడు దాంట్లో ఈ రెండు రకాలు అంతో ఇంతో కలిసే ఉన్నాయి. ఎక్కువగా పౌర రాజకీయ హక్కులే ఉన్నా కొన్ని సామాజిక, ఆర్థిక హక్కులు కూడా ఉన్నాయి. ఆ తరవాత సమగ్రమైన ఒడంబడిక తయారు చేయాలి అనుకున్నప్పుడు అమెరికా గట్టిగా అడ్డం పడడంవల్ల చెయ్యలేకపోయారు. సామాజిక, ఆర్థిక హక్కులు హక్కులు కావు, అవి విధాన పరమైనటువంటి అభిప్రాయాలు మాత్రమే. కొందరికి ఆదర్శం కావచ్చు. కొందరికి కాకపోవచ్చు అనే వైఖరే అమెరికా ఆ రోజు తీసుకుంది. అప్పుడు సోవియట్ కూటమి లోని దేశాలు ఏమన్నాయంటే సామాజిక ఆర్థిక హక్కులు మాత్రమే హక్కులు. మేము వాటిని కల్పిస్తున్నాము. వాటిని వ్యవస్థాపరంగానే కల్పించాలి. పౌర రాజకీయ హక్కులనేవి వాటిని కూలదోయడానికి ఉపయోగించే కుట్ర (సాధనాలు) గానే చూస్తాం మేము అన్నారు. అంటే సామాజిక ఆర్థిక హక్కులను కల్పించే వ్యవస్థను కూలదోయడానికి ఒక కుట్రగా లిబరల్ డెమోక్రసీని చూడటం – ఒక కృత్రిమమైన సంవాదం సాగింది ఈ రెండింటి మధ్య కూడా. అది కృత్రిమమనేది సులభంగానే చెప్పొచ్చు. ఎందుకంటే ఏ మనిషినైనా నీకు అన్నం కావాలా స్వేచ్ఛ కావాలా అంటే రెండూ కావాలి అనే అంటారు. నాకు ఏదో ఒకటి మాత్రమే కావాలి అనే మనిషి ప్రపంచంలో ఎవ్వరూ ఉండరు. తుపాకీ పెట్టి అడిగితే వేరే సంగతి గానీ, స్వేచ్ఛగా అడిగితే మాత్రం రెండూ కావాలనే అంటారు ఎవ్వరైనా. తుపాకీ పెట్టి అడిగితే ఆ అడిగే వాడు ఏది కోరుకుంటాడో దానిని బట్టి చెపుతారు. వాడు అన్నం పెడతానంటాడా లేదా స్వేచ్ఛ ఇస్తానంటాడా అనే దాన్ని బట్టి చెపుతారు.

ప్రాక్టికల్‌గా కూడా మనకు కనిపించేదేమిటంటే ఇప్పుడు మనం సామాజిక ఆర్థిక హక్కులు లేవు, పోతున్నాయని అంటున్నాం. ఉన్నవి తీసేస్తున్నారు గ్లోబలైజేషన్ ద్వారా

అంటున్నాం. ఉదాహరణకు స్వంత జాగా లేని వాళ్ళకు గుడిసెలు వేసుకోవడానికి చోటు కావాలి. కాని అది భారతదేశ రాజ్యాంగంలో ఒక హక్కు కాదు. భారతదేశ రాజ్యాంగంలో ఎక్కడా కూడా ప్రతి ఒక్కరికీ నివసించడానికి ఇన్ని సెంట్ల జాగా ఇవ్వాలి అని రాయలేదు. అది రాజ్యాంగంలోనూ లేదు, దానికి వేరే చట్టమూ లేదు. లేకపోతే ఏంజేస్తారు ఊరుకోరు కదా! చట్టంలో లేకపోతే కొట్లాడతారు. ఖాళీ జాగా కనబడితే గుడిసెలు వేసుకుంటారు. అదొక ఆర్థిక హక్కు అనండి జీవన హక్కు అనండి, మొత్తానికి సామాజిక ఆర్థిక హక్కులలో భాగంగానే దాన్ని డిమాండ్ చేస్తారు. గుడిసెలు వేసుకుంటారు. వేసుకుంటే వాడొచ్చి ఏం జేస్తాడు? నీకు లేని సామాజిక ఆర్థిక హక్కును నీవు కోరుకుంటున్నావు కాబట్టి నీకున్న పౌర హక్కును నేను తీసేస్తాను అంటాడు. నిన్ను కొడతాను, నిన్ను తంతాను, నిన్ను చిత్రహింసలు పెట్టి మళ్ళీ గుడిసెలు వేసుకోకుండా చేస్తాను అంటాడు. ఎలా? ఎవ్వరినీ పోలీసు యంత్రాంగం నేరవిచారణ పేరుతో హింసించడానికి వీలు లేదు, ఎవ్వరినీ అక్రమంగా నిర్బంధించటానికి వీలు లేదు, చట్టానికి విరుద్ధంగా శిక్షించడానికి వీలు లేదు అని చెప్పే పౌర, రాజకీయ హక్కులు ఏవైతే ఉన్నాయో వాటిని అతిక్రమించి వాళ్ళ గుడిసెలు పీకేస్తాడు, వాళ్ళను తన్ని మళ్ళీ గుడిసెలు వేసుకోకుండా చేస్తాడు. మరో ఉదాహరణ. మాకు ఇళ్ళ స్థలాలు కావాలి అని పేదలు ఉద్యమం చేస్తారు, ఒక ఆందోళన చేస్తారు, ఒక ధర్నా చేస్తారు. ధర్నా ఎక్కడ చేయాలి? హైద్రాబాదు సిటీలో మీరు గట్టిగా ధర్నా చేయాలంటే మినిస్టర్ గారింటి ముందో సెక్రటేరియట్ బయటో చేయాలి, అప్పుడైతే కదా వాడికి వినపడేది, కనపడేది. కాని అలా చెయ్యటానికి వీలు లేదని పోలీసు కమీషనర్ గారు ఒక ఆర్డర్ జారీ చేశాడు. హైదరాబాద్‌లో ధర్నా చేయాలనుకున్న వారందరూ కూడా ఫలానా చోట మాత్రమే చేయాలి. ఇందిరా పార్కు అనే చోటే చేయాలి. అక్కడేమో ధర్నా చేసేవాళ్ళు, మరొక ధర్నా చేసేవాళ్ళు మాత్రమే ఉంటారు. వేరే ఎవ్వరూ ఉండరక్కడ ఓదార్చుకోవడానికైనా చెప్పుకోవడానికైనా మీ గోడు.

అది నాకు చాలదు, నేను మినిస్టర్ గారి ఇంటి బయటనో సెక్రటేరియట్ దగ్గరో ధర్నా చేస్తాను అని అంటే మీరు ఏం డిమాండ్ చేస్తున్నారు? భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 లో ఇచ్చిన రెండు పౌర, రాజకీయ హక్కులు పొందాలని చూస్తున్నారు. అవేమిటీ అంటే సమావేశ స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ. భారత రాజ్యాంగం హామీ ఇచ్చినటువంటి ప్రాథమిక హక్కులు అవి. వాటిని మీకు లేని ఒక సామాజిక ఆర్థిక హక్కు కోసం మీరు వాడుకుంటున్నారు. మాకు ఇళ్ళ స్థలాలు ఇవ్వండి మేము గుడిసెలేసుకుంటాం, పీకేసిన గుడిసెలను మళ్ళీ వేసుకోవడానికి మాకు అవకాశం కల్పించండి అని ఆ హక్కును మీరు వాడుకొనే ప్రయత్నం చేస్తే గుర్రాల మీద పోలీసులు దిగుతారు. ఇప్పుడు హైద్రాబాద్‌లో పోలీసులు ఎక్కువగా గుర్రాల మీదే తిరుగుతున్నారు. వాళ్ళకు వేరే వాహనాలు సరిపోవడంలే. పిల్లల్ని, పాపల్ని, ముసలివాళ్ళను, స్త్రీలను తేడా చూడకుండా చావగొడుతున్నారు. ఇది ఎందుకు చెప్తున్నానంటే పౌర రాజకీయ హక్కులు, సామాజిక ఆర్థిక

> సామాజిక ఆర్థిక హక్కులు మాకు లేవు అని ఆందోళన చేస్తే మీకు ఉన్నాయి అని చెప్పే పౌర, రాజకీయ హక్కులని తీసేస్తారు. రివర్సుగా చెప్పాలంటే మనకు లేని సామాజిక హక్కుల కోసం మనం చేసే ప్రతి ఆందోళన కూడా మనకున్న పౌర రాజకీయ హక్కులు వాడుకొనే చేస్తాం.

హక్కులు అనేది కృత్రిమమైన వర్గీకరణ అని చెప్పటం కోసం. సామాజిక ఆర్థిక హక్కులు మాకు లేవు అని ఆందోళన చేస్తే మీకు ఉన్నాయి అని చెప్పే పౌర, రాజకీయ హక్కులని తీసేస్తారు. రివర్సుగా చెప్పాలంటే మనకు లేని సామాజిక హక్కుల కోసం మనం చేసే ప్రతి ఆందోళన కూడా మనకున్న పౌర రాజకీయ హక్కులు వాడుకొనే చేస్తాం. పౌర రాజకీయ హక్కులు ఆ రకంగా విలువైనవే.

భారతదేశంలో నీకు పని చేసుకునే హక్కు లేదు, నివాసం కలిగి ఉండే హక్కు లేదు, నీకు ఒక రోగం వస్తే దాన్ని సమాజమే నయం చేయాలనే హక్కు నీకు లేదు. మరి ఉన్న హక్కులేవి? ఒక మీటింగ్ పెట్టుకోవచ్చు, కాబట్టి మీటింగ్ పెట్టుకుంటాం, మాట్లాడతాం. ఊరేగింపులు తీయొచ్చు, కాబట్టి ఊరేగింపు తీస్తాం. ఊరేగింపు తీసే హక్కు ఉందా లేదా అని కూడా ఆ మధ్య ఒక చర్చ వచ్చింది. సమావేశ స్వేచ్ఛ ఉంది, కానీ సమావేశమయిన వాళ్ళు ఊరేగింపుకు కూడా పోయే స్వేచ్ఛ ఉందా? ఇప్పుడయితే ఏమందురోగానీ, 1960లలో ఏఐఎస్ఎఫ్ వాళ్ళు వేసిన కేసు సుప్రీంకోర్టు దాకా పోతే రాజ్యాంగ ధర్మాసనం మంచి తీర్పు ఇచ్చింది. భారత రాజ్యాంగంలో సమావేశ హక్కుతో పాటు దేశంలో ఎక్కడికైనా సంచరించే హక్కు కూడా ఉంది పౌరులకు. రెండూ కలిపితే ఊరేగింపు హక్కు అవుతుందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ మాత్రం అన్నందుకు సుప్రీంకోర్టును మెచ్చుకోవాలి. ఇవ్వాళైతే అనదు. ఇవ్వాళ ఏమంటుందంటే అది వేరే ఇది వేరే, అసలు దీనికి దానికి సంబంధం లేదనొచ్చు. కోర్టులు ఆ రోజు అలా అనలా. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు అది. దాన్ని వాడుకొని ఇందిరా పార్కు దగ్గర మాత్రమే ధర్నా చేయాలన్న నిబంధన మీద కేసు వేశాం హైకోర్టులో. అది తుది విచారణకు రానుంది. సుప్రీంకోర్టు తీర్పు చూపించాము. అడ్మిట్ చేసుకున్నారు. ఏమంటారో చూద్దాం. ఆ నాటి అభిప్రాయాలు మారుతున్నాయి కదా.

అందుకే నేను ఏమంటున్నానంటే  సామాజిక ఆర్థిక హక్కులు, పౌర రాజకీయ హక్కులు అనే విభజన కృత్రిమమైనదని. ఒకానొక కారణమేమిటంటే మనుషులకు అన్నీ కావాల. ఓటింగ్ హక్కు ఇస్తాను, అన్నం ఇవ్వం అన్నా మనుషులు ఒప్పుకోరు. అన్నం

పెడతాను నాకిష్టమైన పరిపాలన చేస్తానన్నా మనుషులు ఒప్పుకోరు. రెండూ కావాలి. సామాజిక ఆర్థిక హక్కులు లేనిచోట వాటికోసం పౌర రాజకీయ హక్కులను ఉపయోగించుకొని పోరాటాలు చేస్తారు. ఆ పోరాటాలను వేరే రకంగా ఎదుర్కోలేకపోతే పౌర రాజకీయ హక్కులను అతిక్రమించడం ద్వారానే ప్రభుత్వం వాటిని అణచివేయాలని చూస్తుంది. అందువల్ల ఇవి సన్నిహితంగా ముడిపడి ఉన్న విషయాలు. ఇలా చెపితే పది నిమిషాలలో సులభంగా అర్థమవుతుంది గానీ అర్ధ శతాబ్దం పాటు దీని గురించి కొట్లాడారు అవి వేరే ఇవి వేరే అని. అమెరికా కూటమి ఒక స్పందన, రష్యా కూటమి ఒక స్పందన. హక్కుల ఉద్యమంలో కూడా చాలా గందరగోళం. చట్టాల గురించి మాట్లాడొచ్చా, మాట్లాడకూడదా? చట్టాలలో ఉండే హక్కులు మనం క్లెయిమ్ చేసుకోవచ్చా, చేసుకోకూడదా? ఇవన్నీ కూడా మానవ నాగరికత ఎదుగుదల క్రమంలో ఇష్టమున్నా లేకపోయినా పరిపాలించే వాళ్ళు, పెత్తనం చేసేవాళ్ళు క్రమంగా ఇచ్చినటువంటి, ఇవ్వక తప్పనటువంటి హక్కులు. పౌర రాజకీయ హక్కులయినా అంతే, సామాజిక ఆర్థిక హక్కులయినా అంతే. వాటిని కలగలిపి ఉపయోగించుకోవడం, పెంచుకోవడం, చివరికి మానవ హక్కులను ప్రాతిపదికగా కలిగినటువంటి సమాజనిర్మాణం దిశగా తీసుకుపోవడం అనేది సరైన చరిత్ర గమనం అవుతుంది. దాంట్లో అంతర్భాగంగానే ఈ మానవ హక్కుల సంఘాలు గానీ, ఉద్యమాలు గానీ పని చేస్తాయి.

## ప్రతి మనిషికీ ఒకే విలువ

హక్కుల భావనకు ఇవ్వాళున్న పునాది ఏమిటి? ఎందుకు నీకు హక్కులు ఇవ్వాలి అంటే మనిషిని కాబట్టి అంటున్నాం. అందుకే మానవ హక్కులు అనే మాట వాడతాం. పాశ్చాత్య దేశాల నుంచి కొన్ని హక్కులు ఒక స్రవంతిగా వచ్చి మన అవగాహనలో భాగం అయ్యాయన్నాను కదా. బ్రాహ్మణీయ హిందూ సమాజానికి వ్యతిరేకంగా ఇక్కడ బుద్ధుడి కాలంలో నుంచీ జరిగిన పోరాటాలు ఏవైతే ఉన్నాయో, అంబేద్కర్ భాషలో చెప్పాలంటే ప్రతి మనిషికి ఒకే విలువ అనేది చాలా కీలకమైనటువంటి సూత్రీకరణ. అదే నిరాకరించబడింది, తిరస్కరించబడింది బ్రాహ్మణీయ వ్యవస్థలో. అందుకే ప్రతి మనిషికి ఒకే విలువ అనేది చాలా కీలకమైన ఎదురు జవాబు అవుతుంది బ్రాహ్మణిజానికి. ఆ విలువను, అదొక సూత్రంగా చెప్తున్నామంటే దానికి అనుబంధంగా అనేక హక్కులు వస్తాయి. రిజర్వేషన్ హక్కుతో సహా అన్నీ కూడా దానికి అనుబంధంగా వస్తాయి. అది ఒక స్రవంతి. సోషలిస్టు సిద్ధాంతము, ఆచరణ నుంచి వచ్చినటువంటి స్రవంతి. ప్రతి ఒక్కరికీ పని చేసుకొనే హక్కుండాలి; ప్రతి ఒక్కరికీ వనరులపైన నియంత్రణ ఉండాలి; సమాజంలో, ప్రకృతిలో ఉండే వనరులు కొద్దిమంది గుత్తాధిపత్యంలో ఉండడానికి వీలు లేదు; కనీసం జీవనం అభివృద్ధికి అవకాశాలు అందరికీ అందుబాటులో ఉండాలి అనేవి మూడవ స్రవంతి హక్కులు. ఈ మూడు స్రవంతులు కూడా ఇవ్వాళ మన హక్కుల భావనలో అంతర్భాగం అయినాయి.

మూడింటికీ చాలా సుదీర్ఘమైన చరిత్ర ఉంది. పౌర రాజకీయ హక్కుల కోసం పాశ్చాత్య దేశాలలో దాదాపు మాగ్నా కార్టా రాసినప్పటి నుంచి నాలుగైదు వందల సంవత్సరాలపాటు పెద్ద పోరాటం నడిచింది. ఏ దశలో కూడా రాజులైనవాళ్ళు, పరిపాలకులు పౌరులకు హక్కులు ఉన్నాయి అని సులభంగా ఒప్పుకోలేదు. కొట్లాడితేనే ఒప్పుకొన్నారు. ఇంగ్లాండ్‌లో ఒక సివిల్ వార్ జరిగి రాజును ఉరితీసిన తరవాతే, మళ్ళీ సింహాసనము ఎవరికి ఇస్తాము అంటే మేము ప్రకటించిన బిల్ ఆఫ్ రైట్స్ మీద ఎవడు సంతకం చేస్తే వాడికే ఇస్తాము అంటే, అప్పుడొచ్చింది గ్యారంటీ దానికి.

**కా**నీ పౌరులు vs రాజ్యము అని చెప్పిన ఈ పౌరులు ఎవరు? మాగ్నా కార్టా రాసిన నాటికి వాళ్ళు చెప్పినటువంటి కామన్ కన్సెంట్ ఆఫ్ ల్యాండ్‌లో (సమాజం యొక్క ఉమ్మడి సమ్మతి) సమాజం ఎవరు? పెద్ద భూస్వాములయిన మగవాళ్ళు మాత్రమే. వాళ్ళు, వాళ్ళ House of Commons, అక్కడ నుంచి వచ్చినటువంటి సమ్మతి మాత్రమే పరిపాలనకు పునాది అయింది. ఇక ఆ తరవాత సమాజం యొక్క ఉమ్మడి సమ్మతి అన్న దాంట్లో సమాజం నిర్వచనం పెంచుకొంటూ పోవడం పెద్ద పోరాటమే అయింది వారికి. అంటే పౌర రాజకీయ హక్కుల భావనలో సైతం పౌరులు అనే భావాన్ని విశాలం చేసుకోవడానికి వాళ్ళు చాలా పోరాటమే చేయాల్సి వచ్చింది. పుట్టుకతోనే తమకు ప్రజాస్వామ్యం ఉన్నట్లు మాట్లాడే ఈ దేశాలు నిజానికి స్త్రీలకు ఓటు హక్కును ఈ శతాబ్దం మొదటి దాకా ఇవ్వలేదు. అప్పటికి పార్లమెంట్ ఏర్పడి ఆ దేశాలలో మూడొందల ఏళ్ళు, నాలుగు వందల ఏళ్ళు అయ్యింది. అయినా మగవాళ్ళకు మాత్రమే ఓటు హక్కు ఉంది. అందుకే మహిళా ఉద్యమాలకు పాశ్చాత్య దేశాలలో ఓటు హక్కు అనేది చాలా ముఖ్యమైనటువంటి విషయం అయ్యింది. ఇవ్వాళ మనం దీన్ని చాలా చిన్న విషయంగా భావిస్తాం. ఓటు హక్కు అందరికీ సహజంగా ఉంటుందనుకుంటాం. కాని సహజంగా రాలేదు అది. వందల ఏళ్లపాటు పోరాడాల్సి వచ్చింది దానికోసం. దీనికి జవాబు ఇటీవల మనం కూడా విన్నాం.

ఎన్.టి. రామారావు వచ్చినప్పుడు ఈ ఆడవాళ్ళందరూ వెళ్ళి ఆయనకు ఓట్లేస్తున్నారని గగ్గోలుపెట్టారు. అంటే ఏమిటని? ఆడవాళ్ళు హేతుబద్ధంగా ఆలోచించరు, మగవాళ్ళు మాత్రమే రీజనబుల్‌గా రేషనల్‌గా ఆలోచించి ఓట్లేస్తారు అని. గుడ్డిగా వాళ్ళందరూ ఎన్.టి. రామారావుకు వేయడం వల్లే ఇదంతా జరిగింది అన్నారు. ఇదే జవాబు ఒకప్పుడు కూడా. ఓటు హక్కు స్త్రీలకు ఎందుకివ్వకూడదంటే వాళ్ళు హేతుబద్ధంగా ఆలోచించలేరు, భావోద్వేగాలతో ఆలోచిస్తారు కాబట్టి ఓటు హక్కు వాళ్ళకియ్యొద్దు అని. దాన్ని అధిగమించడానికి పెద్ద పోరాటమే చేశారు వాళ్ళు. అది మహిళా ఉద్యమానికి చాలా ముఖ్యమైన పోరాటం అయ్యింది పాశ్చాత్య దేశాలలో. అట్లా ఒక్కొక్క సెక్షన్ ఓటు హక్కు కోసం పోరాడాల్సి వచ్చింది. మొదట్లో ఇంత ఆస్తి ఉంటేనే ఓటు హక్కు అని ఉండేది. ఆ ఆస్తి పరిమితి తగ్గించుకుంటూ రావడం కూడా పెద్ద పోరాటమే అయ్యింది. ఒక్కసారిగా పోలేదు

అది కూడా. లెవలర్స్ అని 19వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో ఒక చిన్న గ్రూపు ఉండే వాళ్ళు. లెవల్ చేయడమంటే నేలమట్టం చేయడమని. వాళ్ళ మీద పెద్ద అభియోగం ఏమిటీ అంటే వాళ్ళు అందరినీ ఒకటి చేసేస్తున్నారు అని. వాళ్ళు అడుగుతున్నది ఓటు హక్కే. ఆస్తులు పంచమని అడగలా వాళ్ళు. వాళ్ళు తమను తాము వివరించుకుంటూ ఏమన్నారంటే, మమ్మల్ని మీరు అపార్థం చేసుకోవద్దు, మేము లెవలర్స్ అంటున్నామంటే ఆడవాళ్ళకు, భిక్షగాళ్ళకు కూడా ఓటు హక్కు ఇవ్వమని అడగటం లేదు, అంతగా లెవల్ మేమేమీ చేయడం లేదు అని వాళ్ళు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. పౌర రాజకీయ హక్కుల జాబితాలో రానటువంటి పని హక్కుగానీ, జీవనాధారం కలిగి ఉండే హక్కు గానీ, స్త్రీకి మగవాడితో సమానంగా బాహ్య జీవితంలో పాల్గొనే స్వేచ్ఛ, హక్కు గాని, తన జీవితానికి సంబంధించి నిర్ణయాలు తాను తీసుకొనే స్వేచ్ఛ, హక్కు గానీ, ఒక్కొక్కటి ఒక్కొక్క పోరాటంగానే ముందుకొచ్చాయి.

## లింగాయతులు, వైష్ణవులు

మన దేశంలో బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు అయితే ఇవ్వాల్టికీ అయిపోలేదు. రెండువేల ఐదొందల ఏళ్ళుగా ఆ పోరాటం నడుస్తూనే ఉంది. ప్రతి దశలోనూ, జరిగిన ప్రతి పోరాటంలోనూ ఆ పోరాటం లేదా ఉద్యమం చేసిన వాళ్ళు పూర్తిగా ఇక్కడ లేకుండా అయినా వెళ్ళిపోయారు బుద్ధుడిలాగా, బౌద్ధంలాగా. లేదా వాళ్ళు కూడా ఒక కులం అయిపోయారు. కర్ణాటకలో లింగాయతులనే ఒక కులం ఉంది. అది దీనికి చాలా అద్భుతమైన ఉదాహరణ. మరో ఉదాహరణ వైష్ణవం. వైష్ణవమైనా, లింగాయత మతమైనా పుట్టింది దేనికి అంటే దేవుడికి సంబంధించినటువంటి జ్ఞానాన్ని, మానవ జీవితానికి సంబంధించిన సత్యాన్ని పొందే అర్హత బ్రాహ్మణులకే ఎందుకుండాలి? ప్రతి ఒక్కరికి ఉండాలి. ఆ ప్రతి ఒక్కరూ ఎవరూ అంటే లింగధారణ చేసినవాళ్ళందరూ అని. అంటే లింగధారులయిన వాళ్ళందరికీ కూడా శివుని గురించి జ్ఞానాన్ని పొందేటటువంటి అర్హత ఉంటుంది అన్నారు. ఏ కులంలో పుట్టినా పర్వాలేదు అని చెప్పి పుట్టిన లింగాయతులు ఇవ్వాళ వాళ్లే ఒక కులం అయిపోయారు కర్ణాటకలో. పైగా అది ఒక ఆధిపత్య కులం అక్కడ. ఆనాడు ఛండాలురుగా పిలవబడే వాళ్లను కూడా చేర్చుకొని లింగధారి అయితే చాలు శివజ్ఞానం పొందేటటువంటి అర్హత ఉంటుందని చెప్పిన వాళ్ళు వాళ్ళు. ఇవ్వాళ కర్ణాటకలో దళితులపైన దాడులు ఎక్కువగా చేసేది కూడా లింగాయతులు, వొక్కళిగాలే. బ్రాహ్మణీయ సమాజానికున్న బలం అది. వ్యతిరేకంగా పోరాటం చేసిన వాళ్ళు పూర్తిగా బయటికైనా వెళ్లిపోతారు లేదా వాళ్ళు కూడా ఒక కులంగా మారి వర్ణవ్యవస్థలో అంతర్భాగమైనా అయిపోతారు. వైష్ణవం కూడా అంతే. వైష్ణవం పుట్టింది ఎట్లా? భక్తి ఉంటే చాలు. విష్ణువుని ధ్యానం చేసేటటువంటి, విష్ణువుని కీర్తించేటటువంటి భక్తి ఉంటే చాలు. ఆ భక్తి ఎవరికైనా ఉండొచ్చు, ఛండాలురైనా పర్వాలేదు, ఎవరైనా పర్వాలేదు అని చెప్పి వైష్ణవం పుట్టింది.

ఒక సార్వజనీన విలువ కోసం పోరాటం చేస్తూ దాన్ని మనకు మాత్రమే అన్వయించుకొంటున్నాము. ఇదే పదే పదే జరుగుతూ వచ్చింది కాబట్టే అందరూ బ్రాహ్మణీయ సమాజంలో భాగమయిపోయారు. అట్లా కాకుండా ఉండాలి అంటే ఆ సార్వజనీనతను నిలబెట్టుకోవాలి.

ఇవ్వాళ బ్రాహ్మణులలో శ్రీవైష్ణవులు ఉన్నారు. మా జాతి అదే. నేను పుట్టిన జాతి. మరి బ్రాహ్మణులలో శ్రీవైష్ణవులు ఎక్కడి నుంచి వచ్చారు? వైష్ణవం పుట్టిందే బ్రాహ్మణీయ ఆధిపత్యాన్ని వ్యతిరేకించేందుకు. ఇంతకు ముందే చెప్పినట్టు ఆనాటికి హక్కుల భావన అంటే జ్ఞానానికి సంబంధించిన భావనే, దైవ జ్ఞానానికి సంబంధించిన భావనే. దేవుడిని తెలుసుకోవడానికి భక్తి ఉంటే చాలు అన్నారు. ఎందుకంటే బ్రాహ్మణులు వేదం ఎవర్నీ చదవనీయరు. అలా అని ఎక్కడా దాచి పెట్టలేదు దాన్ని. మనసులో పెట్టుకున్నారు. పుస్తకాన్ని దాచిపెడితే దొంగిలించి అయినా చదువుకోవచ్చు. కాని వాడు పుస్తకంలో రాయలేదు. తాను మాత్రమే తెలుసుకొని, తాను ఎవరికిస్తే వాళ్ళకి మాత్రమే తెలిసేలా చేసుకున్నాడు. ఇంకెట్లా తెలుసుకోవాలి వేరేవాళ్ళు? అందుకని నీ వేదజ్ఞానమే అక్కరలేదు పో, దేవుడ్ని తెలుసుకోవడానికి భక్తి ఉంటే చాలు అన్నారు. ఆ భక్తి ఎవరికైనా ఉండొచ్చు అన్నారు. అలా ఉన్న వాళ్ళందరూ వైష్ణవులే అన్నారు. వాళ్ళే ఇప్పుడు ఒక బ్రాహ్మణ శాఖ అయ్యారు! ఇది ఎందుకు చెప్తున్నానంటే ఇవ్వాళ్టికి కూడా జరుగుతున్నది ఇదే.

బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కీలకమైన అంశం అంబేద్కర్ చెప్పిన ప్రతి మనిషికి సమానమైన విలువ అనేది. కాని తరచుగా ఏం జరుగుతూ వస్తున్నదంటే బ్రాహ్మణీయ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగేటటువంటి పోరాటాలు, తమకంటే కింది వాళ్ళు అలాంటి పోరాటమే మొదలుపెడితే వ్యతిరేకంగా స్పందించడం. దీన్ని మనం పదే పదే చూసుకుంటూ వస్తున్నాం. అంటే ఒక సార్వజనీన విలువ కోసం పోరాటం చేస్తూ దాన్ని మనకు మాత్రమే అన్వయించుకొంటున్నాము. ఇదే పదే పదే జరుగుతూ వచ్చింది కాబట్టే అందరూ బ్రాహ్మణీయ సమాజంలో భాగమయిపోయారు. అట్లా కాకుండా ఉండాలి అంటే ఆ సార్వజనీనతను నిలబెట్టుకోవాలి. ఇవాళ దళిత ఉద్యమం ప్రయత్నపూర్వకంగా చేయవలసిన పనులలో అదొకటి. వారిలో చేసే వాళ్లున్నారు, చేయలేకపోతున్నవాళ్ళు ఉన్నారు. ఆ నిర్దిష్ట విమర్శలోకి నేను పోవడం లేదు గానీ, ఆ కర్తవ్యం అయితే మనకుంది. మళ్ళీ సామాజిక ఆర్థిక హక్కుల విషయానికి వస్తే అందరికీ వనరులపైన అజమాయిషీ ఉండాలి, అందరికీ వనరుల వినియోగం పైన హక్కు ఉండాలి, అందరికీ పని చేసుకునే హక్కు ఉండాలి. ప్రతి ఒక్కరికీ జీవనాధారం లభించాలి అనే

ఆలోచన ఒక వ్యవస్థగా రూపం తీసుకొనే ప్రయత్నం జరిగి నిలదొక్కుకోలేక ఆగిపోయింది. తిరిగి ఆ అన్ని సమాజాలు కూడా పూర్తిగా పెట్టుబడిదారీ కార్పొరేట్ పెట్టుబడిలోకి వెళ్లిపోవడం జరిగింది. కారణాలు, వివరాలలోకి ప్రస్తుతం పోవలసిన అవసరం లేదు.

ఈ మూడు రకాల హక్కులు కూడా ఇవ్వాళ మానవ హక్కుల ఉద్యమం అవగాహనకు స్ఫూర్తినిచ్చేటటువంటి విషయాలుగానే మన ముందున్నాయి. ఈ మూడు సంప్రదాయాలనూ గ్రహించి ఇవ్వాళ మానవ హక్కులు అనే భావనను విశాలంగా నిర్వచించుకునే ప్రయత్నం ఒకటి చేస్తున్నాము. సంఘాలుగా, మానవ హక్కుల ఉద్యమాలుగా చేస్తున్నాం ఈ పని. వీటికో చరిత్ర ఉంది. ప్రధానంగా దాని గురించి మాట్లాడటమే ఇవ్వాళ నా ఉద్దేశ్యం. హక్కుల కోసమే సంఘాలుగా ఏర్పడటమనేది ఒక ప్రత్యేకమైన పరిస్థితిలోనే అన్ని దేశాలలోను జరిగింది.

## హక్కుల సంఘాల ఆవిర్భావం

దాదాపు హక్కుల కోసం ఏర్పడిన సంఘాలు అన్నీ కూడా అప్పటి సమాజంలో వచ్చిన ఒక సంక్షోభం నేపథ్యంలో, తానే పెట్టుకున్న ప్రమాణాలకు భిన్నంగా, విరుద్ధంగా రాజ్యం ఆ సంక్షోభాన్ని అణచి వేసినప్పుడు ఇది అన్యాయము అంటూ గొంతెత్తి మాట్లాడేందుకు పుట్టినవే. ఎందుకట్లా జరిగిందంటే చెప్పలేం గానీ, జరిగిందయితే అదీ. నేను చెప్పేది మానవ హక్కుల సంఘాల గురించి. హక్కుల ఉద్యమాలు అంటే వేరే రకంగా వస్తుంది. ప్రతి అణగారిన సెక్షన్ చేసిన పోరాటమూ హక్కుల ఉద్యమమే. కానీ మానవ హక్కుల సంఘాలుగా, పౌరహక్కుల సంఘాలుగా, ప్రజాస్వామ్య హక్కుల సంఘాలుగా ఉన్నవన్నీ కూడా ఒకే ఒక ప్రత్యేకమైన సందర్భంలో పుట్టాయి. అది ఏమిటి అంటే సమాజంలో ఒక సంక్షోభం వస్తుంది. ఆ సంక్షోభం నుంచి ఒక ఉద్యమం గానీ, ఒక తిరుగుబాటు గానీ, ఒక అలజడి గానీ సంఘటితంగానో అసంఘటితంగానో వస్తుంది. ఆ సమాజాన్ని పరిపాలించే ప్రభుత్వము లేదా రాజ్యము – దానికి వర్తించే నియమాలు కొన్ని ఉంటాయి గదా, ఒక చట్టమో, ఒక రాజ్యాంగమో, ఒక పాలసీనో దానికి లోబడి కాకుండా పూర్తిగా విరుద్ధంగా ఆ అలజడిని, ఆ సంక్షోభాన్ని, ఆ ఉద్యమాలను, ఆ పోరాటాలను అణచివేసే ప్రయత్నం చేసినప్పుడు ఇది అన్యాయం అంటూ గొంతెత్తి మాట్లాడిన రూపంలోనే అన్నీ కూడా – పౌర హక్కుల సంఘాలైనా, మానవ హక్కుల సంఘాలైనా, ప్రజాస్వామిక హక్కుల సంఘాలైనా ఇండియాలోనైనా ఏ దేశంలో అయినా సరే – పుట్టాయి.

## అమెరికాలో ACLU

ఉదాహరణకు అమెరికాలో American Civil liberties Union ఇప్పటికీ ఉంది. 1915, 16 సంవత్సరాలలో అంటే రష్యాలో బోల్షివిక్ విప్లవం రాబోతూ ఉన్న దశలో పాశ్చాత్య దేశాలలో విపరీతమైన భయం ఉండింది. ఈ బోల్షివిక్‌లు ప్రపంచమంతా

అక్రమించుకుంటారేమో అని. ఇప్పుడు మనకు ఆశ్చర్యం అనిపించవచ్చు కానీ అప్పుడు నిజంగా భయముండింది వాళ్ళకు. ఆ భయంతో అమెరికాలో ఏం జేశారంటే సాధారణ కార్మిక సంఘాల కార్యకర్తలను, కమ్యూనిస్టులను, సోషలిస్టులను, అనార్కిస్టులను అందరినీ పట్టుకొని జైల్లో పెట్టి కుట్రకేసులు పెట్టారు. మన దగ్గర పెడుతున్నట్టే. ఏమని అంటే వీళ్ళు అమెరికాను బోల్షివిక్‌లకు అప్పగించడానికి కుట్ర చేస్తున్నారు అని. చిన్న కుట్ర కాదది. ఏదో ఒక బిల్డింగ్‌ను కూల్చడానికి కుట్ర కాదు, ఒకడిని చంపడానికి కుట్ర కాదు. అమెరికాను బోల్షివిక్‌లకు అప్పగించడానికి కుట్ర చేస్తున్నారని కేసులు పెట్టారు వాళ్ళ మీద. ఇది అమెరికా రాజ్యాంగానికే విరుద్ధం, We the people of united States of America అని 1776 లో మనం ప్రకటించుకున్న ఫిలడెల్ఫియా డిక్లరేషన్ ఉంది గదా దాంట్లో అభిప్రాయ స్వేచ్ఛను ఒక ప్రాథమిక హక్కుగా మనం అనుకున్నాము. కాబట్టి అలా చేయడానికి వీలు లేదు అంటూ పుట్టిందే American Civil Liberties Union. తరవాత అది చాలా ఎదిగింది. కొంత ఎదగలేకపోయింది. 1960లలో నల్ల జాతీయుల ఉద్యమం వచ్చినప్పుడు వాళ్ళు ఈ సంఘం మీద చాలా సీరియస్ విమర్శ పెట్టారు. ACLU అప్పటికి నలభై ఏళ్ళుగా ఉంది అక్కడ. నల్ల జాతీయుల హక్కుల గురించి మీరేమి మాట్లాడారు? ఎందుకు మాట్లాడలేదు అని అడుగుతూ మార్టిన్ లూథర్ కింగ్, మిగతా వాళ్ళూ కలిసి బ్లాక్ సివిల్ రైట్స్ మూవ్‌మెంట్ ఒకటి విడిగా మొదలుపెట్టారు. అంత అవసరం ఎందుకు వచ్చింది? ఎందుకంటే ACLU ఎదగలేకపోయింది కాబట్టి, విశాలం కాలేకపోయింది కాబట్టి, నల్ల జాతీయులకు అమెరికా సమాజంలో ఎదురవుతున్న వివక్షను ఒక హక్కుల సమస్యగా అది గుర్తించలేకపోయింది కాబట్టి. అందుకే నల్లజాతీయుల పౌర హక్కుల ఉద్యమం విడిగా మొదలయింది. అట్లాగే అమెరికాలో అనేక మహిళా సంఘాలు కూడా విడిగా పోరాడాయి. మహిళా సంఘాల డిమాండులో మహిళల ఆకాంక్షగా ఉన్నటువంటి సమానత్వ హక్కులు ఏవైతే ఉన్నాయో అవి ACLU అజెండాలో పూర్తిగా లేవు. అందుకే మహిళా హక్కుల ఉద్యమం విడిగా అమెరికాలో పెరుగుతూ వచ్చింది. ఆదివాసుల ఉద్యమాలు కూడ ఇప్పుడు అలాగే జరుగుతున్నాయి.

## బ్రిటన్‌లో NCCL

బ్రిటన్‌లోనూ అంతే. అక్కడ చాలా బలంగా ఉంది National Council for Civil Liberties (NCCL) అనేది. అది పుట్టింది కూడా ఒక ప్రత్యేకమైన పరిస్థితిలో. బ్రిటన్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛ, అభిప్రాయ స్వేచ్ఛ చాలా ముఖ్యమైనవి అని గదా అనుకుంటాం. 1680లో Bill of Rights ప్రిపేర్ చేసినప్పటినుంచి వాళ్ళు ఆ స్పృహతో ఉన్నారని కదా అనుకుంటాం. అటువంటి బ్రిటన్‌లో 1930లలో ఆర్థిక మాంద్యం తీవ్రంగా వచ్చినప్పుడు వాల్‌స్ట్రీట్ కుప్పకూలడం ఇవన్నీ అయినాయి గదా. పెట్టుబడిదారీ దేశాలన్నిట్లో ఫ్యాక్టరీలు పెద్దఎత్తున మూతబడ్డాయి. కార్మికులు నిరుద్యోగులయ్యారు. వీధులపాలయ్యారు. అప్పుడు

కార్మిక సంఘాలు, లేబర్ పార్టీ వాళ్ళందరూ ఒక పోరాట రూపం ఎంచుకున్నారు. ఉద్యోగాలు పోయిన కార్మికులతో ఊరేగింపులు తీయడం. దానికి హంగర్ మార్చ్ అని పేరు. ఆకలి ఊరేగింపులు. పెద్ద పాలసీ మార్పులేమీ అడగలేదు వాళ్ళు. మాకు అన్నం పెట్టండి అని ఊరేగింపులు తీసారు. అట్లా లండన్‌లో ఒక రోజు ఒక ఊరేగింపు జరుగుతూ ఉంది. రాబర్ట్ నాక్స్ అనే జర్నలిస్టు ఆ ఊరేగింపును కవర్ చేస్తున్నాడు. ఊరేగింపు సాగుతూ ఉంది. ఈలోగా ఒక వ్యాన్ వచ్చి వెనకాల ఆగింది. దాంట్లో నుంచి కొంత మంది కార్మికులలాగే దుస్తులు వేసుకున్న వాళ్ళు దిగారు. దిగి వాళ్ళు ఊరేగింపులో కలిసిపోయి ఊరేగింపులో ముందు ఉన్న కార్మికులు ఇస్తున్న దానికన్నా తీవ్రంగా నినాదాలు ఇవ్వడం మొదలుపెట్టారు. పక్కవాడు ఇస్తే ఆకలిగా ఉన్నవాడు ఊరుకుంటాడా? వాడూ ఇస్తాడు కదా. అలా అందరూ తీవ్రంగా నినాదాలు ఇవ్వసాగారు. వేడెక్కింది ఊరేగింపు. కొంతసేపటికి – తర్వాత వచ్చి చేరిన వాళ్ళు రాళ్ళు తీసుకొని వేయడం మొదలుపెట్టారు. దాంతో ముందునుంచి ఉన్న వాళ్ళూ రాళ్ళు తీసుకొని వేయడం మొదలబెట్టారు. అప్పుడు అదే వ్యానులో నుంచి యూనిఫారమ్‌లో ఉన్న పోలీసులు దిగి అందరినీ చావగొట్టారు. ఇదంతా ఆయన చూసాడు. ఏం జరిగిందో స్పష్టంగా ఉంది.

వార్త రాసి ఊరుకోక కొంతమంది మిత్రులకు చెప్పుకొంటూ పోయాడు. ఏమి అన్యాయం ఇది? భావ ప్రకటనా స్వేచ్ఛ అనేది మనం గర్వంగా భావించే బ్రిటిషు ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్యమైన అంశం కదా. అన్నం పెట్టలేకపోతే పోయావు, ఫ్యాక్టరీలు తెరవలేకపోతే పోయావు, ఆర్థిక మాంద్యానికి పరిష్కారం చూపించలేకపోతే పోయావు, ఊరేగింపులు తీసి మాకు అన్నం పెట్టు అని అడిగే హక్కును కూడా గౌరవించలేకపోతే ఎట్లా? ఆయన కృషి ఫలితంగా అప్పుడే National Council for Civil Liberties ఏర్పడింది. ఇప్పటికీ వాళ్ళ మానిఫెస్టోలో మొదటి అంశం భావప్రకటనా స్వేచ్ఛే. ఆ చారిత్రక మూలమే దానికి కారణం. తరవాత అది చాలా అంశాలను చేపడుతూ పోయింది. ముఖ్యంగా ఐరిష్ టెర్రరిజం అని పిలవబడిన చర్యలను ఎదుర్కొనటానికి బ్రిటన్ ఉపయోగించిన పద్ధతుల మీద చాలా సీరియస్‌గా వాళ్ళు విమర్శ పెడుతూ ఎప్పటికప్పుడు బ్రిటన్ ప్రయోగిస్తున్న – మన టాడా లాంటిదే ఇంగ్లాండ్‌లో కూడా ఒకటుంది – చట్టాల్ని ఎదుర్కోవడానికి ఉద్యమాలు చేయడం, అలా చాలా పనిచేస్తూ వస్తున్నారు వాళ్ళు. ఇవ్వాళ వాళ్ళు ఎక్కడిదాకా ఎదగగలిగారంటే ఇంగ్లాండ్‌లో ప్రభుత్వం ఏదైనా ఒక చట్టం చేసినప్పుడు ఆ బిల్లును అది ముందే NCCL కు చూపిస్తుంది.. దాంట్లో పౌరహక్కులకు వ్యతిరేక అంశాలేమన్నా ఉంటే చెప్పండని. చెపితే తప్పనిసరిగా వింటారని కాదు కానీ, సలహా అయితే అడుగుతారు. అక్కడి దాకా అది ఎదగగలిగింది. ప్రపంచ ఆర్థిక మాంద్యం నుంచి పుట్టిన సంక్షోభాన్ని బ్రిటన్ తాను గౌరవించవలసిన హక్కులను గౌరవించకుండా, అందుకు విరుద్ధంగా ప్రవర్తించడానికి స్పందనగానే అది పుట్టింది.

> ఒక అభద్రత వచ్చినప్పుడు తాము ప్రామాణికంగా చెప్పే రాజ్యాంగం, సిద్ధాంతం ఒప్పుకోనటువంటి అణచివేతను ప్రయోగించినప్పుడు ఇది అన్యాయం అంటూ ముందుకొచ్చినవే ఈ హక్కుల సంఘాలన్నీ కూడా.

## రష్యా, తూర్పు యూరప్ దేశాల్లో

రష్యా, తూర్పు యూరపు దేశాల విషయానికొస్తే ఈ పని చాలా కష్టమయ్యింది. కానీ కొన్ని తూర్పు యూరపు దేశాలలో మాత్రం అంటే జెకోస్లోవేకియా, హంగేరి, పోలాండ్ లాంటి దేశాలలో కమ్యూనిస్టు పార్టీల ప్రభుత్వాలు వచ్చిన తరువాత కూడా హక్కుల సంఘాలు ఏర్పడ్డాయి. అయితే దాదాపు అన్నీ రహస్యంగా పనిచేసే సంఘాలే. వాళ్ళు ప్రధానంగా పెట్టిన డిమాండ్ ఏమిటీ అంటే రాజకీయ స్వేచ్ఛ. పరిపాలించే ప్రభుత్వంతో విభేదించే హక్కు ఆ దేశాలలో లేదు. పరిపాలించే ప్రభుత్వమేమో కార్మిక పార్టీగానే పరిపాలిస్తుంది. అది కార్మికుల తరపునే పరిపాలిస్తుంది. కానీ కార్మికులకు మాత్రం దానిని విమర్శించే అధికారం లేదు. కొత్తగా సొంతంగా ట్రేడ్ యూనియన్లు పెట్టుకునే అధికారం కూడా లేదు. దానిని విమర్శిస్తూ వాళ్ళు ముందుకు వచ్చారు. అన్ని దేశాల రాజ్యాంగాలలో భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుంది కదా, భావప్రకటనా స్వేచ్ఛ లేదు అని ఏ రాజ్యాంగంలోనూ రాసుకోరు కదా, జెకోస్లావాకియాలో ఉంది, రష్యాలో కూడా ఉంది, మరి రాసుకున్న దానికి విరుద్ధంగా వాళ్ళందరినీ దేశద్రోహులు అని చెప్పి జైల్లో పారేయడం మీరు ప్రామాణికంగా భావించేటటువంటి మార్క్సిజం లెనినిజం కూడా ఒప్పుకోదు, కార్మికులకు స్వేచ్ఛ ఉండాలి, సోషలిజాన్ని కాంక్షించే వాళ్ళకు స్వేచ్ఛ ఉండాలని మీ సిద్ధాంతమే చెపుతుంది కదా అని విమర్శిస్తూ వాళ్ళు హక్కుల కోసం కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అంటే ఒక అభద్రత వచ్చినప్పుడు తాము ప్రామాణికంగా చెప్పే రాజ్యాంగం, సిద్ధాంతం ఒప్పుకోనటువంటి అణచివేతను ప్రయోగించినప్పుడు ఇది అన్యాయం అంటూ ముందుకొచ్చినవే ఈ హక్కుల సంఘాలన్నీ కూడా.

## భారతదేశంలో

అట్లాగే ఇండియాలో కూడా ఇవ్వాళ పని చేస్తున్న హక్కుల సంఘాల్ని తీసుకుంటే ఒక మూడు మూలాలు స్థూలంగా కనిపిస్తాయి.

## 1. నక్సలైట్ ఉద్యమం నుంచి..

ఆంధ్రప్రదేశ్‌లో, పశ్చిమ బెంగాల్‌లో, మహారాష్ట్రలో హక్కుల సంఘాలకు పునాది ఎక్కడుండింది అంటే 1960ల చివరి భాగంలో వచ్చిన నక్సలైట్ ఉద్యమంలో. ఆ ఉద్యమం

పుట్టినప్పుడు, అదొక ఉద్యమం, ఒక రాజకీయ ఉద్యమం అని గుర్తించడానికే ప్రభుత్వం ఇష్టపడలేదు. ఆ ఉద్యమానికి పునాది అత్యంత అణచివేతకు, పేదరికానికి గురయినటువంటి ప్రజానీకంలో, ఆదివాసులలో ఉండింది. నక్సలైట్ల లక్ష్యమైతే సాయుధంగా రాజ్యాధికారం కూలదోయడం కావచ్చు. కానీ వాళ్లు పెట్టిన డిమాండ్లు ఏవయితే ఉన్నాయో, వాళ్లు లేవదీసిన సమస్యలేవయితే ఉన్నాయో అవి ఆదివాసీ పేదవాళ్ళ సమస్యలు. భూసంస్కరణలు అమలు కాకపోవడమనే సమస్య, కనీస వేతనాల చట్టం అమలు కాకపోవడమనే సమస్య.. ఇలాంటివి. ఈ విషయాలను చూడకుండా ఆయుధాలు పట్టుకున్నారు కాబట్టి చంపుతాము, వాళ్లనే కాదు వాళ్లకు సపోర్టు ఇచ్చే వాళ్లనూ చంపుతాము, వాళ్ళకు అన్నం పెట్టే వాళ్ళను కూడా చంపుతాము. దానితో పాటు వాళ్ళ మీద కుట్ర కేసులు పెట్టడమూ, వాళ్లను కూడా ఎన్‌కౌంటర్లు చేయడమూ... ఇవన్నీ చేశాయి ఆ రాష్ట్ర ప్రభుత్వాలు 1972లో. పశ్చిమబెంగాల్‌లో ఇది మన దగ్గరికంటే ఎక్కువగా, మరింత ఘోరంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీకి చెందినటువంటి ప్రైవేటు గూండా గ్యాంగులు కలకత్తా నగరంలో భయంకరమైన హత్యాకాండకు పాల్పడ్డాయి. ఆ రోజులలో నక్సలైట్లు అని పిలవబడే వాళ్ళు, వాళ్ళ బంధువులు, వాళ్ళ స్నేహితులు, వాళ్ళ మీటింగులకు పోయేవాళ్ళు ఎవ్వరినీ కూడా వదిలిపెట్టకుండా నరికి చంపారు కలకత్తాలో. ఇప్పటికీ లెక్క తెలియదు ఎంత మందిని చంపారనేది. ఆ తరవాత దశాబ్దాల తరబడి వామపక్ష పార్టీలు పరిపాలించినప్పటికీ ఆ లెక్క ఇప్పటికీ తేలలేదు.

1980లో న్యాయ విచారణ కమీషన్ వేస్తే పోలీసులు కోర్టుకుపోయి దాన్ని రద్దు చేయించుకున్నారు. న్యాయవిచారణ కమీషన్ వేయడానికి కావలసినటువంటి పద్ధతులు పాటించలేదు అని కలకత్తా హైకోర్టు దాన్ని రద్దు చేసింది. ఆ తరవాత ఏం జరగలేదు. మొన్న రెండేళ్ళ కింద APDR అనే మా మిత్ర సంస్థ మళ్ళా కలకత్తా హైకోర్టులో కేసు వేసింది. 1960లలో జరిగిన ఆ హత్యాకాండపైన ఇప్పటికైనా న్యాయవిచారణ జరపాలని అడిగింది. 30 ఏళ్ళ కింద జరిగింది కదా అని హైకోర్టు అంటే ఫలానా గడువు దాటిపోతే హత్య మీద విచారణ జరపరాదని మన దేశ చట్టాలలో ఎక్కడా లేదు, ఎప్పుడైనా జరపవచ్చు, సాక్ష్యం దొరుకుతుందో దొరకదో చూద్దాం, దొరికితే మంచిది, దొరక్కపోతే మేము తప్పుకుంటాం అని వాళ్లన్నారు. కలకత్తా హైకోర్టు కరక్టే, హత్యా నేరానికి లిమిటేషన్ లేదు, ఎప్పుడయినా విచారించవచ్చు అంటూనే ఇంతకాలం అయిన తరువాత సాక్ష్యాలేమి మిగులుతాయిలే అని కొట్టేసింది. సుప్రీంకోర్టులో దానిమీద అప్పీలు వేశారు వాళ్ళు. కన్నాబిరాన్ గారిని పెట్టుకొన్నారు. నేను కూడా సహాయం చేశాను. మొత్తం ఇంత లావున తయారు చేశాము. సుప్రీంకోర్టు కూడా ముప్పై ఏళ్ళు అయిపోయిందిగదా ఇంకేం చేస్తాములే అని ఒక్క వాక్యం చెప్పి దాన్ని డిస్మిస్ చేశారు వాళ్లు. అంటే చూడ్డానికి ఇష్టం లేదు అంతే. ఆనాడు కలకత్తాలో ఏం జరిగింది అనే విషయాలను చూడ్డానికి గానీ అవి బయటకు

రావడం గానీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా ఎవ్వరికీ ఇష్టం లేదు. ఆ సంఘటనల నేపథ్యంలోనే కలకత్తాలో 1972లో Association for Protection of Democratic rights (APDR) ఏర్పడ్డది. అదే నేపథ్యంలో దాదాపు అదే కారణాలతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒక కృషి మొదలయ్యింది. OPDR, APCLC అని రెండు సంస్థలుగా అది ఏర్పడింది ఇక్కడ. తరవాత కాలంలో దాదాపు ఇదే రకంగా అంటే నక్సలైట్ పార్టీ ఉద్యమాలు విస్తరించిన క్రమంలో మహారాష్ట్ర, కర్ణాటకలలో కూడా ఇదే రకమైనటువంటి స్పందన ప్రభుత్వం నుండి వచ్చినప్పుడు అక్కడ కూడా హక్కుల సంఘాలు ఏర్పడ్డాయి. ఇది ఒక మూలం.

## 2. అక్రమ పరిపాలనకు వ్యతిరేకంగా...

ఇంకొక మూలం అందరికీ బాగా పరిచయమున్న పియుసిఎల్ ఏర్పాటు. 1970లలోనే జయప్రకాశ్ నారాయణ్ ప్రోద్బలంతో బీహార్‌లో, గుజరాత్‌లో యువకులు చాలామంది ప్రభుత్వ అవినీతి, ఆశ్రిత పక్షపాతం, అక్రమ పరిపాలనలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారు. అంటే సాయుధ పోరాటమేం కాదు. విద్యార్థులు పెద్దఎత్తున వీధుల్లోకి వచ్చి ఉద్యమం చేస్తే సిఆర్‌పిఎఫ్‌ను దించి బీహార్‌లో వందల మందిని చంపారు. అప్పుడు జయప్రకాశ్ నారాయణ్ ఇచ్చినటువంటి పిలుపునందుకొని ఆయన రాజకీయాలతో సన్నిహితంగా ఉండే కొంతమంది మేధావులు జస్టిస్ తార్కుండేలాంటి వాళ్ళు పి.యు.సి.ఎల్. అనే హక్కుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. నేను ఇంతకు ముందు చెప్పినట్టుగా ఒక హక్కు మనకు లేకపోతే ఉన్న హక్కులను వాడుకొని పోరాడతాం. ఉన్న హక్కులను నిరాకరించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తూనే ఉంటుంది కాబట్టి లేని హక్కులు, ఉన్న హక్కులు ఎప్పుడూ సన్నిహితంగా మిళితమయ్యే ఉంటాయి. ఎట్లాగైతే నక్సలైట్లపై అణచివేతకు వ్యతిరేకంగా ప్రధానంగా మేధావి వర్గం వాళ్ళు హక్కుల సంఘాల్లోకి వచ్చారో ఇక్కడా అలాగే వచ్చారు. వచ్చిన వాళ్ళందరూ కూడా అంతో ఇంతో నక్సలైట్ ఉద్యమం పట్ల సానుభూతి ఉన్నవాళ్ళే కాబట్టి వారిపై మీరంతా నక్సలైట్లే అని ఒక నింద కూడా వేశారు. నిజానికి ఒక ఉద్యమంపైన అణచివేత జరిగినప్పుడు అందరూ స్పందిస్తే బాగుంటుంది. కానీ అలా జరగదు. అంతో ఇంతో వాళ్ళపైన సానుభూతి ఉన్నవాళ్ళే స్పందిస్తారు. ఆ స్పందన సహజమైంది. దానిని నిందించాల్సిన అవసరం లేదు. అట్లాగే జయప్రకాశ్ నారాయణ్ గారి నాయకత్వంలో జరిగిన ఉద్యమంపై అణచివేత వచ్చినప్పుడు, ఆ అణచివేతకు వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్‌కు రాజకీయంగా సన్నిహితమైనటువంటి తార్కుండేగారే స్పందించారు. స్పందించి పి.యుసి.ఎల్‌ను ఏర్పాటు చేశారు. అది ఇవ్వాల్టికీ దేశవ్యాప్తంగా పనిచేస్తూనే ఉంది.

## 3. మా జాతి వేరు అనే డిమాండు నుంచి...

మూడవ రకమైనటువంటి హక్కుల సంఘాలు నాగాలాండ్‌లో, కాశ్మీర్‌లో, అస్సాంలో, పంజాబ్‌లో పుట్టాయి. మా జాతి వేరనే అభిప్రాయం చాలా బలంగా ఉండేది నాగాలాండ్‌లో,

కాశ్మీరులో. పంజాబ్‌లో, మిజోరాంలో మాత్రం ఇది మెజారిటీ డిమాండ్ కాదు నాకు తెలిసినంత వరకు. ఒకానొక రాజకీయ డిమాండే. కానీ నాగాలాండ్‌లో, కాశ్మీరులో మాత్రం చాలా బలమైనటువంటి అభిప్రాయం ఏమంటే మేము భారతీయులం కాము, మమ్మల్ని మీరు బలవంతంగా ఇండియాలో పెట్టుకోవద్దు అని. దీనికి చరిత్రలో వాళ్లు చాలా కారణాలు చూపిస్తున్నారు. ఆ వివరాలలోకి ఇప్పుడు పోనక్కరలేదు. వాళ్ళెవ్వరూ కూడా వెంటనే ఆయుధాలు పట్టుకోలేదు. నాగా ప్రజానీకానికి భారతప్రభుత్వం 1947లో ఇచ్చిన హామీ ఏమిటంటే మీరు ఇండియాలో తాత్కాలికంగా మాత్రమే చేరండి. పది సంవత్సరాలు ఉండండి ఇండియాలో. 1957లో పున:పరిశీలన చేసే అవకాశం మీకిస్తాము. మేము ఇక్కడి కాంగ్రెసు పార్టీనిగానీ, ఇంకొక పార్టీనిగానీ మీకు ప్రతినిధులుగా భావించము. నాగా నేషనలిస్ట్ కౌన్సిల్‌నే మేము ప్రతినిధిగా భావిస్తాం – సంప్రదాయకంగా వచ్చి కొంత ఆధునీకరణ చెందినటువంటి వాళ్ళ తెగ సంస్థ అది – వాళ్ళను మాత్రమే ప్రతినిధులుగా భావిస్తాము, మా కాంగ్రెసు పార్టీని కాదు, ఇంకెవ్వరినీ గాదు. పదేళ్ళు ఇండియాలో ఉండండి ఆ తరవాత మీకు పునరాలోచన స్వేచ్ఛ ఇస్తాము అని వాళ్ళకు హామీ ఇచ్చారు. అయితే కాశ్మీరీలకన్నా నాగాలు తెలివైన వాళ్ళు. ఈ హామీని వాళ్లు నమ్మలే. తామే ప్లెబిసైట్ పెట్టుకున్నారు. వీళ్ళు పెట్టరని ముందే తెలుసు వాళ్ళకు. ప్లెబిసైట్ పెట్టుకుంటే 91 శాతం జనం ఇండియాలో ఉండము మేము అనే దానికే ఓటేశారు. ఆ ప్లెబిసైట్ అన్యాయంగా జరిగిందని ఎవ్వరూ ఇప్పటిదాకా అనలేదు. న్యాయంగా జరిగిందనే అందరూ ఒప్పుకొంటున్నారు. అయినా 1957లో పదేళ్ళు అయ్యాయి, మా సంగతేంది అని అడిగితే సైన్యాన్ని దింపారు. ప్రభుత్వం ప్లెబిసైట్‌పెట్టి వాళ్ల అభిప్రాయం తెలుసుకోలేదు, బయటకు పోయే అవకాశమూ ఇయ్యలేదు. ఇప్పటికి నలభై ఏళ్ళుగా సైన్యం అక్కడే ఉంది. చచ్చీ చచ్చీ ఇంక చావలేక ఇప్పుడు వాళ్లు బలిమిన చర్చలకు కూర్చొన్నారే తప్ప ఇష్టపూర్వకంగా కాదు.

అట్లాగే కాశ్మీరులో కూడా. కాశ్మీర్ ఇండియాలో భాగమైనప్పుడే ఆ ఒప్పందంలోని ఒక షరతు ఏంటంటే, మీకు స్వయం ప్రతిపత్తి ఉంటుంది, తుది నిర్ణయం చేసే స్వేచ్ఛ మీకే ఉంటుంది అని. ఆ రెండు హామీల మీదనే కాశ్మీరు ఇండియాలో భాగం అయ్యింది. ఆ రెండిట్ని కూడా ఇండియా గౌరవించలేదు. నలభై ఏళ్ళుగా చట్టబద్ధంగా దానికోసం ప్రయత్నాలు చేసిన తరవాతే వాళ్లు ఆయుధాలు పట్టుకున్నారు. అదే చెపుతారు వాళ్లు. అది చారిత్రక వాస్తవమే. కానీ దాని మీద ఇండియన్ గవర్నమెంటు జవాబు ఏంటంటే నాగాలు అంతర్జాతీయ క్రిస్టియన్ మిషనరీల ఏజెంట్లయితే వీళ్ళేమో పాకిస్తాన్ ఏజెంట్లు అని. స్థానిక ప్రజానీకానికి సమస్యలున్నాయి, వాళ్ళకు వైమనస్యం ఉంది, వాళ్ళలో అసంతృప్తి ఉంది, దానికి కారణాలు ఉన్నాయని మాత్రం మనవాళ్ళు ఒప్పుకోరు. ఆ అణచివేత పెద్దఎత్తున ప్రయోగిస్తూ వచ్చేటప్పటికి సహజంగానే నాగాల నుండి, కాశ్మీరీల నుండి హక్కుల సంఘాలు పుట్టాయి. నక్సలైట్ ఉద్యమం పైన అణచివేతకు స్పందనగా పుట్టిన మన హక్కుల సంఘాలు ఎన్‌కౌంటర్లను వ్యతిరేకిస్తూ, జీవించే హక్కును తీసెయ్యడానికి వీలు లేదనేది ఎట్లా కేంద్రంగా

నా హక్కుల గురించి మాత్రమే నేను మాట్లాడతాను అంటే దానికి సహజాతంగా ఉండే సార్వజనీనతను మీరు కాదన్న వాళ్ళవుతారు. కాబట్టి సహజంగానే అది విస్తృతమవుతుంది. వ్యవస్థను మార్చటం కోసం పోరాటం చేస్తున్న వ్యక్తి అరెస్టయి నిర్బంధానికి గురవుతున్నాడని పోలీసుస్టేషన్‌కు పోతే అక్కడ పదిమంది ఉంటారు జేబుదొంగలు. మరి వాళ్ళ హక్కుల సంగతేంది అన్న ప్రశ్న ఆటోమేటిక్‌గా వస్తుంది.

పెట్టుకొని పనిచేసుకుంటూ వచ్చాయో, అట్లాగే ఆ ప్రాంతంలో ఉన్న హక్కుల సంఘాలు స్వయం నిర్ణయాధికారం అనే హక్కును కేంద్రంగా పెట్టుకొని పనిచేయడం మొదలుబెట్టినయి. సహజమే అది. ఎట్లాగైతే ఇంగ్లాండ్‌లో ఎన్‌సిసిఎల్ భావప్రకటనా స్వేచ్ఛను కేంద్రంగా పెట్టుకొని చేసిందో వీళ్లూ అలాగే పనిచేసుకుంటూ వచ్చారు. స్వయం నిర్ణయాధికారం ఒక హక్కు. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోనే ఉంది అది. International covenant on civil and political rights లో పాయింట్ నంబర్ ఒకటి ఏమిటి అంటే All people shall have the right for self determination. ఇది ఐక్యరాజ్య సమితి ఒడంబడికలోనే ఉంది కదా అని వాళ్ళక్కడ అంటూ ఉన్నారు. ఈ మూడు రకాల పునాదుల నుంచి మూడు రకాల సంఘాలు అనేవి ఏర్పడటం జరిగింది.

## అదొక పుట్టుమచ్చ

ఏర్పడినప్పుడు ఉన్న తమ అవగాహనను – ఆ పుట్టుమచ్చను – అవి భరిస్తూనే వచ్చాయి. ఏ సందర్భాలలో అవి పుట్టాయో చాలాకాలం దాకా ఆ సందర్భానికే వాళ్ళ అవగాహన పరిమితం అవుతూ రావడం జరిగింది. మన రాష్ట్రంలో అయితే మిలిటెంట్‌గా ముందుకొస్తున్నటువంటి ప్రజా ఉద్యమాలపైన, వ్యవస్థను మార్చడానికి ముందుకొస్తున్న ప్రజా ఉద్యమాల పైన ప్రభుత్వం ప్రయోగించే హింసను ఖండించడం, వ్యతిరేకించడం అనే ఒక పరిమితమయిన అజెండాను పెట్టుకొనే పనిచేస్తూ రావడమనేది జరిగింది. కాని ఇంతకు ముందే చెప్పాను హక్కులు అనే భావనలో ఉండేటటువంటి ఒక స్వభావం ఏమిటంటే అది స్వభావ రీత్యానే సార్వజనీనం. స్వభావరీత్యానే అది నేను పక్కవాళ్ళ హక్కుల గురించి మాట్లాడను అననివ్వదు. హక్కులు అనే భావన నీకు ఆ అవకాశం ఇవ్వదు. ఎందుకంటే నా హక్కుల గురించి మాత్రమే నేను మాట్లాడతాను అంటే దానికి సహజాతంగా ఉండే సార్వజనీనతను మీరు కాదన్న వాళ్ళవుతారు. కాబట్టి సహజంగానే అది విస్తృతమవుతుంది. వ్యవస్థను మార్చటం కోసం పోరాటం చేస్తున్న వ్యక్తి అరెస్టయి నిర్బంధానికి గురవుతున్నాడని

పోలీసుస్టేషన్‌కు పోతే అక్కడ పదిమంది ఉంటారు జేబుదొంగలు. మరి వాళ్ళ హక్కుల సంగతేంది అన్న ప్రశ్న ఆటోమేటిక్‌గా వస్తుంది. హక్కులకు స్వాభావికంగా ఉండే సార్వజనీనత వల్లనే ఆ ప్రశ్న వస్తుంది. ఆ ప్రశ్నకు జవాబు చెప్పాల్సిన అవసరం ఉంటుంది. అప్పుడు ఏమవుతుంది అంటే వ్యవస్థను మార్చడం కోసం పోరాటం చేసే వాళ్ళు మాత్రమే కాదు, ఎవ్వరి మీదయినా సరే రాజ్యం అణచివేతను ప్రయోగిస్తే తప్పనిసరిగా అది హక్కుల సంఘాల పరిధిలో, కర్తవ్యంలో భాగం అవుతుంది. దానిని వ్యతిరేకించడం, వాళ్ళకు సహాయం చేయడం అవసరమవుతుంది.

తొలినాడు ఈ సంఘాల అవగాహనలో రాజ్యహింస, వ్యవస్థను మార్చటం కోసం పనిచేసే ఉద్యమాలపైన ప్రయోగిస్తున్న హింస మాత్రమే ప్రధానం అయినప్పటికీ దానికి గురయ్యేవాళ్ళు ఎక్కువగా పేదవాళ్ళు, బలహీన వర్గాలవాళ్ళు అనే అవగాహన కూడా వచ్చింది. ఇది సులభంగా వచ్చిందంటే అబద్ధం అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో హక్కుల సంఘాలు లాకప్ హత్యల్ని చేపట్టడం పౌరహక్కుల సంఘం ఏర్పడిన పదేళ్ళ తరవాతే జరిగింది. అంతకు ముందు కాదు. అయితే మొదలుపెట్టిన తరవాత మాత్రం ఒక స్పష్టమైన అవగాహనతోనే పనిచేసుకొంటూ రావడం జరిగింది. అట్లాగే ఇతర అనుభవాలు కూడా. అంబేద్కర్ సంఘాలవాళ్ళు చాలా సందర్భాలలో మమ్మల్ని అడిగేవాళ్ళు. లాకప్‌లో వేసి కొడితే మీరు స్పందిస్తారు – విమర్శిస్తారు బాగుంది. మంచి పని చేస్తున్నారు. కాని ఒక మనిషిని లాకప్‌లో కొట్టినప్పుడే హింసా? నువ్వు అంటరానివాడివని వెలివేస్తే అది హింస కాదా అని అడిగారు. మొదట్లో మాకే అర్థంగాని జవాబులేవో ఇచ్చాం. మాకు వాళ్ళడిగిన విషయమూ అర్థం కాలేదు. మా జవాబూ అర్థం కాలేదు.

కారంచేడు ఘటన, దళిత మహాసభ ఆవిర్భావం తర్వాత వచ్చిన చర్చవల్ల మాకు పెరిగిన అవగాహన ఏమిటి అంటే లాకప్‌లో వేసి కొడితే ఎంత హింసో, విలువ రీత్యా నువ్వు తక్కువ మనిషివి, నేను ఎక్కువ మనిషిని అంటే అంతే హింస. ఎక్కువ హింసా, తక్కువ హింసా అనేది కాదుగానీ మొత్తానికి అంటరానితనం కూడా తీవ్రమైన హింసే. అప్పుడేమన్నమాట? మనం పోలీసు హింస గురించి మాట్లాడుతున్నాము, లాకప్ హత్యల గురించి మాట్లాడుతున్నాము. అంటే పౌరులకి, రాజ్యానికి మధ్య ఉన్న అసమాన సంబంధాన్ని ప్రాతిపదిక చేసుకొని మాట్లాడుతున్నాం. అవును పౌరులకు రాజ్యానికి మధ్య ఉండేది అసమాన సంబంధమే. ఆ అసమాన సంబంధంలో అణచివేతకు గురయ్యేది, రాజ్యం యొక్క అధికారానికి గురయ్యేది ఎవరు? పౌరులు. మరి అటువంటి అసమాన సంబంధం కులంలోనూ ఉంది, అటువంటి అసమాన సంబంధం జెండర్‌లోనూ ఉంది, అటువంటి అసమాన సంబంధం ఫ్యాక్టరీల్లోనూ ఉంది. పొలం దగ్గరా ఉంది, కాంట్రాక్టరుకు, అతని దగ్గర పనిచేసే కార్మికులకు మధ్య ఉంది, ఏజెన్సీలోని ఆదివాసులకు, బయటవాళ్ళకు మధ్య ఉంది. సంఘ్ పరివార్ వాళ్ళు పెరిగేకొద్దీ మైనారిటీలకు మెజారిటీకి మధ్య కూడా ఒక

అసమాన సంబంధం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. అంటే వ్యవస్థీకృతంగా అసమాన సంబంధాలెక్కడెక్కడ సమాజంలో ఉన్నా అవన్నీ కూడా హక్కుల ఉద్యమం అజెండాలో భాగం అవుతాయి.

## అనుభవం నుండే నేర్చుకున్నాం

ఇది ప్రాక్టికల్‌గా మాకొచ్చిన అవగాహన. నేను మొదట్లో theoretical గా వివరించు కొంటూ వచ్చాను. ఇది ప్రాక్టికల్‌గా మాలో పెరిగిన అవగాహన. ఇది పెరిగింది అంబేద్కర్ సంఘాలు ప్రశ్నించినప్పుడే, స్త్రీవాదులు ప్రశ్నించినప్పుడే. నాకు బాగా జ్ఞాపకం హైద్రాబాదులో ఒక సెమినార్ పెట్టాం. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 59వ రాజ్యాంగ సవరణ అని చెప్పి ఆయనొక ప్రయత్నం చేశాడు. అది కాలేదు చివరికి. ఆ 59వ రాజ్యాంగ సవరణ ఏమిటంటే దేశంలో ఎమర్జెన్సీ పెట్టినప్పుడు రాష్ట్రపతి ఒక నోటిఫికేషన్ ద్వారా ప్రజల భావప్రకటనా స్వేచ్ఛను, అభిప్రాయ స్వేచ్ఛను తీసేయవచ్చు అనేది. అంటే ఆర్టికల్ 19 వర్తించదనే ఒక నోటిఫికేషన్ జారీ చేయొచ్చని. అది చాలా దుర్మార్గమైన ప్రయత్నం అని చెప్పి ఆందోళన చేశాము. 59వ రాజ్యాంగ సవరణ వ్యతిరేక కమిటీ అని ఒకటి ఏర్పాటు చేశాము. అప్పటికింకా పౌరహక్కుల సంఘంలో యాక్టివ్‌గా ఉన్నవాళ్ళం మీటింగ్‌లు బెట్టాము. సెమినార్‌లు పెట్టాం. చాలా ఆందోళనలు చేశాం. హైద్రాబాదులో ఒక సెమినార్ పెట్టినప్పుడు డాక్టరు వీణ అనే ఆమెను పిలిచాం. ఆమె స్త్రీవాద రచయిత్రి. డాక్టరుగా మెడిసన్ గురించి చాలా రాసున్నారు. ఆమెను స్పీకర్‌గా పిలిచాం. అందరం మాట్లాడుతున్నాం. భావ ప్రకటనా స్వేచ్ఛ లేకపోతే ఎంత నష్టం ఎంత కష్టం అని. అబద్ధమేమీ కాదు. వాస్తవమే అది. ఆమె వంతు వచ్చినప్పుడు ఆమె ఒక మాట అన్నారు. భలే వింతగా ఉంది మీ వ్యవహారము. మీకు భావ ప్రకటనా స్వేచ్ఛ పోవాలి అంటే 59వ రాజ్యాంగ సవరణ రావాలి, ఎమర్జెన్సీ పెట్టాలి, రాష్ట్రపతి నోటిఫికేషన్ రావాలి. కాని మాకు? స్త్రీలకు సమాజంలో, కుటుంబంలో ఏమాత్రం భావప్రకటనా స్వేచ్ఛ ఉంది? ఏ రాజ్యాంగ సవరణ లేకుండానే, ఏ ఎమర్జెన్సీ లేకుండానే మా స్వేచ్ఛను ఎప్పుడో తీసేశారు కదా అని ఆమె అన్నపుడు ఆరోజు మేము చిరాకుపడ్డ మాట వాస్తవమే. కాని వాస్తవమైన మాటే అది. మొదటే అన్నాను కదా మనిషిని పౌరులుగా చూస్తే రాజ్యం నుండి వచ్చే సమస్యలు మాత్రమే కనిపిస్తాయి. మనిషిని స్త్రీగా చూస్తే వేరేవి కనిపిస్తాయి, దళితులుగా చూస్తే వేరేవి కనిపిస్తాయి. అన్నిటినీ కలిపి చూసినప్పుడే మనకు ఒక సమగ్రమైన అవగాహన అనేది ఏర్పడుతుంది. అట్లా కాలక్రమంలో మా అవగాహన పెరుగుతూ వచ్చింది.

## మానవహక్కుల వేదిక అవగాహన

సైద్ధాంతికంగా చెప్పుకోవాల్సి వస్తే నేను మొదట్లో చెప్పిన అంశాలే వస్తాయి. పౌర రాజకీయ హక్కులు, సామాజిక ఆర్థిక సాంస్కృతిక హక్కులు, చరిత్రలో వాటి మూలాలు ఇవన్నీ కలిసి ఇవ్వాళ హక్కుల ఉద్యమం అవగాహనలో భాగంగా ఉన్నాయి. ఆ క్రమంలోనే

విస్తరిస్తూ వస్తున్నాయి. అన్ని హక్కుల సంఘాల్లోనూ అంతే. ప్రత్యేకించి మేము మానవ హక్కుల వేదికగా నొక్కి చెప్పే కొన్ని అంశాలు మాత్రం మీకు వివరించి ముగిస్తాను. వేరే వాళ్ళు ఏమనుకుంటున్నారో నేను చెప్పదల్చుకోలేదు. మా అభిప్రాయాలు మాత్రమే చెప్తాను.

హక్కుల ఉద్యమాలలో పనిచేసేటప్పుడు సహజంగా వచ్చే చర్చ ఒకటుంది. పోలీసు స్టేషన్‌లో ఒకరిని పెట్టినప్పుడు 24 గంటలలోపు కోర్టులో హాజరు పర్చాల అని డిమాండ్ చేస్తాం. ఒకరిని చంపినప్పుడు చట్టవిరుద్ధంగా ఎవ్వరి ప్రాణాన్నీ తీయడానికి వీలు లేదు అని చెపుతాం. ఒక మీటింగ్ రద్దు చేసినప్పుడు సమావేశ స్వేచ్ఛ ఒక ప్రాథమిక హక్కు, నువ్వెట్లా దానిని సడలిస్తావని చెప్పి ప్రశ్నిస్తాం. ఈ డిమాండ్లన్నీ చేసేటప్పుడు ఏం చేస్తున్నాము అంటే చట్టంలోనూ, రాజ్యాంగంలోను ఉండే కొన్ని హక్కులను సొంతం చేసుకుంటున్నాము. మాకు ఈ హక్కులున్నాయి, వీటిని అమలు చేయండి అని డిమాండ్ చేస్తున్నాం. చాలా కాలంగా హక్కుల ఉద్యమంలో ఉన్న ఒక ప్రశ్న ఏమిటంటే చట్టంలో, రాజ్యాంగంలో, లేదా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉండే ఈ ప్రజాస్వామిక హక్కుల్ని ఎట్లా అర్థం చేసుకోవాలి అని. ఇవన్నీ ప్రజలను మభ్యపెట్టడానికి భ్రమలుగా మాత్రమే ఇక్కడున్నాయి అనేది ఒక ఆలోచన. వామపక్ష ఉద్యమాన్నుంచి బలంగా వచ్చినటువంటి ఆలోచన. అవి ప్రజలను మభ్యపెట్టడానికి భ్రమలుగా మాత్రమే అక్కడుంటే మనం ఎట్లా వాడుకుంటున్నాం వాటిని? భ్రమలను వాడుకోవచ్చా ఎవరైనా? ప్రజలను మభ్యపెట్టే భ్రమలుగా మాత్రమే ఈ హక్కులు రాజ్యాంగంలో, చట్టంలో ఉంటే అవి మనకెట్లా ఉపయోగపడుతున్నాయి? ఎందుకు వాటిని మనం డిమాండ్ చేస్తున్నాము? డిమాండ్ చేస్తున్నామూ అంటే వాటికి ఎంతో కొంత పాత్ర ఉంది, ఒక స్థానం ఉంది అని గుర్తిస్తున్నట్టే కదా. అంటే భారతదేశంలో ప్రజాస్వామ్యం అనేది కొంత ఉంది... అనే గుర్తింపు ఉన్నట్లే కదా. హక్కుల కోసం మనం మాట్లాడుతున్నాము అంటేనే దాంట్లో అది అంతర్భాగంగా ఉంది.

## హక్కులు బూటకం అనుకోవడం లేదు

అసలు ప్రజాస్వామ్యమే లేకపోతే ఆఫ్ఘనిస్తాన్‌లో లాగా పౌరహక్కుల సంఘాలుండవు గదా. ఉండేమి చేస్తారు అక్కడ. అడగటానికి ఏమీ లేదక్కడ. అక్కడ రాజ్యాంగమే లేదు. వాళ్ళ రాజ్యమే రాజ్యాంగం. ప్రజాస్వామ్యమనేది కొంత మేరకయినా ఉంటేనే హక్కుల ఉద్యమం అనేది ఉంటుంది. ఉన్న ప్రజాస్వామ్యం బూటకం అయితే హక్కుల ఉద్యమాల డిమాండ్‌లకు అర్థం ఉండదు. ఇదంతా ఒక చర్చగా వచ్చింది. మేము తీసుకున్న వైఖరి ఏమిటి అంటే ప్రజాస్వామ్యం అనేది మొత్తం బూటకం కాదు. దానిని బూటకంగా మార్చే ప్రయత్నాలు జరుగుతూ ఉంటాయి. బూటకమైన హక్కులు కొన్నింటిని కల్పించి నిజమైన హక్కులు కల్పించాము అని చెప్పే ప్రయత్నాలు జరుగుతూ ఉంటాయి. కానీ అన్ని హక్కులు బూటకం కాదు. మొత్తంగా ప్రజాస్వామ్యం బూటకం కాదు. ఒక substantial reality – అది వన్ పర్సెంటనండి, ఫైవ్ పర్సెంటనండి, టెన్ పర్సెంటనండి అది ఉంది. హక్కుల ఉద్యమాల

అప్పటికే సంఘటితమయిన వాళ్ళు, ఒక సంఘం పెట్టుకున్నవాళ్ళు, ఒక పార్టీ పెట్టుకున్న వాళ్ళు, ఒక ఉద్యమం చేస్తున్నవాళ్ళు - వాళ్ళకు వాళ్ళ గొంతు కొంచెమైనా ఉంటుంది. అయినా వాళ్ళ పైన వచ్చే అణచివేత ప్రధానం అనుకుంటే, ఆ స్థాయికి కూడా ఎదగలేనివాళ్ళపైన అణచివేత అనేది వాస్తవానికి ఇంకా ఎక్కువ ప్రధానం కావాలి కదా.

కర్తవ్యం ఏమిటీ అంటే ఇదంతా బూటకం అని చెప్పడం కాదు. ఉన్నదానిని అమలు చేయించడం, మరింతగా దానిని పెంపొందించడం. పెంపొందించడానికి రకరకాల రూపాలలో కృషి చేయడం. ఇదొక స్టాండ్‌గానే మానవ హక్కుల వేదిక తీసుకొంది.

## అసంఘటిత శక్తుల మాటేమిటి?

రెండవది ఇంతకు ముందే చెప్పాను. రకరకాల కోణాల నుంచి హక్కులనేవి ఆవిర్భవిస్తాయి. ఎక్కడెక్కడ అసమానత, అణచివేత సమాజంలో ఉంటే అక్కడంతా కూడా హక్కుల లేమి ఉంటుంది. దానికి వ్యతిరేకంగా హక్కుల ఆకాంక్ష ఉంటుంది. ఆ అసమానత పౌరులు VS రాజ్యమనేది కావచ్చు. దళితులు VS బ్రాహ్మణులనేది కావచ్చు. స్త్రీలు VS పురుషులు అని కావచ్చు, ఆదివాసీలు VS ఆదివాసీయేతరులు అనేది కావచ్చు. లేదా ఇంతకుముందు చర్చించినట్లుగా వివక్ష గురయిన ప్రాంతాలు VS పెత్తనం చేసేటటువంటి ప్రాంతాలు కావచ్చు. రకరకాల రూపాలలో వ్యవస్థీకృతమయిన ఇతర అసమానతల మధ్య కావచ్చు. కాలక్రమంలో ఇవన్నీ కూడా హక్కుల ఉద్యమాల అజెండాలో భాగం అయినాయి. అయినప్పటికీ బలంగా వస్తున్నటువంటి చర్చ ఏమిటంటే సంఘటిత ప్రజా ఉద్యమాలపైన ప్రభుత్వం ప్రయోగించే అణచివేతే కేంద్ర విషయంగా ఉండాలి అని. ఎందుకుండాలి అనేది మా ప్రశ్న. అది ఉండటం వలన జరిగే తీవ్రమైన నష్టం ఒకటుంది. సంఘటిత ప్రజా ఉద్యమాలపైన జరిగే అణచివేతే ప్రధానమైన అంశం అనుకుంటే సంఘటితమే కానటువంటి ప్రజానీకం ఇంకెంతో మంది ఉన్నారు. వాళ్ళు మనకు అసలే కనిపించకుండా పోతారు.

అప్పటికే సంఘటితమయిన వాళ్ళు, ఒక సంఘం పెట్టుకున్నవాళ్ళు, ఒక పార్టీ పెట్టుకున్న వాళ్ళు, ఒక ఉద్యమం చేస్తున్నవాళ్ళు - వాళ్ళకు వాళ్ళ గొంతు కొంచెమైనా ఉంటుంది. అయినా వాళ్ళ పైన వచ్చే అణచివేత ప్రధానం అనుకుంటే, ఆ స్థాయికి కూడా ఎదగలేనివాళ్ళపైన అణచివేత అనేది వాస్తవానికి ఇంకా ఎక్కువ ప్రధానం కావాలి కదా. ఇంకా ప్రధానం కాకపోయినా కనీసం దానికి సమానమైన ప్రాధాన్యం అయినా ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది. మేము అనుకోవడం ఏమిటీ అంటే సంఘటిత ప్రజా ఉద్యమాలపైన

జరిగే అణచివేత ఎలాగూ అజెండాలో భాగమే కానీ, దాన్నే కేంద్రంగా చేసుకుంటే సంఘటితం కాలేని అశక్తులను, నిస్సహాయులను మనం అసలే చూడకుండా పోతాము. అశక్తులలో ఎవ్వరు ఉంటారంటే చిన్న చిన్న సమూహాలు ఉంటాయి. ఒక ప్రాంతంలో కొద్దిమంది మాత్రమే బతుకుతూ ఉంటారు. వాళ్ళకు చెప్పుకోవడానికి తమ వాళ్ళు అనే వాళ్ళు ఎవరూ ఉండరు. తమపై జరుగుతున్న అణచివేతను వాళ్ళు కనీసం ప్రశ్నించలేని స్థితిలో ఉంటారు. అలాగే రాజకీయంగా సంఘటితం కావడం సాధ్యం కాని వాళ్ళు ఉంటారు. స్త్రీలు సమాజంలో సగభాగమే కానీ రాజకీయంగా సంఘటితమై పోరాడడానికి కుటుంబం గోడలే వారికి పెద్ద ఆటంకం. మహిళా సంఘాలు ఉన్నప్పటికీ వాళ్లు సంఘటితం కాలేకపోవచ్చు. అలా కాలేకపోవడానికి చాలా కారణాలుంటాయి. ఈ వ్యవస్థలో భాగంగానే ఆ కారణాలుంటాయి. మరి సంఘటితం కాలేని వాళ్ళ హక్కుల కోసం మనం పని చేయాలి అంటే సంఘటిత పోరాటాలపై జరిగే అణచివేతనే ప్రధానమనుకోడం సరయినది కాదు కదా.

## అవసరాన్ని బట్టి ప్రాధాన్యం

**మూ**డవది – రాజ్యం ప్రయోగించే హింస, మగవాళ్ళు ప్రయోగించే హింస, అగ్రకులాలు ప్రయోగించే హింస, అభివృద్ధి చెందిన ప్రాంతాలు చెందని ప్రాంతాలపైన ప్రయోగించే హింస – హింస అంటే భౌతిక హింసే కానక్కర్లేదు. రకరకాల రూపాలలో జరిగే అణచివేత, వివక్షలు కూడా హింసే – వీటిలో ఫలానాది ప్రధానము అని చెప్పడానికి సూత్రబద్ధమైన తాత్వికమైన కారణాలు ఏవీ లేవు. ఉన్నాయి అనేది ఎవరి రాజకీయ సిద్ధాంతాన్ని బట్టి వాళ్ళు చెప్పుకోవాలి తప్ప హక్కుల కోణం నుంచి చూసినప్పుడు ఇవి ప్రధానము, ఇవి సెకండరీ అనడానికి ఆధారాలు ఏమీ ఉండవు. ఆయా సందర్భాలలో ఒక దానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాము. ఉదాహరణకి ఇప్పుడు మేము మానవ హక్కుల వేదికగా 'పోటో' మీద ఉద్యమం చేస్తున్నాము. ఇది రాజ్యహింసలో భాగమే. పోటో ఒక ప్రమాదకరమైనటువంటి రాజ్యహింస సాధనం కాబట్టి తప్పనిసరిగా దానికి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తాము. కాని ఎల్లప్పుడూ రాజ్యహింసకు సంబంధించిన సాధనాలకే ప్రాధాన్యం ఉండాలనేది ఏమీ లేదు. అది సందర్భాన్ని బట్టి ఉంటుంది. కొంతకాలం కింద ఉదాహరణకు బాక్సైట్ మైనింగ్ కోసం 1/70ని సవరణ చేస్తారు అన్నప్పుడు దానికి ప్రాధాన్యం ఇచ్చి ప్రచారం చేశాము. అట్లాగే విశాఖపట్నం జిల్లా, ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతాలలో పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంటు వైఫల్యం వల్ల, పంచాయితీరాజ్ డిపార్ట్‌మెంటు వైఫల్యం వల్ల వేలమంది రోగాలకు గురయి చనిపోయారు. ఆదిలాబాద్‌లో ప్రభుత్వ లెక్కల ప్రకారమే వెయ్యిమందికి పైగా చనిపోయారు. విశాఖపట్నం ఏజెన్సీలో కూడా చాలామంది చనిపోయారు. సంక్షేమమనేది రాజ్యం నుంచి ప్రజానీకానికి రావాల్సిన హక్కు. శుభ్రమైన మంచి నీళ్ళు, పరిసరాల పరిశుభ్రత లేకపోవడం వల్లనే అంతమంది ప్రాణాలు పోయాయి.

దానిమీద ప్రచారం చేశాం. సందర్భాన్ని బట్టి తప్ప ఎప్పుడూ రాజ్యహింసకే ప్రాధాన్యం ఇస్తామనేది సరి అయినది కాదు.

## బయటివాళ్లుగా మాట్లాడడమూ ముఖ్యమే

నాలుగవది – చాలా సందర్భాలలో చాలామంది వేసే ప్రశ్న ఏమిటీ అంటే ఇంత అజెండా పెట్టుకున్నారు మీరు హక్కుల సంఘంగా. మరి స్త్రీల హక్కుల కోసం స్త్రీలు పోరాటం చేస్తారు కదా. దళితుల హక్కుల కోసం దళితులు ఉద్యమాలు చేస్తారు కదా. కార్మికుల హక్కుల కోసం కార్మికుల ఉద్యమాలు ఉన్నాయి కదా. అదనంగా ఒక హక్కుల సంఘం చేసేదేముంది? చేయవల్సిన అవసరం ఏముంది అనే ప్రశ్న కూడా మాకు తరచుగా ఎదురవుతుంటుంది. దానికి మేము చెప్పే జవాబు ఏమిటంటే సమాజంలో ఒక అన్యాయం జరిగింది అని చెప్పేటప్పుడు ఎవరికి అన్యాయం జరిగిందో వాళ్ళు మాత్రమే మాట్లాడుకుంటే మీకు జరిగింది కాబట్టి మీరు మాట్లాడుకుంటున్నారులే అనే స్పందన ఆ సమాజం నుంచి వచ్చే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. హక్కుల సంఘాలలో కేవలం స్త్రీలే గాదు, కేవలం దళితులే గాదు, కేవలం ఆదివాసులే కాదు, వీటిలో అన్ని రకాల వాళ్ళు ఉంటారు, విశాలమైన అజెండా ఉన్న సంస్థగా మాట్లాడితే బయటివాళ్ళుగా మాట్లాడుతున్నామన్నది చాలా విలువైనటువంటి అంశం అవుతుంది. నక్సలైట్లపైన ఎన్‌కౌంటర్లు జరిగితే వాళ్ళే మాట్లాడుకోవచ్చుగా, ఎందుకు హక్కుల సంఘాలు మాట్లాడుతున్నాయి అంటే స్వతంత్రంగా ఉన్న ఒక హక్కుల సంఘం మాట్లాడితే వీళ్ళు వాళ్ళ మనుషులు కాదు, స్వతంత్రమైన వాళ్ళు. అయినా వీళ్ళు మాట్లాడుతున్నారు అంటే ఇక్కడేదో అన్యాయం జరిగి ఉండాలని సమాజం వినే అవకాశం ఉంటుంది. అది అన్ని ఉద్యమాలకూ వర్తిస్తుంది. మహిళా ఉద్యమానికైనా, దళిత ఉద్యమానికైనా, కార్మిక ఉద్యమానికైనా పూర్తిగా వాళ్ళలో భాగం కానటువంటి ఒక వేదిక, సార్వజనీనంగా, సూత్రబద్ధంగా హక్కుల గురించి, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే ఒక సంస్థ, ఒక ఉద్యమం వారి తరఫున మాట్లాడటమనేది వారి ఆకాంక్షలకు బలాన్ని కల్పించగలదు.

## విశ్లేషించే బాధ్యత

ఐదవది – అదనంగా మేము చేయగల పనులలో ఒకటి ఏమిటి అంటే చాలామంది ఉద్యమాల్లో ఉండే వాళ్ళు, అణచివేతకు గురయ్యే వాళ్ళు – అణచివేతకు గురయ్యే వాళ్ళు అవడం వలనే, ఆ కారణంగానే తమ పరిస్థితిని సంపూర్ణంగా వివరించి చెప్పడం గానీ, తమ పరిస్థితి గురించి ప్రభుత్వం మాట్లాడే మాటలకు పూర్తిగా జవాబు చెప్పడంగానీ కష్టం కావచ్చు. ఓ దళితుడిని చంపేస్తారు ఒక గ్రామంలో. చంపేసి నింద వాళ్ళమీదే వేస్తారు. ఆదివాసుల హక్కులు తొలగిస్తారు. నింద వాళ్ళమీదే పడేస్తారు. లేకపోతే గ్లోబలైజేషన్ తీసుకొచ్చి పేదవాళ్ళకు రాయితీలు ఇవ్వడం వల్లనే ఆర్థిక వ్యవస్థ నాశనం అయిపోయింది, అందుకే గ్లోబలైజేషన్ అవసరం అయ్యింది అంటారు. ఈ నిందలకు వాళ్ళే జవాబు చెప్పుకోవాలి అంటే కష్టం కావచ్చు. హక్కుల ఉద్యమంలో ఉండేటటువంటి వాళ్ళు

చదువుకున్న వాళ్ళు, కొంత విశ్లేషణ చేయగలవాళ్ళు అయి ఉండటం వల్ల ప్రభుత్వం వేసేటటువంటి ఈ నిందలకు వాళ్ళు విశ్లేషించి ఎదురు జవాబు చెప్పగలరు. ఈ ఉద్యమాలకు ఇది కూడా ఒక ముఖ్యమైన కర్తవ్యమే. హక్కులను సిద్ధాంతీకరించడం, సూత్రీకరించడం, ఉద్యమాల ఆకాంక్షలలో ముందుకొచ్చిన హక్కులను సూత్రీకరణ చేసి వాటిని సమాజంలో నిలబెట్టడం. ఇవి కూడా హక్కుల ఉద్యమాలు చేయాల్సిన పనులే. వాళ్ళు మాట్లాడుతున్న కోణం వాళ్ళే చెప్పుకుంటారు, వాళ్ళమీద అణచివేత వస్తే వాళ్ళే మాట్లాడుకుంటారని కాకుండా, అందరం మాట్లాడదాము. మేము వాళ్ళలో భాగం కాదు. బయట ఉన్నాం. అయినా మేము మాట్లాడుతున్నాము అంటే మీరు కూడా మాట్లాడాల అని ఇతరులను కూడా ఒప్పించే ప్రయత్నం చెయ్యాలి.

స్పష్టంగా ఇటువంటి ఒక కార్యరంగమైతే ఉంది హక్కుల ఉద్యమానికి. ఆ కార్యరంగాన్ని సమగ్రంగా విశాలమైన ప్రాతిపదిక మీద నిర్వహించాలి. ఈ హక్కుల అవగాహనకు, ఈ అవగాహన కలిగి ఉండటానికి ఏం కావాలి? అణచివేత ఎక్కడున్నా, అసమానత ఎక్కడున్నా దానిని వ్యతిరేకించాలి. సమానత్వం ఒక హక్కు అనేది గుర్తించాలి. ఇప్పటిదాకా చరిత్ర నాగరిక క్రమంలో ఎదిగినటువంటి హక్కులేవైతే ఉన్నాయో వాటిని కాపాడుకోవాలి, వాటిని ముందుకు తీసుకొని పోవాలి. ఇది నమ్మడానికి ఒక మనిషి కమ్యూనిస్టు కానవసరం లేదు. ఇంకొకటో మరొకటో కానవసరం లేదు. అంటే ఈ ఉద్యమాలు ఫలానా రాజకీయ సిద్ధాంతానికే పరిమితం కావాల్సిన అవసరం కూడా ఏమీ లేదు. ఒకరు కమ్యూనిస్టుగా ఈ అవగాహనకు రావచ్చు. ఒకరు అంబేద్కర్‌వాదిగా రావచ్చు. ఒకరు స్త్రీవాదిగా రావచ్చు, ఒకరు నిజాయితీగల గాంధేయవాదిగా కూడా రావచ్చు. అటువంటి వాళ్ళు కూడా ఉన్నారు. ఒకరు లోహియావాదిగానూ రావచ్చు. ఏ కోణంనుంచి అయినాసరే కేవలం మన కోణానికి ప్రధానంగా కనిపించే హక్కులు మాత్రమే కాకుండా మొత్తంగా అణచివేత, అసమానత ఎక్కడున్నా అక్కడంతా ఉన్న హక్కుల లేమిని గుర్తించగలగాలి. గుర్తించడం, దానికి వ్యతిరేకంగా నిలబడటం; చరిత్ర క్రమంలో ఎదిగినటువంటి హక్కులు ఏవైతే ఉన్నాయో వాటిని అమలు చేసుకోవడం, కాపాడుకోవడం, పెంపొందించుకోవడం; హక్కుల లేమికి గురయ్యే వాళ్ళ, అణచివేతకు గురయ్యేవాళ్ళ తరఫున మనం కూడా మాట్లాడాలి అనే అవగాహన కలిగి ఉండటం; ప్రభుత్వాలు గానీ, పెత్తందారీవర్గాలుగానీ, అణచివేతకు గురిచేసే వాళ్ళు గానీ వాళ్ళు వేసే నిందలు, ఇచ్చే వివరణలను మనకుండే శక్తియుక్తులన్నిటినీ కూడా ఉపయోగించి ఎదుర్కోవడానికి సహాయ పడటం – ఈ కర్తవ్యాలు నిర్వహించే పాత్ర ఒకటి విశాలంగా పోషించాలి. అందువల్ల హక్కుల ఉద్యమం అజెండా ఎప్పుడూ విశాలంగా ఉండాలి. కార్యకలాపాలు విశాలంగా ఉండాలి, నిర్మాణం కూడా విశాలంగా ఉండాలనేది మేము భావిస్తున్నాము.

## మూడూ విశాలంగానే ఉండాలి

అజెండా విశాలంగా ఉండాలి అన్నంత వరకు చాలా మంది ఒప్పుకుంటున్నారు. కార్యకలాపాలు విశాలంగా ఉండాలి అనంటే ఇది మేము ప్రధానం అనుకుంటున్నాము,

మొత్తంగా ఉద్యమాలు చేసే హింసను ఖండించాలనే ప్రతిపాదన మేము ఏ రోజూ పెట్టలేదు. ఉద్యమాలు హింసాత్మకంగానూ, హింస లేకుండానూ కూడా అప్రజాస్వామికంగా ప్రవర్తించినప్పుడు, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ప్రవర్తించినప్పుడు, అన్యాయంగా ప్రవర్తించినప్పుడు – అప్పుడు కూడా మౌనంగా ఉండటం సాధ్యమవుతుందా అనేది ప్రశ్న.

దీనికి లోటు రానంత వరకు వేరే వాటిని చేపడతాము అని అక్కడ ఒక పరిమితి పెడుతున్నారు. నిర్మాణం విశాలంగా ఉండాలంటే గట్టిగా వ్యతిరేకత వస్తోంది. అజెండా సిద్ధాంతపరమైనది. అది అందరూ ఒప్పుకొంటున్నారు. అణచివేత ఎక్కడున్నా అక్కడంతా హక్కుల లేమి ఉంటుంది కాబట్టి, అది అజెండాలో భాగం అయింది కాబట్టి, కార్యకలాపాలు కూడా అంతే విశాలంగా ఉండాలనేటప్పటికి ఏమొస్తుంది అంటే ఎన్‌కౌంటర్లు, లాకప్ హత్యలు లాంటి రాజ్యహింసే ప్రధానమై వేరే వాటిని టైముంటే చేస్తాము అనేది వస్తోంది. అట్లా ఉండటానికి వీలు లేదు. అది కూడా విశాలంగానే ఉండాలి. ఇక నిర్మాణం విశాలంగా ఉండాలి అంటే మనకు నచ్చేటటువంటి రాజకీయ భావాలు కలవాళ్ళు మాత్రమే కాదు వేరేవాళ్ళు కూడా – ఎంతవరకు అంటే ఈ అజెండాతో ఏకీభవించేంత వరకు, ఈ కార్యకలాపాలతో ఏకీభవించేంత వరకు – సమాన హెూదా, సమాన ప్రాతిపదిక మీద ఉద్యమంలో భాగస్వాములు కావాలి అనేది మానవ హక్కుల వేదికగా మాకున్నటువంటి అవగాహన. ఇవ్వాళ దేశంలోని హక్కుల ఉద్యమంలో ఈ చర్చ మేము పెడుతూ ఉన్నాము. పూర్తిగా అందరూ ఏకీభవించారని మేము అనముగానీ స్పందన వస్తూ ఉంది, చర్చ జరుగుతూ ఉంది. మానవ హక్కుల వేదిక ఏర్పడినప్పుడు చాలామంది ఏమనుకున్నారంటే నక్సలైట్ల హింసను ఖండించటానికి పుట్టింది ఈ సంస్థ అని. అందుకే మొదట్లో కొంతమంది బిజెపి, ఆర్.ఎస్.ఎస్ వాళ్ళు కూడా చేరతామని వచ్చారు. ఇది కమ్యూనిస్టు వ్యతిరేక సంస్థ అయిపోయింది, హాయిగా చేరొచ్చు దీంట్లో అనుకున్నారు వాళ్లు. ఇప్పుడు ఎవరూ మా జోలికి రారనుకోండి. అది వేరే సంగతి.

## మా ప్రధాన విభేదం హింస మీద కాదు

నిజానికి హక్కుల ఉద్యమంలో మేము పెడుతున్న చర్చలో ఈ హింస అనేది ఒకానొక అంశం మాత్రమే. ప్రధానమైంది కూడా కాదు. మొత్తంగా ఉద్యమాలు చేసే హింసను ఖండించాలనే ప్రతిపాదన మేము ఏరోజూ పెట్టలేదు. ఉద్యమాలలో హింసే ఉండటానికి వీలు లేదని ఎవ్వరూ అనలేము. ఎందుకంటే సమాజంలో హింస చాలా ఉంది. ఆకలి హింసే, పేదరికం హింసే, నిరుద్యోగం హింసే. స్వేచ్ఛ లేకపోవడం హింసే, అంటరానితనం

హింసే. అవన్నీ ఉన్నప్పుడు ఉద్యమాలలో హింసే ఉండకూడదు, ఉద్యమాలన్నీ శాంతియుతంగా జరగాలని ఎవ్వరూ అనలేం. జరిగితే బాగుండును కానీ, అది కేవలం వాంఛనీయం మాత్రమే, సాధించగలిగింది కాదు. ఎక్కడ అభ్యంతరం వచ్చింది, ఎక్కడ అభిప్రాయభేదాలు వచ్చినాయి అంటే ఉద్యమాలు హింసాత్మకంగానూ, హింస లేకుండాను కూడా అప్రజాస్వామికంగా ప్రవర్తించినప్పుడు, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ప్రవర్తించినప్పుడు, అన్యాయంగా ప్రవర్తించినప్పుడు – అప్పుడు కూడా మౌనంగా ఉండటం సాధ్యమవుతుందా అనేది ప్రశ్న. చాలా ఇటీవలి సంఘటన దేవరకొండ ఎం.ఎల్.ఎ రాగ్యానాయక్ హత్య. అది ఏ రకంగానూ సమర్ధనీయం కాదు. ఏ రకంగానూ మౌనంగా ఉండగలిగేది కాదు. సమర్ధనీయమా కాదా వేరే సంగతి. మౌనంగా ఉండగలిగింది మాత్రం కాదు. ఖండించాం దాన్ని. అదే ఒక దుర్మార్గుడు అయిన ఎం.ఎల్.ఎను చంపి ఉంటే మంచి పని చేశారు అంటారా అంటే మేమేమీ మాట్లాడం, వాడు దుర్మార్గుడు, ఏదో చేశాడు, వాళ్ళేదో చంపుకున్నారు మాకనవసరం. అదొక పాలిటిక్స్‌లో భాగంగా జరిగింది మాకనవసరం అనుకుంటాం.

ఆ తేడా అంటే అన్యాయంగా అప్రజాస్వామికంగా ఉద్యమాలు ప్రవర్తించినప్పుడు – ఉదాహరణకు కాశ్మీరులో స్వయం నిర్ణయాధికారం కావాలి అనడానికి బలమైన చారిత్రక కారణాలు ఉన్నాయి. కాబట్టి కాశ్మీరీల పోరాటం మౌలికంగా ఒక ప్రజాస్వామిక పోరాటంగానే భావించాలని అంటున్నాం. అయినా అక్కడ మిలిటెంట్లు స్త్రీలపైన ఆంక్షలు పెడితే బహిరంగంగానే మా రిపోర్టులో దాన్ని ఖండిస్తూ వస్తున్నాము అది అన్యాయమని. మీరు చేసే పోరాటం మంచిది కావచ్చు. కానీ స్వేచ్ఛకోసం పోరాటాలు చేస్తూ సగభాగానికున్న స్వేచ్ఛను తీసేసి బురఖాలు వేసుకొని ఇంట్లో కూర్చోండి అనడం ఒప్పుకోడానికి వీలు లేదని బహిరంగంగానే దాన్ని ఖండిస్తాం. ఖండించాము కూడా. అట్లా ఏ ఉద్యమం అప్రజాస్వామిక చర్యలనైనా సరే ఖండించాల్సిందే. ఇది ప్రధానమైన తేడా కానే కాదు. నేను ఇంతకు ముందు వివరించిన విషయాలే ప్రధానమైనటువంటివి. ఇది ఒకానొక అంశం మాత్రమే. సంచలనాత్మకంగా భావించబట్టి దీనికి పత్రికలు, మీడియా బాగా ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. మా అవగాహన అనేది స్థూలంగా నేను ఇప్పుడు వివరించి చెప్పిందే. ఈ క్లాసులు పెట్టడంలో మాకున్న స్వార్థం ఏమిటంటే మేము ఈ విషయాల్ని వివరించి చెపితే, ఈ జిల్లాలో ఇప్పుడున్న ఇద్దరు ముగ్గురు మాత్రమే కాకుండా మరో పదిమంది వచ్చి పనిచేస్తారని మా అభిలాష.

# హక్కులకొక తాత్విక కోణాన్ని ఆవిష్కరించుకుందాం

హక్కులు అనే భావన తనకు సొంతం అని పాశ్చాత్య దేశాల లిబరల్ సంప్రదాయం భావిస్తుంది. అందువల్ల ఆ తాత్విక సంప్రదాయం హక్కుల భావనను చాలా చర్చించింది. హక్కుల గురించి నిత్యం ఆరాటపడే సగటు జీవికి ఏమీ అర్థంకాని సిద్ధాంత సంవాదం చాలా జరిపింది.

హక్కుల భావన లిబరల్ సంప్రదాయానికి ప్రత్యేకమేం కాదుగానీ, ఆ సంప్రదాయానికి ఉన్న ఒక ముఖ్య లక్షణం హక్కుల చర్చకు చాలా వెసులుబాటు కల్పిస్తుంది. హక్కులు మనిషికి చెందినవి. ఇక్కడ మనిషి అంటే వ్యక్తి అనుకోనక్కరలేదు, ఒక సామాజిక సమూహం కావచ్చు. ఒక్కొక్క హక్కు ప్రతిపాదన వ్యక్తిని ప్రాతిపదిక చేసుకున్నట్టే ఒక్కొక్క హక్కు ప్రతిపాదన వ్యక్తిని కాక ఏదో ఒక సామాజిక సమూహాన్ని ప్రాతిపదిక చేసుకోవచ్చు. ఉదాహరణకు 'సంఘం పెట్టుకునే హక్కు' అనే దానికి అర్థం ఉండాలంటే

కె. బాలగోపాల్

మానవ హక్కుల వేదిక ఏడవ బులెటిన్ సంపాదకీయం, మే 2005

కనీసం ఇద్దరు మనుషులుండాలి. ఒకే ఒక వ్యక్తికి 'సంఘం పెట్టుకునే హక్కు' ఉండదు. ఇంకొంచెం లోతయిన అర్థంలో కూడా ఒక హక్కు ప్రతిపాదనకు వ్యక్తి కాక సమూహం ప్రాతిపదిక కాగలదు. ఒక ప్రత్యేకమైన జీవన సరళి, స్థితిగతులు ఉన్న వారి హక్కుల గురించి మాట్లాడేటప్పుడు (ఉదాహరణకు ఆదివాసుల హక్కులు) ఆ ప్రజలను ఒక సమూహంగానే తీసుకొని మాట్లాడతాము. ప్రత్యేకమైన జీవన సరళే ఉండనక్కరలేదు. కేవలం ఆర్థిక లేక సామాజిక స్థితి నిర్వచించే ప్రత్యేకత ఒక సమూహానికి ప్రాతిపదిక కావచ్చు. గుడిసెవాసుల హక్కులు, వినియోగదారుల హక్కులు ఇటువంటివి.

అయితే హక్కుల ప్రతిపాదన వ్యక్తిపరంగా జరిగినా సమూహంపరంగా జరిగినా దాని తాత్విక మూలంలో ఎక్కడో మనిషికి ఒక మనిషిగా విలువనిచ్చే గుణం ఉంది. నీకీ హక్కు ఎక్కడిది అన్నప్పుడు మనిషయి పుట్టాను కాబట్టి అనేది అన్నిటికంటే ఆకర్షణీయమైన జవాబు. ఆ హక్కు వ్యక్తికి చెందినది కావచ్చు (ఉదాహరణకు అభిప్రాయ స్వేచ్ఛ), ఒక సమష్టికి చెందినది కావచ్చు (శ్రామికులకు కనీస వేతనం, శుభ్రమైన పర్యావరణం మొదలయినవి).

అందువల్లనే మనిషిని మనిషిగా కేంద్రం చేసుకునే తాత్విక గుణం గల లిబరల్ సంప్రదాయం హక్కుల భావననూ తనదిగా భావించి దాని విశదీకరణ కోసం చాలా చర్చ జరిపింది.

అయితే చాలా విచిత్రమైన విషయం ఏమిటంటే హక్కుల ఉద్యమాలకూ ఈ హక్కుల సిద్ధాంత చర్చకూ ఏమీ సంబంధం లేకుండా దేనిపాటికది సాగుతుండడం. పాశ్చాత్య దేశాలలో సహితం హక్కుల ఉద్యమం లిబరల్ తాత్విక సంప్రదాయానికి చెందిన హక్కుల సంవాదంతో పెద్దగా సంబంధం లేకుండా ఒక ప్రాక్టికల్ కార్యక్రమంగా సాగిపోతుంటుంది. మూడవ ప్రపంచ దేశాలలో చాలా క్లిష్టమైన హక్కుల పరిరక్షణ కార్యక్రమాన్ని చేపట్టిన ఉద్యమాలయితే అటువంటి తాత్విక చర్చ ఒకటి ఉందన్న స్పృహ లేకుండానే నడుస్తున్నాయి.

దీనికి చాలా కారణాలున్నాయి. మనబోటి దేశాలలో హక్కుల ఉద్యమాలు ఒక బలమైన అవసరం నుండి పుట్టాయి. ఆ అవసరాన్ని తీర్చే నిత్య కార్యక్రమంలో నిమగ్నమయి ఉంటాయి. దానికి చట్టం పనికొస్తే చట్టాన్ని వాడుకుంటాయి. కోర్టులు అక్కరకొస్తే కోర్టులను వాడుకుంటాయి. ప్రచారం, ఆందోళన, లాబీయింగ్, ఏది ఉపయోగకరమనుకుంటే అది చేస్తాయి. దీనికి లోతయిన తాత్విక సంవాదం అసలు అవసరమా అన్న పద్ధతిలో సాగుతుంటాయి.

ఇదొక కారణం కావచ్చు.

ఇంకొక కారణం, మూడవ ప్రపంచ దేశాలలోని హక్కుల ఉద్యమాల ప్రాపంచిక దృక్పథం ఎక్కువ భాగం ఏదో ఒక అర్థంలో రాడికల్ దృక్పథం. ప్రస్తుత సమాజాన్ని అదొక గడచిపోతున్న సామాజిక దశగా అర్థం చేసుకుంటుంది. పాశ్చాత్య లిబరల్ దృక్పథం ఇవ్వాళ్టి

సమానత్వాన్ని వ్యవస్థీకరించడం, అమలులోకి తీసుకురావడం, ఆచరించడం ఎంతమాత్రం సులభం కాదన్న స్పృహ హక్కుల ఉద్యమానికి లేకపోలేదు. ఒకనాడు దీనిని తేలికగా తీసుకొని ఉన్నా, ఇవాళ తీసుకోవడం సాధ్యం కాదు.

సమాజాన్నే శాశ్వతం అనుకున్నా అనుకోకున్నా, అది ఈ సమాజంలోనే నిలబడి దానివైపే చూస్తూ ఆలోచిస్తుంది. రాడికల్ దృక్పథాలు ఇవ్వాళ్టి సమాజంలో నిలబడి రేపటి సమాజంగా భావించే దానివైపు చూస్తూ ఆలోచిస్తాయి. ఈ తేడా వల్ల హక్కులను చూసే పద్ధతిలో చాలా తేడా వస్తుంది.

అది కూడా కారణం కావచ్చు.

అయితే అంతకంటే మౌలికమైన సమస్య ఉందేమో అనిపిస్తుంది. మౌలిక అనే భావనను 'సమానత' అనే భావన అంటిపెట్టుకొని ఉంటుంది. ఇది నా హక్కు అని ఎవరు ఎవరితో అన్నా అక్కడ నీకంటే నేనేం తక్కువకాదు అనే ధ్వని తప్పనిసరిగా ఉంటుంది. సమానత్వ భావన హక్కుల భావనలో అంతర్లీనమయినది.

ఇది లిబరల్ సంప్రదాయాన్ని చాలా ఇబ్బంది పెడుతుంది. ఆ సంప్రదాయం సమానత్వం అనే ఆలోచనను చాలా సమస్యాత్మమైనదిగా భావిస్తుంది. చట్టం ముందు సమానత్వాన్ని మాత్రమే నిర్ద్వంద్వంగా అంగీకరిస్తుంది. వేరే ఏ అర్థంలో సమానత్వాన్ని ప్రతిపాదించినా అడుగడుగూ తటపటాయిస్తుంది.

**కా**నీ హక్కుల ఉద్యమం సమానత్వాన్ని చాలా సహజమైన భావనగా స్వీకరిస్తుంది. హక్కుల భావనతో విడదీయరానిదిగా ఏ ఇబ్బందీ లేకుండా గుర్తిస్తుంది. సమానత్వాన్ని వ్యవస్థీకరించడం, అమలులోకి తీసుకురావడం, ఆచరించడం ఎంతమాత్రం సులభం కాదన్న స్పృహ హక్కుల ఉద్యమానికి లేకపోలేదు. ఒకనాడు దీనిని తేలికగా తీసుకొని ఉన్నా, ఇవాళ తీసుకోవడం సాధ్యం కాదు. సమానత్వం అనేది ఎంత ఆకర్షణీయమైన భావనో దానిని ఆచరణలోకి తీసుకురావడం అంత కష్టతరం అనేది ఇరవయ్యవ శతాబ్దం నేర్పిన ప్రధాన గుణపాఠం. దానిని విస్మరించే ప్రగతిశీలక ఉద్యమమేదీ ముందుకు పోలేదు. అయినప్పటికీ సూత్రప్రాయంగా హక్కులంటే సమానత్వం అని ఒప్పుకోవడానికి హక్కుల ఉద్యమం సంశయించదు.

లిబరల్ సంప్రదాయంలో విస్తారంగా జరుగుతున్న హక్కుల సిద్ధాంత చర్చ మూడవ ప్రపంచ దేశాల హక్కుల ఉద్యమాలను పెద్దగా ఆకర్షించకపోవడానికి ఇది బలమైన కారణం కావచ్చు.

అయినప్పటికీ దానిని అసలే పట్టించుకోకుండా సాగిపోవడమూ సరయినది కాదు. ఇందుకు మూడు కారణాలున్నాయి. అడ్డగోలు వాదనలు విడిచిపెట్టి తర్కబద్ధంగా వాదించడం నేర్చుకోవడానికి లిబరల్ సంప్రదాయానికి చెందిన హక్కుల సంవాదం ఉపయోగపడుతుంది. రెండవది, హక్కుల మధ్య ఘర్షణను సీరియస్‌గా తీసుకోవడం నేర్పుతుంది. ఒకరి మేలు కోసం మరొకరి ప్రాణం తీయవచ్చు అన్న దగ్గర మొదలుపెట్టి ఒకరి బాగుకోసం మరొకరి పైన నిర్బంధం పెట్టవచ్చు, ఒకరి పురోగమనం కోసం మరొకరి అవకాశాలు కుదించవచ్చు, మొదలయినవన్నీ హక్కుల మధ్య ఘర్షణకు సంబంధించిన సమస్యలు. ఈ సమాజంలో నిలబడి వేరే సమాజం వైపు చూసే దృక్పథం కంటే ఈ సమాజం మీద దృష్టిపెట్టే దృక్పథమే ఈ సమస్యలను లోతుగా అధ్యయనం చేయగలుగుతుంది. మూడవది, హక్కుల ప్రతిపాదనకు వ్యక్తి ప్రాతిపదిక అనుకున్నా, ఒక సమూహం ప్రాతిపదిక అనుకున్నా మనిషికి మనిషిగా విలువనిచ్చే గుణం – మానవతావాదానికి పునాదిప్రాయమైన గుణం – హక్కుల దృక్కోణానికి చాలా అవసరం. లేకపోతే మనిషి మరి దేనికో సాధనం అయిపోయే ప్రమాదం ఉంది.

ఈ మేరకు లిబరల్ తాత్విక సంప్రదాయం నుండి స్వీకరిస్తూ, సమానత్వాన్ని ప్రాతిపదిక చేసుకున్న హక్కుల దృక్కోణాన్ని తాత్వికంగా బలోపేతం చేసే కృషి అవసరం. హక్కుల ఉద్యమానికి తనదంటూ ఒక కర్తవ్యం, కార్యరంగం ఉన్నాయనుకుంటేనే ఇది సాధ్యం అని వేరే చెప్పనవసరం లేదు. హక్కుల ఉద్యమాన్ని కేవలం రాజకీయ కాలక్షేపంగా చూసే దృష్టి ఏ తాత్విక దృక్పథాన్నీ పెంపొందించలేదు.

డా॥ బి.ఆర్. అంబేద్కర్
ఓపెన్ యూనివర్శిటీ కోసం
రాసిన పాఠాలు
ఆగస్టు 2001

# నిత్యజీవితంలో మానవహక్కులు

'దైనందిన జీవితంలో మానవహక్కులు' అనే విషయానికి మూడు కోణాలు ఉన్నాయి.

1. మన దైనందిన జీవిత ప్రవర్తనవల్ల ఇతరుల హక్కులకు భంగం కలిగించడం.
2. మనం ఇతరుల హక్కులను శాసించే స్థితిలో ఉన్నప్పుడు ఆ అధికారం లేక పెత్తనం చలాయించే పద్ధతి.
3. మానవహక్కుల పరిరక్షణ కోసం మనం దైనందిన జీవితంలో చేసే కృషి.

వీటిని అదే క్రమంలో చర్చించుకుందాం.

క్యూలో నిలబడి ఒక టికెట్‌గానీ వేరే ఏదైనా వస్తువుగానీ కొనుగోలు చేసేచోట ఏదో ఒక రకంగా క్యూలో నిలబడే అవసరాన్ని తప్పించుకోవడం కోసం అడ్డదారులు వెతుక్కుంటాం. దీనివల్ల మనకంటే ముందునుండి కాచుకున్నవాళ్లకు దొరకకుండ మనమే ఆ వస్తువును పొందవచ్చు. ఇది వాళ్ల హక్కుకు భంగకరమని తెలిసి కూడ 'మనం

కె. బాలగోపాల్

మానవహక్కుల పి.జి. డిప్లొమా కోర్సు కోసం రాసిన పాఠం

చేయకపోతే ఇంకొకరు చేస్తారు' అనే వాదనతో మన ప్రవర్తనను సమర్థించుకుంటాము. పదిమంది ఉమ్మడిగా ఉపయోగించుకునే వస్తువును – ఉదాహరణకు లైబ్రరీపుస్తకం, పబ్లిక్ టెలిఫోన్, పరిమితంగా నీళ్లొచ్చే వీధికొళాయి, ఒక ప్రభుత్వ అధికారి సమయం, వగైరా – ఆ పదిమందిలో ఒకరుగా మన వంతు వచ్చినప్పుడు అవసరం మేరకు వాడుకొని ఇతరులకు విడిచిపెట్టకుండ మన అవసరమే ప్రధానమైనట్టు వీలయినంత ఎక్కువగా వాడుకోవాలని చూస్తాం.

సామాజిక జీవితంలో మన వృత్తి, లేక ఉద్యోగం సక్రమంగా నిర్వర్తించకపోవడం వల్ల ఇతరులనేకులు తమ హక్కులు కోల్పోతారని గుర్తించకుండ వీలయినంత తక్కువ పనిచేసి ఎక్కువ ప్రతిఫలం పొందాలని చూస్తాం.

ఈ రకమైన ప్రవర్తన సమాజంలో తరచుగా ఎదురవుతుంది. ఇతరత్రా హక్కుల గురించి మాట్లాడేవాళ్లు సహితం తమ స్వంత ప్రయోజనాల కోసం పై రీతులలో ప్రవర్తించడం కద్దు.

'ఎదుటివాళ్లు నీతో ఏ విధంగా ప్రవర్తించాలని నువ్వు కోరుకుంటావో నువ్వు ఎదుటివారితో ఆ విధంగా ప్రవర్తించు' అన్న సూక్తి ఎరుగుదుము. దీనిని నిర్దిష్టంగా హక్కులకు అన్వయించి, 'ఎదుటివారు నీ హక్కులను ఏ రకంగా గౌరవించాలని ఆశిస్తావో ఆ రకంగా వారి హక్కులను నువ్వు గౌరవించు' అని చెప్పుకోవచ్చు.

దీనిని ఇంగ్లీష్‌లో సివిక్‌సెన్స్ అంటారు. పౌరచైతన్యం లేక పౌరస్పృహ అని తెలుగులో అనవచ్చును. ఈ చైతన్యం లేక స్పృహ సమాజంలో తగు మోతాదులో ఉంటే బలహీనులు, మొహమాటస్తులు, అడ్డదారులు తొక్కే అవకాశం లేనివారు నిత్యజీవితంలో తమ హక్కులు కోల్పోయే పరిస్థితి తక్కువగా ఉంటుందనడంలో సందేహం అక్కరలేదు.

ఒక సూత్రాన్ని సత్యంగా గుర్తించిన వెంటనే అది ఏ పరిధిలో సత్యమో నిర్ధారించి ఆ పరిధి వెలుపల అది ఏ విధంగా సవరణకు గురికావలసి ఉంటుందో నిర్ణయించడం అవసరం.

దైనందిన జీవితంలో హక్కులు అనుభవించేటప్పుడు అందరితో సమానంగా వాటిని అనుభవించే నడవడిక హక్కుల చైతన్యంలో భాగం కావలసిందేగానీ అది అన్ని సందర్భాలలో అందరికీ సాధ్యం కాకపోవచ్చు. వారి అవసరాన్ని గుర్తించి ఇతరులు దారి ఇవ్వడం కూడ హక్కులను పెంపొందించే నడవడికలో భాగమే. అంగవైకల్యం ఉన్నవాళ్లు, వయసుమళ్లిన వాళ్లు, చంటి పిల్లలను ఎత్తుకున్నవాళ్లు, రైలు టికెట్ కోసం అందరితో సమానంగా లైన్‌లో నిలబడలేకపోవచ్చు. వారిని ముందు తీసుకోనిచ్చి తమ హక్కును ఆ మేరకు కోల్పోవడానికి ఇతరులు సిద్ధపడడం కూడ పౌర జీవితానికి అవసరమైన స్పృహే.

ఈ స్పృహకు సమాజంలో నైతిక విలువ ఉందని గుర్తించి దానికి అనర్హులమైనా మన ప్రయోజనాలకోసం వాడుకోవాలని చూడకుండ ఉండడమూ అవసరమే.

నీళ్లు పరిమితంగా వచ్చే వీధి కొళాయివద్ద ఇంటికి బంధువులొస్తున్నవారు రెండు బిందెలు ఎక్కువ తీసుకోవడాన్ని ఇతరులు అర్థం చేసుకొని అనుమతించడం ఎంత అవసరమో, రాని బంధువులను చూపించి రెండు బిందెలు ఎక్కువ తీసుకుపోయే దురాలోచనకు ఎవ్వరూ లోనుకాకుండ ఉండడమూ అంతే అవసరం.

వీధి కొళాయిని ఉదాహరణగా తీసుకుంటే బహుశా ఎక్కువమందికి ఇబ్బంది కలగకపోవచ్చునుగానీ ఇతర జీవితరంగాలకూ సందర్భాలకూ కూడ దీనిని వర్తింపజేసుకున్నట్టయితే మనమందరమూ చాలా తరచుగా ఈ రకమైన దుష్ప్రవర్తనకు లోనవుతుంటామని సులభంగానే గుర్తించవచ్చును.

ఎదుటివారు మన హక్కులను ఏ విధంగా గౌరవించాలని చూస్తామో మనం ఎదుటివారి హక్కులను ఆ విధంగానే గౌరవించాలనే సూత్రం వెనుక అందరి పరిస్థితి ఒకటేనన్న భావన ఉంది. నూటికి నూరుశాతం ఒకటే కాకున్నా, మొత్తంమీద పరిస్థితులలో సామ్యం ఉన్న మేరకు ఈ సూత్రాన్ని అందరూ పాటించడం హక్కులకు సంబంధించిన సామాజిక స్పృహలో భాగమే.

పరిస్థితులు అందరివీ ఒకటే కాకపోవడానికి అంగవైకల్యం, ముసలితనం వంటి భౌతిక కారణాలేకాక సామాజిక ఆర్థిక కారణాలు కూడ ఉంటాయి. ఉదాహరణకు 'చంటిపిల్లలను ఎత్తుకొని ఉండడం' అనేది భౌతిక కారణంగా కనిపించవచ్చును గానీ ఎక్కువగా స్త్రీలే ఎత్తుకొని ఉంటారు కాబట్టి ఇది భౌతిక కారణంగా కనిపించే సామాజిక కారణం.

వేరే ఉదాహరణలు కూడా చూడవచ్చు. పారిశ్రామిక వివాదాలలో సమ్మెచేసే హక్కును, లాకౌట్ ప్రకటించే హక్కును చట్టం దాదాపు ఒకటిగా చూస్తుంది. రెండిటికీ ఒకేరకమైన అవకాశాన్ని ఇస్తుంది. ఒకేరకమైన పరిమితులు పెడుతుంది. కార్మికులు తమ అవసరాల సాధన కోసం ఒత్తిడి పెట్టడానికి పనిచేయడం మానుకోవడం సమ్మె. యాజమాన్యం తన ప్రయోజనాల రక్షణ కోసం ఒత్తిడి పెట్టడానికి పని ఇవ్వడం మానుకోవడం లాకౌట్. చట్టం ఈ రెండిటినీ ఒకేరకంగా చూస్తుంది.

అంతమాత్రం చేత, సమ్మె చేయడానికి తమకుండే హక్కును యాజమాన్యం గౌరవించాలని తాము కోరుకున్నట్టే లాకౌట్ చేయడానికి యాజమాన్యానికి ఉండే హక్కును కూడ కార్మికులు గౌరవించాలనడం అసమంజసం. సమ్మెవల్ల యజమానులకు నష్టాలు వచ్చేమాట వాస్తవమే గానీ వారి జీవనం దెబ్బతినదు. లాకౌట్ కార్మికుల జీవనాన్నే దెబ్బతీస్తుంది.

ఈ రకమైన ఉదాహరణలు ఇతర జీవితరంగాలలోనూ చూడవచ్చును. 'ఇతరులు మన హక్కులను గౌరవించాలని కాంక్షించినట్టు మనం వారి హక్కులను గౌరవించాలి' అనే సాధారణ సూత్రానికి సామాజిక ఆర్థిక అసమానతలు పరిధిని నిర్ణయిస్తాయి.

మరయితే అసమానతలు ఉన్నచోట ఎదుటివారి హక్కులను అసలే గుర్తించనక్కరలేదని అనుకోవాలా? ఇది మానవ హక్కుల అవగాహనకు సంబంధించిన ఒక క్లిష్టమైన ప్రశ్న. ఈ ప్రశ్నను చర్చించడానికిది సందర్భం కాదుగానీ ఇటువంటి ప్రశ్న ఒకటి ఉందనీ హక్కుల రంగంలో జరిగే సంవాదంలో దీని గురించి చాలా చర్చ జరిగిందనీ తెలుసుకోవడం అవసరం. ఈ ప్రశ్నకు పూర్తిగా అవుననిగానీ పూర్తిగా కాదనిగానీ జవాబు ఇవ్వలేమని ప్రస్తుతానికి చెప్పుకుంటే సరిపోతుంది.

అయితే సామాజిక ఆర్థిక రంగాలలో మనం ఆధిక్యతాస్థానంలో గనక ఉంటే, మన దైనందిన జీవిత ఆచరణను మానవ హక్కుల స్ఫూర్తితో ఏ విధంగా మలచుకోవాలన్న విషయాన్ని చర్చించడం మాత్రం ప్రస్తుత పాఠ్యాంశానికి అవసరం. ఇది పైన చెప్పిన మూడు కోణాలలో రెండవది.

ఆధిపత్యం, పెత్తనం అనేవి ఎక్కడో సమాజం పై భాగంలో మాత్రమే ఉండవు. అన్ని స్థాయిలలోనూ ఉంటాయి. మనమందరమూ ఏదో ఒక స్థాయిలో అధికారాన్నీ పెత్తనాన్నీ అనుభవిస్తుంటాము. మగవాళ్లయి పుట్టినవాళ్లు తమ కుటుంబాలలోనూ బయటా కూడా స్త్రీలపైన, అగ్రకులాలలో పుట్టినవాళ్లు తమ గ్రామంలోనే కాక మొత్తంగా సమాజంలో ఉన్న దళిత బహుజన కులాల మీద, పట్టణాలలో నివసించేవాళ్లు పల్లెప్రజల మీద, అభివృద్ధి చెందిన ప్రాంతాలలో బతికేవాళ్లు అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాల మీద ఆధిక్యత చలాయిస్తుంటారు. ఇతరులను కార్మికులుగానో ఉద్యోగులుగానో నియమించి వారిచేత పనిచేయించుకొని ఆ ఉత్పత్తిని వ్యాపారం చేసేవారు ఆ సిబ్బందిపైన పెత్తనం చేస్తుంటారు.

మనం ఉద్యోగస్తులమయితే, చేసే ఉద్యోగాన్ని బట్టి ఏదో ఒక రకమైన ఆధిక్యత అనుభవిస్తుంటాము. పోలీసు ఉద్యోగమైతే ప్రజలమీద చాలా పెత్తనం అనుభవిస్తాము. నిజానికి ఏ ప్రభుత్వ ఉద్యోగమూ ఇందుకు పూర్తిగా మినహాయింపు కాదు. అధ్యాపకులు పిల్లలమీద, విద్యుత్‌శాఖ ఉద్యోగులు రైతులమీద, సివిల్ సప్లైస్ ఉద్యోగులు రేషన్ కార్డులకోసం వచ్చే పేదలమీద, ప్రభుత్వ డాక్టర్లు ఆస్పత్రికొచ్చే రోగులమీద పెత్తనం, ఆధిపత్యం లేక అధికారం కలిగి ఉంటారు.

ఈ వివిధ రూపాల ఆధిక్యత చలాయించడంలో మానవహక్కుల స్పృహ ఏ మేరకు సమాజంలో నెలకొని ఉందనే విషయంపైన దైనందిన జీవితంలో మానవహక్కుల సమస్యల తీవ్రత ఆధారపడి ఉంటుంది. ఆధిక్యతనూ పెత్తనాన్నీ ప్రయత్నపూర్వకంగా తగ్గించుకోవడం, ఆధిపత్యానికి గురయ్యేవారి ఆకాంక్షలను గౌరవించడం, అధికారం చలాయించేటప్పుడు నియమబద్ధంగా, ప్రజాస్వామికంగా వ్యవహరించడం ఈ విషయంలో మానవహక్కుల స్పృహకు ప్రమాణాలు. ఈ ఆధిపత్యాలన్నీ పూర్తిగా పోవాలని సూత్రప్రాయంగా విశ్వసించేవారు సహితం తమ దైనందిన జీవితంలో వీటిని తగ్గించడానికి ప్రయత్నించకపోవడం తరచుగా జరుగుతుంటుంది. దైనందిన జీవితంలో మానవ హక్కులు అనే విషయానికి ఈ వైరుధ్యం కూడ ఒక కోణమే.

మనం ప్రాజెక్టుల వల్ల ప్రయోజనం పొందే లబ్ధిదారులమయినట్టయితే ఈ విషయంలో ముంపు ప్రాంతాలవారి ప్రయోజనాలకు కూడ మన ప్రయోజనాలతోపాటు సమాన ప్రాముఖ్యం ఇచ్చే మానవ హక్కుల స్పృహ పొందడం ఈ వైరుధ్యం పరిష్కారానికి చాలా అవసరం.

మనమొక ప్రాజెక్టు నిర్మాణంవల్ల ప్రయోజనం పొందే స్థితిలో ఉన్నామనుకోండి. ఆ ప్రాజెక్టువల్ల మన పొలాలకు వచ్చే నీటిని దృష్టిలో ఉంచుకొని దానికోసం ఆందోళన చేస్తాం. అయితే ఆ ప్రాజెక్టు నిర్మాణం వల్ల మనకంటె ఇంకా నికృష్టంగా బతుకుతున్న బడుగు ప్రజల ఆవాసాలు, పొలాలు ముంపుకు గురి అయ్యే ప్రమాదముందనుకుందాం. ఆ ముంపును కనీస పరిమాణానికి తగ్గించాలంటే ప్రాజెక్టు ఎత్తు తగ్గించవలసి ఉంటుందనుకుందాం. లేదా ఒక పెద్ద ప్రాజెక్టు స్థానంలో మూడు నాలుగు చిన్న ప్రాజెక్టులు కట్టే ప్రత్యామ్నాయాన్ని అమలు చేయవలసి ఉంటుందనుకుందాం. మనకంటె వెనుకబడి ఉన్న ఆ ప్రజల యోగక్షేమాలను దృష్టిలో ఉంచుకొని ఆ ప్రత్యామ్నాయంవల్ల మన ప్రయోజనం కొంత దెబ్బతిన్నప్పటికీ దానిని ఆమోదించగలిగినట్టయితే అభివృద్ధి విషయంలో మనం మానవ హక్కుల స్పృహతో వ్యవహరించినట్టవుతుంది.

నదీజలాల ప్రాజెక్టుల విషయంలో ఈ సమస్య దాదాపు అనివార్యంగా తలెత్తుతుంది. ప్రాజెక్టులు కట్టేది సాధారణంగా నది పైభాగాన ఉన్న అడవులు, కొండల ప్రాంతాలలో. ప్రాజెక్టువల్ల నీళ్లు పొందేది సాధారణంగా దిగువన ఉన్న మైదాన ప్రాంతాలు. అక్కడి ప్రజలు ఎంతయినా అడవివాసుల కంటె ఎక్కువ రాజకీయ ప్రాబల్యం కలిగే ఉంటారు. ఎక్కువ సాంఘిక ఆర్థిక అభివృద్ధి కలిగి ఉంటారు. అందువల్లనే రాజకీయంగా ఆందోళన చేసి, ఒత్తిడిపెట్టి, ప్రాజెక్టు మంజూరు చేయించుకోగలుగుతారు. చాలా కాలంపాటు ఈ విషయంలో వారి హక్కులేతప్ప ఇతరుల హక్కుల సమస్య ఇమిడి ఉందన్న ఆలోచన ఎవరికీ రాలేదు. ఈ మధ్య కాలంలో ముంపు ప్రాంత ప్రజలు ఆందోళన చేయడం మొదలుపెట్టిన తరువాతే ఇక్కడ లబ్ధిదారుల ప్రయోజనాలకూ ముంపు ప్రాంతాల ప్రజల కష్టాలకూ మధ్యనొక వైరుధ్యం ఉందని అర్థమయింది. మనం ప్రాజెక్టుల వల్ల ప్రయోజనం పొందే లబ్ధిదారులమయినట్టయితే ఈ విషయంలో ముంపు ప్రాంతాలవారి ప్రయోజనాలకు కూడ మన ప్రయోజనాలతోపాటు సమాన ప్రాముఖ్యం ఇచ్చే మానవ హక్కుల స్పృహ పొందడం ఈ వైరుధ్యం పరిష్కారానికి చాలా అవసరం.

పట్టణాలలో నివసించే ధనిక, మధ్యతరగతి ప్రజలు తమ వాహనాలు వేగంగా కదలడానికి విశాలమైన రోడ్లు, ఫ్లైఓవర్లు కావాలని కోరుకుంటారు. వారి రాజకీయ ప్రాబల్యంవల్ల, వారి ఆర్థిక అవసరాలకు పెట్టుబడిదారీ మార్కెట్‌లో లభించే స్పందన వల్ల

వారు తమ కోరికను సాధించుకోగలుగుతారు. కానీ వారికి అత్యవసరంగానో అనివార్యంగానో కనిపించే ఈ 'అభివృద్ధి' సైకిళ్లపైన లేదా కాలినడకన ప్రయాణం చేయక తప్పని పేదల అసౌకర్యాన్ని బాగా పెంచుతుంది. మన దేశంలో వేగంగా పెరుగుతున్న ఏ నగరాన్ని చూసినా ఈ విషయం అర్థం అవుతుంది. మనం ధనిక, మధ్యతరగతి పట్టణవాసులమైతే, మన ప్రయోజనాలకూ పేదల అవసరాలకూ మధ్యనున్న ఈ వైరుధ్యాన్ని లెక్కలోకి తీసుకునే విధంగా పట్టణ అభివృద్ధిని గురించి ఆలోచించే మానవ హక్కుల స్పృహ మనం అలవరచుకోకపోతే ఈ వికృతమైన నగరాభివృద్ధి సాగుతూనే ఉంటుంది.

విద్యుత్తు, సాగునీటి వంటి అవసరాల విషయంలో పట్టణ ప్రాంత ప్రయోజనాలకిచ్చే ప్రాముఖ్యం పల్లెలకు చాలా నష్టం చేసింది, చేస్తున్నది. మనం పట్టణవాసులమయినట్టయితే పట్టణాభివృద్ధి మనకెంత అవసరమనిపించినా పల్లెల సమాన అభివృద్ధిని కాంక్షించే మానవ హక్కుల స్పృహతో దానిని కొంత వదులుకొని పల్లెలకు వనరులు మరింత ఎక్కువగా ఇవ్వాలనే ఆకాంక్షతో గొంతు కలపవలసి ఉంటుంది.

మన దృష్టికి చాలా న్యాయంగా తోచే ప్రయోజనాలకూ మానవహక్కుల దృష్టికీ మధ్యనుండగల వైరుధ్యాన్ని ఈ మధ్యకాలంలో విద్యాఉద్యోగ రాజకీయరంగాల రిజర్వేషన్ల చర్చ బలీయంగా బయటపెట్టింది. మనం మగవాళ్లమయితే స్త్రీల సమాన ప్రతిపత్తికి దోహదపడే రిజర్వేషన్లను వ్యతిరేకించడానికి ఏవో సాకులు వెతుకుతాం. మనం అగ్రకులాలకు చెందినవారమయితే ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులాలకు కల్పించిన రిజర్వేషన్లను కుదించివేయడానికి, తగ్గించివేయడానికి, అమలు కాకుండ చూడడానికి అనేక ప్రయత్నాలు చేస్తాం. మనం ఏజెన్సీలోగానీ ఏజెన్సీ ప్రాంతానికి సమీపంలోగానీ నివసించే ఆదివాసీయేతరులమయితే ఆదివాసులకు ఏజెన్సీలో ప్రత్యేక హక్కులు కల్పించే చట్టాలను నీరుగార్చడానికి మన రాజకీయ ప్రాబల్యమంతా ఉపయోగించి కృషి చేస్తాం.

మన నిత్యజీవిత ప్రయోజనాల కోసం, అవసరాల కోసం మనకందరికీ శాంతి భద్రతల సంరక్షణ కావాలి. కానీ తమ మనుగడ కోసమే శాంతి భద్రతలకు భంగం కలిగించక తప్పని పరిస్థితి సమాజంలో ఎవరో ఒకరికి ఎప్పుడూ ఉంటుంది. అది మామూలు నేరకాండ రూపంలో ఉండవచ్చును, రాజకీయ పోరాటం రూపంలో ఉండవచ్చును. ఈ రెండు రకాల మనుషుల మధ్యనుండేది ఆధిపత్య సంబంధమే కానక్కరలేదు. అయినప్పటికీ ఈ రెండు ప్రయోజనాల మధ్య వైరుధ్యం ఉంది. అశాంతి పట్ల, అభద్రత పట్ల, వాటికి కారకులయినవారి పట్ల ఒక మానవ హక్కుల స్పృహ కలిగి ఉండడం దైనందిన జీవితంలో మానవ హక్కులకు సంబంధించిన ఒక ముఖ్య అంశం.

దొంగతనం వంటి నేరాలలో ముద్దాయిలయినవారి హక్కుల గురించి మాట్లాడితే, 'మీయింట్లో దొంగతనం జరిగినప్పుడు మీరిట్లాగే మాట్లాడుతారేమో చూద్దాం' అని ఎద్దేవా చేసే పోలీస్ అధికారులు ఉన్నారు. దైనందిన జీవిత విషయాలలో మానవహక్కుల స్పృహ లోపించడాన్ని తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నమే ఈ వెక్కిరింత.

మన యింట్లో దొంగతనం జరిగినప్పుడు పోలీసులు అనుమానితులను కొట్టి, తన్ని దొంగిలించిన వస్తువులను వెనక్కి ఇప్పించాలని మనం కోరుకున్నట్టయితే నేరస్మృతిలో మానవ హక్కుల గురించి సూత్రప్రాయంగా ఎన్ని మాటలు మాట్లాడినా ప్రయోజనం లేనట్టే. ఈ దైనందిన మానవహక్కుల స్పృహ ఏ మేరకు మనలో లోపిస్తుందో ఆ మేరకు పోలీసు వ్యవస్థ మానవ హక్కుల అతిక్రమణ యధేచ్ఛగా కొనసాగించగలుగుతుంది.

ఉద్యోగంరీత్యా ఇతరులపైన పెత్తనం లేక అధికారం చలాయించే స్థితిలో ఉండే వాళ్ల దైనందిన ప్రవర్తనలో మానవ హక్కుల స్పృహ ఉండడం సమాజంలో మానవహక్కులు కొంత మేరకయినా బాగుండడానికి చాలా అవసరం.

మనం ప్రభుత్వ ఉద్యోగులమైతే ప్రజలను ఈసడించుకుంటూ వారిని ఒక 'న్యూసెన్స్'గా భావిస్తున్నామా? మనం అధ్యాపకులమైతే పిల్లల వ్యక్తిత్వాన్నీ, స్వేచ్ఛనూ గౌరవించలేకుండ ఉన్నామా? మనం ఆఫీసర్లమైతే మన కింది ఉద్యోగులతో సగౌరవంగా వ్యవహరించలేకుండ ఉన్నామా?

బహుశా అన్నిటికంటె ముఖ్యంగా మనం చేసే ఉద్యోగానికి వర్తించే చట్టాలనూ నియమాలనూ గౌరవించలేకుండ ఉన్నామా? వాటినొక అవరోధంగా భావిస్తున్నామా?

ఇవి మన సమాజంలో తరచుగా దర్శనమిచ్చే అవలక్షణాలు. దైనందిన జీవితంలో మానవహక్కుల స్పృహ లేమిని ఇవి సూచిస్తాయి.

మన దైనందిన జీవితంలో మానవ హక్కుల స్పృహతో ప్రవర్తించడమే కాక మొత్తంగా సమాజంలో మానవ హక్కుల పురోభివృద్ధి కోసం దైనందిన కృషి చేయడం కూడ చాలా అవసరం. ఎందుకంటే మన పాటికి మనం వీలయినంతగా మానవ హక్కుల స్ఫూర్తితో ప్రవర్తించడం నైతికంగానేకాక సామాజికంగా కూడ చాలా అవసరమయినప్పటికీ దానివల్ల మొత్తంగా సమాజంలో మానవ హక్కుల పరిస్థితిలో మార్పు వచ్చేయదు. ఆ మార్పుకు మార్గాలను అన్వేషించి ఆ దిశగా దైనందిన కృషి చేయడం చాలా అవసరం. ఈ మార్పుకోసం ఎవరో 'ఉద్యమకారులు' లేక 'పోరాటకారులు' కృషి చేస్తారనీ, మిగిలినవాళ్లము ప్రేక్షకులుగానో లేక వారు సాధించిపెట్టే హక్కుల గ్రహీతలుగానో ఉంటామనీ అనుకోవడం పొరపాటు. మనమందరం మానవులం, అందరమూ మానవ హక్కుల సాధనకు సంబంధించిన కృషిలో దైనందిన జీవితంలో భాగం కావాలి.

కొన్ని మార్పులు చట్టాలకు సంబంధించినవి. ఈ రోజు చట్టంలో లేని ఒక హక్కును కల్పించడానికి ఒక కొత్త చట్టంగానీ, ఇప్పటికే ఉన్న ఒక చట్టానికి సవరణగానీ అవసరం అవుతుంది. అప్పుడు చట్టాలు చేసే చట్టసభలకు ఈ సంకల్పం కలిగించడం కోసం మనం కృషి చేయవలసి ఉంటుంది. చట్ట సభలలో స్థానాలకోసం పోటీ పడేది రాజకీయ పార్టీలు కాబట్టి రాజకీయ పార్టీలకు ఈ సంకల్పం కలిగించడం కోసం కృషి చేయవలసి ఉంటుంది.

ఇప్పటివరకు చరిత్ర చెప్పేదేమిటంటే ఏ హక్కయినా ఉనికిలోకి రావాలంటే అది ఏ ప్రజలకు అవసరమో వారు సంఘటితపడి దానికోసం కృషి చేయాలి. ఆ సంఘటన రూపొందడానికి, నిలబడడానికి, విజయవంతం కావడానికి జరగవలసిన కృషి చాలా ఉంటుంది. ఈ విధంగా సంఘటితపడి తమ అవసరాన్ని ఒక హక్కుగా డిమాండ్ చేయడం ఆ ప్రజలు అలవరచుకున్న తరువాత ఆ డిమాండ్‌కు రాజకీయ పార్టీలూ చట్టసభలూ స్పందించేటట్టు చేయడం దానికి అనుబంధంగా జరగవలసిన కృషి.

హక్కు అవసరమైన ప్రజలు దానికోసం సంఘటితంగా డిమాండ్ చేయడం ఎంత ముఖ్యమో, తక్కిన సమాజం వారి కోరికను ఆమోదించడం అంతే ముఖ్యం. వారు ఆ హక్కును పొందడం వల్ల కొంత పెత్తనం, ఆధిక్యత కోల్పోయే వారుంటారు. వారేకాక తాము ఏ పెత్తనమూ కోల్పోకపోయినా కొత్తను ఆహ్వానించడానికి సులభంగా సిద్ధపడని వారు ఉంటారు. అంతే కాకుండ 'ఈరోజు వీళ్లిది అడిగితే రేపు ఇంకా ఎవరెవరు ఏమేం అడుగుతారో' అని వెనకాడేవారుంటారు.

హక్కులు అవసరమైన ప్రజలను సంఘటితపరచడంలో ప్రతి ఒక్కరికీ పాత్ర ఉండకపోవచ్చునుగానీ సమాజంలోని ఈ ప్రతిఘటనను అధిగమించడంలో ప్రతి ఒక్కరికీ పాత్ర ఉంటుంది. కొత్తను ఆహ్వానించడానికి సమాజాన్ని మానసికంగా తయారు చేసే పాత్ర. ఇది ఎక్కువగా చర్చ ద్వారా, సంవాదం ద్వారా సాధ్యం కావాలి. మనం ఇప్పటికే దీనికి కావలసిన అవకాశాలు పొందిన వారమయితే ఆ అవకాశాన్ని ఇందుకోసం ఉపయోగించడం కంటె మనం చేయగల మేలు వేరే ఉండదు.

అయితే చట్టంలో కొత్త హక్కులకు గుర్తింపు కల్పించడమేకాక ఇప్పటికే గుర్తింపు పొందిన వాటిని అమలు చేయించడం కూడ ఒక మానవహక్కుల కృషే.

ఒక్కోసారి ఒక తరంలో సమాజంలో ఆమోదం పొంది చట్టాల రూపం తీసుకున్న హక్కుల విషయంలో తరువాతి తరంలో వ్యతిరేకత, నిరసన తలెత్తుతాయి. అప్పటికి ఆ హక్కు చట్టంలో లేక రాజ్యాంగంలో ఆమోదం పొంది ఉంటుంది. కానీ అమలు కావడం కష్టమయిపోతుంది. అప్పుడు దానికి అనుకూలమైన సామాజిక ఆమోదాన్ని సజీవంగా ఉంచడం, తిరోగమనాన్ని ప్రతిఘటించడం అవసరం అవుతుంది.

ప్రపంచంలో చాలా దేశాలలో మత సామరస్యం, లౌకికవాదం, మైనారిటీల హక్కులు మొదలైన విషయాలకు ఈ గతే పడుతున్న దాఖలాలు ఉన్నాయి. ఒక తరంలో హక్కులుగా గుర్తింపు పొంది రాజ్యాంగ చట్రంలో భాగమైన ఈ విషయాల పట్ల ఇప్పుడు వ్యతిరేకత చాలా దేశాలలో బలపడింది. ఆ దేశాల రాజ్యాంగంలోనూ చట్టాలలోనూ ఈ అంశాలు ఏ మార్పు లేకుండ కొనసాగుతున్నప్పటికీ నిత్యజీవితంలో అవి కరువయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో మానవ హక్కుల స్పృహగల వాళ్లు నిర్వహించవలసిన కర్తవ్యం స్పష్టమే. మత

ఒక్కొకసారి సామాజిక ఆలోచనా రీతులలో పెద్దగా మార్పు రాకముందే
చట్టాలు వచ్చేస్తాయి. దానికి కారణమేదైనా, ఆ చట్టాలు కల్పించే
హక్కులకు అనుకూలమైన ఆలోచనారీతిని సమాజంలో
పెంపొందించుకోకపోతే ఆ చట్టాలు నిరర్థకంగా ఉండిపోతాయి.

సామరస్యాన్నీ లౌకికవాదాన్నీ మైనారిటీల హక్కులపట్ల గౌరవాన్నీ సజీవంగా ఉంచడం కోసం అన్ని సామాజిక జీవితరంగాలలోనూ కృషి చేయవలసి ఉంటుంది.

ఒక్కొకసారి సామాజిక ఆలోచనా రీతులలో పెద్దగా మార్పు రాకముందే చట్టాలు వచ్చేస్తాయి. దానికి కారణమేదైనా, ఆ చట్టాలు కల్పించే హక్కులకు అనుకూలమైన ఆలోచనారీతిని సమాజంలో పెంపొందించుకోకపోతే ఆ చట్టాలు నిరర్థకంగా ఉండిపోతాయి. ఇది దైనందిన జీవితంలో విస్తృతంగా జరగవలసిన కృషి. ఉదాహరణకు -

మన దేశంలో అంటరానితనాన్ని నిషేధించే చట్టాలు వచ్చేనాటికి అంటరానితనం తప్పన్న బలమైన ప్రజాభిప్రాయమేదీ లేదు. ఒక చారిత్రక క్రమంలో ఆ చట్టాలు వచ్చేసాయే తప్ప ప్రజలలో ఏకాభిప్రాయం ఉండడం వల్ల కాదు. అందువల్లనే అవి గట్టిగా అమలు కాకుండ ఉండిపోయాయి. కాబట్టి ఆ చట్టాలకు అనుగుణ్యమైన సామాజిక చైతన్యాన్ని పెంపొందించే కృషి కొనసాగుతూనే ఉండాలి. ఈ కృషి ఎదుర్కొనే ప్రతిఘటన సమాజంలో అడుగడుగునా వేళ్లూని ఉంది కాబట్టి ఇందులో మానవ హక్కుల పురోగమనాన్ని కాంక్షించే వారందరూ నిత్యం భాగం కావలసి ఉంటుంది.

కుటుంబం లోపల స్త్రీలు అనుభవించే హింసను నేరంగా గుర్తించే చట్టాలు కూడ అంతే. భర్త భార్యను కొట్టినా మానసికంగా హింసించినా అది నేరమని చెప్పే సవరణ నేరస్మృతిలో 1983లో వచ్చింది కానీ సామాజిక ఆలోచనా రీతులలో ఆ సవరణ ఇంకా రాలేదు. అది రానిదే స్త్రీలు పొందిన ఈ హక్కు నిజంగా వారికి దక్కదు. ఇది ప్రతీ కుటుంబంలోనూ ఉండే సమస్యే కాబట్టి ఈ హక్కుకు అనుకూలమైన ఆలోచనా రీతులను పెంపొందించే కృషి నిస్సందేహంగా దైనందిన కృషే.

అయితే మానవహక్కుల కృషిలో చట్టాల రూపకల్పన, వాటి అమలు అనేవే కాక చట్టాలతో సంబంధం లేని సామాజిక, సాంస్కృతిక, దార్శనిక కృషి చాలా ఉంటుంది. ఇది చర్చ, సంవాదం, ప్రచారాల రూపంలో జరిగే కృషి కాబట్టి అది దైనందిన జీవితంలో భాగం కాక తప్పదు. అంటరానితనాన్ని గురించి, కుటుంబ హింస గురించి పైన ఇచ్చిన ఉదాహరణలలో కూడ నిజానికి చట్టానికి ఉండే పాత్ర స్వల్పమే. ఇక్కడ ప్రధానంగా మార్పు రావలసింది సామాజిక ప్రవర్తనా రీతులలో, సంస్కృతిలో, అలవాట్లలో, ఆచారాలలో.

**ఈ** రోజు ఒక ముఖ్య సంవాదంగా ముందుకొస్తున్న ఒక ఉదాహరణ చూసి ఈ పాఠాన్ని ముగిద్దాం. ఇది 'అభివృద్ధి' నమూనాకు సంబంధించినది. దేశ కాలాలతో సంబంధం లేని ఏకైక అభివృద్ధి నమూనా ఉందంటూ దానిని ప్రపంచంలోని అన్ని దేశాలపైన రుద్దే ప్రయత్నమొకటి ఇప్పుడు జరుగుతున్నది. ఈ నమూనా నిజానికి ఏ దేశానికైనా ఏ కాలానికైనా పనికొస్తుందా అనేది వేరే సంగతి కానీ మనబోటి దేశాలకు ఇది చాలా హాని చేయగలదు.

అభివృద్ధిని మానవహక్కుల కోణం నుండి చూసినప్పుడు, లేమినీ వెనుకబాటుతనాన్నీ అణచివేతనూ నిర్దిష్టంగా గుర్తించి వాటిని తొలగించే లక్ష్యాన్ని కేంద్రం చేసుకుని ఆ చట్రం లోపల ఆర్థిక పెరుగుదలను అర్థం చేసుకునే నమూనా సరయినది. దీనివల్ల విపరీతమైన పెరుగుదల రేటు లభించకపోవచ్చును. కానీ కొంతయినా సమత, సమతుల్యం ఉంటాయి. అందుకు భిన్నంగా సమత, సమతుల్యం వంటి లక్ష్యాలతో ఏమీ సంబంధం లేని వేగవంతమైన పెరుగుదలనూ ఆధునీకరణనూ లక్ష్యంగా పెట్టుకున్న అభివృద్ధి నమూనాను అన్ని ప్రపంచదేశాల పైన రుద్దడం, ఆ దేశాల పాలకులు స్వీకరించడం జరుగుతున్నది.

**ఈ** నమూనాలో కొంత ఆకర్షణ లేకపోలేదు ఉంది. ఆ ఆకర్షణను ఎదుర్కొని సమతనూ మానవహక్కులనూ నిలబెట్టే కృషి ఈనాటి ముఖ్యమైన మానవహక్కుల కర్తవ్యాలలో ఒకటి. ఆ ఆకర్షణ మనచుట్టూ ఉంది, మనందరి మెదళ్లపైనా ప్రభావం వేస్తుంది కాబట్టి ఇదొక నిత్యజీవిత కృషి. కొంతమందికి తళుకు బెళుకుల కొత్తదనం కల్పిస్తూ అధికభాగం ప్రజలకు అస్థిరత, పేదరికం పంచిపెట్టే అభివృద్ధి నమూనా మానవ హక్కులకు శత్రువని సమాజం చేత ఒప్పించే కృషి ఎక్కడో ఎవరో చేపట్టే రాజకీయపోరాటం మాత్రమే కాదు. దాని దుష్ఫలితాలను అనునిత్యం ఎదుర్కొంటూ ఎండగడుతూ సాగవలసిన కృషి.

# నేరమూ శిక్ష - మానవ హక్కులు

పోలీసుస్టేషన్లలోనూ, న్యాయస్థానాలలోనూ అనుమానితులతో వ్యవహరించే తీరు తరచుగా మానవహక్కుల ఆందోళనకు దారితీస్తుంది. ఇది ఎంతగా జరుగుతుందంటే మానవ హక్కుల వాదులపైన 'నేరస్తులను సమర్థిస్తున్నారు' అనీ 'చట్టబద్ధంగా బతికే పౌరులకంటే నేరస్తులమీదే మీకు ఎక్కువ సానుభూతి' అనీ అభియోగాలు వేయడం జరుగుతుంటుంది. ఇదొక తప్పుడు అభిప్రాయం. మానవహక్కులంటే నేరం వల్ల బాధితులకు కలిగిన నష్టంకంటే నేరానికి పాల్పడినవారి హక్కులకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం అని కానే కాదు. నేరాలకు గురయిన బాధితుల కష్టాలు తప్పనిసరిగా పట్టించుకోవలసిన విషయాలే. నేరస్తుల నుండి పౌరులను కాపాడటం, అందులో భాగంగా నేరస్తులను శిక్షించడం రెండూ అవసరమే. లేకపోతే బలహీనులయిన వారికి బలవంతుల నుండి, చాతుర్యంగల వారి నుండి రక్షణ ఉండదు.

కె. బాలగోపాల్

మానవహక్కుల పి.జి. డిప్లొమా కోర్సు కోసం రాసిన పాఠం

అయితే ఇక్కడ కొన్ని సమస్యలు ఉన్నాయి. నేరస్తులను శిక్షించాలన్న న్యాయమైన ఆతృతతో శాంతిభద్రతల యంత్రాంగం కేవలం అనుమానితులు అయినవారి హక్కులను అతిక్రమించవచ్చునా? నేరాన్ని రుజువు చేయడంలోనూ, నేరస్తులను పట్టుకోవడంలోనూ అన్యాయమైన పద్ధతులు వినియోగించవచ్చునా? వినియోగించినట్టయితే నిర్దోషులు శిక్షకు గురయ్యే ప్రమాదం లేదా? దోషులను సక్రమంగానే గుర్తించామని అనుకున్నా, చేసిన నేరానికి తగిన శిక్ష కంటె ఎక్కువ శిక్ష వేయవచ్చునా? అసలు నేరస్తులను శిక్షించడంలో గల ఉద్దేశ్యం ఏమిటి? ఏ నేరానికి ఎటువంటి శిక్ష వేయడం ఉచితంగా ఉంటుంది? అంతేకాక, నేరస్తులను శిక్షించడం అవసరం అన్న ఆతృతలో బలవంతులకు వ్యతిరేకంగా బలహీనులు వ్యక్తం చేసే నిరసనను - ఉదాహరణకు కార్మికుల సమ్మెను - సమాజం నేరంగా పరిగణించడం తగునా? ఇటువంటి ప్రశ్నలకు నేర నిరోధక యంత్రాంగంలోనూ, దాని అంతర్గత నియమాలలోనూ సమగ్రమైన స్థానం లేదు. కాబట్టి వీటిని గురించి మాట్లాడుకోవడం అవసరం. మాట్లాడుకోవడమేకాక ఈ ప్రశ్నలకు సంబంధించిన అవగాహనను, తగిన సంస్థాగత నిర్మాణాలనూ రూపొందించడం కూడ అవసరం.

నేరం అంటే అర్థమేమిటి? దాని నిర్వచనం ఏమిటి? నేరాలలో అనుమానితులయిన వారి హక్కులేమిటి? దోషులైన వారికి సహితం ఉండే హక్కులు ఏమిటి? అనే ప్రశ్నలను చర్చించేటప్పుడు మనం చేసేది ఇదే. ఈ ప్రశ్నల గురించి మన ఆందోళనకు కారణం ఏమిటో కూడా తెలుసుకుందాం. అన్ని మానవహక్కుల ప్రకటనలు, ఒడంబడికలలోను (1948 నాటి అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన, 1966 నాటి అంతర్జాతీయ పౌర రాజకీయ హక్కుల ఒడంబడిక, 1985 నాటి ఐక్యరాజ్యసమితి చిత్రహింసల వ్యతిరేక ఒడంబడిక మొదలయినవి) నేరాలలో అనుమానితులయిన వారికి చిత్రహింసల నుండి, బలవంతపు ఒప్పుకోళ్ల నుండి, అన్యాయమైన నేర విచారణ పద్ధతుల నుండి రక్షణ కల్పించే సూత్రాలున్నాయి. నేరం రుజువయిన దోషులనుకూడ క్రూరమైన, అవమానకరమైన శిక్షలనుండి ఈ సూత్రాలు కాపాడతాయి. ఒక నేరం చేసి తద్వారా మరొకరి హక్కులకు భంగం కలిగించిన (లేక కలిగించినట్టు అనుమానించబడే) వ్యక్తుల హక్కుల గురించి మనకింత బాధ ఎందుకు? ఒక దొంగ మరొకరి కష్టార్జితాన్ని దొంగిలిస్తాడు. హంతకుడు మరొకరి ప్రాణాన్ని తీస్తాడు. ప్రతి నేరమూ ఎవరో ఒకరికి హాని కలిగిస్తుంది. తద్వారా హక్కులను అతిక్రమిస్తుంది. అటువంటప్పుడు, నేరం చేసినట్టు అనుమానించబడే వ్యక్తులతో వ్యవహరించేటప్పుడు ఉపయోగించే పద్ధతుల గురించి మనం ఆందోళన చెందడం ఎందుకు? నేరం రుజువయిన వ్యక్తులకు వేసే శిక్షలకు సంబంధించిన ప్రమాణాల గురించి ఆందోళన చెందడం ఎందుకు?

ఈ ఆందోళన వ్యక్తం చేయగానే ప్రభుత్వానికి వచ్చే సందేహాలు కొన్ని ఉన్నాయి.

ఈ ఆందోళన వెనుక ఏదైనా ఒక విధ్వంసక ఆకాంక్ష దాగి ఉందేమో? సామాజిక వ్యవస్థను ధ్వంసం చేసి అరాచకత్వాన్ని పెంపొందించాలన్న కాంక్ష దాగి ఉందేమో? మానవ హక్కుల గురించి మాట్లాడినప్పుడల్లా ఇటువంటి సందేహాలు ముందుకొస్తాయి.

మానవ హక్కుల ఆందోళన లక్ష్యం మానవ నాగరికత సారాన్ని పెంపొందించడమే తప్ప దానిని ధ్వంసం చేయడం కాదు. ఆ లక్ష్యంలో భాగంగానే నేరాలలో అనుమానితులయిన వారి న్యాయమైన హక్కులపట్ల ఆందోళన వ్యక్తం చేస్తాము.

ఈ సందేహం న్యాయమైనది కాదు. మానవ హక్కుల ఆందోళన లక్ష్యం మానవ నాగరికత సారాన్ని పెంపొందించడమే తప్ప దానిని ధ్వంసం చేయడం కాదు. ఆ లక్ష్యంలో భాగంగానే నేరాలలో అనుమానితులయిన వారి న్యాయమైన హక్కులపట్ల ఆందోళన వ్యక్తం చేస్తాము. నేరాన్ని సక్రమంగా, హేతుబద్ధంగా నిర్వచించాలనీ శిక్షకు న్యాయమైన ప్రమాణాలు అందాలనీ ఆందోళన చేయడం కూడా అందుకే.

దీనికి కారణం ఏమిటి అంటే చాలా కారణాలున్నాయి. వాటిలో ఒక్కొక్కటీ తెలుసుకుంటే మానవ హక్కుల ఆందోళనకు సంబంధించిన ఈ కోణాన్ని అర్థం చేసుకోగలుగుతాము.

అన్నిటికంటే సాధారణమైన కారణమేమిటంటే నేరం రుజువయ్యేంత వరకు ఎవ్వరూ దోషి కారు. అంతవరకు ఎవరైనా కేవలం అనుమానితుడే కాబట్టి అమాయకులను శిక్షించడం ఎంత తప్పో. వట్టి అనుమానితులను శిక్షించడమూ అంతే తప్పు. నేరాలను నిరోధించడం, నేరస్తులను శిక్షించడం అవసరమయినట్లే నిర్దోషులను, అమాయకులను శిక్షించకుండ ఉండడమూ అవసరమే. పోలీసు నిర్బంధంలో ఒక వ్యక్తిని హింసించడం, లేదా కాల్చి చంపడం నేరం రుజువు కాకముందే శిక్షించడం అవుతుంది. అదేవిధంగా, నేర విచారణ న్యాయంగా లేకపోవడం అంటే ముద్దాయికి తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవడానికి సహేతుకమైన అవకాశం ఇవ్వకుండ శిక్షించడం అవుతుంది.

దీనికీ మానవ నాగరికతను కాపాడడం లేక మెరుగు పరచడానికీ ఉన్న సంబంధం ఏమిటి? నేరం పూర్తిగా రుజువయ్యేంతవరకు అనుమానితులను నేరస్తులుగా చూడకూడదనేది ఒక నాగరికతా నియమం. నేరాన్ని రుజువు చేయడానికి ఉపయోగించే నేరవిచారణ పద్ధతి ముద్దాయికి తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకునేందుకు సహేతుకమైన అవకాశం కల్పించాలన్న నియమం కూడ అంతే. నియమ రహితమైన నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో ఈ విలువలను గెలుచుకోవడం, నిలబెట్టుకోవడం జరిగింది. అటువంటి పాలనలో మనిషిని శిక్షించడానికి కేవలం అనుమానిస్తే చాలుననే పరిస్థితి ఉండేది. అటువంటి పాలనా వ్యవస్థల నేర విచారణ పద్ధతులు పేదలకు, మైనారిటీ మతస్థులకు, జాతులకు, సాంఘికంగా అణగారిన వారికి చాలా అన్యాయం చేసాయి. కాబట్టి చిత్రహింసలనూ అన్యాయమైన నేర విచారణ పద్ధతులను అన్యాయమైన నేరవిచారణ పద్ధతులను వ్యతిరేకించేటప్పుడు మనం నాగరికతను ధ్వంసం చేయడం లేదు. కాపాడుతున్నాం. నియమరహిత నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా నాగరికత సాధించిన విజయాలను కాపాడుతున్నాం.

రెండవది, నేరం వ్యక్తులు చేస్తారే గానీ, శిక్ష సమాజం వేస్తుంది. ఒక్కొక్కసారి నేరస్తులొక గుంపుగా నేరం చేస్తారు. కానీ అదొక వ్యక్తుల గుంపే. శిక్ష వేసేది మాత్రం సమాజమే. నేరాన్ని పరిశోధించే పోలీసు యంత్రాంగం, నేరాన్ని విచారించే న్యాయమూర్తులు, దోషులను జైల్లో నిర్బంధించే జైలు అధికారులు కాదు నేరస్తులను శిక్షించేది. ఈ అధికారులు కేవలం సమాజం ప్రయోగించే పరికరాలు. నేరాలను పరిశోధించేది, విచారించేది, శిక్షించేది సమాజమే. జరిగిన నేరానికి ప్రతీకారంగా కాక న్యాయం చేయడం కోసం సమాజం ఈ పని చేస్తుంది. నేరాలు కేవలం బాధితులపైన నేరాలని ఆధునిక నేరచట్టం భావించదు. నేరాలను ప్రధానంగా సమాజంపైన నేరాలుగా భావిస్తుంది. అదే సమయంలో శిక్షకు గల లక్ష్యాన్ని ప్రతీకారం నుండి న్యాయానికి మరలిస్తుంది. దీని వెనుక ఉన్న ఆలోచన ఏమిటంటే నేరం అనేది సామాజిక వ్యవస్థ మూల సూత్రాలకు, అంటే సామాజిక నాగరికత ప్రమాణాలకు హాని కలిగిస్తుంది అని. సమాజం కేవలం బాధితులకు కలిగిన నష్టాన్ని కాక న్యాయానికి జరిగిన నష్టాన్ని సవరించాలని చూస్తుంది. ఆ లక్ష్యంతోనే నేరస్తుడిని శిక్షిస్తుంది. ముద్దాయి హక్కుల గురించి, నేరం రుజువయిన దోషుల హక్కుల గురించి ఎందుకు మాట్లాడాలన్న ప్రశ్న వేసుకున్నప్పుడు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి.

**మూ**డవది – ఒక వ్యక్తి 'నేరస్తుడు' కాబట్టి మానవ హక్కుల పేరిట సానుభూతి పొందడానికి అతనికి యోగ్యత లేదని భావించడంలో నేరం అనే భావన శాశ్వతమైనదని అందులో మార్పు లేదని ఒక అవగాహన ఉంది. ఆమోదనీయమైన ప్రవర్తనకూ నేరానికీ మధ్య ఖచ్చితమైన, స్థిరమైన విభజనరేఖ ఉందనే అవగాహన ఉంది. కానీ నిజానికి నేరం అనే భావన స్థలకాలాలకు అతీతమైనది కాదు. అది మార్పుకు లోనయ్యే సామాజిక విషయం. సమాజం మారినప్పుడు నేరానికుండే నిర్వచనం కూడ మారుతుంది. ఒకే సమాజంలో కూడ ఒకరికి నేరమయింది మరొకరికి నేరం కాదు. ఒక సందర్భంలో నేరమయింది మరొక సందర్భంలో కాదు. కాలం మారితే సైతం – అంటే ఇవ్వాళ నేరమయింది రేపు కాకపోవచ్చు.

అంటరానితనం ఈ రోజొక నేరం. రెండువందల ఏళ్ళ కింద, అందుకు విరుద్ధంగా, అంటరాని తనాన్ని ఆమోదించకపోవడం నేరం. నేరస్తులను ఎప్పుడూ ద్వేషించవలసిందే, మానవతకూ సానుభూతికీ దూరం ఉంచవలసిందే ననుకుంటే రెండు వందల ఏళ్ల కింద అంటరానితనానికి వ్యతిరేకంగా తిరగబడిన దళితుడు సమాజ ద్వేషానికి గురయి ఉండేవాడు. ఈ రోజు అంటరానితనం పాటించే సవర్ణులు ఆ ద్వేషానికి గురికావలసి ఉంటుంది.

ఒకప్పుడు భర్తకు భౌతికంగా లోబడి ఉండని స్త్రీ – అతను కొట్టే దెబ్బలు మౌనంగా స్వీకరించని స్త్రీ నేరం చేసినట్టే. ఇప్పుడది పాక్షికంగా మారింది. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 498–ఎ ప్రకారం భర్త భార్యను భౌతిక హింసకే కాదు, మానసిక హింసకు గురిచేసినా అది నేరమే.

కాబట్టి నేరం అనేదానికి స్థిరమైన అర్థం లేదు. నాగరికత మారేకొద్దీ అది మారుతుంది. 'నేరస్తులకు సానుభూతి చూపించడమేమిటి?' అనిగానీ, 'నేరస్తుల మానవ హక్కుల గురించి మాట్లాడవద్దు' అనిగానీ అన్నప్పుడు మనం నేరం అనే భావనకొక స్థిరత్వాన్ని ఇస్తున్నాము. అటువంటి స్థిరత్వం చరిత్రలో లేదు.

అంటరానితనం, భార్యను హింసించడం అనేవి ఈ వాదనకు అనుకూలంగా ఎంచుకున్న ఉదాహరణలని ఎవరైనా అభ్యంతరం చెప్పొచ్చు. ఇవి మినహాయింపులనీ, దొంగతనం, హత్య, మోసం, రేప్ మొదలయిన అనేక ఇతర నేరాలకు స్థిరమైన అర్థం ఉందనీ అనొచ్చు. మానవ నాగరికత (అత్యంత ప్రాథమిక దశల్లో తప్ప) వీటిని ఎప్పుడూ నేరాలుగానే భావించిందనీ, కాబట్టి ఇటువంటి నేరాలకు బాధ్యులయిన వ్యక్తులకు మానవ హక్కులు ఉండవనడంలో తప్పేమీ లేదనీ అనొచ్చు.

ఈ వాదన నిజమేననిపిస్తుంది గానీ, వాస్తవంగా నిజమేనా? సమాజం హత్యను మొత్తం మీద నేరంగా భావించిందనేది సత్యమే. కానీ అన్ని సమాజాలూ దానికి మినహాయింపు పెట్టాయి. అనేక ఆదివాసీ తెగలలో, తమ తెగకు చెందిన వ్యక్తిని చంపడం నేరమేగానీ ఇతర తెగలకు చెందిన వారిని చంపడం నేరం కాకపోవచ్చు. ఒక్కొక్కసారి అటువంటి హత్యలను వీరోచితమైన చర్యలుగా కూడా భావించడం జరుగుతుంది. మధ్యయుగాల హైందవ సమాజంలో, హత్యను మామూలుగా నేరంగానే భావించారు గానీ, క్షత్రియుడు తన కుల ధర్మ నిర్వహణలో భాగంగా చేసిన హత్యలను నేరంగా భావించలేదు. ఆ హత్యలు సరయినవే, న్యాయమైనవే, క్షేత్ర ధర్మానికి అనుగుణ్యమైనవే (భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడితో చెప్పినట్లు) అదే విధంగా వర్ణాశ్రమ ధర్మానికి వ్యతిరేకంగా తిరగబడ్డ శూద్రుడిని చంపడం కూడ ఆ నాడు నేరంగా భావించబడలేదు. దానినొక న్యాయమైన చర్యగానే భావించారు. కాని ఆధునిక కాలంలో ఎవరు ఎవరిని చంపినా అది నేరమే. విదేశీయుడిని చంపినా అది నేరమే – ఆ విదేశీయుడు శత్రు సైనికుడయితే తప్ప. అప్పుడతనిని చంపడం నేరం కాకపోగా భారత సైనికుడి కర్తవ్యం అవుతుంది. శత్రుసైనికులను చంపడంలో కూడా భారత సైనికుడు ఎంత ఉత్సాహం చూపిస్తే అంతగా అతని దేశభక్తిని దేశం గుర్తిస్తుంది. కానీ మరుసటి దినం అదే శత్రుసైనికుడు టూరిస్టుగా భారతదేశానికొస్తే అతనిని చంపడం మళ్లీ నేరం అవుతుంది.

గ్రామస్థులు గుంపయి బందిపోట్లను పట్టుకొని కొట్టి చంపిన ఘటనలు మనకు తెలిసినవే. చట్టం కళ్ళలో ఇవి హత్యలే అయినప్పటికీ వాటిని వీరోచితమైన కృత్యాలుగా మనం అభినందిస్తుంటాం. పూర్తిగా చట్టానికి విరుద్ధంగా, బందిపోట్లను చంపమనీ చంపితే కేసులుండవనీ ప్రజలను రెచ్చగొట్టిన పోలీస్ అధికారులు ఉన్నారు.

మోసాన్ని మరొక ఉదాహరణగా తీసుకోవచ్చు. మరొకరిని మోసం చేసి వారిని నష్టపరచి తాము ప్రయోజనం పొందాలని చూడడం భారత శిక్షాస్మృతి ప్రకారం నేరం. అయితే అతి

తెల్లటి పళ్ళ గురించి, అత్యంత శుభ్రమైన ఉతుకు గురించి కంపెనీలు చేసే అడ్వర్టైజ్‌మెంట్‌లకు ఇది వర్తించదు. ఆ ప్రచారం కూడ మోసమేనని మనకు తెలుసుగానీ ఈ చట్టం వాటికి వర్తించదు. దానిని పెట్టుబడిదారీ వ్యవస్థకు సంబంధించిన సాధారణ వ్యాపార నీతిగానే పరిగణించడం జరుగుతుంది. పైగా దానికోసం చాలా నేర్పరితనం, కళాత్మకత వెచ్చించబడుతుంటాయి కూడ. అడ్వర్టైజ్‌మెంట్ వట్టి మోసమేనని అందరికీ తెలిసినప్పటికీ చట్టంగానీ మనంగానీ దానిని శిక్షార్హమైన నేరంగా భావించము.

కల్తీ సరుకు అమ్మడం ద్వారా వినియోగదారున్ని మోసం చేయడాన్ని కూడ వ్యాపార నీతిగానే చాలా కాలం భావించడం జరిగింది. దానిని గౌరవించక పోవచ్చుగానీ సహించేవారు. అది 'మోసం' అనే నేరం కిందికి వచ్చేది కాదు. చట్టం నుండి వినియోగదారుడు సహాయం కోరుకున్నట్టయితే సంక్లిష్టమైన సివిల్ కేసులు చేపట్టవలసి వచ్చేది. వినియోగదారుల ఉద్యమం ముందుకొచ్చి వినియోగదారుల రక్షణకోసం చట్టాలు చేసిన తరువాతే ఈ రకమైన మోసానికి నేరంగా కచ్చితమైన గుర్తింపు వచ్చింది. మరొక రకంగా చెప్పాలంటే, వినియోగదారుల ఉద్యమం అభివృద్ధి చెందిన చోట ఈ రకమైన మోసానికి ఉండే సామాజిక అర్థం మారిపోయింది. ఇష్టంగాను అయిష్టంగాను ఇంతకాలం అందరూ వ్యాపార నీతిగా సహించినది కొత్తగా దానికోసమే రూపొందించిన చట్టాల కింద నేరంగా గుర్తింపు పొందింది.

ఇది దొంగతనానికి కూడ వర్తిస్తుంది. ఇంటికి కన్నం వేసే వాళ్ళు, జేబుకు కన్నంవేసే వాళ్ళు చేసే నేరాన్ని మాత్రమే దొంగతనం అంటాము. పరిపాలనా వ్యవహారాల నిర్వహణ క్రమంలోనూ, వ్యాపార క్రమంలోనూ జరిగే దానిని దొంగతనం అనరు. అంతకంటె మర్యాద పూర్వకమైన మాటలు ప్రయోగిస్తారు. దానిని దుర్వినియోగం అంటారు. సాధారణంగా దొంగతనాలకు ఉపయోగించే చట్టాన్ని ఈ నేరానికి వర్తింపజేయరు. అంతకంటె సున్నితమైన పద్ధతులలో దానితో వ్యవహరించడం జరుగుతుంది. ఎక్కువ భాగం విస్మరించి ఊరుకోవడం జరుగుతుంది.

లైంగిక అత్యాచారాన్ని మరొక ఉదాహరణగా తీసుకోవచ్చు. ఒక స్త్రీతో ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా లైంగికచర్య జరపడాన్ని అన్ని సమాజాలూ వ్యతిరేకించాయి గానీ, దానికి ఎప్పుడూ కొన్ని మినహాయింపులు ఇవ్వడం జరిగింది. అగ్రవర్ణ భూస్వామ్య కుటుంబాలకు చెందిన మగవాళ్లు, పూజారులు, కింది కులాల స్త్రీలను లేక జోగినులను లేక దేవదాసీలను బలాత్కరం చేయడం ఒక హక్కుగా భావించిన రోజులు ఉండేవి. ఆధునిక చట్టం ఈ రకమైన వికృతమైన హక్కులను గుర్తించదు గానీ మన బోటి కొన్ని దేశాలలో ఇప్పటికీ భార్య ఇష్టానికి వ్యతిరేకంగా ఆమెతో సంభోగించడం భర్తకుండే చట్టపరమైన హక్కుగా భావించబడుతూనే ఉంది. రేప్ నేరాన్ని నిర్వచించే భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 376 భర్త భార్యపైన చేసే అత్యాచారానికి మినహాయింపు ఇస్తుంది. సామాజికంగా కూడ ఆ భర్త తన 'హక్కు' తీసుకుంటున్నాడని భావించడం జరుగుతుందే తప్ప, అతను నేరం చేశాడని ఎవరూ

నేరానికి మూలం సామాజికం కాబట్టి 'నేరస్తుల పట్ల మానవత్వంతో స్పందించనక్కరలేదు' అని ప్రకటించేటప్పుడు మనం చెప్పే విశ్వజనీన నైతిక ప్రమాణం పైకి కనిపించినంత న్యాయమైనది కాదు.

అనుకోరు. అతనిని నేరస్తుడిగా చూడడం జరగదు. అయితే కొన్ని పాశ్చాత్య దేశాలో ఈ 'హక్కు'కు గుర్తింపు లేదు. భార్య ఇష్టానికి వ్యతిరేకంగా ఆమెతో సంభోగించాలని ప్రయత్నం చేసే భర్తను అక్కడ చట్టం రేపిస్ట్‌గా భావిస్తుంది. భారత నేరస్మృతిలో కూడా అటువంటి మార్పు తీసుకురావాలని మహిళా ఉద్యమం ప్రయత్నిస్తున్నది.

## సామాజిక మూలం

నేరానికి మూలం సామాజికం అని ఈ పాటికి స్పష్టం అయి ఉంటుంది. కాబట్టి 'నేరస్తుల పట్ల మానవత్వంతో స్పందించనక్కరలేదు' అని ప్రకటించేటప్పుడు మనం చెప్పే విశ్వజనీన నైతిక ప్రమాణం పైకి కనిపించినంత న్యాయమైనది కాదు.

నాలుగవది, నేరానికి ఉండే అర్థమే కాదు, దాని కారణం లేక మూలం కూడ కనీసం కొంతమేరకు సామాజికమే. యువతను పేదరికమే నేర ప్రపంచంలోకి నెడుతుందన్న ఆలోచన సినిమాల ద్వారా సుపరిచితం అయింది. తరచుగా దీనిని చాలా నాటకీయంగా వ్యక్తం చేయడం జరుగుతుంది. ఉదాహరణకు చావు బతుకులలో ఉన్న తల్లికి మందులు కొని ఇవ్వడం కోసం డబ్బులు లేక దొంగతనానికి పాల్పడ్డ యువకుడు ఆ తరువాత నేరస్తుడిగా కొనసాగినట్టు చూపిస్తారు. నిజజీవితం మరీ అంత నాటకీయం కాదు. నేరం చేయాలన్న నిర్ణయం ఎల్లప్పుడూ సంపూర్ణంగా సమాజం వ్యక్తిమీద రుద్దేదే కాదు. ఏదో ఒక మేరకు ఆ వ్యక్తి సంకల్పపూర్వకంగా తీసుకున్న నిర్ణయం కూడ అందులో ఉంటుంది.

అయితే చాలా సందర్భాలలో వ్యక్తిని నేరం వైపు పురిగొల్పే సామాజిక పరిస్థితుల పాత్ర కూడా గణనీయంగా ఉంటుంది. వీటిలో కొన్ని పరిస్థితులు - ఉదాహరణకు లైంగిక సంబంధమైన అసూయలు, అన్నీ సామాజిక వ్యవస్థలలోనూ అన్ని సామాజిక వర్గాలలోనూ సామాన్యంగా ఉండేవే కాబట్టి వాటిని సామాజిక కారణాలు అని కాక మానవమనుగడలో సార్వజనీనమైన కారణాలు అనవచ్చును. అయితే కొన్ని కారణాలు ప్రత్యక్షంగా సామాజికమైనవి. ఉదాహరణకు పేదరికం, లేమి, సామాజిక అణచివేత మొదలయినవి. మన సమాజంలో జరిగే నేరాలలో ఈ రకమైన సామాజిక పరిస్థితుల నుండి ఉత్పన్నమయ్యేవి చాలా ఉన్నాయి. అంటే అర్థం, ఈ పరిస్థితులు పోతే నేరాలన్నీ పోతాయని కాదు. నేరాలు పూర్తిగా అదృశ్యం కాకపోవచ్చు. ఎందుకంటే మానసిక మూలాలు ఉండే వ్యక్తిగత కారణాల వల్ల జరిగే నేరాలు కొనసాగవచ్చు. అంతేకాక కొత్త సామాజిక పరిస్థితుల

నుండి కొత్త నేరాలు పుట్టగలవు. అవి లేమి నుండి కాక కలిమి నుండి పుట్టే నేరాలు కావచ్చు. అయితే సామాజిక సంపదతో పాటు సామాజిక సంక్షేమం కూడా బాగా అభివృద్ధి చెందిన స్కాండినేవియన్ దేశాల అనుభవాన్ని బట్టి అటువంటి స్థితిలో నేరాలు మొత్తం మీద తక్కువగా ఉంటాయని చెప్పవచ్చు.

కాబట్టి నేరం కొంతమేరకు 'పరిస్థితుల సృష్టి' అని చెప్పవచ్చు. నేరగాళ్ల హక్కుల గురించి, ముద్దాయిల హక్కుల గురించి మాట్లాడడం సబబా అన్న ప్రశ్నను చర్చించేటప్పుడు దీనినొక ముఖ్య విషయంగా గుర్తుంచుకోవాలి. నేరస్తుల హక్కుల గురించి మాట్లాడడం పట్ల మనం అభ్యంతరం చెప్తున్నామంటే అర్థం మనం నేరానికి గల బాధ్యతను మొత్తంగా వ్యక్తిమీద పెట్టి సమాజం పాత్రను, సామాజిక పరిస్థితుల పాత్రను ఉపేక్షిస్తున్నామని. నేరస్థుడు నేరానికి నూరు శాతం తానే బాధ్యుడనుకోవడం వల్లనే మనం మానవతను మరిచిపోగలుగుతున్నాం. నేరస్థుడు కూడా తనకు మానవ హక్కులు ఉన్నాయన్న విషయం మరచిపోగలుగుతున్నాడు.

నేరం వెనుక ఉన్న సామాజిక పరిస్థితులూ కారణాలూ వ్యక్తి అదుపులో ఉండవు కాబట్టి ఆ మేరకు నేరానికి బాధ్యత వ్యక్తిది కాదు. అయితే సామాజిక పరిస్థితులు వ్యక్తి అదుపులో ఉండవంటే అర్థం ఆ పరిస్థితులకు వ్యక్తిపైన ఉండే ప్రభావం కూడ వ్యక్తి అదుపులో ఉండదని కాదు. పేదరికం అనేది పేద వ్యక్తులు అదుపులో లేని ఒక సామాజిక పరిస్థితి అయితే పేదరికం కారణంగా దొంగతనం చేయాలన్న తలపు రావడం పూర్తిగా వ్యక్తి అదుపులో లేని విషయం కాదు. అయితే ఆ ప్రోద్బలాన్ని అర్థం చేసుకోగలము. అది చట్టం దృష్టిలో నేరం. అయినా మానవతా దృక్పథంతో దానిని అర్థం చేసుకోగలము. కాబట్టి ఆ ప్రోద్బలానికి లోనయిన వ్యక్తిని సానుభూతికి పూర్తిగా అతీతునిగా భావించనక్కరలేదు.

వ్యక్తి అదుపులో లేని పరిస్థితుల ప్రోద్బలం వల్ల ఆ వ్యక్తి చేసే పనులకు అతన్నే పూర్తిగా బాధ్యుడిని చేయకూడదన్న ఆలోచన చట్టంలో సహితం లేకపోలేదు. ఇప్పుడున్న చట్టం కూడ అటువంటి కొన్ని పరిస్థితులను గుర్తిస్తుంది. వాటికి తక్కువ శిక్ష నిర్దేశిస్తుంది. అయితే చట్టం గుర్తించే ఆ పరిస్థితులు సామాజికం కాదు. ఉదాహరణకు, ఎదుటివారు అకస్మాత్తుగా రెచ్చగొట్టడం వల్ల కోపోద్రిక్తులయి చేసిన నేరానికి చట్టం తక్కువ శిక్ష వేస్తుంది. ఎందుకంటే ఆ చర్య ఆ వ్యక్తి అదుపులో లేనిది కాబట్టి. ఒక్కొక్కసారి అటువంటి నేరాలను చట్టం పూర్తిగా క్షమిస్తుంది కూడ. చట్టం గుర్తించే ఈ కారణాలకు సామాజిక ఆర్థిక కారణాలను కూడ చేర్చాలని మానవ హక్కుల దృక్పథం భావిస్తుంది.

నేరానికిగల అర్థం మారుతూ ఉంటుందనీ, నేరానికి సామాజిక నేపథ్యం ఉందనీ అనడం మానవ హక్కుల పేరిట నేరాలను సమర్థించడమేనని అనిపించవచ్చు. అంటే హింసనూ అభద్రతనూ కల్పించే చర్యలను సమర్థిస్తున్నామనుకోవచ్చు. అంటే మానవ హక్కులు అనేవి సంఘవ్యతిరేక భావన అనే అనుమానం ఇక్కడ మళ్లీ ధ్వనించవచ్చు. కానీ ఇది నిజం కాదు.

సామాజిక భద్రతను కాపాడడం అవసరమే. అందువల్ల నేరాలను నిరోధించడంలో నేరస్తులను శిక్షించడమూ అవసరమే.

## సామాజిక భద్రత

మనం సామాజిక భద్రతను ఎందుకు కోరుకుంటాం? భద్రత భద్రత కోసమేనా? అదే జీవిత లక్ష్యమా? కాదనేది స్పష్టమే. భద్రత ఎందుకు కోరుకుంటామంటే అదే లేకపోతే బలహీనులు, అమాయకులు ధనవంతుల, బలవంతుల దాడులకూ తెలివైన వాళ్ల మోసాలకూ దోపిడీకీ గురి అవుతారు కాబట్టి. భద్రత లేకపోతే భయం, అస్థిరత జీవితాన్ని ఆక్రమించుకుంటాయి కాబట్టి. ముఖ్యంగా పేదల, బలహీనుల, అమాయకుల జీవితాలకు అప్పుడు మానవ హక్కులనేవే ఉండవు. అవసరమైన పరిమాణంలో సామాజిక భద్రత లేకపోతే మానవ హక్కులకు మనుగడ ఉండదు. శాంతి భద్రతల యంత్రాంగం అందుకోసమే ఉంది. తమ సామాజిక ఆర్థిక పరిస్థితులు అనుమతించే మేరకు ప్రజలు జీవితాన్ని, స్వేచ్ఛను అనుభవించేందుకు, బలహీనులూ పేదలూ బలవంతుల నుండి రక్షణ పొందేందుకు, ఈ యంత్రాంగం అవసరం.

**అ**యితే మానవ హక్కులను అనుభవించగల పరిస్థితిని కల్పిస్తుందన్న కారణంగానే భద్రతను కాంక్షిస్తామనేది ఎప్పుడయితే గుర్తిస్తామో అప్పుడు సామాజిక భద్రతను కాపాడే పని కూడ మానవ హక్కులను గౌరవించే పద్ధతిలో జరగాలని గుర్తించగలుగుతాము. లేకపోతే లక్ష్యాన్ని సాధనం ధ్వంసం చేస్తుంది. ప్రజలు శాంతిగా బతకగలగాలని మానవ హక్కులకు భంగకరమైన అస్థిర, భయం నిండిన జీవితం నుండి వారికి స్వేచ్ఛ లభించాలనీ మనం సామాజిక భద్రతను కోరుకునేట్టయితే, ఆ అభద్రతను నిరోధించే కర్తవ్యం, శిక్షించే కర్తవ్యం కూడ మానవ హక్కులను కాపాడే పద్ధతిలోనే పెంపొందించే పద్ధతిలోనే జరగాలి. అంతేగానీ మానవ హక్కులను ధ్వంసం చేసే పద్ధతిలో కాదు. లేకపోతే వైద్యం రోగాన్ని నయం చేసే బదులు రోగిని అంతం చేస్తుంది.

తమకు ఉన్న సామాజిక ఆర్థిక అవకాశాలు మానవ హక్కులను అనుభవించడానికి ఏ మేరకు అవకాశం కల్పిస్తాయో ఆ మేరకు వాటిని ప్రశాంతంగా మనుషులు అనుభవించడానికి సామాజిక భద్రత అవసరం అని చూసాము. అయితే ప్రజలలో కొంత మందికి సామాజిక ఆర్థిక అవకాశాలు అతి తక్కువగా ఉండవచ్చు. అవి కల్పించే మానవ హక్కులు అతి స్వల్పం కావచ్చు. వేరే మాటలలో చెప్పాలంటే, సామాజిక భద్రతకు ఒక సామాజిక ఆర్థిక నేపథ్యం ఉంటుంది. ఒక్కొక్క సామాజిక వ్యవస్థలో కొంతమంది చాలా ధనవంతులు, మరికొందరు అత్యంత దరిద్రులు, అందువల్ల మానవ హక్కులు అతి తక్కువగలవారు ఉండవచ్చును. ఒక్కొక్క సామాజిక వ్యవస్థలో ఆర్థిక అసమానతలు మరీ అంత కొట్టొచ్చినట్టు ఉండకపోవచ్చును. కొన్ని సామాజిక వ్యవస్థలలో ప్రజలలో కొందరు సామాజికంగా ఎంతో బలహీనులు కావచ్చు. ఉదాహరణకు భారతదేశంలో దళితులు, స్త్రీల

లాగ ఈ వివక్ష, బలహీనతలు మరీ అంత తీవ్రంగా లేని సామాజిక వ్యవస్థలు కూడా ఉండవచ్చు.

## సామాజిక, ఆర్థిక నేపథ్యం

అటువంటి వివక్ష అనుభవించేవారు అంతకంటే భిన్నమైన సామాజిక వ్యవస్థ కావాలని న్యాయంగా కోరుకోవచ్చు. తాము మరింతగా మానవ హక్కులు అనుభవించగల సామాజిక పరిస్థితుల కోసం వారు సంఘటితంగా పోరాటం చేయవచ్చు. బంద్‌లు, రాస్తారోకోలు నిర్వహించవచ్చు. ఊరేగింపులు తీయవచ్చు. ధర్నాలు చేయవచ్చు.

అటువంటి పోరాటాలు చేసే వారిని తరచుగా 'భద్రతకు శత్రువులు'గా భావించడం జరుగుతుంది. కానీ వారు భద్రతకు శత్రువులు కారు. అప్పటి సామాజిక వ్యవస్థకు శత్రువులు. జీవితం, స్వేచ్ఛ, మానవ హక్కులు అనుభవించడానికి అందరికీ భద్రత కావాలి కాబట్టి భద్రతకు శత్రువులయిన మనుషులెవరూ ఉండరు. అయితే ఒక సామాజిక వ్యవస్థలో మానవ హక్కులు కరువైన వారు ఆ సామాజిక వ్యవస్థకు శత్రువులు కాగలరు. వారికి కూడ భద్రమైన జీవితమే కావాలి. కానీ తమకు మరింత నిండుగా మానవ హక్కులు కల్పించే భిన్నమైన సామాజిక ఆర్థిక వ్యవస్థను వారు కోరుకుంటారు. ఆ కోరిక, అటువంటి పోరాటాలు చారిత్రక ప్రగతికోసం కూడా అవసరం. అయితే అటువంటి పోరాటాలు ప్రస్తుత సమాజంలోని భద్రతకు భంగకరం కాగలవు. వాటివల్ల అభద్రత, హింసాత్మక నేరాలు జరిగితే సమాజం మొత్తంగా వాటిని ఉపేక్షించజాలదు, క్షమించజాలదు. ఆకారణంగానే భద్రతను కాపాడే వ్యవస్థలు మానవ హక్కులను గౌరవించాలి. అభద్రతకు ఉండే సామాజిక మూలాలను సానుభూతితో అర్థం చేసుకోవాలి. నిరసననూ పోరాటాలనూ నిర్దాక్షిణ్యంగా ఖండించే వైఖరి, వాటికి పాల్పడేవారి పట్ల మానవత ప్రదర్శించనక్కరలేదనీ వారికి మానవ హక్కులు ఉండవనీ అనుకునే వైఖరి, ప్రగతికి హానికరం.

నేరాలలో ముద్దాయిలయినవారి హక్కుల గురించి, నేరానికిచ్చే నిర్వచనాన్ని గురించి, శిక్షా ప్రమాణాల గురించి ఆలోచించాలనీ సున్నితంగా వ్యవహరించాలనీ భావించడానికి ఇవన్నీ కూడ కారణాలే. నేరానికీ శిక్షకూ ఇన్ని కోణాలున్నాయని ఎప్పుడయితే అర్థం చేసుకుంటామో, అప్పుడు ఈ క్రింది ప్రశ్నలు వేసుకోవలసి ఉంటుంది. నేరాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ఏ విధంగా నిర్వచించాలి? నేరాన్ని నిరోధించడానికి ఏ రకమైన పద్ధతులు ఉపయోగించవచ్చును? నేర పరిశోధన ఏ విధంగా చేయవచ్చు? నేరాలను ఏ విధంగా విచారించడం సబబుగా ఉంటుంది? చివరిగా, ఏ విధంగా శిక్షించడం సరయినది? నిజానికి ఇవన్నీ ఏ విధంగా ఉండాలి అనేదానికన్న ఏ విధంగా ఉండకూడదు అనేదానిమీద మన దృష్టి ఎక్కువగా ఉండాలి. వేరొక భాషలో చెప్పాలంటే ఈ కర్తవ్యాలకు మానవ హక్కుల స్పృహను ఏవిధంగా కలిగించాలన్నది మన సమస్య.

అభద్రతకు ఉండే సామాజిక మూలాలను సానుభూతితో అర్థం చేసుకోవాలి. నిరసననూ పోరాటాలనూ నిర్దాక్షిణ్యంగా ఖండించే వైఖరి, వాటికి పాల్పడేవారి పట్ల మానవత ప్రదర్శించనక్కరలేదనీ వారికి మానవ హక్కులు ఉండవనీ అనుకునే వైఖరి, ప్రగతికి హానికరం.

నేరానికి ఇచ్చే నిర్వచనం సామాజిక ఆర్థిక పరిస్థితుల పట్ల స్పృహ కలిగి ఉండాలన్నాము. ప్రస్తుతం భారతదేశంలో ఉన్న చట్టాలలో కొన్నిటికి మాత్రమే ఈ లక్షణం ఉంది. ఉదాహరణకు వరకట్న నిషేధ చట్టం, అంటరానితనాన్ని నిషేధించే చట్టం. సాధారణంగా మాత్రం 'నా ముందు అందరూ సమానమే' అని చట్టం అంటుంది. అంటే నేరాలను నిర్వచించేటప్పుడు, శిక్షలు నిర్దేశించేటప్పుడు నేరస్తుల సామాజిక ఆర్థిక పూర్వరంగాన్ని చట్టం పట్టించుకోదు. ఇది ఒక కోణంలో మంచిదే. ఎందుకంటే చట్టానికి ఉండే ఈ వైఖరి ఫలితంగా ధనవంతులకు, బలవంతులకు చట్టంలో ప్రత్యేక ప్రతిపత్తి ఏదీ ఉండదు. వాళ్ళపట్ల చట్టం ఉదారంగా ఉండడానికి వీలుండదు. అయితే వేరొక కోణంలో ఇది చెడ్డది. పేదలకూ సాంఘికంగా బలహీనులయిన వారికీ చట్టం చూపించవలసిన ఔదార్యం చూపించదు. లేమి నుండి, అణచివేత నుండి పుట్టే ఒత్తిడులను చట్టం తగినంతగా లెక్కలోనికి తీసుకోదు. మానవ హక్కుల దృక్కోణం నుండి చూసినప్పుడు ఇది చట్టంలోని ఒక లోపం.

నేరనిరోధం మాటకొస్తే, అది పూర్తిగా పోలీసుల బాధ్యత కాకూడదు. అది ప్రధానంగా సమాజం బాధ్యత. నేరానికి ప్రోద్బలం కల్పించే పరిస్థితులను తొలగించాలి లేదా బాగా తగ్గించాలి. పేదరికం, లేమి, నిరుద్యోగం ఉన్న సమాజాలు నేరానికి నిలయాలయి ఉంటాయి. సమాజంలో అన్ని స్థాయిలలోనూ వస్తు దాహాన్నీ, దయాదాక్షిణ్యాలు లేని పోటీనీ ప్రోత్సహించే పెట్టుబడిదారీ వ్యవస్థ కూడ నేరానికి నిలయమయి ఉంటుంది. ఈ పరిస్థితిని తొలగించడం, లేదా అదుపు చేయడం నేరాలను తగ్గించడానికి చాలా దోహదం చేయగలదు. దురదృష్టవశాత్తూ నేరానికీ సమాజానికీ మధ్యనున్న ఈ సంబంధం తరచుగా కనుమరుగవుతున్నది. నేరాలను అదుపు చేయడం కేవలం పోలీసుల కర్తవ్యమయినట్టు భావించడం జరుగుతున్నది.

## పోలీసుల పాత్ర

నేరాలను అదుపు చేయడానికి పోలీసులకు తెలిసిన ఒకే ఒక సులభ మార్గం బలప్రయోగం. బయట సమాజంలో హింస జరిగే అవకాశముందనుకొన్నప్పుడు, లేదా నేరాల సంఖ్య పెరిగినప్పుడు పోలీసులు సంఘ వ్యతిరేక శక్తులను అదుపులోకి తీసుకుందన్న వార్తలు పత్రికలలో చదువుతుంటాం. వాళ్ళను అదుపులోకి తీసుకునేది నేరం చేసినందుకు

కాదు, నేరం చేయకుండ ఉండేందుకు. ఈ అదుపులోకి తీసుకోవడం అనేది ఏ చట్టబద్ధతా లేకుండ జరగవచ్చు లేదా నేర విచారణ స్మృతి (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్) లోని సెక్షన్లు 107-100ల క్రిందనయినా జరగవచ్చు. ఎవరినయినా 'ముందు జాగ్రత్త'గా ప్రభుత్వమే బంధించదలచుకుంటే జాతీయ భద్రతా చట్టం (నాసా) వంటి చట్టాలను ప్రయోగిస్తుంది.

మానవ హక్కుల సూత్రాలు ఈ 'ముందు జాగ్రత్త' నిర్బంధాన్ని సహేతుకమైన సందేహంతో చూస్తాయి. ఆ నిర్బంధం ఫలితంగా కనీసం ఏదో ఒక నేరంలో ముద్దాయి కూడా కాని వ్యక్తి స్వేచ్ఛను హరించడం జరుగుతుంది. ఇది సూత్రరీత్యా అభ్యంతరకరమే. తరచుగా దుర్వినియోగానికి గురి అవుతుంటుంది కూడ. పాలకుల రాజకీయ ప్రత్యర్థులు, కార్మిక సంఘాల నిర్వాహకులు మొదలయిన వారిని కేవలం అధికారంలో ఉన్న వ్యక్తుల ప్రయోజనాలను, పార్టీల ప్రయోజనాలను కాపాడడం కోసం 'ముందు జాగ్రత్త'గా నిర్బంధించవచ్చు.

అభద్రతను అదుపు చేయడానికి పోలీసులకు తెలిసిన మరొక మార్గం భౌతిక బలప్రయోగం. పూర్తిగా శాంతియుతంగా నడిచే ధర్నాలను, ఊరేగింపులను, ప్రదర్శనలను సహితం చెదరగొట్టడానికి ఈ పద్ధతిని తరచుగా వినియోగించడం జరుగుతుంది.

కాబట్టి, నేరాలను అరికట్టే క్రమంలో అనేక హక్కుల అతిక్రమణ తరచుగా జరుగుతుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21లలోని వ్యక్తిగత స్వేచ్ఛ, సమావేశ స్వేచ్ఛ, భావప్రకటనా హక్కు మొదలయినవన్నీ అతిక్రమణకు గురవుతుంటాయి.

అందువల్ల, నేరనిరోధక చర్యలు మానవ హక్కుల ప్రమాదాలకు లోబడి ఉండేటట్టు చూడడానికి చాలా మానవ హక్కుల స్పృహ కావాలి.

ఇక నేరపరిశోధన లోనూ నేరవిచారణ లోనూ ఉండవలసిన మానవ హక్కుల సూత్రాలను చూద్దాం. నేరం రుజువు అయ్యేంత వరకు ముద్దాయి నిర్దోషి అనేదీ; నేరం రుజువు చేసే బాధ్యత ప్రాసిక్యూషన్ మీద ఉంటుందనేదీ; నేరం ఒప్పుకోవాలంటూ ముద్దాయిపైన ఏ రూపంలోనూ ఒత్తిడి పెట్టడానికి వీలు లేదనేదీ; ముద్దాయి మీద పెట్టిన అభియోగం సంపూర్ణంగా రుజువు చేయాలనేదీ; ఈ మొత్తం విచారణ క్రమం బహిరంగంగా, న్యాయంగా, నిష్పాక్షికంగా ఉండాలనేదీ నేరవిచారణకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలు.

భారతదేశ నేరస్మృతిని ఈ కోణం నుండి చూసినప్పుడు పెద్దగా లోపాలు కనిపించవు. అయితే నేర విచారణ వ్యవస్థ రోజువారీ వ్యవహారాలలో ఈ నేరస్మృతిని అతిక్రమించడం తరచుగా జరుగుతూ ఉంటుంది. దీని పూర్తి వివరాలలోకి ఇక్కడ పోలేము. ఎందుకంటే దీనికి వేరే ఒక పాఠం కేటాయించబడింది. (నేర విచారణ వ్యవస్థ – మానవ హక్కులు)

## శిక్ష–సిద్ధాంత దృక్పథం

ఇంక శిక్ష గురించి, దానికి అన్వయించే మానవ హక్కుల సూత్రాల గురించి చూద్దాం. సామాజిక భద్రతను కాపాడాలంటే నేరాలను విచారించి నేరస్తులను శిక్షించాలని చూసాం.

అయితే సామాజిక భద్రత దానంతటదే ఒక లక్ష్యం కాదనీ, జీవితాన్నీ స్వేచ్ఛనూ మానవ హక్కులనూ అనుభవించడానికి కావలసిన ప్రశాంతిని అందిచ్చే ఒక సాధనం మాత్రమేనని గుర్తుంచుకుంటే, సామాజిక భద్రతను కాపాడే ప్రక్రియ మానవ హక్కులను, ముఖ్యంగా జీవితాన్నీ స్వేచ్ఛనూ గౌరవించేదిగా ఉండాలని గ్రహించగలుగుతాం. ఆ ప్రక్రియ అశాంతికి ఉండే సామాజిక మూలాన్ని గురించి స్పృహ కలిగి ఉండాలి. అశాంతిని ఎందుకు శిక్షించాలి, ఏ విధంగా శిక్షించాలి అనే విషయంలో మానవ హక్కుల దృక్పథం కలిగి ఉండాలి. ఆ ప్రక్రియ ఇంతకంటే ఎక్కువ స్వేచ్ఛ, ఎక్కువ మానవ హక్కులు, మరింత నిండైన జీవితం కల్పించే సామాజిక ఆర్థిక వ్యవస్థను సాధించే మార్పులకు అవకాశమే లేకుండా చేసే విధంగా ఉండకూడదు.

శిక్షను గురించి కూడ ఈ వెలుగులోనే చూడాలి. శిక్ష రూపాలు కాలక్రమంలో ప్రజాస్వామిక దిశగా మారాయి. కొరడా దెబ్బలు, కాళ్లు చేతుల నరికివేత, కాలిన ఇనుముతో వాతలు పెట్టడం మొదలయిన శిక్షలు తరతమ భేదాలతో అన్ని దేశాలలోనూ ఒకప్పుడు అమలులో ఉండేవి. ఈ రోజు సౌదీ అరేబియా వంటి కొన్ని దేశాలను మినహాయించి, వేరే ఏ దేశంలోనయినా ఖైదులో నిర్బంధం లేక జుర్మానాలు మాత్రమే చట్టం ఆమోదించే శిక్షలు. భౌతికదండన చట్టం నుండి దాదాపు చెరిగిపోయింది. మరణ దండన ఒక్కటే దీనికి మినహాయింపు. చాలా దేశాలు మరణ దండనను రద్దు చేసాయి గానీ అనేక ఇతర దేశాలు (భారతదేశం వాటిలో ఒకటి) దానిని కొనసాగిస్తున్నాయి. మానవ హక్కుల ఉద్యమం మరణ దండనను సంపూర్ణంగా రద్దు చేయాలని కోరడానికి గల కారణాలలో ఒకటేమింటే వాతలు పెట్టడం, కాళ్లూ చేతులు నరకడం వంటి భౌతిక దండనలన్నిటినీ రద్దు చేసినాక ఈ ఒక్క దండనను మిగల్చడానికి సహేతుకమైన కారణం ఏదీ లేదు.

శిక్ష ఏ రూపంలో ఉండాలన్న ప్రశ్నే కాకుండ, అసలు శిక్ష ఎందుకు వేయాలన్న ప్రశ్న కూడా వేసుకోవాలి. సామాజిక భద్రతను కాపాడడంలో శిక్షాస్మృతికి ఉండే స్థానం ఏమిటి? ఈ ప్రశ్నలకు మనం చెప్పుకునే జవాబు శిక్షల స్వభావాన్ని గురించి, తీవ్రత గురించి మనకుండే అవగాహన మీద ఆధారపడి ఉంటుంది. న్యాయమూర్తులూ శాసనకర్తలూ దీనికి చెప్పే జవాబు ఏమిటంటే ఒకరికి హాని చేసినవారు శిక్ష అనుభవించకపోతే సమాజ నైతికత దెబ్బతింటుంది. కాబట్టి సామాజిక నైతిక స్పృహకు జవాబు చెప్పడానికి నేరస్తులను శిక్షించడం అవసరం. ఇది శిక్ష వేయవలసిన ఆవశ్యకతను వివరిస్తుందే తప్ప ఒక నేరం చేసిన వారికి ఎంత శిక్ష వేయాలని చెప్పదు.

ప్రతీకార శిక్షా సిద్ధాంతం పై ప్రశ్నకు తీవ్ర స్వభావంగల ఒక సమాధానం చెప్తుంది. నేరానికి పరిహారం శిక్ష అని ఈ సిద్ధాంతం చెప్తుంది. అంటే నేరస్తుడు బాధితునికి హాని కలిగించాడు కాబట్టి తాను కూడ బాధ అనుభవించవలసిందేనని అర్థం. ఇది సమాజం విధించే శిక్ష రూపంలో కనిపించే బాధితుని ప్రతీకారవాంఛ తప్ప వేరే ఏమీకాదు. అయితే

ప్రతీకారం అనాగరికమనీ, న్యాయం దానిని ప్రాతిపదిక చేసుకోవడానికి వీలులేదనీ భావించినప్పుడు అదే ప్రతీకారం సమాజం ఎంతో ఆలోచనాత్మకంగా వేసే శిక్ష రూపంలో ఎలా పునర్దర్శనం ఇస్తుంది? అందుకే ఈ ప్రతీకార శిక్షా సిద్ధాంతాన్ని ఆమోదించడానికి వీలులేదు. సమాజం నేరస్తుడిని శిక్షించేది ప్రతీకారం తీర్చుకోవడానికి కాదు, తను చేసిన అన్యాయాన్ని సవరించడానికి. శిక్షకు ప్రమాణం న్యాయం అయి ఉండాలి గాని ప్రతీకారం (లేక పరిహారం) కాదు. శిక్ష పరిమాణాన్ని నిర్ణయించడంలో న్యాయం అనేది పరిహారం అంత స్పష్టమైన ప్రమాణం కాకపోవచ్చు. అయినప్పటికీ జీవితం, స్వేచ్ఛ, మానవహక్కుల వంటి విలువల్ని గౌరవించే నాగరిక సమాజానికి అదే తగిన ప్రమాణం.

ఉదాహరణకు పరిహార సిద్ధాంతం ఏమంటుందంటే నువ్వు చంపావు కాబట్టి నువ్వూ చావవలసిందే అంటుంది. న్యాయం అనే భావన నిర్ధారించే శిక్ష ఆయా పరిస్థితులను బట్టి అంతకంటే చాలా ఉదారంగా ఉండగలదు. ఆ అన్యాయాన్ని సవరించడానికి ఒక సంవత్సరం జైలు శిక్ష చాలునని భావించవచ్చును కూడ. కొన్ని సంవత్సరాల క్రితం ఇంగ్లండ్‌లో జరిగిన ఒక ఘటనను ఇక్కడ ఉదాహరణగా తీసుకోవచ్చు. తన భర్తను చంపిన ఒక స్త్రీని ఒక కోర్టు విచారించింది. ఆమె భర్త ఆమెను చాలా ఏళ్ళుగా అతిక్రూరంగా హింసిస్తుంటే ఆమె భరించలేక అతనిని చంపింది. ఆమె నేరం రుజువయింది. అయితే ఆ నేరం జరిగిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న న్యాయస్థానం అరెస్టు రూపంలోనూ నేరవిచారణ రూపంలోనూ ఇప్పటికే ఆమె అనుభవించిన శిక్ష చాలునని నిర్ణయించి ఆమెను విడుదల చేసింది. పరిహార సిద్ధాంతం బోధించే వైఖరికి ఇది చాలా భిన్నమైనది. శిక్ష పరిమాణాన్ని నిర్ణయించడానికి న్యాయం అనే భావన మనకిచ్చే ప్రమాణం అనేక సందర్భాలలో అస్పష్టమయినదయితే కావచ్చును గాక, అదే సరయినది.

శిక్షకు సంబంధించిన మరొక సిద్ధాంతం నేర నిరోధక సిద్ధాంతం. అంటే ఒక నేరస్తుడికి ఎంత శిక్ష వేయాలంటే రేపు నేరాలు చేయబోయే వారిని చేయకుండ నిరోధించేటంత వేయాలి. ఇది పైకి సహేతుకంగానే కనిపించవచ్చు. కానీ ఈ అవగాహనలో ఒక నేరానికి ఎంత శిక్ష ఉచితంగా ఉంటుందనేది ఆ ఘటనలో జరిగిన అన్యాయాన్ని సవరించడానికి ఎంత శిక్ష అవసరం అన్నదాన్నిబట్టి కాక భవిష్యత్ నేరాలను నిరోధించడానికి ఎంత శిక్ష అవసరం అనేదాన్నిబట్టి నిర్ణయించబడుతుంది. కాబట్టి రాము అనే వ్యక్తి పేదరికంవల్ల దొంగతనం చేస్తే అతనికి తక్కువ శిక్ష వేస్తే సరిపోతుందనవచ్చు. కాని రేపు ఇంకొక సోము లేక దాము పేదరికాన్ని కారణంగా చూపించి దొంగతనాలు చేయకుండ ఉండాలంటే ఎంత శిక్ష అవసరమో అంత వేయాలని న్యాయమూర్తికి చెప్తుంది ఈ సిద్ధాంతం. రాముకు అతని నేరానికి ఉచితమైన దానికంటె ఎక్కువ శిక్ష పడవచ్చు.

శిక్షకు సంబంధించిన మూడవ సిద్ధాంతం సంస్కరణ సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రకారం, నేరస్తుడు తాను చేసిన దానికి పశ్చాత్తాపం చెంది ఇంకెప్పుడూ అటువంటి పని చేయనన్న సంకల్పం పొందే పాటి శిక్ష వేస్తే సరిపోతుంది. ఉదాహరణకు ఆ వ్యక్తిని కుటుంబం నుండి

శిక్షకు ప్రమాణం న్యాయం అయి ఉండాలి గాని ప్రతీకారం (లేక పరిహారం) కాదు. శిక్ష పరిమాణాన్ని నిర్ణయించడంలో న్యాయం అనేది పరిహారం అంత స్పష్టమైన ప్రమాణం కాకపోవచ్చు. అయినప్పటికీ జీవితం, స్వేచ్ఛ, మానవహక్కుల వంటి విలువల్ని గౌరవించే నాగరిక సమాజానికి అదే తగిన ప్రమాణం.

బంధుమిత్రుల నుండి దూరంగా కొంత కాలం ఖైదులో ఉంచితే అటువంటి సంకల్పం రావడానికి అది సరిపోవచ్చు. పై రెండు ప్రమాణాలకంటే ఇది సహేతుకమైనది. కానీ దీనితో ఒకటి రెండు సమస్యలున్నాయి. పేదరికపు ఒత్తిడి వల్ల నేరానికి పాల్పడిన వ్యక్తి నిజంగానే పశ్చాత్తాపం చెందవచ్చును. కానీ ఖైదు నుండి బయటికి పోయిన తరువాత అవే పరిస్థితులు ఎదురయినట్టయితే తిరిగి అదే నేరం చేయవచ్చు. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఖైదీని సంస్కరించడంతోపాటు అతని పరిస్థితులను సంస్కరించే ప్రయత్నం కూడా – ఉదాహరణకు ఖైదు నుండి బయటకు పోయిన తరువాత అతనికొక ఉద్యోగం చూపించడం అవసరం కావచ్చు.

ఇవి శిక్షకు సంబంధించిన సైద్ధాంతిక ప్రతిపాదనలు. మరి మన దేశంలో శిక్షాస్మృతి వెనుకనున్న తాత్విక ధోరణి ఏమిటి? దురదృష్టవశాత్తు అది న్యాయమూర్తుల వైఖరిమీద, జైలు అధికార్ల వైఖరిమీద ఆధారపడింది. నేరస్మృతిలో ఎక్కడా శిక్షకు సంబంధించిన సైద్ధాంతిక ప్రమాణాలు చర్చించబడలేదు. శిక్ష వేయడంలో గల లక్ష్యం ఇదనిగానీ, అదనిగానీ భారత శిక్ష్మాస్మృతి చెప్పదు. జుర్మానా, ఖైదు అనే రెండు రూపాల శిక్షను మాత్రమే శిక్షాస్మృతి గుర్తిస్తుంది. (మరణ దండన శిక్షాస్మృతి గుర్తించే మరొక శిక్ష). ఒక్కొక్క నేరానికి, కోర్టు విధించగల గరిష్ఠ శిక్షను మాత్రమే శిక్షాస్మృతి నిర్దేశిస్తుంది. ఆ కనిషపరిమాణానికి లోబడి ఎంత శిక్ష వేసేదీ నిర్ణయించే విచక్షణ కోర్టుకే విడిచిపెడుతుంది. (కొన్ని నేరాలకు కనిష్ఠ శిక్ష కూడ నిర్దేశించబడింది గానీ అది అరుదు). ఈ విచక్షణ మంచిదే. ఎందుకంటే తద్వారా ఆ కేసుకు సంబంధించిన సామాజిక, నైతిక అంశాలను లెక్కలోకి తీసుకొని ఏపాటి శిక్ష వేస్తే ఉచితంగా ఉంటుందో నిర్ణయించే అవకాశం న్యాయస్థానానికి ఉంటుంది. కేసును పూర్తిగా విచారించి, నేరాన్ని నిర్ధారించిన తరువాత కూడా శిక్ష ఎంత వేయాలన్న విషయంలో ముద్దాయి అభ్యర్ధనను న్యాయమూర్తి వినాలన్న నియమాన్ని కూడా నేర విచారణ స్మృతి పెట్టింది. ఆ సమయంలో కూడా ఆ నేరం వెనుక ఉన్న సామాజిక, మానసిక, నైతిక భూమికను మొత్తంగా లెక్కలోకి తీసుకునే అవకాశం న్యాయస్థానానికి ఉండాలన్నది శిక్షాస్మృతి ఉద్దేశ్యం. కాని న్యాయమూర్తులకు సామాజిక, నైతిక విషయాల గురించి ఉండే

అవగాహనలో మానవ హక్కుల స్పృహ తగినంతగా ఉండకపోవచ్చును. కాబట్టి మానవ హక్కుల చైతన్యాన్ని పెంచడం అవసరం. అప్పుడు చట్టం కల్పించే విచక్షణ మానవ హక్కుల పెంపుదలకు ఉపయోగపడుతుంది.

అయితే న్యాయమూర్తులలో అధికభాగం శిక్షలు వేసేటప్పుడు నేర నిరోధనను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంటారని చెప్పవచ్చు. కోర్టులు విధించే శిక్షను అమలు చేసే జైలు అధికారుల మాటకొస్తే, వాళ్ళ దృష్టిలోనూ నేర నిరోధానికి చాలా ప్రాముఖ్యం ఉంది. ఒకసారి ఖైదుకు పోయిన తరువాత నేరస్తుడు అనుభవించేది జైలు అధికారులు విశ్వసించే శిక్షే తప్ప న్యాయమూర్తి ఉద్దేశించిన శిక్ష కాదు. శిక్ష పరిమాణం విషయం మాత్రమే న్యాయమూర్తి నిర్ణయించిన శిక్ష అమలవుతుంది. జైలు అధికార్లలో అధిక భాగం ఖైదీని అమానవీయమైన స్థితిలో ఉంచి అవమానపరిస్తేనే శిక్ష ఫలితాన్ని ఇస్తుందని నమ్ముతారు. ఇతర చట్టాలలో అధికార్లకు ఎవ్వరికీ లేని విచక్షణ జైలు చట్టాలు జైలు అధికార్లకు ఇస్తాయి. జైళ్ళు సమాజం కళ్ళకు కనిపించవు. అవి జైలు అధికార్ల జాగీర్లు.

1978 తరువాత భారత సుప్రీంకోర్టు అనేక తీర్పులలో ఖైదీల హక్కుల గురించి చెప్పింది. కేవలం జైలులో పెట్టడం వల్ల కోల్పోయే హక్కులను మినహాయించి మిగిలిన అన్ని ప్రాథమిక హక్కులూ ఖైదీలకు ఉంటాయని చెప్పింది. అయితే ఈ హక్కుల స్పృహ ఇంకా జైలు అధికారుల దాకా చేరలేదు. జైళ్ళ సంస్కరణ గురించి మాట్లాడేటప్పుడు వీటిని పరిగణనలోనికి తీసుకోవాలి.

# నేర విచారణ వ్యవస్థ - మానవ హక్కులు

భారతదేశంలోని నేరవిచారణ వ్యవస్థ కొన్ని ప్రాథమిక సూత్రాల మీద ఆధారపడింది.

అందులో మొదటిది, చట్టం ముందు అందరూ సమానమనీ చట్టం అందరినీ సమానంగా కాపాడాలనీ చెప్పే ప్రాథమిక హక్కు. (భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 14). దీనికి చాలా అర్థాలున్నాయి. ఒకటేమింటే, బలవంతులు చేసిన నేరాలనూ బలహీనులు చేసిన నేరాలనూ చట్టం ఒకే రకంగా చూడాలి. నేర స్వభావాన్ని బట్టి తేడా చూడాలే తప్ప నేరంచేసిన వారి సామాజిక ఆర్థిక, రాజకీయ హోదాను బట్టి కాదు.

ఉదాహరణకు, నేరం తీవ్రమయినదయితే కోర్టు త్వరగా బెయిలు ఇవ్వకపోవచ్చు. సామాన్య నేరమయితే బెయిలు మంజూరు చేయడానికి తటపటాయించకూడదు. అంతే తప్ప నేరం చేసిన వ్యక్తి సామాజిక హోదాను బట్టి పోకూడదు.

కె. బాలగోపాల్

మానవహక్కుల పి.జి. డిప్లొమా కోర్సు కోసం రాసిన పాఠం

మరొక అర్థమేమిటంటే పేదల మీద బలహీనుల మీద జరిగిన నేరాలనూ, ధనవంతులమీదా బలవంతులమీదా జరిగిన నేరాలనూ ఒకేరకంగా చూడాలి.

ఒకే రకంగా 'చూడాలి' అంటే అర్థం కోర్టులు ఒకే రకంగా చూడాలని మాత్రమే కాదు, నేరవిచారణ లోనే కాక నేరపరిశోధనలో కూడ (అంటే న్యాయస్థానాలలోనే కాక పోలీస్‌స్టేషన్‌లో కూడా) సమదృష్టి ఉండాలని అర్థం. అంటే ఒక భిక్షగాడిని హత్యచేసినా దేశ ప్రధానిని హత్యచేసినా ఒకే రకంగా స్పందించాలని అర్థం.

సాధారణంగా జరిగేది ఇది కాదని మనకు తెలుసు.

నేరస్మృతి భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను అనుసరించి నిష్పాక్షికమైన నేరవిచారణ పద్ధతిని నిర్దేశించింది. అయితే ఆచరణ అందుకు భిన్నంగా ఉంది. చట్టాలు అమలయినప్పుడే ఆచరణలో వాటిని అనుభవించగలుగుతాము. చట్టంలోని హక్కులను సమగ్రంగా అమలు చేసినప్పుడే వాటిని పొందగలుగుతాము. భిక్షగాడి హత్య, ప్రధానమంత్రి హత్య అనే ఉదాహరణనే తీసుకోనక్కరలేదు. వాటి విషయంలో నేరవిచారణ వ్యవస్థ చూపించే వివక్షను 'అర్థం' చేసుకోగలమనుకున్నా వాటిలాగా 'అర్థం' చేసుకోవడం సాధ్యపడని స్థాయిలో కూడ నేరాలను విచారించేటప్పుడు నేరవిచారణ వ్యవస్థ అనుసరించే వైఖరిలో గణనీయమైన తేడాలు కనిపిస్తాయి. అది ప్రధానంగా పోలీసు యంత్రాంగానికి వర్తిస్తుంది. కానీ న్యాయమూర్తులు సహితం ఈ విమర్శను తప్పించుకోజాలరు. మానవహక్కుల ఉద్యమం, మానవహక్కుల స్పృహ అవసరం అని భావించడానికి గల కారణాలలో ఇదొక ముఖ్యకారణం. చట్టం ముందు అందరూ సమానమేననీ చట్టం అందరికీ సమానరక్షణ ఇవ్వాలనీ చెప్పే ప్రాథమిక హక్కు మనకు ఉందని సంతృప్తి చెంది ఊరుకోలేము.

చట్టం ముందర సమానత్వం అనే హక్కుకు మరొక అర్థం ఉంది. నేరవిచారణలో చట్టం ముద్దాయికీ బాధితులకూ సమాన సంరక్షణ కల్పించాలన్న అర్థం కూడా ఉంది. బాధితుల సంరక్షణ అంటే అర్థం – నేరాన్ని సమగ్రంగా పరిశోధించాలి. దోషులను తగినరీతిలో శిక్షించాలి. విచారణలో బాధితులు, సాక్షులు నిర్భయంగా పాల్గొనగలగాలి. న్యాయం పొందే హక్కుకు, నేరస్తుడిని గుర్తించడంలో నేరవిచారణ వ్యవస్థకు తోడ్పడే హక్కుకు రక్షణ ఉండాలి. ముద్దాయి సంరక్షణ అంటే అర్థం – న్యాయమైన, నిష్పాక్షికమైన విచారణ లేకుండ, తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవడానికి అన్ని అవకాశాలు ఇవ్వకుండ ముద్దాయిని నేరస్తుడిగా ప్రకటించడానికి వీలులేదని.

ముద్దాయికి చట్టం సంరక్షణ కల్పిస్తుందంటే అర్థం చట్టానికి నేరాలపట్ల, నేరస్తులపట్ల ఉదాసీనవైఖరి ఉందని కాదు. నేరం బాధితుల హక్కులను అతిక్రమిస్తుంది. కాబట్టి చట్టానికి నేరంపట్ల ఉదాసీన వైఖరి ఉండజాలదు. (అయితే నేరానికి గల సామాజిక కారణాల గురించి చట్టానికి స్పృహ ఉండవలసిన అవసరం ఉందన్న విషయం తరువాతి పాఠంలో చూద్దాం) అయినప్పటికీ నేరవిచారణలో ముద్దాయికి చట్టం సంరక్షణ కల్పించడానికి ఒక కారణం

> ఒకే రకంగా 'చూడాలి' అంటే అర్థం కోర్టులు ఒకే రకంగా చూడాలని మాత్రమే కాదు, నేరవిచారణ లోనే కాక నేరపరిశోధనలో కూడ (అంటే న్యాయస్థానాలలోనే కాక పోలీస్‌స్టేషన్‌లో కూడా) సమదృష్టి ఉండాలని అర్థం. అంటే ఒక భిక్షగాడిని హత్యచేసినా దేశ ప్రధానిని హత్యచేసినా ఒకే రకంగా స్పందించాలని అర్థం.

ఉంది. అది ఒక మౌలిక ప్రజాతంత్ర సూత్రం. అదేమిటంటే, నేరం చేసినవారిని శిక్షించవలసిందేకానీ నేరస్థులు కాని వారినెవ్వరినీ శిక్షించడానికి వీలులేదు. అయితే చట్టం ఈ సూత్రానికి భరోసా ఏవిధంగా ఇవ్వగలుగుతుంది? నూటికి నూరుశాతం భరోసా ఇవ్వలేదుకానీ, భారతదేశ నేరస్మృతిలో ఈ సూత్రం అమలుకు అవసరమైన అంశాలు చాలా ఉన్నాయి.

వీటన్నిటిలోకీ ప్రాథమికమైనది, భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కయిన ఆర్టికల్ 21. చట్టం నిర్దేశించే పద్ధతిలో తప్ప మరొకరకంగా ఎవరి ప్రాణాన్ని గానీ స్వేచ్ఛను గానీ తీసేయడానికి వీలులేదనే హక్కు ఇది. నేరం చేసినట్టు రుజువు అయినట్టయితే ముద్దాయి తన స్వేచ్ఛను, లేదా ప్రాణాన్ని కోల్పోవలసి ఉంటుంది కాబట్టి నేరాన్ని రుజువుచేసే పద్ధతి యావత్తు చట్టం ప్రకారం ఉండాలి. అంటే నేరవిచారణ పద్ధతిలోని ప్రతీ ఘట్టం చట్టం నిర్దేశించినట్టే ఉండాలని అర్థం. చట్టం ఆ పద్ధతిని నిర్దేశించాలి, విచారణ దానిని పాటించాలి. చట్టం నిర్దేశించిన పద్ధతికంటే భిన్నంగా జరిగే నేరవిచారణ, వేసే శిక్ష, ఆర్టికల్ 21లోని ప్రాథమిక హక్కుకు విరుద్ధం అవుతాయి. చట్టం నిర్దేశించే నేరవిచారణ పద్ధతి నేరవిధానస్మృతి (సిఆర్‌పిసి) లోనూ భారత సాక్ష్యాల చట్టంలోనూ వివరించబడింది. ఈ పద్ధతి ముద్దాయి హక్కులను కాపాడుతూ అదే సమయంలో నేరస్తుడిని గుర్తించడానికి ప్రాసిక్యూషన్‌కు సహేతుకమైన అవకాశాలు కల్పిస్తుంది.

ఆర్టికల్ 21 కల్పించే రక్షణ పైకి కన్పించేంత గంభీరమైనది కాదు. ముద్దాయి నేరస్తుడని రుజువు చేసే క్రమంలో ప్రతీ ఘట్టం ఏదో ఒక చట్టం నిర్దేశించినట్టు ఉండాలని మాత్రమే ఆర్టికల్ 21 ఉంటుంది. కానీ ఆ చట్టమే అన్యాయంగా, అహేతుకంగా ఉంటే ఏం అవుతుంది? ఉదాహరణకు పోలీసులు అనుమానితుడిని హింసించి ఒప్పుకోలు సేకరించవచ్చుననీ ఆ ఒప్పుకోలు ఆధారంగా న్యాయస్థానం నేరనిర్ధారణ చేయవచ్చుననీ ఒక చట్టం చేసారనుకోండి. అదొక అన్యాయమైన చట్టం ఆధారంగా రూపొందించిన చట్టబద్ధమైన పద్ధతి అవుతుంది. ఎందుకంటే పోలీసు కస్టడీలో చిత్రహింసలు పెట్టినట్టయితే ఎవరయినా సరే చావు తప్పించుకోవడానికి ఏ నేరమయినా ఒప్పేసుకుంటారు.

అయితే అటువంటి చట్టం భారతరాజ్యాంగం ప్రకారం చెల్లుబాటు కాదు. ఎవరిచేతనూ బలవంతంగా నేరం ఒప్పించడానికి వీలులేదని భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 20 (3) అంటుంది. అదొక ప్రాథమిక హక్కు కాబట్టి, ముద్దాయిని హింసించి నేరం ఒప్పించి ఆ ఒప్పుకోలు ఆధారంగా నేరనిర్ధారణ చేసే నేర విచారణ పద్ధతి రాజ్యాంగ విరుద్ధం అవుతుంది.

అయితే నేరవిచారణలో మరీ అంత తీవ్ర అన్యాయమైన పద్ధతిని ప్రవేశపెట్టే ప్రయత్నాన్ని భారతరాజ్యాంగం ఆమోదించదుగానీ, కొంత తక్కువ మోతాదులో అన్యాయమైన పద్ధతులు, లేక పరోక్షంగా అన్యాయమైన పద్ధతులు చట్టబద్ధమైనవిగా చెల్లుబాటయ్యే అవకాశం లేకపోలేదు. మరి అటువంటప్పుడు, బాధితులకు చట్టం ఎంత రక్షణ కల్పిస్తుందో ముద్దాయికి కూడా అంత కల్పించాలన్న సూత్రాన్ని ఎట్లా సాధించాలి?

1978లో ఇచ్చిన ఒక తీర్పులో సుప్రీంకోర్టు నేరవిచారణలో ముద్దాయి హక్కులకు బలం చేకూర్చే వ్యాఖ్యానం చేసింది. ప్రాణాన్నీ స్వేచ్ఛనూ తీసివేసే అవకాశం కల్పించే చట్టం ఎటువంటి చట్టమైనా కావడానికి వీలులేదని, ఆ చట్టం నిష్పాక్షికమైనది, న్యాయమైనది, సహేతుకమైనది అయి ఉండాలని ఆ తీర్పులో సుప్రీంకోర్టు అనింది. అంటే, నేరవిచారణ పద్ధతి చట్టబద్ధమై ఉండటమే కాదు, దానిని నిర్వహించే పద్ధతి న్యాయంగా, నిష్పాక్షికంగా, సహేతుకంగా ఉండాలి.

ఈ తీర్పు ఫలితంగా పరిస్థితి కొంత మెరుగయిందిగానీ సమస్య పూర్తిగా పరిష్కారం అయిందని ఇప్పటికీ చెప్పలేము. ఎందుకంటే ఒక పద్ధతి న్యాయం, నిష్పాక్షికం, సహేతుకం అవునా కాదా అనేది ఒకమేరకు మన అభిప్రాయాన్ని బట్టి ఉంటుంది. నిజమే ఈ విషయంలో సుప్రీంకోర్టు అభిప్రాయం శిరోధార్యమే, అయినప్పటికీ అది పొరబాట్లకు అతీతం మాత్రం కాదు.

టెర్రరిస్టు విచ్ఛిన్నకర కార్యకలాపాల చట్టాన్ని (అంటే 'టాడా'ను) ఇక్కడ ఉదాహరణగా తీసుకోవచ్చు. ఈ చట్టం టెర్రరిస్టు నేరాలు అనే కొత్త నేరాన్ని నిర్వచిస్తుంది. వాటిని విచారించడానికి మామూలు నేరవిచారణ పద్ధతిని సవరించి కొత్త పద్ధతిని ప్రవేశపెడుతుంది. టెర్రరిస్టు నేరాల నిర్వచనము, వాటిని విచారించడం కోసం సవరించిన పద్ధతి 'న్యాయం, నిష్పాక్షికం, సహేతుకం' అనే ప్రమాణానికి నిలవజాలవని మానవహక్కుల కార్యకర్తలు, రాజ్యాంగనిపుణులు, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చాలామంది అభిప్రాయపడినప్పటికీ సుప్రీంకోర్టు మాత్రం ఆ చట్టం 'న్యాయం, నిష్పాక్షికం, సహేతుకం' అనే ప్రమాణానికి నిలుస్తుందనే తీర్పు ఇచ్చింది.

కాబట్టి, బాధితుల హక్కులు కాపాడాలన్న ఆత్రుతలో ముద్దాయి హక్కులను సంరక్షించే బాధ్యతను చట్టం విస్మరించకుండ ఉండాలంటే ఏం చేయాలన్నది ఇప్పటికీ సమస్యగానే ఉందని చెప్పాలి. నేరవిచారణలో ముద్దాయి హక్కులను సంరక్షించవలసిన ఆవశ్యకత

ఏమిటో మరొకసారి ఇక్కడ నొక్కిచెప్పడం అవసరం. దానివెనుక ఉన్న ఉద్దేశ్యం నేరాలను ప్రోత్సహించాలని కాదు, సమాజాన్ని నేరాలనుండి, నేరస్తులనుండి కాపాడాలన్న ఆరాటంలో అమాయకులకు శిక్ష వేయకుండ చూడాలన్నదే ఇక్కడి లక్ష్యం.

అయితే టెర్రరిస్టు నేరాల వంటి అసాధారణ నేరాలను పక్కనపెట్టి సాధారణ నేరాలను తీసుకుంటే ఇప్పుడున్న నేరవిచారణ పద్ధతి మొత్తంమీద నిష్పాక్షికమైనదనే చెప్పాలి. సమస్యలు ఎక్కువగా వచ్చేది ఈ పద్ధతిని అతిక్రమించే చర్యలనుండి, లేక ఈ పద్ధతిలోని అస్పష్టమైన అంశాలను దుర్వినియోగం చేసే చర్యలనుండి. అందుకోసమే మానవహక్కుల చైతన్యం, నిఘా చాలా అవసరం.

## సాక్ష్యాల చట్టం

ఈ నేరవిచారణ పద్ధతి నేర విధానస్మృతి(సిఆర్‌పిసి)లోనూ సాక్ష్యాలచట్టం లోనూ వివరించబడింది. ఇవి గత శతాబ్దంలో తయారుచేసిన చట్టాలు. అప్పటికి భారతదేశానికొక రాజ్యాంగం లేదు. భారతపౌరులకు ప్రాథమిక హక్కులు లేవు. అయినప్పటికీ మొత్తం మీద ఈ పద్ధతిలో రెండు ప్రాథమిక లక్షణాలున్నాయి. ఒకటి, ప్రాసిక్యూషన్ నేరాన్ని రుజువు చేసేంతవరకు ముద్దాయిని నిర్దోషిగానే పరిగణించడం. రెండు సహేతుకమైన ఏ సందేహానికీ తావులేనంత సంపూర్ణంగా రుజువయినప్పుడే నేరం రుజువైనట్టు భావించడం. ఇందులో మొదటి సూత్రం సాక్ష్యాలచట్టం సెక్షన్లు 101-104లో అంతర్లీనంగా ఉంది. రెండవది ఇంగ్లీష్ చట్టాలను ఆధారం చేసుకొని కోర్టులు చేసిన వ్యాఖ్యానాల ద్వారా స్థిరపడింది.

అందులో భాగంగా, సాక్ష్యాలచట్టంలోని సెక్షన్ 25 ఏమంటుందంటే, పోలీసులకు ఒక వ్యక్తి ఇచ్చే ఒప్పుకోలును అతనికి వ్యతిరేకంగా సాక్ష్యంగా వాడుకోవడానికి వీలులేదని. అంటే, ముద్దాయిని పోలీసు కస్టడిలో హింసించి నేరం ఒప్పించి ఆ ఒప్పుకోలును కోర్టులో సాక్ష్యంగా పెట్టడానికి వీలులేదని భారతరాజ్యాంగం ఉనికిలోనికి రాకముందే చట్టం ప్రకటించింది. (రాజ్యాంగం వచ్చిన తరువాత ఇది ఒక ప్రాథమిక హక్కు అయింది.)

అయినప్పటికీ మన దేశంలో పోలీసులు తరచుగా ముద్దాయిలను చిత్రహింసలకు గురిచేసి బలవంతంగా వారినుండి ఒప్పుకోలు తీసుకుంటారనేది అందరికీ తెలిసిన సంగతే. ఈ పని ఎందుకు చేస్తారంటే, పోలీసుల కస్టడీలో ఇచ్చిన సమాచారాన్ని అనుసరించి ఏదైనా వస్తువును పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగితే, ఆ వస్తువునూ ఆ మేరకు ఇచ్చిన సమాచారానీ కోర్టులో సాక్ష్యంగా ప్రవేశపెట్టవచ్చునని సాక్ష్యాల చట్టంలోని సెక్షన్ 27 అంటుంది. అంటే, బలవంతపు ఒప్పుకోలును సాక్ష్యంగా ప్రవేశపెట్టి నేరాన్ని రుజువుచేసే అవకాశం లేదని సెక్షన్ 25 అంటుండగా, బలవంతంగా చెప్పించిన సమాచారం ఆధారంగా స్వాధీనం చేసుకున్న వస్తువును, ఆ మేరకు ఆ సమాచారాన్ని సాక్ష్యంగా ప్రవేశపెట్టే అవకాశం సెక్షన్ 27 ఇస్తుంది. చట్టం కల్పించే ఈ అవకాశం ఫలితంగా పోలీసులు తమ కస్టడీలో

ఉన్నవారిపైన పెద్దఎత్తున హింసకు పాల్పడుతుంటారు. ఈ చిత్రహింసల ఫలితంగా అంగవైకల్యం, మరణం తరచుగా సంభవిస్తుంటాయి. కాబట్టి ఈ విషయంలో మానవహక్కుల చైతన్యం ఆచరణ చాలా అవసరం.

దీనిని బట్టి, ఒప్పుకోలు కాక ఇతర సమాచారాన్ని రాబట్టడం కోసం చిత్రహింసలు పెట్టడాన్ని చట్టం ఆమోదిస్తుందనుకుంటే పొరబాటే. అది నిజంకాదు. అందుకు విరుద్ధంగా, సమాచారం సేకరించడానికి చిత్రహింసలు ప్రయోగించడం నేరమనీ ఆ పనిచేసిన పోలీస్ అధికారికి (గాయతీవ్రతను బట్టి) 10 సంవత్సరాల దాకా జైలు శిక్ష వేయవచ్చుననీ భారతశిక్షాస్మృతిలోని సెక్షన్లు 330, 331 అంటాయి.

## కస్టడీలో ముద్దాయి హక్కులు

అరెస్టు చేసిన వ్యక్తిని పోలీసు కస్టడీలో చిత్రహింసలు పెట్టకుండ నిరోధించడానికి ఉద్దేశించబడిన మరొక చట్టం నేరవిధాన స్మృతిలోని సెక్షన్ 57. కస్టడీలోకి తీసుకున్న ఏ వ్యక్తినయినా పోలీసులు 24 గంటల లోపల సమీప జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలని ఈ సెక్షన్ అంటుంది.

సెక్షన్ 57 ఫలితంగా, అనుమానితుడిని ప్రశ్నించడానికి తగు సమయం తమకు దక్కడం లేదని పోలీసులు తరచుగా ఫిర్యాదు చేస్తుంటారు. చట్టం బాధితులనూ ముద్దాయినీ సమానంగా సంరక్షించాలన్న విషయం జ్ఞాపకం పెట్టుకోవాలి. కాబట్టి నిర్దోషిని శిక్షించరాదనేది ఎంత ముఖ్యమైన నియమమో, నిజమైన దోషిని గుర్తించి శిక్షించాలనేది కూడ అంతే ముఖ్యం. కాబట్టి అరెస్టు చేసిన వ్యక్తిని ప్రశ్నించడానికి పోలీసులకు సహేతుకమైన అవకాశం ఉండాలి.

**అ**దే సమయంలో ప్రశ్నించడం పేరుమీద ముద్దాయిని కస్టడీలో హింసించకుండ చూడటం కూడ అవసరం. నేరాన్ని ప్రాసిక్యూషన్ రుజువు చేసేదాకా ముద్దాయిని నిర్దోషిగానే పరిగణించాలన్న సమదృష్టి సూత్రం దీనికి మూలం. కాబట్టి నేరపరిశోధన పేరిట ముద్దాయిని హింసించే అవకాశం లేకుండ చూసే బాధ్యత చట్టం మీద ఉంటుంది.

నేరవిచారణ స్మృతి ఈ భిన్నమైన అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటిమధ్య సమతుల్యం సాధించే ప్రయత్నం చేస్తుంది. అరెస్టు చేసిన ముద్దాయిని కోర్టులో హాజరుపెట్టకుండ పోలీసు కస్టడీలో ఎక్కువసేపు ఉంచుకునే అవకాశం పోలీసులకు ఇవ్వదు. అయితే కోర్టులో హాజరుపెట్టిన తరువాత కోర్టు ముద్దాయిని తిరిగి పోలీసు కస్టడీకే, ప్రశ్నించడం కోసం సిఆర్‌పిసి సెక్షన్ 167(2) కింద అప్పగించవచ్చును. ఇది ముద్దాయికి మేజిస్ట్రేటు పర్యవేక్షణవల్ల వచ్చే సంరక్షణ కొంత కల్పిస్తుంది. ఉదాహరణకు ముద్దాయిని పోలీసు కస్టడీకి అప్పగించిన మేజిస్ట్రేటు, పోలీసులతనిని ప్రతిరోజూ ఒకసారి తన ఎదుట హాజరు పెట్టాలని ఆదేశించవచ్చు. లేదా ప్రతిరోజూ ఒక డాక్టరు అతనిని లాకప్పులో పరీక్షించాలని ఆదేశించవచ్చును.

నేరవిచారణ పద్ధతి కస్టడీలో చిత్రహింసలతో ప్రారంభం కావడానికి వీలులేదు. కాబట్టి, భారతరాజ్యాంగంలోనూ, సిఆర్‌పిసిలోనూ, సాక్ష్యాల చట్టంలోనూ చిత్రహింసలను చట్టవిరుద్ధమని ప్రకటించే అంశాలు ఎన్ని ఉన్నప్పటికీ, పోలీసు కస్టడీలో చిత్రహింసలను అరికట్టడానికి మానవహక్కుల చైతన్యం, నిఘా, ఆందోళన అవసరం.

అయినప్పటికీ పోలీసు కస్టడీలో చిత్రహింసలు ఒక తీవ్రమైన సమస్యగానే ఉంది. నేరవిచారణలో సహేతుకత, నిష్పాక్షికత అనే సూత్రాలనది అపహాస్యం చేస్తుంది. అరెస్టు చేసిన వ్యక్తిని 24 గంటల లోపల కోర్టుఎదుట హాజరుపెట్టాలన్న సిఆర్‌పిసి సెక్షన్ 57 లోని నియమాన్ని పోలీసులు ఎప్పుడోతప్ప గౌరవించరనేది తెలిసిన విషయమే. కస్టడీలో చిత్రహింసలు పెట్టకపోతే నేరాలు రుజువు చేయడం సాధ్యం కాదని పోలీస్ అధికారులు అంటుంటారు కూడ. కస్టడీలో చిత్రహింసల పట్ల నిరసన తెలిపే వాళ్ళకు బాధితుల హక్కులకంటే నేరస్తుల హక్కులు ముఖ్యమన్న అపవాదు కూడ ఉంది. అయితే పోలీసు కస్టడీలో ఒక వ్యక్తిని హింసకు గురిచేసేటప్పుడు అతను దోషి అయిందీ నిర్దోషి అయిందీ ఆ పోలీసులకు తెలియదని జ్ఞాపకం పెట్టుకోవాలి. దోషులను పట్టుకోవడానికి నిర్దోషులకు హాని చేసినా తప్పులేదనే వైఖరి సరయినది కాదు. అంతేకాక, దోషికి కూడ న్యాయస్థానం నిర్ణయించే శిక్ష మాత్రమే వేయాలి. దానికి ముందు చట్టబద్ధమైన నేరవిచారణ జరగాలి. సహేతుకమైన సందేహానికి ఆస్కారం లేనంత సంపూర్ణంగా నేరం రుజువు కావాలి. ఎంత శిక్ష వేయడం ఉచితంగా ఉంటుందన్న మదింపు జరగాలి. ఈ నిష్పాక్షికమైన, సహేతుకమైన నేరవిచారణ పద్ధతి కస్టడీలో చిత్రహింసలతో ప్రారంభం కావడానికి వీలులేదు. కాబట్టి, భారతరాజ్యాంగంలోనూ, సిఆర్‌పిసిలోనూ, సాక్ష్యాల చట్టంలోనూ చిత్రహింసలను చట్టవిరుద్ధమని ప్రకటించే అంశాలు ఎన్ని ఉన్నప్పటికీ, పోలీసు కస్టడీలో చిత్రహింసలను అరికట్టడానికి మానవహక్కుల చైతన్యం, నిఘా, ఆందోళన అవసరం.

## అరెస్టు చేసే పద్ధతి

అయితే మానవహక్కుల సమస్యలు అరెస్టు చేసిన తరువాత కాదు, అరెస్టుచేసే సమయంలోనే మొదలవుతాయి. ఒక నేరంలో అనుమానితుడయిన వ్యక్తిని అరెస్టు చేసేటప్పుడు పోలీసులు ఎంత బలప్రయోగానికి పాల్పడవచ్చును? అతను అనుమానితుడయినంత మాత్రాన కస్టడీలోకి తీసుకునేటప్పుడు కొట్టడం, కాల్పులు జరపడం తగునా? కేవలం అనుమానించబడినంత మాత్రాన ఎవ్వరూ దోషి కాదన్న సూత్రం సిఆర్‌పిసిలో ఆద్యంతం ఉందన్న సంగతి మరొకసారి గుర్తు చేయాలి.

చట్టం నిర్దేశించే పద్ధతిలో నేరం రుజువయిన తరువాతనే అతను దోషి అవుతాడు. అయితే విచారించడం కోసం అతన్ని అరెస్టు చేసే అధికారం, ప్రశ్నించే అధికారం పోలీసులకు అవసరం. అయితే ఇది అతనిని చట్టానికి లోబరచడం కోసం కస్టడీలోకి తీసుకునే అధికారమే తప్ప అంతకంటే ఎక్కువగా అనుమానితుడి హక్కులను హరించే అధికారం కాదు.

కాబట్టి, అరెస్టు చేసే సమయంలో ముద్దాయి నుండి ఎదురయ్యే ప్రతిఘటనను అధిగమించడానికి అవసరమైన దానికి మించి పోలీసులు బలప్రయోగానికి పాల్పడడానికి వీలులేదు. సిఆర్‌పిసిలోని సెక్షన్ 46 ఈ మాటే అంటుంది. కానీ ఎంత బలప్రయోగం అవసరమో ఎట్లా తెలుస్తుంది? అనుమానితుడిని అరెస్టుచేసే క్రమంలో పోలీసులు అతనిపైన కాల్పులు జరపవచ్చునా? చంపవచ్చునా? అతనిని కొట్టి నేలమీద పడేసి కదలకుండ చేయవచ్చునా? వీలులేదు. అరెస్టు చేయదలచుకున్న వ్యక్తి మాటలకే లొంగినట్టయితే అతన్ని ముట్టుకునే అధికారం కూడ అరెస్టు చేస్తున్న పోలీస్ అధికారికి లేదు. మాటలకు లొంగకపోయినట్టయితే భౌతికంగా అదుపులోకి తీసుకోవచ్చు. అరెస్టును ఆ వ్యక్తి ప్రతిఘటిస్తే, అప్పుడు బలప్రయోగం చేయవచ్చు. అయితే ప్రతిఘటనను అధిగమించి అరెస్టు చేయడానికి అవసరమైన మేరకీ బలప్రయోగం చేయవచ్చు. అంతే తప్ప పోలీస్ అధికారి తన అధికారాన్ని ప్రదర్శించడానికి ఎంతయినా బలప్రయోగం చేయడానికి వీలులేదు. ప్రతిఘటించే సూచనలు లేకున్నా బలప్రయోగం చేయడానికి వీలులేదు. కానీ సాధారణంగా జరిగేది అదే కాబట్టి, చాలా సందర్భాలలో అనుమానితులు అరెస్టు అయ్యే ఘడియలోనే తీవ్రంగా హింసకు గురి అవుతుంటారు. ఈ హింస అనవసరమేకాక చట్ట విరుద్ధం కూడ. ఆ తరువాత పోలీసుకస్టడీలో జరిగే హింస వేరే విషయం. అరెస్టు చేసేటప్పుడే పోలీసులు ఉపయోగించగల బలప్రయోగానికి చట్టం పెట్టే పరిమితులను తరచుగా అతిక్రమించే ఈ సంస్కృతిని ఎదుర్కొనడానికి మానవహక్కుల చైతన్యం, చొరవ అవసరం.

## నేర పరిశోధన పద్ధతి

నేర పరిశోధనలో అనుమానితుల అరెస్టు, ఇంటరాగేషన్ మాత్రమేకాక ఇళ్ళు, అంగళ్ళు సోదాచేయడం, మనుషులను సోదా చేయడం కూడా అవసరం అవుతుంది. నేరంతో సంబంధం ఉన్న వ్యక్తులను, ఇతర సాక్ష్యాలను వెతకడానికి, స్వాధీనం చేసుకోవడానికి చట్టం ఈ అధికారం పోలీసు యంత్రాంగానికి ఇచ్చింది. అయితే మనుషులనూ స్థలాలనూ సోదా చేసే క్రమంలో హక్కులకు భంగం కలగవచ్చు. అవమానపరచడం, గాయపరచడం, వస్తువులను ధ్వంసం చేయడం జరగవచ్చు. ఈ రకమైన హక్కుల అతిక్రమణ సమర్ధనీయం కాదు.

అది సమర్ధనీయం కాదని భావించడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి, ఒక వ్యక్తి మీద ఎంత సహేతుకమైన అనుమానం ఉన్నా, నేరం రుజువయ్యేదాకా ఆ వ్యక్తి

అనుమానితుడే తప్ప దోషి కాడు. రెండు, నేరం రుజువయిన తరువాత కూడ శిక్షవేయవలసింది న్యాయస్థానమే తప్ప పోలీసులు కాదు. నేరపరిశోధన చేసే క్రమంలోనే పోలీసులు అనుమానితులకు శిక్షవేయడానికి వీలులేదు. పోలీసులు చేసే నేరపరిశోధన, న్యాయస్థానానికి నేరనిర్ధారణ చేయడానికి అవసరమైన ఒక పరికరం మాత్రమే, అంతకు మించి వేరే ఏమీకాదు. అనుమానితులను దోషులుగా భావించి నేరపరిశోధన చేసే క్రమంలోనే వారిని శిక్షించడం పోలీసు యంత్రాంగానికి అలవాటయిపోయింది. కాబట్టి ఈ విషయాలు చెప్పడం అవసరం. ఈ కారణంగానే వ్యక్తులనూ స్థలాలనూ సోదా చేసే క్రమంలో తరచుగా వస్తువుల విధ్వంసం, వ్యక్తులను అవమానపరచడం (ముఖ్యంగా స్త్రీలను), గాయపరచడం జరుగుతుంటుంది.

ఈ రకమైన హక్కుల అతిక్రమణను నివారించడానికి నేరవిధానస్మృతి (సిఆర్‌పిసి)లో కొన్ని నియమాలున్నాయి. సెక్షన్ 51(1) ప్రకారం, అరెస్టు చేసిన వ్యక్తినుండి స్వాధీనం చేసుకున్న వస్తువులకు రసీదు తయారుచేసి ఆ వ్యక్తికి ఇవ్వాలి. సెక్షన్ 51(2) ప్రకారం, స్త్రీని సోదాచేసేటప్పుడు మహిళా పోలీసులే చేయాలి. పోలీసులకు సోదాచేసే అధికారం ఉన్నా ఆ ప్రదేశంలో ఉన్నవారు పోలీసులను లోపలికి రానీయకపోయినట్టయితే పోలీసులు తలుపు లేక కిటికీ పగలగొట్టి లోపలికి ప్రవేశించవచ్చునని సెక్షన్ 47 అంటుంది. అయితే ఆ విధ్వంసం పోలీసులకు లోనికి ప్రవేశించడానికి అవకాశం కల్పించేమేరకు మాత్రమే ఉండాలి. అది కూడ ఆ ప్రదేశంలో ఉన్నవాళ్ళు లోనికి రానీయనప్పుడు మాత్రమే. అంతే తప్ప పోలీసులు పోవడం పోవడమే తలుపులు, కిటికీలు పగలగొట్టకూడదు. లోపలికంటూ ప్రవేశించిన తరువాత కుర్చీలు బల్లలు వస్తువులు విరగ్గొట్టకూడదు. బలప్రయోగంతో లోనికి ప్రవేశించేటప్పుడు కూడ, లోపల ఒక స్త్రీ గనక ఉన్నట్టయితే (అనుమానితురాలు ఆమే అయితే తప్ప) తాము లోనికి ప్రవేశించబోతున్న సంగతి చెప్పి ఆమెకు అక్కడినుండి వెళ్ళిపోయే అవకాశం, సమయం ఇవ్వాలి.

స్థలాలను సోదా చేసేటప్పుడు వస్తునష్టం జరగకుండా ఉండటం కోసం సిఆర్‌పిసిలోని సెక్షన్ 100 కొన్ని నియమాలు పెట్టింది. ఒక ప్రదేశాన్ని సోదాచేయడానికి పోలీసులు పోయేటప్పుడు ఆ ప్రాంతంలో నివసించే స్వతంత్రులు, గౌరవనీయులు అయిన సాక్షులు ఇద్దరినిగానీ అంతకంటే ఎక్కువగానీ, వెంటపెట్టుకొని పోవాలని ఆ సెక్షన్ అంటుంది. సోదా వారి సమక్షంలో జరగాలి. సోదాచేసిన క్రమంలో స్వాధీనం చేసుకున్న వస్తువుల జాబితా పోలీసులు తయారుచేసి సాక్షుల సంతకాలు తీసుకోవాలి. ఆ ప్రదేశంలో నివసించేవారు సోదాచేసే సమయంలో అక్కడ ఉండి సోదాను చూడదలచుకున్నట్టయితే పోలీసులు వారిని అనుమతించాలి. సోదా అయిపోయిన తరువాత, స్వాధీనం చేసుకున్న వస్తువుల జాబితాను ఆ యిద్దరు సాక్షుల సంతకంతో సహా వారికి ఇవ్వాలి.

అయితే వాస్తవంలో సోదాచేసే క్రమంలో పోలీసులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేయకుండ నిరోధించడంలో ఈ చట్టాలు విఫలం అయ్యాయి. ఒకవేళ పోలీసులు చేసిన

సోదా ఈ చట్టాలను అతిక్రమించినా సోదాచేసి స్వాధీనం చేసుకున్న సాక్ష్యం చెల్లుబాటు అవుతుందని కోర్టు తీర్పులిచ్చాయి.

కాబట్టి సోదాచేసే క్రమంలోనూ, వస్తువులను స్వాధీనం చేసుకునే క్రమంలోనూ మానవహక్కుల అతిక్రమణ జరగకుండ చూడటానికి ప్రత్యేకమైన కృషి అవసరం.

## ముద్దాయి హక్కులు

ఇక న్యాయస్థానంలో విచారణ జరిగేటప్పుడు ముద్దాయికి ఉండే హక్కులు చూద్దాం. అరెస్టుచేసిన తరువాత వీలయినంత త్వరగా ముద్దాయిని న్యాయమూర్తి ఎదుట హాజరుపెట్టాలనీ, ఎట్టిపరిస్థితిలోనూ 24 గంటలు దాటడానికి వీలులేదనీ (అరెస్టు చేసిన స్థలం నుండి కోర్టుకు పోవడానికి పట్టేసమయాన్ని మినహాయించి) చట్టం చెపుతుంది. అంతేకాదు అరెస్టయిన వ్యక్తికి కోర్టుకుపోయేదాకా తాను ఎందుకు అరెస్టయిందీ తెలియని పరిస్థితి ఉండడానికి వీలులేదు. అరెస్టుకు కారణం ఏమిటో పోలీసులు అరెస్టుచేసిన వ్యక్తికి వెంటనే చెప్పాలని సిఆర్‌పిసి సెక్షన్ 56 అంటుంది. భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 22 (1) ప్రకారం ఇదొక ప్రాథమిక హక్కు. అంతేకాక, ముద్దాయికి తనకు నచ్చిన న్యాయవాదిని కలుసుకునే ప్రాథమికహక్కు కూడ ఉంది. అరెస్టయిన క్షణం నుండి ఈ హక్కు ఉనికిలోకి వస్తుంది.

అరెస్టు చేసిన వ్యక్తిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పెట్టగానే మేజిస్ట్రేట్ ఆ వ్యక్తిని తగిన కస్టడీకి పంపుతారు. సాధారణంగా స్వల్పకాలానికి మాత్రమే ఇస్తారు. అది కూడ నేరపరిశోధన కొనసాగించడానికి పోలీసు కస్టడీకి ఇవ్వడం అవసరం అని కోర్టు భావిస్తేనే. అటువంటప్పుడు ముద్దాయిని ఫలాన గడువుకొకసారి కోర్టుకు తీసుకురావాలనిగానీ, ముద్దాయిని బంధించిన స్థలంలో వైద్యపరీక్షలు అనుమతించాలనిగానీ మేజిస్ట్రేట్ ఆదేశించవచ్చు. చిత్రహింసల ప్రమాదాన్ని తగ్గించడానికిది ఉపయోగపడుతుంది. నిజానికి, మొట్టమొదటిసారి ముద్దాయిని పోలీసులు మేజిస్ట్రేట్ ముందు హాజరు పెట్టినప్పుడే, నిర్బంధంలో ఉన్న సమయంలో పోలీసులతనితో చట్టబద్ధంగా వ్యవహరించినదీ లేనిదీ మేజిస్ట్రేటు వాకబు చేయాలి. లేదని ముద్దాయి చెప్తే ఆ వివరాలు మేజిస్ట్రేటు నమోదు చేసి చట్టం ప్రకారం చర్యతీసుకోవాలి.

అయితే మామూలుగా మేజిస్ట్రేట్‌లు తమముందు హాజరు పెట్టిన ముద్దాయిని జైలు కస్టడీకి పంపిస్తారు. దీనిని 'జ్యుడీషియల్ కస్టడీ' అంటారు. ఆ మాట ప్రయోగించడంలో గల భావమేమిటంటే, జైలులో ఉన్నప్పటికీ ముద్దాయి న్యాయస్థానం కస్టడీలో ఉన్నాడని.

నేరం ఇంకా రుజువు కాకపోయినప్పటికీ కోర్టు ముద్దాయిని జైలులో ఎందుకు నిర్బంధిస్తుంది? నేరం రుజువు అయ్యేంతవరకు ముద్దాయి నిర్దోషేనన్నది భారత నేరస్మృతికి సంబంధించి ఒక ప్రాథమిక సూత్రమని చెప్పాము. అటువంటప్పుడు అనుమానితులను కోర్టు జైలుకు ఎట్లా పంపిస్తుంది?

న్యాయసహాయం పొందడానికి అయ్యేఖర్చు పేదలు, ముఖ్యంగా దళితకులాలకు చెందినవారు ఎదుర్కొనే సమస్యలలో ఒకటి. ఈ దుర్బలత్వాన్ని సవరించకపోయినట్టయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లోని సమాన సంరక్షణ అనే ప్రాథమికహక్కు ఆచరణలో దక్కకుండానే ఉండిపోతుంది.

దీనికి కారణమేమిటంటే న్యాయం జరగాలంటే అనుమానితులు నేరపరిశోధనకూ విచారణకూ అందుబాట్లో ఉండాలి. కేవలం అనుమానితులయిన (ఇంకా దోషులుగా రుజువుకాని) వారిహక్కులను కాపాడడం చట్టానికి ఎంత ముఖ్యమో, దోషిని గుర్తించి శిక్షించడం కూడ అంతే ముఖ్యం. అందుకోసం ముద్దాయి నేరపరిశోధనకూ విచారణకూ అందుబాట్లో ఉండాలి. అయితే ఆ అవసరానికి కావలసిన మోతాదును మించి ముద్దాయి స్వేచ్ఛపైన, హక్కులపైన పరిమితులు పెట్టకూడదు.

కాబట్టి నేరపరిశోధన, విచారణలకు అందుబాట్లో ఉండడం కోసం ముద్దాయిని జుడీషియల్ కస్టడీలో, అంటే జైలులో ఉంచడం జరుగుతుంది. అయితే ఇది కచ్చితంగా అవసరం అయినమేరకు మాత్రమే. అంతకు మించి అనుమానితుని హక్కులను అణచివేయడానికి వీలులేదు. నేరం తీవ్రమైనది కాని పక్షంలో ముద్దాయి నేరపరిశోధనకు ఆటంకం కలిగించడనీ నేరవిచారణను తప్పించుకోడనీ చట్టం భావిస్తే అటువంటి నేరాలను చట్టం 'బెయిలబుల్' నేరాలు అంటుంది. అంటే అరెస్టయిన వెంటనే ముద్దాయికి బెయిలు పొందే హక్కు ఉంటుందని అర్థం.

తక్కిన నేరాలను నాన్ – బెయిలబుల్ నేరాలు అంటారు. అంటే అర్థం ఆ నేరాలకు ముద్దాయికి బెయిల్ దొరకదనీ, ఇవ్వకూడదనీ కాదు. బెయిల్ ఇచ్చేదీ లేనిదీ కోర్టు నిర్ణయిస్తుందని మాత్రమే అర్థం. బెయిల్ అసలే ఇవ్వని నేరం చట్టంలో ఏదీ లేదు. నాన్ – బెయిలబుల్ అని పిలవబడే నేరాలలో బెయిల్ ఇచ్చేదీ లేనిదీ న్యాయస్థానాల నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. బెయిలబుల్ నేరాలలో అరెస్టు కాగానే బెయిలుపైన విడుదల కావడం ముద్దాయి హక్కు.

నాన్ – బెయిలబుల్ నేరాలలో సహితం, బెయిలు సాధారణ పరిస్థితులలో మొట్టమొదట అడిగినప్పుడే ఇవ్వాలనీ, అసాధారణ పరిస్థితులలో మాత్రమే తిరస్కరించాలనీ సుప్రీంకోర్టు అనింది. ముద్దాయిని విడుదల చేసినట్టయితే న్యాయప్రక్రియకు అడ్డం వస్తాడా లేదా అనేదొక్కటే బెయిలు ఇవ్వడానికీ నిరాకరించడానికీ ప్రమాణం కావాలి.

అయితే చట్టంలోనూ సుప్రీంకోర్టు తీర్పులోనూ ఉన్న ఈ ఉదారవైఖరి న్యాయస్థానాల వ్యవహారశైలిలో కనిపించదు. దొంగతనం వంటి నేరాలలో ఇరుక్కున్న పేదలు న్యాయస్థానాలలో తరచుగా వ్యతిరేకవైఖరిని ఎదుర్కొంటారు. సహేతుకమైన కారణమేదీ లేకుండానే వారికి బెయిలు నిరాకరించబడుతుంది. బెయిలు నిరాకరించి, నేరవిచారణ పొడిగించడంవల్ల జైలులో ముద్దాయిలు దీర్ఘకాలం ఉండిపోతారు. ఒక్కొకసారి వారిపైన ఉన్న అభియోగానికి చట్టం నిర్దేశించిన గరిష్ట శిక్ష కంటె ఎక్కువకాలం ఉండిపోతారు.

న్యాయసహాయం పొందడానికి అయ్యేఖర్చు పేదలు, ముఖ్యంగా దళితకులాలకు చెందినవారు ఎదుర్కొనే సమస్యలలో ఒకటి. చట్టం పౌరులందరికీ హామీ యిచ్చే సమానత్వ సంరక్షణ పేదలు పొందలేకపోవడానికి గల కారణాలలో ముఖ్యమైనది న్యాయవాదిని పెట్టుకోలేకపోవడం. ఈ దుర్బలత్వాన్ని సవరించకపోయినట్టయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లోని సమాన సంరక్షణ అనే ప్రాథమికహక్కు ఆచరణలో దక్కకుండానే ఉండిపోతుంది.

సుప్రీంకోర్టు ఈ విషయాన్ని గమనించి, ఉచిత న్యాయసహాయం పౌరుల ప్రాథమిక హక్కు అని తీర్పు ఇచ్చింది. నేరవిచారణలో ముద్దాయిలు స్వంత ఖర్చుతో న్యాయవాదిని నియమించుకోలేక పోయినట్టయితే వారికి న్యాయస్థానమే ప్రభుత్వం ఖర్చుతో న్యాయవాదిని నియమిస్తుంది. దీనితోనూ పూర్తి సమానత్వం రాదు. ఎందుకంటే ప్రభుత్వం ఈ న్యాయవాదులకిచ్చే ఫీజు 'మార్కెట్ రేటు'కంటే బాగా తక్కువ ఉంటుంది. అయినప్పటికీ ఈ సదుపాయం వల్ల ముద్దాయిలు నేర్పరులయిన న్యాయవాదుల సహాయం పొందగలుగుతారు.

నేరాన్ని విచారించేటప్పుడు న్యాయస్థానం సిఆర్‌పిసిలోని వివరమైన నేరవిచారణ పద్ధతిని అనుసరించాలి. ఈ విచారణ పద్ధతి లక్ష్యాలు రెండు : ఒకటి, ముద్దాయికి నిష్పాక్షికమైన విచారణ అందియ్యడం, రెండు, దోషిని గుర్తించి శిక్షించడానికి అవసరమైన అధికారాన్ని న్యాయస్థానానికి ఇవ్వడం.

ఈ విచారణ పద్ధతిని వివరంగా చర్చించుకోవలసిన అవసరం లేదుగానీ కొన్ని విషయాలు చెప్పుకోవాలి. అనుమానితుని చేత బలవంతంగా నేరం ఒప్పించడానికి వీలులేదన్న సూత్రం న్యాయస్థానంలో జరిగే నేరవిచారణకు కూడ వర్తిస్తుంది. నేరవిచారణలో ముద్దాయిని సాక్షిబోనులో బలవంతంగా నిలబెట్టడానికి వీలులేదు. నేరాన్ని గురించి అతను ఏమీ చెప్పదలచుకోకపోతే కోర్టు అతనిచేత బలవంతంగా చెప్పించలేదు.

సాక్షిది వేరే సంగతి. నేరవిచారణలో సాక్షి అయిన వ్యక్తి కోర్టు ఆదేశించినప్పుడు హాజరుకావలసిందే. సాక్ష్యం చెప్పవలసిందే. ముద్దాయి నేరం చేసాడని రుజువు చేయవలసిన భారం ప్రాసిక్యూషన్ పైన ఉంటుంది. తన నిర్దోషిత్వం రుజువు చేసుకునే భారం ముద్దాయిపైన ఉండదు.

నిష్పాక్షికమైన నేరవిచారణలో ఒక ముఖ్య అంశం ప్రతి సాక్షినీ ఎదురు ప్రశ్నించడానికి (క్రాస్ – ఎగ్జామిన్ చేయడానికి) ముద్దాయికి ఉండే హక్కు. ఇది కేవలం ముద్దాయి హక్కు

మాత్రమే కాదు. నేరవిచారణలో ఒక తప్పనిసరి ఘట్టం. క్రాస్ – ఎగ్జామినేషన్ జరగకుండా సాక్ష్యానికి 'సాక్ష్యం'గా విలువలేదు. ముద్దాయికి ఒక సాక్షిని ఎదురుప్రశ్నించే అవకాశం లభించిన తరువాతనే ఆ సాక్షి ఇచ్చిన వాంగ్మూలం చట్టం కళ్లలో 'సాక్ష్యం' అవుతుంది. అప్పుడే కోర్టు ఆసాక్ష్యాన్ని పరిగణలోకి తీసుకోగలుగుతుంది. ఉదాహరణకు, ఒక సాక్షి తన వాంగ్మూలం మొత్తం ఇచ్చిన తరువాత ఎదురుప్రశ్న జరగకుండానే చనిపోయాడనుకోండి. అతని సాక్ష్యానికి ఏమీ విలువ ఉండదు. దానిని న్యాయస్థానం లెక్కలోకి తీసుకోజాలదు.

నేరవిచారణ పద్ధతిలో ఇన్ని జాగ్రత్తలు ఉన్నప్పటికీ న్యాయమూర్తి తప్పులే చేయరని చట్టం భావించదు. కాబట్టి పైకోర్టుకు అప్పీల్ చేసుకునే అవకాశం చట్టంలో ఉంది. రెండవ అప్పీల్‌కు కూడ అవకాశం కొంత ఉంది. మరణదండన విషయంలోనయితే అప్పీల్ మాత్రమే ముద్దాయి హక్కు కాదు. అది నేరవిచారణలో భాగమే. అంటే సెషన్స్ కోర్టు విధించిన మరణదండనను హైకోర్టు ధృవీకరించినప్పుడే అది లెక్కలోకి వస్తుంది. ఆ తరువాత సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసుకునే అవకాశమూ ఉంటుంది.

కాబట్టి, నేరస్మృతి పోలీసులకూ న్యాయస్థానాలకూ దోషులను గుర్తించడానికీ శిక్షించడానికీ అవసరమైన అధికారాలు ఇస్తూ, అదే సమయంలో అమాయకులకు శిక్షపడకుండ ఉండేందుకు, ఎంత ఉచితమో అంతకు మించిన శిక్షపడకుండా ఉండేందుకు తగిన రక్షణ కూడ కల్పిస్తుందని అర్థం అవుతుంది. ఈ రక్షణకోసం అనేక హక్కులు కల్పించబడ్డాయి.

పౌరులు ఈ హక్కులను అనుభవించేటట్టు చూడడం మన బాధ్యత, మన కర్తవ్యం. ఈ హక్కులలోనే కొన్ని లోపాలు, పరిమితులు ఉన్నాయి. వాటిని గుర్తించాలి, తొలగించాలి. దీనికంతటికీ మానవహక్కుల చైతన్యం, ఆచరణ అవసరం. అది లేకుండ హక్కులు పొందలేము. అనుభవించలేము.

# పౌర సమాజం - మానవ హక్కులు

పౌరసమాజం (ఇంగ్లీష్‌లో సివిల్ సొసైటీ) అనేది యూరప్‌లో ఆధునిక యుగం ప్రారంభంలో ప్రాచుర్యం పొందిన మాట. స్వేచ్ఛావిపణి ఇందులో కీలకమైన భావన. మధ్యయుగాలలో ఆర్థిక వ్యవస్థపైన రాజ్యానికి యూరప్‌లో విస్తృతమైన అదుపు ఉండింది. రాజ్యం జోక్యం నుండి విముక్తి పొందిన ఆర్థిక వ్యవస్థ – స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థ – పాశ్చాత్యభావనలో ఆధునికతకు కేంద్రలక్షణం.

ఈ స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థకోసం పాశ్చాత్యదేశాలలో పెద్ద పోరాటమే జరిగింది. అది పాశ్చాత్య నమూనా ఆధునికతా భావన మీద తన ముద్ర వేసింది. ఆధునికతకు స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థే పునాది అని దానిని అభిమానించేవారూ తిరస్కరించేవారూ కూడ సూత్రీకరించారు.

ఆ తరువాత తన అర్థాన్ని విస్తృతపరచుకున్న 'పౌరసమాజం' అనే భావనకు పాశ్చాత్య



మానవహక్కుల పి.జి. డిప్లొమా కోర్సు కోసం రాసిన పాఠం

ఆలోచనా సంప్రదాయంలో స్థిరపడిన నిర్వచనాన్ని క్లుప్తంగా చెప్పుకోవాలంటే, "రాజ్యంలో భాగంగా కాకుండా పౌరులు పౌరులుగా ఒకరితో ఒకరు సంబంధాలు పెట్టుకొని వ్యవహరించే జీవితరంగం" అని చెప్పుకోవచ్చును. చాలాకాలం పౌరసమాజం అనే మాటకు పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అనే అర్థమే ఉండింది. హెగెల్, మార్క్స్ కూడా ఆ అర్థంలోనే ఆ మాటను ఉపయోగించారు.

అంతకుముందు యూరప్‌లోని ఆర్థిక వ్యవస్థలో రాజ్యం జోక్యం అడుగడుగునా ఉండింది. వ్యాపారస్వేచ్ఛ మీద, ఆస్తిహక్కు మీద, శ్రమశక్తి వినియోగం మీద, సహజవనరుల మీద, రాజ్యం పెత్తనం ఉండింది. ఉత్పాదకత పెరుగుదలకు ఇది పెద్ద అవరోధమనీ ఆర్థిక వ్యవస్థకు రాజ్యం తగిలించిన శృంఖలాల నుండి దానిని విముక్తి చేయనిదే అభివృద్ధి సాధ్యం కాదనీ ఆధునికులు చేసిన తిరుగుబాటు మధ్యయుగాల పతనంలో ఒక ముఖ్యఘట్టం.

అయితే అదే క్రమంలో రాజ్యం జోక్యం లేదా ప్రమేయం లేకుండ పౌరులు పౌరులుగా తమ మధ్య తాము సంబంధాలు పెట్టుకొని వ్యవహరించే ఇతర జీవితరంగాలు కూడ అనేకం ఉనికిలోకి వచ్చాయి. వీటి ఆవిర్భావానికి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఆవిర్భావమే పునాది అని వాదించే సిద్ధాంతాలున్నాయి. ఆర్థిక జీవితం రాజ్యంపెత్తనం నుండి విముక్తి పొంది 'పౌర జీవితం'గా రూపాంతరం చెందిన క్రమంలోనే తక్కిన జీవితరంగాలలో కూడ అటువంటి స్వతంత్ర లేక స్వయంప్రతిపత్తి గల వ్యవస్థలు ఏర్పడ్డాయని ఈ సిద్ధాంతాలు సూత్రీకరిస్తాయి. అందుకు భిన్నంగా అన్ని జీవితరంగాలలోనూ ఈ మార్పులు పెనవేసుకొని వచ్చాయనీ 'మానవ వ్యక్తి'ని ప్రపంచానికి కేంద్రం చేసి చూసే ఆధునిక యుగ లక్షణానికి ఇవన్నీ ఒకే సమయంలో ప్రతీకలనీ వీటిలో ఒకటి పునాది, మరొకటి పర్యవసానం అనుకునే అవకాశం లేదనీ వాదించిన వారున్నారు.

ఏది ఏమైనా యూరప్‌లో పౌరసమాజం అనే ఆధునిక వాస్తవికత, దానికి సంబంధించిన భావన ఈ విధంగా రూపొందాయి. కాలక్రమంలో 'పౌరసమాజం' అనే మాటకు పెట్టుబడిదారీ మార్కెట్ వ్యవస్థ అనే అర్థం పోయి, పౌరులు పౌరులుగా విద్య, మతం, వినోదం, సంస్కృతి, సమిష్టి సంస్థలు (ఉదాహరణకు కార్మిక సంఘాలు, వృత్తిదారుల సంఘాలు) మొదలయిన రంగాలలోనూ రూపాలలోనూ ఏర్పరచుకున్న నిర్మాణాలు, సంబంధాలు అన్న అర్థం వచ్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ సామాజిక జీవితంలో రాజ్యగతమైన 'రాజకీయ సమాజం' కానిదంతా పౌరసమాజమే. ఈ శతాబ్దంలో ఆ మాటను ఈ అర్థంలోనే పాశ్చాత్యులు వాడుతున్నారు.

అయితే కుటుంబం, కుటుంబగతమైన మానవ సంబంధాలు పౌర సమాజంలో భాగమా కాదా అన్న ప్రశ్న చాలాకాలం అస్పష్టంగా ఉండిపోయింది. వ్యక్తిగత జీవితంగా పిలవబడే జీవితరంగానికి చెందిన మానవ సంబంధాలు పౌర సమాజంలో భాగమా కాదా? వినోదం కోసం పదిమంది (రాజ్యం ప్రమేయం లేకుండ) తమకోసం తాము ఏర్పరచుకున్న క్లబ్బు పౌరసమాజంలో భాగమే. వందమంది కార్మికులు తమ హక్కులరక్షణ కోసం నెలకొల్పిన

కార్మిక సంఘం పౌర సమాజంలో భాగమే. వ్యాపార వర్గాలు తమ సమస్యలు చర్చించుకోవడానికి ఏర్పరచుకున్న వర్తక వేదికలు పౌరసమాజంలో భాగమే. ఒక ప్రైవేట్ విద్యాసంస్థ, ఫిలింసొసైటీ, ఒక పెట్టుబడిదారీ కంపెనీ, మదర్ థెరిసా నెలకొల్పిన సేవాసంస్థ, ఇవన్నీ పౌరసమాజంలో భాగమే. ఇంత విస్తృతమైన పౌరసమాజం ఉండడమే 'ఆధునికత'ను నిర్వచించే లక్షణాలలో ఒకటి.

కానీ ఒక స్త్రీ, ఒక పురుషుడు పెళ్లి చేసుకొని నెలకొల్పిన కుటుంబం పౌరసమాజంలో భాగమా? లేకపోతే పెళ్లి, పిల్లలు సంసారం అనేవి వ్యక్తిగత విషయాలు కాబట్టి అవి రాజకీయ సమాజానికిగానీ పౌరసమాజానికిగానీ చెందని ప్రైవేట్ వ్యవహారమా? అస్పష్టంగా ఉన్న ఈ విషయానికి స్త్రీ వాదులు స్పష్టత చేకూర్చారు. స్త్రీ పురుష సంబంధాలను 'ప్రైవేట్' విషయాలుగా చూడడం సామాజిక విషయాలకు వర్తించే న్యాయం, సమానత, ప్రజాస్వామ్యం మొదలయిన విలువలు వాటికి వర్తించకుండ 'కాపాడడానికే' పనికొస్తున్నదనీ 'వ్యక్తిగతం' అనుకునేది కూడ 'సామాజిక'మేనని గుర్తించినప్పుడే ఆ విలువలకు చోటు కల్పించడం సాధ్యమవుతుందనీ స్త్రీ వాదులు చేసిన విమర్శ ఫలితంగా కుటుంబాన్ని కూడ పౌరసమాజంలో భాగంగా చూడడం మొదలయింది.

కానీ ఇక్కడొక ప్రశ్న ముందుకొస్తుంది. రాజ్యం జోక్యం నుండి, రాజ్యం పెత్తనం నుండి విముక్తి పొంది స్వంత అస్తిత్వాన్ని సాధించుకోవడం యూరప్‌లో 'ఆధునిక' కాలంలో పౌర సమాజానికి చెందిన ఇతర వ్యవస్థలనో జీవనరంగాలనో, ముఖ్యంగా ఆర్థిక రంగాన్ని నిర్వచించే లక్షణం. కానీ కుటుంబ జీవితమూ స్త్రీ పురుష సంబంధాలూ 'ఆధునిక' యుగంలోకి ప్రవేశించింది రాజ్యం నుండి విముక్తి పొందినప్పుడు కాదు, మతం నుండి విముక్తి పొందినప్పుడు. (లేదా పొందిన మేరకు – పూర్తిగా ఇప్పటికీ ఏ దేశంలోనూ పొందలేదు). స్త్రీలకు సంబంధించినంతవరకు 'ఆధునికత'ను నిర్వచించే వర్గీకరణ రాజకీయ సమాజం – పౌరసమాజం అనేది కాదు, మత సమాజం – లౌకిక సమాజం అనేది. ఆధునికతకు మార్కెట్‌ను కేంద్రంచేసి – అంటే ఆర్థిక వ్యవస్థను కేంద్రం చేసి – చూడడం అత్యధిక రాజకీయ సిద్ధాంతాల సామాన్య గుణం కావడం వల్ల రాజకీయ సమాజం – పౌర సమాజం అనేదే మౌలికమైన వర్గీకరణగా (ఆధునికతను మధ్యయుగాల నుండి వేరు చేసే వర్గీకరణగా) కనిపిస్తుంది గానీ కుటుంబం, స్త్రీ పురుష సంబంధాల కోణం నుండి చూస్తే వేరుగా కనిపిస్తుంది.

రాజ్యం ప్రత్యక్ష ప్రమేయం లేకుండ పౌరులు తమ మధ్య తాము పౌరులుగా ఏర్పరచుకునే సంబంధాలు, వ్యవస్థలు, నిర్మాణాల మొత్తాన్ని పౌర సమాజం అన్నట్టయితే ఈ పౌరసమాజం రాజ్యం పెత్తనం కింద ఉండకపోవచ్చునుగానీ రాజ్యం నుండి పూర్తి స్వతంత్రంగానూ ఉండదు. పౌర సమాజంలోని మానవ సంబంధాలను క్రమబద్ధం చేసే చట్టాలు ఉంటాయి. వాటిని రాజ్యమే రూపొందిస్తుంది, రాజ్యమే అమలు చేస్తుంది.

> కుటుంబ జీవితమూ స్త్రీ పురుష సంబంధాలూ 'ఆధునిక' యుగంలోకి ప్రవేశించింది రాజ్యం నుండి విముక్తి పొందినప్పుడు కాదు, మతం నుండి విముక్తి పొందినప్పుడు. (లేదా పొందిన మేరకు - పూర్తిగా ఇప్పటికీ ఏ దేశంలోనూ పొందలేదు). స్త్రీలకు సంబంధించినంతవరకు 'ఆధునికత'ను నిర్వచించే వర్గీకరణ రాజకీయ సమాజం - పౌరసమాజం అనేది కాదు, మత సమాజం - లౌకిక సమాజం అనేది.

'స్వేచ్ఛావిపణి' ఎంత స్వేచ్ఛగా ఉన్నా కాంట్రాక్ట్ చట్టం లేకుండ దానికి మనుగడ ఉండదు. ఆ చట్టాన్ని రాజ్యంలో భాగమైన న్యాయస్థానాలు రాజ్యానికి ఉండే నిర్బంధ అధికారం సహాయంతో అమలు చేస్తాయి. ట్రేడ్ యూనియన్ చట్టం, సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం, కంపెనీ చట్టం, సహకార సంస్థల చట్టం మొదలయినవన్నీ వివిధ పౌరసమాజ సంస్థలనూ సంబంధాలనూ క్రమబద్ధం చేసేవే. ఈ మేరకు పౌరసమాజం మీద రాజ్యం అదుపు ఉంటుంది. పూర్తిగా స్వచ్ఛందంగా తమను తాము రూపొందించుకొని నిలబెట్టుకునే సంస్థలు (ఉదాహరణకు రాజకీయపార్టీలు) మాత్రమే రాజ్యం నుండి నిజంగా స్వతంత్రంగా ఉండదలచుకుంటే ఉండగలవు.

పౌరసమాజానికి సంబంధించిన ఒక ముఖ్యమైన మానవహక్కుల సమస్యగా పాశ్చాత్య దేశాలలో గుర్తింపు పొందినది ఏమిటంటే పైన చెప్పిన పరిమితమైన జోక్యాన్ని మించి రాజ్యం తన పెత్తనాన్ని పెంచుకోకుండ చూడడం, పౌరసమాజంలోని సంస్థలు, మానవ సంబంధాలు స్వేచ్ఛగా తమను తాము రూపొందించుకునే వెసులుబాటును కాపాడుకోవడం. పాశ్చాత్యదేశాల మానవ హక్కుల సంప్రదాయంలో ఈ అభిప్రాయానికి చాలా ప్రాచుర్యం ఉంది.

అయితే ఇది అంతే తీవ్రంగా విమర్శకు కూడ గురయింది. మధ్యయుగాలలో రాజ్యాధికారం సామాజిక జీవితంపైన పెట్టిన అహేతుకమైన ఆంక్షల నుండి, నిర్బంధ పూరితమైన నియంత్రణ నుండి పౌరసమాజం విముక్తి పొంది స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడం ఆహ్వానించదగ్గ విషయమేగానీ ఆ స్వేచ్ఛనే ప్రజాస్వామ్యానికీ హక్కులకూ ప్రమాణంగా నిలబెట్టడం తగదు. ఎందుకంటే రాజ్యంలో ఉన్నట్టే పౌరసమాజంలోనూ అసమానతలు, అణచివేత ఉంటాయి. మనుషులు రాజ్యంలో భాగంగా కాకుండ పౌరులుగా తమ మధ్య తాము ఏర్పరచుకునే సంబంధాలన్నీ సమానతా ప్రాతిపదికన ఉంటాయన్న భరోసా లేదు. ఉదాహరణకు స్వేచ్ఛా విపణిలో పౌరులుగా వ్యవహరించేవారిలో బాగా ఆస్తులున్న వారుంటారు, కొంచెం మాత్రమే ఆస్తి ఉన్నవారుంటారు, అసలే ఆస్తి లేక

శ్రమశక్తిని అమ్ముకొని బతికే వారుంటారు. వీరిమధ్య స్వేచ్ఛా విపణిలో నెలకొనే సంబంధాలలో దోపిడీ, అణచివేత, ఆధిపత్యాలు ఉంటాయి.

రాజ్యం అదుపులేకుండ పౌరులు పౌరులుగా రూపొందించుకునే విద్యావ్యవస్థ, సాంస్కృతిక సాహిత్యరంగాలు కూడ అంతే. అవి సమానతా విలువలనూ మానవతా సంస్కృతినీ పెంపొందించి తీరుతాయన్న భరోసా ఏమీ లేదు. రాజ్యంనుండి పూర్తి స్వేచ్ఛగా ఉండే విద్యా వ్యవస్థ, సాంస్కృతిక రంగం జాత్యహంకార విలువలను ప్రచారం చేయవచ్చును, పాశ్చాత్యదేశాలలో చేసాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే రాజ్యం లాగే పౌరసమాజం అనేది కూడ అసమానతలకు నెలవు. మానవ సమాజం ఆచరణను ఊపిరాడనీయకుండ చేసి అదుపులో పెట్టుకున్న మధ్యయుగాల రాజ్య ఆధిపత్యం నుండి పౌరజీవితానికి స్వేచ్ఛ కావాలని కోరుకోవడం, దానిని సాధించుకోవడం ప్రగతిశీలకమైన చారిత్రక పరిణామమే. కానీ హక్కుల సాధనలో అదే చివరి ఘట్టం కాదు. హక్కులకు పౌరసమాజ స్వేచ్ఛే తుది నిర్వచనం కాదు.

ఈ విమర్శ ఎప్పుడయితే పాశ్చాత్య దేశాలలో వివిధ సామాజికవర్గాల నుండి, ఉద్యమాల నుండి వచ్చిందో అప్పుడు పౌరసమాజంలోని మానవ హక్కుల లేమి గురించి చర్చ మొదలయింది. కార్మికులు, స్త్రీలు, నల్లజాతీయులు పౌర సమాజంలో తమ స్థితిగతుల గురించి చర్చ పెట్టారు. హక్కులు అంటే కేవలం రాజ్యం నుండి స్వేచ్ఛేకాదు, రాజ్యేతర ఆధిపత్యాలనుండి కూడ స్వేచ్ఛ ఉన్నప్పుడే హక్కులు సంపూర్ణంగా ఉన్నట్టని ఈ సంవాదం నిర్ధారించింది. 'పౌరసమాజానికి స్వేచ్ఛ' అనే భావనకు కొనసాగింపుగా 'పౌరసమాజం లోపల స్వేచ్ఛ' అనేది ముందుకొచ్చింది. ఆవేశంగా జరిపే చర్చలో రెండవ భావన మొదటిదానికి శత్రువుగా కనిపించినా నిజానికది కొనసాగింపే.

మనుషులు ప్రకృతితోనూ ఇతర మనుషులతోనూ ఏర్పరచుకునే సంబంధాల ద్వారా తమను తాము వ్యక్తీకరించుకుంటారు. ఈ సంబంధాలకొక వ్యవస్థిత రూపం ఇచ్చే సంఘజీవిత నిర్మాణాలు మానవ స్వయం వ్యక్తీకరణకు వేదికలు కల్పిస్తాయి. ఒక సామాజిక రూపం కల్పిస్తాయి.

ఈ క్రియ మీద మధ్యయుగాలలో రాజ్యం, మతం పెట్టిన ఆంక్షలు, నియంత్రణ, మనుషుల సృజనాత్మక వ్యక్తీకరణను కుదించివేసింది. చాలా సందర్భాలలో దానిని వికృతంగా తయారు చేసింది. ఈ స్థితినుండి పాశ్చాత్య దేశాలలో మానవ సామాజిక జీవితానికి విముక్తి కల్పించిన చారిత్రక పరిణామానికి సంకేతం పౌర సమాజం అనే భావన.

పౌరసమాజం లోపల మానవహక్కులు:

అయితే ఆ విధంగా విముక్తమయిన మానవ సృజనాత్మకత అన్ని వేళలలోనూ సమానత్వంవైపు, మానవీయతవైపు ప్రయాణం చేయలేదు. అది నిర్బంధపూరితమైన

సామాజిక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఒకరి శ్రమనొకరు దోచుకునే ఆర్థిక వ్యవస్థకు రూపకల్పన చేసింది. అత్యంత స్వేచ్ఛాయుతమైన పౌరసమాజంగల 19వ శతాబ్దపు అమెరికాలో నెలకొన్న బానిస వ్యవస్థ ఇందులో మొదటిదానికొక ఉదాహరణ.

ఈ వాస్తవాన్ని బయటకు లాగి పౌరసమాజంలోని మానవహక్కుల లేమి గురించి చర్చపెట్టిన క్రమంలో రాజ్యంపట్ల అప్పటిదాకా అమలులో ఉన్న దృక్పథంలో కొంత మార్పు వచ్చింది. పౌర సమాజంలోని అసమానతలు ఎదుర్కోవడానికి బలహీనులకు ఆసరా ఎక్కడినుండి వస్తుంది? ఎవరయితే బలవంతుల మీద కూడ నిర్బంధంగా నియమాలు పెట్టి అమలు చేయగలరో వారినుండే రాగలదు. అంటే రాజ్యం నుండే రాగలదు.

పౌరసమాజాన్ని ఊపిరాడనీయకుండ అదుపు చేసిన అహేతుకమైన రాజ్యాధికారాన్ని వ్యతిరేకించిన వైఖరి స్థానంలో, పౌరసమాజంలోని అసమానతలనూ దోపిడీనీ అదుపు చేయగల సహేతుకమైన రాజ్యాధికారాన్ని ఆదరించే వైఖరి వచ్చింది. పైన చెప్పినట్లు సంవాదపు వేడిలో ఇవి పరస్పరం శత్రువైఖరులుగా కనిపించినా వాటి మధ్య శత్రుత్వమేమీ ఉండనవసరం లేదు. మొదటిది ఒక చారిత్రక దశలో ముందుకొచ్చిన ప్రజాస్వామిక భావన కాగా రెండవది తరువాతి కాలంలో దానిపైన కొత్తకోణం నుండి పెట్టిన విమర్శ తీసుకొచ్చిన సవరణ. 'రాజ్యం ఎంత తక్కువ పరిపాలిస్తే అంత మంచిది' అనేది ప్రామాణికమైన ప్రజాస్వామిక అవగాహనగా మొదటి దశలో ముందుకొచ్చింది. రాజ్యం ఎంతగా పరిపాలన చేస్తుందనేది ప్రమాణం కాదనీ, అహేతుకమైన అధికారాలు రాజ్యం చేతిలోనుండి తీసేసి పౌరసమాజానికి స్వేచ్ఛ కల్పిస్తూ, అదే సమయంలో పౌరసమాజంలోని అసమానతలనూ అణచివేతనూ అదుపు చేసే సహేతుకమైన అధికారాన్ని రాజ్యం చేతిలో పెట్టడమే కాక పెంచడం కూడ అవసరం అని రెండవ దశలో భావించడం జరిగింది.

ఈ దశలను ఈ విధంగా వివరిస్తున్నామంటే అర్థం ఈ సంవాదం ఇంత ప్రశాంతంగా జరిగిందని కాదు. విపరీతమైన ఘర్షణ రూపంలో జరిగింది. రెండు వైపులా అవాంఛనీయమైన అతివాదం చోటుచేసుకుంది. ఇప్పటికీ సంవాదం ముగియలేదు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న సరళీకరణ, ప్రపంచీకరణలు ఈ చర్చకు మళ్లీ ఊపిరి పోసాయి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన సదుపాయాలు కల్పించడం వరకే రాజ్యం కర్తవ్యం తప్ప అందులోని అసమానతల జోలికి రాజ్యం పోకూడదనేది నేడొక బలమైన వాదన.

పాశ్చాత్యదేశాలలోని పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో తమ హక్కుల కోసం, మనుగడ కోసం కార్మికులు చేసిన పోరాటాలు, ఓటుహక్కుతో మొదలుపెట్టి అన్ని రంగాలలో సమానత్వం కోసం స్త్రీలు చేపట్టిన పోరాటాలు, పౌరసత్వంతో మొదలుకొని సంపూర్ణ సామాజిక సమానత్వం కోసం అమెరికా వంటి దేశాలలో నల్లజాతీయులు (ఈ మధ్యకాలంలో అమెరికాలోనేకాక ఆస్ట్రేలియాలో కూడ ఆదివాసులు) చేసిన, చేస్తున్న

పోరాటాలు ఆ దేశాలలో పౌరసమాజంలో మానవహక్కుల కోసం జరిగిన, జరుగుతున్న పోరాటాలు.

ఈ పోరాటాలన్నీ కూడ సామాజిక సంబంధాలలో మార్పును కోరుకున్నాయి. ఈ మార్పు సాంఘిక సంస్కృతితోనూ జీవన విధానంతోనూ ముడిపడి ఉంది. కాబట్టి దీనిని రాజ్యం సాధించిపెట్టలేదు. అయినప్పటికీ ఈ మార్పుల సాధనలో రాజ్యశాసనాలకొక పాత్ర ఉండగలదు. ఈ ఉద్యమాలన్నీ ఆ రకమైన శాసన సహాయాన్ని కోరాయి, పొందాయి.

కార్మికులకు పనిగంటల పరిమితిని కల్పించిన చట్టాలు, కనీసవేతన చట్టాలు, లాభాలలో బోనస్ రూపంలో వాటా కల్పించే చట్టాలు, ఉద్యోగ భద్రతను పరిమితంగానయినా సరే కల్పించే చట్టాలు, పనిస్థలంలో జరిగే ప్రమాదాలకు నష్టపరిహారం కల్పించే చట్టాలు మొదలయినవన్నీ పౌర సమాజంలోని ఒక అసమానతను అదుపు చేసే ప్రయత్నంలో భాగంగా రూపొందిన శాసనాలే. స్త్రీలకు ఓటుహక్కు కల్పించిన చట్టాలు, విడాకుల హక్కు కల్పించిన చట్టాలు, లైంగిక హింసను నిరోధించడానికీ శిక్షించడానికీ రూపొందించిన చట్టాలు, పనిస్థలంలో సమాన వేతనాలు, ప్రసూతి సెలవు మొదలయిన హక్కులు కల్పించిన చట్టాలు మరొక అసమాన పౌరసమాజ వ్యవస్థను అదుపు చేయడానికి ముందుకొచ్చిన శాసనాలు. పౌరసత్వమే లేని నల్లజాతీయులకు పౌరసత్వం కల్పించి బానిస వ్యవస్థను రద్దుచేసిన చట్టాలు, ఆ తరువాతి కాలంలో వివిధ సామాజిక రంగాలలో నల్లజాతీయులకు సమాన అవకాశాలు కల్పించడం కోసం చేసిన చట్టాలు ఇంకొక అసమాన పౌరసమాజ వ్యవస్థపైన చేసిన పోరాటం ఫలితంగా అమెరికా రాజ్యం చేపట్టిన శాసన సంస్కరణలు.

**కమ్యూనిస్టు పార్టీల పాలనలో పౌరసమాజం:**

మధ్యయుగాల యూరప్‌లో రాజ్యం పౌరసమాజంపైన పెట్టిన నియంత్రణ సంగతి ఎట్లాగున్నా, ఆధునిక కాలంలో కమ్యూనిస్టు పార్టీలు నెలకొల్పిన నియంతృత్వాలు పౌరసమాజంపైన రాజ్యం అదుపు సంపూర్ణంగా ఉంటే ఎట్లాగుంటుందో రుచి చూపించాయి. రాజ్యం జోక్యం లేని జీవిత రంగమేదీ లేకుండ పోయింది కమ్యూనిస్టు పాలనలో. రాజ్యం జోక్యం లేకుండ, పౌరులు పౌరులుగా తమ మధ్య తాము సంబంధాలు నెలకొల్పడంగానీ తమ కోసం తాము వ్యవస్థలు రూపొందించుకోవడంగానీ సాధ్యం కాకుండ ఉండింది. రాజ్యం పర్యవేక్షణలోనే కార్మిక సంఘాలయినా, కళా సాహిత్య సంస్థలయినా, విద్యా వైజ్ఞానిక రంగమైనా నడుచుకునేవి.

కమ్యూనిస్టు పార్టీల పాలనలో ప్రజలకు పని, చదువు, వైద్యం మొదలయిన అనేక విషయాలలో హక్కులు, భద్రత దొరికినప్పటికీ పౌర సమాజాన్ని ఊపిరాడనంతగా అదుపులో పెట్టుకున్న రాజకీయ సమాజం పట్ల కాలక్రమంలో ఆ దేశాలలో తీవ్రమైన అసంతృప్తి నెలకొనింది. ఆ రాజకీయ వ్యవస్థ పతనంలో ఈ అసంతృప్తి ముఖ్యమైన పాత్ర నిర్వహించింది.

> పౌరసమాజానికి స్వేచ్ఛ, పౌరసమాజం లోపల స్వేచ్ఛ అనేవి మానవ హక్కులకు రెండు పార్శ్వాలు. మనుషులు రాజ్యం అదుపు లేకుండ స్వేచ్ఛగా ప్రకృతితోనూ ఇతర మనుషులతోనూ సంబంధాలను రూపకల్పన చేసుకునే పరిస్థితి ఉండాలి. అదే సమయంలో ఆ సంబంధాలు ఒకరి స్వేచ్ఛనూ జీవితాన్నీ మరొకరు హరించే సంబంధాలుగా ఉండకూడదు.

పౌర సమాజానికి తగుమాత్రం స్వేచ్ఛ, స్వతంత్రత అవసరమనీ లేకపోతే మానవ మనుగడలో సంతృప్తి ఉండదనీ దీనినిబట్టి అర్థం అవుతుంది.

కానీ అదే పరమావధిగా పెట్టుకున్న హక్కుల స్పృహ అసమగ్రమని కూడ పాశ్చాత్య దేశాల చరిత్రే చెప్తుంది. పౌరసమాజంలోపలి అసమానతల నుండి ఉత్పన్నమయ్యే మానవహక్కుల సమస్యలు అనేకం ఉంటాయనీ, వాటిని గుర్తించకుండ రాజ్యం అదుపు నుండి విముక్తమయిన పౌరసమాజమే మానవహక్కులకూ ప్రజాస్వామ్యానికీ అంతిమ ప్రమాణం అనుకోవడం తప్పనీ పైన చూసాం. కమ్యూనిస్టు పార్టీల ఏకచ్ఛత్రాధిపత్యాన్ని తొలగించుకుని పౌరసమాజస్వేచ్ఛను పునరుద్ధరించుకున్న యూరోపియన్ దేశాలూ ఈ సత్యాన్ని గుర్తిస్తున్నాయి. దీనికి అంతిమ పరిష్కారం ఏమైనా, ప్రస్తుత దశలో పౌరసమాజంలోని అసమానతలనూ దోపిడీనీ అదుపు చేయడంలో రాజ్యానికొక పాత్ర ఉందని ఆ దేశాల ప్రజలు గుర్తిస్తున్నారు.

అందువల్ల పౌరసమాజానికి స్వేచ్ఛ, పౌరసమాజం లోపల స్వేచ్ఛ అనేవి మానవ హక్కులకు రెండు పార్శ్వాలు. మనుషులు రాజ్యం అదుపు లేకుండ స్వేచ్ఛగా ప్రకృతితోనూ ఇతర మనుషులతోనూ సంబంధాలను రూపకల్పన చేసుకునే పరిస్థితి ఉండాలి. అదే సమయంలో ఆ సంబంధాలు ఒకరి స్వేచ్ఛనూ జీవితాన్నీ మరొకరు హరించే సంబంధాలుగా ఉండకూడదు. ఈ రెండూ ఏక సమయంలో ఒనగూడే పరిస్థితి ఏ విధంగా ఏర్పడుతుంది, ఏ మేరకు సాధ్యమవుతుంది అనేది మానవహక్కుల కృషి తుది గమ్యాన్ని నిర్దేశిస్తుంది.

**భారతదేశంలో పౌరసమాజం – మానవహక్కులు**

మానవహక్కుల అంతిమ లక్ష్యాన్ని గురించి మట్లాడుకునేటప్పుడు ఏ దేశమైనా ఒకటే కావచ్చునుగానీ, చారిత్రకంగా హక్కుల గమనాన్ని పరిశీలించేటప్పుడు ఒక దేశానికీ మరొక దేశానికీ చాలా తేడా ఉంటుంది.

పౌరసమాజం అనే భావన పౌరసమాజం – రాజ్యం అనే వర్గీకరణతో ముడిపడి ఉన్న భావన. రాజ్యం అదుపు నుండి పౌరసమాజం బయటపడి తనను తాను ఒక స్వతంత్ర జీవిత

రంగంగా రూపొందించుకునే ప్రయత్నం. 'ఆధునికత'ను నిర్వచించిన యూరప్ దేశాల చరిత్రతో పౌరసమాజం అనే భావన చారిత్రకంగా ముడిపడి ఉంది. అయినప్పటికీ 'రాజ్యం' కాని సామాజిక జీవితాన్ని 'పౌరసమాజం'గా నిర్వచిస్తే, ఆ భావనను భారతదేశానికి కూడ అన్వయించలేమా అంటే అన్వయించవచ్చును గానీ అది యాంత్రికమైన అవగాహనకు దారితీసే ప్రమాదం ఉంది. మన చరిత్రకు అది సంపూర్ణంగా అతకదు కాబట్టి మన చరిత్రకు అది పూర్తిగా న్యాయం చేకూర్చదు.

**ఆ** భావన మనకు అసలే పనికిరాదని కాదు. ఒక పరిధిలో పనికొస్తుంది. రాజ్యం (రాజకీయ సమాజం) – పౌర సమాజం అనే భావనతో బాటు ధార్మిక సమాజం (మతం) – లౌకక సమాజం అనే భావనను కూడ కలిపి తీసుకున్నప్పుడే భారతదేశ చరిత్రలో హక్కులు, ప్రజాస్వామ్యం, ఆధునికత అనే భావనలను సమగ్రంగా నిర్వచించగలుగుతాము. పాశ్చాత్యదేశాలలో కూడ స్త్రీల కోణం నుండి చూసినప్పుడిది సత్యమే. ఆ విషయం పైన చూసాం. స్త్రీల కోణంనుండే కాక సాధారణంగా కూడ మతం – లౌకిక సమాజం అనే వర్గీకరణకు కొంత ప్రాముఖ్యం ఉంది, 'ఆధునికత'ను నిర్వచించడంలో ఒక పాత్ర ఉంది. అయితే భారత చరిత్రలో ఇదే ప్రధానం. దాని నుండి విడదీసి రాజ్యం – పౌరసమాజం అనే చర్చ పెట్టడం ఇక్కడ సాధ్యం కాదు.

ఈ విషయాన్ని కొంచెం వివరంగా చూస్తేనే పౌర సమాజంలో మానవహక్కులు అనే విషయాన్ని అర్థం చేసుకోగలము. అసలు భారతదేశంలోని హైందవ సమాజంలో ఒక పౌరసమాజమే లేదనీ అటువంటిచోట ఒక ఆధునిక జాతిని నిర్మించడం ఎట్లా సాధ్యమవుతుందనీ ప్రశ్నించిన వారిలో అంబేద్కర్ ముఖ్యుడు. ఇక్కడ పౌర సమాజం (సివిల్ సొసైటీ) ఏర్పడకుండ అడ్డుకున్నది రాజ్యం కాదు, కులం. 'పౌరులు పౌరులుగా' తమ మధ్య తాము స్వేచ్ఛగా సంబంధాలు, సాంఘిక నిర్మాణాలు ఏర్పరచుకోలేకపోవడం కంటె మనుషులలో మనుషులుగా పరస్పర సంబంధాలు, సంపర్కం ఏర్పరచుకోలేక పోవడం హైందవ సమాజం ఎదుర్కొన్న సమస్య. దీనికి అడ్డమొచ్చింది రాజ్యం కాదు, రాజ్య నియంత్రణ కాదు. కులం, వర్ణధర్మం, అవి కట్టిన అడ్డుగోడలు అడ్డమొచ్చాయి.

పాశ్చాత్యదేశాలలో మధ్యయుగాలలో ఒక భూస్వామికి చెందిన భూమిలో పనిచేసే రైతులకు ఆ భూమిని విడిచిపెట్టిపోయే స్వేచ్ఛ లేదు. ఒక వృత్తి శ్రేణికి చెందిన శ్రామికులకు ఆ శ్రేణిని వదిలిపెట్టిపోయే స్వేచ్ఛ మీద పరిమితి ఉండేది. ఇవి చట్టం, అంటే రాజ్యం, పెట్టిన పరిమితులు. ఇటువంటి పరిమితులనూ నిర్బంధాన్నీ ఛేదించినాకనే స్వేచ్ఛావిపణి ఏర్పడగలిగింది. అదే క్రమంలోనే ఒక్క ఆర్థిక రంగంలోనేకాక అన్ని రంగాలలోనూ పౌరులు రాజ్యంతో నిమిత్తం లేకుండ ఒక పౌరజీవితాన్నీ పౌరజీవిత నిర్మాణాలనూ రూపొందించుకోగలిగారు.

**కా**నీ భారతీయ (అంటే హైందవ) సమాజంలో ఒక పౌరజీవితం ఏర్పడాలంటే కులం కట్టిన అడ్డుగోడలు పోవాలి. పౌర జీవితం, అంటే పౌరసమాజం ఏర్పడనిదే ప్రజాస్వామ్య

వ్యవస్థను నెలకొల్పడం సాధ్యంకాదని అంబేద్కర్ వాదించాడు. పౌరులుగా తమ సామాన్య అవసరాలనూ సమస్యలనూ చర్చించుకొని ఒక 'ప్రజాభిప్రాయం' అనేదాన్ని రూపొందించుకుంటారనే ప్రాతిపదిక మీద ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ ఆధారపడింది. దానికి కావలసిన పరస్పర సంపర్కం, సహానుభూతి కుల వ్యవస్థలో సాధ్యం అవుతాయా అన్నది అంబేద్కర్ ప్రశ్న. మనుషులు తమ కులానికి చెందిన వారితో మాత్రమే సంభాషిస్తారు, సమస్యలూ కోరికలూ పంచుకుంటారు, సహానుభూతి ప్రదర్శిస్తారు. ఆ ప్రాతిపదికమీద మాత్రమే పౌర సమాజ సంస్థలు ఏర్పాటు చేసుకొంటారు. అటువంటి చోట పౌరసమాజం నిలువునా చీలి ఉంటుంది. అదసలు పౌరసమాజమే కాదు.

పాశ్చాత్యదేశాలలో మానవ సాంఘిక జీవితం రాజ్యం అదుపునుండి బయటపడి తనను తాను ఒక పౌరసమాజంగా రూపొందించుకోవలసి వచ్చింది. అక్కడకూడ సంఘజీవితంపైన మతం ప్రభావం చాలా బలంగా ఉన్నప్పటికీ ప్రొటెస్టంట్ తిరుగుబాటు తరువాత ఆ ప్రభావం తగ్గింది. పౌరసమాజం అన్న భావన రాజ్యానికున్న సార్వత్రిక అధికారాన్ని అభావం చేసే భావనగానే ముందుకొచ్చింది, రాగలిగింది.

మరొక విషయం ఏమిటంటే యూరప్‌లో పౌరసమాజం అన్న భావన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను కేంద్రం చేసుకున్న భావన. ఆర్థిక సంబంధాలపైన యూరప్‌లో మతం ప్రభావం తక్కువే. రాజ్యం పెట్టిన (స్వేచ్ఛావిపణి దృష్టిలో అహేతుకంగా కనిపించే) నియంత్రణే ఆర్థిక వ్యవస్థలో మార్పుకు ప్రధాన అవరోధం. ఇతర విషయాలలో (ఉదాహరణకు విద్య, కుటుంబ సంబంధాలు) మతం పెట్టిన నియంత్రణే ప్రధానమయినా మార్కెట్ ఆర్థిక వ్యవస్థ యూరప్‌లో విప్లవాత్మకం అనదగిన ఒక వెల్లువగా ముందుకు రావడం వల్ల ఆధునికతకూ పౌరసమాజానికీ అదే ప్రామాణికం కాగలిగింది.

హైందవ సమాజంలో 'ధర్మం' అనేది వృత్తులను కులాలకు పంపిణీ చేయడం ద్వారా ఆర్థిక జీవితాన్ని కూడ శాసించింది. యూరప్‌లో వృత్తులు శ్రేణులుగా సంఘటితమయి ఉండేవి. వాటి సభ్యులకు మార్కెట్ ఆర్థిక వ్యవస్థ కోరుకునే స్వేచ్ఛ లేకపోవడానికి శ్రేణి నియమాలు కారణం. ఈ నియమాలకు శాసనాల ప్రతిపత్తి ఉండేది. అంటే అవి రాజ్యం ద్వారా అమలయ్యేవి.

హైందవ సమాజంలో వృత్తులు కులాలుగా ఉండడంవల్ల వృత్తిపనివారి స్వేచ్ఛకు కులధర్మం ఆటంకంగా ఉండింది. అందువల్ల ఇక్కడ ఒకవేళ మార్కెట్ ఆర్థిక వ్యవస్థ (పెట్టుబడిదారీ వ్యవస్థ) విప్లవాత్మకమైన వేగంతో రూపం తీసుకొని ఉంటే అది కుల వ్యవస్థతోనూ కుల ధర్మంతోనూ గట్టిగా తలపడి ఉండేది. రాజ్యం కంటె ఎక్కువగా కులంతో ఘర్షణ పడి ఉండేది. పౌరసమాజం రాజ్యానికుండే నియంత్రణాధికారాల కంటే ప్రాథమికంగా కులానికుండే నియంత్రణాధికారాన్ని అభావం చేయవలసి ఉండేది. పౌర సమాజం నిర్వచనమే ఇక్కడ భిన్నంగా ఉండాలి. నిజానికి దానికి 'పౌరసమాజం' కంటే 'మానవ సమాజం' అనేది సరయిన మాట అవుతుంది.

అయితే భారత సమాజంలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ విప్లవాత్మకంగా ముందుకు రాలేదు. అందువల్ల ఇక్కడ ఆధునికతకు ఆర్థికమే కేంద్రం కాదు. దానితోబాటు స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ముందుకొచ్చిన రాజకీయ ఆధునికత కూడ అంతే కేంద్రస్థానంలో ఉంది. అంబేద్కర్ పెట్టిన విమర్శకు ఇక్కడే ప్రాముఖ్యం ఉంది. కులానికి బయట మనుషుల మధ్య ఏ రకమైన సంపర్కాన్నయినా నిరుత్సాహపరిచే కులవ్యవస్థ చెక్కుచెదరకుండ ఉన్నంత కాలం రాజకీయ ఆధునికత అంటే ప్రజాస్వామ్యం – ఏ విధంగా సాధ్యం అవుతుంది? ఈ ఆధునికతను ఆవిష్కరించే పౌర సమాజం లేక మానవ సమాజం కులం పోనిదే ఎట్లా సాధ్యం అవుతుంది?

నిజానికి స్వాతంత్ర్యోద్యమానికి సమాంతరంగా ఒక పౌరసమాజాన్ని రూపొందించడం ద్వారా ఆధునికతను ఆవిష్కరించే ప్రయత్నం మన దేశంలో జరిగింది. ఇది వివిధ సంఘ సంస్కరణ ఉద్యమాల రూపంలో జరిగింది. ఈ ఉద్యమాలు కుల వ్యవస్థనూ స్త్రీల పరిస్థితినీ సంస్కరించడం తమ లక్ష్యంగా పెట్టుకున్నాయి. రెండూ కూడ బ్రాహ్మణీయ ధర్మంతోనే తలపడ్డాయి. ఏ మేరకయితే విజయవంతంగా తలపడగలిగాయో ఆ మేరకు ఒక పౌర సమాజాన్ని (భారతీయ సమాజానికి నిర్దిష్టమైన అర్థంలో) రూపొందించగలిగాయి.

## పౌరసమాజ స్వేచ్ఛ – పౌరసమాజం లోపల స్వేచ్ఛ

పాశ్చాత్యదేశాల చరిత్రలో పౌరసమాజం అనే భావనకు పెట్టుబడిదారీ మార్కెట్ వ్యవస్థను కేంద్రం చేసుకోవడం వల్ల పౌర సమాజానికి స్వేచ్ఛ (రాజ్యం నుండి), పౌర సమాజం లోపల స్వేచ్ఛ (దోపిడీ, అసమానతల నుండి) అనేవి రెండు విడివిడి భావనలుగా కనిపిస్తాయి. మొదటిదాని పరిమితులను విమర్శిస్తూ రెండవది – కార్మికులు, స్త్రీలు, నల్లజాతీయుల ఉద్యమాల ద్వారా – ముందుకొచ్చింది.

భారతదేశంలో పౌరసమాజం అనే భావనకు వర్ణధర్మానికీ కులవ్యవస్థకూ వ్యతిరేకంగా జరిగిన సామాజిక రాజకీయ కృషి కేంద్రమని పైన వివరించాము. అందువల్ల పౌరసమాజానికి స్వేచ్ఛ, పౌరసమాజం లోపల స్వేచ్ఛ అనే తేడా మరీ అంత స్పష్టంగా ఉండదు. కులం కట్టిన అడ్డుగోడలు కూలిన మేరకే పౌరసమాజానికి స్వేచ్ఛ లభిస్తుంది. అదే సమయంలో పౌరసమాజం లోపల కులపరమైన తేడాలు కూడ తగ్గుతాయి.

అయితే ఇది సాపేక్షంగా మాత్రమే సత్యం. పౌరసమాజం అనేది రూపొందడానికి వర్ణధర్మం, కులవ్యవస్థ అడ్డంగా ఉన్నాయని మనం అంటున్నామంటే మనుషుల పరస్పర సంపర్కానికీ సహానుభూతికీ కులవ్యవస్థ కల్పించే అవరోధాన్ని మాత్రమే చూస్తున్నాం. కులాన్ని సమాజంలో నిలువునా లేచిన గోడలుగా చూస్తున్నాం. ఇక్కడ కులానికుండే చీల్చే గుణమే ప్రధానం తప్ప కులానికుండే అసమాన స్వభావం, హెచ్చుతగ్గుల స్వభావం ముఖ్యం కాదు. కానీ పౌర సమాజం లోపలి అసమానతల గురించి మాట్లాడేటప్పుడు ఈ

సామాజిక జీవితం స్వేచ్ఛాయుతంగా లేకపోవడం ఒక ముఖ్యమైన హక్కుల సమస్య. రాజ్యం, మతం, ధర్మం, మూఢత్వం దీనిపైన పెట్టిన అహేతుకమైన ఆంక్షలనెదిరించి స్వేచ్ఛాయుతమైన మానవ సామాజిక ఆచరణ నిర్వచించే పౌరజీవితాన్ని, పౌరసమాజాన్ని రూపొందించుకోవడం హక్కుల చరిత్రలో ఒక ముఖ్యఘట్టం.

అసమానతలు ముఖ్యమవుతాయి. కులం అనేది సమాజంలో నిలువునా మొలిచిన అడ్డుగోడల వ్యవస్థగా కాక, సమాజాన్ని అడ్డంగా చీల్చిన నిచ్చెనమెట్ల వ్యవస్థగా కనిపిస్తుంది.

స్త్రీల విషయం కూడ అంతే. స్త్రీలు పౌర సమాజంలో, పౌర జీవితంలో భాగం కావడానికి అడ్డంగా ఉన్న కుటుంబవ్యవస్థ గురించి, దానికి ఆలంబనగా ఉన్న మత ధర్మాన్ని గురించి మాట్లాడేటప్పుడు స్త్రీల స్థితిగతులకు సంబంధించిన ఒక అంశాన్ని మాత్రమే స్పృశిస్తున్నాం. స్వేచ్ఛగా స్త్రీలు పౌరజీవితంలో భాగమయిన తరువాత కూడ, అంటే స్త్రీ పురుషులు కలిసిన సమగ్రమైన పౌరసమాజం ఏర్పడిన తరువాత కూడ, స్త్రీలు అడుగడుగునా అసమానతలు ఎదుర్కోవచ్చు. ఇంటినుండి బయటికొచ్చి పౌరజీవితంలో భాగమైన స్త్రీలు ఆ పౌర జీవితంలో ఆర్థిక అసమానతనూ, అవకాశాలలో, హోదాలో అసమానతనూ ఎదుర్కొంటూ ఉండడం మనం చూస్తూనే ఉన్నాం. ఇది పౌరసమాజం ఉనికికీ ఆవిర్భావానికీ సంబంధించిన సమస్య కాదు. పౌరసమాజం లోపలి అసమానతల సమస్య.

## ముగింపు

మనుషులు ప్రకృతితోనూ ఇతర మనుషులతోనూ ఏర్పరచుకునే సంబంధాల మొత్తమే సమాజం. ఈ సామాజిక జీవితం స్వేచ్ఛాయుతంగా లేకపోవడం ఒక ముఖ్యమైన హక్కుల సమస్య. రాజ్యం, మతం, ధర్మం, మూఢత్వం దీనిపైన పెట్టిన అహేతుకమైన ఆంక్షలనెదిరించి స్వేచ్ఛాయుతమైన మానవ సామాజిక ఆచరణ నిర్వచించే పౌరజీవితాన్ని, పౌరసమాజాన్ని రూపొందించుకోవడం హక్కుల చరిత్రలో ఒక ముఖ్యఘట్టం. ఈ పౌరజీవితం అనేక నిర్మాణాల రూపంలో ఉంటుంది. ఆర్థిక సంస్థలు, కళాసాంస్కృతిక వేదికలు, భావసారూప్యతగల వ్యక్తుల సంఘాలు, వైజ్ఞానిక సంస్థలు ఇందులో ముఖ్యమైనవి. ఇవి మానవ సృజనాత్మకతకూ క్రియాశీలమైన ఆచరణకూ ఆలోచనకూ వేదికలు. ఈ సృజనాత్మకతనూ క్రియాశీలాన్నీ అంతకు ముందున్న అహేతుకమైన నియమాలూ నిర్బంధాలూ (అవి రాజ్యం నుండి వచ్చినవిగానీ మతం నుండి వచ్చినవి గానీ) వికసించకుండ చేసాయి.


కె. బాలగోపాల్

అయితే విముక్తమైన పౌరసమాజం హక్కుల అన్వేషణలో చివరి ఘట్టం కాదు. ఆ పౌరసమాజం లోపల ఉండే అసమానతల గురించి చర్చ, ఫిర్యాదులు వెంటనే ముందుకొస్తాయి, వచ్చాయి. ఆర్థిక దోపిడీ, స్త్రీ పురుష అసమానతలు, శ్వేత జాతి ఆధిక్యత, కులపెత్తనం మొదలైన అసమానతలు పౌరసమాజంలో ఉన్నాయని గుర్తించిన తరువాత వీటికి వ్యతిరేకంగా హక్కుల ఆరాటం మొదలయింది. ఇది పౌరసమాజం మీద విమర్శగానే మొదలయింది. 'అమెరికా పౌరులమైన మేము...' అంటూ మొదలయ్యే అమెరికా రాజ్యాంగంలో 'పౌరుల'కు ఇచ్చిన నిర్వచనంలో స్త్రీలకు, నల్లజాతీయులకు, ఆస్తులు లేని కార్మికులకు చోటులేదని అది కేవలం మోతుబరులయిన తెల్లజాతి మగవాళ్లకు వర్తిస్తుందని గుర్తించిన అసమ్మతి ఉద్యమాలు తమ హక్కుల ప్రకటనను 'అమెరికాకు చెందిన ఇతర పౌరులయిన మేము' అంటూ మొదలుపెట్టాయి.

రాజ్యం, మతం పెట్టే అహేతుకమైన అదుపు నుండి మొత్తంగా సమాజానికి స్వేచ్ఛ, సమాజం లోపల మనుషులు ఒకరిపైన ఒకరు చేసే పెత్తనం నుండి, దోపిడీ నుండి స్వేచ్ఛ అనే రెండు ఆదర్శాలు కలిసినప్పుడే పౌరసమాజం పట్ల మానవ హక్కుల దృక్పథం పరిపూర్ణ రూపం తీసుకుంటుంది. దీని అర్థం పౌరసమాజంలో అమలయ్యే అణచివేత నుండీ దోపిడీనుండీ రాజ్యాన్నీ మతాన్నీ పూర్తిగా వేరు చేయగలమని కాదు. వివరణలో స్పష్టత కోసం వాటిని వేరుగా చర్చించడం జరిగింది. ఒక్కొక్క సందర్భంలో అవి ఏ విధంగా కలగలిసి ఉంటాయనేది నిర్దిష్టంగా విశ్లేషించవలసిన విషయమే.

# నివాళి వ్యాసాలు

# ఇదా దేశభక్తి !



గోపి రాజన్న
1947 - 12.1.1985

**1985** జనవరి 12 రాత్రి 9-30 గంటలప్పుడు ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం జగిత్యాల తాలూకా ఉపాధ్యక్షుడు, అడ్వకేట్ గోపి రాజన్న జగిత్యాల పట్టణంలో తుపాకులతో కాల్చి చంపబడ్డాడు. చంపినవాళ్ళు 'దేశభక్తి' గురించి, 'అహింస' గురించి నిత్యం ఆక్రోశించే రాష్ట్రీయ స్వయం సేవక సంఘం (ఆర్.ఎస్.ఎస్). భారతీయ జనతాపార్టీ (బిజెపి) లకు చెందిన వాళ్ళు. ఒక పద్ధతి ప్రకారం ప్లాన్ వేసుకొని వచ్చి భార్యతో సినిమాకు పోయిన గోపి రాజన్న ఇంటిబయట కాపుకాసి, వాళ్ళు తిరిగి రాగానే కాల్చి చంపారు. హంతకులను పట్టుకునే ప్రయత్నం చేసిన రాజన్న భార్యను తలమీద తుపాకి మడమతో స్పృహ కోల్పోయేలాగ కొట్టి పడేసి పోయారు.

అహింస గురించి, ఈ మధ్యకాలంలో గాంధీయిజం గురించి నిరంతరం మాట్లాడే ఆర్.ఎస్.ఎస్. - బి.జె.పి.లకు గోపిరాజన్నను చంపాల్సిన అవసరం ఏం వచ్చింది?

భూమిలేని పేద రైతు కుటుంబంలో (జగిత్యాల తాలూకా కోలవాయి గ్రామంలో)

'స్వేచ్ఛ' సంపాదకీయం, ఫిబ్రవరి 1985

పుట్టిన రాజన్న ట్యూషన్‌లు చెప్పుకొని చదువుకున్నాడు. ఈ ఆర్.ఎస్.ఎస్. వారి 'శిశు మందిర్'లోనే చదువు చెప్పాడు. కాని ఆర్.ఎస్.ఎస్. ఫాసిస్టు స్వభావాన్ని, ఆ సంస్థమీద పెత్తందార్ల పెత్తనాన్ని చూసి విసిగిపోయి వదిలిపెట్టాడు. 'లా' చదివి 1981లో జగిత్యాలలోనే ప్రాక్టీసు పెట్టాడు. అప్పటినుండి పౌరహక్కుల సంఘంలో పనిచేస్తున్నాడు. 'కల్లోలిత ప్రాంతంగా' ఆరేళ్ళ క్రితం ప్రకటించిన జగిత్యాల తాలూకాలో పేద ప్రజల మీద పోలీసులు చేస్తున్న పాశవికమైన అత్యాచారాలను ఖండించడంలో నిరంతరం కృషి చేశాడు. పోలీసులు పేద రైతాంగం మీద మూకుమ్మడిగా తప్పుడు కేసులు బనాయిస్తూ వుంటే, ఒక పేద రైతు ఇంట్లో పుట్టి వకీలు పట్టా తీసుకున్న వ్యక్తిగా వాళ్ళకు వృత్తిపరంగా సహాయం చేశాడు. ఒక సంవత్సరం క్రితం జగిత్యాల బార్‌లోని ఆర్.ఎస్.ఎస్. – బి.జె.పి న్యాయవాదులు రాజన్నను కోర్టులో పట్టుకొని తలుపులు మూసి 'నక్సలైట్లపై కేసులు చేయడం మానేయమ'ని, 'పౌరహక్కుల సంఘంలో పనిచేయడం మానేయ'మని బెదిరించారు. అయినా రాజన్న బెదరలేదు.

అందుకే రాజన్నను ఆర్.ఎస్.ఎస్. – బి.జె.పి. ఫాసిస్టులు చంపారు.

దేశంలో ఎక్కడయినాసరే ప్రజల పక్షాన నిలబడి వాళ్ళవాళ్ళ హక్కుల గురించి అడిగేవాళ్ళు వీళ్ళకు శత్రువులు. పేదల కేసులు చేయడానికి వీలులేదట. వాళ్ళను అన్యాయంగా పోలీసులు కొడితే అడగటానికి వీలులేదట. కేసులు చేసినా, అడిగినా చంపుతారట. చంపడానికి వీళ్ళకు ఆయుధాలను ఎన్టీఆర్ ప్రభుత్వం ఇచ్చింది. 'ఆత్మరక్షణ' కోసం ఆయుధాలు కావాలని అడిగి తీసుకొని ప్లాన్ ప్రకారం రాజన్నను హత్యచేశారు. 'కల్లోలితప్రాంతం'గా ప్రకటించిన జగిత్యాలలో ఆయుధంగాని, ఆయుధంగా ఉపయోగించబడగల పరికరంగాని చేతిలో పట్టుకోవటం చట్టప్రకారం నేరం. ఎంతో మంది పేదరైతులను చేతిలో కొడవలి, గొడ్డలి, పలుగు, పార ఉన్నాయని చెప్పి వాళ్ళను 'తీవ్రవాదులు' అని అరెస్టుచేసి కేసులుపెట్టి కోర్టులచుట్టూ తిప్పుకున్నారు. అటువంటి ప్రాంతంలో ప్రభుత్వం ఈ 'అహింసావాదులకు' ఆయుధాల లైసెన్సులు ఎట్లా ఇచ్చింది? ప్రతిపక్షాల ఐక్యత పేరిట బి.జె.పి.కి ఎన్టీఆర్‌తో కుదిరిన సఖ్యసంబంధం ఫలమా యిది?

పేదప్రజలపై పోలీసులు, అధికార యంత్రాంగం, పెత్తందార్లు చేసే అత్యాచారాలను పౌరహక్కుల సంఘం ఖండిస్తుంది. కూలికోసం, రెండు గుంటల భూమికోసం పోరాడేవాళ్ళను మూకుమ్మడి నేరస్తులుగా ప్రకటించి వాళ్ళను చిత్రహింసల పాలుచేస్తే పౌరహక్కుల సంఘం వ్యతిరేకిస్తుంది.

గత ఆరేళ్ళుగా తెలంగాణ జిల్లాలలో, ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలో పేద ప్రజలపై ఇటువంటి దాడులు విపరీతంగా సాగుతున్నాయి. గ్రామాలమీద పడి పోలీసులు రైతాంగాన్ని గొడ్లను బాదినట్లు బాదుతున్నారు. వాళ్ళ ఇళ్ళను కూలగొడుతున్నారు. కుండలు, గాదెలు పగులకొడుతున్నారు. రేడియోలవంటి విలువైన వస్తువులను నాశనం చేస్తున్నారు. యువకులను అరెస్టు చేసి రోజుల తరబడి అక్రమ నిర్బంధంలో ఉంచి రోకలిబండలెక్కించి

తొక్కుతున్నారు. చర్మం ఊడిపోయేలా చితకబాదుతున్నారు. వారి పొలాల్లోకి పశువులను తోలి మేపుతున్నారు. పొలాలకు నీరు ఆపి ఎండబెడుతున్నారు. యువకులను గ్రామాలనుండి తరిమేసి వారిమీద ఆధారపడి బతికే కుటుంబాలను నాశనం చేస్తున్నారు. బెదిరించి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. తప్పుడు కేసులు బనాయించి కోర్టులచుట్టూ తిప్పుతూ ఇళ్ళు గుల్లచేస్తున్నారు. పౌరహక్కుల సంఘం ఈ అక్రమాలను వ్యతిరేకిస్తుంది. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తుంది. ఇది ఆర్.ఎస్.ఎస్ – బి.జె.పి.లకు ఎందుకు అభ్యంతరకరంగా కనిపిస్తోందో ప్రజలు ఆలోచించాలి. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి కంకణం కట్టుకున్నట్టు మాట్లాడే ఈ సంస్థలు పోలీసు అత్యాచారాలను వ్యతిరేకించే వాళ్ళను ఎందుకు హత్యచేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. అయినా, పౌరహక్కుల సంఘం ఈ బెదిరింపులకు హత్యలకు భయపడి తన కర్తవ్యాన్ని వదిలిపెట్టదు. గోపి రాజన్న హత్య పౌరహక్కుల సంఘాన్ని మరింత దృఢదీక్షతో పనిచేయిస్తుందే తప్ప ఈ ప్రజావ్యతిరేకులు ఆశించినట్టు భయపెట్టదు.

# డా॥ రామనాథంకు జోహార్లు



డా॥ రామనాథం
16.10.1933 - 3.9.1985

పిల్లవాడికో పిల్లదానికో ఒంట్లో బాగాలేకపోతే "రామనాథం దవాఖానాకు పోదాం పద" అనేవారు నిన్నటిదాకా వరంగల్‌లో. 17 సంవత్సరాలుగా ఆదివారం సాయంకాలాలు మినహాయిస్తే ఒక్క పూట కూడా తప్పకుండ రోజుకు 8 గంటలు పసిపిల్లలకు వైద్యంచేసే 'రామనాథం డాక్టరు' ప్రమాదకరమైన నక్సలైట్ అని వసంతనాగేశ్వరరావు కనుగొన్నాడు. కాని, తమ పిల్లలకు దగ్గొచ్చినా కడుపు నొచ్చినా ఆయన దగ్గరకు మోసుకొచ్చే కూలి నాలి స్త్రీలు ఈ మాట వింటే ఆశ్చర్యపోతారు. 'ఆయనకు ఎంతో మంది శత్రువులు, ఎవరయినా చంపి ఉండవచ్చు' నంటాడు వరంగల్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్. సాయంత్రమయితే ఆయన క్లినిక్ బయట

పిల్లాడినెత్తుకొని 'ఇంకా రాలేదే డాక్టర్ సాబ్' అని ఎదురు చూసే తల్లులకు, ఓర్పు చెదరని ఆ ముఖం కోసం వత్తులు పెట్టుకొని చూసే కళ్ళే తప్ప ఆయన్ను ద్వేషించే కళ్లుంటాయని తెలీదు. పౌరహక్కుల సంఘం బాధ్యుడుగా పోలీసుల అత్యాచారాలను బహిర్గతం చేస్తున్నావు జాగ్రత్త సుమా అంటే


'స్వేచ్ఛ'లో, బ్రోచర్లలో రాసిన వ్యాసాలనుంచి కొంతభాగం, 1985-90

'వరంగల్‌లో పోలీసుల పిల్లలకు మాత్రం నేను తప్ప వేరే డాక్టరు ఎవరు?' అనేవాడు ఆయన. కాజీపేట ఎస్.ఐ.ని ఎవరో చంపారని ప్రతీకారంగా ఆ పిల్లల తండ్రులే తనను దారుణంగా హతమారుస్తారని ఆయన కలలోకూడా ఊహించలేదు.

డాక్టర్ రామనాథం కేవలం వైద్యుడేకాదు. ఆయన అన్యాయాన్ని బలంగా వ్యతిరేకించిన మానవతావాది. న్యాయంకోసం, సమానత్వం కోసం జరిగిన ప్రతి పోరాటానికి అండగా నిలబడ్డారు. ప్రజలు ఎక్కడ బాధలో వున్నా ఒక వైద్యుడుగానూ, మనిషిగానూ స్పందించారు. 1977లో ఉప్పెన దివిసీమను తాకినప్పుడు ఆ ప్రాంతానికి వెంటనే వెళ్ళి వైద్యశిబిరం నెలకొల్పిన డాక్టర్లలో ఆయనొకరు. ప్రభుత్వ డాక్టర్లు 1981వ సంవత్సరంలో దీర్ఘకాలం సమ్మెచేసినపుడు వరంగల్ ప్రజలకోసం ఆయన డాక్టర్ అంజద్ అలీతో కలిసి ఉచిత వైద్య శిబిరం నడిపారు. కులాంతర వివాహాల నుండి భూమికోసం కూలికోసం పేదలు చేసిన పోరాటాల దాకా అభ్యుదయాన్ని, సమానత్వాన్ని ఆకాంక్షించే ప్రతి పోరాటానికి ఆయన సానుభూతితో స్పందించారు.

ఆయన మన రాష్ట్ర పౌరహక్కుల ఉద్యమ నిర్మాతల్లో ఒకరు. పోలీసు జులుం పెరిగిపోతున్న తరుణంలో ఆయన రాజ్యాంగం ప్రజలకు, ముఖ్యంగా అత్యంత బలహీనులైన గ్రామీణ పేదలకు భరోసా యిచ్చిన హక్కుల సంరక్షణ కోసం గట్టిగా పోరాడారు. దానికి తన ప్రాణాన్నే మూల్యంగా చెల్లించారు. తమ దుర్మార్గాలను ఎత్తిచూపే వాళ్ళపట్ల తీవ్రమైన అసహనం ప్రదర్శించడం మన దేశ పాలకుల నైజం. దాని వల్ల అటువంటి విమర్శకులందరూ తమ ఉద్యోగాలను, స్వేచ్ఛను, కొన్ని సందర్భాలలో ప్రాణాల్ని కూడా పణంగా చెల్లించారు. డాక్టర్ రామనాథం ఎమర్జెన్సీలో ఒకసారి, 1985 జనవరిలో మరొకసారి అరెస్టయ్యారు. చివరికి 1985 సెప్టెంబర్ 3వ తేదీన వరంగల్‌లోని జయప్రకాశ్ నారాయణ్ రోడ్డు మీది తన క్లినిక్‌లో పనిలో నిమగ్నమై వున్న డాక్టర్ గారిని పోలీసులు కాల్చి చంపారు.

కూలి సరిగ్గా ఇవ్వని భూస్వాములను కూలి అడగడానికీ, భూములు పంచని పాలకులను భూములు అడగడానికీ, అడవులను ఆక్రమించుకొన్న ప్రభుత్వానికి అవి గిరిజనుల అడవులని చెప్పడానికీ, కార్మికుల పని పరిస్థితులు మెరుగుపరచండని యజమానులను నిలదీయడానికీ, పండించిన పంటకు గిట్టుబాటుధర అడగడానికీ, పంట పండించడానికి నీళ్ళూ కరెంటూ ఎరువులూ మందులూ చవగ్గా ఇవ్వాలని అడగడానికీ, తమ భాషకూ మతానికీ సంస్కృతికీ న్యాయం చేకూర్చాలని డిమాండు చేయడానికీ జనం ఐక్యమై ఆందోళన చేస్తే దానిని తీవ్రవాదం అనడానికి వీలులేదని డాక్టర్ రామనాథం అన్నారు. ఆ ఆందోళన ఏ సామాజిక దృక్పథాన్ని ఎంచుకొన్నా ఏ పోరాట రూపాన్ని అనుసరించినా దానినొక రాజకీయ పోరాటంగా పరిగణించి రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప శాంతి భద్రతల సమస్యగా పరిగణించి సంఘ వ్యతిరేక ముద్రవేసి హింసాత్మకంగా అణచడానికి వీలులేదన్నారు. ఆందోళనకారులు నేరాలు చేస్తే మంచిపని చేసారని ఆయన అనలేదు,

చట్టబద్ధంగా వాళ్ళను శిక్షించవద్దనలేదు. కానీ ఆందోళననే ఒక నేరంగా భావించడానికి వీలులేదన్నారు. ఇవన్నీ ఆయన నమ్మాడు కాబట్టే పౌరహక్కుల సంఘం నిర్మాతలలో ఒకడయి వరంగల్ జిల్లాశాఖ అధ్యక్షునిగానూ రాష్ట్ర ఉపాధ్యక్షునిగానూ బాధ్యత స్వీకరించి పనిచేసారు. వరంగల్‌లో అత్యంత జనాదరణ పొందిన పిల్లల డాక్టరుగా తన విధి నిర్వహణను కొనసాగిస్తూనే పౌరహక్కుల పరిరక్షణ గురించి తపన చెందారు, కృషిచేసారు.

ఈ కృషి గిట్టని వరంగల్ జిల్లా పోలీసు యంత్రాంగం కాజీపేట ఎస్.ఐ. యాదగిరిరెడ్డి మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకుపోతూ ఆ రోడ్డు మీదనున్న డాక్టర్ గారి క్లినిక్ మీద దాడి చేసింది. క్లినిక్‌ను ధ్వంసం చేయడంతో పాటు ఆయన్ని కాల్చి చంపారు. ఈ ఊరేగింపుకు నాయకులు వరంగల్ రేంజి డిఐజి జనక్‌రాజ్ తివారి, జిల్లా ఎస్.పి. అరవిందరావు. హంతకుల బృందానికి సారథులయిన ఈ యిద్దరినిగానీ అందులో భాగస్వాములయిన ఇతర జిల్లా పోలీస్ అధికార్లనుగానీ ఇప్పటిదాకా అరెస్టు చేయలేదు, కనీసం విచారించలేదు. ఎఫ్ఐఆర్ రాసిన క్షణమే ఈ కేసు మూతపడింది. అసెంబ్లీలో ప్రశ్నల ఫలితంగా ప్రభుత్వం నియమించిన సిబిసిఐడి విచారణ అధికారి హంతకులు పోలీసులు కాదనీ ఎవరో రాజకీయ శత్రువులనీ ఎపిసిఎల్‌సి బాధ్యులతో మాట్లాడుతూ అన్నాడు. ఆయన 'నివేదిక' దానిని అనుసరించి ఉంటుందని భావించవచ్చు.

అయినా, డాక్టర్‌గారిని చంపింది ఒక వ్యక్తికాదు. రాజ్యాంగ యంత్రం ఆయనను చంపింది. రాజ్యాంగ యంత్రం తనను తాను శిక్షించుకుంటుందని ఏ మూర్ఖులూ నమ్మరు కాబట్టి డాక్టర్‌గారి హత్యకేసులో 'న్యాయం' జరుగుతుందా అనేది అర్థరహితమయిన ప్రశ్న. ప్రజా చైతన్యం పెరిగి రాజ్యాంగ యంత్రం పశుత్వాన్ని ప్రజలే ఎదుర్కొనగలిగిన నాడే నిజమైన 'న్యాయం' జరుగుతుంది. ఆ చైతన్యం ప్రజలలో పెరగడం మినహా వేరే 'న్యాయం' డాక్టర్‌గారూ కోరుకొని ఉండేవారు కాదు, మేమూ కోరుకోవడం లేదు.

# మౌనం నిశ్శబ్దం కాదు


జాపా లక్ష్మారెడ్డి
1917 - 7.11.1986

లక్ష్మారెడ్డి గుబురు మీసాలు, మూడురోజుల గడ్డం, ముడతలు పడ్డ మొహం కరీంనగర్‌లో అందరికీ చిరపరిచితమే. 65 ఏళ్ళ ఆ వృద్ధుడు అక్కడ అందరికీ ఆప్తుడు, ఆత్మీయుడు. వామపక్ష ప్రజాస్వామిక ఉద్యమాలలో, అదీ పోరాటగడ్డ అయిన తెలంగాణలో నాలుగు దశాబ్దాల పాటు క్రియాశీల పాత్ర నిర్వహించడంవల్ల ఆయనకు ఆ జిల్లాలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు, అయాచిత గౌరవం లభించాయి. దీనివల్ల ఏ శత్రువూ తనను ఏమీ చేయలేడనే ధీమా కూడా ఆయనకు ఉండేది. 'నేను యువకుడిగా ఉన్నపుడే రజాకార్లు నన్ను ఏమీ చేయలేదు. ఇవ్వాళ నన్ను ఎవరో ఏదో చేస్తారనే భయం వ్యర్థం' అని ఆయన తన శ్రేయోభిలాషులకు తరచూ చెప్పేవాడు. అయితే ఆయన అంచనా తప్పయింది. ఖాసిం రజ్వీ నాయకత్వంలోని రజాకార్లు చేయలేని పని, 200 మంది భూస్వాములు సాహసించలేని పని ఎన్టీఆర్ పోలీసులు చేయగలిగారు.

'స్వేచ్ఛ' మాసపత్రిక, డిసెంబర్ 1986

ఆయనను నవంబర్ 7 తెల్లవారుజామున యింటినుంచి బయటకు లాగి కణతకు గురిపెట్టి కాల్చి చంపారు. జాపా లక్ష్మారెడ్డి కరీంనగర్‌కు 4 కి.మీ దూరంలోని అల్గునూరులో వ్యవసాయం చేసేవారు. పదెకరాల

కమతం. పాతికేళ్ళ లోపే తెలంగాణ పోరాటంలో పాల్గొని కొరియర్‌గా పనిచేశారు. దేశ్‌ముఖుల దోపిడీ, ఆర్థిక మాంద్యం ఫలితంగా ఏర్పడిన దారిద్ర్యం ఎలా తామందరినీ కమ్యూనిస్టు రాజకీయాలవైపు నడిపించిందీ ఆయనకు యివాళ్టికీ బాగా గుర్తే. తెలంగాణ పోరాట విరమణ తరువాత కూడా ఆయన అన్ని ప్రజాస్వామిక పోరాటాలకు చేరువలోనే ఉంటూ వచ్చారు. కరీంనగర్ జిల్లా సి.పి.ఐ. కార్యవర్గంలో 1950 నుంచి 1959 వరకు ఉన్నారు. అల్గునూరుకు సర్పంచ్‌గా ఎన్నికై 15 ఏళ్ళపాటు ఆ పదవిలో కొనసాగారు. 1962లో కమ్యూనిస్టు పార్టీ చీలడానికి రెండేళ్ళ ముందే స్వతంత్ర మార్క్సిస్టు గ్రూపులో చేరి పనిచేశారు. 1970 దశకం ప్రారంభంలో (ఆ తరువాత అనేక రాష్ట్రాలకు 'మార్గదర్శకం'గా) ఎన్‌కౌంటర్ హత్యలు ప్రారంభమైనపుడు వాటిని నిరసించిన కొద్దిమందిలో లక్ష్మారెడ్డి ఒకరు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడిగా మహాకవి శ్రీశ్రీ కరీంనగర్ వచ్చినపుడు అక్కడ పౌరహక్కుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది లక్ష్మారెడ్డే. అప్పట్నించీ అంటే 1974 నుంచి ఆయన మా సంఘం కార్యవర్గసభ్యుడని గర్వంగా చెబుతున్నాం.

ఆయన ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల ఉద్యమ నిర్మాతల్లో ఒకరు. 1978లో కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, సిరిసిల్ల తాలూకాలను ప్రభుత్వం కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి పోలీసులకు అసాధారణ అధికారాలు కట్టబెట్టింది. అంతకు ముందే మంథని, మహదేవ్‌పూర్ తాలూకాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించారు. ఆ సమయంలో ఆ జిల్లాలో పౌరహక్కుల ఉద్యమాన్ని నిర్మించే బాధ్యతను స్వీకరించడానికి ఎంతో దీక్ష, ధైర్యం అవసరం. ఆ రెండు ఆయనకు పుష్కలంగా ఉండేవి. ఆనాటి పరిస్థితులకు స్పందించి లక్ష్మారెడ్డి ప్రోద్బలంతో పౌరహక్కుల ఉద్యమంలో చేరిన యువన్యాయవాదులు, అధ్యాపకులు ఎందరో ఉన్నారు. ఎ.పి.సి.యల్.సి. జిల్లా శాఖ అధ్యక్షుడు, కార్యదర్శి హోదాలో ఆయన వారిని మంచి కార్యకర్తలుగా తీర్చిదిద్ది, ఆ తరువాత వారు దాడులకు, అరెస్టులకు, చిత్రహింసలకు, ఆఖరికి హత్యలకు గురికావడాన్ని కూడా కళ్లారా చూడవలసి వచ్చింది. నిర్బంధాన్ని భరించలేక తప్పనిసరై చాలామంది రాజీనామా చేసి సంస్థనుంచి తప్పుకున్నా ఆయన మాత్రం చెక్కు చెదరకుండా చివరికంటా నిలిచారు.

కరీంనగర్ జిల్లాలో గత ఏడాది కాలంగా ఎన్ని ఎన్‌కౌంటర్లు జరిగినా నిజనిర్ధారణ కమిటీలు వెళ్ళలేని పరిస్థితి ఏర్పడితే, కనీసం వీటిని ఆపడంకోసం అక్రమనిర్బంధంలో ఉన్న వ్యక్తుల గురించి ఆయన ఎప్పటికప్పుడు పత్రికా ప్రకటనలు యిచ్చేవారు.


భారతదేశంలోని పౌరహక్కుల సంఘాలన్నింటికీ నిజనిర్ధారణే అన్నిటికంటే పెద్ద పని. (మరే దేశంలోని పౌరహక్కుల సంఘాలు యింతగా నిజనిర్ధారణ చేయవలసిన అవసరం

ఉండదు.) కాని కరీంనగర్‌లోని కల్లోలిత ప్రాంతాలలో భయం దాదాపు భౌతికరూపం దాల్చి ఎవరినీ నోరు మెదపనివ్వదు. ఆర్వాల్ మారణ కాండ తరువాత బాధితులు జర్నలిస్టులతో, పౌరసంఘాల వాళ్ళతో స్వేచ్ఛగా మాట్లాడగలిగారు. కాని కరీంనగర్ గ్రామాల్లో అది చాలా కష్టసాధ్యం. అటువంటి భయానక పరిస్థితుల్లో కూడా లక్ష్మారెడ్డి వారిచేత మాట్లాడించ గలిగేవారు. వారు తమ కష్టాలు చెప్పుకునేట్టు చేయగలిగేవారు. వాళ్ళలో ఒకడుగా కలిసిపోవడమే యిందుకు ముఖ్య కారణం. దీనివల్ల ప్రజాస్వామిక ఉద్యమానికి ఆయన ఎంతో విలువైన వ్యక్తిగా మారితే ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులకు ద్వేషపూరితుడయ్యాడు.

'బహిరంగ సభలు పెట్టలేకపోవచ్చు. కరపత్రాలు అచ్చేసి పంచలేకపోవచ్చు. పోలీసు అత్యాచారాలను, హత్యలను పరిశోధించలేకపోవచ్చు. కాని అక్రమ నిర్బంధం గురించి ప్రపంచానికి తెలిపి ఎన్‌కౌంటర్ హత్యను ఆపే ప్రయత్నం చేయకుండా మమ్మల్ని ఎవరూ ఆపలేరు' అని ఆయన నిర్భయంగా చెప్పేవాడు. ఈ ఏడాది మేలో 'ఫియర్ వికాస్' బంద్ సందర్భంగా పోలీసులు ఆయన యింటిపై దాడిచేసి, కొడుకును కొట్టి మీ అయ్యను చంపుతామని బెదిరించినా లక్ష్మారెడ్డి బెదిరిపోలేదు. చనిపోవడానికి కొద్దిరోజులు ముందు కూడా మంథని ఆంధ్రజ్యోతి విలేఖరిని పోలీసులు అరెస్టుచేస్తే దాన్ని ఖండిస్తూ ఆయన ఒక ప్రకటన యిచ్చారు.

నవంబర్ 6వ తేదీ రాత్రి కొందరు నక్సలైట్లు పెద్దపల్లి డి.ఎస్.పి.ని హత్య చేశారన్న కోపంతో, అంతకుముందు వరంగల్ పోలీసులు నెలకొల్పిన 'ఆదర్శం' ప్రకారం కరీంనగర్ పోలీసులు జిల్లాలో నిర్భయంగా సంచరిస్తున్న ఏకైక పౌరహక్కుల నాయకుడిని కాల్చి చంపారు. అణచివేత సైతం సాధించలేని ఆయన మౌనాన్ని ఎట్టకేలకు భౌతికంగా సాధించామని వారు విర్రవీగుతుండొచ్చు కానీ ఆయన మౌనంగా లేరు. ఈ సారి తనమీదే జరిగిన అత్యాచారాన్ని నిర్జీవంగా ఉండి కూడా ప్రపంచానికి ఎలుగెత్తి చాటుతున్నారు.

# ప్రభాకరరెడ్డి బాటలో సాగండి



నర్రా ప్రభాకరరెడ్డి
19.8.1954 - 7.12.1991

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం వరంగల్ జిల్లా శాఖ కన్వీనర్లలో ఒకరయిన నర్రా ప్రభాకరరెడ్డిని డిసెంబర్ 7వ తేదీ ఉదయం 7-30 గంటలకు హనుమకొండలో ఆయన ఇంట్లోనే పోలీసులు కాల్చేసారు. తెల్లబట్టలలో నలుగురు పోలీసులు స్కూటర్లపై వచ్చి బండ్లు ఆయన ఇంటికి రెండు ఫర్లాంగుల దూరాన ఆపి కాలినడకన ఇంటి దగ్గరికి వచ్చారు. ప్రభాకరరెడ్డితో పని ఉందంటూ ఇంటి ముందు గదిలోకి ప్రవేశించారు. లోపలి గదినుండి బయటకు వచ్చిన ప్రభాకరరెడ్డి తలకు రివాల్వర్ పెట్టి మాటామంతీ లేకుండా కాల్చేసారు. తలలో రెండు, ఆ తరువాత ఛాతీలో రెండు బుల్లెట్లు కాల్చగా ప్రభాకరరెడ్డి అక్కడికక్కడే చనిపోయాడు. హంతకులు తాపీగా తమ స్కూటర్ల దగ్గరికి నడిచిపోయారు.

'మాకేమీ తెలియదు' అని వరంగల్ జిల్లా ఎస్.పి. డి.టి.నాయక్ నటించినా ప్రభాకరరెడ్డిని చంపింది పోలీసులేననడంలో పౌరహక్కుల సంఘానికే కాదు, ప్రజలకు కూడా



స్వేచ్ఛ మాసపత్రిక, నవంబర్ - డిసెంబర్ 1991

ఎటువంటి సందేహం లేదు. ప్రభాకరరెడ్డి పోలీసులకు తప్ప వేరే ఎవ్వరికీ ఆటంకం కాలేదు. పోలీసులకు ఆటంకమయ్యాడంటే వాళ్ల చట్టబద్ధమయిన విధి నిర్వహణకు ఆటంకమయ్యాడని కాదు. వాళ్ళ చట్టబాహ్యమయిన రాక్షసత్వానికి ఆటంకం అయ్యాడు.

1985 సెప్టెంబర్ 3న డాక్టర్ రామనాథం గారిని అప్పటి జిల్లా ఎస్‌పి అరవిందరావుగారి ఆధ్వర్యాన పోలీసులు హత్య చేసిన తరువాత దాదాపు అయిదేళ్లు వరంగల్‌లో పౌరహక్కుల సంఘం పనిచేయలేదు. అయిదేళ్ళలో వరంగల్ పోలీసులు 32 మందిని 'ఎన్‌కౌంటర్ల' పేరిట కాల్చేసారు. 11 మందిని అరెస్టు చేసి లాకప్పుల నుండి మాయం చేసారు. లెక్కలేనంత మంది పేద రైతులను, భూమిలేని కూలీలను అపారమైన హింసకు గురిచేసారు. దాదాపు 100 మంది మీద 'టాడా' కేసులు పెట్టారు. ఈ రాక్షసత్వాన్ని ప్రశ్నిస్తే కాల్చి పారేస్తారేమోనని వరంగల్‌లోని ప్రజాస్వామికవాదులంతా భీతిల్లే వాతావరణం పోలీసులు కల్పించారు.

ఈ భయాన్ని శాశ్వతం కానీయడానికి వీలు లేదని ముందుకొచ్చిన సాహసి ప్రభాకరరెడ్డి. ఆ సాహసానికి పరిహారమేమిటో తెలిసీ పౌరహక్కుల సంఘాన్ని జిల్లాలో పునరుద్ధరించడానికి కృషి చేయడమే కాదు, న్యాయవాదిగా 'నక్సలైట్ల' కేసులు నిబద్ధతతో చేయడమూ సాహసమే. గతంలో ఆ కేసులు చేసిన న్యాయవాదులు ఎటువంటి బెదిరింపులు రుచి చూసారో, ఏ పరిస్థితిలో వరంగల్ వదిలిపెట్టి పోయారో ప్రభాకరరెడ్డికి తెలుసు. అయినా ఖాతరు చేయకుండా ఆ కేసులు చేపట్టాడు. అప్పుడొకటి, ఇప్పుడొకటి కాదు. 'నక్సలైట్లు' అనే పేరు మీద పోలీసులు జైలుకు పంపిన వారందరి కేసులూ తన బాధ్యతగానే భావించాడు. ఒక ఉద్యమంగా వాటిని చేపట్టాడు. రెండేళ్ల వ్యవధిలో 'టాడా' కేసులు ఎదుర్కొంటున్న దాదాపు 700 మందికి బెయిలు తీసుకున్నాడు. జిల్లా కోర్టు ఆవరణలో ప్రభాకరరెడ్డి ఎక్కడుంటాడని ఎవరిని అడిగినా 'నక్సలైట్ స్పెషల్ కోర్టు' అయిన మూడవ అదనపు మేజిస్ట్రేటు కోర్టువైపు తడుముకోకుండా చూపించేవారు. అంతగా ఆ బరువు తనమీద వేసుకున్నాడు.

ఈ కేసులు చేసేవాడనే కాదు, ఫీజు అడగకుండా చేసేవాడని కూడా పోలీసులకు చాలా కోపంగా ఉండేది. ఇది బహుశా ఆశ్చర్యం కలిగిస్తుందేమో. పేదలకు ఉచిత న్యాయసహాయం అందించాలని భారత రాజ్యాంగంలోని అధికరణం 39-ఎ ఒక ఆదేశిక సూత్రంగా చెప్తుంది. రాజ్యాంగమంటే పోలీసులకు గౌరవం లేదనుకున్నా, న్యాయవాది ముద్దాయిల దగ్గర ఫీజు ఎంత తీసుకుంటే వాళ్లకేం తేడా వచ్చిందని అనుకోవచ్చు. అదే పొరబాటు. నిజంగా నేరం చేసారన్న అనుమానం మీద పెట్టే కేసులయితే ఇతర విషయాల గురించి పోలీసులు పట్టించుకోనవసరం లేదు. కానీ కేసులు పెట్టేది నిజమయిన అనుమానం మీద కాదు. వేధింపు కోసం. ఆర్థికంగా క్రుంగదీయడం కోసం. జీవితాన్ని దుర్భరం చేయడం కోసం. నక్సలైట్ రాజకీయాల వల్ల భూములు పొందినవాళ్లు, కూలిరేట్లు, జీతాలు పెంచుకున్న వాళ్లు, రకరకాల ఇతర సామాజిక ప్రయోజనాలు పొందిన వాళ్లు, ఆ

ప్రయోజనాల కంటే ఎక్కువ నష్టంపాలు కావాలి. 'ఎందుకొచ్చిన పోరాటాలు' అని విసుగు చెందాలి. ఊళ్ల మీద దాడులు అందుకోసమే. ప్రజలను మూకుమ్మడిగా చావబాదడం అందుకోసమే. ఇళ్ళు కూల్చడం ఇంట్లోని కుండలు, గిన్నెలు, కుర్చీలు, బల్లలు విరగ్గొట్టడం, చితగ్గొట్టడం అందుకోసమే. వందలమందిని హత్య, బస్సు దహనం, బాంబు దాడులు మొదలయిన ఆరోపణలతో 'టాడా' కేసులు పెట్టి జైలుకు పంపించడం అందుకోసమే. ఈ పశుత్వానికి అడ్డం వచ్చే పౌరహక్కుల సంఘమన్నా న్యాయవాదులన్నా పోలీసులకు కోపం రావడం సహజమే. సాయుధ నక్సలైట్లతో పోలీసులు తలపడితే పౌరహక్కుల సంఘం అడ్డం రాదు. న్యాయవాదులూ అడ్డంరారు. కానీ పోలీసులు చేసేది ఆ పనికాదు. కాబట్టే వాళ్ళకు పౌరహక్కుల సంఘం అడ్డమొస్తుంది, న్యాయవాదులు అడ్డమొస్తారు.

'మేము జనం మీద టాడా కేసులు పెట్టి, కష్టపడి అరెస్టు చేసి జైలుకు పంపితే, కేసు కాగితాలు రాసినంత సేపు కూడ జైలులో ఉంచకుండా, పైగా ఏ ఖర్చూ లేకుండా ఈయన వాళ్లను బయటికి తీస్తుంటే చూస్తూ ఊరుకోవాలా?' అని జనగాం డిఎస్.పి. ప్రభాకరరెడ్డి గురించి బహిరంగంగానే అన్నాడు. వాళ్లు కేసులు పెడితే బెయిలు పిటిషన్లు వేయకూడదు. జైలు నుండి బయటికి తీయకూడదు. కేసు వాదించకూడదు. ఒకవేళ చేసినా వేల రూపాయల ఫీజు తీసుకోవాలి గానీ సానుభూతితో చేయకూడదు. వ్యాపార దృక్పథంతో వకాలత్ చేయాలిగానీ మానవహక్కుల దృక్పథంతో చేయకూడదు. చేస్తే పోలీసుల 'విధి నిర్వహణ' అనబడే పైశాచికత్వానికి ఆటంకం అవుతుంది.

1990లో వరంగల్ జిల్లాలో పౌరహక్కుల సంఘాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నించినప్పుడు ఉత్సాహంగా ముందుకొచ్చిన వ్యక్తులలో ప్రభాకరరెడ్డి ఒకడు. ఆగస్ట్ నెలలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నప్పుడు బుర్రారాములుతో బాటు కన్వీనర్‌గా ఎన్నికయ్యాడు. ఒక నెల రోజులలో డాక్టర్ రామనాథం 5వ వర్ధంతి సభను జిల్లా కమిటీ వరంగల్‌లో విజయవంతంగా నిర్వహించింది. అప్పటినుండి చాలా చురుగ్గా పనిచేస్తూ, అయిదేళ్ళుగా జిల్లాలో పౌరహక్కుల సంఘం పేరు వినబడలేదన్న విషయాన్ని మరపింపజేసింది. 1990 డిసెంబర్ నుండి క్రమంగా పెరుగుతూ వున్న పోలీసు నిర్బంధాన్ని ప్రతిఘటించడమే కాక అనేక పౌరహక్కుల సమస్యల మీద కృషి చేసింది.

1990 డిసెంబర్ 5వ తేదీన నర్మెట్టలో పోలీసులు కాల్పులు జరిపారు. వేగంగా పెరగబోతున్న నిర్బంధానికి నర్మెట్ట కాల్పులు నాంది పలికాయి. కాల్పుల అనంతరం పోలీసులు నర్మెట్ట మండలంలో పెద్దఎత్తున నిర్బంధం ప్రయోగించారు. జనాన్ని మూకుమ్మడిగా 'టాడా' కేసులలో ఇరికించారు. ప్రభాకరరెడ్డి స్వగ్రామమయిన వెల్దండ నర్మెట్ట మండలంలో వుంది. ఆ గ్రామానికి ప్రభాకరరెడ్డి 1987 నుండి సర్పంచ్‌గా వున్నాడు. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయి గ్రామంలోని బడుగు వర్గాల మేలుకోసం అనేక కార్యక్రమాలు చేపట్టి వాళ్ల ప్రేమకు పాత్రుడయ్యాడు. వెల్దండ పంచాయితీ 'అత్యుత్తమ పంచాయితీ'గా ప్రభుత్వంచేత కూడ గుర్తింపు పొందింది.

నర్మెట్ట మండలంలో 1990 డిసెంబర్ నుండి పోలీసులు ప్రయోగించిన అణచివేతను ఎదుర్కొనడానికి ప్రభాకరరెడ్డి పౌరహక్కుల సంఘాన్నే కాక మండల సర్పంచ్‌లను, ఇతర పెద్దలను కూడా చురుగ్గా కదిలించాడు. మరొక వైపు కోర్టులో కేసులు కూడా తానే చేపట్టి అరెస్టయిన వాళ్ళందరినీ బెయిల్ మీద విడిపించాడు. నర్మెట్ట పోలీసుల అరాచకాలకు వ్యతిరేకంగా మండల సమావేశంలో తీర్మానం చేయించాడు. మండల సర్పంచ్‌లంతా కలిసి జిల్లా అధికార యంత్రాంగంపైన ఒత్తిడి తీసుకొచ్చారు.

నర్మెట్టతో ప్రారంభమయిన అణచివేత వేగంగా జిల్లా అంతటికీ వ్యాపించింది. 'ఎన్‌కౌంటర్లు' మళ్లీ మొదలయ్యాయి. మనుషులను మళ్లీ 'మాయం' చేయసాగారు. పోలీసులు పెద్దసంఖ్యలో గ్రామాలను చుట్టుముట్టి ప్రజలను హింసించసాగారు.

పౌరహక్కుల సంఘం ఈ నిర్బంధకాండను సమర్థవంతంగా వ్యతిరేకించింది. 'మాయం' అయిన వారి గురించి న్యాయవిచారణ నిర్వహిస్తున్న జస్టిస్ టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ దగ్గరికి సాక్షులను తీసుకుపోయింది. అరెస్టుల వార్తలను ఎప్పటికప్పుడు పత్రికల దృష్టికీ, అధికార్ల దృష్టికీ తీసుకొచ్చి ప్రాణాలు కాపాడింది.

ఈ కర్తవ్యానికే పరిమితం కాకుండా పౌరహక్కుల సంఘం వరంగల్ జిల్లాలో అనేక ప్రజాసమస్యలలో తన శక్తి మేరకు జోక్యం చేసుకుని ప్రజాస్వామిక పరిష్కారం కోసం కృషి చేసింది. ఈ కృషిని జిల్లా అధికార యంత్రాంగం నిస్సంకోచంగా ఉపయోగించుకుంది. తానే ఆహ్వానించింది కూడ. ఆర్.టి.సి. కార్మికుల సమ్మె, లారీ యజమాన్లకు ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు మధ్య వచ్చిన విభేదాలు, ఇతర అనేక సమస్యలు పౌరహక్కుల సంఘం జోక్యంతో పరిష్కారమయ్యాయి. తమకు అవసరమయినప్పుడు పౌరహక్కుల సంఘం జోక్యాన్ని తామే కోరుకున్న అధికారయంత్రాంగం తమ అవసరం తీరిన తరువాత పౌరహక్కుల సంఘం మీద దుమ్మెత్తి పోయడానికి గానీ ప్రభాకరరెడ్డిని హత్యచేయడానికి గానీ వెనుదీయలేదు.


నిజానికి ఒక్క పోలీసులకు తప్ప వేరే ఎవ్వరికీ వరంగల్‌లో పౌరహక్కుల సంఘం శత్రువుగా కనిపించలేదు. ప్రభాకరరెడ్డి అంతకంటే కనిపించలేదు. వివిధ రాజకీయ భావాలు గల వరంగల్ జిల్లా న్యాయవాదులు ప్రభాకరరెడ్డిని ఏకగ్రీవంగా జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నుకోవడం దీనికి నిదర్శనం.

పోలీసులకు మట్టుకే ఈ ప్రజాదరణ నచ్చలేదు. పౌరహక్కుల సంఘానికి ఎంతగా ప్రజాదరణ పెరిగితే అంతగా తమ రాక్షసత్వం అసాధ్యం అవుతుంది. అందుకే ప్రభాకరరెడ్డిని తమ హిట్‌లిస్ట్‌లో వేసుకున్నారు. తమ దగ్గర 17 మంది లాయర్లు, మేధావుల లిస్టు వుందనీ, అందులో ప్రభాకరరెడ్డి ప్రథముడనీ, వాళ్ల సంగతి చూసుకుంటామనీ వరంగల్ (రూరల్) ఎఎస్‌పి సురేంద్రబాబు లాకప్పులో జనాన్ని కొడుతూ చాలాసార్లు హెచ్చరించాడు. హయగ్రీవాచారి హత్యతో వరంగల్ పోలీసుల ప్రతిష్ట దెబ్బతినిందని భావించి తమ హిట్‌లిస్ట్ బయటకు తీసి ప్రభాకరరెడ్డిని కాల్చేసారు. ప్రభాకరరెడ్డి హత్య హయగ్రీవాచారి హత్యకు

ప్రతీకారం అనీ, 'వీళ్లొకరిని చంపితే వాళ్లొకరిని చంపుతున్నారు' అనీ కొంతమంది ఒక పద్ధతి ప్రకారం ప్రచారం చేస్తున్నారు. అది పూర్తిగా అవాస్తవం. ప్రభాకరరెడ్డి హత్య ప్రతీకార హత్యే. అయితే హయగ్రీవాచారి హత్యకు ప్రతీకారం కాదు. ఆయనంటే పోలీసులకు అంత ప్రేమ ఉందని మేము అనుకోవడం లేదు. ప్రభాకరరెడ్డి హత్య వరంగల్ జిల్లాలో పౌరహక్కుల సంఘం చేసిన కృషికి ప్రతీకారం. ప్రభాకరరెడ్డి అసాధారణమయిన చొరవతో, సాహసంతో పోలీసుల అణచివేత చర్యలకు వేసిన అడ్డుకట్టకు ప్రతీకారం. 'టాడా' కేసులు ఎంత వేగంగా పెడితే అంత పట్టుదలతో ముద్దాయిలను జైలునుండి బయటకు తీసిన ప్రజాన్యాయవాది నిబద్ధతకు ప్రతీకారం.

ప్రభాకరరెడ్డి హత్యకు పౌరహక్కుల సంఘం దు:ఖిస్తుంది. ప్రభాకరరెడ్డి హత్యకు పౌరహక్కుల సంఘం గర్విస్తుంది. సరిహద్దు భద్రతా దళాలను వరంగల్ గ్రామాలలో దించాలంటే ప్రభాకరరెడ్డిని తొలగించాలనీ, పౌరహక్కుల సంఘాన్ని దెబ్బతీయాలనీ ప్రభుత్వం భావించడం ఎంత అమానుషమో పౌరహక్కుల సంఘానికి అంత గర్వకారణం. డబ్బు కోసం గడ్డి కరిచే న్యాయవాదులను పెద్ద మనుషులుగా గౌరవించే ఈ వ్యవస్థ, పేదలకూ పేదల కోసం పోరాడే వారికి ఉచితంగా న్యాయసహాయం అందించే న్యాయవాది ఉనికినే సహించలేకుండా ఉందంటే దానికి పౌరహక్కుల సంఘం సిగ్గుపడనవసరం లేదు, వ్యవస్థ సిగ్గుపడాలి. పౌరహక్కుల సంఘానికి నీతులు చెప్పే పెద్దమనుషులు సిగ్గుపడాలి.

# తీరని లోటు



సి.వి. సుబ్బారావు
17.11.1953 - 17.1.1994

పౌరహక్కుల ఉద్యమంలో దాదాపు 15 సంవత్సరాలు చురుకయిన పాత్ర నిర్వహించి విలువైన సంప్రదాయాలు నెలకొల్పిన సి.వి. సుబ్బారావు జనవరి 17 రాత్రి ఢిల్లీలో గుండెపోటుతో మృతిచెందారు. ఆంధ్ర రాష్ట్రానికి చెందిన సుబ్బారావు ఢిల్లీలోనున్న పీపుల్స్ యూనియన్ ఫర్ డెమొక్రాటిక్ రైట్స్ PUDR వ్యవస్థాపక సభ్యుడు. చనిపోయేనాటికి ఆ సంస్థ కార్యదర్శి.

PUDR ఏర్పాటుతో భారతదేశ పౌరహక్కుల ఉద్యమంలో 70వ దశకంలో పుట్టిన నూతన ధోరణి ఢిల్లీకి విస్తరించింది. అప్పట్లో చాలామంది, ప్రత్యేకించి ఢిల్లీలోని పౌరహక్కుల సంస్థలు కేవలం రాజ్యాంగంలోని ప్రాధమిక హక్కులను కాపాడటమే లక్ష్యంగా ఎంచుకోవాలని అనేవారు. ఇందుకు భిన్నంగా PUDR ఏర్పాటుకు

చొరవ తీసుకున్న సుబ్బారావు విభిన్న రూపాల్లో సామాజిక, ఆర్థిక ఆధిపత్య వర్గాలకింద నలిగిపోతున్న పేదప్రజలు జీవితంలో

కరపత్రం, 5.2.1994

సుఖసంతోషాల్ని పెంపొందించుకోవడానికి, కనీస జీవన ప్రమాణాలను సాధించుకోవటానికి పోరాటం చేసే హక్కును కలిగి ఉంటారని, ఆ హక్కును కాపాడటమే పౌరహక్కుల సంఘాల ప్రధాన లక్ష్యమని వాదించాడు. అంటే ఆదేశిక సూత్రాలను ప్రాథమిక హక్కుల్లో భాగంగా చూడాలన్నాడు. ఆ విధంగా 70వ దశకంలో దేశంలో పౌరహక్కుల ఉద్యమంలో తలెత్తిన నూతన ధోరణి సుబ్బారావు చొరవవల్ల PUDR రూపంలో వ్యక్తీకరించబడింది. ఢిల్లీ వంటి మహానగరంలో సాధారణ ప్రజానీకంపై, ప్రజా ఉద్యమాలపై దేశంలోని విభిన్న ప్రాంతాల్లో సాగుతున్న అణచివేతను ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, పత్రికలు ఎన్నడూ పట్టించుకోలేదు. సుబ్బారావు చొరవతో PUDR మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు, ప్రజా ఉద్యమాల పౌరహక్కుల అణచివేతకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ప్రచారం చేసింది. ఆసియాడ్ గ్రామాన్ని కట్టిన కూలీల బానిసత్వం, బీహార్ గని కార్మికుల కడుహీన పరిస్థితులు, బస్తర్ ఆదివాసులను అభివృద్ధి క్రమం నిర్వాసితులను చేసిన వైనం, బీహార్, ఆంధ్రా విప్లవకారులపై రాజ్య యంత్రాంగం అమలు చేస్తున్న అణచివేత చర్యలు వంటి విషయాలు సుబ్బారావు చొరవతో PUDR వేదిక నుండి వెలుగులోకి వచ్చాయి. ప్రత్యేకించి APCLC పైన నిర్బంధం వచ్చినప్పుడల్లా ఢిల్లీ విశ్వవిద్యాలయానికి, ఢిల్లీ నగరంలోని ఇతర సంస్థలకూ చెందిన మేధావుల అభిప్రాయాలను సమీకరించి రాష్ట్ర ప్రభుత్వంపైన ఒత్తిడి పెట్టడానికి PUDR చేసిన కృషిలో సుబ్బారావు చొరవ చాలా ఉంది.

సుబ్బారావు పౌరహక్కుల ఉద్యమకారుడు మాత్రమే కాదు. విద్యార్థిగా ఉన్నప్పుడు విప్లవ విద్యార్థి ఉద్యమాలలో చాలా కృషిచేసాడు. రాడికల్ విద్యార్థి సంఘం వ్యవస్థాపక సభ్యుడు, మొదటి ఉపాధ్యక్షుడు. ఎమర్జెన్సీలో జైలులో ఉండి ఎం.ఏ. పూర్తి చేసాడు. విప్లవ రచయితల సంఘం ఆవిర్భావానికి ప్రేరణ అయిన 'విశాఖ విద్యార్థుల'లో సుబ్బారావు ఒకడు. చాలాకాలం విరసం సభ్యుడు. సృజన 'సాహితీ మిత్రుల' లో ఒకరిగా ఆ పత్రిక ప్రమాణాలను నిర్దేశించడానికీ నిలబెట్టడానికీ చాలా కృషి చేసాడు. సాహిత్య పాఠకులకు 'సురా'గా పరిచితులు.

ఈశాన్య భారతదేశంలోని ఉద్యమాల గురించి 'వేర్పాటు వాదం, విచ్ఛిన్నకారుల కుట్రలు' అని ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తున్న దశలో ఆ ఉద్యమాల నేపథ్యాన్ని, వాటిలో ఇమిడి ఉన్న జాతి సమస్యను వివరిస్తూ 'రగులుకున్న రాక్షసిబొగ్గు' అనే ఆలోచనాత్మకమయిన రచన చేసారు. సాహిత్యాన్ని సాహిత్య ప్రమాణాలతో కొలిచే విధానానికి భిన్నంగా, వాటిని సామాజిక నేపథ్యంలో చూసే ప్రయత్నానికి సుబ్బారావు రూపం ఇచ్చారు. ఆయన సంపాదకత్వంలో వెలువడిన 'విభాత సంధ్యలు' ఈ దృష్ట్యా తెలుగు సాహిత్య విమర్శకు కొత్త ద్వారాలు తెరిచింది. మార్క్సిస్టు ఆర్థిక శాస్త్రాన్ని సులభంగా పరిచయం చేస్తూ తెలుగులో 'రాజకీయార్థిక శాస్త్రం – ఒక విశ్లేషణ' అనే ప్రామాణిక రచన చేశారు. పౌరహక్కుల నివేదికలను సామాజిక శాస్త్ర ప్రమాణాలకు తగినట్టుగా రాసే సాంప్రదాయాన్ని సుబ్బారావు ప్రవేశపెట్టాడు. హైదరాబాద్ సంస్థానంలో పారిశ్రామికాభివృద్ధి మీద ఆయన చేసిన

పరిశోధన ఇంగ్లీషులో పుస్తకంగా రానుంది. చైనా ఆర్థికాభివృద్ధి సమస్యలపై కూడా ఆయన పరిశోధన చేశాడు. సామాజిక శాస్త్రాల్లో ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల దృష్టినుంచి సామాజిక సమస్యలను విశ్లేషించాలని ఆయన భావించాడు.

రీసర్చి పనులమీద 1984 నుంచి రెండేళ్ళపాటు సుబ్బారావు హైదరాబాదులో ఉన్నాడు. ఆ కాలంలో ఆయన APCLC లో, విరసంలో చురుకైన కార్యకర్తగా పనిచేశాడు. ఆ కాలంలోని విభిన్న సామాజిక సమస్యలపై మేధావుల మధ్య చర్చ రేకెత్తించటానికి, కార్యకర్తలకు, మేధావులకు మధ్య సంబంధాలను పెంపొందించడానికి సమీక్షావేదిక అనే చర్చావేదికను నిర్వహించాడు.

రచయిత, ఆలోచనాపరుడు, పౌరహక్కుల ఉద్యమకారుడు, సమాజంలోనేకాక వ్యక్తిగత జీవితంలోనూ ప్రజాతంత్ర సంస్కృతి ఉండాలని కాంక్షించిన ప్రజాస్వామిక వాది అయిన సి.వి. సుబ్బారావు 40 ఏళ్ళకే మరణించడం ఆయన స్నేహితులకే కాక దేశంలోని ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటు.

*– ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, విప్లవ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్స్ అసోసియేషన్, జనవాహిని సంస్థల తరఫున వచ్చిన కరపత్రం.*

# నలుగురు నేతలకు నివాళి


జస్వంత్ సింగ్ ఖల్రా
1952 - 22.9.1995

**జస్వంత్ సింగ్ ఖల్రా** (43) పంజాబుకు చెందిన అకాలీదళ్ మానవహక్కుల శాఖ ప్రధాన కార్యదర్శి. 1995 సెప్టెంబర్ 6వ తేదీన అమృత్‌సర్‌లోని అతని ఇంటి ఎదుటే తెల్లబట్టలలో వున్న 'గుర్తు తెలియని వ్యక్తులు' అతనిని కిడ్నాప్ చేసి తీసుకొని పోయారు. ఆ నెల 22న ఖల్రా తరన్ తరన్ పోలీస్ జిల్లాలోని సర్హాలి పోలీస్ స్టేషన్‌లో కనిపించాడు. ఆ తరువాత ఇప్పటిదాకా అతని ఆచూకీ తెలియదు.

**జలీల్ అహ్మద్ అంద్రబీ** కాశ్మీర్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది. కాశ్మీర్ కమిషన్ ఆఫ్ జ్యూరిస్ట్స్ అధ్యక్షుడు. మానవహక్కుల ఆందోళనకారుడు. 1995లో వియన్నా మానవ హక్కుల కాన్ఫరెన్స్‌కు హాజరయ్యాడు. 1996 మార్చి 8న అతను శ్రీనగర్‌లోని హైదర్‌పురా ప్రాంతంలో సాయంత్రం 5 గంటల సమయంలో తన భార్యతో సహా కారులో వెళుతుండగా, కొందరు ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లు కారు ఆపి అతనిని చంపి



ఎపిసిఎల్‌సి కరపత్రం, 26 ఆగస్టు 1996

రాష్ట్రీయ రైఫిల్స్ అనే సైనిక విభాగానికి చెందిన అధికార్లకు అప్పగించారు. అదేనెల 27న అతని మృతదేహం శ్రీనగర్ నడిబొడ్డున రాజ్‌బాగ్‌లో జీలం నదిలో దొరికింది. నుదుటి మధ్యలో వున్న బుల్లెట్ గాయం అతని హత్యకు సాక్షి.

**పరాగ్ కుమార్ దాస్** (35) అస్సాంకు చెందిన మానవహక్కుల కార్యకర్త. మానవ్ అధికార్ సంగ్రాం సమితి ('మాస్') వ్యవస్థాపక సభ్యుడు. చనిపోయేనాటికి ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి, రచయిత, పత్రికా సంపాదకుడు. 1996 మే 17న గౌహతి నగరంలో అతను తన కుమారుడిని స్కూల్ నుంచి ఇంటికి తీసుకొస్తుండగా దారిలో కొందరు సాయుధ దుండగులు కాల్చి చంపారు. వారు ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లయిన 'సుల్ఫా' (సరండర్డ్ ఉల్ఫా) కార్యకర్తలని నమ్మడానికి ఆధారాలున్నాయి.

**జడ్.వి.యావ్‌పి** (Z.V. Yaopie, 45) నాగాలాండ్‌లోని దిమాపూర్‌కు చెందిన మానవహక్కుల న్యాయవాది. 1996 మే 23 నాడు అతను హత్యకు గురి అయ్యాడు. అక్రమ నిర్బంధంలో వున్న నాగా యువకుల గురించి అధికార్లతో చర్చించి ఇంటికి వచ్చిన యావ్‌పీని సైన్యం పురమాయించిన సాయుధ దుండగులు అతని యింట్లోనే కాల్చి చంపారు.

ఈ నలుగురూ పౌరహక్కుల పరిరక్షణ కోసం కృషి చేసిన మేధావులు, మానవహక్కుల కార్యకర్తలు. తుపాకులు చేతిలో పట్టుకున్న వారు కారు. పోలీసులతోనూ, సైనిక బలగాలతోనూ సాయుధ ఘర్షణకు దిగిన రహస్య ఉద్యమకారులు కారు. మానవతా విలువల గురించి, ప్రజాతంత్ర రాజకీయ హక్కుల గురించి, రాజ్యాంగ హక్కుల గురించి శాంతియుతంగా ఆందోళన చేసినవారు, రాసినవారు, న్యాయస్థానాలలో వాదించినవారు, అంతర్జాతీయ వేదికలలో మాట్లాడినవారు.

వీరు పనిచేసిన నాలుగు రాష్ట్రాలలోనూ ఆయా జాతుల స్వాతంత్ర్యం లేక స్వయం ప్రతిపత్తి కోసం చాలా కాలంగా ఉద్యమాలు సాగుతున్నాయి. అవన్నీ ఒక దశలో సాయుధరూపం తీసుకున్నాయి. ఒక్కో ప్రాంతంలోనూ ఆ ఉద్యమాలకు నేపథ్యంగా ఒక చరిత్ర ఉంది. ఆ చరిత్ర మిగిలించిన అసంతృప్తి ఉంది. స్వాతంత్ర్యం, లేక స్వయం ప్రతిపత్తి గురించి బలమైన ఆకాంక్ష ఉంది.

ఆ అసంతృప్తినీ, అసంతృప్తికి లోనయిన ప్రజల ఆకాంక్షలనూ అర్థం చేసుకోవడానికి సిద్ధంగా లేని భారత పాలకులు ఈ ఉద్యమాలన్నిటినీ 'వేర్పాటువాద' 'దేశద్రోహకర' 'తీవ్రవాద' ఉద్యమాలుగాను, విదేశీ కుట్రల ఫలితమైన అలజడిగాను చిత్రీకరించారు.

జాతిఉద్యమాల పట్ల భారత ప్రభుత్వం అనుసరించిన అప్రజాస్వామిక వైఖరికిది నాంది. 'దేశం నుండి వేరుపడిపోతామని ఎవ్వరు తుపాకులు పట్టుకున్నా వెంటనే లొంగిపోవలసిందేనా?' అని ఆవేశపడిపోయేవారు ప్రజలలో చాలామంది ఉన్నారు. ఆ ఆవేశం అనవసరం. స్వయం ప్రతిపత్తి, లేక స్వాతంత్ర్యం కోరుకోవడాన్ని 'దేశద్రోహం'గా కాక ఒక రాజకీయ హక్కుగా గుర్తించడం ప్రజాస్వామ్య వైఖరి. అంటే అర్థం 'లొంగిపోవాలని'

కాదు. అసలు ఒక రాజకీయ ఆకాంక్ష ప్రజలలో ముందుకొచ్చినప్పుడు దానికి 'లొంగిపోవాలా' లేక దానిని 'లొంగదీసుకోవాలా' అని ఆలోచించడమే అప్రజాస్వామిక సంస్కృతిని సూచిస్తుంది. ఒక న్యాయమైన ఆకాంక్షగా దానిని గౌరవించడం అవసరం. దానితో రాజకీయంగా, ప్రజాస్వామికంగా వ్యవహరించడం అవసరం. దాని పర్యవసానం ఆ ప్రజలు దేశం నుండి వేరుపడిపోవడం కావచ్చు. లేదా స్వయం ప్రతిపత్తి గల సమాఖ్య తరహా సంబంధాన్ని నెలకొల్పుకోవడం కావచ్చు. లేదా మొత్తంగానే దేశ రాజకీయ వ్యవస్థలోనూ పరిపాలనా రంగంలోనూ వికేంద్రీకరణను వ్యవస్థీకరించడం కావచ్చు. లేదా అందరికీ ఆమోదయోగ్యమైన వేరే ఏ ఫలితమైనా కావచ్చు.

అంతే తప్ప ఆ ఆకాంక్షకు ఉండే రాజకీయ, ప్రజాతంత్ర స్వభావాన్ని కాదని, దానిని 'ద్రోహం'గాను, ఆ కోరిక గల ప్రజలను 'దేశ ద్రోహులు'గాను చూడడం తప్పు.

పంజాబులో, కాశ్మీర్‌లో, అస్సాంలో, నాగాలాండ్‌లో ఉద్యమ రూపం తీసుకున్న జాతి ఆకాంక్షను దేశద్రోహకరమైన వేర్పాటువాదంగా అర్థం చేసుకున్న భారత పాలకులు, శత్రుదేశాల పైన ప్రయోగించే సైన్యాన్ని ఆ ప్రజలపైన ప్రయోగించారు. ఆ ప్రజలపైన యుద్ధం ప్రకటించారు. పోరాటకారుల సాయుధ చర్యలను ఎదుర్కొనే చట్టపరమైన కర్తవ్యాన్ని అడ్డంపెట్టుకొని ప్రజలందరిపైన చట్టబాహ్యమైన హింస ప్రయోగించారు.

పై నాలుగు రాష్ట్రాలలోనూ సైన్యం, పారామిలిటరీ బలగాలు, పోలీసులు మూకుమ్మడిగా ప్రజలపైన విపరీతమైన హింసకు పాల్పడ్డాయి. బూటకపు ఎన్‌కౌంటర్లలో వేలాది మందిని చంపారు. ఒళ్లు గగుర్పొడిచే రీతిలో చిత్రహింసలు పెట్టారు. ఇళ్లు లెక్కలేనన్ని కూల్చారు, కాల్చారు. క్యాంపులలో ప్రజలచేత వెట్టిచాకిరీ చేయించుకున్నారు. స్త్రీలను బలాత్కరించారు. పొలాలు, ఆస్తులు, ఇళ్లలోని వస్తువుల్నీ ధ్వంసం చేసారు. హింసను ఒక బెదిరింపుగా చూపించి లక్షలాది రూపాయల లంచాలు గుంజారు.

చట్టబాహ్యమైన ఈ హింసకుతోడు, హింసాత్మక చట్టాలను కూడ భారత పాలకులు ఆ ప్రజలపైన ప్రయోగించారు. మీసా, నాసా వంటి ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాలు, పోలీసులకు అహేతుకమయిన అధికారులు ఇచ్చే కల్లోలిత ప్రాంతాల చట్టం, సైనికులకు అటువంటి అధికారాలే కట్టబెట్టే సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం, రాజకీయ కార్యకలాపాలను నేరంగా నిర్వచించే 'టాడా' చట్టం, వీటిలో ముఖ్యమైనవి. ఈ చట్టాలలోని చాలా అంశాలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 19, 20, 21 లకు, ఐక్యరాజ్యసమితి 1966లో ఆమోదించిన అంతర్జాతీయ పౌరరాజకీయ హక్కుల ఒడంబడికకు వ్యతిరేకమైనవి. అయినా భారత న్యాయస్థానాలు వీటిని రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించడానికి సిద్ధంగా లేవు. వీటిని సవాలు చేస్తూ దాఖలయిన కేసులలో ఏళ్ల తరబడి తీర్పు చెప్పకుండ దాటివేయడం, లేదా వక్రవ్యాఖ్యానాలతో వీటిని రాజ్యాంగబద్ధమేనని ప్రకటించడం జరుగుతూ ఉంది.

ఈ నేపథ్యంలోనే పైనాలుగు రాష్ట్రాలలోనూ పౌరహక్కుల కోసం కృషి చేసే సంస్థలు, వ్యక్తులు ముందుకొచ్చారు. సాయుధ బలగాలు చేసే అత్యాచారాలను బయటపెట్టారు. ఇతర రాష్ట్రాల పౌరహక్కుల సంఘాలను తమ రాష్ట్రాలకు ఆహ్వానించి అక్కడి పరిస్థితులను తెలియజెప్పారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలకూ, ఐక్యరాజ్యసమితికీ రిపోర్టులు పంపారు. స్థానిక కోర్టుల నుండి సుప్రీంకోర్టు దాకా అనేక కేసులు వేశారు. దినపత్రికలలోనూ, తమ స్వంత ప్రచురణలలోనూ నిర్బంధ కాండకు సంబంధించిన వివరాలు ప్రచురించి విస్తృతంగా ప్రచారం చేశారు. సాధ్యమైన చోట ప్రజాందోళనా కార్యక్రమాలు నిర్వహించారు.

ఇదంతా కేవలం అక్కడ నడుస్తున్న ఉద్యమాలకు మాత్రమే ప్రయోజనకారి కాదు. ఆ విధంగా చూడడం సంకుచిత దృష్టి, ఇది దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే కృషి, ప్రజాస్వామ్యానికి లోతయిన అర్థం కల్పించే కృషి, భారతదేశాన్ని నిండయిన ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్దే కృషి. తాము ప్రపంచంలోకల్లా అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని నడుపుతున్నామని గర్వించే భారత పాలకులు ఈ కృషి చేసిన మానవహక్కుల కార్యకర్తలకు కృతజ్ఞులయి ఉండవలసింది. కానీ వాళ్లకు ఆ కార్యకర్తలు ఒక ఆటంకంగా, అవరోధంగా కనిపించారు. ప్రజాస్వామ్యానికీ దేశ ప్రాదేశిక సమగ్రతకూ విరోధం ఏర్పడినప్పుడల్లా మన పాలకులు ప్రాదేశిక సమగ్రతకే ఓటు వేసారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. అక్కడితో తృప్తి చెందకుండా ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడేవారిని కూడా ఖూనీ చేశారు.

## జస్వంత్‌సింగ్ ఖల్రా

పంజాబులో పోలీసులు అపహరించి 'మాయం' చేసి అనామకంగా దహనం చేసిన వేలాది యువకుల ఆచూకీ వెలికి తీయడానికి జస్వంత్‌సింగ్ ఖల్రా కృషి చేశాడు. 1992లో కొన్ని వందల మందిని ఈవిధంగా దహనం చేశారనీ, 1992–95 మధ్య దాదాపు 3000 మంది ఈ విధంగా అనామకంగా కాటికి చేరారనీ అంచనా. 1992లో ఒక్క అమృత్‌సర్ పట్టణంలోని దుర్గియానా శ్మశానవాటికలోనే 300 మందికి పోలీసులు అంత్యక్రియలు చేశారు. ఈ హత్యలకు సంబంధించిన వాస్తవాలు వెలికితీసి కోర్టులో కేసు వేయడానికి ఖల్రా కృషి చేశాడు. అప్పట్లోనే పోలీసులు అతనిని బెదిరించారు. 'ఇంకొక్కడిని మాయం చేయడం మాకు కష్టమనుకోవద్దు' అని హెచ్చరించారు. చివరికి అదే జరిగింది. 1995 సెప్టెంబర్ 6న ఖల్రా అపహరణకు గురయ్యాడు. సెప్టెంబర్ 22న తరన్‌తరన్ సమీపంలో సర్హాలి పోలీస్‌స్టేషన్‌లో కనిపించాడు. ఆ తరువాత 'మాయం' అయ్యాడు. ఖల్రాను మాయం చేసింది తరన్ తరన్ పోలీసులేనన్న అభియోగంతో అతని మిత్రులు సుప్రీంకోర్టులో కేసువేయగా సుప్రీంకోర్టు సిబిఐని పరిశోధించమని ఆదేశించింది. సిబిఐ తన నివేదికను సుప్రీంకోర్టుకు ఈ సంవత్సరం (1996) జూలై నెలలో సమర్పించింది. ఆ నివేదికను ఆధారం చేసుకొని సుప్రీంకోర్టు తరన్‌తరన్ ఎస్‌పితో సహా 9 మంది పోలీస్ అధికారుల పైన ఖల్రాను కిడ్నాప్ చేసినందుకు కేసు పెట్టవలసిందిగా పంజాబు ప్రభుత్వాన్ని ఆదేశించింది.


## జలీల్ అంద్రబీ (-8.3.1996)

కాశ్మీర్‌లోనయితే భారత సైనిక బలగాలు చేపట్టిన హింసాత్మక అణచివేత చర్యలకు లెక్కలేదు. అంత క్రూరమైన చిత్రహింసలు, అంతటి విచ్చలవిడి మూకుమ్మడి హత్యలు వేరే ఎక్కడా జరగలేదు. వీటి గురించి హైకోర్టు న్యాయవాది అయిన జలీల్ అంద్రబీ 1995లో వియన్నాలో జరిగిన అంతర్జాతీయ మానవహక్కుల కాన్ఫరెన్స్‌లో వివరంగా మాట్లాడాడు. శ్రీనగర్ హైకోర్టులో కేసులు వేశాడు. భారత సైనిక బలగాలు ఇంటరాగేషన్ సెంటర్స్‌గా ఉపయోగించుకుంటున్న నివాసాలలో నెలకొన్న పరిస్థితులపైన విచారణ జరిపించ వలసిందిగా అంద్రబీ వేసిన రిట్‌పిటిషన్‌కు హైకోర్టు స్పందించి ప్రతీ జిల్లాలోనూ విచారణ కమిటీలను నియమిస్తూ ఆర్డర్ జారీ చేసింది.

జలీల్ అంద్రబీ బ్రతికి వుంటే తమ అణచివేతకు ఏదో ఒకరకంగా అడ్డమొస్తూనే ఉంటాడని భావించిన రాష్ట్రీయరైఫిల్స్ అధికారులు అతన్ని చంపదలచుకున్నారు. అతనిని పట్టి తమకు అప్పగించడానికి తమ పోషణలో వర్ధిల్లుతున్న ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లను వాడుకున్నారు. వాళ్లు అంద్రబీ కారును ఆపి అతనిని దింపి రాష్ట్రీయ రైఫిల్స్ అధికారికి అప్పగించారు. ఇది జరిగింది 1996 మార్చి 8న. అంద్రబీ భార్య రఫత్ అరా కూడా న్యాయవాదే. అతనితోపాటు ఆమెకూడా ఆరోజు కారులో వుంది. ఆమె వెంటనే హైకోర్టులో హెబియస్‌కార్పస్ పిటిషన్ వేసింది. అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలు కూడా అంద్రబీ అపహరణ గురించి ఆందోళన చేశాయి. కానీ ఏదీ అతని ప్రాణాన్ని కాపాడలేక పోయింది. మార్చి 27న శ్రీనగర్‌లోని రాజ్‌బాగ్ సమీపంలో జీలంనదిలో అతని శవం దొరికింది. అప్పటికి అతను చనిపోయి 14 రోజులు అయివుండవచ్చునని ఫోరెన్సిక్ నిపుణుడు అభిప్రాయపడ్డాడు.

శ్రీనగర్ హైకోర్టు అంద్రబీ హత్యను ఆపలేకపోయింది గానీ అతని హత్య జరిగిన తరువాత గట్టిగానే స్పందించింది. అతని హత్యపైన నేర పరిశోధన చేయడానికి పోలీస్ సూపరింటెండెంట్ స్థాయి అధికారి నేతృత్వంలో ఒక స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (ఎస్ఐటి)ను నియమించింది. సైనిక అధికారుల నేరాలను పరిశోధించడానికి ధైర్యం చాలని ఎస్ఐటి నీళు ్ల నములుతుంటే హైకోర్టు వారిని పలుమార్లు తీవ్రంగా అభిశంసించింది. హైకోర్టు ఎస్ఐటిని నియమించిందని తెలియగానే రాష్ట్రీయ రైఫిల్స్ అధికారులు ఎందుకయినా మంచిదని అంద్రబీని కిడ్నాప్ చేయడానికి సహకరించిన కిరాయి మిలిటెంట్లను చంపేశారు. ఏప్రిల్ 5వ తేదీన శ్రీనగర్-జమ్ము జాతీయ రహదారి మీదనున్న పాంపోర్ గ్రామం వద్ద అయిదు 'గుర్తుతెలియని' శవాలు కనిపించాయి. వాళ్లుజలీల్ అంద్రబీని సైన్యానికి పట్టి ఇచ్చిన యువకులేననీ, వారు బ్రతికి ఉంటే బండారం బయటపడుతుందని రాష్ట్రీయ రైఫిల్స్ అధికారులే గుట్టుచప్పుడు కాకుండా వారిని చంపివేశారని కొద్దిరోజుల తరువాత 'కాశ్మీర్ టైమ్స్' దినపత్రిక రాసింది. ఈ అభియోగానికి రాష్ట్రీయ రైఫిల్స్ ఇప్పటిదాకా జవాబు చెప్పలేదు.

## పరాగ్‌దాస్



పరాగ్ దాస్
1961 - 17.5.1996

పరాగ్‌దాస్ మానవ్ అధికార్ సంగ్రామ్ సమితి ('మాస్') ద్వారాను, తాను సంపాదకునిగా ఉన్న 'అస్సోమీయ ప్రతీదిన్' పత్రిక ద్వారాను అస్సాం జాతి ఉద్యమ ఆకాంక్షలను, దానిపైన ప్రభుత్వం ప్రయోగిస్తున్న అణచివేతను ప్రచారం చేశాడు. అతను విద్యాధికుడు. సాహిత్యం నుంచి అర్థశాస్త్రం దాకా అనేక విషయాలలో ప్రావీణ్యం ఉన్నవాడు. చాలా రచనలు చేశాడు.

1991 సెప్టెంబర్ నెలలో భారత సైన్యం అస్సాంలో 'ఆపరేషన్ రైనో' అనే కార్యక్రమం ప్రారంభించింది. అదే సంవత్సరం 'మాస్' ఏర్పడింది. 'మాస్' అస్సాంలోనే కాక నాగాలాండ్‌లోనూ మణిపూర్‌లోనూ సైన్యం చేసిన అనేక అత్యాచారాలను బయటపెట్టింది. ప్రచారం చేసింది. 'మాస్' పైన అస్సాం ప్రభుత్వం ప్రయోగించిన అణచివేతలో భాగంగా పరాగ్‌దాస్ రెండుసార్లు 'టాడా' క్రింద జైలుకు పోయాడు. చివరికి ఈ సంవత్సరం మే 17న హత్యకు గురి అయ్యాడు. అస్సాం ఐక్య విముక్తి సంఘటన (ఉల్ఫా)లో కొంత కాలం పనిచేసి బయటకు వచ్చి సైన్యంతో సహకరించడానికి సిద్ధపడిన యువకులతో హితేశ్వర్ సైకియా ప్రభుత్వం రూపొందించిన ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లయిన 'సుల్ఫా' (సరండర్డ్ ఉల్ఫా) కార్యకర్తలు అతనిని చంపారని అతని సహచరులు భావిస్తున్నారు.

## జడ్.వి.యాప్‌వీ **(1951-23.5.1996)**

నాగాలాండ్ మన దేశంలో జాతి ఉద్యమం తీవ్ర రూపం తీసుకున్న మొట్టమొదటి ప్రాంతం. నాగాలాండ్‌లో 40 సంవత్సరాలుగా స్వాతంత్ర ఆకాంక్షతో పోరాటం సాగుతూ ఉంది. తొలినాడే భారత ప్రభుత్వం అక్కడ సైన్యాన్ని దించింది. కానీ ఇప్పటికీ నాగా ప్రజలలో బలంగా ఉన్న స్వాతంత్ర ఆకాంక్షను అణచలేకపోయింది. సైన్యం పాల్పడిన అత్యాచారాలను వెలికి తీసి ప్రచారం చేయడానికి, కోర్టులలో కేసులు వేసి బందీల ప్రాణాలు కాపాడడానికి, బయటి పౌరహక్కుల సంస్థలే కాక స్థానిక పౌరహక్కుల సంఘాలు, న్యాయవాదులు, మేధావులు నలభై ఏళ్లుగా కృషి చేశారు. సైనిక అధికార్లతోనూ సివిల్ అధికార్లతోనూ మాట్లాడి బందీలను విడిపించడం, అప్పుడప్పుడు జరిగే న్యాయ విచారణల్లో పాల్గొనడం ఈశాన్య భారత రాష్ట్రాలలోని మానవహక్కుల కార్యకర్తల కర్తవ్యం అయింది.

దాదాపుగా సైనిక పాలన నెలకొన్న ఆ ప్రాంతంలో ఈ కృషి చేయడం సులభం కాదు. అయినా ధైర్యంగా నిలబడి పనిచేసిన వాళ్లు ఉన్నారు. వారిలో ఒకడయిన జడ్.వి.యాప్‌వీ తన ప్రజాతంత్ర కృషికి ఈ సంవత్సరం మే 23న మూల్యం చెల్లించాడు. అక్రమ నిర్బంధంలో ఉన్న నాగా జాతీయుల విడుదల గురించి ఆరోజు అధికార్లతో మాట్లాడి


యాప్పీ ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే ఇంట్లోకి కొందరు సాయుధులు వచ్చి అతన్ని కాల్చి చంపారు. హంతకులు సైన్యం పోషణలో ఉన్న కిరాయి మిలిటెంట్లు అయివుండవచ్చునని అనుమానం.

**ప్రజలారా!**

భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశమని మనలో చాలామంది గర్విస్తున్నాం. కానీ అయిదేళ్ల కొకసారి ఎన్నికలు జరిగినంత మాత్రాన ప్రజాస్వామ్యం అయిపోదు. భారతదేశం పరిపూర్ణమైన ప్రజాస్వామ్యం కావాలంటే అనేక రంగాలలో అనేక మార్పులు రావలసివుంది. వాటిలో ముఖ్యమైనవాటి కోసం పౌరహక్కుల ఉద్యమం కృషి చేస్తూంది. ఈ కృషిని కేవలం కొన్ని రాజకీయ వర్గాలకోసం చేస్తున్న సేవగా ప్రభుత్వం చిత్రీకరించి నిందించడం దుర్మార్గమైన విషయం. పౌరహక్కులకోసం కృషి చేయడమంటే 'తీవ్రవాదులకూ' 'వేర్పాటువాదులకూ' సేవచేయడం అనే దుష్ప్రచారానికి పాల్పడుతున్న ప్రభుత్వం తన ప్రచారబలాన్ని అడ్డంపెట్టుకొని పౌరహక్కుల ఉద్యమకారులను వేధిస్తూ ఉంది. ఖైదు చేస్తూ ఉంది. హత్యగావిస్తూ ఉంది. ఆంధ్రప్రదేశ్ పోలీసులు పౌరహక్కుల సంఘం నాయకులు డా॥ రామనాథం, జాపాలక్ష్మారెడ్డి, నర్రా ప్రభాకరరెడ్డిని హతమార్చారు. గోపి రాజన్నను చంపిన ఆర్.ఎస్.ఎస్. దుండగులను 11 ఏళ్లు గడిచినా ఈనాటికీ అరెస్టు చేయలేదు.

పౌరహక్కుల కృషి మనందరి బ్రతుకుకు, భవితవ్యానికీ అవసరం అయిన ప్రజాతంత్ర విలువల కోసం, హక్కుల కోసం జరుగుతున్న కృషి. ఈ విషయం ప్రజలందరూ గుర్తించి పౌరహక్కుల ఉద్యమకారులపైన పోలీసులు, సైనిక బలగాలు జరుపుతున్న దాడులనూ హత్యాకాండనూ ఖండించాలని కోరుతున్నాం. మనమందరం ఐక్యమై కాపాడుకుంటేనే పౌరహక్కులు నిలుస్తాయి. పౌరహక్కుల ఉద్యమం నిలుస్తుంది.

# ప్రజల మెడలో స్టెతస్కోపు



ఆమెడ నారాయణ
11.12.1957 - 25.9.1996

ఆమెడ నారాయణ 38 సంవత్సరాల వయసున్న ప్రజా వైద్యుడు. 'ప్రజా వైద్యశాల' అనే బోర్డు మన రాష్ట్రంలో చాలామంది డాక్టర్లు పెట్టుకున్నారు కానీ ఆ పేరు నిజంగా అతికే కొద్దిమంది వైద్యులలో ఆమెడ నారాయణ ఒకడు. ఆయనను పోలీసులు చంపేస్తే 'మా దేవుడిని చంపారు' అని మొగిలిచర్ల గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామస్తులు ఒక్క గొంతుతో రోదించారు. మృతదేహం దగ్గర వేల సంఖ్యలో గుమిగూడి పోలీసులపైన దుమ్మెత్తిపోసారు. ప్రజలలో, అందులోనూ పేద ప్రజలలో అంతటి అభిమానం సంపాదించుకున్న డాక్టర్లు దేశంలో కొద్దిమందే ఉంటారు.

నారాయణ వరంగల్ జిల్లాలోని ఒక మారుమూల మండల కేంద్రమైన కొరివి అనే గ్రామానికి చెందినవాడు. కుండలు చేసుకొని బ్రతికే కుమ్మరి కుటుంబంలో పుట్టాడు. హైస్కూల్ చదువుకునే రోజులలోనూ కులవృత్తి చేసుకుంటూనే చదువుకునేవాడు. కాకతీయ మెడికల్ కాలేజీలో చదువుకుంటుండగా రాడికల్

కె. బాలగోపాల్

ఎపిసిఎల్‌సి కరపత్రం నుంచి, నవంబర్ 1996

విద్యార్థి సంఘంలో చేరాడు. డాక్టర్ అయిన తరువాత తన తల్లిదండ్రుల బోటి గ్రామీణ శ్రామిక ప్రజలకు తన జ్ఞానాన్నీ నైపుణ్యాన్నీ అందించడం జీవిత ధ్యేయంగా ఎంచుకున్నాడు. నారాయణ నిజమైన వైద్యుడు. వైద్య జ్ఞానాన్ని సొమ్ము చేసుకునే వైద్యవ్యాపారులకన్నా, తమ నైపుణ్యానికి డాలర్లలో వెలకట్టి విదేశాలకు వలసపోయే వైద్యపట్టభద్రులకన్నా నారాయణే నిజమైన వైద్యుడు. వైద్య సేవల వ్యాపారీకరణ శరవేగంగా పురోగమిస్తున్న ఈ రోజులలో పేద ప్రజలకు నారాయణ వంటి డాక్టర్ల అవసరం చాలా ఉంది. 'నా ఫీజు ఇంత. అది ఇస్తేనే వైద్యం చేస్తాను' అని నారాయణ ఎన్నడూ అని ఎరుగడు. తన దగ్గరకు వచ్చే వాళ్ల అవసరమే తప్ప వాళ్లు తనకు ఇచ్చుకోగల ఫీజు ఎంత అనేది అతనికి ఏరోజూ ప్రమాణం కాదు.

మెడిసిన్ చదువు పూర్తిచేసి హౌస్ సర్జన్‌గా ఉన్నప్పుడు అతను వృత్తిని అభ్యసించడం కోసం పౌరహక్కుల డాక్టరు రామనాథం గారి క్లినిక్‌కు వచ్చేవాడు. 1983లో అతను మొగిలిచర్లలో క్లినిక్ తెరిచినప్పుడు డాక్టర్ రామనాథమే ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథి. ఆ తరువాత కొంతకాలం డాక్టర్ రామనాథం అతని క్లినిక్‌కు మందులు కూడా పంపించేవారు. డాక్టర్ రామనాథంను పోలీసులు 1985 సెప్టెంబర్‌లో కాల్చి చంపితే డాక్టర్ నారాయణను 1996 సెప్టెంబర్‌లో కాల్చి చంపారు.

సెప్టెంబర్ 25 పొద్దున వరంగల్ పట్టణంలోని తన ఇంటినుండి మొగిలిచర్లలోని తన క్లినిక్‌కు స్కూటర్‌పైన పోతున్న డాక్టర్ నారాయణను పోలీసులు దారికాచి చంపారు. ఆ ప్రజా డాక్టర్‌కు ఉన్న ఒక్క బలహీనతను వాడుకొని అతన్ని చంపారు. ఎవరయినా ఎక్కడయినా ఆపి ఒంట్లో బాగాలేదని వైద్యం చేయమని అడిగితే అక్కడికక్కడే స్కూటర్ నిలిపి వైద్యం చేయడమే తప్ప 'క్లినిక్‌కు రమ్మని' చెప్పి వెళ్లిపోవడం నారాయణకు అలవాటు లేదు. ఆ సంగతి తెలిసిన పోలీసులు అతనిని ఎనుమాముల గ్రామం దగ్గర ఆ విధంగానే ఆపి కాల్చి చంపారు.

'అతనేం నక్సలైటా? లేకపోతే పౌరహక్కుల సంఘం సభ్యుడా? అతనిని మేమెందుకు చంపుతాం?' అని వరంగల్ పోలీసు అధికారులు పత్రికా విలేకరులతో అన్నారు. తాము ఏం మాట్లాడుతున్నారో వాళ్లకు అర్థం అవుతున్నట్టు లేదు. లేక, ఏం మాట్లాడినా అడిగేవాళ్లెవరన్న అహంకారం బలిసిందో. పోలీసులకు ఎవరినీ చంపే అధికారం లేదు. వాళ్లకుండేది నేరాలను నిరోధించే అధికారం, జరిగిన నేరాలను పరిశోధించే అధికారం మాత్రమే.


పోలీసులు చేసే వీరంగం చూసి వాళ్లకు ఇంకా ఏమేం అధికారాలు ఉన్నాయో అనిపించవచ్చును. తాము డాక్టర్ నారాయణను చంపినట్టు పోలీసులు ఒప్పుకోవడం లేదుగానీ, చేసినట్టు ఒప్పుకోని ఆ ఘోరానికి ఒక కారణం మట్టుకు చూపిస్తున్నారు. నారాయణ నక్సలైట్లకు వైద్యం చేసేవాడు అనే 'నింద'ను ప్రచారం చేస్తున్నారు. నక్సలైట్లకు నారాయణ వైద్యం చేసే ఉండవచ్చును. వైద్య సహాయం అవసరమయి ఎవరు తన దగ్గరకు వచ్చినా వైద్యం చేయడం నిరాకరిస్తే అది డాక్టరు తప్పు అవుతుంది కానీ చేస్తే తప్పు కాదు.

నారాయణ నక్సలైట్లకే కాదు, మొగిలిచర్లలో నక్సలైట్లు ఎవరినయినా కొట్టిపోయినా వాళ్లకు కూడ ట్రీట్‌మెంట్ ఇచ్చేవాడని ఆ గ్రామప్రజలు అంటున్నారు.

నిజానికి తెలంగాణ గ్రామాలలోని డాక్టర్లందరిపైనా ఈ 'నింద' వేయవచ్చును. డాక్టర్ నారాయణ పీపుల్స్‌వార్ సానుభూతిపరుడే అయి ఉండవచ్చును. కాని డాక్టర్లు నక్సలైట్లకు కూడ వైద్యం చేస్తారు. అది వాళ్ల వృత్తి కాబట్టి చేయక తప్పదు. అది సాకుగా చూపించి తెలంగాణ గ్రామాలలో డాక్టర్లను హతమార్చడం మొదలుపెడితే ప్రజలకు వైద్యం చేసేవాళ్లు మిగలరు. నిజానికి ఈ సంవత్సరం నారాయణనే కాక మరొక ఇద్దరు గ్రామీణ వైద్యులను కూడ తెలంగాణలో పోలీసులు చంపారు. అయితే వాళ్లు ఆర్.ఎం.పిలు కావడం వల్లనో, లేక నారాయణ హత్యలాగ మిస్టరీగా మిగిలించకుండ పోలీసులు వాళ్ల హత్యను 'ఎన్‌కౌంటర్'గా చూపించడం వల్లనో అవి సంచలనం సృష్టించలేదు. ఆ యిద్దరిదీ కరీంనగర్ జిల్లా. ఇద్దరిపైనా 'నింద' ఒకటే. 'నక్సలైట్లకు వైద్యం చేస్తున్నారు' అనేది. ఇది ఇట్లా కొనసాగితే త్వరలో డాక్టర్లంతా తెలంగాణ గ్రామాలను వదిలిపెట్టి వెళ్లిపోయినా ఆశ్చర్యపోవలసిన పనిలేదు. ప్రభుత్వ రంగంలో వైద్య సేవలు అంతరించి పోతున్న ఈ దశలో తెలంగాణ ప్రజలకు పెద్ద ముప్పే వచ్చి పడనుంది.

డాక్టర్ నారాయణ హత్యకు పోలీసుల ప్రతీకార వాంఛే కారణం అన్న అభిప్రాయం ఉంది. పీపుల్స్‌వార్ నక్సలైట్లు భీంసింగ్ అనే తాడ్వాయి పోలీస్ కానిస్టేబుల్‌ను చంపినందుకు ప్రతీకారంగా డాక్టర్ నారాయణను పోలీసులు చంపారన్న అభిప్రాయం ఉంది. అంతకు ముందు వర్ధన్నపేట పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఐల్‌రెడ్డిని నక్సలైట్లు చంపినప్పుడు వరంగల్ పోలీసులు పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులయిన బుర్రా రాములు, అంబటి శ్రీనివాసులను చంపుతామని బహిరంగంగా నినాదాలు ఇచ్చారు. పౌరహక్కుల నాయకులు డాక్టర్ రామనాథంను 1985లో, జాపా లక్ష్మారెడ్డిని 1986లో, నర్రా ప్రభాకరరెడ్డిని 1991లో పోలీసులు చంపడానికి ఈ ప్రతీకార తర్కమే కారణం.

# ఒక మంచి మనిషికి జోహార్లు



బయ్యారం రాంరెడ్డి
1956 - 17.8.1999

'రైతు స్వభావం' అంటాం. అది రైతులందరిలోనూ ఉండకపోవచ్చును గానీ ఏదో ఒక అర్థంలో అది రైతులకు సహజం, స్వాభావికం అనుకుంటాం. ఒక్కొక్క జీవన విధానానికీ జీవిత రంగానికీ స్వాభావికమైన గుణాలు కొన్ని ఉన్నాయన్న అభిప్రాయం దీని వెనుక ఉంది. ఆ రంగంలో, లేక ఆ జీవన విధానాన్ని అనుసరించే సామాజిక వర్గంలో మెజారిటీ మనుషులలో ఆ గుణాలు ప్రదర్శితమవుతాయని ఎవ్వరూ లెక్కగట్టలేరు. బహుశా మెజారిటీ అనే అర్థంలో కాక ఆ జీవన విధానానికి ఉండే ప్రత్యేక లక్షణాలకు ఈ గుణాలు తగినవి, అతికేవి అనుకోవడం వల్ల వాటిని సహజమయినవిగా, స్వాభావికమైనవిగా భావిస్తామేమో.

రైతులలో నిష్కపటమైన బోలాతనం, వ్యాపారస్తులలో డబ్బు జాగ్రత్త, మేధావులలో పిరికితనం సహజమైన లక్షణాలుగా భావిస్తాం. అవి ఆయా వర్గాల



ప్రజాతంత్ర వారపత్రిక, 22.8.1999

'స్వభావం'లో భాగమనుకుంటాం. ఈ ఆపాదిత స్వభావాలలో కొన్ని ఆకర్షణీయమైనవి, కొన్ని అనాకర్షణీయమైనవి. 'రైతు స్వభావం' అనేది ఆకర్షణీయమైనది. నిష్కపటం, బోలాతనం, ముక్కుసూటి నడవడిక, పరోపకారం మొదయినవి ఈ ఆపాదిత గుణాలలో ముఖ్యమైనవి. ఇవి రైతులలో ఎంత మందిలో నిజంగా కనిపిస్తాయోగానీ కనిపించినప్పుడు అది సహజం అనుకుంటాం.

బయ్యారం రాంరెడ్డి రైతు. 'రైతు స్వభావం' ఉన్న రైతు. ఎంతో కొంత చదువుకున్నాడు. ఇంకా చదువుకుందామని 'లా'లో చేరాడు. ఎంతో కొంత రాజకీయ జీవితం చూసాడు, ఇంకా చూద్దామని హక్కుల ఉద్యమంలో పనిచేశాడు. చదువుకున్న పట్టణ జీవులు అధికంగా ఉన్న హక్కుల ఉద్యమంలో పనిచేసినప్పుడు వారికి సహజమయిన డొంక తిరుగుడు వ్యవహారశైలినీ చెవులు కొరికే సంస్కృతినీ దగ్గరినుండి చూసాడు. రాజకీయాలలో ఉండడం వల్ల విలువలకంటే లక్ష్యాలకంటే అప్పటి ఎత్తుగడలకూ తాత్కాలిక అవసరాలకూ ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చే గుణాన్ని కూడా దగ్గరి నుండి చూసాడు. అయినా తన 'రైతు స్వభావాన్ని' వదులుకోలేదు.

బహుశా అది అతని స్వభావమేమో. ఏ వర్గ జీవితం నుండీ పుట్టినది కాదేమో.

అతనిది మెదక్ జిల్లా సిద్దిపేట సమీపంలోని చినగుండవెల్లి. కులానికి రెడ్డి, మధ్యతరగతి రైతు. గ్రామంలో ఒకనాడు సిపిఐ (ఎం)లో ఉండేవాడు. గ్రామంలో జరిగిన ఒక హత్యలో ముద్దాయిగా జైలుకు పోయాడు. కోర్టు యావజ్జీవ ఖైదు విధించింది. ఆ హత్యలో తనకు భాగస్వామ్యం లేదనీ వేరే వాళ్ళు చేసిన దానిలో హతుని వర్గం కక్షకొద్దీ తనను కూడ ఇరికించిందనీ నాతో పరిచయమయిన కొత్తలో అన్నాడు. "ఈయనకు హింస అంటే ఇష్టముండదు కాబట్టి అట్లా చెప్పడం మంచిద"నుకున్నాడేమో తెలీదు. ఎందుకంటే మా పరిచయం పెరిగి ఒకరి మీద ఒకరికి విశ్వాసం ఏర్పడిన తరువాత ఆ మాట మళ్లీ ఎప్పుడూ అనలేదు. అది నిజమో కాదో నాకు ఈనాటికీ తెలీదు. తెలుసుకోవాలన్న కుతూహలం కూడ కలగలేదు. ఎందుకంటే బయ్యారం రాంరెడ్డి ఎంతటి దుర్మార్గుడైనా ఒక పథకం ప్రకారం నిస్సహాయుడిని చేసి కోల్డ్‌బ్లడెడ్‌గా చంపలేడనేది ఎంత సత్యమో, అన్యాయాన్ని సహించలేని ఆవేశంలో క్షణిక ఉద్రేకంలో కత్తి పట్టుకోగలడనేది కూడా అంతే సత్యం. హింస అంటే సాధారణంగా గౌరవం లేని వాళ్లు సహితం రెండవ గుణాన్ని గౌరవించగలరు.

పది సంవత్సరాల పై చిలుకు జైలు జీవితం అనుభవించి బయటికొచ్చిన బయ్యారం రాంరెడ్డి 'ఇంక రాజకీయాలూ ఉద్యమాలూ' వద్దనుకొని ఉంటే ఎవరూ అభిశంసించి ఉండరు. కానీ బయటికి రాకముందు నుండీ కూడ బయటికి పోయిన తరువాత ప్రజా ఉద్యమాలలో చురుకుగా పనిచేయాలనే రాంరెడ్డి నిర్ణయించుకున్నాడు. సమస్యల దీర్ఘకాల పరిష్కారం కోసం రాజకీయ నిర్మాణం, వ్యూహరచన చేయడం కంటే కష్టాలలో ఉన్న ప్రజలకు తక్షణ సహాయం చేయడంలో ఎక్కువ సంతృప్తి పొందే వారందరి లాగా రాంరెడ్డి కూడా పౌరహక్కుల ఉద్యమంలో పనిచేయాలని నిర్ణయించుకున్నాడు.

హక్కులకు చాలా కోణాలు ఉన్నప్పటికీ ఒక్క పోలీసు హింస గురించి మాత్రమే పని చేయడాన్ని సమర్థించుకోవడానికి కావలసిన పరిస్థితి తెలంగాణలో ఉంది. ఆ ఒక్క పనే చేసినా ఇక్కడ చేతినిండా పని ఉంటుంది. మెదక్ జిల్లాలో ఆ భారం మీద వేసుకోవడానికి పౌరహక్కుల సంఘానికి చాలా కాలం ఎవరూ దొరకలేదు. జైలు నుండి బయటికొచ్చిన రాంరెడ్డి దానికి సిద్ధం కావడమే కాక తగిన వాడు కూడా కావడం హక్కుల ఉద్యమం అదృష్టమనే చెప్పాలి.

ఈ నాలుగయిదేళ్లలో పోలీసులు ఎత్తుకు పోయిన పిల్లల తల్లిదండ్రులు ఎన్ని వందల మంది రాంరెడ్డి దగ్గరికి పరుగున వచ్చారో. లాకప్పులో చిత్రహింసలు అనుభవిస్తున్నవారి బంధుమిత్రులు ఎన్ని వందల మంది ఆ బందీల విడుదల కోసం రాంరెడ్డిని నమ్ముకున్నారో. తన దగ్గరకొచ్చిన ఏ ఒక్కరికీ 'నావల్లకాదు' అని రాంరెడ్డి ఏనాడూ జవాబు చెప్పలేదు. పత్రికలకు ప్రకటన ఇస్తాడు. అది పత్రికలలో మరుసటి దినం కనిపించకపోతే విలేఖరులను వెతికి పట్టుకొని ఎందుకు ప్రచురించలేదని దబాయించి రెండవరోజు వేయించుకుంటాడు. నిర్బంధానికి బాధ్యుడయిన పోలీస్ అధికారి తన మాట కొంతవరకైనా మన్నిస్తాడనుకుంటే అతనితో తానే ఫోన్‌లో మాట్లాడతాడు. లేదంటే ఏ రాజకీయ నాయకునితోనో లేదా హైదరాబాద్‌లో ఉండే పౌరహక్కుల సంఘం బాధ్యులతోనో మాట్లాడిస్తాడు. టెలిగ్రాంలు ఇస్తాడు, ఇప్పిస్తాడు. ఏదైనా చేసి చిత్రహింసలను ఆపిస్తాడు, 'ఎన్‌కౌంటర్' నుండి బందీని కాపాడతాడు.

ఇదీ బయ్యారం రాంరెడ్డి మీద మెదక్ జిల్లా ప్రజలకున్న విశ్వాసం. రాంరెడ్డి ఆ విశ్వాసాన్ని శాయశక్తులా నిలబెట్టుకున్నాడు. క్రూరమైన అధికారాలు ఒంటబట్టించుకున్న మెదక్ పోలీసులు యథాప్రకారం అతనిని నక్సలైట్ అన్నారు. ఒక కేసులో ఇరికించారు. ఇంకా కేసులలో ఇరికిస్తామని బెదిరించారు. నిన్ను చంపితే దిక్కేముందన్నారు. అయినా రాంరెడ్డి భయపడలేదనడం అబద్ధం అవుతుంది. భయం తెలియని మనుషులు మనుషులే కారు. కానీ తన భయం వల్ల ఇతరులకు తాను చేస్తున్న సహాయం దెబ్బతినకూడదనుకున్నాడు. అందుకోసం భయాన్ని జయించాడు.


రాంరెడ్డి పెద్దగా ఉన్నవాడు కాదు. బొటాబొటిగా బతికేవాడు. ఒక్కోసారి ఎవరయినా వచ్చి ఎస్‌పికి వెంటనే ఫోన్‌చేయమని అడిగితే పైసలుండేవి కావు. ఎవరో ఒకరిని పది రూపాయలడిగి ఆ పనిచేసేవాడే తప్ప నావల్లకాదనే వాడు కాదు. తనకున్న కొద్దిపాటి ఆదాయాన్ని ప్రజల హక్కుల సంరక్షణ కోసం ధారాళంగా ఖర్చు చేసేవాడు.

హక్కుల చైతన్యం ప్రాథమికంగా విలువల చైతన్యం. విలువల కోసం ఎంత కృషి చేస్తాం, ఏ మేరకు చేస్తాం, ఏ రూపంలో చేస్తాం అనే దానికి పరిమితులు ఉంటాయిగానీ విలువల చైతన్యాన్ని ఒక పరిధికే పరిమితం చేయడం సాధ్యం కాదని గుర్తించిన హక్కుల ఉద్యమకారులలో రాంరెడ్డి ఒకడు. ఇది అతని అవగాహనాలోపం అనుకునే వాళ్లు

అనుకోవచ్చును గానీ రాంరెడ్డిలో ఈ స్పృహ సిద్ధాంత చర్చనుండి రాలేదు. అన్యాయానికి గురయిన అసహాయుల పట్ల దయ చూపించకుండా ఉండలేని మంచితనం నుండి వచ్చింది. అన్యాయం ఎక్కడ జరిగినా ఆగ్రహం చెందకుండా ఉండలేని విలువల నుండి వచ్చింది. తన స్వభావం నుండి వచ్చింది. ఆ రకమైన విలువల చైతన్యానికి చారిత్రక స్పృహ లేదనీ సామాజిక నేపథ్యం తెలియదనీ దబాయించి విలువల చైతన్యాన్ని ఒక పరిధికే పరిమితం చేయాలని ఎంత ప్రయత్నం చేసినా ప్రయోజనం లేదు. చారిత్రక స్పృహతోనూ సామాజిక భూమిక గురించి ఎరుకతోనూ కూడా విలువలకు స్వాభావికమైన సార్వజనీనతను నిలబెట్టుకోవడం సాధ్యమే, అవసరమే. అది స్వభావరీత్యా సహజమైన బయ్యారం రాంరెడ్డి వంటి ముక్కుసూటి మనిషికి, కపటం ఎరుగని 'రైతు' వ్యక్తిత్వానికి సులభం కూడ.

నాలుగు పదుల వయసులోనే ఆగస్ట్ 17 రాత్రి బయ్యారం రాంరెడ్డి అకస్మాత్తుగా గుండె పోటుతో మరణించాడు. నిత్యం పోలీసు నిర్బంధానికి గురయ్యే మెదక్ జిల్లా ప్రజలు ఒక పెద్ద అండను కోల్పోయారు. పోలీసులు ఎంత బెదిరించినా మూయించలేని నోటిని మృత్యువు మూయించింది. రాంరెడ్డి తన జీవిత ఆచరణలో చూపించిన మార్గాన్ని మాత్రం మృత్యువు జయించదనే ఆశిద్దాం.

# నియోగి సంస్మరణ



శంకర్ గుహ నియోగి
14.2.1943 - 28.9.1991

సెప్టెంబర్ 28 శంకర్ గుహ నియోగి చనిపోయిన రోజు.

అతను హత్య చేయబడ్డాడు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలోని కంపెనీల యాజమానులతనిని కిరాయి హంతకుల చేత హత్య చేయించారు. వాళ్లకూ వీళ్లకూ కూడా సెషన్స్ కోర్టు శిక్షలు వేసిందిగానీ జబల్‌పూర్‌లోని హైకోర్టు బెంచి అందరినీ విడిచిపెట్టింది.

నియోగి అసాధారణమైన కార్మిక నాయకుడు. మొదటి అసాధారణమైన విషయమేమిటంటే అతను కార్మిక నాయకుడు మాత్రమే కాదు, అతను నడిపిన కార్మిక ఉద్యమం కేవలం కార్మిక ఉద్యమం కాదు. ప్రస్తుతమున్న సమాజం కన్నా భిన్నమైన సమాజం ఏ విధంగా ఉంటుందో ప్రజా ఉద్యమాలు కొంతమేరకైనా నిర్మాణాత్మకంగా చూపించాలని నియోగి నమ్మాడు. ఎవరి బాగు వారు చూసుకోవడమే హేతుబద్ధమైన ఆలోచన అనే పెట్టుబడిదారీ తర్కాన్ని అసహ్యించుకుంటే చాలదు. దానికి ప్రత్యామ్నాయం కేవలం ఒక ఆదర్శం


ప్రజాతంత్ర వారపత్రిక, 3.10.1999

కాదనీ వట్టి ఆవేశం అసలే కాదనీ అది మనుషులకు సాధ్యమయ్యే జీవన శైలేననీ చూపించినప్పుడే మనకున్న అసహ్యాన్ని పదిమందిలోనూ కలిగించగలుగుతాం.

మనుషులు శ్రమనూ బాధ్యతనూ సంపదనూ సమిష్టిగా పంచుకునే జీవితాన్ని నిర్మించి చూపించడం సులభం కాదు. ప్రస్తుతమున్న దోపిడీ వ్యవస్థలో అక్కడక్కడ స్థానికంగా ఆదర్శవంతమైన జీవన పరిస్థితులను రూపొందించడం, రూపొందించి నిలబెట్టడం అసాధ్యమని దీనిని వివరించబోతారు. దోపిడీ వ్యవస్థే లేకున్నా, కొత్తగా 'అప్పుడే తయారు చేసిన' మనుషులను మన చేతిలో పెట్టినా, అది కష్టమే.

దీని అర్థం నిరాశతో ఆ ప్రయత్నాన్నే వదులుకుందామని కాదు. ప్రస్తుత వ్యవస్థలో అసాధ్యంగానీ ఈ వ్యవస్థను కూలదోసిన తరువాత సులభమేననుకోవడం కంటే ఎప్పుడయినా కష్టమేనని గుర్తించి ఇప్పటినుండే సాధ్యమైన మేరకు ఒక ప్రత్యామ్నాయ జీవన విధానాన్ని నిలబెట్టడం ఈ ప్రయత్నానికి చాలా ఉపయోగపడుతుంది. మనం మంచి కమ్యూనిస్టులు కాలేకపోవడానికి 'వ్యవస్థ' మాత్రమే కారణం కాదని మన మనసులలోకి చూసుకుంటే మనకందరికీ తెలుస్తుంది. అట్లాగని మితిమీరిన స్వప్రయోజనం, అది వ్యక్తిత్వానికి కేంద్రమయితే వచ్చే ద్వేషం, ఈర్ష్య ఇవే మనల్ని అన్ని వేళలా నడిపించవని కూడా మనకు తెలుసును. మనిషికి సాధ్యమయ్యే చెడును అధిగమించి మనిషికి సాధ్యమయ్యే మంచిని నిలబెట్టడం ఎప్పుడయినా కష్టమే. కానీ ఎప్పుడూ అసాధ్యం కాదు. ఎంత సాధ్యమవుతుందనే దాని మీద పరిసర పరిస్థితుల ప్రభావం ఉండదని కాదు. ఉంటుంది. కానీ అదే సర్వం అనుకుంటే భవిష్యత్ గురించి మనం చూపించే ప్రత్యామ్నాయ చిత్రం వట్టి ఊహా చిత్రంగానే ఉండిపోయి ఎవ్వరినీ పెద్దగా ఆకర్షించదు.

శంకర్ గుహ నియోగి ఆలోచనల వెలుగులో ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో కార్మికులు, ఇతర ప్రజలు నిర్మించిన రకరకాల సహకార సంస్థలు ఆ భవిష్యత్తును, ఆ ప్రత్యామ్నాయాన్ని కొంచెం దగ్గరికి తీసుకొచ్చి చూపించాయి. ఆ ప్రయోగాలలో ఉండే సమస్యలను ఇప్పటినుండే దగ్గరగా చూడడం కూడా వాటిని ప్రజాస్వామికంగా పరిష్కరించుకునే కృషికి, ఆలోచనకు తోడ్పడుతుంది. ఇప్పుడంతా అసాధ్యమేనని, 'ఆ తరువాత' సులభసాధ్యమని అనుకుంటూ ఉంటే 'ఆ తరువాత' సమస్యలు ఒక్కసారిగా ముందుకొస్తే వాటిని అర్థం చేసుకోలేక ప్రతీఘాతుక శక్తులకు అంటగట్టి బల ప్రయోగంతో అణచివేసే వైఖరే దానికి జవాబయ్యే ప్రమాదం ఉంది.

విభిన్న సమస్యలను జోడించి పోరాటం చేయడం శంకర్ గుహనియోగి చేపట్టిన రాజకీయ ప్రయోగ విశేషాలలో మరొకటి. కార్మికులు రైతులతో మమేకం కావాలనీ రైతాంగం ఆదివాసులతో మమేకం కావాలనీ అనడం, వినడం కొత్తకాదు. కానీ నిజానికి ఈ మమేకం అనేది ఉంటే మానసిక స్పందన రూపంలో మాత్రమే ఉంటున్నది. పూర్తిగా ఒక పోరాటం మరొక పోరాటంతో ఏకం కావడం అసంభవమే కానీ ఇంతకంటే బలమైన సంఘీభావం సాధ్యమే. కానీ ఒకే పార్టీకి ఉన్న రైతు సంఘం, కార్మిక సంఘాల రూపంలో


పార్టీ ద్వారానే కార్మికులూ రైతాంగమూ 'మమేకం' కావడం తప్ప అంతకంటే లోతయిన అర్థం ఆ మాటకు ఉద్యమాలు ఇవ్వలేక పోతున్నాయి.

ఛత్తీస్‌గఢ్ గని శ్రామిక సంఘం సారా వ్యతిరేక పోరాటం నుండి ఛత్తీస్‌గఢ్ ప్రాంత వెనుకబాటుతనం, వివక్షలదాకా అనేక సమస్యల మీద పోరాటాలు చేపట్టింది. జార్ఖండ్ లాగ ఛత్తీస్‌గఢ్ కూడ ఖనిజాల నిక్షేపాలు విస్తారంగా ఉన్న ప్రాంతం. వాటిని ఆధారం చేసుకున్న పెద్ద పరిశ్రమలు కూడ అనేకం ఉన్నాయి. భిలాయినగరం వీటికి ప్రధాన కేంద్రం. అయినప్పటికీ ఛత్తీస్‌గఢ్ మొత్తంగా అభివృద్ధి చెందింది తక్కువ. దేశంలోని ఇతర ప్రాంతాల అభివృద్ధికి ఖనిజాలు సరఫరా చేసే ప్రాంతంగానే ఉండిపోయింది. శంకర్ గుహ నియోగి నిర్వహించిన కార్మిక పోరాటాలలో ఇది కూడా ఒక ముఖ్య అంశం అయింది.

పెట్టుబడిదార్లు కార్మికులకు సారాయి తాగించి వారి వ్యక్తిత్వాన్ని బలహీనపరచి పోరాట చైతన్యాన్ని నీరుగారుస్తారని విమర్శించని కార్మిక ఉద్యమం లేదు గానీ, పెట్టుబడిదార్లనూ వ్యవస్థనూ నిందించి సరిపెట్టుకుంటే చాలదని గుర్తించి కార్మికుల చేత సారాయి తాగడం మాన్పించే ఉద్యమం చేపట్టిన నాయకుడు నియోగి. మనుషులలోని బలహీనతలను పెత్తందారీ శక్తులు, వారి ప్రయోజనాలకు అనుకూలంగా రూపొందిన వ్యవస్థలు వాడుకునే వైనం సుపరిచితమయినదే. దానిమీద విమర్శకూడ అందరూ ఎప్పుడూ చేసేదే. కానీ దానికి జవాబుగా తమ బలహీనతలను గుర్తించి వాటి నుండి బయటపడే ప్రయత్నం ప్రజలు చేయాలని నమ్మి దానికోసం ఉద్యమం నిర్మించడం వామపక్ష సంప్రదాయంలో మామూలుగా కనిపించదు. మానవ ప్రగతికి సంబంధించిన చర్చ మనిషితో మొదలయి మనిషితో ముగిసినట్టయితే ఇది సాధ్యమయ్యేది. వ్యవస్థతో మొదలయి వ్యవస్థతో ముగిసే (మధ్యలో మనిషిని వెతుక్కునే) చర్చకు ఈ అవగాహన సైద్ధాంతికంగా కష్టతరం. నియోగి తన ప్రయత్నాన్ని సిద్ధాంతీకరించాడో లేదో - ఏ విధంగా సిద్ధాంతీకరించాడో - తెలీదు. కానీ అతని ప్రయత్నం నుండి ఈ జ్ఞానం పొందగలిగితే అది సఫలమయినట్టే.

చివరిగా మాట్లాడుకోవలసింది, నియోగి మరణానంతరం అతను నిర్మించిన ఉద్యమంలో చోటు చేసుకున్న సంక్షోభం గురించి. చాలా మంచి ప్రయత్నాలు చేసిన ఉద్యమాలు సహితం వాటిని ఉద్యమ ఆలోచనలుగా నిలబెట్టలేకపోవడం, విశిష్ట వ్యక్తిత్వం గల ఒక నాయకుడు లేక సిద్ధాంతవేత్త ఆలోచనలుగానే అవి ఉండిపోవడం తరచు చూస్తున్నాం. టిటో మరణానంతరం అతి భయంకరమైన జాత్యహంకారానికి క్షేత్రంగా మారిన యుగోస్లావియా దీనికి ఒక ప్రముఖ నిదర్శనం. అయితే మావో నుండి శంకర్ గుహ నియోగి దాకా ఇంకా అనేకం ఉన్నాయి. దీనిని 'వ్యక్తివాదం' అని సులభంగా కొట్టిపారేయొచ్చును గానీ మానవత ప్రాతిపదికన అర్థం చేసుకొని సవరించుకోవడం అంత సులభం కాకపోవచ్చు.

# నిస్పృహకు చోటివ్వద్దు



పురుషోత్తం
13.4.1962 - 23.11.2000

**తా**ను నమ్మిన పౌరహక్కుల ఉద్యమ నిర్మాణం కోసం పురుషోత్తం చేసిన నిర్విరామకృషి, తన విశ్వాసాలకు కార్యరూపం ఇవ్వడంలో ప్రాణహానికి వెరవని అతని తెగింపు అసాధారణమైనవి. అతనినీ, ఆజం అలీనీ పోలీసుల రక్షణలో ఉన్న కిరాయి హంతకులు పట్టపగలు అతిక్రూరంగా హతమార్చిన వైనం కూడా అసాధారణమైనదే.

సామాజిక జీవితంలోని భిన్న ప్రయోజనాలు, భిన్న లక్ష్యాల మధ్య వైరుధ్యం మన కళ్ల ముందే రోజురోజుకూ మరింత హింసాత్మక రూపం తీసుకుంటున్నది. అందులో బలవంతులైన వారు మరింత నగ్నంగానూ మరింత క్రూరంగానూ హింసకు పాల్పడుతున్నారు. అది ఒక హక్కయినట్టు వారు ప్రవర్తిస్తుంటే ప్రజలు మౌనంగా చూస్తున్నారు. ఆ హింసలో క్రూరత్వం పెరిగే కొద్దీ ప్రేక్షకుల మౌనం కూడా పెరుగుతుంది. రాష్ట్ర రాజధానిలో మధ్యతరగతి నివాసాల మధ్య పురుషోత్తంను పట్టపగలు తల తెగనరికి చంపడం అటువంటి

కె. బాలగోపాల్

ఒక భయంకర దృశ్యం. నల్గొండ పట్టణంలో ఆర్టీసీ బస్టాండు ఎదురుగా పురుషోత్తం సంస్మరణ సభ జరుపుకుంటున్న హాలు బయట రోడ్డు మీద ఆజంను నరికి చంపడం మరో భయంకర దృశ్యం.

వాళ్లు ఇంత చేయగలిగినప్పుడు ఇంక చేయలేనిదేముంది? ఇంక ఎవరైనా కూడా న్యాయాన్ని గురించి, హక్కుల గురించి మాట్లాడి సాధించేది ఏముంది? మాట్లాడేవాళ్లు ఏ రోజైనా ఏ రకంగానయినా చావవచ్చు. పోలీసులతో చెట్టపట్టాలు వేసుకొని తిరిగే హంతకులు బహిరంగంగా సంచరిస్తున్న చోట మనం తీసుకోగల 'జాగ్రత్తలు' అంటూ ఏమీ ఉండవు. నిస్పృహ నిండిన ఈ ఆలోచనలకు మనం సులభంగా లోనయ్యే ప్రమాదం ఉంది. ఆపైన ఏమి చేసినా ప్రయోజనం లేదనో, లేక ఈ క్రూరత్వాన్ని ఎదుర్కోవడానికి అంతటి క్రూరత్వానికి మనమూ సిద్ధపడితేనే ప్రయోజనం ఉంటుందనో నిర్ధారించుకోవడం ఇంకొక్కడుగు మాత్రమే. పురుషోత్తంను, ఆజంను చంపినవాళ్లకూ చంపించినవాళ్లకూ ఆ హంతకుల సంరక్షకులకూ కావలసింది అదే.

ఈ ఎనిమిది నెలల కాలంలో జరిగిన ఇతర పరిణామాలను చూస్తే మన నిస్పృహ వారికెందుకవసరమో అర్థం అవుతుంది. ఆర్థిక 'సంస్కరణల' దుష్ప్రభావాలు ఒక్కొక్కటిగా ప్రజలపైన పడుతున్నాయి. ప్రజలకర్థమవుతున్నాయి. 'అభివృద్ధి' నిర్వచనం నుండి ప్రజలను తొలగించి పెట్టుబడి సమీకరణనూ, పెరుగుదల రేటునూ సర్వప్రమాణాలుగా భావించే పాలనా విధానాలు న్యాయస్థానాల ఆమోదముద్ర పొందుతున్నాయి. ఆ విధానాలు అన్యాయమైనవంటూ కోర్టుకు పోయిన వారిని 'మీరు ప్రజల కోసం కేసు వేస్తున్నారా? ప్రచారం కోసం వేస్తున్నారా?' అని దేశ ప్రధాన న్యాయమూర్తి ఈసడింపుగా అడుగుతున్నారు. 'నీకు చట్టంలో స్పష్టంగా రాసి ఉన్న హక్కు ఏదయినా పోతేనే కోర్టుకు రా – లేకపోతే రావద్దు' అని మన హైకోర్టు నుండి కర్ణాటకకు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయివెళ్లిన జస్టిస్ వెంకట్రామిరెడ్డి అంటున్నారు.

ఈ 'అభివృద్ధి'కి రెండవ ధృవం నిర్వాసితులు. భౌతికంగా నిర్వాసితులయ్యే ప్రజల విషయం 'నర్మదా కేసు' సందర్భంగా బాగానే చర్చకు వచ్చింది. అంతకంటె తక్కువ స్థాయిలో అయినప్పటికీ అంతే సంపూర్ణంగా ప్రజలను నిర్వాసితులు చేసే ప్రయత్నాలు మన రాష్ట్రంలో హైదరాబాద్, గుంటూరు వంటి పట్టణ ప్రాంతాలలో మొదలయ్యాయి. నర్మదా డ్యాంకయినా సౌరాష్ట్రలోని కరువు ప్రాంతాలకు నీరందించడం అనే పాజిటివ్ లక్ష్యం ఉందేమోగానీ పట్టణాల సుందరీకరణకు అటువంటి లక్ష్యం కూడా ఏదీ లేదు.

ఒక పట్టణం నడిబొడ్డున ఒక ఎకరం ప్రభుత్వ భూమి ఉందనుకోండి. అందులో ఒక్కొక్కరు మూడు సెంట్ల భూమిలో గుడిసెలేసుకొని – రోడ్లకు, కాలవలకు, అంగళ్లకు కొంచెం చోటు మిగిలించి – ముప్పయి కుటుంబాలు నివసిస్తున్నాయనుకోండి. ఖరీదయిన ఆ భూమిలో వాళ్లను ఉండనిస్తే రాష్ట్రానికి ఏమొస్తుంది? వాళ్లు అక్కడున్నా వేరే ఎక్కడున్నా

చేసే కూలి చేస్తారు. రాష్ట్ర ఆదాయానికి చేర్చే సంపద చేరుస్తారు. దానికి వారు నగరం నడిబొడ్డున ఎందుకుండాలి? దూరం వెళ్లిపోవడం వల్ల వారి దినసరి ఖర్చులు పెరగవచ్చు, వారిప్పుడు చేస్తున్న పని కోల్పోయి కొత్తది వెతుక్కోవలసి రావచ్చు. అది వారి తలనొప్పి. వారు కొత్తది వెతుక్కోకమానరు, ఖర్చులు పెరిగి జీవనం దెబ్బతిన్నా 'రాష్ట్ర ఆదాయానికి' ఎప్పటిలాగే అంతే సంపద చేర్చకమానరు. కానీ వారిని పట్టణం నడిబొడ్డు నుండి బయటికి తరిమేసి ఆ ఎకరం జాగాను పర్యాటక అభివృద్ధికి కేటాయిస్తే 'రాష్ట్ర ఆదాయం' పెరుగుతుంది, ఇరవై ఏళ్లలో 10 శాతం పెరుగుదల రేటు సాధించాలన్న చంద్రబాబు నమూనా లక్ష్యానికి రాష్ట్రం ఇంకొంచెం చేరువ అవుతుంది.

భౌతికంగా నిర్వాసితులయ్యేవారి సమస్య కొంచెం ప్రయత్నం చేస్తే అర్థమయినా అవుతుంది. కానీ ఒక జీవనమార్గం నుండి, కనీస భద్రత నుండి, అభివృద్ధి అవకాశాల నుండి 'నిర్వాసితులు' అయ్యేవారూ ఉన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను ఆర్థిక క్రమశిక్షణ పేరిట నీరసింపజేసే కొద్దీ ఆహార భద్రతకు దూరమయ్యేవారి సంఖ్య పెరుగుతున్నది. ఎఫ్‌సిఐ గోడవున్లు పట్టనంతగా ఆహారధాన్యాల నిల్వలు పెరుగుతున్నాయిగానీ పేదలు వాటి లభ్యత నుండి 'నిర్వాసితులు' అవుతున్నారు. గ్లోబలైజేషన్ వ్యవసాయరంగంలోకి ప్రవేశించాక రైతాంగం జీవితాలలో అస్థిరత, అభద్రత చాలా పెరుగుతున్నాయి. కార్పొరేట్ వ్యవసాయం దీనికి తట్టుకుని వర్ధిల్లుతుందేమోగానీ రైతులు – అందులోనూ కరువు ప్రాంతాల రైతులు – తట్టుకోలేరు. కరువుకు ఏ పరిష్కారమూ ఈ వ్యవసాయ వ్యూహంలో లేదు. అస్థిరతే దీని లక్షణం కాబట్టి దానికి విరుగుడు ఎట్లాగూ లేదు. పెరుగుతున్న రైతాంగం ఆత్మహత్యల జాబితాలో ఈ పరిస్థితి ప్రతిబింబిస్తోంది. భద్రత నుండి 'నిర్వాసితుల'యిన రైతాంగం జీవితానికే వెలి అవుతున్నారు. రేపు చంద్రబాబు కుటిల యత్నాలు ఫలించి ఏజెన్సీలో ఖనిజాల కార్పొరేషన్లకు నెలవు దొరికితే ఆదివాసులకు ఇంతకంటే చాలా వేగంగా ఇదే గతి పట్టే ప్రమాదం ఉంది.

ప్రజలను భౌతికంగా నిస్సహాయులను చేస్తున్న ఈ పరిస్థితిలో వారు మానసికంగా కూడా నిస్పృహకు లోనయినట్టయితే ఇంక దీనికి పరిష్కారం దొరకదు. పాలనా వ్యవస్థ అన్ని నియమాలనూ పక్కనబెట్టి విచ్చలవిడిగా వ్యవహరించడం ఈ నిస్పృహ పెరగడానికి తోడ్పడుతుంది. ఈ నిస్పృహను పెంచడం దాని లక్ష్యాలలో ఒకటి. ప్రభుత్వం ప్రైవేట్ హంతకముఠాలను చేరదీయడం, పోలీసులు జైలు నుండి కోర్టుకు తీసుకుపోతున్న ముద్దాయిలను దారిలోనే కాల్చిపారేయడం, దోషినీ నిర్దోషినీ వేరు చేయగల సున్నితత్వాన్ని నేర స్మృతి నుండి వెలివేయడం ఇదంతా కేవలం రాశిలో మాత్రమే కాదు, గుణంలోనూ చాలా పెరిగిన నిర్బంధం. గుణంలోని తేడాలో ప్రధాన విషయం ప్రజలలో అది పెంచే మానసిక దుర్బలత, నిస్సహాయత. ప్రస్తుత పాలనా విధానాలకు ఇదే కావాలి.

ఆ నిస్సహాయతను అధిగమించడానికి కావలసిన దృఢసంకల్పాన్నీ మానసిక స్థైర్యాన్నీ పురుషోత్తం నుండి ఉద్యమాలూ ఉద్యమకారులూ ప్రజలూ నేర్చుకోగలిగితే అతని మరణం

వృథా కానట్టే. ఆ సంకల్పం ఏ రకమైన ఉద్యమ ఆచరణకు దారి తీస్తుందనే విషయంలో ఉద్యమాల మధ్య ఉద్యమకారుల మధ్య ఎన్ని అభిప్రాయభేదాలయినా ఉండవచ్చుగాక అది వేరే విషయం.

****

అతను నమ్మిన నమూనా పట్ల మానవహక్కుల వేదికకు అభిప్రాయ భేదమున్నప్పటికీ ఒక హక్కుల ఉద్యమకారునిగా అతని కృషి పట్ల మాకు గౌరవం ఉంది. అటువంటి ఉద్యమకారుడు ఏ విధంగా చనిపోయినా అది బాధాకరమే. అతనిని ఎవరు, ఏ కారణంగా హత్యచేసినా అది ఖండించదగ్గ విషయమే. కానీ ఆ హంతకులు పోలీసుల కనుసన్నలలో బతికే సర్కారీ హంతకులయినప్పుడు అదింక కేవలం ఆ హతుడి సమస్య కాదు. అప్పుడు ప్రజాస్వామ్యానికి ఏ గతి పట్టిందని అందరూ ఆందోళన చెందవలసి ఉంటుంది. చట్టబద్ధపాలనను మన పాలకులు ఎంత దూరం దిగజార్చారని అందరూ ఆవేదన చెందవలసి ఉంటుంది. కేవలం పురుషోత్తంకో పౌరహక్కుల సంఘానికో హక్కుల ఉద్యమానికో కాక రాజకీయ స్వేచ్ఛనూ ప్రభుత్వంతో విభేదించే హక్కునూ కోరుకునే వారందరికీ ఇవి చాలా ప్రమాదకరమైన పరిణామం అని అందరమూ గుర్తించాలి.

ఉద్యమాలలో బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తులు ఉద్యమద్వేషులుగానూ ప్రభుత్వం చెప్పుచేతలలో బతికే హంతకులుగానూ మారడానికి ఆ ఉద్యమాల బాధ్యత ఏమీ లేదా, వారిని ప్రశ్నించనక్కరలేదా అని అడిగేవారు ఉంటారు. మేము ఈ ప్రశ్నను దాటవేయదలచుకోలేదు. ఏదో డొంకతిరుగుడు జవాబు చెప్పదలుచుకోలేదు. వారి బాధ్యత సహితం ఉందనీ, వారిని ప్రశ్నించాలనీ, ఒప్పుకుంటాం. ప్రజాస్వామ్య విధ్వంసకమైన పరిణామాలకు ఎవరు ఏ కోణం నుండి ఏ మేరకు బాధ్యులయినా వారిని ప్రశ్నించవలసిందే.

అయితే ఆ ప్రశ్న, దానికి వారిచ్చే జవాబు ఎట్లాగున్నా నేరస్తుల ముఠాలను చేరదీసి వారి నేరాలకు అభయం ఇచ్చి ఉద్యమాలపైన, తమ పాలనకు వ్యతిరేకమైన వారిపైన ప్రయోగించే ప్రభుత్వ వ్యూహాన్ని అత్యంత ప్రమాదకరమైన, అభ్యంతరకరమైన విషయంగా అందరమూ గుర్తించడం అవసరం. దానిని సాగనిస్తే పాలకులకు గులాంలైన వారికి తప్ప వేరెవ్వరికీ జీవితానికి భద్రత ఉండదు, రాజకీయ స్వేచ్ఛ ఉండదు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యమే ఉండదు.

'సర్కారీ హంతక ముఠాలను వ్యతిరేకించండి' పేరుతో
మానవహక్కుల వేదిక వేసిన కరపత్రం నుంచి, 16.12.2000

# హక్కుల ఉద్యమానికి తాత్విక స్ఫూర్తి



వి.ఎం. తార్కుండే
3.7.1909 - 22.3.2004

ఏడేళ్ళ కింద అనుకుంటాను. ఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ సంస్థ 'కాశ్మీర్ సమస్య'పై సెమినార్ తలపెట్టింది. వక్తలలో ఒకరు పియుసిఎల్ వ్యవస్థాపకులలో ఒకరయిన వి.ఎం. తార్కుండే. ఆయన బొంబాయి హైకోర్టు రిటైర్డ్ జడ్జి, సుప్రీంకోర్టులో న్యాయవాది. రిజిస్ట్రార్ అనుమతితో నిర్వహించతలపెట్టిన ఆ సెమినార్‌ను ఎబివిపి కార్యకర్తలు జరగనివ్వలేదు. గుంపుగా కర్రలు పట్టుకొనివచ్చి ముందే హాలును ఆక్రమించుకున్నారు. తార్కుండే వస్తే ఆయనను చావగొడతాం అన్నారు. తార్కుండే అప్పటికే వచ్చి ఉన్నారు. ఆయనకేమీ అపాయం జరగకుండ అక్కడినుండి తప్పించడం ప్రధానం అని నిర్వాహకులు భావించారు. సెమినార్ ఆలోచనను వదులుకొని తార్కుండేని తీసుకుపోయారు. అప్పటికి తార్కుండే వయసు 80 దాటింది. కాశ్మీర్ మీద మీటింగ్

కె. బాలగోపాల్

వార్త దినపత్రిక, 24.3.2004

అనేసరికి వచ్చారు. ఆ తరువాత ఆయన బయటకు రావడం దాదాపు మానుకున్నారు. ఢిల్లీ శివారు నొయిడాలో ఉంటూ అక్కడే 22వ తేదీ రాత్రి కన్నుమూసారు.

## వైతాళికులది ప్రత్యేక స్థానం

ఉద్యమాల ప్రారంభకులకెప్పుడూ చరిత్రలో ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. వారు ప్రాథమిక సమస్యలను ఎదుర్కొని ఉద్యమాన్ని బట్టకట్టించిన తరువాత ఇతరులు దానిని నడుపుతారు. భారత పౌరహక్కుల ఉద్యమంలో తార్కుండేది అటువంటి పాత్ర. దాదాపు 30 ఏళ్ళ క్రితం ఆయన జీవం పోసిన పౌరహక్కుల ప్రజాసంఘం (పియుసిఎల్) ఇప్పుడొక జాతీయస్థాయి సంస్థ అయింది. దానితోపాటు ఎదిగిన పౌరహక్కుల ఉద్యమం ఇప్పుడు సామాజిక చైతన్యంలో గుర్తింపు పొందింది. అప్పుడప్పుడు కుంటుతూ ఉన్నా దాని ఉనికికీ గుర్తింపుకూ ఢోకాలేదు. మనం రాజకీయంగా విభేదించే వాళ్ళ హక్కుల రక్షణ కోసం మన శ్రమనూ, వనరులనూ ఖర్చు చేయడం చిన్న విషయం కాదు. నక్సలైట్ పార్టీల కార్యకర్తలను బలితీసుకున్న 'ఎన్‌కౌంటర్'ల గురించి దేశవ్యాప్త నిరసన పోగుచేయడంలో తార్కుండే కృషి అసాధారణం. ఆయన రాజకీయంగా 'రాయిస్టు'. రాయిస్టులలో కమ్యూనిస్టు వ్యతిరేకత సర్వసాధారణం. కానీ, నక్సలైట్ల హక్కుల విషయంలో పనిచేసేటప్పుడు తార్కుండే మాటలలోగానీ, ప్రవర్తనలోగానీ ఆ వ్యతిరేకత ధ్వనించేది కాదు. పని చేసే క్రమంలో తీరికగా కూర్చునే సమయం దొరికితే అప్పుడు తన రాజకీయ భావాలను వివరించేవారు. అయితే పౌరహక్కుల పనిలో ఉన్నప్పుడు ఆ ధ్వని వినిపించేది కాదు.

హక్కుల ఉద్యమంలో సహితం, రాజకీయ భావసారూప్యత ఉన్నవారు కూడా విడిపోయి పనిచేయడం అలవరచుకుంటున్న రోజుల్లో తార్కుండే నడవడి ఆదర్శంగా ఉంటుంది. 'కాశ్మీర్ సమస్య'కు ఆయన స్పందించిన తీరు కూడా అసాధారణమైనదే. 'తార్కుండే ఈ మధ్య రావడం లేదెందుకు?' అని ఆయన వయసెంతో తెలియని కాశ్మీరీలు అడుగుతుంటారు. ఒక్కొక్కసారి నిష్ఠూరమాడుతుంటారు కూడా. కాశ్మీరులో స్వయం నిర్ణయాధికార పోరాటం, దానిపై నిర్బంధం మొదలయిన తరువాత దేశంలోని సగటు పౌరహక్కులవారికి 'దేశ భక్తి'ని అధిగమించి కాశ్మీరీలకు జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించడానికి కొంత సమయం పట్టింది. గుర్తించాక ఏ మాత్రం తటపటాయించకుండ, వయసును సహితం లెక్కచేయకుండ శ్రీనగర్ పోయి కాశ్మీరీలకు సంఘీభావం తెలిపిన మొదటి పౌరహక్కుల నాయకుడు తార్కుండే.

తార్కుండే రాజకీయంగా రాయిస్టేకాక జయప్రకాష్ నారాయణ్‌కు సన్నిహితుడు కూడ. పౌరహక్కుల విషయంలో నిబద్ధతకు రెండూ తోడ్పడ్డాయి. మన దేశంలో హక్కుల ఉద్యమంలోని కార్యకర్తలలో కమ్యూనిస్టు భావాలు గలవారే మెజారిటీ. ఇది ఆ ఉద్యమానికి బలాన్ని ఇచ్చింది. హక్కుల భావనను పౌరహక్కులకే పరిమితం చేయకుండ మనిషి మనుగడను ప్రాతిపదికగా తీసుకొని విశాలంగా అర్థం చేసుకునే తత్వాన్ని నేర్పింది. పోరాట


లక్షణాన్ని అందిచ్చింది. అయితే కమ్యూనిస్టు భావాలు కలవారు మాత్రమే ఉండిఉంటే కొన్ని రకాల నష్టమూ జరిగి ఉండేది. కమ్యూనిస్టు సిద్ధాంత దృక్పథంలో 'బూర్జువా ప్రజాస్వామ్యం'గా భావించే వ్యవస్థలో అంతర్భాగంగా ఎదిగిన పౌరహక్కులను గురించి లోతయిన అవగాహన హక్కుల ఉద్యమంలో లోపించి ఉండేది. ఆధునిక భారత రాజకీయాలలో 'బూర్జువా ప్రజాస్వామ్యం'లోని హక్కుల కోణాన్ని గురించి మంచి అవగాహన ఉన్న వ్యక్తి రాం మనోహర్ లోహియా. ఆయన నాయకుడిగా ఉండిన సోషలిస్టు ఉద్యమమొక్కటే పౌరహక్కులను తన రాజకీయ అజెండాలో భాగం చేసింది. జయప్రకాశ్ నారాయణ్ తరువాతి రోజులలో ఆ సోషలిస్టు ఉద్యమానికి ప్రధాన నాయకుడయ్యాడు. 1970లలో ఇందిరాగాంధీకి విపరీతమైన ప్రజాదరణ ఉన్న రోజులలో, ఆమె పాలనలోని నియంతృత్వ పోకడలను వ్యతిరేకించిన రాజకీయవేత్త జయప్రకాశ్ నారాయణ్. ఆయన స్ఫూర్తితో బీహార్‌లోనూ, గుజరాత్‌లోనూ బలమైన విద్యార్థి యువజన పోరాటాలు నడిచాయి. పారామిలిటరీ బలగాలను ప్రయోగించి వాటిని అణచివేసారు. ఆ రెండు రాష్ట్రాలలోనూ కొన్ని వందలమంది యువకులూ, విద్యార్థులూ చనిపోయారు. తార్కుండే వంటి మేధావులు (అప్పటికి ఆయన బొంబాయి హైకోర్టు జడ్జిగా రిటైరయి ఉన్నారు) ఈ అణచివేతను నిరసిస్తూ పియుసిఎల్ ఏర్పాటుకు పునాదివేసారు. సోషలిస్టు ఉద్యమానికి లోహియాకాలం నుండి ఉన్న పౌరహక్కుల స్ఫూర్తి కొత్తగా ఆవిర్భవించిన ఈ పౌరహక్కుల ఉద్యమానికి తాత్వికబలాన్ని ఇచ్చింది.

## మరో నేపథ్యం...

దీనికి సమాంతరంగా పశ్చిమ బెంగాల్లోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ వేరే నేపథ్యం నుండి పౌరహక్కుల కృషి మొదలైంది. నక్సలైట్ ఉద్యమాన్ని ఎదుర్కొనడానికి ఆ రాష్ట్రాల పాలకులు అనుసరించిన అణచివేతను నిరసిస్తూ రచయితలూ, ఇతర మధ్యతరగతి జీవులూ ముందుకు రావడం దానికి నాంది. ఈ కృషికి పౌరహక్కుల గురించి నిర్దిష్టమైన అవగాహన ఏమీ లేకున్నా కమ్యూనిస్టు రాజకీయాల్లో భాగమైన ప్రజా పోరాట సంప్రదాయాన్ని హక్కుల ఉద్యమంలోకి అది తీసుకురాగలిగింది. ఈ రెండు స్రవంతులూ 1970, 80లలో ఒకరినొకరు తాత్వికంగా, రాజకీయంగా అనుమానంగా చూసుకుంటూ పనిచేసినప్పటికీ 1990లలో అనుమానాలు తగ్గి పరస్పర అవగాహన పెరిగింది. కమ్యూనిస్టుల పట్ల తన రాజకీయ అభిప్రాయాలు ఏవయినప్పటికీ వారి హక్కుల విషయంలో రాజీలేని వైఖరి అవలంబించిన తార్కుండే ఈ రెండు స్రవంతుల మధ్య పుట్టుకతోనే ఉన్న ఎడాన్ని తగ్గించడానికి ప్రత్యేకమైన ప్రయత్నమేమీ లేకుండానే తోడ్పడ్డారు. ఈ రెండు స్రవంతుల తాత్విక ధోరణుల కలయికే 1990ల తరువాత పౌరహక్కుల ఉద్యమ దృక్పథమయింది. ఆ తరువాతి కాలంలో అంబేద్కరిజం నుండి ప్రధానంగానూ స్త్రీవాదం నుండి కొంతమేరకు ఈ దృక్పథం కొత్త కోణాలు నేర్చుకున్నది. అయితే భిన్నమూలాల నుండి వచ్చిన ఈ భావాలను సమీకరించి ఒక సమగ్రమైన ప్రాపంచిక దృక్పథాన్ని రూపొందించుకునే కర్తవ్యాన్ని హక్కుల

ఉద్యమం ఇంకా పరిపూర్తి చేయలేదు. రాజకీయ జడత్వం నుండి తాత్విక అపరిపక్వతదాకా దీనికి అనేక కారణాలు ఉన్నాయి. 30 ఏళ్ళనాడు తార్కుండేవంటి కొద్దిమంది ప్రారంభించిన ఈ ఉద్యమం ఇప్పుడు ఇక్కడిదాకా ఎదిగింది. హక్కుల పరిరక్షణలో రాజీ పడని తత్వాన్ని తార్కుండే ఈ ఉద్యమానికి నేర్పారు. ఆ బలాన్ని కాపాడుకుంటూ తాత్విక పరిపూర్ణతను సాధించుకోవడం, ఒక ప్రత్యేకమైన కర్తవ్యాన్ని నిర్దేశించుకోవడం హక్కుల ఉద్యమం చేయవలసిన పని. హక్కుల భావనలోని అన్ని కోణాలను తిరస్కరించి అధికారం, సంపద తప్ప వేరే సామాజిక నీతి ఏదీ లేదనే దిశగా సాగుతున్న ప్రస్తుత పాలనా నీతిని ఎదుర్కోవాలంటే దానికి తాత్విక బలం అవసరం. తార్కుండేవంటి ఉద్యమ ప్రారంభకుల నిబద్ధత అందుకు అవసరమైన సంకల్పాన్ని ఇస్తుందని ఆశిద్దాం.

# అసాధారణులలో ఒకడు



గొర్రెపాటి నరేంద్రనాథ్
2.9.1952 - 3.7.2009

గాంధేయవాదులు ఆయనను కమ్యూనిస్టు అనుకునేవారు. కమ్యూనిస్టులు ఆయనను గాంధేయవాది అనుకునేవారు. ఆయన మాత్రం ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఇద్దరి వేదికలలోనూ పనిచేసేవాడు. మంచి కోసం పనిచేసే ఏ వేదికలోనయినా ఇమిడేవాడు. ఇమిడి పనిచేసేవాడు. అట్లాగని తన అభిప్రాయాలు ఎక్కడా దాచుకునేవాడు కాదు. ఎవరి దగ్గర వారి అభిప్రాయాలు పలికేవాడు కాదు. పైగా ఎవరితో కలిసి పనిచేసినా వారి దృక్కోణానికి కనిపించని విషయాలు, తోచని ఆలోచనలు చర్చకు పెట్టేవాడు. గాంధేయవాదులను వర్గ దోపిడీ సంగతేమిటని అడిగేవాడు. కమ్యూనిస్టులను ప్రజాస్వామ్యం గురించి, హింస గురించి ప్రశ్నించేవాడు. బయట ఉండి ఇటువంటి ప్రశ్నలు వేసిన వాళ్లు చాలా మందే ఉన్నారు. కాని నరేంద్రనాథ్ ఇద్దరితోనూ కలిసి పనిచేస్తూ ఇద్దరి వేదికలలోనూ పని చేస్తూ ఈ ప్రశ్నలు లేవదీసేవాడు.

కె. బాలగోపాల్

ఆంధ్రజ్యోతి దినపత్రిక, 5.7.2009

ఇది నరేంద్రనాథ్ స్వభావం నుంచి వచ్చిందే తప్ప తెచ్చి పెట్టుకున్న ఎత్తుగడ కాదు. మంచి చేసే వారెవరినయినా మనస్ఫూర్తిగా ఇష్టపడేవాడు. గాంధేయవాదాన్ని విస్తృత ప్రజా ఉద్యమాలలో ఆచరించాలని ప్రయత్నిస్తున్న మేధాపాట్కర్ తోనూ కలిసి పనిచేశాడు. కమ్యూనిస్టు కొల్లా వెంకయ్య గారినీ చాలా అభిమానించి భూ సంస్కరణల అమలు కోసం ఆయనతోనూ కలిసి పనిచేసేవాడు. నరేంద్రనాథ్‌కు అభిప్రాయాలు లేక కాదు. కానీ పిడివాదం లేశమంత కూడ ఉండేది కాదు. ఉదాహరణకు హింస ఏ కారణంగా చేసినా ఎవరు చేసినా తప్పని నమ్మేవాడు. కానీ ఉద్యమాలూ ఉద్యమకారులూ చేసే హింసను ఖండించడానికి నిరాకరించే పౌరహక్కుల సంఘంలో బాధ్యతలు తీసుకొని మరీ పనిచేశాడు. మానవ హక్కుల వేదిక ఏర్పడిన తరువాత, ఉద్యమకారులు హింసను అన్యాయంగా ప్రయోగిస్తే ఖండిస్తామని అంటే 'హింసకు న్యాయం అన్యాయం ఏమిటి అసలు హింసే అన్యాయం' అంటూ అభ్యంతరం తెలిపాడు గానీ మళ్లీ బాధ్యతలు తీసుకొని మరీ పని చేశాడు.

పేదలకు పంచడానికి ఇంకా భూములెక్కడున్నాయి అని కమ్యూనిస్టులు సహితం అనుకుంటున్న దశలో తన స్వంత జిల్లా అయిన చిత్తూరులో పేదలకు పంచని, పంచినా అన్యాక్రాంతమైన సీలింగ్ భూముల్నీ, భూస్వాములు బోగస్ సెటిల్‌మెంట్ పట్టాలు పొందిన ఎస్టేట్ భూముల్నీ ఎన్ని వేల ఎకరాలున్నాయో ఒక్కొక్కటిగా బయటకు తీసి భూ సంస్కరణల కార్యాచరణోద్యమం పేరిట దళిత సంఘాలనూ ఇతర ఉద్యమకారులనూ కలుపుకొని కలెక్టర్ల, జాయింట్ కలెక్టర్ల వెంటపడ్డాడు. గడచిన అయిదారు సంవత్సరాలలో ఆ జిల్లాలో పనిచేసిన రెవెన్యూ అధికారులెవ్వరూ నరేంద్రనాథ్‌ను జీవితంలో మరచిపోలేరు. మావోయిస్టులకూ రాష్ట్ర ప్రభుత్వానికీ మధ్య చర్చలు విఫలం అయిన తరువాత మావోయిస్టుల సూచన మేరకు ఏర్పడిన భూమి కమిషన్‌లో కూడా చొరవ తీసుకొని పనిచేశాడు.

ఒకటి సత్యమని నమ్మిన తరువాత దానిని ఆచరించకుండ ఉండడం నరేంద్రనాథ్‌కు తెలీదు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో పిజి చేశాడు కనుక మంచి ఉద్యోగంలో స్థిరపడి అభ్యుదయం గురించి రాస్తూ మాట్లాడుతూ సమాజం మన్ననలు పొంది ఉండవచ్చు. కానీ అది అతని నైజం కాదు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చాడు. ఆ రోజులలో హైదరాబాద్‌లో మత ఘర్షణలు తరచుగా జరిగేవి. మతతత్వాన్నీ, మతతత్వ పార్టీలనూ తిడుతూ కూర్చుంటే చాలదనీ పాత బస్తీలో ప్రజలకు కరువయిన పౌర సదుపాయాలు కల్పించడం, వాటికోసం ఆందోళన చేయడం అవసరమనీ నమ్మి 'హైదరాబాద్‌లో ఏక్తా'లో భాగం అయ్యాడు. పాత బస్తీలో ఉచిత క్లినిక్‌ల ఏర్పాటులో నిమగ్నమయి కొంతకాలం పనిచేశాడు.

అయితే తన కార్యరంగం హైదరాబాద్ కాదనే నిర్ణయానికి వచ్చాక తన భావాలు చాలా వరకు పంచుకునే సహచరి ఉమాశంకరితో కలిసి చిత్తూరు జిల్లాలోని తన స్వగ్రామమయిన వెంకటాపురం వెళ్లిపోయాడు. వ్యవసాయం చేసుకుంటూ సామాజిక అభ్యదయం కోసం కృషి చేశాడు. కులాంతర వివాహాలు చేశాడు. 'రెండు గ్లాసుల' దుర్మార్గానికి వ్యతిరేకంగా

ఊరూరా తిరిగి ప్రచారం చేసి చాలా చోట్ల మాన్పించగలిగాడు. ఆ జిల్లాలో దళితులు వోట్లేసి ఎరుగని గ్రామాలు అనేకం ఉన్నాయని తెలుసుకొని దళిత పల్లెలలో ప్రత్యేక పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని పట్టుబట్టి చాలాచోట్ల సాధించాడు. వ్యవసాయాన్ని నిరాదరణ ద్వారా, తప్పుడు అభివృద్ధి విధానాల ద్వారా ధ్వంసం చేసిన పాలకనీతికి ఒక మెట్ట ప్రాంతపు రైతుగా స్పందించాడు. అన్ని విషయాలలో లాగ ఈ విషయంలో కూడ ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ కూర్చుంటే చాలదనీ మనం చేసేది చేయాలనీ నమ్మాడు. రసాయన ఎరువులు, మందులు వాడకుండ వ్యవసాయం చేసే ప్రయోగాన్ని తన భూమిలోనే చేశాడు. గ్రామంలో ఒక రైతు మాత్రమే ఈ ప్రయోగం చేస్తే అందులో ఎన్ని కష్టాలున్నాయో ఆచరణాత్మకంగా గ్రహించాడు. నిరాశ చెందాడు గానీ నిస్పృహలో సహితం తనను గురించి తాను చమత్కరించే నైజం ఉన్న వ్యక్తి కాబట్టి డీలాపడిపోలేదు. 'ఇట్లు ఒక రైతు' అనే శీర్షికతో తన అనుభవాన్ని పుస్తకంగా ప్రచురించాడు.

ఒక దశాబ్దం కింద విద్యుత్ రంగ సంస్కరణలు ప్రారంభమయిననాటినుంచి వాటికొక వినియోగదారుడైన రైతుగానూ, ఉద్యమకారుడిగానూ నరేంద్రనాథ్ స్పందించాడు. వాటి లోతుపాతులు బాగా అధ్యయనం చేసి పదిమందికీ వివరించి చెప్పాడు. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ప్రతీ సంవత్సరం నిర్వహించే టారిఫ్ విచారణలకు సవివరమయిన విమర్శతోనూ ప్రతిపాదనలతోనూ హాజరయ్యేవాడు. తన మిత్రులకు తర్ఫీదు ఇచ్చి వారిని బతిమాలి బామాలి హాజరయ్యేట్టు చూసేవాడు.

ప్రాజెక్టు నిర్వాసితుల గురించి, బాధితుల గురించి ఇవ్వాళ ఆందోళన చేయడం సాధారణ విషయమయిందిగానీ శ్రీశైలం ప్రాజెక్టునాడే దిక్కు లేకుండా ఊర్లు ఖాళీ చేసిన ప్రజల గురించి సమాచారం సేకరించాడు, చర్చ పెట్టాడు. ఏ సమస్యనయినా ప్రజలతో చర్చ పెట్టడమే ఇష్టపడేవాడు. పట్టణాలలో జరిగే సభల కంటే గ్రామాలలో తిరిగే పాదయాత్రలనే ఎక్కువ ఇష్టపడేవాడు. మెదడు క్యాన్సర్ సెకండరీస్ ఏర్పడ్డాయని తెలిసిన తరువాత కూడ సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా కరీంనగర్ జిల్లాలో జరిగిన పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నాడు.

నరేంద్రనాథ్ ఇన్ని పనులనూ చేయడమే కాక అన్ని పనులూ నవ్వుతూ చేసేవాడు. పసిపిల్లవాడి నవ్వు అతని ముద్ర. చర్చలయినా నవ్వుతూనే పెట్టేవాడు. సంస్థాగత సమావేశాలకు నరేంద్రనాథ్ హాజరవుతున్నాడంటే ఏదో ఒక చర్చ పెట్టడానికే అని అందరికీ తెలుసు. నిరంతరం వాదించేవాడు కాని ఎదుటివారిని ఎప్పుడూ కించపరిచేవాడు కాదు. ఎదుటివారిని గాయపరచడమే వాదనలో విజయం అని భావించేవారు మనకు ఉద్యమాలలో, ఉద్యమ సంస్థలలో చాలామంది కనిపిస్తారు. తేడాలు రాగానే సంస్థలు చీలిపోవడానికి ఇదొక ముఖ్య కారణం. నరేంద్రనాథ్ దీనికి పూర్తిగా భిన్నమైన వ్యక్తి. ఉద్యమాలలోనే కాదు, సామాజిక సంఘర్షణలోనూ అంతే. అతను అన్యాయాన్ని ద్వేషించాడు గానీ ఏ మనిషినీ ద్వేషించలేదు. బహుశా అతను గాంధియిజం అని అర్థం చేసుకున్నది

ఇదేననుకుంటాను. దీనిని గాంధీ ఎంతగా ఆచరించారో తెలీదుగానీ నరేంద్రనాథ్ మాత్రం మనస్ఫూర్తిగా ఆచరించాడు. మనిషిగా మంచితనాన్ని ఏ మాత్రం కోల్పోకుండా న్యాయం కోసం జరిగే సంఘర్షణలో భాగస్వాములు కావచ్చునని రుజువు చేశాడు.

చనిపోయిన వాళ్లకు నివాళులు అర్పించేటప్పుడు 'అసాధారణమైన మనిషి' అనడం పరిపాటి. అయితే నిజమైన అర్థంలో అసాధారణమైన మనుషులు ప్రపంచంలో కొద్దిమందే ఉంటారు. ఆ కొద్దిమందిలో ఒకడు గొర్రెపాటి నరేంద్రనాథ్. అటువంటి వ్యక్తిని 57 సంవత్సరాల వయసులోనే క్యాన్సర్ రోగం ఈ లోకానికి దూరం చేయడం నిజంగా చాలా బాధాకరం.

# హక్కుల ఉద్యమం - తాత్విక దృక్పథం

ఏ కోణం నుంచి అయినాసరే కేవలం మన కోణానికి ప్రధానంగా కనిపించే హక్కులు మాత్రమే కాకుండా మొత్తంగా అణచివేత, అసమానత ఎక్కడున్నా అక్కడంతా ఉన్న హక్కుల లేమిని గుర్తించగలగాలి. గుర్తించడం, దానికి వ్యతిరేకంగా నిలబడటం; చరిత్ర క్రమంలో ఎదిగినటువంటి హక్కులు ఏవైతే ఉన్నాయో వాటిని అమలు చేసుకోవడం, కాపాడుకోవడం, పెంపొందించుకోవడం; హక్కుల లేమికి గురయ్యేవాళ్ళ, అణచివేతకు గురయ్యేవాళ్ళ తరపున మనం కూడా మాట్లాడాలి అనే అవగాహన కలిగి ఉండటం; ప్రభుత్వాలు గానీ, పెత్తందారీవర్గాలు గానీ, అణచివేతకు గురిచేసేవాళ్ళు గానీ వేసే నిందలు, చెప్పే అబద్ధాలను మనకుండే శక్తియుక్తులన్నిటినీ కూడా ఉపయోగించి ఎదుర్కోవడానికి సహాయపడటం - ఈ కర్తవ్యాలు నిర్వహించే పాత్ర ఒకటి హక్కుల ఉద్యమం పోషించాలి. అందువల్ల హక్కుల ఉద్యమం అజెండా ఎప్పుడూ విశాలంగా ఉండాలి, కార్యకలాపాలు విశాలంగా ఉండాలి, నిర్మాణం కూడా విశాలంగా ఉండాలని మేము భావిస్తున్నాము.

– బాలగోపాల్



Human Rights Forum Publication